SOME PAGES DAMAGE IN THE BOOK ONLY

(some pages text cut in the book only)

బమ్మెర పోతన నికేతనచర్చ

కడప, 1920

Record no. 325

Bammera Pōtana nikētanacarca

Kadapa, 1920

Record no. 325

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

బమ్మెర పోతన నికేతనచర్చ / కడప : బమ్మెర పోతనామాత్య సమాజము, 1920.

Multipul pagenation. ;22 cm.

Record no. 325

Bammera Pōtana nikētanacarca / Kaḍapa : Bammera Pōtanāmātya samājamu, 1920.

Multipul pagenation. ;22 cm.

Record no. 325

244


బమ్మెర పోతన జీవన చరిత్ర

(57)

Register S.No. 9

[illegible]

బమ్మెర పోతన నికేతనచర్చ.



ఒంటిమిట్ట కోదండరామాలయమున నుండు పోతనవిగ్రహముయొక్క ప్రతిరూపము.

కడప

బమ్మెర పోతనామాత్యసమాజమువారిచే ప్రకటితము.

౧౯౨౦.

వె, ౧-౮-౦.

శ్రీరామాయనమః.

బమ్మెర పోతన నికేతనచర్చ.

ఆంధ్రకవికులతిలకుం డగుబమ్మెర పోతరాజునివాసము కడపమండల మందలి యొంటిమిట్ట యని కొందఱును, గోలకొండదేశములోని యోరుగల్లని మఱి కొందఱును గలకాలమునుండి వాదించుచున్నారు. గతానుగతికముగా నొంటిమిట్టవాదము నంగీకరించినవారిలోనే నే నింతవఱకుఁ జేరియుంటిని. కాని 1914-వ సంవత్సరము డిసెంబరు నెలలో నే నోరుగంటికిఁ బోయి యే డెనిమిది దినములచ్చట నుండుట తటస్థింపఁగా నా కాలమున నేను విని కన్నదానిని బట్టియు, నిటీవల నాకుఁ దెలియవచ్చిన కొన్నివిషయములఁ బట్టియుఁ బోతనామాత్యుఁ డోరుగంటిప్రాంతమువాఁ డనువాదమె బలవత్తరమని నా కిపుడు తోఁచుచున్నది. ఈ రెండువాదములకుఁ గలయాధారములు నాకుఁ దెలిసినంతవఱకు వివరించెదను. ఇంతకంటె నధికముగా నెవ్వరికయినఁ దెలిసినచో వా రద్దానిఁ బ్రకటింతురుఁ గాక యనియుఁ బండితులు ప్రమాణముల నన్నింటిని నిష్పక్షపాతబుద్ధితో విమర్శించి సత్యమును దేల్తురనియుఁ బ్రార్థించెద. ఈ వాదమున కాధారము లగు ముఖ్యాంశము లెవ్వి యన:—

(1) పోతరాజుయొక్కయు, భాగవతములో శిథిలములయిన భాగములఁ బూరించిన యితరకవులయొక్కయు నింటిపేళ్లు.

(2) పోతరాజు గంగాతీరమందు మహేశ్వరధ్యానము సేయునవసరమున రామభద్రుఁడు ప్రత్యక్షమయి భాగవతముఁ దెనిఁగింపు మని యనుజ్ఞ యిచ్చె ననుట.

(3) రామభద్రునిచే ననుజ్ఞాతుం డై పోతన కొన్నిదినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి యందు గురువృద్ధబుధబంధుజనానుజ్ఞాతుం డై కృతి యారంభించె ననుట.

(4) పోతరాజు భోగినీదండకము రావు సర్వజ్ఞసింగమనేని ప్రేరణముచే రచించె ననుజనశ్రుతి.

(5) ఇతరము లగుజనశ్రుతులు.

(6) భాగవతాంధ్రభాషావిశేషములు.

(1) పోతరాజు నింటిపేరు బమ్మెరవా రయినట్లు భాగవతములో రెండు మూఁడుచోటుల నున్నది. ఇది నిర్వివాదాంశము కదా! ఇది గ్రామనామము గాఁ గనుపట్టుచున్నది. బమ్మెర యనుగ్రామ మోరుగంటికి రమారమి మూఁడామడదూరములో నల్లగొండమండలమందు చేర్యాలతాలూకాలో నున్నది. దీని నచ్చట జనులు సాధారణముగా బొమ్మెర యని పిలుతురు. ఈ పేరు గల గ్రామము మఱియొక్క చెక్కడ నున్నట్లు తెలియ రాలేదు. కావున, పోతరాజు నింటిపే రీ బమ్మెరను బట్టియే పుట్టిన దని యూహింపవచ్చును. మఱియు, భాగవతము పంచమస్కంధము బొప్పనామాత్యపుత్త్రుఁ డగుగంగనార్యుఁడును, షష్ఠస్కంధము నేర్చూరి సింగయయు, నేకాదశద్వాదశస్కంధములు పోతనామాత్యప్రియశిష్యుఁ డగు వెలిగందల నారయయుఁ దెనింగించిన ట్లచ్చుప్రతులలో నున్నది. గంగనార్యుని యింటిపేరు మనకుఁ దెలియదు. ఏర్చూ రనుగ్రామము గోలకొండదేశములోని నల్లగొండమండలములోను, వెలిగందల యనుగ్రామ మాదేశమందే పూర్వము వెలిగందలజిల్లా యనియు, నిప్పుడు కరీంనగరము జిల్లా యనియు వ్యవహారము గల మండలమందును గలవు. ఈ గ్రామనామములం బట్టియే సింగయ నారయల యింటిపేళ్లు పుట్టిన వని యూహింపఁదగు. బమ్మెర, ఏర్చూరు, వెలిగందలయు నోరుగంటి ప్రాంతదేశములో నుండుటచే నా యింటిపేళ్లు గలవా రాదేశమువా రని యూహించుట యసమంజసము కాదు.

కాని, యా యింటిపేళ్లు గలవా రితరదేశములకుఁ బోయి యచ్చట నివసించి యుండఁగూడదా యని యొంటిమిట్టవాదు లాక్షేపింపవచ్చును. ప్రస్తుతము తూర్పుదేశమం దున్నగోలకొండ వేపారులయొక్కయు, తెలగాణ్యులయొక్కయు నింటిపేళ్లు గలగ్రామము లనేకములు గోలకొండదేశములో నున్నవి. దీనినిబట్టి యా గృహనామములు గలవారు తొలుత గోలకొండదేశమునుండి వచ్చినా రని తేలుచున్నది. ఆ ప్రకారమే, బమ్మెరవారు, వెలిగందలవారు ఏర్చూరువారును దమతమగ్రామములనుండి వచ్చి యొంటిమిట్టప్రాంతమందు స్థిరపడియుండిన నుండ వచ్చును. కాని యా యింటిపేళ్లు గలవారు పోతరాజకాలమం దొంటిమిట్టప్రాంతమున నుండి రనుటకుఁ దగినయాధారములు కనఁబడినఁ గాని యా యాక్షేపమునకు బలము లేదు. అట్టియాధారములు లేనిచో నాయింటిపేళ్లు గలవారు గోలకొండదేశమం దుండి రనియే యూహింపవలసి యుండును.

(2) గ్రంథరచనకు మూలమును జెప్పుచుఁ బోతరాజు "మదీయపూర్వజన్మసహస్రసంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణ కథాప్రపంచవిరచనా

కుతూహలుండనై యొక్కరాకానిశాకాలంబున సోమోపరాగంబు రాకఁ గనుంగొని సజ్జనానుమతంబున నభ్రంకషశుభ్రసముత్తుంగభంగ యగుగంగకుం జని క్రుంకులిడి వెడలి మహనీయమంజులపులినప్రదేశంబున మహేశ్వరధ్యానంబు సేయుచుఁ గించిదున్మీలితలోచనుండనై యున్నయెడ" రాజముఖ్యుఁ డొక్కఁడు ప్రత్యక్షమై "రామభద్రుండ మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెలుంగు సేయుము. నీకు భవబంధంబులు దెగు నని యానతిచ్చి తిరోహితుం డయ్యె" నని వ్రాసెను. పోతరాజు స్నానముచేసిన "గంగ" యేదియో నిర్ణయింపవలసియున్నది. గంగ యనుపేరు సాధారణముగా భాగీరథికి రూఢమయి యున్నది. కాని, యిచ్చట యా యర్థము సరిపోవునట్లు లేదు. భాగీరథి యోరుగంటి కా కాలములోఁ "గొన్నిదినంబుల" ప్రయాణమునకంటెఁ గడు దూరము. ఒంటిమిట్ట కంతకంటెను దూరము. ఒంటిమిట్టనుండి గాని, యోరుగంటినుండి గాని పోతన చంద్రగ్రహణ నిమిత్తమున స్నానమునకై యంతదూరము పోయి యుండఁడు. పోయె నన్నచో గంగ యేకశిలానగరమునకుఁ "గొన్నిదినంబుల" ప్రయాణములో నున్న దనుమాట తప్పగును. కావున నీ సందర్భమున గంగ యనఁగా భాగీరథి కా దని చెప్పవలసియున్నది. అట్లయినచో నది మఱి యేనది యైయుండును? సుప్రసిద్ధ మయినపుణ్యనది యై యుండవలయును. ఆ నది గోదావరి యని తోఁచుచున్నది. గోదావరి యోరుగంటికిఁ బదియామడదూరమున నున్నది. నాలు గయిదుదినముల ప్రయాణము. ఈ నదికి గోలకొండదేశమం దంతటను "గంగ" యను సంజ్ఞ రూఢమయియున్నది. ఇది నిస్సంశయము. ఆ దేశమువారు పర్వదినములందు గోదావరీ స్నానమునకుఁ దఱుచుగా వెళ్లుట కలదు. ఒంటిమిట్టకు సమీపములో నిట్టినది లేదు, గాని శ్రీశైలమునొద్దఁ గృష్ణానది యున్నది. ఆ ప్రదేశమం దా నదికి "పాతాళగంగ" యను సంజ్ఞ శాసనము లందుఁ గలదు. కాని శ్రీశైలయాత్ర యిప్పుడే కష్టసాధ్యము. పూర్వము కష్టతరముగా నుండియుండవలయును. ఈ యాత్రకుఁ బోవువారు శివరాత్రికిఁ గాని, వసంతనవరాత్రములందుఁ గాని పోవుదురు. ఇతరపర్వములయందుఁ బోవునాచారము లేదు. పోయినను శ్రీశైలము మొదటఁ బోయి యక్కడనుండి క్రిందికిఁ దిగి నదిలో స్నానముచేసి తిరిగి యాలయమునొద్దకుఁ బోవలయును. శివపూజాధురంధరుం డగుపోతన యట్లు పోయినాఁ డనినను, శ్రీశైలపతి యగుమల్లికార్జునుఁ బేర్కొనక యుండఁడు. ఆ ప్రకారమే గంగాస్నానమునకై కాశికిఁ గాని, ప్రయా

కకుఁ గాని పోయి యుండెనచో నాపట్టణములను నచటనుండు దేవతలను బేర్కొనక యుండఁడు. ఈ హేతువును బట్టి రామభద్రుఁడు పోతనకుఁ గనఁబడినది గోదావరీతీరమం దైయుండును, గాని భాగీరథీతీరమందుఁ గాదు; కృష్ణాతీరమందును గాదని తేలుచున్నది. ఈనిర్ణయ మోరుగంటివాదమును నిస్సంశయముగా బలపఱుచుచున్నది.

ఒంటిమిట్టలోఁ గోదండరామస్వామియాలయ మున్న దనియు, నీకోదండరామస్వామియే భాగవతకృతిపతి యగురామభద్రుఁ డనియు, నిందుచేతఁ బోతన యొంటిమిట్టవాఁడని తేలుచున్న దనియు నొంటిమిట్టవాదులు వాదించుచున్నారు. కాని, యీవాద మంత సరసముగా లేదు. కవి తనకు ధ్యానములోఁ దోఁచినవాఁడు రాభద్రుఁ డని చెప్పెను, గాని యేకశిలానగరమందుండు దేవుఁ డని చెప్పియుండ లేదు. ఆశ్వాసాద్యంతపద్యములం బట్టి చూచినను గృతిపతి విష్ణ్వవతారమై యిక్ష్వాకువంశమందు జనించిన మహాపురుషుఁ డనియే యేర్పడుచున్నది గాని యొంటిమిట్టలో వెలసిన కోదండరామస్వామి యనుట కాధారములు కనఁబడుట లేదు. ఒంటిమిట్టలోఁ గోదండరామస్వామ్యాలయ మున్నంతమాత్రాన పోతరా జక్కడివాఁ డనుట యుక్తము గాదు.

(3) రామభద్రునిచే ననుజ్ఞాతుం డైనపిదప "మరలి కొన్నిదినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి యందు గురువృద్ధబుధబంధుజనానుజ్ఞాతుండనై" కృతికిఁ బూనితి నని పోతరాజు వ్రాసెను. కృతినిర్మాణ మేకశిలానగరమం దయిన దనుమాట యీవాదమున కంతకు మూలాధారముగా నున్నది. ఏకశిలానగర మన నేదియో నిర్ణయింపవలసియున్నది. ఇది గ్రామనామముయొక్క సంస్కృతరూపము గాని మూలనామము గాదు. "ఓరుగల్లు" "ఒంటిమిట్ట" యను నివి రెండును గూడ దీనికి దేశ్యరూపము లని చెప్పవచ్చును, గాని కొన్ని కారణములచే నేకశిలానగరశబ్దవాచ్య మగుపట్టణము ఓరుగల్లే యని నిర్ణయింపవలసి యున్నది. ఆ కారణము లెవ్వి యనిన:—ఒంటిమిట్ట యనఁగా నొంటిగా నుండుగుట్ట (చిన్నకొండ) యని యర్థము. ఒరుగల్లు, శబ్దవికారము. ఒరుగల్లనఁగాఁ, గన్నడమున నొక్క-రాయి యని యర్థము. కాకతీయరాజ్యాభివృద్ధికిఁ బూర్వ మీదేశము పశ్చిమచాళుక్యులపాలనములోఁ జేరియుండి కన్నడభాష యచ్చటఁ బ్రచురముగా నుండెను. ఆ కాలమందుఁ బుట్టిన కన్నడపద్యశాసన మొక్కటి యిప్పటికిని హనుమకొండకోటలోని పద్మాక్షి యాలయమున కెదుటఁ జూడనగు. ఆ కాలమం దీపట్టణము పుట్టి యుండు

టచే దాని కీకన్నడనామము గలిగెను. ఒరుగల్లు, ఏకశిల యనునీరెండుశబ్దముల కర్థమునం దించుకైన భేదము లేదు. ఏకశిలకును, ఒంటిమిట్టకును భేద మధికము గా నున్నది. ఇంతియ కాక, యేకశిల యనఁగా నఖండశిల యని యర్థము. ఒరుగల్లునకు నిదియే యర్థము. ఓరుగంటికోట నట్టనడుమ బొడ్డురాతివలె నఖండశిలారూప మగునొకచిన్నకొండ యున్నది. దానిపైఁ బాడుదేవాలయ మొక్కటి గలదు. ఈరాతినిబట్టియే పట్టణమున కాపేరు వచ్చియుండు నని చూచినవారికిఁ దోఁపక మానదు.

ఇంతియగాక, పోతనకుఁ బూర్వము పుట్టినప్రతాపరుద్రీయాదిగ్రంథములందును, గొన్నిశాసనములందును, ఏకశిలానగర మనుసంజ్ఞ యోరుగంటికి రూఢమై యున్నది. ఒంటిమిట్ట కాసంజ్ఞ పూర్వ మున్నట్లు తోఁపదు. మఱియు, నగరశబ్దము పెద్దపట్టణమునకుఁ జెల్లును గాని యొంటిమిట్టవంటి చిన్నయూరికి వర్తింపదు. ఈ కారణములఁ బట్టి యేకశిలానగర మన నోరుగల్లనియే తోఁచుచున్నది.

(4) భోగినీదండకము పోతరాజు రావు సర్వజ్ఞసింగమనేని యుంపుడుకత్తె నుద్దేశించి రచించె నని లోకములో వాడుక కలదు. ఈదండకము పోతరాజుకృతమనుమాట సత్యమయ్యెనేని యది కూడ నోరుగల్లువాదమునకే యుపకరించునని నాయభిప్రాయము. "సురభివారివంశచరిత్ర" మనుగ్రంథమందును "వెలుగోటివారివంశచరిత్ర" మనుగ్రంథమందును, బ్రహ్మశ్రీ వెల్లాల సదాశివశాస్త్రులుగా రీరావువారిచరిత్రము విపులముగాఁ జర్చించి భోగినీదండకమునకు సంబంధించిన సర్వజ్ఞసింగభూపతి రావువంశములోఁ బదియవతరమువారిలో జ్యేష్ఠుఁడనియు, నాతఁడు 1450-వ క్రైస్తవాబ్దప్రాంతమునఁ గర్ణాటప్రౌఢదేవరాయలకాలములో జీవించియుండె ననియు నిర్ణయించిరి.

ఈ కాలమందు రావువారు గోలకొండదేశములో నల్లగొండ, రాచకొండ, దేవరకొండ, ఓరుగల్లు, ఈ ప్రాంతములందే రాజ్యము చేయుచుండినట్లు కనఁబడుచున్నది. ఈ విషయమున సదాశివశాస్త్రులుగారే యిట్లు వ్రాయుచున్నారు. 7-వ తరమువారిని గూర్చి వ్రాయుచు "వీరిలోఁ బెదసింగమనాయఁడు, ధర్మానాయఁడు, తమప్రధానరాజధాని యగురాచకొండలో నివసించి భువనగిరి, యోరుగల్లు, నల్లగొండ, ఆమనగల్లు, రేచర్ల మొదలుగాఁ దమ దండ్రిగారి దినంబులలో నుండిన వింధ్య శ్రీశైలమధ్యమండలము నేలుచుండినవారు" అని వ్రాసినారు. 8-వ తరమును గుఱించి వ్రాయుచు "కాఁబట్టి

యీామెనిమిదవ తరములోవా రంద ఱింటమించుగా నక్కాలములో నున్న వారై యీా వెగొందిరాజులవశంవదులై దేవరకొండ, నల్లగొండ, యేకశిలా నగరము మొదలుగాఁ గలతమ పితృపితామహాదిపరిపాలితం బగుదేశమునఁ దయుఁ బాలించినవా" రని వ్రాసినారు. 9-వ తరము వారిని గూర్చి యిట్లు వ్రాసిరి. "ఈ లింగమనాయఁడు, ధర్మానాయఁడు, అనపోతానాయఁడు, తమ పితౄదులచే నేలఁబడిన యావద్దేశము నేలుచుండుటయే కాక విక్రమార్జితము లగు రాజమహేంద్ర ప్రాంతదేశముల నేలినారు." ఈ చివరముక్కకుఁ బ్రమాణము లేమియుఁ జూపక "ఈ విషయము వారివారిచరితములు చదివిన విశదమగు" నని విరమించిరి. 10-వ తరమువాఁడైన సర్వజ్ఞసింగమనాయని గూర్చి వ్రాయుచు "మరియు నాతండు బమ్మెర పోతనామాత్యునిచే భోగినీ దండకము కృతి నొందుటనుబట్టి బమ్మెర పోతనామాత్య శ్రీనాథాది కవుల కాలములోఁ దమపితౄర్జిత మగు రాజమహేంద్రనగర రాజధానిలో వసించి రాజ్యము చేయుచుండినవాఁడు" అని వ్రాసినారు. సర్వజ్ఞసింగమనాయఁడు రాజమహేంద్రనగరమున నివసించె నని చెప్పుట కాతఁడు "బమ్మెర పోతనామాత్యునిచే భోగినీదండకము కృతినొందుట" తప్ప వేఱే యాధారము లేదు. పోతరా జొంటిమిట్టనివాసి యనుకొని సదాశివశాస్త్రులవా రిట్లు వ్రాసినారు. ఇతరాధార రహిత మగునీవ్రాఁత పోతరా జొంటిమిట్టనివాసి యనుట కాధారము కానేరదు. 11, 12-వ తరములవారలుకూడ నోరుగల్లుప్రాంతమున రాజ్యము చేసినట్లు సదాశివశాస్త్రులుగారి గ్రంథములవలననే కనుపట్టుచున్నది. భోగినీదండకము పోతరాజుకృతియే యయి, కృతిపతి యోరుగంటిప్రాంతము వాఁడై యుండినచోఁ బోతరాజుకూడ నాప్రాంతమువాఁడే యయియుండు నని యూహించుట యసమంజసము కాదు. పోతరా జొంటిమిట్టవాఁ డయినను, శ్రీనాథునివలెనే యోరుగంటికిఁ బోయి సర్వజ్ఞసింగమనేనిఁ జూచి యుండఁగూడదా యని యొంటిమిట్టవాదు లనవచ్చును. అదియు సమంజసమే. కాని, శ్రీనాథునివలెఁ బోతరాజు బహుదేశద్రష్ట యని కాని, యనేకరాజుల నాశ్రయించి నట్లు గాని ప్రమాణములు గానరావు. జనశ్రుతియు లేదు. తగిన యాధారములు లేనప్పుడు కృతికర్తయుఁ గృతిపతియు నేకదేశస్థులే యని యూహించుట యుక్తము.

(1) ఒంటిమిట్టలో నొకానొకపొలమునకు బమ్మెర పోతరాజుగారి పొల మనువాడుక గల దనియు, కోదండరామస్వామి యాలయములో నొకచోటు చూపి యచ్చటనే కూర్చుండి పోతరాజు భాగవతమును వ్రాసె నని యాగ్రామ

స్థులు చెప్పుదు రనియు నేను వినియున్నాఁడను. పోతరాజు బమ్మెర నివాసి యని బమ్మెరయందును సమీపమందున్న గ్రామములందును వాడుక కలదు. ఈ బమ్మెర గ్రామము నెల్లుట్లవారను గోలకొండవేపారులకు మొఖాసాగాఁ జెల్లుచుండెడిది. ఈ నెల్లుట్లవారిది కౌండిన్యసగోత్రము, ఆపస్తంబసూత్రము. ఈ వంశములోఁ జిట్టచివరవాఁడు నెల్లుట్ల నరసింహారావుగారు. ఆయన గత వికారి సంవత్సరమందు వృద్ధదశలో గతించెను. ప్రస్తుత మాయన దౌహిత్రుఁ డగు వేంకటపాపయ్యగా రాగ్రామమున కధికారిగా నున్నారు. నరసింహారావుగారు పోతరాజు తమవంశమునకు మూలపురుషుఁ డని చెప్పుచుండినట్లును, ఆ మాటయే యా ప్రాంతమందలి జనులు విశ్వసించుచున్నట్లును దెలియుచున్నది. ఇంతియ కాక, బమ్మెరలోఁ బోతరాజునొక శిలావిగ్రహ మున్న దఁట. పోతనామాత్యునకుఁ బ్రతిబింబముగా నది చెక్కఁబడిన దని యా గ్రామమువా రందురు. ఈ దేవతనుబట్టియే కవి కా నామము కలిగిన దనుట యెక్కువ యుక్తముగా నుండును. ఎట్లయిన నేమి, కవికిని శిలావిగ్రహమునకును సంబంధము సిద్ధము. బమ్మెరప్రాంతమందలి జనశ్రుతులను దెలుపుపత్రములు కొన్ని నాయొద్ద నున్నవి. అవి యాంధ్రసాహిత్యపరిషత్తునకై గ్రంథముల సంపాదించుటకు నియమింపఁబడిన దూపాటి తిరుమల వేంకటరమణాచార్యులుగారు సంపాదించినారు. వానికి సరియయినప్రతుల నీ క్రిందఁ బొందుపఱచుచున్నాఁడను. మాతృకలు పరిషత్కార్యస్థానమందుఁ గలవు.

(6) భాగవతమందు ద్రొబ్బు, నూకు, ననుశబ్దములు "త్రోయు" నను నర్థమందుఁ బ్రయోగింపఁబడినవి. ఈ శబ్దముల కీయర్థ మొంటిమిట్టప్రాంతమునందు వలెనే యోరుగంటిప్రాంతమునందును గలదు. వ్యాకరణకార్య విశేషములు కూడ నచ్చటచ్చటఁ గొన్ని భాగవతమునందుఁ గలవు. కాని యవి దేశ్యములు కాకపోవుటచే వానింబట్టి కవి యీ దేశమువాఁ డని నిర్ణయించుట కవకాశము లేదు.

నాకుఁ దెలిసినంతవఱ కుభయవాదముల బలాబలములు వివరించినాఁడను. నేఁ జెప్పినహేతువుల నొక్కటొక్కటిగా విడఁదీసి పరిశీలించినచోఁ గొన్ని యిటు, కొన్ని యటు మ్రొగ్గవచ్చును. కాని యాధారముల నన్నిటి సమష్టిగా నిష్పక్షపాతబుద్ధితో విమర్శించినయెడల నోరుగంటివాదమే నిలుచు నని నా యభిప్రాయము.

జ. రామయ్య.

శ్రీరామాయనమః.

అనుబంధములు.

—∞—

బమ్మెరకు 3 మైళ్లదూరమందున్న గూడూరులో నివసించు పాలడుగు లక్ష్మారావుగారు వ్రాయించినవి.

బమ్మెర పోతరాజుగారు బొమ్మెరలో ప్రస్తుత మున్న నెల్లుట్లవారి వంశీకుఁడు. ఆయనకు బింబముగా పోతరాజు అనే ఒకరాయిని ఒకదానిని ఊరి బయట హనుమంతుని దేవళముదగ్గిర వేసియున్నారు. ఆ రాయిని అంతా పోతరాజుగారు అని అంటూఁవుంటారు. బొమ్మెరలో దొరవా రగు నెల్లుట్ల నరసింహారావుగారు జీవించి వున్నప్పుడు పోతరాజును గురించి యెన్నెన్నో కథలు చెప్పుచు ఆయన తమవంశమునకు మూలపురుషు డని చెప్పగా నేను అనేక మార్లు వినివున్నాను. పోతరాజుగారు బొమ్మెరనివాసి యే యని చుట్టుపట్ల పాలెములు పట్టణములలో గూడా ప్రఖ్యాతి కలదు.

పోతరాజుగారు పూర్వకాలములో జీవించియుండగా బొమ్మెరలో చెరువు కింద సెలకలు దున్నుచూ వుండంగా శ్రీనాథు డనేటి ఒక కవీశ్వరుడు మేనా యెక్కి చెరువుకట్టమీదనుంచి పోతూ పోతరాజు తనకు బావమరిది కాబట్టి పరిహాసముగా ముందు బాజుబోయీలను తొలగమన్నా డట. అప్పుడు శ్రీనాథుని పల్లకీ మునుపటివలెనే ముందువాం డ్లున్నప్పటివలెనే పోతూ వుందట. ఆ వఖ్తులో పోతరాజు తననాగలిదున్నె ఒకదున్నను విడిచిపెట్టినాడట. యెప్పటివలె నాగలి పోయినదట. తరువాత శ్రీనాథుడు రెండవవైపు బోయీలను తొలగించగా మునుపటిరీతుగా పోయిందట. పోతరాజు తరువాత రెండో దున్నపోతును తీయగా యెప్పటివలెనే నాగలి దున్నుకొంటూ పోయిం దని చెప్పుతూ పోతరాజు దున్నిన చేలున్నూ శ్రీనాథుడు పోయిన చెరువుకట్ట చూపుచు నరసింహారావుగారు చెప్పేవారు. వారు వికారి సం॥ గతించిరి. పోతరాజు కాలములో ఆయనవంశీకులు శైవులుగా వుండేవారు. రానురాను వైష్ణవము పుచ్చుకొని గోలకొండ వ్యాపారు లనబడుచున్నారు.

పాలడుగు లక్ష్మారావు మవుజే గుడురు అని యున్నది.

(పత్రము వ్రాంత వేంకటరమణాచార్యులుగారిది.)

(2)

(బమ్మెర కామడదూరములోనున్న వేల్పుకొండయందు నివసించు ఎల్లంభట్ల రామకృష్ణశాస్త్రులుగారు వ్రాసినది.)

గోదావరి అనేది మంథెన్నవద్దున వున్నది. దీనికి సుమారు 12 ఆమడ వున్నది. బొమ్మెరనుంచి గోదావరికి పోవడానికి వరంగ్గల్ మీదుగా బాటా వున్నది. పూర్వంనుంచి యిదేబాటా. వరంగ్గల్ బొమ్మెరకు సుమారు 14 పద్నాల్గు కోసులు వున్నది. వరంగ్గల్‌లును యిక్కడివారు ఏకశిలానగరం అని అనుకోవటం కలదు. గోదావరిని యిక్కడ వాడుక గంగ్గా అంటారు. పర్వదినముల్లో వెళ్లి స్నానములుచేశి రావటం కద్దు. పోతరాజు బొమ్మెర గ్రామంకు బయిట సమీపంలో హనుమానగుడిదెగ్గిర వున్నది. పోతరాజు గారిగద్ది అని నాల్గుస్తంభములు పొడుగు సుమారు కండె (నిలువు) అండ్దాజారవుతులి వున్నవి. వాటిని పోతరాజుగారు వుండ్డేగద్దె అని పెద్దలు చెప్పగా వినివున్నాము. దీనికి దసరారోజు శమీవృక్షము దర్శనమునకు పొయ్యే అపుడు అదేమార్గం పోయి అక్షతలు మొదలయినవి బ్రాంహ్మణులు మొదలగువారు వెయ్యటం కద్దు. యిక్కడ పోతరాజు అనేది గ్రామదేవత కాదు, గ్రామదేవత గ్రామము మధ్యన వుంట్టుంది. దీనికి బొడ్డురాయి అని అంటారు. దీనికి బ్రాంహ్మణులు పూజ చెయ్యరు. వెనుకటినుంచి పోతరాజుకు ప్రతిబింబం అని అనుకోవటం వాడుక. ఇటీవల పుట్టిందికాదు.

“ఏకశిలానగరంబ్బునకు దక్షిణభాగంబ్బున కనతిదూరంబ్బున బొమ్మెర అనేగ్రామంబ్బున పోతరాజుగారు” అని యేదో వక గ్రంథం చూచినట్టు జ్ఞాపకం కలదు. పోతరాజుగారిది యిదేబొమ్మెరని చుట్టుపట్టు వారంత్త అనటం కద్దు. పోతరాజుగారి కాలంలో బొమ్మెరవా రనింన్నీ కృష్ణదేవరాయలవారి వఖ్తులో నారాయణప్ప మొదలయినవారు దివానిగిరి చేశినందువల్ల రాయ భండ్డారువారనింన్నీ తర్వాత ఆలంగ్గీరి బాషాన్యవఖ్తులో ఖిల్లతుపొంద్ది నాల్గుపర్గణాలకు దేశముఖు దేశపాండ్యాగిరి సంపాదించ్చిరి. వారివంశ్యులు రామభక్తులు. పూర్వం శివపూజాధురంధురులు కాబట్టి యిక్కడ వీరాచలం అనే గ్రామంలో శ్రీరామక్షేత్రం వున్నది. ఇపుడు ఆక్షేత్రంకు జీడికల్లు అని అంట్టారు. ఆగ్రామం వారికి సర్కారువారు యిచ్చినవతనులు గలనిడిగొండ పర్గణాలోదే కాబట్టి నిడిగొండ్ల అనేగ్రామంకు సమీపంగ్గ కోశెడుదూరంలో వుండ్డే నెల్లుట్ల గ్రామంలో వున్నందువల్ల నెల్లుట్లవారు అని యిప్పటికి అంట్టూ

వుంన్నారు. ఆవతనులు యిప్పటికి జర్గుతూవుండే రుసుంకు అదె బొమ్మెర అనే గ్రామం పన్ను మఖ్తాగా యింక్కా కొన్నిగ్రామంలు వారివంశ్యస్తులకు కొంద్దరికి యిచ్చివుంన్నారు. జర్గుతూవుంన్నవి. కొంద్దరు గ్రామంలు యిష్టంతేక రుసుంలు తీసుకుంట్టూ వుంన్నారు. సర్కారులో దాఖలా వుంన్నది. అప్పటి నుంచ్చి యింతవరకు కండిన్య (కౌండిన్య) సగోత్రం ఆపస్తంబసూత్రం జర్గుతూ వుంన్నది. పోతరాజుగారినివాసం యిక్కడనే నని నిశ్చయం అంద్దరు అంట్టారు. పోతరాజుగారు భాగవతం చెప్పినట్టు వుంన్నది. ఇతరగ్రంథములు యేమి చెప్పి నట్టు లేదు. ఈ బొమ్మెర పోతరాజుగారిది నేలకొండ్లపల్లెలో గుడికట్టు వుంన్నట్టు తెలుస్తుంది. పోతరాజు తమవంశ్యస్తులు అని యీ ధొరవారు అయ్ని నెల్లుట్ల నర్సింహారావుగారు యీవంశీకులు చెప్పగా వినివుంన్నాను. నర్సింహా రావుగారు వికారి సం॥ పుష్య శు. 5-రోజున గతించిరి. వీరియింటిలో భాగ వతం లేదు. వకదశమస్కంధం మట్టుకు జీర్నం అయ్నిది వుంన్నది. మేము ఆది నుంచ్చి రాజాశ్రమం వీరిది కాబట్టి వీరిసంగ్గతి బాగా తెలిశి వుంన్నది పయిసంగ తులు యధార్థం కల్పితము కావు.

యల్లంభట్ల రామకృష్ణయ్యవ్రాలు.

వేల్పుగొండ గ్రామం, రాక్షస సం॥ చయిత్ర శు 5 లు (అనియున్నది.)

పైదాని కనుబంధము.

భాగవతంలో నూకుట దొబ్బుట అని ప్రయోగంబులు కలవు. యీ మాటకు నెట్టుట త్రోయుట అని అర్థం కలదు. 20-3-15.

య. రా. (అనియున్నది.)

(3)

2-వ పత్రమున కనుబంధము.

పైసంగతులు మేముకూడా విని వున్నాము.

నెల్లుట్ల వేంకటపాపయ్య ధా॥

మఖ్తాదారు మవుజే బొమ్మెరా (అనియున్నది.)

(ఈ నెల్లుట్ల వేంకటపాపయ్య అనువారు ప్రస్తుతగ్రామ మగుబమ్మెరకు అధికారులు, వీరు దౌహిత్రసంప్రదాయమున నీయాస్తికి కామందులైరి. వీరి తాతగారు వీరిబాల్యమందు గతించినందున పోతరాజును గూర్చి విశేషములు కథలు తెలియవుగాని పోతరాజు తప్పక తమవంశీకుఁ డని చెప్పుచున్నారు.

దూ. తి. వేంకటరమణాచార్యులు. (అని యున్నది)

(4)

గోదావరిని గంగ్గా అని యిక్కడివారు అంటారు. పోతరాజుగారు యీ బొమ్మెర నెల్లుట్లవారివంశమునకు మూలపురుషు డని యీ వంశీకులు చెప్పగా చాలకాలమునుంచి వింట్టూ వున్నాము.

గోమఠం బుచ్చయ్యగారు బొమ్మెర నివాసం. రాక్షస సం॥ చైత్ర శు. 6 ఆదిత్యవారం (అని యున్నది.)

(5)

గోదావరిని గంగయని వాడుక మిక్కిలి యిక్కడ వాడుక కలదు. ఏక శిలానగర మనునది వరంగల్. ప్రతాపరుద్రియగ్రంథమందు నాటకప్రకరణ మందు వైతాళికవాక్యమందు "రాజ న్నేకశిలానగరాధీశ" అని సంబోధన వాక్యముచేత ప్రతాపరుద్రుడేలిన వరంగల్ అని చెప్పవల్సినది. పోతరాజు విగ్రహము పోతరాజు ప్రతిబింబమే యని వీరివంశస్తులు చెప్పగా వినియున్నాను.

శ్రీమాన్ విద్వాన్ అమరవాది నారాయణాచార్యులు, వరంగల్

21-3-15. (అని యున్నది.)

(6)

"పాలకుర్తినిలయా । సోమయలింగ్గ । పాదాములకుశరణు । పురవూగ బొమ్మెర పోతరాజుకు । మీరుకోరినవరములు కృపచేశినారట, పాలకుర్తినిలయా &c." అని అనేకపదములు ప్రతివారు చదువుట వల్ల లక్షణం లేసట్టు వుంన్నవి. యీపదం వేల్పుగొండ నివాశియగు చవుదరి నర్సయ్య అనేవారు చదువంగ్గ విని వ్రాశితిని. పాలకుర్తి అనేగ్రామం యీబొమ్మెరకు వకమయిలుకు లోపుగా వుంన్నది. అక్కడ సోమలింగ్గం అనేరుద్రుడు నరశింహ్వాస్వామింన్ని హారహరి క్షేత్రం అనాది నుంచ్చి వుత్సవం జర్గుతూ (వున్నవి) పూర్వం పాలకూరి అని పేరు. ఇప్పుడు పాలకుర్తి అని అంట్టారు.

యీదేశంలో పోలికను సూచించ్చుమాటకు బోలె అను భాగవతకారు డగు పోతరాజు గారినాడు "పోతరాజు బోలెలు" అని పరిహాసంగ్గా అంట్టారు.

య. రామకృష్ణశాస్త్రి వ్రాలు (అని యున్నది.)

(ఈ య. రామకృష్ణశాస్త్రిగారును, రెండవపత్రము వ్రాసిన యెల్లం భట్ల రామకృష్ణయ్యగారు నొక్కఁడే. ఈ రెండు కాగితములు కూడ నాయన స్వహస్తలిఖితములే. పాల్కురికి సోమనాథకవి పైనఁ జెప్పఁబడిన పాలకుర్తి నివా సియే. జ. రా.)

శ్రీరామాయనమః.

ఒంటిమిట్ట పోతనామాత్యుఁడు

(1917 సం॥రం ఏప్రెల్ నెల 8-వ తేది కడపలో బ్ర॥ శ్రీ॥ రా-శ్రీ, వావిలికొలను సుబ్బరావుగారిచేఁ జదువబడిన యుపన్యాసము.)

ప్రథమ భాగము.

ఆ. సత్యధర్మమూర్తి సత్యధర్మప్రతి
ష్ఠాపకుండు రామచంద్రవిభుఁడు
నాదువాక్కునందు నయమారఁగా నిల్చి
సత్యవచను నన్ను సలుపుఁగాత!

మహాశయులారా!

శ్రీమదాంధ్రభాగవతము రచియించిన పోతనామాత్యుఁ డేగ్రామమం దుండి యామహాపురాణమును దెనిఁగించె ననువిషయ మీవ్యాసమునఁ జర్చింపఁబడును.

1. వ్యాసరచనకుఁ గారణము.

1. సత్య మెఱిఁగినపూర్వమహనీయులు పోతనామాత్యుఁ డొంటిమిట్ట యని తెనుఁగునను, ఏకశిలానగర మని సంస్కృతమునను బేరుగన్న గ్రామమున నుండె నని వ్రాసిరి. పురాణము హయగ్రీవశాస్త్రులవారు లోనగువారీకోటిలోనివారు.

తరువాతివారు కొందఱోరుగంటికిని నొంటిమిట్టకును నేకశిలానగర మని పేరుండుటచేత భాగవతమునఁ జెప్పఁబడిన యేకశిలానగర మేదియో యిదమిత్థమితివక్తవ్యతామూఢులై ద్వాపరబుద్ధులై యెటు చెప్పఁజాలక సందిగ్ధముగా వ్రాసిరి. ఆ వెనుక నొంటిమిట్టవిషయ మేమియు నెఱుఁగనివారు ప్రతాపరుద్రీయమున నోరుగంటికి నేకశిలానగర మని యుండుట క్రొత్తగాఁ గాంచి వారు చదివినపుస్తకములలో నెందును నొంటిమిట్టకు నేకశిలానగర మనుపేరు లేకుండుటచే లోకమున నేకశిలానగర మొక్కటియే యని భ్రాంతులై బోడితలలకు మోఁకాళ్లకు ముడిపెట్టినట్టులు వేనికో వేనికో ముడిపెట్టి పత్రికలయందు నూతనముగఁ దా మొక గొప్పవిషయము కనిపెట్టినట్లు విజృంభించి వ్రాసిరి.

ఈ కడపటి రెండు తెగలవారును మూఁడవయేకశిలానగర ముండుట యెఱుంగరు. అది యెఱింగియుండిన మఱేమి చిత్రములు వ్రాసియుందురో.

ఆంధ్రవాల్మీకిరామాయణమున బమ్మెర పోతనామాత్యుఁ డొంటిమిట్టవాఁడని వ్రాయఁబడియుండుటఁ గాంచి యీ వాదిప్రతివాదులలోఁ గొందఱు నాకుఁ గలయాధారములను దెలుపఁగోరిరి గాని వివాదప్రీతి లేనివాఁడ నగుటచే నే నెవ్వరికిఁ బ్రత్యుత్తర మీయనైతిని. ప్రాజ్ఞుఁ డెవఁడైన సత్యమును స్థాపింప యత్నింపఁడా యని యూరకుంటిని.

నాకు నుత్తరములు వ్రాసినవా రంద ఱీవ్యాసము నే తమయుత్తరములకుఁ బ్రత్యుత్తరములుగ భావించి నన్ను క్షమింతురుగాక.

2. ఇట్లుండ బొమ్మెర, యేచ్చూరు, వెలిగందల యనుగ్రామములు గోలకొండదేశములో నున్నవని తెలిసికొని బ్ర॥ శ్రీ॥ జయంతి రామయ్యపంతులవారా పేరిగ్రామము లాంధ్రదేశమున మఱెందు లేవా యని విచారింపక తొందరపడి తమపూర్వాభిప్రాయమును దటాలున మార్చుకొని యీవిషయము కొంత చర్చించి "నేఁజెప్పిన హేతువుల నొక్కటొక్కటిగా విడఁదీసి పరిశీలించినచోఁ గొన్ని యిటు కొన్ని యటు మ్రొగ్గవచ్చును, కాని యాధారములనన్నిటి సమష్టిగా నిష్పక్షపాతబుద్ధితో విమర్శించినయెడల నోరుగంటివారి వాదమే నిలుచు నని నా యభిప్రాయము." అని రాక్షసనామ సంవత్సర మాఘ ఫాల్గునముల యాంధ్రసాహిత్యపరిషత్పత్రికయందుఁ దమయభిప్రాయమును బ్రకటించిరి.

వీరు పండితులు, గ్రంథశాసనశోధకు లని ప్రసిద్ధులు. న్యాయవాదిపరీక్షయం దుత్తీర్ణులై న్యాయాధిపతిపదవి నలంకరించి యుండువారు. కావున నే చమత్కారోక్తుల యుక్తుల సమర్థులు. ఇట్టివా రిట్టియభిప్రాయ మిచ్చినపు డొంటిమిట్టవారివాద మడుగంటినట్టు లయ్యెను. కావున నామిత్రు లనేకులు నన్నుఁ బ్రేరించుటచేతను, నేను సత్య మని నమ్మినది యసత్యముచే బాధపడుచుండుటను, ఆంధ్రవాల్మీకిరామాయణమున వ్రాయఁబడినది యవిచారమూలకముగా దని తెలుపుటకును, నొంటిమిట్టవారిపక్షమునఁ జెప్పవలసిన కొన్ని విషయములు చెప్పక యోరుగంటివారిపక్షము క్లిష్టకల్పనలచేతను, నపోహములచేతను సమర్థించి యుండుటచేతను, నాకుఁ దెలిసినంతవఱకు సత్యమును స్థాపించుటకు నే నీవ్యాసము వ్రాయవలసివచ్చెను.

3. ఆర్యులారా! యింతవఱకు బమ్మెరపోతరా జొంటిమిట్టవాఁడా యో

రుగంటివాఁడా యనియే కొందఱు సందేహించుచుండిరి. పంతులవారు తమ వ్యాసమునకు ననుబంధములఁ గొన్ని ప్రకటించిరి. ఈ యనుబంధములు గోల్కొండదేశమందు బొమ్మెర, యోరుగల్లు, రెండు నున్నవనుటకు నాధారము లగును గాని తక్కినవిషయముల నోరుగంటివారి వాదమునకుఁ బ్రతిబంధక ములే. వానివలన బొమ్మెరగ్రామమువారు పోతనామాత్యుఁడు తమగ్రామమం దుండెనని చెప్పుచున్నట్టు లేర్పడుచున్నది. అనుబంధములందలి విషయములు సత్యము లైనచో నోరుగంటివారివాదము కూడ మూలఁబడుచున్నది. అక్క యైశ్వర్యమును జూచి చెల్లెలు చేయివిఱుగఁబడె నన్నట్టులు బొమ్మెరవారివాద మును బురస్కరించుకొని యోరుగంటివాదులు తమపక్షము జయించె నను కొనుటే వింతగానున్నది. బ్ర॥శ్రీ॥ రామయ్యపంతులవా రావిషయమై యేమి యువ్రాయక విడుచుటే కాక బొమ్మెరవారివాదమును దమయోరుగంటివారి వాదమున కుపబలముగఁ బరిగ్రహింప సాహసించిరి.

ఇప్పుడు పోతనామాత్యుఁ డొంటిమిట్టయం దుండెనా, యోరుగంటి యందుండెనా, బొమ్మెరయం దుండెనా యని విచారింపవలసియున్నది. ఇంత వఱకు నాకీ విషయమై సందేహ ముండినను బంతులవారి వ్యాసమును జదివిన పిమ్మట నా సందేహము లన్నియుఁ దీరెను. పోతనామాత్యుఁ డొంటిమిట్టయం దుండె ననుటే సమష్టిమీఁదఁ జూచినను, వ్యష్టిమీఁదఁ జూచినను సమంజస మని నిశ్చయించుకొంటిని. కావున నొక్కొక్క గ్రామమువారి వాదమును విమర్శించెదను. ఉభయవాదముల నిరసూయబుద్ధి పరిశీలించిన నిష్పక్షపా తులే సత్యము స్థాపింప సమర్థులు. ఇట్లనుటచే నోరుగంటివాదు లెవ్వరేని తమయందు నేను బక్షపాతదోష మారోపించితి నని భ్రమింపఁ గారణము లేదు. ఉన్నవిషయమును విపర్యస్తముచేసి నూతనవిషయము నొకదానిని గనిపెట్టి భ్రాంతిమంతమైన యాంధ్రలోకమునకు వాస్తవము నెఱిఁగించి భ్రాంతిఁ దొలఁ గించితి మను మమతాహంతలును గీర్తికాంక్షయును వారికి మనస్సులో నుండిన నుండవచ్చును గాని నా కట్టి యాశ పుట్టఁ గారణమును లేదు. పోతనామా త్యుఁడు గోల్కొండదేశమువాఁ డని గోల్కొండవేపారుల పూర్వుఁ డని చెప్పు టచే గోల్కొండదేశము వాఁడను గోల్కొండవేపారియు నగునాకు నోరుగంటి వాదులు వంద్యులే. అయినను సత్యమునకు విరోధముగ నుండు దేశాభిమా నము గాని జాత్యభిమానముగాని శ్లాఘ్యము గాదు. పోతన గోల్కొండవాఁ డని యేర్పడిన నాకును సంతోషమే. అయినను దెలిసినవిషయము దాఁప రాదుకదా.

2. బొమ్మెరవారివాదము.

4. బొమ్మెర యను గ్రామ మోరుగంటికి 14 కోసులలో ననఁగా రమా రమి 35,40 మైళ్లలో నున్నదఁట. పోతరాజుగారి బమ్మెర యీ బొమ్మెర(?)యే యఁట. ఈ బొమ్మెరయందుఁ బోతరాజుగా రుండి రఁట. ఆగ్రామవాసులు వారి ప్రతిబింబముగా నొకరాతిని నిలిపి దానిని బోతరా జందు రఁట. ఇది గ్రామ దేవత కాదఁట. బొడ్డురాయి యఁట, గ్రామదేవత వేఱే యున్నదఁట. ఈగ్రామ మందే బమ్మెర పోతరాజుగారు భాగవతము రచించుకాలమునఁ బొలము దున్ను చుండఁగా శ్రీనాథుఁడు వచ్చి బోయలు లేకుండఁ బల్లకి మోయింపఁగాఁ బోత రాజుగారు దున్నపోతులు లేకుండ మడక దున్నించినా రఁట. ఈ గ్రామము నందుఁ బోతరాజుగారు భాగవతము "చెప్పినట్టున్నదఁట." వీరివంశమువారు రామభక్తులఁట. వా రిప్పు డాగ్రామమున కథకారులుగ నున్నారఁట. వారి యింటిపేరు నల్లుట్లవా రఁట. ఈ వంశములోని కడపటిపురుషుఁడు వికారిసంవ త్సరములో మరణించెనఁట. వీరు గోలకొండ వేపారులఁట. వీరియింట జీర్ణ దశమస్కంధముమాత్ర మున్నదఁట. తక్కిన భాగవతముపుస్తకమును లే దఁట. ఇది యనుబంధముల సారాంశము.

5. ఈ యనుబంధములను నమ్మితిమేని బమ్మెర పోతరాజుగారు బొమ్మెర యం దుండియే భాగవతమును రచియించినట్టు లేర్పడుచున్నది. కాని దీనిని బంతులవారు గూడ నంగీకరింపలేదు. వారు భాగవతవాక్యమునే ప్రమాణ ముగఁ గొని యేకశిలానగరమందే కృతి రచింపఁబడె నని తీర్మానించిరి. బొమ్మెర వారివాదమున కనుకూలముగ భాగవతమం దొకవాక్యము గాని శబ్దము గాని లేదు. "బమ్మెర పోతరాజొకఁ"డని మాత్రము కానవచ్చుచున్నది. బమ్మెర యనునది గృహనామము కావున నా గ్రామమందే యాయన యుండెననుట కాధారము గాఁ జాలదు. ఈ కారణముచే బొమ్మెరవారివాదము నిరాధార మగుచున్నది.

6. పోతరాజుగారు బొమ్మెరవాసులై, యం దుండియే గ్రహణస్నాన మునకు భాగీరథికిఁ గాని యా గ్రామజనులు చెప్పునట్లు, 140 మైళ్లదూరములో నుండు గోదావరికిఁ గాని పోయి యుండిరా మరలి వచ్చుచో నడిత్రోవలో నేక శిలానగరమున నిలువఁగారణము లేదు. ఈ కారణమును దెలుపుభాగము బొమ్మెరవారియం దున్నది. పోతరాజుగా రేకశిలానగరమునఁ గృతిరచించితి ననినమాట యసత్య మని బొమ్మెరవారు సిద్ధాంతము చేయువఱకు వారివాద మును లోకము విశ్వసింపదు.

7. “పోతరాజుగారికాలంలో బొమ్మెరవా”రని యున్నట్లు తెల్లంభట్ల రామకృష్ణయ్యగారు వ్రాసియిచ్చిన యనుబంధపత్రమున నున్నది. వీరే “యు. రామకృష్ణశాస్త్రి” యనుపేర వేఱొకయుత్తరము వ్రాసియిచ్చిరి. పోతరాజుగారివంశ్యులు నెల్లుట్లనుండి బొమ్మెరకునచ్చిన కారణముచే నెల్లుట్లవారని పిలువఁబడుచున్నారఁట. వీరికి రాయబండారువారికి నేమి సంబంధమో వా రేగ్రామవాసులో తెలియలేదు. వీరికిఁ బూర్వులు పోతరాజు గారఁట. వారు “బొమ్మెర” యందుండిరఁట. వారు “బొమ్మెరయం దుండఁగానే బమ్మెరవా రనుపేరు గలవా రైరఁట. వీరో వీరివంశ్యులో బొమ్మెర విడిచి నెల్లుట్ల కేలపోయిరో యెప్పుడు పోయిరో తెలియలేదు. వారు మరల బొమ్మెర కేల వచ్చిరో బొమ్మెరవా రనుపేరు మాసిపోవఁ గారణ మేమో. ఈవిషయము లేవియుఁ బంతులవారు చర్చింపరైరి.

8. బొమ్మెరగ్రామమునం దుండఁగాఁ బోతరాజుగారికి బమ్మెరవా రనుపేరు వచ్చిన దనుట విశ్వసనీయము గాదు. ప్రబలకారణములేక వచ్చినపేరు పోయిన దనుటయు నమ్మఁదగినదికాదు. ఒక కుటుంబమువా రొకగ్రామములో నివసించుచుండువఱకు నాగ్రామముపేరు వారియింటిపేరుగా నుండుట యరుదు. వా రాగ్రామము విడిచి వేఱొకగ్రామమునకుఁ బోయియుచ్చుటఁ గుదిరినపుడే వారి స్వగ్రామనామము గృహనామముగా నగుచుండుట యెల్లవారికి విదితము. ఇది లోకానుభవసిద్ధము. ఏ పట్టనమందుఁగాని పల్లెలయందుఁగాని విచారించినచో నాపట్టన గ్రామనామము లింటిపేరుగఁ గలవారు పదివేల కొకరెండైన నుందురో యుండరో. ఒక కుటుంబమువారు తమగ్రామము విడిచి వేఱుగ్రామములఁ గొన్నినాళ్లుండి యక్కడ స్వగ్రామనామము గృహనామముగా రూఢి పడినపిమ్మట మరల నేదేని కారణముచే స్వగ్రామమునకువచ్చి వసింపఁగలిగిరేని యప్పుడు వారిగృహనామము గ్రామనామము నొక్కటిగ నుండును. కావున, బమ్మెరపోతరాజుగారు బమ్మెర(బొమ్మెరకాదు) గ్రామమందుండు వఱకు వారికి బమ్మెరవా రనుపేరు వచ్చియుండదు. కావున వారు గ్రామాంతరవాసు లయిన పిమ్మటనే భాగవతమును రచియించి యుండవలయును. ఈవిధముగఁ జూచి నను బొమ్మెర వారివాదము నిలువదు.

9. సమీపగ్రామములలో నిరువురు మువ్వురు ప్రసిద్ధులు పోతరాజులుండిరేని యందొకరిని గుర్తించుటకు బమ్మెర పోతరా జని లోకులు పిలిచి యుండిన నుండవచ్చును. ఇది స్థాపించుభాగము బొమ్మెరవారియం దున్నది,

ఒకవేళ నటులుండెనేని వాదమునకై యూహింత మన్నను బోతనామాత్యుఁడు తన్ను బమ్మెరపోతరా జని వ్రాసికొని యుండఁడు.

ఆంధ్రులలో నింటిపేరు లేనివారు లేరు. కావునఁ దనవంశమున కప్పటికున్న పేరే పోతన వ్రాసికొని యుండును. ఎట్లన:—పొత్తపి యనుగ్రామమునకుఁ బెంచలయ్య యనునాయన కరణముగా నుండినచో లోకు లాయనను బొత్తపి పెంచలయ్య యనివాడుట కలదు గాని యాయన తనపేరు వ్రాయవలసివచ్చి నప్పుడంతయుఁ దనయింటిపేరు పెట్టి మల్లవరపు పెంచలయ్య యనియే వ్రాయును గాని పొత్తపి పెంచలయ్య యని వ్రాసికొనఁడు.

ఈ విధముగఁ జూచినయెడల రామకృష్ణశాస్త్రిగారిమాటలు నమ్మరానివని యేర్పడుచున్నది.

10. ఇఁకఁ బోతరాజు శిలను గుఱించి యాలోచింతము. ఇది గ్రామమునకు బొడ్డురాయి యఁట. ఈ రాతికిఁ బోతరాజ కవివరేణ్యు పేరు పెట్టినారఁట. ఈ విషయమున రామకృష్ణశాస్త్రిగారి వాక్యముల ననువదించుచున్నాను. “ఇక్కడ పోతరాజు అనేది గ్రామదేవత కాదు. గ్రామదేవత గ్రామమధ్యమున నుంట్టుంది. దీనికి బొడ్డురాయి అని అంటారు. దీనికి బ్రాహ్మణులు పూజచేయరు. వెనుకటినుంచి పోతరాజుకు ప్రతిబింబం అని అనుకోవటం వాడుక.” విజ్ఞులారా! ఈ వాక్యములను మీరు హెచ్చరికతో నన్వయింపవలయును. “దీనికి బొడ్డురాయి” అనుచో, దీనికి అనఁగాఁ బోతరాజశిల కని యన్వయించితిని. దీనికి బ్రాహ్మణులు పూజచేయ రనుచో, దీనికి ననఁగా, బోతరాజశిల కని యన్వయించితిని. ఈ యన్వయము తప్పని యీ శిల బ్రాహ్మణులచేఁ బూజింపఁబడుచున్న దని యది మఱియేదో వాక్యముతో నన్వయింపవలయు నని రామయ్యపంతులవా రనిరి. అది బొడ్డురాయి యేయయి పూజగొనక పోయెనా యది పోతరాజు బింబము కానేరదు. నేను జేసిన యన్వయము తప్పో యొప్పో మీరే యాలోచింపఁ గోరెదను.

ఆరసిచూచిన నీశిల పోతురాజుశిలయై యుండవచ్చును. బమ్మెర బొమ్మెరయైనట్లు పోతురాజు పోతరాజై యుండవలయును. ఈ పోతురాజు విగ్రహములు గంగమ్మ, పోలేరమ్మ లోనగు గాలిగంగల సంవత్సరోత్సవములలో మెఱవడి చేయుట మీరందఱెఱింగినవిషయమే. దీనినే వాడుకలోఁ బోతరా జందురు. నామసామ్యమునుబట్టి బొమ్మెర పోతురాజు భాగవతగ్రంథకర్త యైన బమ్మెరపోతరాజై యుండవచ్చును. అవురా దాని యదృష్టము. శిలాభోగమున నిట్టిదేమో,

ఈ విషయమున రామయ్యపంతులవారు "ఈ దేవతనుబట్టియే కవికా నామము కలిగిన దనుట యెక్కువ యుక్తముగా నుండును" అని బొమ్మెరవారి మాటను దలక్రిందుచేసిరి. వీరియూహయందు విపరీత మేమియు లేదు. కావున నంగీకరింపవచ్చును. కాని పోతరాజులు గ్రామగ్రామమున నుండుటచే నేయూరి పోతరాజును బట్టియైనఁ గవి కాపేరు వచ్చియుండవచ్చును. బొమ్మెరలోని రాతినిబట్టియే కవి కాపేరు వచ్చిన దని పంతులవా రెట్లు స్థాపింపఁగలరో

11. తొలుత బొమ్మెరయే బమ్మెర యనునది యెంతనిశ్చయమో. బమ్మెర యను గ్రామము నుఱొకటి యాంధ్రదేశమున నున్నట్టు లేదు, అని పంతులవారే సందేహముగాఁ జెప్పిరికదా. తా నుధికారపదవి నలంకరించిన మండల మందుండిన యేల్చూరే యేచ్చూరని పంతులవారు తెలిసికొనఁజాలకయుండియు నెందోయుండిన బొమ్మెరయే బమ్మెర యని సాధింపఁజూచుటయు బమ్మెర యనునది యాంధ్రలోకమున లే దని వ్రాయసాహసించుటయు వింతగొల్పెడి. ఆంధ్రప్రపంచమున నుండు పల్లెలపే ర్లన్నియుఁ దెలిసిన సర్వజ్ఞుఁ డీమాట చెప్ప నర్హుఁడు. 400 సంవత్సరముల కీవల నెన్ని గ్రామములు నామావశిష్టము లైనవో యెన్ని పే రైనను వినరాకపోయినవో యెవఁడు చెప్పఁగలఁడు. కావున నాలుగువందల సంవత్సరములకుఁ బూర్వము బమ్మెర యను గ్రామము వేఱుగ లేదనియు నీబొమ్మెర యే పూర్వము బమ్మెర యనియు నిట్టిట్టి కారణములచే నిట్టు మాఱె ననియు నేచ్చూరికి నేను గనఁబఱిచినట్లు కనఁబఱుచు వఱకుఁ బంతుల వారిమాట పాటింపరాదు.

ఆయూరివారివాక్యము విశ్వసించి తాము చెప్పుచున్నామని పంతులవా రందు రేని "వేములవాడ భీమకవి విశ్రుతవాక్యము దీనినమ్ముఁడీ" యను చాటువు, దక్షారామభీమేశనందనుఁడన్" అనుగ్రంథస్థవాక్యము, జనశ్రుతి నిన్నిటిని నిరసించి వేములవాడ భీమకవి గాఁడు, లేములవాడభీమకవి యని సాధింప యత్నించు వీరీ విషయమునఁ దగినవిమర్శము చేయక గ్రామజనుల వాక్యము నమ్ముట ఋజుపద్ధతి గాదని చెప్పవలసివచ్చును. లేములవాడను బౌర పాటున వేములవాడయని పఠించి భీమకవి యచ్చటివాఁడని లోకులు, భ్రాంతి పడుచున్నారని పంతులవా రెట్లు తలంచుచున్నారో యట్లే బొమ్మెరను బమ్మెర యనుకొని వారు భ్రాంతులగుచున్నా రని యెంటిమిట్టవారు లనుచున్నారు. రెంటి నొకటే యని సప్రమాణముగ స్థిరీకరింప వలసినభారము పంతులవారి యం దున్నది.

ఓహో! కంఠస్థానము లేని యన్యదేశజులచేతను, వారిననుకరించుట గొప్పతనముగఁ గొను స్వదేశమూఢులచేతను, జమవురాని "సర్వే" వారిచేతను, బీఠాపురము, పిఠాపురమని, రాజమహేంద్రవరము రాజమండ్రియని పులివెందల పులివెండ్ల యని యిట్లుపేర్లువికారములు పొందుచుండుట యెఱింగిన నీవేల బమ్మెర బొమ్మెర గా మాఱియుండుటను సందేహించెద వని మీరడుగ వచ్చును.

మాఱిన మాఱియుండవచ్చును గాని వివాదవిషయమున నెదుటివారు మనల నెట్టిప్రమాణములు గోరెదరో యట్టిప్రమాణములను మనము వారిని గోరుట తప్పా? అంగీకరించినఁ బ్రమాదము లేనిచో నంగీకరింపవచ్చును గాని యది యనర్థమునకుఁ గారణ మగునేని నిర్విచారముగ నంగీకరింపరాదు. కించిద్భేదముతో రూపసామ్యము గలనామములు గలగ్రామము లంధ్రదేశమునఁ బెక్కులు గలవు. అందుఁ గొన్నివిన్నవించెదను.

ఏకనాపురము	కాంచీపురముతాలూకా.	అలివేలుమంగాపురము	వేంకటగిరితాలూకా.
నేకనాపురము	సిద్ధవటముతాలూకా.	కంపసముద్రము	రాజంపేటతాలూకా.
రావులకోలను	ప్రొద్దుటూరుతాలూకా.	కెంపసముద్రము	హోసూరుతాలూకా.
రావులకొల్లు	సిద్ధవటముతాలూకా.	తిడ	అనకాపల్లితాలూకా
కడప	కడపతాలూకా.	తడ	నెల్లూరుజిల్లా.
కుడప	తిరువూరుతాలూకా.	జయతి	గజపతినగరము తాలూకా
కదిరి	కదిరితాలూకా.	జయంతి	నందిగామతాలూకా.
కుదిరి	పోలూరుతాలూకా.	గోల్కొండ	నిజామురాష్ట్రము.
పులివెందర	పోలూరుతాలూకా.	గొల్లకొండ	విశాఖపట్టనముజిల్లా.
పులివెందల	పులివెందలతాలూకా.	వావిలపాడు	శృంగవరపుకోట తాలూ
అలిమేలుమంగాపురము	చంద్రగిరితాలూకా.	వావిలిపాడు	చంద్రగిరితాలూకా[కా.

ఇట్టివి పెక్కులు గలవు. బమ్మెర-బొమ్మెర యిట్టివై యుండవచ్చును. ఇన్నాళ్లవఱకు బొమ్మెర తెలియరానట్టే యిప్పటికి బమ్మెరయునికి తెలియరాకుండవచ్చును. అట్టిది యుండి నామావశేషమై యుండవచ్చును. ఇన్ని సందేహము లుండుసందర్భములో బమ్మెర బొమ్మెర యొక్కటియే యని యెట్లు తటాలున నంగీకరింపవచ్చును.

12. పోతనామాత్యుని వంశమువారు బొమ్మెరయం దున్నారఁట. వారు పోతనసంఖ్యలో వారియన్నగారివంశమువారో లేక జ్ఞాతులో యెట్లెఱుఁగ నగు? పోతనామాత్యునుండి నేఁటివఱకు నాయనవంశవృక్షము నవిచ్ఛిన్న

ముగా వ్రాసియుంచినవా రెవరో! మాయింటిపేరిగ్రామమందు మాబంధువు లున్నారు, మే మిందున్నారము. ఈమాత్రముచేతనే నేను వావిలికొలని గ్రామనివాసి నని చెప్పనగునా? ఇట్టిసంబంధమే బమ్మెరకుఁ బోతరాజుగారికి నుండవచ్చును. బొమ్మెరవారి వాదవిషయమున సందేహింపఁదగినవి యింకను గలవు గాని యవి యిప్పు డప్రస్తుత మగుటచే నింతతో దాని విచారము మాని యోరుగంటివారివాదమును బరిశీలించెదను.

3. ఓరుగంటివారివాదము.

12. ఏకశిలానగర మని పోతరాజుగారు చెప్పుటయు నేకశిలానగరమని యోరుగంటికిఁ గూడఁ బే రుండుటయుఁ దప్ప వీరివాదమున కితరాధార మేదియు లేదు. పోతరాజుగారివిషయమున బొమ్మెరయందును, నొంటిమిట్ట యందును, గలలోకప్రవాదము లోరుగంటిలో లే వని యనుబంధములవలనను బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారి వ్యాసమువలనను స్పష్టమగుచున్నది. ఓరుగంటి వాస్తవ్యులు శ్రీమాన్ విద్వాన్ అమరవాది నారాయణాచార్యులవారు "గోదావరిని గంగయని వాడుక మిక్కిలి యిక్కడ వాడుక కలదు. ఏకశిలానగర మనునది వరంగల్ ప్రతాపరుద్రీయగ్రంథమందు నాటకప్రకరణమందు వైతాళికవాక్యమందు "రాజ న్నేకశిలానగరాధీశ" యని సంబోధనవాక్యముచేతఁ బ్రతాపరుద్రుఁ డేలినవరంగల్ అని చెప్పవలసినది. పోతరాజువిగ్రహము పోతరాజు ప్రతిబింబమే యని వీరివంశస్థులు చెప్పఁగా వినియున్నాను" అని వ్రాసియిచ్చిరి గాని పోతరాజునకు నోరుగంటికి నీషత్తైన సంబంధ మున్నట్టు వారు చెప్పినవారు గారు. ప్రతాపరుద్రుఁ డేలినది యోరుగల్లు గా దని యెవరు చెప్పిరి? వారివాదము బొమ్మెరవారివాదమున కుపకరించుచున్నదిగాని యోరుగంటివారివాదమునకుఁ బ్రయోజనపడదు. బమ్మెరపోతనవిషయమై యత్కించిత్ప్రమాణ ముండినను నంతటి విద్వాంసులకుఁ దెలియకుండునా? తెలిసియుండినఁ జెప్పకుందురా? ఒకవేళ వారికిఁ దెలియకుండినను నోరుగంటివారివాదము స్థాపింప నిన్నియనుబంధముల సంపాదించినవారైనఁ దద్విషయము తెలిసినవారియొద్ద వ్రాయించుకొని తేకుందురా? వా రొకవేళ నుపేక్షించి రనుకొన్నను నిదే కార్యముగ నోరుగంటికిఁ బోయి యేడెనిమిదిదినములుండి యీవిషయమంతయు విచారించి పూర్వాభిప్రాయము మార్చుకొనిన పంతులవా రైన నట్టివిషయ మేమైన నుండినఁ జెప్పక గంగను గోదావరిగఁ జేయ వ్యర్థముగ శ్రమింతురా? తమవాదమున కైదవయాధారము జనశ్రుతి

యని వ్రాసినవా రోరుగంటివిషయమై యొకమాట యయిన వ్రాయకుందురా? కావున నోరుగంటికిఁ బోతరాజుగారిభాగవతమునకు సంబంధము లేదనియు నీకమీఁద నట్టిపత్రములు సృష్టింపఁబడునేని వితండావాదమునకై తేఁబడినకూటసాక్ష్యముగ గ్రహింపవలసియుండుననియుఁ దలఁచెదను.

ఓరుగంటివారివాదమే బలీయమనుటకుఁ బంతులవా రాఱాధారముల వ్రాసిరి. అందు:—

3A. మొదటియాధారము.

13. "పోతరాజుయొక్కయు, భాగవతములో శిథిలము లయినభాగములఁ బూరించినయితరకవులయొక్కయు నింటిపేళ్లు." పోతరాజుగారియింటిపేరు బమ్మెరవారు. బొమ్మెర యనుగ్రామ మోరుగంటికి రమారమి మూఁడామడదూరమున నున్నది. దీని నచ్చటివారు బొమ్మెర యందురు" ఈపేరు గల గ్రామము మఱియొక్కచోట నున్నట్లు తెలియరాలేదు. కావునఁ బోతరాజు నింటిపే రీ బొమ్మెరనుబట్టియే పుట్టిన దని యూహింపవచ్చును. మఱియు భాగవతము పంచమస్కంధము బొప్పనామాత్యపుత్రుఁ డగుగంగనార్యుఁడును, షష్ఠస్కంధము నేర్చూరి సింగయయు, నేకాదశద్వాదశస్కంధములు పోతనామాత్యప్రియశిష్యుఁ డగువెలిగందలనారయయుఁ దెలిఁగించిన ట్టచ్చుప్రతులలో నున్నది. "ఏర్చూరు, వెలిగందల, గోల్కొండదేశములో నున్నవి" అని వ్రాసి పంతులవారు కడపట "బమ్మెర, ఏర్చూరు, వెలిగందలయు నోరుగంటిప్రాంతదేశములో నుండుటచే నాయింటిపేళ్లు గలవా రాదేశము వారని యూహించుట యసమంజసము కాదు" అనిరి.

14. ఈకడపటివాక్యమందు "ఆయింటిపేళ్లుగలవా రాదేశము వా"రను నది "ఆయింటిపేళ్లుగలవారి వంశములమూలపురుషులు తొలుత నాదేశము వారు" అని లుప్తపూరణము గావించినచో నిది యూహామాత్రముగఁ గాక సామాన్యసత్య మని యంగీకరించిన నంగీకరింపవచ్చును. అటుగానిచో నీయూహ యపోహమే యగు.

"ప్రస్తుతము తూర్పుదేశమం దున్నగోలకొండవేపారులయొక్కయుఁ దెలగాణ్యులయొక్కయు నింటిపేళ్లు గలగ్రామము లనేకములు గోలకొండదేశములో నున్నవి. దీనినిబట్టి యాగృహనామములఁ గలవారు తొలుత గోలకొండదేశమునుండి వచ్చినా రని తేలుచున్నది. ఆప్రకారమే బమ్మెరవారు వెలిగందలవారు, ఏర్చూరువారును దమతమగ్రామములనుండి వచ్చి యొంటి

మిట్టప్రాంతమందు స్థిరపడి యుండిన నుండవచ్చును గాని యీ యింటిపేళ్లు గలవారు పోతరాజుకాలమం దొంటిమిట్టప్రాంతమున నుండి రనుటకుఁ దగిన యాధారములు కనఁబడిన గాని యీయాక్షేపమునకు బలము లేదు. అట్టి యాధారములు లేనిచో నాయింటిపేళ్లు గలవారు గోలకొండదేశమం దుండిరనియే యూహింపవలసియుండును" అని పంతులవారు వ్రాసిరి.

15. ఇందుఁ గడపటి రెండువాక్యములందలి వాదపద్ధతియు నూహయు లోకానుభవమునకు వాస్తవమునకుఁ గూడ విరుద్ధ మని యొంటిమిట్టవాదు లందురు. ఏలన,

మనదేశమున రాజులు, మంత్రులు, మహాకవీంద్రు లేకాలమువారో యేదేశమువారో చెప్పుటకుఁ జరిత్రములు లేవు. సందర్భములఁబట్టి దేశకాలము లూహించుచున్నారు. కొన్ని యిప్పటికి నూహింప సాధ్యపడకున్నవి. పెరటిచెట్టు మందునకుఁ బనికిరానికారణముచేఁ గేవలకవిత్వవైశిష్ట్యముచేతనే తమయభిజనములఁ బ్రసిద్ధిగాంచినకవులు నూటి కొక్కరైనఁ గలరో లేరో. అందఱు దేశాంతరములఁ దమప్రాగల్భ్యము మెఱసి ప్రసిద్ధికి వచ్చినవారే.

అంతియకాక యాంధ్రరాజులప్రభుత్వము దక్షిణదేశమునఁ జెల్లినపుడును గోల్కొండదేశమునఁ దురకలరాయిడి ప్రబలమైనపుడును ననేకాంధ్రకుటుంబములవారు ద్రవిడదేశమున నందందు నెలవుకొనిరి. గోల్కొండదేశమున 1309 మొదలు 1424 వఱకుఁ దురకలదాడి విపరీతముగ నుండుటయు దేశ మల్లకల్లోలముగ నుండుటయుఁ దుదకు నాదేశములనుండి స్వదేశప్రభువులు తఱుముఁగొట్టఁబడి దక్షిణాభిముఖులై వచ్చి యందందు నెలకొనుటయుఁ జరిత్రకారులు వ్రాసి యుండువిషయమే కదా. బమ్మెరపోతనయు నీకాలములోనివాఁడే, పోతరాజు పుట్టకముందే యందుఁ దురకలదాడి విశేషముగ నుండెను. ఆకారణముచే దేశప్రభువులే దేశభ్రష్టులై పోవుచుండ బీదసాదలు తురకలబాధ సహింపలేక దేశభ్రష్టు లగుట వింత గాదు.

మఱియు నీకాలమున విజయనగరరాజ్యము ప్రబలముగ నుండె నని చరిత్రములే చెప్పుచున్నవి. కావునఁ బోతనామాత్యుఁడో యాయన తండ్రియో యాదేశము విడిచి యీప్రాంతమునకువచ్చి రని యూహించుటయందు వైపరీత్యమేదియుఁ గానరాదు. కడపమండలమందే నాయెఱిఁగినంతలో నోరుగంటివారను పేరు గలకుటుంబములు మూఁడునాలు గున్నవి. వీ రాకాలమున నాదేశము విడిచి వచ్చినవా రనియే తోఁచుచున్నది.

ఇట్లుండ నేవో రెండుమూఁడు సామాన్యకుటుంబములవా రన్యదేశముల నుండినట్లు చిరకాలప్రసిద్ధి యుండినను జాలదఁట. ఇట్టికాలమున నిట్టి ప్రదేశమున నిట్టివా రుండి రని 500 సంవత్సరములనాఁటి వృత్తాంతమునకుఁ "దగినయాధారములు వలయునఁట" జనశ్రుతియుఁ బూర్వులేఖనములుఁ దగినయాధారములుగావోటు? బికారి పోతనమాట యటుండ నిండు, ప్రభువులగు వెలుగోటివారికాలమున నెం దుండిరో పంతులవారు చెప్పఁగలరా? ప్రభువులస్థితి య ట్లుండ బీదసాదలగతి యెట్లు చెప్పవచ్చును. అయిదునూర్ల సంవత్సరములనాఁటివృత్తాంతమిపు డిదమిత్థ మని నిర్ధారించుట యసాధ్య మని యెఱిఁగియెఱిఁగి దుర్లభవస్తుప్రార్థనము చేయుట యోరుగంటివారివాద దౌర్బల్యము సూచించుచున్నది. వీరి యూహాల కేతగినయాధారములఁ గనఁబఱిచిరో."

16. పంతులవా రూహించినట్లు లూహించి సిద్ధాంతముచేయఁబూనినచో నెట్టి యనర్థకములుపొసఁగునో తెలుపుటకై నాచరిత్రము దృష్టాంతముగఁ జెప్పుచున్నాను.

మేము గోల్కొండవేపారులము. ఆకారణముచేతనే మా పూర్వులు గోలకొండదేశమువా రనుట నిర్వివాదము. మా యింటిపేరు వావిలికొలనివారు. ఈపేరిగ్రామము గోలకొండదేశమం దున్నది. మాబంధువు లాప్రాంతముల నేఁటికి నున్నవారు.

నా కౌసల్యాపరిణయము భద్రాద్రిరామస్వామి కంకితము. దానిని ముద్రించి ప్రకటించినవా రిప్పటి పీఠాపురపురాజుగారి మేనమామగారై విని గడప, ఉండ్రాజవరము లోనగు తాలూకాల జమీందారులైన మ-రా-రా-శ్రీ శ్రీరాజా వెల్లంకి వేంకటరామారావుబహద్దర్ వారు.

అంతియకాక యభినవాంధ్రభోజు లని యాంధ్రలోకముచే నెన్నఁబడుచున్నట్టియు, నాకు జీవనోపాయము కల్పించియు, బదరికాశ్రమమం దాసన్నమరణదశనుండు నాకుఁ బ్రాణము నిలిపినట్టియు, మదీయాంధ్రవాల్మీకి రామాయణాదికృతులఁ బ్రకటించి పాంచభౌతిక కాయముకన్న శాశ్వతమైన యశఃకాయ మొసఁగి స్థిరజీవిఁ జేసినట్టియు శ్రీరాజారావు వేంకటకుమారమహీపతి సూర్యారావు బహదర్ గారు పాలించు పీఠికాపురము, మీఁద సూచించిన ప్రదేశములకు సమీపమందున్నది. ఈప్రభువుగారు నాకొనర్చిన సాహాయ్యము లోకమంతయు నెఱిఁగియే యున్నది. కావున 500 సంవత్సరములకుఁ దరు

వాతి చిత్రచరిత్రకారు లాదేశమువాఁడను నేను గాకుండిన నాకేల యా ప్రభువుగారు తోడ్పడుదు రని యూహించి నేను గోలకొండదేశమువాఁడ నని కాని వేఁగినాటివాఁడ నని కాని వ్రాయుచు నాయూరు కడప గాదు కరప యనియుఁ బ్రమాదమువలననో లేక ర-ల-డ లకభేదము కావుననో కరపయే కడపగా ముద్రింపఁబడినదనియు,(నాజన్మస్థలము జమ్ములమడుఁగును జమ్మడక యనియు వాడుచుండుటచే) జమ్మడక కృష్ణామండలమునఁ గాఁబోలు నుండుటచే నదియే నాజన్మస్థల మనియు దీనికి సమీపమందే బెజవాడ తాలూకాలోఁ బ్రొద్దుటూరను గ్రామమున్న దనియు నాప్రాంతములవాఁడ నగుటచేతనే నా కృతి భద్రాద్రిరామస్వామి కంకితమిచ్చితి ననియు, నక్కడివాఁడనగుటచేతనే పీఠికాపురమురాజుగారి ప్రాపు నాకుఁ గలిగె ననియు లేకున్నఁ గడపయెక్కడ? పీఠాపురమెక్కడ? రెంటికి సంబంధము కుదుర దనియు వ్రాసిరేని నేనంతవఱకు జీవించి యుండినను నది కాదని యెట్లు సమర్థింపవలయునో నాకుఁ దోఁచినది కాదు. నేను జీవించియుండఁగానే నన్నుఁ గొందఱు సుబ్బరాయశాస్త్రిగారని వ్రాయుచున్నారు. తమజాతిలోఁ బుట్టి తమకుఁ గీర్తి తెచ్చితి నని కొందఱు మాధ్వులు వ్రాసియున్నారు. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికలో నొకరు నన్ను దక్షిణదేశకవులలోఁ జేర్చిరి.

జీవద్గ్రంథకర్తల గతియే యిట్టులుండ నిట్టియూహాలవారు చరిత్రకారులు పుట్టుదు రని యూహాయే లేనికాలమువారి గుఱించి యేమి చెప్పవలయును. కావున గగనకుసుమములఁ దేరఁగోరు వాదపద్ధతి సరిగాదు. శాసనములలోనగు ప్రత్యక్షప్రమాణములు లేనపుడు గ్రంథకర్తలవిషయమై పూర్వుల లేఖనములు జనశ్రుతి బలిష్ఠము లైనప్రమాణములు. ఇవి రెండు నోరుగంటివిషయమున శశవిషాణములు.

17. ప్రొద్దుటూరియందు నిప్పు డోరుగంటివా రనియొకకుటుంబ ముండుట పంతులవారు నెఱింగియే యుందురు. వారెన్నితరములకు ముందు కడపమండలముఁ జేరిరో వారికే తెలియదు. దీనివలన నూహింపఁదగిన దేమి? ఓరుగంటిప్రాంతమునుండి కొన్నికుటుంబములవారు కడపమండలమందుఁ జేరిరని యే కదా? ఇట్టియోరుగంటివారికుటుంబము లింకను గడపమండలమందే యూఁడున్నవి. ఈప్రకారము వచ్చిన వంశమువారిలో 400, 500 సంవత్సరములలో నిలిచిపోయిన కుటుంబము లెన్నియో యెవ్వఁ డెఱుఁగును. ఉన్నవారికే తమపూర్వులవృత్తాంత మననేల 6, 7 తరములకు ముందటివారి పేళ్లే

తెలియకుండఁగా నష్టవంశములచరిత్ర మెవ్వఁ డెట్లెఱుఁగనగు. భాగవతకవిచతుష్టయవృత్తాంతము తెలుపఁదగిన విశ్వసనీయాధారము లాదేశమందైనఁ గలవా? వారివంశము లిప్పటికున్నవా? ఓరుగంటినుండి వచ్చినవా రోరుగంటివా రైనట్లు బమ్మెరనుండి వచ్చినవారు బమ్మెరవారైరి.

18. బమ్మెర పోతరా జొంటిమిట్టవాఁ డని యనాదిజనశ్రుతి గలదు. లిఖితాధారములు గలవు. అటుగా దని యిప్పుడు నూతనముగ నోరుగంటిగ్రామము వాఁడని చెప్పువా రోరుగంటివాదులు కావున జనశ్రుతియు లిఖితప్రమాణము లసత్యమనియుఁ బోతరా జొంటిమిట్టకు రా లే దనియు గోలకొండదేశమందే యుండె ననియుఁ "దగిన యాధారముల"చే సిద్ధాంతము చేయవలసిన భార మోరుగంటివాదులయం దుండ నీ భార మొంటిమిట్టవారిపైఁ బంతులవారు వేయుట వాదచమత్కార మేమో గాని యుక్తియుక్తముగాదు. న్యాయ్యమునుగాదు. కావున భాగవతకవు లందఱు గోలకొండదేశము విడిచి రా లే దని యోరుగంటివాదులు సప్రమాణముగ సిద్ధాంతము చేయువఱకు వారివాదమునకు లోకము చెవినీయవలసిన పనిలేదు.

19. కేవల కవిగృహనామములఁబట్టి వాసస్థలము సిద్ధాంతము చేయుపద్ధతి సరిగా దని నూపింప నింతదూరము వ్రాయవలసివచ్చెను గాని పంతులవారిప్రథమాధారము నిస్సారముఁ జేయ వేఱుమార్గము లేక కాదు. ఇఁకఁ బంతులవారి వాదపద్ధతినే యొంటిమిట్టవిషయమున నన్వయించెద.

ఏచూరు, వెలిగందల గోలకొండదేశమం దున్నవి. కావున "నాయింటిపేళ్లు గలవారు గోల్కొండదేశమం దుండి రనియే యూహింపవలసియుండును" అని కదా పంతులవారివాదము. భాగవతము షష్ఠస్కంధము రచియించిన సింగయ్య తనపూర్వపితామహుఁడు 'ఎఱ్ఱన' యేచూరిశాసనుం డని వ్రాసెనే కాని తనయింటిపే రేచూరువా రని వ్రాయలేదు. ఎఱ్ఱన యధికారిగా నుండినస్థల మేచూరు.

ఈ యేచూరు నరసారావుపేఁటసమీపమున గుంటూరుజిల్లాలో నున్నది. దీనికిఁ గలప్రమాణములు. ఆధునిక కవిజీవితములు పుట 59. "పోతరాజు లక్ష్మీనరసింహకవిగారు. వీరి నివాసస్థలము నర్సారావుపేట తాలూకా ఏచూరు. ఆఱువేలనియోగిబ్రాహ్మణులు. ఆపస్తంబసూత్రులు. శ్రీవత్సగోత్రులు."

అందే పుట 279. "పోతరాజు విశ్వనాథకవిగారు. వీరినివాసము నరసారావుపేఁట తాలూకా ఏచూరు. ఆఱువేలనియోగులు. శ్రీవత్ససగోత్రులు."

అందే పుట 435. "పోతరాజు రాసుకవిగారు. వీరి నివాసస్థలము గుంటూరుజిల్లా నర్సారావుపేఁట తాలూకా యేఱ్చూరుగ్రామము. శ్రీవత్సముని గోత్రులు."

మీఁదిగ్రంథమును రచియించిన మ-రా-శ్రీ, రాజా భుజంగరావుగారు "ఏల్చూరు" అనుటకు "ఏఱ్చూరు" అని ముద్రించి రనియు సర్వే లెక్కలలో 'ఏల్చూరు' అనియే యున్న దనియుఁ బంతులవారు వాదింపవచ్చును.

దీనికి జతపఱిచిన 1 2 3 4, అనుబంధములను వీరు పఠించి రేని వీరి సంశయము సమూలము తొలఁగును. ఈ యనుబంధములవలన నేఱ్చూ రను నది యీ దేశమందును నుండుటే గాక యందే భాగవతషష్ఠస్కంధకర్త సింగయ్యయు నుండె నని తెలియవచ్చుచున్నది. విప్రనారాయణచరిత్రపీఠికయందుఁ బంతులవారు "సింగనమంత్రిసంశకర్త యైన యెఱ్ఱాప్రెగడ గోలకొండదేశములోని నల్లగొండమండలమందలి యేఱ్చూరుగ్రామమున నుండువాఁడు" అని వ్రాసిరి. కాని దాని కాధార మించుకయైన వచించినవారు కారు. లోకమున నేఱ్చూ రొక్కటియే యున్న దనుభ్రాంతియే యీ వ్రాఁత కాధారమై యుండవలయును.

ఇఁక రెండవగ్రామమైన వెలిగందల వేంకటగిరిరాజుగారి గ్రామము. పొదిలితాలూకాలో నున్నది. *ఈ రెండు నిప్పుడీ దేశమునఁ గడపమండలమునకు సమీపమున నున్నట్లు లేర్పడెను గదా. కావునఁ బంతులవారు తమవాదమును నొంటిమిట్టపరముగా నన్వయించి నిష్పక్షపాతబుద్ధితో నొంటిమిట్టకు ననుకూలముగఁ దీర్పుచెప్పఁ బోరింబోరి వేఁడుచున్నాఁడను. ఈ విధముగ నోరుగంటివారికిఁ బ్రబలాధారమైన ప్రథమాధారము నిస్సారమయ్యెను.

రెండవయాధారము.

20. "పోతరాజు గంగాతీరమందు మహేశ్వరధ్యానము సేయు నవసరమున రామభద్రుఁడు ప్రత్యక్షమై భాగవతము తెనిఁగింపు మని యనుజ్ఞ యిచ్చె ననుట."

ఇందు గంగ యనఁగా గోదావరి యని యర్థకల్పనముఁ గావించి యిది యోరుగంటివాదులకు రెండవయాధార మని పంతులవారు వ్రాసిరి. భాగవతకవిచతుష్టయమువారి యింటిపేర్లు గలగ్రామములు గోలకొండదేశమందే యు

*పులివెందల-పులివెండ్ల Pulivendla పులివెండ్ల యని వాడఁబడుచున్నట్లు లిది వెలిగండ్ల యని వాడఁబడుచున్నది. నిజాము రాష్ట్రమందును వెలిగందల యనిలేదు. ఎల్గండల్ ఎల్గండ్ల యని యున్నది. ఆంధ్రుల చరిత్రమందును ఎల్గందల యనియే యున్నది.

న్నవని యెంచి దానిని బలపఱుచుటకై యిట్టి క్లిష్టార్థకల్పనము గావింపఁబడె నని యెట్టివారికి స్ఫురింపకపోదు. పరిశీలించి చూడ నా యాధారము దారమువలె నిస్సార మయ్యెఁ గదా. దీనిగతియు దానితోపాటే. గంగయనఁగా గోదావరి కావునను, గోదావరి గోల్కొండదేశమందే యుండుటను బోతరాజు గోల్కొండదేశమువాఁడు. పోతరాజు గోల్కొండదేశమువాఁడు గనుక గోదావరిని గంగయని వ్రాసెను. అను నీ యుక్తులు పరస్పర మాధారము లగుటచే నన్యోన్యాశ్రయత్వదోషమునకుఁ బాలుపడ నయ్యెను. పోతన గోల్కొండయం దుండిన వాఁ డనునది విశ్వసించినఁ గాని గంగ గోదావరి యని స్ఫురింపదు. ప్రథమాధారమున కిది యాశ్రయము కాదనియు నా కారణముచే నన్యోన్యాశ్రయత్వము లేదనినను నిది స్వతంత్రాధారము కాఁజాల దని వా రంగీకరింపక తప్పదు. అది యెట్టులయిన నగును గాక యిది యు నొక యాధారముగఁ బంతులవారు వ్రాసిరి. కావున నది యెంతమాత్రము క్షోదక్షమమో చూతము.

21. "శ్రీమన్నారాయణకథాప్రపంచవిరచనాకుతూహలుండనై యొక్క రాకానిశాకాలంబున సోమోపరాగంబు రాకం గని సజ్జనానుమతంబున నభ్రంకషశుభ్రసముత్తుంగభంగ యగుగంగకుఁ జని క్రుంకులిడి వెడలి మహనీయ మంజులపులినతలమధ్యంబున మహేశ్వరధ్యానంబు చేసి కించిదున్మీలితలోచనుండనై యున్నయెడ"........

ఇవి పోతరాజుగారి వాక్యములు. ఇందు 'గంగ' యనఁగా గోదావరి యని యోరుగంటివారి వాదము. దాని కాధారము జనులవాడుకయే గాని శాస్త్రము గాదఁట పురాణము గాదఁట పూర్వోత్తరకథాసందర్భమును గాదఁట.

కేవల గంగాశబ్దమునకు గోదావరి యనునర్థ మిప్పు డోరుగంటివాదులు చెప్పఁగా వినుచున్నాను గాని యింతవఱకే గ్రంథమందుఁ జదివినట్లు స్ఫురింపలేదు. అశ్రుతపూర్వమును. ఈ నా యజ్ఞానమును సత్కవిప్రయోగముచేఁ బురాణవాక్యములచే వారు తొలఁగింతురుగాక. బమ్మెరపోతరా జెందైన నట్లు ప్రయోగించెనా వారు సెలవిచ్చెదరుగాక.

"ఈ నదికి గోలకొండదేశమం దంతటను గంగయనుసంజ్ఞ రూఢమైయున్నది" అని పంతులవారు తమప్రమాణమును దెలుపుటచేతనే శాస్త్రపురాణసత్కవీశ్వరప్రయోగాదిప్రమాణములు శూన్యము లని తెలియవచ్చుచున్నది. జనవాక్యము ప్రమాణము గాదా యందురేమో. పురాణసుప్రసిద్ధ సంకేతనామములకు విరుద్ధార్థము కల్పించుపామరవాక్యము ప్రమాణము కానేరదు.

దక్షిణగంగ యని గోదావరికి సంకేతము స్థలపురాణములఁ గలదు. దాని నాధారముచేసికొని నన్నయ్యభట్టు మూలమునందు లేకున్నను స్వదేశాభిమానముచే "దక్షిణగంగనాఁ దనరు గోదావరి" యని భారతమున వ్రాసెను. సంగ్రహార్థమై యొండె భక్తిచే నొండెఁ బామరులు దక్షిణగంగను గంగ యని వాడిన వాడుకోవచ్చును, గాని గ్రంథముల స్థలనిర్దేశము చేయునపుడు విశేషణరహితముగఁ బ్రయోగింపరాదు. పోతరాజుగా రెందును నట్లు ప్రయోగించియు నుండలేదు. పామరవాక్యములఁబట్టి యుగ్రంథముల కర్థము చెప్పరాదు. అట్లుచెప్పిన నేమి యందురా.

i. కావేరీతీరవాసు లందఱు నేకుంటకుఁగాని నదికిఁగాని స్నానమునకుఁ బోవునపుడు కావేరికిఁ బోయివచ్చెద మని చెప్పుట వాడుక. ఆ కారణముచేతనే యన్నికుంటలు వంకలు కావేరు లగునా? వాని నెల్లఁ గావేరులుగ నుగ్రంథముల వ్రాయువాఁడు వివేకియా?

ii. మాధ్వులు నరకచతుర్దశినాఁ డుషస్స్నానము చేసి గంగాస్నానము చేసితిరా యని తమ మతస్థులనే గాక పరిచితుల నెల్లఁ బ్రశ్నించు వాడుక సుప్రసిద్ధము. వాస్తవముగ వీరు స్నానమొనర్చినది బావి నీటియందో వాన చూరు నీటియందో కొళ్లాయినీటియందో. వీరి మాటలు ప్రమాణములుగఁ గొనితిమేని గంగాళములోని వన్నియు గంగలే. ఈ నీళ్లనెల్ల "నభ్రంకష శుభ్రసముత్తుంగ భంగ గంగ" లని వ్రాయు కవీశ్వరు లెఁకఁ బుట్టుదురు కాఁబోలు.

iii. ఇంద్ర. చెల్లఁగ మదిఁగ నిన్ను భజింతు గంగఁ
ఫుల్లత్తరంగఁ బహుపుణ్య సంగఁ
గల్లోల లక్ష్మీ జితకాశ మల్లిఁ
దల్లిఁ సుధీకల్ప లతామతల్లిఁ

పోతరాజుగారి యీ పద్యమునకు గోదావరిపరముగ గోల్కొండదేశమువా రర్థము చెప్పెదరు కాఁబోలు.

iv. తిరునల్వేలియందు శ్రీవైకుంఠ మనియు, సేలముజిల్లా తిరుచఁగోడు తాలూకాయందు వైకుంఠమనియు గుంటూరుతాలూకాలో వైకుంఠమనియుఁ జీకాకోలు తాలూకాలో వైకుంఠపురమనియుఁ గలవు కదా. ఈ పేర్లు జనులవాడుకయం దుండుటయే గాక గ్రంథస్థములు నగుటచే "అలవైకుంఠపురంబులో నగరిలో నామూల"యను పద్య

మునకు నర్థము చెప్పునపుడు మా యూరిలోని మా యింటిమూల నుండి విష్ణువు వెడలిపోయె నని యీ నాలుగూళ్లవాండ్రు కలహించిన నోరుగంటివాడు లేమిపంచాయతీ చేయుదురో. ఏ యూరి జనుల వాక్యము ప్రమాణమని న్యాయాధిపతులు తీర్పు చెప్పుదురో.

v. ప్రొద్దుటూరి కొకమైలుదూరములో రామేశ్వర మని గ్రామముండుట యీగ్రామమునకు మంచిబాట వేయించి పుణ్యముగట్టుకొన్న పంతులవా రెఱుఁగనివిషయముగాదు. లోకులెల్ల నాగ్రామమును రామేశ్వర మని యే పిలుతురు. అపరరామేశ్వర మని మాహాత్మ్యము చెప్పుదురు. ఎవరైనను నేను రామేశ్వరమునకుఁ బోయి సేతుస్నానము చేసితి నని చెప్పినచో నీయూరివారు తమగ్రామమునకు నతఁడు వచ్చి యేటికాల్వపంతెనక్రింద మునిఁగె నని చెప్పిన లోకము నవ్వదా? ఓరుగంటివాడు లెవ్వరైనఁ గాశికిఁ బోయి గంగఁ దెచ్చి యీ రామేశ్వరమున కర్పింతురా? దక్షారామవాసు లీరామేశ్వరమునకు వచ్చి పోయినఁ గాశీరామేశ్వరయాత్ర పూర్ణమైన ట్టగునా?

vi.

తిరువళ్లూరు తాలూకా	గోవర్ధనగిరి.
పుంగనూరు తాలూకా	భద్రాచలము.
పుత్తూరు తాలూకా	విరాటపురము.
తెక్కలి తాలూకా	శ్రీరంగము.
దివి తాలూకా	అయోధ్య.

పురాణేతిహాసాదుల నీ పేర్లు వచ్చినచోటుల నా యా గ్రామవాసులు తమతమ గ్రామములే చెప్పఁబడిన వని వాదింపఁజొచ్చిన సంతకంటెను బరిహాస్య మొండొకఁ డుండునా?

vii. "తిరుగుదు రయారె సురపురి నురల మరగ" యనుపద్యమునకుఁ గల్బరగయందుఁ జచ్చిన వారు తమయూరికే వచ్చి రని తామే సురల మని సురపురమువారు వాదించిన లోక మంగీకరింపవలయునా?

viii. గంగాధరశబ్దమునకు నోరుగంటివాడు లేమి వ్యుత్పత్తి చెప్పుదురో! నేను మీఁద నుదాహరించిన వన్నియు నా యా స్థలములందే గాక లెక్కలపుస్తకములందును బ్రసిద్ధములై నిస్సంశయముగ లోక మంగీకరింపఁదగినవి. అట్టి వానిని గ్రహించి పురాణముల కర్థము చెప్పినఁ గలుగునవర్థకము తెలిసెఁగదా. ఇఁక గోల్కొండదేశ

మందు మాత్రమే (దేశమం దంతయు నిది కలదో లేదో) తెలియ వచ్చు దానిని గ్రహించి పురాణములకు నెవ్వఁ డర్థము చెప్ప సాహసించును? గోదావరి గంగయని పోతన చెప్పఁదలచియుండిన దక్షిణ గంగ యని యే చెప్పియుండును. ఇంతగ్రంథము వ్రాసినవాఁ డీక మూఁడక్షరములు వ్రాయఁజాలఁ డయ్యెనా? అటు చెప్పిన గోదావరికి న్యూనత గలదా? కావునఁ బోతన స్నానమాడిన గంగ భాగీరథియే కాని గోదావరి సర్వథా కానేరదు.

22. అయిన గోదావరిని గంగ యనరాదా యని మీ రడుగుదురు కాఁబోలు. పూర్వోత్తరసందర్భములను బట్టి గోదావరిని గంగయని నిరూపింప వలసియున్నప్పుడు స్తుతిపాఠముననో, వర్ణనముననో యెందేని భక్తిభావనచే గంగ యని చెప్పవచ్చును. అటుగాక స్వతంత్రించి వస్తునిర్దేశము చేయునపుడు దక్షిణ గంగ యనవలయును గాని గంగ యనరాదు. గోదావరీనదినే కా దేయేటి నీటినైన నీవే గంగ వని స్తోత్రము చేయవచ్చును. ఏటినీటినే కాదు. ఏ నీటి నైన నట్లు స్తుతింపవచ్చును. తాను స్నానముచేయు గొట్టపునీటిని "గంగేచ యమునే చైవ" యనవచ్చును. అది దోషముకాదు. అంతమాత్రముచేతనే యానీరెల్ల భాగీరథి యని యర్థము చెప్పరాదు.

"ప్రవహించు నేవీటిపశ్చిమప్రాకార మొరసి గంగమ్మ సాగరము గొమ్మ" యని కాశీఖండమున లేదా? యిది స్వతంత్రప్రయోగము కాదా? యని యొరుగంటివారు లడుగవచ్చును. దీనికిఁ బ్రత్యుత్తర మీ పద్యమంతయు నుదాహరించుచుంటి.

సీ. ఉండు నేవీట మార్కండేయమునినాథ సజ్జలింగ మనంగశాసనుండు
ప్రవహించు నేవీటిపశ్చిమప్రాకార మొరసి గంగమ్మ సాగరముగొమ్మ

* * * * *

* * * * *

గీ. ప్రబలధారాసురత్రాణభద్రజాతి, కరిఘటాసైన్యదుస్సాధకనకలోహ
గోపురద్వాఃకవాటప్రదీపితమతి, సాంద్రవిభవంబు రాజమహేంద్రపురము.

సందర్భమునుబట్టి గంగ యేదైనది స్పష్టమగుచున్నది. ఇట్టి సందర్భము పోతనగంగకు లేదు.

అట్టులే వారు శ్రీనాథుఁడు భీమఖండమున గౌతమిని గుఱించి

"కంటిరే ఘోరపాతకముల నెల్లఁ
గడిమి . ంచుచున్నది గంగ యిప్పుడు" అనియు

"మహోదన్వత్పృథాలింగన,
వ్యాపారప్రతిపన్న సౌఖ్యకును సాష్టాంగంబు గంగమ్మకున్."

అనియు వ్రాసె నని వాదింపవచ్చును.

దీనికి మీరు భీమఖండమునఁ జతుర్థాశ్వాసమున 158 మొదలు 190 వఱకుఁ గలపద్యములను జదువుఁ డని నేను మిమ్ముఁ గోరుటే తగిన ప్రత్యుత్తరము. మీఁది పద్యములకు ముందువెనుకల

"గౌతమీగంగఁ బాపి యిక్కడికినొక్క, సిద్ధవాహినిఁ బ్రవహింపఁ జేసికాసి"

"గౌతమీగంగ నాలోలఘనతరంగ"

"పూర్వమున గౌతమీగంగ పుట్టివచ్చె." ఈ ప్రకారము స్తుతిఘట్టమున నభేదాధ్యవసాయముచే గంగాలక్షణములన్నియు గోదావరియం దారోపింపఁబడినవి. ఇచ్చటఁ గవి జలపర్యాయముగ గంగాశబ్దముఁ బ్రయోగించె ననుట నిర్బాధము.

అడిదము సూరకవి చెఱువునీటి నేమని సంబోధించెనో చూడుఁడు.

సీ. బ్రహ్మాండభాండసంపత్తి కుక్షినిగల్గు పద్మనాభుని పదాబ్జమునఁ బుట్టి
సకలరత్నాకరస్థానమై యుప్పొంగు నంబుధీశుని చరణంబుఁద్రొక్కి
పరమతత్త్వజ్ఞుఁడై పరఁగు శంతనుమహీరమణువామాంకభాగమునఁ జేరి
యఖిలలోకాధ్యక్షుఁ డైమించివిహరించు శివుజటాజూటాగ్రసీమ నిలిచి

తే. తనరు నీవంటిధన్య కుత్తమముగాదు, పూసపాటిమహాస్థానభూమియందుఁ
గాలుద్రొక్కంగనోడుఁజండాలుఁడైనఁ, గదలుమిటమానిదివిజగంగాభవాని.

ఇట్టులే భీమఖండమం దనియు నెఱుఁగునది.

గంగ యనుసంజ్ఞ గోదావరికి లేదా యందురేని గోదావరికే కా దైదు నదులకుఁ గలదు. కావేరి, తుంగభద్ర, కృష్ణవేణి, గౌతమి, భాగీరథి యీ యైదు పంచగంగ లని ప్రశస్తి.

"మీ యింటిలో నేను గంగద్రావను" ఇది సామాన్యముగ లోకులు వాడుకొనుమాటయే, ఇక్కడ గంగ యనునది జలపర్యాయశబ్దము. వీని నన్నిటినిబట్టి చూడఁ బూజ్యార్థమందు నే నీటినైన గంగ యని చెప్పవచ్చును గాని వస్తునిర్దేశమందు గంగాశబ్దము భాగీరథికిఁ దప్పఁ దక్కినవానికి నుపయోగింప రాదని యేర్పడుచున్నది. కావునఁ బోతన స్నానముచేసిన గంగ భాగీరథియే.

23. ఆ దేశమువారి మాటలఁగాక పంతులవారు మఱియొకయూహచే గంగను గోదావరిఁ జేయఁజూచిరి. అది యేదన,

"మహేశ్వరధ్యానంబుచేసి కించిదున్మీలితలోచనుండనై యున్నయెడ" "రాజముఖుఁ డొక్కరుఁడు నాకన్నుఁగవకు నెదురఁ గానఁబడి" "రామభద్రుండ మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబు దెనుంగుసేయుము. నీకు భవబంధంబు తెగు నని యానతిచ్చి తిరోహితుం డైన" "హరికరుణావిశేషంబునను గృతార్థత్వంబు సిద్ధించె నని బుద్ధినెఱిఁగి లేచి మరలి / స్నాత్వే / మరల కొన్ని దినంబులకు నేకశిలానగరంబునకుం జనుదెంచి యందు గురువృద్ధబుధబంధుజనానుజ్ఞాతుండనై" అనునవి పోతనామాత్యుని వాక్యములు; వీనిపైఁ బంతులవారు

"భాగీరథి యోరుగంటి కా కాలములోఁ "గొన్నిదినంబుల" ప్రయాణమున కంటెఁ గడుదూరము. ఒంటిమిట్ట కంతకంటెను దూరము. ఒంటిమిట్ట నుండి గాని యోరుగంటినుండి గాని పోతన చంద్రగ్రహణనిమిత్తమున స్నానమునకై యంతదూరము పోయియుండఁడు. పోయె నన్నచో గంగ యేకశిలానగరమునకుఁ "గొన్నిదినంబుల" ప్రయాణములో నున్న దను మాట తప్పగును. కావున నీ సందర్భమున గంగ యనఁగా భాగీరథి కా దని చెప్పవలసి యున్నది" అని వ్రాసిరి.

పంతులవారు "కొన్నిదినంబుల"పై నెక్కువభారము మోపిరి గాని కొన్నిదినము లనఁగా నెన్నిదినములో చెప్పరైరి. అయినను "గోదావరి యోరుగంటికిఁ బదియామడదూరమున నున్నది. నాలుగయిదుదినముల ప్రయాణము" అని వారు వ్రాయుటచేఁ గొన్నిదినము లనఁగా నాలు గయిదు దినము లని వారియభిప్రాయ మయినట్టు మన మూహింపవచ్చును. ఈవిషయమున నాకుఁ గల సందేహములు విన్నవించుకొనుచున్నాను.

(1) గ్రహణస్నానము మాత్రమే యుద్దిష్ట మైనయెడలఁ బదియామడ దూర మొకఁడు పోవునా? తమవాదమునకు బలముఁ గల్పింప నాదేశమువారు పోవుదు రని యోరుగంటివాదులు చెప్పెదరుగాని యది సంశయింపఁ దగినదే. ఇప్పుడే యీ మార్గము గహనమని యసహాయుఁడుగఁ బోరాదని వింటిని. ఇఁకఁ బూర్వ మెట్టు లుండెనో. తాను దగుపరివారముతోఁ బోయినట్టు పోతరాజు చెప్పినవాఁడు కాఁడు. పారమార్థికబుద్ధి గలవాఁ డగుటచేఁ బోయె నని యందు లేని గ్రహణస్నానమునకుఁ బదియామడ పోన సాహసించిన భక్తుఁ డిఁక నిరువదియామడపోయి భాగీరథిలోనే మునుఁగఁ దలంపకుండునా?

(2) సులభముగ జ్ఞప్తియందుంచుకొనఁదగిన యల్పసంఖ్య 4,5 చెప్పవలసివచ్చినపుడు "కొన్ని" యని చెప్పుదురా? 4,5 దినముల విరామమే యైన

యెడల "మరలి వచ్చి" యనియే చెప్పియుండును. 4,5 దినముల లొక్క లెక్కగాఁ జెప్పియేయుండఁడు. 4,5 దినములు త్రోవలో నుంటి ననుటయం దేమి సారస్య విశేషము గలదో నాకు స్ఫురింపలేదు. ఎక్కువసంఖ్య గలదినములో నెలలో యగుటచేతనే కొన్ని యని చెప్పెను.

(3) తాను స్నానముచేయఁబోయినగంగ "యభ్రంకషశుభ్రసముత్తుంగభంగ" యని పోతరాజుగారు చెప్పిరి. అభ్రంకషత్వము శుభ్రత్వము గోదావరియందుఁ గవిసమయమా? వాస్తవమా? రెండును గావు. ఈ రెండువిశేషణములు భాగీరథియందు సార్థకములు. శుభ్రమనఁగాఁ దెలుపు. ఇదియే సమస్తనిఘంటువులయందుఁ జెప్పఁబడిన యర్థము. ఆశబ్దమునకుఁ [illegible]తక్కినయర్థము లిందుఁ బొసఁగవు. సత్కవిప్రయోగము లీ యర్థముననే కానవచ్చుచున్నవి. భాగీరథి శ్వేతవర్ణ యని కవిసమయమే గాక వాస్తవమునై యున్నది. ఏదైనఁ గక్కుఱితిప్రయోగము నాధారముచేసికొని శుభ్రమనఁగా నిర్మల మని నిష్పంకమని యోరుగంటివాదు లర్థము చెప్పుదురు కాఁబోలు. ఆ యర్థ మిప్పుడు వాడుకలో నున్న దని యందు లేని శబ్దార్థము పాటింపక పోతన ప్రయోగించియుండఁడు. నిష్పంక మని చెప్పఁదలఁచియుండినచో "అకర్దమ మిదం తీర్థ" మ్మని వాల్మీకులు చెప్పినట్టు స్పష్టముగానే చెప్పియుండును. అనుప్రాసము నిమిత్తమై చెప్పెనందు రేని ప్రాసమునిమిత్తమై యర్థమున కాభాసత్వము పోతరాజు గల్పింపఁడు. ఎట్లనఁ జూడుఁడు. "రాకానిశాకాలంబున సోమోపరాగంబు రాకగని" యని 'రాక' రెండుమార్లు వచించెను. ఇక్కడ శాకారాకలకై మొదటిరాక వేయఁబడలేదు. రాకయనఁగా 16 కలలతోఁ గూడినచంద్రుని గల రాత్రి. 16 కలలు కలిగినప్పుడు గాక తక్కినవేళలఁ జంద్రగ్రహణము కలుగ దని జ్యోతిశ్శాస్త్రమునఁ బ్రసిద్ధి. ఈ కారణముచే బూర్ణిమతో వాక్యము ప్రారంభింపక రాకతోఁ బ్రారంభించి దానికిఁ దగిన యనుప్రాసములే వేసికొనెను. కావునఁ బ్రాసము కోసరముగనే శుభ్రశబ్దము ప్రయోగించె ననుట యంగీకరింపఁ దగినది కాదు. వాదమునకై నిష్పంక మనునర్థము గ్రహింతమనినఁ దనకుఁ బదియామడలో నుండుజలము సపంకమో నిష్పంకమో యెట్లెఱుంగ సాధ్యము? చూచివచ్చిన పిమ్మట వ్రాసె నన నీయన చూచునప్పటికి జనులత్రొక్కుడులచే నది సపంకమే యగు. కావున నభ్రంకష శుభ్ర విశేషణములు రెండును బోతరాజుగారు స్నానముచేసిన నదికి స్వభావగుణములు.

భీమఖండమున సప్తగోదావరస్తుతియం దానది తెలుపనికవి వర్ణింపలేదా యని యోరుగంటివాదు లడుగవచ్చును. "గౌతమీగంగ" యని గంగకు

గోదావరికి నభేదాధ్యవసాయము చేసి గంగాలక్షణము లన్నియు గౌతమి యందుఁ గవి యారోపించె నని మున్నే మనవి చేసితిని. అటుగాక వాస్తవమందు లేని శివునిశిరస్సుపై నుండునాకాశగంగను ద్రోచివైచి గోదావరిని జెఱువు నీళ్లను కొళ్ళాయినీళ్ళను శివునిభార్యలుగఁ జేసి యాయనతలపై నెక్కించుట లోనగు ననేకార్థకములు పొసఁగు. పురుషసింహమని చెప్పినపుడు పురుషునకు నాలుగు కాళ్ళు తోఁక వాస్తవ మని వాదించువారుగాని యీ మాటయనరు.

(4) "సజ్జనానుమతంబున గంగకుం జని"యని పోతరాజుగారు చెప్పిరి. గ్రహణస్నానమునకుఁ బోవువారు "సజ్జనానుమతిఁ గైకొనుట శాస్త్రీయమా? సదాచారమా? యదియుఁ గాదు. తీర్థయాత్ర చేయువారు సజ్జనానుమతిఁ గైకొనుట శాస్త్రీయాచారము. అది నేఁటికి నాచరణమం దున్నది. దీనివలన జనులు పుష్కరమునకై ముందే బయలుదేఱి పోయినట్లు గ్రహణము నిమిత్తముగఁ గొని తీర్థయాత్ర యథావిధి సంకల్పించి పోతరాజుగారు భాగీరథికిఁ జనిరని తెలియ వచ్చును. నదీస్నానమునకు సజ్జనానుమతిఁ గొనుట శాస్త్రీయాచారమే కదా? "సజ్జనానుమతంబునఁ గ్రుంకులిడి" యని యేల యన్వయింపరా దందు రేని దూరాన్వయదోషము సందిగ్ధదోషమునా మహాకవివరుని మెడలో వేయవలసి వచ్చును. వచనమం దట్టిదోష మెట్టిమూఢుఁడైనఁ గావించునా? పోతరాజు గారి యభిప్రాయ మదియే యైయుండిన "........గంగకుం జని సజ్జనానుమతంబునఁ గ్రుంకిలిడి"యనియే వ్రాసియుందురు. ఈవిధముగఁ జూచినను బోతరాజుగారి గంగ భాగీరథియే కాని గోదావరి కానేరదు.

"అభ్రంకషశుభ్రసముత్తుంగభంగ" "సజ్జనానుమతంబున" నను నవి రెండును వాక్యాలంకారము లనిపంతులవా రందు రేని పోతనామాత్యుఁడు స్నానముచేసినది యొంటిమిట్ట చెఱువునీటియందో బావినీటియందో యని యొంటిమిట్టవాదు లనవలసివచ్చును. అటే లందురా.

"సర్వం గంగాసమం తోయం గ్రహణే చంద్రసూర్యయో" యని మాధవీయనిర్ణయసింధ్వత్యాదులందు గ్రహణకాలమున సమస్తజలము గంగా సమమనియుఁ దద్భక్తిభావనచే దేనియందు స్నానముచేసినను గంగాస్నానము చేసిన ఫలము వచ్చు ననియు నున్నది. "యాదృశీ భావనా యత్ర సిద్ధి ర్భవతి తాదృశీ"యని కలదుగదా? మాధ్వులు గంగాస్నానము చేసితిరా యని ప్రశ్నించుట యీభక్తిభావనలచేతనే, కావున సర్వశాస్త్రప్రవీణుఁడును సదాచారప

*పోతరాజు చెప్పినగంగ కాశీబుగ్గయని గంగ బుగ్గయని వాదించువా రభ్రంకష శుభ్ర సముత్తుంగభంగ సజ్జనానుమతులకే గతులు కల్పింతురో.

రాయణుఁడును శ్రద్ధాభక్తియుతుఁ డగుపోతనామాత్యుఁడు భక్తిభావనచేఁ జెఱువునీటినే గంగయనియే త్రికరణశుద్ధి నమ్మి స్నానము చేసె ననినచో నొరుగంటి వాదు లేమిప్రత్యుత్తర మీయఁగలరు? సత్యసంగరు లగునొంటిమిట్టవాదు లేదే నెపమున గెలువ నుత్సాహించువారు కారు. కావున నిట్టిక్లిష్టకల్పనలు క్లిష్టార్థములు చేయఁదలఁపరు.

(5) భాగీరథి యనునర్థము గ్రహించినచోఁ గాశీప్రయాగలను నచటి దేవతలను బేర్కొనకయుండెఁ డని పంతులవారు వ్రాసిరి. పురాణమునఁ దన యాత్రాచరిత్రము చెప్పవలయు నని నిర్బంధమా? చెప్పకుండినఁ బ్రత్యవాయమా? "నేను గాశీరామేశ్వరములఁ జూచితి"ననిన వానియం దందు దేవతలను దీర్థములను జూచితి నని యర్థవశమున స్ఫురింపదా? పోతరాజుగారు వ్రాయఁ దలపెట్టినది భాగవతముగాని నిజయాత్రాచరిత్రగాదు. కావునఁ దనకు భగవద్దర్శన మెం దయ్యెనో యాప్రదేశమును జెప్పెను. తక్కిన విషయమును జెప్పుట యప్రస్తుతప్రశంస. మహాకవి యట్టిదోషమునకుఁ బాలుపడునా?

(6) పంతులవారు "మరలి కొన్నిదినంబుల" కనుపాఠము గ్రహించి మరలి యనఁగా గృహోన్ముఖుఁడై యని యర్థము చేసి "గంగ యేకశిలానగరమునకుఁ గొన్నిదినంబులప్రయాణములో *నున్న దనుట తప్పగును." అని వ్రాసిరి. గురుజాడ శ్రీరామమూర్తిపంతులవారు "మఱికొన్నిదినంబుల" కను పాఠము గ్రహించిరి. అనేకతాళదళసంపుటములం దీ పాఠమే కానవచ్చుచున్నది. ఈ పాఠము గ్రహించినయెడలఁ "గొన్నిదినంబు" లనునది ప్రయాణకాలము కానేరదు. గంగాతీరమున నుండినకాల మగును. ఇదియే సమంజసముగానున్నది. 'మరల' యనుదానికి 'మరలి' యనునది లేఖకప్రమాదపతితముగా నోపు. త్రోవలో నడియడవిలోఁ గొన్నిదినంబులు గడపితి నని చెప్పుటం దేసారస్యమును గానరా దని ముందే మనవిచేసితిని. దూరయాత్ర చేసినవాఁ డగుటచే భాగీరథీతీరంబునఁ గొన్నినాళ్లుండె నని తలంచుట తప్పుగాదు. మఱి యొప్పే యగు. గోదావరియొద్దున నొంటరిగఁ గొన్నిదినంబు లుండె ననుట యచింత్యము.

(7) 'మరలి' యనుపాఠ మున్నది గదా? దాని కేమి గతి యని మీ రడుగవచ్చును. ఆ పాఠము గ్రహించినను "గంగ యేకశిలానగరమునకుఁ గొన్ని దినంబులప్రయాణములో నున్న దనుట తప్పగును" అని పంతులవారు వ్రాసినదే తప్పగును. "కొన్నిదినంబు"లనుటకు 4,5 దినము లని వారు చేసిన

యర్థము సరి గాదు. ప్రయోగములు చూడుఁడు. కాశీఖండము తృతీయాశ్వాసము 13.

వ. "ఇవ్విధంబున భువనోపద్రవంబుఁ బ్రశాంతిం బొందించి దక్షిణకాశీ గమనంబునం గాని కాశీవియోగవేదనాభారంబు డిందుపడ దని డెందంబున నిశ్చయించి మందమందప్రయాణంబులఁ గొందలిరాకుఁబోఁడిం గనుకంద కుండ ముందఱ పిఱుంద నడిపించుచు నెడనెడఁ బుణ్యవాహినీతీర్థంబులఁ గ్రుంకులుపెట్టి యష్టమూర్తి నభ్యర్థించుచుం గొన్నివాసరంబులకుఁ గుంభసంభవుండు గోదావరి నోరసికొనుచు నాంధ్రదేశంబున నరుగునప్పుడు" అం దగస్త్యుఁడు వింధ్యోత్తరభాగమునుండి మెల్లమెల్లగఁ దీర్థసేవలు సేయుచుఁ గొన్నివాసరంబులకు గోదావరి నోరసికొనుచు నాంధ్రదేశమున నరిగె నని చెప్పఁబడెను గదా. ఇది 4,5 దినములప్రయాణ మేమో మీరే యాలోచింపుఁడు.

భీమఖండముద్వితీయాశ్వాసము. 50,51,52 "కతిపయదిన ప్రయాణంబున

సీ. గంగానదీప్రవాహకణము మాధవదేవు దోరంతరంబు శ్రీతులసిచిగురుఁ
బురుషోత్తమమునందుఁ బుండరీకాక్షుని దివ్యపాదాంభోజ తీర్థజలము
శ్రీకూర్మమునయందు శేషాహిపర్యంకు కంఠంబుక్రొత్త చెంగల్వదండ
సింహాద్రియందు లక్ష్మీనృకంఠీరవ సార్వభౌముప్రసాద చందనంబుఁ
తే. గాశికావిప్రయోగోరుగాఢతాప, శాంతికొదవెను శిశిరోపచార మగుచుఁ
జాయ తెరువున శ్రీబాదరాయణునకు, హరిహరధ్యానపూజాపరాయణునకు

*   *   *   *   *

తే. అట్టిపీఠాపురముఁ జేర నరుగుదెంచెఁ, బరమశైవుండు శ్రీపరాశరసుతుండు,"

ఆర్యులారా! యిందు వ్యాసముని కాశినుండి పురుషోత్తమము, శ్రీకూర్మము, సింహాద్రి చూచుచుఁ గొన్నిదినంబులఁ బీఠికాపురముఁ జేరె నని చెప్పఁబడెను. ఇప్పుడు పొగబండిపై నెందు దిగకపోయినను నిది 4,5 దినముల ప్రమాణము. నడచి వచ్చినబడుగువ్యాసున కెన్నిదినముల ప్రయాణమో మీరే యాలోచింపుఁడు. ఇందుఁ బంతులవారు చెప్పినట్లు 4,5 దినముల ప్రయాణ మనిన మీ రంగీకరింతురా. మీఁది రెండనువాదములందును మాస పర్యాయముగ దినశబ్దము ప్రయోగింపఁబడిన దని తలంచుట యొప్పు. ఇట్టివి మఱికొన్ని ప్రయోగములు గలవు కాని గ్రంథవిస్తరభీతి విరమించితి. పంతుల వారు గ్రహించిన "మరలి" యనుపాఠము గ్రహించినను నోరుగంటివారి

వాదమే దుర్బలమై యొంటిమిట్టవారివాదమే బలిష్ఠ మగుచున్న దని దీనివలన స్పష్టపడియెఁగదా.

ఏ విధముగఁ జూచినను బోతరాజుగారి గంగ భాగీరథియే కాని గోదావరి కానేరదు. కావునఁ గేవలగంగాశబ్దమునకు గోదావరి యనునర్థముసృష్టి విశ్వామిత్రసృష్టిగా నున్నది.

24. ఓరుగంటినుండి గ్రహణస్నానార్థమై పోవ గోదావరి యున్నట్లు "లొంటిమిట్టకు సమీపములో" "సుప్రసిద్ధ మైనపుణ్యనది లేదు." శ్రీశైలము నొద్ద గృష్ణానది యున్నది. ఆప్రదేశమం దానదికి "పాతాళగంగ" యనుసంజ్ఞ శాసనములందుఁ గలదు. కాని శ్రీశైలయాత్ర యిప్పుడే కష్టసాధ్యము. పూర్వము కష్టతరముగ నుండి యుండవలయును" అని పంతులవారు వ్రాసిరి.

కడపనుండి శ్రీశైలమునకు గ్రహణకాలస్నానమునకై పోవుట కష్టతర సాధ్య మని పంతులవా రనిరి గాని యసాధ్య మన రైరి. అది కొంతమే లే, అది య టుండనిండు.

దత్తమండలవాసులారా! యొంటిమిట్టకు సమీపమున ననఁగాఁ బది యామడలోపల గ్రహణస్నానయోగ్య మైనపుణ్యనది లే దనుపంతులవారి మాట మీ రంగీకరింతురా? మీ రననేల? స్థలజ్ఞుఁ డెవ్వఁ డైన నంగీకరించునా?

ఒంటిమిట్టకు 5 మైళ్ళదూరములో "సాక్షాద్గంగ" పినాకిని యుండుటయుఁ బర్వదినంబులం దన్నిటఁ దత్తీరవాసులు పినాకినీస్నానమునకై పోవుచుండుటయుఁ బంతులవారు మఱచిరి కాఁబోలు. పెన్నమాహాత్మ్యము భారతమందును జేర్కొనఁబడినది. పినాకినిని గంగ యని చెప్పవచ్చునా? యని స్థలమాహాత్మ్యజ్ఞానముగాని పురాణజ్ఞానముగాని లేనివారు సందేహింపవచ్చును. కాని "బున్నేభ్యోజీప్" అను సూత్రమున నైన పినాకినీశబ్ద మసహాయముగ సాక్షాద్గంగను బోధించుచున్న దని యేసంస్కృతవైయాకరణుఁడైనఁ జెప్పఁగలఁడు. దీని పుట్టుపుగుఱించి శ్రీభారతియం దిదివఱకే వ్రాసియున్నాను. "దక్షిణ" పెట్టినఁగాని గోదావరి గంగ కానేరదు. పినాకిని కట్టితోడ్పాటుతోఁ బనిలేదు. గోదావరి దక్షిణగంగ యని యేస్కాందపురాణము చెప్పుచున్నదో యాస్కాందపురాణమే పినాకిని సాక్షాద్గంగ యని చెప్పుచున్నది. ఈవిషయమై నేను బెంచివ్రాయుట మాని కడప డిస్ట్రిక్టుమాన్యుయల్ లోని యీవాక్యముఁ బంతుల వారిస్మరణమునకుఁ దెచ్చుచున్నాను.

"Sidhout itself is sometimes called the Dakshina Kasi on account of the similarity of its position to Kasi or Benares. The Pennair, on

which it is situated is compared to the Ganges, Pushpagiri, a village in the Cuddapah Taluq to Gaya and Gundlamada, a village at the junction of the Cheyair and the Penniar to Prayaga on the confluence of the Ganges and the Jumna."

"The names of some of the rivers show that a part of the country, at all events, is in odour of sanctity. The Chitravati (a Hindu goddess), the Papaghni, the sin-destroyer, the Pennair are all sacred streams, the latter especially so."

సిద్ధవట స్థలపురాణమున

"శ్రీమత్సిద్ధవటావాసా న్నరసాయుజ్యమాప్నుయాత్
క్వచిత్పినాకినీస్నానా త్క్వచిత్సిద్ధేశదర్శనాత్
క్వచిత్సిద్ధవటావాసా జ్జీవన్ముక్తోనసంశయః"

ఒంటిమిట్టకు రెండుమైళ్లలో నుండు గంగపేరూరు పెన్నపేరూరు అను గ్రామములు గంగాపినాకినుల సంబంధము నేఁటికిని ఘోషించుచున్నవి. ఇది గాక యొంటిమిట్టకు 10 మైళ్లలో బాహుద (చెయ్యేరు) యున్నది. ఇది పుణ్య నది కాదన నెవరుసాహసింతురు? దీనితీరముననే యత్తిరాల (హత్యరాల) యను సుప్రసిద్ధక్షేత్రము గలదు. పరశురాముఁడు మాతృహత్య రాల్చుకొన్న దిం దనియే పురాణప్రసిద్ధి.

మార్గము దుర్గమ మనుకారణముచేఁ "బాతాళగంగను" గ్రహింపఁ బంతులవారీయ కొన నైరి. అట్టివారు 65 మైళ్లలో నుండు తిరుమలమీఁది యాకాశగంగ నేలగ్రహింపనైరో?

అదియును గాదేని యంతకు సమీపమున నుండుసువర్ణముఖరి నేల గ్రహింపనైరో? సువర్ణముఖరి గంగ కాదనువారు గలరా?

శ్రీకాళహస్తి మాహాత్మ్యమునందలి యీ పద్యములఁ దిలకింపుఁడు.

ఉ. ఏనజుఁడర్క మునీంద్ర! పరమేశుఁడు నీకు నభీప్సితంబున
న్నీనియమించి పంచె, వర మెయ్యది వేఁడు మటన్న నభ్రగం
గానదిఁ దెచ్చి యిచ్చుట నఖండగతిం బ్రవహింపఁజేయవే
దాన మనోరథంబు ఫలితం బగు నాకుఁ బయోజసంభవా!

ఉ. నావుడుఁ దమ్మిచూలి గగనంబుఁ గనుంగొనఁగా సువర్ణశో
భావిభవంబుతో బహుళభంగ మహాముఖరత్వసంపదన్
దేవనదీఝరంబు చనుదెంచినఁ గాంచి విరించి తద్గుణ
శ్రీవెలయన్ సువర్ణముఖరీప్రథ దానికిఁ గల్గఁజేయుచున్.

ఇవిగాక చిత్రావతి, పాపఘ్ని లోనగునదులును గలవు. ఇన్నిపుణ్య నదులుండుట తెలిసి తెలిసి యొంటిమిట్టసమీపమున గ్రహణస్నానయోగ్య మైన పుణ్యనది లేదని పంతులవారు వ్రాయుటే చిత్రము.

"సోమోపరాగంబు రాకఁ గని" యనుచోఁ 'గని' యనఁగాఁ దెలిసి కొని యని యర్థము కాని చూచి యని యర్థము కానేరదు. ఈ తెలిసికొనుట త్రోత్తిపంచాంగము పుట్టిన నాఁడే యై యుండవచ్చును. గ్రహణస్నానమునకై పోతరాజు పదియామడ పోయె ననియు నొంటిమిట్టకుఁ జుట్టు నంతదూరములోఁ బుణ్యతీర్థమే లేదనియు వ్రాసి పంతులవారొరుగంటివారివాదము బలపఱుప యత్నించుటచే నింతదూరము వ్రాయవలసి వచ్చెను గాని పోతరాజు భాగీరథికే పోయె నని నా యభిప్రాయము.

ఉత్తదినములఁ దీర్థస్నానముకంటెఁ బర్వదినములందలి స్నానము విశేష ఫలదము. సామాన్యపూర్ణిమామావాస్యలకంటె గ్రహణకాలములఁ జేయు స్నానాదులు విశేషతరఫలదములు.

"హేమభారం కురుక్షేత్రే గ్రస్తే భానౌ ప్రయచ్ఛతి
యశ్చ రామాయణం లోకే శృణోతి సదృశౌ వుభౌ"

ఇత్యాదులు సుప్రసిద్ధములు. కావుననే పోతరాజు గంగాస్నానమునకు గ్రహణకాలమును నిర్ణయించుకొనె ననియు, గంగాయాత్ర తీర్థయాత్ర కావు ననే శాస్త్రీయసదాచారము ననుసరించి సజ్జనానుమతిఁ గైకొని గ్రహణసమ యమునకు గంగఁ జేరునట్లు కొన్నిమాసములు ముందుగనే స్వగ్రామము విడిచి పయనించె ననియుఁ బుణ్యతీర్థమునకుఁ బోయినకారణముచేతనే యందుఁ గొన్నిదినంబులు నిలిచె ననియుఁ దలఁచుట ఋజుపద్ధతి.

సభ్యులారా! గంగ యనఁగా భాగీరథి యని తొలుతఁ జెప్పి తరువాతఁ జెఱువునీరు బావినీరు కూడ గంగ యని చెప్పితి ననియు, దానిచే నియమము దప్పి స్వోక్తి వ్యాఘాతము కలిగి కలవరపాటు చెందితి ననియుఁ బంతులవా రభిప్రాయపడిరి గాని యట్టిదోషము నాయందు లేదు. గంగ యనఁగా భాగీ రథి యనియే నా వాదము. అది తప్పించి గోదావరి యని కృష్ణ యని నియతి తప్పి విపరీతార్థములు చెప్పఁబూనినచో గోదావరి యనియే యేమి నియమము? ఏ నీటినైన గంగ యనవచ్చు నని యాధారములు తెలిపి యెదుటివారివాద మంగీకరించినఁ గలుగు ననర్థకముల వివరించితిని.

కం. అర్భకులు లేక కాదన, దర్భల మాదన్నకిచ్చెఁ దనయాలిని నా
నిర్భాగ్యుఁడు తనకును నది, గర్భము కాకున్నఁ బోతుగాడిప కిచ్చెన్. అన్నట్లు

ఉత్తమకులస్త్రీ తనభర్తను మాని పరకీయ యైనచోఁ దుడకుఁ గుక్క నక్కలపా లగునట్లు గంగకును రూఢ్యర్థమును వదలి గౌణార్థముల నిష్కారణముగ గ్రహించినచో బురదగుంటలోని నీటికిని నన్వయింపవచ్చునని చెప్పితిని.

(1) ఏరుచూరు లోనగు గ్రామములు గోలకొండదేశమం దున్నవి. కావున నాగ్రామములపేళ్లు గృహనామములు గాఁ గలవా రాగోలకొండదేశ
*మందే యుండవలయును.

(2) బమ్మెరపోతరాజుగారిగంగ గోదావరియే యనురెండాధారములచే నోరుగంటివారిపక్షమును స్థాపించి యిఁక నొంటిమిట్టవారిపక్షమును బంతులవారు ఖండింపఁబూనిరి. వారియాధారములు వారికెంతమాత్రము సాహాయ్యపడెనో మీఁదివిషయము లాలోచించిన విజ్ఞులే యెఱుఁగఁ గలరు.

25. ఇఁక నొంటిమిట్టవారివాద మెంతవఱకుఁ బూర్వపక్షము కాఁబడునో చూడవలసియున్నది.

“ఒంటిమిట్టలోఁ గోదండరామస్వామియాలయ మున్న దనియు, నీకోదండరామస్వామియే భాగవతకృతిపతి యగురామభద్రుఁ డనియు, నిందుచేతఁ బోతన యొంటిమిట్టవాఁ డని తేలుచున్న దనియు నొంటిమిట్టవాదులు వాదించుచున్నారు. కాని యీ వాద మంత సరసముగా లేదు. కవి తనకు ధ్యానములోఁ దోఁచినవాఁడు రామభద్రుఁ డని చెప్పెను. గాని యేకశిలానగరమం దుండుదేవుఁ డని చెప్పియుండలేదు. ఆశ్వాసాద్యంతపద్యములఁబట్టి చూచినను గృతిపతి యొంటిమిట్టలో వెలసినకోదండరామస్వామి యనుటకాధారములు కనఁబడలేదు. ఒంటిమిట్టలోఁ గోదండరామస్వామియాలయమున్నంతమాత్రాన పోతరా జక్కడివాఁ డనుట యుక్తముగాదు” అనునవి పంతులవారివాక్యములు.

వ్రేళ్లు మడఁచి లెక్కపెట్టఁబూనిన నామసామ్యముతప్ప రెండవయాధారము లేకున్నను దమవాదమే సత్య మని వాదించుట యోరుగంటివాదులకుఁ జెల్లును గాని “యొంటిమిట్టలోఁ గోదండరామస్వామియాలయ మున్నంతమాత్రాన” పోతరా జొంటిమిట్టవాఁ డని యొంటిమిట్టవాదు లనుటకు వారు తెలివిమాలినవారు గారు. అనాదిజనశ్రుతులు పూర్వలేఖనములు లోనగు ననేకాధారములు గొని వానితోపాటు దీనిని జేర్చి వీరు చెప్పుచున్నారు. పూర్వోక్తవాక్యముల వా రనువదించిరి గాని మట్టియెద్దైన మాయెద్దే గెలువవలయు నని వాదింపఁ బూనినవారు గారు.

తనకుఁ బ్రత్యక్ష మైన రామభద్రు నెట్టివానింగఁ గవి వర్ణించెనో చూడుఁడు.

సీ. మెఱుఁగు చెంగటనున్న మేఘంబుకైవడి, నువిద చెంగటనుండ నొప్పువాఁడు
చంద్రమండలసుధాసారంబుపోలికి, ముఖమునఁ జిఱునవ్వు మొలచువాఁడు
వల్లీయుతతమాల వసుమతీజముభంగి, బలువిల్లు మూఁపునఁ బరఁగువాఁడు

* * * * *

దీనివలనఁ బోతనకుఁ బ్రత్యక్ష మైనరామభద్రుఁడు పంతులవారు తలంచిన ట్లుత్తరరామభద్రుఁడు కాఁ డనియుఁ గోదండరామభద్రుఁ డనియు నిర్వివాదముగ స్పష్టపడియెఁగదా? ఒంటిమిట్టయం దుండురాముఁడును గోదండరాముఁడే. పోతరాజు రామభక్తుఁడు. శ్రీరామచరిత్రముఁ దిలకింపుఁడు. “చెనకి చెఱిచినాఁడు భాస్కరుఁడు కాకుండిన రామాయణమును బండ్లకెత్తింపనా” యని పోతరా జనె నన్నజనశ్రుతియు దీనిని బలపఱుచుచున్నది. తనయూరియం దుండుతనభక్తునకుఁ దానుబ్రత్యక్ష మయ్యె నని చెప్పుట పంతులవారి “కంత సరసముగా లే”కుండినఁ గొంతయైన సరసముగా నున్నందునకు నొంటిమిట్టవాదులకు వారు వంద్యులు. ఒప్పుకొన నిష్టము లేకయు నొప్పుకొనక తప్పనప్పటియర్థాంగీకారము లిట్టులే కదా యుండును.

పోతరాజు శైవుఁ డనియు మహేశ్వరధ్యానము చేయుచున్నట్టు లాయనయే చెప్పె ననియుఁ గావున రామభక్తుఁ డని యనరాదనియు నందు రేని జన్మమువలనవచ్చినది కులాగతమత మనియుఁ బూర్వజన్మవాసనాబలమున వచ్చునది భక్తియనియుఁ బెద్దలు చెప్పుదురు.

శ్లో॥ శైవా వయం న ఖలు తత్ర విచారణీయం
పంచాక్షరీ జపపరా నితరాం తథాఽపి
చేతో మదీయ మతసీకుసుమావభాసం
స్మేరాననం స్మరతి గోపవధూకిశోరమ్॥” లీలాశుకులు.

హనుమద్భక్తుఁ డైనపుష్పగిరి తిమ్మన్న యోగసమాధి నుండఁగా శ్రీరాముఁడు తనకుఁ బ్రత్యక్ష మైనట్టు చెప్పి యున్నాఁడు.

పోతరాజును “మదీయపూర్వజన్మసంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణకథాప్రపంచవిరచనాకుతూహలుండనై” యని చెప్పెను. కావునఁ బోతరాజు మతమున శైవుఁ డయినను మనమున వైష్ణవుఁడే యనుట స్పష్టము.

ప్రత్యక్ష మైనకోదండరామభద్రుఁడు తా నొంటిమిట్టయం దున్నవాఁడ నని చెప్పలేదఁట. దిక్కాలాద్యనవచ్ఛిన్నమూర్తియై సర్వవ్యాపియై యుండు

వాఁడు తా నొంటిమిట్టయం దుండువాఁడ నని చెప్పకపోవుట దోషమఁట. తిక్కనకును హరిహరనాథుఁ డేల చెప్పలేదో. ఒకవేళ నే నొంటిమిట్టరాముఁడ నని చెప్పియుండిన భగవంతున కిట్టిభేదజ్ఞాన ముండఁజాలదు. కావున నది భగవద్వాక్యము కాఁజాల దని వీరే యాక్షేపించియుందురు. జగన్మూర్తియు జగదంతర్యామియు నై వాసుదేవుఁ డైనభగవంతుఁడు తా నొంటిమిట్టవాసి నని చెప్పకుండుట తప్పని చెప్పువారు పోతరాజుగారు జగత్ప్రసిద్ధుఁ డైనప్రతాప రుద్రుఁ డేలిన యేకశిలానగరమునకు వచ్చితి నని యేల చెప్పఁడయ్యెనో సమాధానము చెప్పఁగలరా? వాస్తవ మారయఁ బోతరా జుండినది గోలకొండలోని యేకశిలానగరమే యైయుండినయెడల జగద్విఖ్యాతి గనిన ప్రతాపరుద్రు పేరు నుడివియే యుండును. అటు చెప్పకపోవుటచేతనే యాయన యుండినది యోరుగల్లు కా దని స్పష్టపడు చున్నది. ఇది కుయుక్తియో సుయుక్తియో నాకుఁ దెలియదుగాని పంతులవారు గంగాతీరస్థక్షేత్రదైవతములఁ జేర్కొనమి గుఱించి వ్రాసినయుక్తికంటెను మేలైనయుక్తి కావున దానిని వారియెడలనే ప్రయోగించితిని.

ఆర్యులారా! శ్రీరామునిఁ గొందఱు కల్యాణరామునిఁగను, గొందఱు పట్టాభిరామునిఁగను, గొందఱు జ్ఞానముద్రాభిరామునిఁగను నానావిధముల సేవించుచున్నారు. ఈ మూర్తులందుఁ గోదండధారణము గానరాదు. "ఇక్ష్వాకువంశమునఁ బుట్టినమహాపురుషుఁ" డిన్నిమూర్తులలో నేమూర్తితో నైనఁ బోతరాజునకు గోచరింపక యాయన యుండుగ్రామమునుండి యాయనకుఁ బరిచిత మైనమూర్తియే యేల గోచరింపవలె? గోచరించినపుడు సంబంధము కల దనుట సమంజసమా లేదనుట సమంజసమా?

గ్రంథస్థపద్యములం దెందును "ఒంటిమిట్టలో వెలసినకోదండరామస్వామి యనుట కాధారములు కనఁబడుట లే" దఁట. మనుష్యప్రభువుల కంకిత మిచ్చినగ్రంథములందే కృతిపతులస్థితిగతులు గ్రామనామములు గానరాకుండఁగా భగవంతునికి గ్రామనామము చెప్పకుండుట దోషమా? జైమినిభారతకృతిపతి యేగ్రామమువాఁడో నేఁటికి సిద్ధాంతము కా లేదుగదా? దేవతాంకితము లైనపూర్వకృతుల స్థలమాహాత్మ్యముం దెలుపుగ్రంథములందుగ్రామనామములో నైనవి కానవచ్చుచున్నవి. కాని తక్కినయెడల గ్రామనామములు తఱచు గానరావు. నెల్లూరిహరిహరనాథున కంకితమిచ్చినతిక్కన తనగ్రామనామముగాని కృతిపతిగ్రామనామముగాని యెందైనఁ జెప్పెనా? చెప్పకుండిన మాత్రానఁ దిక్కన నెల్లూరివాఁడు కాఁడా?

ఒంటిమిట్టవారిబలిష్ఠాధారములఁ దాఁకక తడవక "తుల్యాధార మైన దేవాలయమునుగుఱించి పూర్వపక్షము చేయ యత్నించుట చూచిన "నీకు రాగిపోగులే యనిన నీకవియు లేవే" యనుసామెత స్మృతికి రాక మానదు. ఆ కాలమున నోరుగంటియందు శ్రీరామభజనమందిర మైనను లేదు. ఆ కాలమున నెంతో యీ కాలమున నంతే. ఓరుగంటియం దొకరామభజనమందిర మున్నను, నం దొకరాయి స్థాపితమై యుండినను, నోరుగంటివాదులు విజృంభించి దానినే బ్రహ్మాండముచేసి యా గుండ్రాయియే పోతనకుఁ బ్రత్యక్షమయ్యె నని చిత్రవిచిత్రములుగ వ్రాసియుందురు. ఇప్పుడు వారు చేయునాక్షేపములం దొకఁడైన వారి కప్పుడు స్ఫురించియుండదు. అసత్యము ప్రబలకుండుటకై శ్రీరామమూర్తి యం దేవిధముగను బ్రభవించిన వాఁడు గాఁడోటు. బమ్మెర పోతరాజునకుఁ గోదండరాముఁడు ప్రత్యక్ష మగుటయుఁ, బోతరాజు కోదండరాము లొంటిమిట్టవాసు లగుటయుఁ జూచి యీ యిరువురికి సంబంధముండు నని చెప్పెడియొంటిమిట్టవారివాదము యుక్తియుక్తముగను, న్యాయ్యముగను, నెంతో సరసముగ నున్న దని మధ్యవర్తులకుఁ దోఁపకమానదు.

మూఁడవ యాధారము.

"కృతినిర్మాణ మేకశిలానగరమం దయిన దనుమాట యీ వాదమునకంతకు మూలాధారముగ నున్నది. ఏకశిలానగర మన నేదియో నిర్ణయింపవలసియున్నది. ఇది గ్రామనామముయొక్క సంస్కృతరూపముగాని మూలనామము గాదు." "ఓరుగల్లు" "ఒంటిమిట్ట" యనునవి రెండును గూడ దీనికి దేశ్యరూపము లని చెప్పవచ్చునుగాని కొన్ని కారణములచే నేకశిలానగరవాచ్య మగు పట్టనము ఓరుగల్లే యని నిర్ణయింపవలసియున్నది. ఆ కారణము లెవ్వియన:—

"ఒంటిమిట్ట యనఁగా నొంటిగానుండుగుట్ట(చిన్నకొండ) యని యర్థము. ఓరుగల్లు ఒరుగల్లు శబ్దవికారము. ఒరుగ ల్లనఁగాఁ గన్నడమున నొక్కరాయి యని యర్థము. ఒరుగల్లు ఏకశిల యను నీ రెండు శబ్దముల కర్థమునం దించుకైన భేదము లేదు. ఏకశిలకును, ఒంటిమిట్టకును భేద మధికము గానున్నది. ఇంతియ కాక యేకశిల యనఁగా నఖండశిల యని యర్థము. ఒరుగల్లున కిదియే యర్థము. ఓరుగంటికోట నట్టనడుమ బొడ్డురాతివలె నఖండశిలారూపమగు నొకచిన్నకొండ యున్నది. ఈ రాతిని బట్టియే పట్టనమున కాపేరు వచ్చియుండు నని చూచినవారికిఁ దోఁపకమానదు."

"ఏకశిలానగర మనుసంజ్ఞ యోరుగంటికి రూఢమై యున్నది. ఒంటి

మిట్ట కాసంజ్ఞ పూర్వ మున్నట్లు తోఁపదు. మఱియు నగరశబ్దము పెద్దపట్టనమునకుఁ జెల్లును గాని యొంటిమిట్టవంటి చిన్నయూరికి వర్తింపదు." అని పంతులవా రొంటిమిట్టవారివాదమును బూర్వపక్షమును నోరుగంటివారివాదమును సిద్ధాంతముఁ జేసిరి. దీని సారాంశము.

(1) ఏకశిలానగర మనుపే రోరుగంటికి మాత్రమే చెల్లును.
(2) ఒంటిమిట్ట కాపేరు చెల్లదు.
(3) ఒంటిమిట్ట కాసంజ్ఞ పూర్వ మున్నట్లు తోఁపదు.
(4) నగరశబ్ద మొంటిమిట్టవంటిచిన్నయూరికి వర్తింపదు.

వీనికి నొంటిమిట్టవాదుల ప్రత్యుత్తరము.

(1) సమానరూపములపేర్లు గలగ్రామములు లోకమునఁ బెక్కులు గలవు. అట్టులే యొంటిమిట్టగాక యేకశిలానగర మనుపేరుగలవి రెండును, నొంటిమిట్టయనునవి రెండును గానవచ్చుచున్నవి. ఏకశిలానగర మనుపే రొంటిమిట్టకు, నోరగంటికి, భువనగిరికిఁ గలదు. ఒంటిమిట్ట యనునవి కడప మండలమున సిద్ధవటముతాలూకాలో నొకటి చిత్తూరుతాలూకాలో నొకటి, పుంగనూరుతాలూకాలో నొకటి గలవు. రెం డేకశిలానగరములు గోల్కొండ దేశమంద దున్నవి. కావున "నేకశిలానగరవాచ్య మగుపట్టనము ఓరుగల్లే" యను పంతులవారిమాట సత్యముగాదు. భువనగిరి కాపేరున్నట్టులు సర్వోపనిషత్సారసంగ్రహమునఁ గలదు. అనుబంధము విలోకింపుఁడు.

"ఒరుగల్లనఁగాఁ గన్నడమున నొక్కరాయి యని యర్థము." అనియు "ఏకశిల యనఁగా నఖండశిల యని యర్థము., ఓరుగల్లునకు నిదియే యర్థము." అనియుఁ బంతులవారు వ్రాసిరి. ఒక-ఏకశబ్దమునకు నఖండమనునది యొకటే యర్థమని యోరుగంటివాదు లందురేని వారిమాట పాటింపరాదు. ఏకకుండలుఁడు, ఏకతీర్థుఁడు, ఏకచక్రము, ఏకతాళము, ఏకదంతుఁడు, ఏకదృక్కు, ఏకనటుఁడు (ముఖ్యనటుఁడు) ఏకపత్నుఁడు (సహాయుఁడు) ఏకభక్తవ్రతము-ఏకామ్రేశ్వరుఁడు, ఏకవేణీధర. ఇట్టి యనేకశబ్దములందు నేకశబ్దమునకు నఖండ మనునర్థము పొసఁగదు. ఇది సామాన్యముగఁ దెలిసినవిషయ మైనను నొకానొక రేకశబ్దమునకు నఖండార్థ మొండే కల దనుటచే నిది వ్రాయవలసివచ్చెను. ఇట్టులే 'ఒంటివాఁడ' 'ఒంటికొడుకు' ఒంటిపేఁటహారము, ఒంటికోఱ, ఒంటిచీర, ఒంటికంటిగాము, ఒంటిస్తంభపుమేడ లోనైన వెఱుంగునది.

ఏకశిలానగరనామము నఖండశిలారూప మగు నొకచిన్నకొండ వలనఁ గలిగిన దని యిప్పుడునూతనముగ ఒరుగల్లునకు నేకశిలాశబ్దమునకు సంబంధము కల్పింప నెంచు పంతులవారును వారివలన నెఱిఁగికొనిన పురాతనశాసనశోధకులు నభిప్రాయపడుచున్నారు గాని పూర్వు లట్లభిప్రాయపడలేదు.

Warangal (ఒరుంగల్లు orungallu Tel.) From Oru tam. Single+Kal tam. stone [or] Sanskrit name (Varnakula) meaning caste+collection; (ekasilanagari) One+stone+City. from the single stone wall round the town [Vontimitta]" Madras Manual of Administration.

"గణపతిరా జేకశిలానగరమునకు వచ్చి తనకు మరలఁబడ్డతమ్ములం బ్రహరించి తాను బట్టాభిషిక్తుఁడై యోరుగంటికి శిలాప్రాకారంబుగాఁ గోట నేర్పఱచి" సోమదేవరాజీయము వచనము.

గీ. వచ్చి తనకు మరలఁ బడ్డతమ్ములను హ, రించి సకలగహ్వరిస్థలికిని
బ్రాజ్యు లెన్నఁగాను బట్టాభిషిక్తుఁ డై, వీటి కొక్కరాతికోట నిలిపె.

సోమదేవరాజీయము - పద్యకావ్యము.

పంతులవారి 'యొక్కరాయి' యిందుఁ గానవచ్చుచున్నది.

వీనినిబట్టి యాలోచింప శిలాప్రధాన మైనకోట నిర్మింపఁబడుటచే నానగరమునకు నేకశిలానగర మనుపేరు వచ్చె నని తెలియవచ్చెడిని. దీనివలన నొంటిమిట్ట వారివాదమున కేమియు సాహాయ్యము లేదుగాన విశేషించి చర్చింపవలసినపని లేదుగాని పంతులవారి యఖండశిలావాదమును బెండుపఱుచుచున్నదని చెప్పినఁ జాలును.

ఒంటిమిట్టకు నోరుగంటికి నర్థభేదము విశేషముగా నున్నట్టు పంతులవారు వ్రాసినను వారువ్రాసినయర్థము ప్రకారమే విశేషభేదము లేదని యేర్పడుచున్నది. ఎట్లన

"ఒంటిమిట్ట యనఁగా (నొంటిగానుండు / ఏక) (గుట్ట / శైల) (చిన్నకొండ) యని యర్థము."

"ఓరుగంటినట్టనడుమ (నఖండశిలారూపమగు / ఏక) (చిన్నకొండ / శైల) యున్నది."

'చిన్నకొండ' యనునది రెండిట సమానము. ఏకశబ్దము సమానము. ఈ శబ్దమునకు నొంటియని యఖండమని రెండర్థములు గలవు. ఇఁక విశేషభేద మెచ్చటనుండి వచ్చెనో. అఖండశిలాత్వము ప్రధానముగాని శైలత్వము గాదందురేని మూరెఁడుబారెఁ డఖండశిల లింటింటఁ గల వని ప్రత్యుత్తరము. పంతులవారియర్థము గ్రహించినను వారివాదము దుర్బల మనుటకై యింతవఱకీవిషయము వ్రాసితి. ఇఁక నా యభిప్రాయము తెలిపెదను.

“ఒరుగల్లనఁగా గన్నడమున నొక్కరాయి యని యర్థము.” అని పంతులవారువ్రాసిరి. ఒరుశబ్దమునకు ‘ఒక్క’ యనునర్థము కన్నడమున లేదని మ-రా-రా-శ్రీ, కోలాచలము శ్రీనివాసరావుగారిప్పుడుచెప్పిరి గదా. ఇట్టులే నేనువిచారించిన కర్ణాటకభాషాభిజ్ఞు లెల్లరుఁ జెప్పిరి. ఇప్పుడు పంతులవారి వాదమున కేమిగతి? అఱవమున ‘ఒరు’ అనఁగా ఒకటి యని యర్థము కలదు. ఆ కాలమున నఱవవా రందువ్యాపించి యుండలేదు. కావున నాశబ్దమునకుఁ బ్రసక్తియే పుట్టదు. అట్లైనచో నాశబ్దముగతి యేమని మీరడుగవచ్చును. నా యభిప్రాయమున నది యొరగల్లుగాని యొరుగల్లు గాదు. ఒరగల్లనఁగా “(ఒర+కల్లు) బంగారు లోనగువాని నొరపెట్టెడురాయి. నికషము” అని శబ్దరత్నాకరము. మహాపట్టనముల నికషోపలములుగా దండ్యాది మహాకవులు వర్ణించియున్నారు. దండివశకుమారచరిత్రయందు “అస్తి సమస్త నగరీనికషాయమాణా........మగధదేశశేఖరీభూతా పుష్పపురీనామనగరీ” యనికలదుగదా. ఆ యర్థమున నీనగరమున కీపేరు వచ్చియుండవచ్చును. శిలామయమైనకోట నిర్మితమైనపదపడి యేకశిలానగరమనుపేరు వచ్చియుండవచ్చును. ఒరగల్లు వికారమే ఓరగల్లు అని గొల్లకొండ గోలకొండ యైనట్టులు గ్రహింపవచ్చును. ఒరగల్లే ఒరంగల్లు. ఈ రూపము వ్యాకరణసాధ్యమని పంతులవారెఱుఁగుదురు. ఒరంగల్లు అనునపుడును రేఫముమీఁద నత్వమే కానవచ్చుచున్నది గాని యుత్వము కానవచ్చుటలేదు. దేశమందు భాషయందు లేనిశబ్దార్థముల గ్రహించి చెప్పినపంతులవారివ్యుత్పత్తికంటె సుశబ్దము సార్థ్వము గలిగిననేఁ జెప్పినవ్యుత్పత్తియే సాధువు. పట్టనగౌరవమునకు నేను జెప్పినదియే తగియున్నది. ఈ వ్యుత్పత్తి గ్రహించినఁ బంతులవారి పూర్వపక్షము నేలఁగూలుచున్నది.

ఏకశిలానగరమనుపే రొంటిమిట్టకుఁ గలదా లెదా?

ఒంటిమిట్టకు నేకశిలానగరమనుపేరు పూర్వమున్నట్లు తోఁపదని పంతులవారు వ్రాసిరి. వారికి సత్యముతోఁపకపోవుటచే వృథావాదమునకుఁ గారణమయ్యెను. పూర్వము లేదనుటచే నిటీవల నెవరో వాదార్థము కల్పించిరని పంతులవారి రహస్యాభిప్రాయము కాఁబోలు.

ఉత్తరసర్కారులో నొకానొకఁడు బమ్మెరపోతరా జొంటిమిట్టవాఁడని నా ప్రతిష్ఠయు నాంధ్రవాల్మీకిరామాయణమునకుఁ బ్రశస్తియుఁ గోరి తొలుత నేనువ్రాసితినని పత్రికయందు వ్రాసిప్రకటించె నని విని యాపత్రిక వి. పి. గాఁ బంపుఁడనియు దానికిఁ గలకారణములు తెలుపుఁ డనియు నతనికిఁ వ్రాసితిని

గాని నేఁటినఱకు మాఱుత్తరము లేదు. అతఁడు ధీరుఁడేసి యిపుడైనఁ దనవాదము నిలుపుకొనుఁగాక. అజ్ఞానము, దురభిమానము, అసూయ యెన్నిదబ్బఱలకైన నెడమిచ్చును. వానిమాట యటుండనిచ్చి పంతులవారికిఁ దోఁపకపోవుట కేమికారణమో చూతము. వీరు ప్రయోగించిన “పూర్వ” శబ్దమునకు స్కాందపురాణము పుట్టకముందని యర్థము చేసినచో వీరివాక్యము సత్యమగు నేమో కాని యన్యథా కాదు. స్కాందపురాణ మైనను దాను బుట్టకముందు లోకమునఁ గలవి వివరించెనుగాని నూతనముగ నేదియు సృష్టింపలేదు.

1. పురాణము హయగ్రీవశాస్త్రులవారీవాద మన నేల యీ వాదము చేయువారు పుట్టుట కెన్నియోసంవత్సరములకుముందే బమ్మెర పోతరాజుగారు వ్రాసిన యేకశిలానగర మనవొంటిమిట్ట యనియుఁ బోతరాజుగా రందుండిభాగవతము రచించిరనియు మఱికొన్నివిషయములును వ్రాసిరి. ఈ శాస్త్రులవారు గొప్పపండితులు. చెన్నపురియందుండి భాగవతాద్యనేక సంస్కృతాంధ్ర గ్రంథములు శోధించి ముద్రించినవారు. వీరు ప్రతాపరుద్రయశోభూషణమై విద్యానాథకృతమైన ప్రతాపరుద్రీయమును బఠించినవారే. అం దోరుగంటికి నేకశిలానగర మనిపేరుండుటయు నెఱిఁగినవారే. ఇంతయు నెఱింగియు వారు బలిష్ఠమై యనాదిగ సర్వాంధ్రలోకవ్యాప్త మైనలోకప్రవాదమును, స్థలజ్ఞుల వాక్యములును, స్థలపురాణమును, మఱియితరప్రమాణములను, నాధారపఱిచి కొని సత్యమెఱిఁగి యొరగల్లు “పెద్దపట్టన”మైనను దాని నీసడించి యొంటిమిట్ట వంటి “చిన్నయూరిని” స్వీకరించిరి. సత్యము చెప్పవలసినచోటఁ బ్రాజ్ఞులు పిన్నపెద్దలతారతమ్య మెఱుఁగరు. వాదబలముమాత్రమే పరికింతురు. పంతులవారుచెప్పునట్లు ఒంటిమిట్ట కేకశిలానగర మనుపేరు లేక పోతనామాత్యుఁ డందుండినవాఁడును గాకపోయినచో శాస్త్రులవారివ్రాఁతకుఁ గారణమేమో యోరుగంటివాదులు చెప్పఁదలంపరైరి. ఈ శాస్త్రులవా రొంటిమిట్టవాసులు గారు. కావున నొంటిమిట్టపై నభిమానముంచి యిది సృష్టించి రనియోరుగంటివాదు లనఁ జాలరు. ఓరుగల్లువలె నొంటిమిట్ట గ్రంథముల కెక్కినప్రసిద్ధ నగరము గాదుగదా? విషయ మసత్యమైనచో నిదియెట్లు వారికి శ్రవణగోచరమయ్యెను. పొగబండ్ల కిప్పు డున్నంతప్రచార మప్పటి కాచోటుల లేదు. ఒకవేళనుండిన దనినను నొంటిమిట్ట దూరదేశజనుల నాకర్షించుమహిమ గలది నేఁటికిని గాదు.

2. “Vontimitta (ఒంటిమిట్ట Vontimitta Tel.) From Onti tel. Single + Mitta Tel. Mound [or] Sanskrit name Ekasilanagari meaning

Single+rock+City. [Warangal]. Madras Manual of Administration."
ఇదియు నీ వివాదము పుట్టుటకు ముందు పుట్టిన గ్రంథమే.

3. "ఒంటిమిట్ట లేక యేకశిలానగరమాహాత్మ్య" మని యొక వ్రాఁతపుస్తకమును సాహిత్యపరిషత్తువా రోబిలి గ్రామమందు సంపాదించిరి. అందు

ఉ. "స్కాందపురాణమందు నిది సంస్కృతభాషగ నుండు నాంధ్రముస్
బంధుర మొప్పఁ జేసినను బాలురుస్త్రీజనులాదిగాఁ దగన్
పాంథులునైనఁ జూచి బహుభంగుల మెత్తురు. పూర్తిమట్టి నీ
గ్రంథము తాడిచెర్లకులకర్తగు వేంకటరామశాస్త్రి చేన్. అని కలదు.

దీనివలన నొంటిమిట్టక్షేత్రమాహాత్మ్యము సంస్కృతభాషను స్కాందపురాణమున నున్నట్లు స్పష్టపడియెఁగదా? అందు వ్యుత్పత్తి యిట్లు వ్రాయఁబడియున్నది.

ఆ. కొండలవియు నయ్యు గుహాలతో లతలతో
నడు............చాల నగము లయ్యె
బంగరంబు చెడియుఁ బరఁగ మట్టియు రాయి
యనఁగ నెలసెఁ గలిని నరుదుగాను.

కం. అందులలో నొక్కటి యిచ, టందంబుగ బడియె నదియు నద్భుతభంగిన్
బృందారకాదిమానుల, డెందంబులు సంతసింప దేదీప్యంబై.

కం. ఏకశిలానగరం బన, శ్రీకరముగఁ బట్టనంబు చెలఁగుచు నుండున్
లోకులు తెనుఁగున నుడువుదు, రేకంబుగ నొంటిమిట్ట యిది యను పేరన్.

ఈ గ్రంథము తప్పులతడక. అయినను మనకుఁ గావలసినవిషయము స్పష్టపఱుచుచున్నది. సంస్కృతగ్రంథము నాకు లభింపలేదు. దానిని బరిషత్తువారే సంపాదింతురుగాక. ఈ స్వతంత్రప్రమాణములు మూఁడును నీవాదము విజృంభించుటకుముందే పుట్టినవి. కావున ననాదినుండి యొంటిమిట్టకును నేకశిలానరనామ ముండుట నిస్సందేహము.

ఈ క్రిందఁ జెప్పఁబడువ్యుత్పత్తులంబట్టి యొంటిమిట్ట కేకశిలానగరనామము సార్థకమో నిరర్థకమో ప్రాజ్ఞ లాలోచింపుఁడు.

(1) ఒంటిమిట్టగ్రామమునకు 60,70 గజములదూరములో నొకగుట్టయున్నది. పాఱువేఁటనాఁడు కోదండరామస్వాములవా రీగుట్టశిఖరమున నుండు మండపమునకు విచ్చేయుదురు. దీనికి నితరపర్వతములకు సంబంధము లేదు. ఒంటిగానే యున్నది. ఇది మేరుపర్వతశృంగమనియు దీనివలననే యీ యూరికి నేకశిలాఖ్యవచ్చిన దనియు స్థలపురాణమునఁ గలదు.

"ఏకవృక్షః (ఏకోవృక్షోయస్మిన్) చతుఃక్రోశాన్తరే యత్ర న వృక్షాన్తరమీక్ష్యతే । ఏకవృక్ష స్స విజ్ఞేయ" యని యాగమమున నున్నట్టు శబ్దకల్పద్రుమమునఁ గలదు. అట్టులే చుట్టు సమీపమున శైలములు లేవు గాన దీనికి నేకశైల మని యేకశిల యని పేళ్లు సార్థకములు. ఏకశైలమే యేకశిల. శైలశబ్దము శిలాపర్యాయము. గండశైలశబ్దార్థముఁ జూడుఁడు. భోజచంపువున "తత్ర జంభారిప్రహితాం రంభాం శైలీ భవేతి శప్త్వా" యనికలదు. కావున దీనికి నేకశిలానగర మనిపేరు వచ్చెనని యొకయోజన.

రెండవవ్యుత్పత్తి, దేవాలయమునందలి సీతారామలక్ష్మణవిగ్రహములు మూఁడును నేకశిలానిర్మితములై, యేకాక్షరప్రణవమున మూఁడక్షరములవలె నుండి యా యర్థమునే బోధించుచున్నవి. ఈ వ్యుత్పత్తి నా కల్పితముగాదు, సుప్రసిద్ధ మనుటకై 27-8-1913 గల హిందూపత్రికకు గౌరవార్హులైన కేశవపిళ్లగారు వ్రాసిపంపినదానిలోఁ గొంత నిందుఁ బొందుపఱుచుచున్నాను.

"POTANNA—THE CELEBRATED TELUGU BARD."

"The Hon'ble Mr. P. Kesava Pillai of Gooty writes:—"Bommara Potharaju or Pothanna, as he is popularly known, lived some six centuries ago, at Wontimittta in Cuddapha District, and sang his immortal and sweet poem.

* * * * *

Among the inspired and the beloved of the God's ranks the Brahmin, the peasant poet Pothanna. Not only the Telugu world, but the whole Hindu race has reason to be thankful for the spiritual flame, he has lit amidst men. And how God sways the human heart, sustains it in stress and storm, envelopes it in his all-embracing love, and transports it into ineffable spiritual visions, can be sensed by only those that are capable of studying the lives of God's Bhaktas, with chastened spirit. Pothanna stands in the foremost ranks of selfless Hindu saints, who loved man and realised God.

The ancient temple has a sanctity, but it attracts crowds only during festivals. The Avatar of God as Sri Rama is the presiding deity with his Sita and his inseparable brother. The Divine trio are made out of one single stone and the temple is, therefore, named as of Ekasila. The Bhakta that added glory to the temple was Pothanna and his history is asked and told with varying interest and with more or less details.

We are told that seven cities were raised to Homer but Homer begged for food, when he lived. The Hindu poets, with a few exceptions, have fared worse; for the Hindu never thinks of raising

monuments to the great ones, who leave the beacon lights of their race. And our Pothanna tended cattle as a boy, and was content with the hard labour of a peasant all the rest of his life. He was, indeed, a true democrat, and he refused to acquire competence by dedicating his lofty theme of Sri Krishna's sublime 'Lila' to any man on throne or in palace. And he resided in the latter part of his long-life in a cave within a furlong from the village. The hillock is there by the side of a road, and the fountain, which supplied his wants, still runs; but the cave was demolished to make elbow room for a structure, intended to serve as a resting place, for the God of the temple when the festival comes round.

Mr., J. F. Bryant, Collector of Cuddapah, paid a flying visit to the temple, made enquiries about Pothanna's abode and was shown the spot where the cave was. and I had the privilege to be there with him through his courtesy. The demolition of a saint-poet's abode, struck the countryman of Shakespeare as a sacrilege. And the neglected state of the sacred fountain appeared to be sinful to the Hindu mind. The place attracts thousands of worshippers in the temple as well as the admirers of Pothanna.

* * * * *

ఈ విషయ మింతభక్తిపురస్సరముగ వ్రాసినగౌరవార్హులు కేశవపిళ్లగారెవ్వరో నేను మీకుఁ దెలుపవలయునా? గ్రామ్యవాదులరాయిడి కడ్డపడి యాంధ్రభాషాపవిత్రతను రక్షించిన పుణ్యాత్ములు వీరే. వీ రొనర్చిసాహాయ్యమువలననే పాఠశాలలయందలిపండితులు మాతృభాషను నభ్యసించిన దోషముచేఁ గాఁబోలు కాలుగంజిత్రాగువా రిపుడు సగముకుడుపైనఁ దినుచున్నారు.

మీఁది యనువాదములోని స్థలములను బ్రభుత్వమువారు చక్కఁ జేయఁ బూనినపుడు కూడదనియు నది పోతనగా రుండినస్థలము గాదనియు దానికై ప్రభుత్వమువారు ధనవ్యయము చేయరాదనియు నోరుగంటివాదులు వ్రాసిరి. కాని దబ్బఱగాండ్రకు నసూయాపిశాచగ్రస్తుల కెట్టిగౌరవము జరుపవలయునో యట్టిగౌరవమే జరపి ప్రభుత్వమువారు పోతన స్నానముచేయుచుండిన రామతీర్థమును జక్కఁజేయించి దానితీరమున మండప మొకటి కట్టించిరి.

ఈ విషయము జరగినపుడు పంతులవా రొంటిమిట్టవారిపక్షమున స్థిరబుద్ధులై యుండిరి గాని యోరుగంటివాదులఁ గలయలేదు. ఈ తీర్థము పోతన భూము లనిపిలువఁబడుభూములకుఁ బ్రక్కననే చెఱువుకట్టక్రింద నున్నది. ఈ స్థలములఁ జూచినవారు కట్టమీఁద శ్రీనాథుఁడు మడిలోఁ బోతన యుండి సంభాషించి యుండుట కేయూటంక ముండ దని తలఁపకమానరు.

ఈ విషయములు మీకుఁ దెలిసినను దెలియనివారికై వ్రాసితిని. ఈసాయము కేశవపిళ్లగారే చేసిరి. ఏయాంధ్రుఁడును జేయనిమీఁదిసత్కార్యములు చేసినపిళ్లగా రాంధ్రులస్తుతికిఁ బాత్రులు. ఒంటిమిట్టతో నెట్టిసంబంధము లేక తటస్థులైనవీరు వ్రాసినలేఖ యోరుగంటివారివాదమును నిర్మూలించుచున్నది.

ఒంటిమిట్టకు నేకశిలానగరమునకుఁ గించిదర్థభేద మున్న దనుపంతులవారిమాట వాదమునిమిత్త మంగీకరించెదను. ఒకపదార్థమునకు నొకప్రదేశమునకు భిన్నకారణములచే భిన్ననామములు వచ్చుట వింతకాదుగదా? నెల్లూరికి, విక్రమసింహపురికి నేమిసంబంధము? విద్యానగరమునకు విజయనగరమున కేమిసంబంధము? మదరాసునకుఁ జెన్నపురి కేమిసంబంధము? అలిమేలుమంగాపురమునకుఁ దిరుచానూరి కేమిసంబంధము? భువనగిరికి నేకశిలానగరమున కేమిసంబంధము?* ఇట్టి వెన్నియో కలవు.

(4) "నగరశబ్దము పెద్దపట్టణమునకుఁ జెల్లును గాని యొంటిమిట్టవంటి చిన్నయూరికి వర్తింపదు" అనిపంతులవారు వ్రాసిరి కాని యిది వారు వ్రాయఁదగినది కాదు. అనేకమండలముల సంచరించి నానానగరములను జూచినవీరిట్లు వ్రాయుటే వింత. కలకాల మొంటిమిట్ట యిప్పు డున్నస్థితిలో నుండినది కాదు. రాజధాను లనేకములు నామావశిష్టములై కొన్నియుఁ గుగ్రామములై కొన్నియుఁ బేరైన లేకపోయి కొన్నియు నుండుట ప్రసిద్ధమే కదా? ఒంటిమిట్ట పూర్వ మింతచిన్నయూరై యప్రసిద్ధస్థల మయ్యేనేని యం దంతపెద్ద దేవాలయ మెవ్వఁడు కట్టించియుండును? దానికి విస్తారముగ మాన్యము లెవఁడిచ్చియుం

*త్రిభువన మనఁగా మూఁడని భువన మనఁగా నొకటి యని మ-రా-రా-శ్రీ, కో. శ్రీనివాసరావుగా రనిరి. ఒంటికొండ యుండుటచే నా పేరు వచ్చె నని మ-రా-రా-శ్రీ, రామయ్యపంతులవా రనిరి. భువనమునకు నేడుసంజ్ఞ యనియే చదివియుంటిని. కావునఁ బంతులవారి వాక్యమునకుఁ బ్రమాణము చూపలేని యంగీకార్యము కాదు. అటుగాక భువనగిరి యనునది యేకశిలాపర్యాయ మయ్యేనేని శిలా-శైలశబ్దములు పర్యాయములని నేనుముందు చెప్పినవాదము బలపడుచున్నది. ఒంటిగుట్ట యుండుటచే భువనగిరికి నేకశిలానగరమనుపేరు సార్థకము గావచ్చును. అప్పుడు పంతులవారివాదమంతయు భువనగిరికి నన్వయించునుగదా. భువనగిరివాసులు భాగవతమునఁ జెప్పఁబడిన యేకశిలానగరము తమగ్రామమని చెప్పినచోఁ బంతులవారు వారికేమి యుత్తరమిచ్చెదరో. భువన మనఁగా నేడనుటకుఁ బ్రమాణము.

"శాలిన్యుక్తా మ్తౌ రగౌ గోబ్ధిలోకైః" వృత్తరత్నాకరము. దీనికి నొకవాఖ్య "అత్ర లోకశబ్దే సప్తసంఖ్యా వివక్షితా, ఏతే సప్తపదయో రాదశదిశస్సప్తైవ గోత్రాచలాః పాతాళ్యాసపిసప్త సప్తభువనాన్యేకంనభోమండలం ఇత్యనేన వృద్ధవ్యవహారేణ భువనాని సప్తేతి ప్రసిద్ధత్వాత్" మఱియొకవాఖ్యయందు, "అబ్ధిలోకైః చతుర్భి స్సప్తభిశ్చ వర్ణైర్యతిః."

డును? నేఁటికిని శిథిలములై కానవచ్చుబురుజులు ప్రాకారములు నెవ్వఁడు కట్టించియుండును? పల్లెలయం దిట్టివికూడ నుండునా? ఈ యూరికిఁ గొంచెము దూరములో వేణుగోపాలస్వామి దేవాలయ మున్నది. అది పూర్వము గ్రామ గర్భమున నుండెనఁట. అంతియ కాదు. గ్రామమునకుఁ గొంతదూరములోఁ "గోటలోనిచే" లని కొన్ని కలవు. ఇవి కోట శిథిలమైనతర్వాతఁ జేలుగా మార్పఁబడినవి. ఇట్టివి సిద్ధవటము లోనగువానియందలి పాడుపడినకోటల యందన్నిటఁ గలవుగదా. వీనిని జూచిన గ్రామ మెంతవఱకు వ్యాపించియుం డెనో తెలియ నగు. ఇంతయేల పాఱువేఁటకొండ చుట్టి గృహము లుండె ననుట నిశ్చయము. అట్లైనచో నిది పూర్వము పల్లెయో పట్టనమో మీరే నిర్ధారింపుఁడు. కావునఁ బంతులవారియూహ సరిగాదు.

వాదమునకై యొంటిమిట్ట యాగర్భకుగ్రామ మనియె యంగీకరించెదను. చిన్నయూరికి నగర మనుపేరు లేదా? అట్టివానిని బంతులవారు చూడలేదా వినలేదా? అట్టివానిని గొన్ని తెలిపెదను.

జిల్లా.	తాలూకా.	గ్రామనామములు.	ఇండ్లసంఖ్య.	జనసంఖ్య.
కడప	సిద్ధవటము	ఒంటిమిట్ట	930	4309
నెల్లూరు	ఆత్మకూరు	నబీనగరము	13	96
,,	వేంకటగిరి	దత్తనగరము	0	0
,,	,,	రాజనగరము	0	0
గోదావరి	భద్రాచలము	సీతానగరము	36	283
,,	పెద్దాపురము	వేంకటనగరము (14)	42	201
,,	,,	,, (45)	12	49
,,	పిఠాపురము	సీతానగరము	0	0
,,	రాజమహేంద్రవరము	సీతానగరము	504	2574
,,	పోలవరము	సీతారామనగరము	0	0
,,	ఎల్లవరము	వేంకటనగరము	16	58
చిత్తూర్	పుత్తూర్	సురేంద్రనగరము	140	810
,,	తిరుతని	రాజనగరము	162	1244
,,	చంద్రగిరి	శ్రీనివాసనగరము	6	41
ఉత్తరార్కాడు	పోలూరు	ఓడనగరము	26	185
,,	పలమనేరు	విభూత్యాలనగరము	11	65
చెంగల్పట్టు	తిరువళ్ళూర్	రాజనగరము	242	1131

ఈ నగరములలో కటిరెండుతప్పఁ దక్కినవి పంతులవారెఱుఁగనివి కావు. వీనిలో నొకటైన నొంటిమిట్టకు సమానమైనది లేదు. వీనికెల్ల నగరము లని

పేరుండుట నిర్వివాదము. పంతులవారు వీని నెల్ల నెట్లు నిరాకరించెదరో. ఒంటిమిట్టవంటి రాతిగొట్టునేలలోఁ బల్లెలోఁ బోతరాజువంటిమహాకవి యుండునా యన్నవారివాద మెట్టిదో యిదియు నట్టిదే.

నగర మనుపే రొంటిమిట్టకుఁ దగునో తగదో వ్యుత్పత్తినిబట్టి చూతము. నగరమనఁగా నేమి? "క్రీడార్థంనగాః వృక్షాః పర్వతా వా అత్ర సంతీతి నగరీ. విహారార్థమై వృక్షములుగాని పర్వతములుగాని దీనియందుఁ గలవు" అని లింగాభట్టీయము. ఒంటిమిట్ట సమీపమున నుండుపాఱువేఁటగుట్టను బూర్వము దానిఁజుట్టి యలుగువంకవఱకు నావలను గ్రామము వ్యాపించియుండుటయు మీరు స్మరించితిరేని యీ వ్యుత్పత్తి యొంటిమిట్ట కన్వయించుటని మీకుఁ దోఁపక పోదు. ఒంటిమిట్టకు నేకశిలానగరశబ్దము సరియైన సంస్కృతరూపము గాదని వాదించువారు సరియైనరూప మెట్టి లుండవలయునో సెలవిత్తురుగాక.

ఏకశబ్దము ప్రాచుర్యార్థమందును బ్రయోగించుట కలదు. అటు చూచిన నొంటిమిట్టయం దది సార్థక మగుచున్నది. ఈ విధముగఁ జూచిన నోరుగంటివారి మూఁడవయాధారము నిరాధారమై యొంటిమిట్టపైఁ జేసినయాక్షేపము నిస్సార మగుచున్నది.

నాలుగవయాధారము.

"భోగినీదండకము పోతరాజు రావు సర్వజ్ఞసింగమనేనియుంపుడుకత్తెనుద్దేశించి రచించె నని లోకములో వాడుక కలదు. ఈ దండకము పోతరాజుకృత్యమనుమాట సత్య మయ్యెనేని యదికూడ నోరుగల్లువాదమునకే యుపకరించు నని నాయభిప్రాయము" అని పంతులవారు వ్రాసిరి. ఈ వాక్యమున "నోరుగల్లు" అనుదాని నొంటిమిట్టగా మార్చిన నెక్కువయుక్తి యుక్తముగా నుండునని నా యభిప్రాయము. ఎట్లన

బమ్మెరపోతరాజు వీరభద్రవిజయము వ్రాసినాఁ డనుట యెంతసత్యమో భోగినీదండకము వ్రాసియుండుట యంతసత్యమే యై యుండవచ్చును. కావునఁ బంతులవారిసందేహము న్యాయ్యమే. వాదమునకై వారంగీకరించినట్లు భోగినీదండకము పోతరాజకృత మని నే నంగీకరించెదను. అట్లైనచోఁ బోతనామాత్యుఁడు దరిద్రుఁ డగుట విత్తకాముఁడై బాల్యచపలతచే నా దండకము చెప్పినఁ జెప్పియుండవచ్చు నని తలంపవలయును. దానినిసింగమనాయఁ డాదరించినట్లుగాని బహుమతి యిచ్చినట్లు గాని తెలియరాదు. పోతరాజుగారి తరువాతిచర్యవలన నిరాదరింపఁబడిన ట్లూహింపవలసి యున్నది. ఆదరింపఁబడి

యుండిన యెడల నాయన యుపకార మొనర్చినప్రభువును దూషించి కృతఘ్నుఁడగుటకుఁ గారణము లేదు. పూర్వపుఁబ్రభువులు కొందఱు కవుల మోసగించి కృతినొంది వారిని బరాభవించి వారిచేఁ జీవాట్లు తిని శాశ్వతాపకీర్తి గడించిరో యది లోకవిదితము. చంద్రరేఖావిలాపము ప్రబలదృష్టాంతము. సింగమనాయఁడు వారిలో నొకఁడై యుండిన నుండవచ్చును. ఆకారణముచేతనే యాయనను మనస్సులో నుంచుకొని "ఇమ్మను జేశ్వరాధముల కిచ్చి" యని పోతరాజు నిందించి యుండవచ్చును. అంతియకాదు. శ్రీనాథుఁడు దూతగావచ్చినపుడు

ఉ. "కాటుకకంటినీరు చనుకట్టులపైఁ బడ నేల 'యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల యోమదంబ యో
హాటకగర్భురాణి నిను నాఁకటఁ గ్రాసముకోసరంబు క
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ."

అనిపోతరాజు సరస్వతీదేవిని సంబోధించెను.

ఇందుఁ గర్ణాటశబ్దము సింగమనాయని నుద్దేశించియే చెప్పియుండవలయును. ఆంధ్రభాషకుఁ గర్ణాటభాష యని యాంధ్రప్రభువులకుఁ గర్ణాటప్రభువులని పేరు గలదుకదా! కిరాటుఁ డనఁగా వైశ్యుఁడు. వైశ్యునకు హరవిలాసమంకిత మిచ్చినవాఁడు శ్రీనాథుఁడు. వీరి నిరువురను బోతరాజు దూషించెననుట స్పష్టము. ఇట్టివారికిఁ గృతినిచ్చుట తనతల్లి నిచ్చుటే యని పోతన యభిప్రాయ మని "మదంబ"యని సరస్వతిని సంబోధించుటే తెలుపుచున్నది.

ఈప్రకార మాయనను దూషించిన కవి యాయనరాష్ట్రములో నుండిన యెడల నాప్రభువు గ్రంథము నేకాదు కవినిగూడఁ బూడ్పించి యుండును. అట్టి మహాదశ పోతరాజుగారికిఁ బట్టకుండుటకు సింగమనాయనిరాష్ట్రములో నాయన లేకుండుటే కారణమై యుండవలెను. సర్వజ్ఞసింగమనాయఁ డోరుగంటియం దుండె ననుమాట నిజమైనచో భోగినీదండకము పోతరాజకృతమైనచో, బాల్యచపలతచే ధనాశచేఁ బోతరా జోరుగంటికిఁబోయి యుండినచో నుండవచ్చును. అవమానితుఁడై మరలి వచ్చియు నుండవచ్చును. ఆ మాత్రముననే పోతరా జోరుగంటివాఁడు కాఁజాలఁడు.

"పోతరా జొంటిమిట్టవాఁడైనను శ్రీనాథునివలెనే యోరుగంటికిఁ బోయి సర్వజ్ఞసింగమనేనిఁ జూచియుండఁ గూడదా యని యొంటిమిట్టవాదులనవచ్చును. అదియు సమంజసమే." అని పంతులవా రొంటిమిట్టవారివాదము సమంజస మనిచెప్పుచు నాయూహ సరిగా దనుటకు "శ్రీనాథునివలెఁ బోతరాజు

బహుదేశద్రష్ట యనికాని యనేకరాజుల నాశ్రయించినట్లుగాని ప్రమాణములు గానరావు. జనశ్రుతియు లేదు" అని యుక్తులు వ్రాసిరి.

ఈవాక్యములోనివిషయము లెంతమాత్రము సత్యములో పిదప నాలోచించెదఁ గాని పంతులవారి యుక్తులుమాత్రము నాకు బోధపడలేదని వెంటనే చెప్పవలసియున్నది:—

ఆర్యులారా! నే నిచ్చటికిఁ బదునైదామడదూరములో నుండుప్రభువును నా జన్మములో నొక్కసారి చూచి వచ్చితిననిచెప్పిన నా మాట స్థిరపఱచుటకు నేను "బహుదేశద్రష్ట" నని "యనేకరాజుల నాశ్రయించితి"నని మీకుఁ బ్రమాణములు చూపవలయునా? ఒకఁడు తనజన్మములో నొకచోటికి నొకసారి మాత్రము పోయియుండఁ గూడదా? ఇం దేవైపరీత్యము పంతులవారికిఁ దోఁచెనోకాని నాకేదియుఁ దోఁపలేదు. అందుఁ బ్రథమచుంబనములోనే దంతభగ్నమన్నట్లు లొకసారిపోయి యవమానపడి ప్రభువులయందు హేయబుద్ధి గలపోతన యనేకరాజులనాశ్రయించునా? కావున నొంటిమిట్టవాదులవారివాదముపైఁ బంతులవారి ప్రత్యాఖ్యానము బొత్తిగ యుక్తియుక్తము కాదు.

శ్రీనాథుఁడు ధనాశాపాతకుఁడై దేశములు ద్రిమ్మరి యుప్పుమిరపకాయలమ్ముకొనువారికిఁ గూడ స్వకృతికన్యకల విక్రయించి జీవించినవాఁడు. పోతనామాత్యుఁ డెఱిఁగినరాజు శ్రీరామభద్రుఁ డొకఁడే. తనకృతి నిమ్మని ప్రార్థింపఁ దనయింటికి వచ్చినరాజులను వారిదూతలను నిరసించు చిత్తౌన్నత్యము ధృతి గలవాఁ డాయన యొకఁడే. "శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకరక్షైకారంభకు" అనియుఁ "బలికిన భవహర మగునఁట" యని వ్రాసిన నివృత్తిమార్గనిష్ఠుఁడు పోతనామాత్యుఁడు. శిశ్నోదరపరాయణుఁడై తత్ఫలమనుభవించిన ప్రవృత్తిమార్గనిష్ఠుఁడు శ్రీనాథుఁడు. శ్రీనాథునివలెఁ బోతరాజు "బహుదేశద్రష్ట కాఁడఁట. అనేకరాజుల నాశ్రయింప లేదఁట." ఎంతదోష మెంతదోషము!! "శ్రీనాథునివలెనే యోరుగంటికిఁ బోయి సర్వజ్ఞసింగమనేనిఁజూచి యుండఁగూడదా" అను పంతులవారి వాక్యములో రెండు దోషము లున్నట్లు తోఁచెడిని.

సర్వజ్ఞసింగమనాయఁ డోరుగంటియం దుండె ననుటయు, శ్రీనాథుఁ డందు నాయనను జూచెననుటయు విశ్వసింపఁదగినవి కావు. ఏలన, శ్రీనాథుఁడు తాను సింగమనేని నోరుగంటిలోఁ జూచిన ట్లెందును జెప్పినట్లు లేదు. ఈ కాలములో నోరంగల్లు తురకల యధీనమం దుండెనుగాని స్వదేశప్రభువుల

యధీనమందు లేదు. బ్రహ్మశ్రీ, వెల్లాల సదాశివశాస్త్రులవారు సింగమనాయఁడు రాజమహేంద్రవరములో నున్నట్టు వ్రాసిరి గాని యది తప్పని వారే యంగీకరించినట్టు పంతులవా రిప్పుడు చెప్పిరిగదా. కాశీఖండములోని,

ఉ. ప్రాకటవిక్రమస్ఫురణ రాజమహేంద్రము రాజధానిగా
నేకసితాతపత్రముగ నేలెను వీరనృపాలుఁ డుత్తమ
శ్లోకుఁడు వేమశౌరి యనుజుండు సమున్నత వైభవాఢ్యుఁడై
చీఁకటియుఁ గళింగయును జిల్కసముద్రము సింహశైలముఁ.

అనుపద్యమువలన శ్రీనాథునికాలమున రాజమహేంద్రవరమును నన వేమారెడ్డి తమ్ముఁడు వీరారెడ్డి పాలించుచుండె నని స్పష్టపడియె. దానివలన సింగమనాయఁ డోరుగంటియందుఁ గాని రాజమహేంద్రవరమునందుఁ గాని యుండినవాఁడు కాఁడనుట విశదపడియె. అయిన నాయన యిఁక నెక్కడనుండె నన రాచకొండలో నున్నట్టుకొందఱు చెప్పెదరు. ఈ రాచకొండ యోరుగంటికి 50,60 మైళ్లు దక్షిణమున నున్నది. అనఁగాఁ గడపకు 150 మైళ్లు ఉత్తరమున నున్నది,

గ్రహణస్నానమునకే పోతరాజు 100 మైళ్లు పోయి నూఱుమైళ్లు వచ్చె నని పంతులవారు వ్రాసిరికదా! అట్టివాఁడు పొట్టకూటికై 150 మైళ్లు 7-8 దినముల ప్రయాణము చేసె నని చెప్పినఁ దప్పేమి?

"The ruins of this old centre of Hindu power (Warangal) are still to be seen and are situated about 200 miles to the North of Cuddapah frontier." Cuddapah Dist. Manual.

దారిద్ర్యదోషమునఁ బోతరాజు రాచకొండకుఁ బోయియుండి పరిభవపడివచ్చి నరపతిస్తుతివిముఖుఁడై వానరపతివరదుని సేవించుచుండె ననుట కేవల సమంజసము.

"కృతిపతి యోరుగంటిప్రాంతమువాఁ డైయుండినచోఁ బోతరాజుకూడ నా ప్రాంతమువాఁడే యయి యుండు నని యూహించుట యసమంజసము కాదు" అని పంతులవారువ్రాసిరి. ప్రాంత మనునది 150 మైళ్లవఱకు వ్యాపించు ననుటకుఁ బంతులవా రంగీకరించి రేని పంతులవారి యూహ సరియుండును. సమీపమనఁగా 100 మైళ్లని పంతులవారు వ్రాసినపుడు ప్రాంతమనఁగా 150 మైళ్లు కాఁగూడదా? అటుకా దందు రేని పంతులవారి యూహ సరిగాదు. కవి ప్రభువుల కానుకూల్యముండి కవి యాయాస్థానపండితుఁడు గా నుండినచోఁ బంతులవారి యూహ సరిదాఁకినఁ దాఁకవచ్చును. తప్పినఁ దప్పవచ్చును. కృతి

భర్తది యొకదేశము కృతికర్తది వేఱొకదేశము గా నుండు సందర్భము లెన్నియో కలవు. కాని ప్రభువునందు విషమబుద్ధి గలకవి యతనిరాష్ట్రములో నుండుట పాము న్నయింటిలోఁ గాఁపురముండుటకంటె నపాయకరము. కావున బుద్ధిమంతుఁడగువాఁడు ప్రభువుతో విరోధించి యతనిదూషించి యతనిరాష్ట్రములో నుండఁడు. కావునఁ బంతులవారియూహ పోతనవిషయమున సరిగాదనియంటిని,

ఐదవయాధారము.

"ఇతరము లగుజనశ్రుతు" లని పంతులవా రొకపుట వ్రాసిరి గాని యం దోరుగంటివే వైనను గానరాదు. ఆకారణముచే బలిష్ఠప్రమాణ మైన జనశ్రుతి యోరుగంటివారికి హుళిక్కి యనుట స్పష్టము.

"ఒంటిమిట్టలో నొకానొకపొలమునకు బమ్మెరపోతరాజుగారి పొల మనువాడుక గల దనియుఁ, గోదండరామస్వామి యాలయములో నొకచోటు చూపి యచ్చటనే కూర్చుండి పోతరాజు భాగవతమును వ్రాసె నని యాగ్రామస్థులు చెప్పుదు రనియు నేను వినియున్నాఁడను" అని పంతులవారు వ్రాసిరి.

దీనిని బంతులవారు నిరాకరింపమి నొంటిమిట్టవాదుల కృతజ్ఞతకుఁ బాత్రులు.

ఆఱవయాధారము.

భాగవతాంధ్రభాషావిశేషము:—ఈవిషయమున ద్రొబ్బు నూకు అను శబ్దము లోరుగంటిప్రాంతమందును, ఒంటిమిట్టప్రాంతమందును గల వని పంతులవారు వ్రాసిరి. ఈశబ్దము లన్ని యాంధ్రమండలములఁ గలవు గాని యీమండలములో నుపయోగించునర్థముననే యందుపయోగించుచున్నా రని పంతులవారు సెలవిచ్చినవారు గారు. కొన్ని చోటుల భిన్నార్థములతో వాడఁబడెడిని. కాటుకకంటినీ రనుపద్యములోని 'కోసర' మనునది యోరుగంటి ప్రాంతమున లే దని విన్నాను. కోసము, కోసరము కడపమండలమున వాడఁబడుచున్నవి. కొన్నిమండలములవారి కీశబ్దములయునికియే తెలియదు. కొందఱు గ్రామ్యము లని భ్రమింతురు. ఇట్టివారు కొంద ఱాపదమును బద్యము నుండి యెత్తివైచి మఱియేమేమో తమపైత్యవికారము కొలఁది వ్రాసిరి. ఇప్పటి గ్రంథశోధకులు, తమకర్థముగాని వానిని దమయభిప్రాయమునకు విరోధముగ నుండువానిని భారతభాగవతనైషధాదులందే తమశిక్కకొలఁది సవరించి యాగ్రంథములను రూపుమార్పఁడఁ జేయుచుండ నిఁకఁ జాటువులా వారిధాటికి నాటుకొనును. ఇది పంతులవారు చాటు వందు రేమో. అనిన ననిందు, పోతనపద్యము కా దని వా రనఁజాలరు.

'కనుక' యనునది యిట్లు వాక్యాలంకారముగ,

"వనజాక్షి నేఁగన్న వైజయంతిక నైన
బింబోష్ఠి నేఁగన్నఁ బీతాంబరము నైన
కన్నియ నేఁగన్నఁ బాంచజన్యము నైన"

అని పోతరాజుగారు భాగవతమునఁ బ్రయోగించిరి.

ఇట్టి దీ దేశమందు సాధారణముగ సంభాషణమందు విననగు. గోలకొండదేశమం దిట్టివి వాడుకయందు లే దని విన్నాను. ఒంటిమిట్టవా రాదేశమంతయుఁ దిరుగఁజాల రనుధైర్యముతో నోరుగంటివాదు లీపదము లాదేశమం దున్న వని వాదార్థమై చెప్పవచ్చును. ఔఁగాములు నిశ్చయించు టెట్లు? కావున గోల్కొండదేశ తత్కాలకవుల గ్రంథములం దిట్టిప్రయోగములు చూపువఱకు వీరిమాట లొంటిమిట్టవాదులు పాటిగాఁ గొనరు. అట్లు పూర్వ గ్రంథములందు నీశబ్దము వారుచూపఁగలిగిరా యప్పు డీయాధార మిరువురకు సమానమే కావున నిష్ప్రయోజనము. చూపఁజాలకపోయిరా యోరగంటివారి వాదము మఱింత యడుగంటి నట్టగును. వలయునేని విరామము కలిగినప్పు డిట్టివి మఱికొన్ని యేఱి వ్రాసెదను.

ఒంటిమిట్టవారివాదము.

ఒంటిమిట్టవారివాద మిదివఱకే గ్రంథస్థమై యున్నది. ఇప్పుడు నేను నూతనముగ సృష్టించికాని క్లిష్టకల్పనము చేసిగాని చెప్పవలసిన దేదియులేదు. అయిన నుపక్రమంబున నిదియు సంకల్పించి యుండుటచే దీనిని సంగ్రహముగ విన్నవించుకొనుచున్నాను. బొమ్మెరవారివాదము, ఓరుగంటివారివాదము పూర్వపక్షము చేయఁబడుటచేతనే పరిశేషన్యాయమున నొంటిమిట్టవారి వాదము సిద్ధాంతిత మయ్యెను.

ఒంటిమిట్టవారివాదముపై వచ్చినయాక్షేపము లన్నియు ఖండితములగుటచేతనే వారివాద మేలోటులేక యథాపూర్వము స్థిరపడెను.

అయినను నొంటిమిట్టవారికిఁ గలయాధారములు తెలియఁగోరువారికై వానిని సంగ్రహముగ విన్నవించుకొనుచున్నాను. ఇందుఁ గొన్ని ముందే విపులముగఁ జర్చింపఁబడినవి.

(1) బమ్మెరపోతరా జేకశిలానగరంబున భాగవతంబు రచించితి నని చెప్పెను. ఏకశిలానగర మనుపే రొంటిమిట్టకును గల దని యనేకకారణములచే ముందు స్థాపించితిని.

(2) పోతరాజు పశువులమేపినస్థలము, దున్నినపొలము, స్నానము

చేయుచుండినతీర్థము, కాఁపురముండినయిల్లు, భాగవతము వ్రాయుచుండిన స్థలము, వీనిని జూపువారు నేఁటికి నున్నారు.

(3) పోతరాజు విగ్రహ మని నేఁటికిని నొకవిగ్రహము దేవాలయమునఁ గానవచ్చుచున్నది.

(4) పోతనామాత్యుఁడు తనమేనమామయింటి వంశమువాఁడని చెప్పునట్టి యవ్వ నేఁటికి నున్నది. ఇది నిజమని నెందలూర్ కోర్టువకీళ్లు మ-రా-రా-శ్రీ, ఆ. పరశురామరావుగారు మొదలగువా రిప్పుడు పంతులవారియెదుటనే సభలోఁ జెప్పిరిగదా.

(5) పోతరా జొంటిమిట్టయం దుండె నని కడపమండలవాసులు గానట్టి పురాణము హయగ్రీవశాస్త్రులు లోనగువారు మున్నే వ్రాసియున్నారు.

(6) ఒంటిమిట్టయందే గాక కడపమండలమందే గాక తదితరానేకమండలములందును బోతరా జొంటిమిట్టవాఁ డనుజనశ్రుతియే ప్రమాణము. ఆంధ్ర వాల్మీకి రామాయణము శ్రీరామున కొంటిమిట్టలో నంకితమిచ్చిన దినములలో నాబాలగోపాలము నానామండలములవారు వేలకొలఁది జనులు ఘోషించుచుండిన బమ్మెర పోతరాజునామము వినినవాఁ డెంతటిశంకితుఁడైనను బోతరా జొంటిమిట్టవాఁడు గాఁడన సాహసించునా? అట్టిమాట వాఁడు నాలుక కొనకుఁ దెచ్చుటకైన మనస్సువచ్చునా? బమ్మెరపోతరాజు మరలవచ్చినాఁ డనియెకదా జనవాదము సర్వత్ర ప్రబలియుండెను. ఓరుగంటివారు గోదావరిని గంగయనెద రని చెప్పినంతమాత్రమున సులభముగఁ బంతులవారు బేలుపోయి యభిప్రాయము మార్చికొనిరి గాని యంకితకాలమున వా రొంటిమిట్టకు వచ్చియేయుండిన నిట్లు సంశయించి యుండ రని నానిశ్చయము.

నేను సిద్ధవటము తాలూకాలో రివిన్యూ ఇన్‌స్పెక్టరుగా నుండినకాలములో నొంటిమిట్ట నాకు సంబంధించిన గ్రామముగా నుండెను. అప్పు డాయనను గుఱించి విచారింపఁగాఁ దద్వంశమువా రెవరు లేరనియు నాయన కాఁపురమున్నయిల్లిదే యనియు నొకయిల్లు చూపిరి. ఆయింటఁ 'గాలువవా' రను వారు కాఁపురముండిరి. ఆయింటివారు నదేమాట చెప్పిరి. ఆయింట మూఁడు దినములుండు భాగ్యము నాకు లభించెను. ఇప్పు డాయింటిపట్టునఁ జిన్న సత్రమున్నది. రామాయణాంకితకాలమందు నాకీసత్రమే యొసఁగఁబడెను. దీనివలనఁ బోతనామాత్యునిపే రాగ్రామమువా రెంతబాగుగ జ్ఞప్తియం దుంచుకొని యుండునదియు, పోతరా జందుండుటయే యసత్యమేని పామరులును దానిని జ్ఞప్తియందుంచుకొన సాధ్యపడి యుండ దనియు, సత్యమే గాకున్నఁ

బంతులవారు చెప్పిన యీ "చిన్నయూరి" యందీవార్త పుట్టఁ గారణమే కలుగ దనియు నుదారచిత్తు లగు విజ్ఞులకుఁ దోఁపకమానదు. అయ్యలరాజు రామభద్రుఁడాయూరివాఁ డనుట నిస్సందేహము కదా. ఆయనపై రాయూర నెవ రెఱుఁగుదురు? ఏల? పోతనామాత్యునిమహిమ యెద్దులులేక మడకదున్నించుట, శ్రీనాథాదులు వచ్చినపుడు భగవంతుఁడే భోజనపదార్థములు తెచ్చియిచ్చుట, శత్రురాజులఁ బరాభవించుట లోనైనవి ప్రజలమనస్సున బాగుగ నాటకున్న వారేల యిన్నిశతమానములుగ నాబీదబాఁపని స్మరింతురు.

మీఁదవివరించిన యాధారములకంటెను బ్రబలాధారము లేకవి విషయమున నేర్గ్రామమువారు తేఁగలరో చూడవలసియున్నది.* భాషావిశేషములు లోనైనయాధారములు రెండుమూఁడుమీఁదఁ జేర్చియుండలేదు.

ఆర్యులారా! యిప్పుడు నేఁజెప్పిన విషయము లన్నియు నాలోచించి నిష్పక్షపాతబుద్ధులై యొంటిమిట్టవారి వాదమందు బలముగలదో లేదో తెలుపఁ గోరుచున్నాను. ఇన్నియాధారములు గలయొంటిమిట్టవారివాదమే బలహీనమై పేరుమాత్రము గల యోరుగంటివారివాదమే బలీయమైనచో నింతకంటెను వింతయేది? ఈవిషయము మధ్యవర్తులు పరిష్కరింపవలసి యుండు నని పంతులవారు చెప్పిరి. పంతులవారు న్యాయైకదృక్కు లనియు వితండావాదవిముఖు లనియు నమ్మి నే నీవాదములో దిగి వారికిఁ బ్రత్యుత్తర మీయఁబూనితిని. వారు తెలిసి కొన్ని తెలియక కొన్ని విడిచినవిషయము లన్నియు వారిస్మరణమునకుఁ దెచ్చిన యెడల వారే యొంటిమిట్టవారికి జయ మొసంగుదు రను నమ్మకమే న న్నీశ్రమమునకు లోపఱిచెను. కావున నేను బట్టినవాదము చెడునే యను నహంత వదలి న్యాయమంద మనస్సు నిలిపి బలాబలము లారసి పరిష్కరించినచో వారితీర్పు నా కభిమతమే.

క. "ఘనసామర్థ్యముగలిగియుఁ, దనదోషమెఱింగి యెవఁడు దానిం బలుకుఁ
దా
వినయంబున మాయన్నయు, నినతనయా! నీవొకండు నిద్దఱు తక్కన్."

కిష్కింధాకాండము.

అని తనదోషము తాఁ జెప్పుకొనుట యొప్పైన గొప్పగుణమే. అట్టి గుణము సామాన్యులయం దుండదు.

అటుగాక పంతులవారు వాదమునకే కడఁగిరేని వారియుత్తరములకుఁ బ్రత్యుత్తరమును, నీవిషయమై వ్రాయనలసి యసమయమగుట వదలిన మఱి కొన్నివిషయములను రెండవభాగమునఁ బ్రకటింతును.

వా॥ సుబ్బరావు.

---

* పోతరాజవిజయము 45-వ పుట కడ భాగము చూడుఁడు.

అనుబంధము I.

NARASARAOPETT,
13-12-16.

MY DEAR BROTHER,

Your kind card to hand. I made enquiries of two learned men of this place who are acquainted well with these parts regarding the information that you wanted. They say that the correct pronounciation of the village in Telugu is ఏర్చూరు. It is said that the name of this village as ఏర్చూరు occurs in some Telugu works, In the ordinary popular usage it is called ఏల్చూరు, but it is not correct. In that village there is even now an old Telugu Pandit named పోతరాజురామకవి. He has written a book called నీలకంఠశతకము. I saw that book myself. In that the name of the village appears as ఏర్చూరు. The Pandit calls himself as ఏర్చూరిరామకవి. Moreover, it is said, that the Telugu poet Yerrapragada was born and lived in this village, and the villagers say మాయెఱ్ఱప్రగడ meaning thereby that ఏర్చూరి యెఱ్ఱప్రగడ was a native of this village. Hoping you are doing well.

I am,
Yours truly,
A. SUNDARARAJA ROW, B.A.,
Sub-Registrar.

అనుబంధము II.

శ్రీనీలకంఠశతకము. ఇదిముద్రితగ్రంథము, ప్రతిసీసపద్యము కడపట "నిత్యనందిత వైకుంఠ దైత్యలుంఠ, నిరుపమోత్కంఠ యేర్చూరినీలకంఠ" యని యున్నది. కడపట గద్యములో "ఇది శ్రీమదేర్చూరి లక్ష్మీనరసింహాకరుణాకటాక్షలబ్ధ కవితాధురంధరుండును........నగురామకవిచే రచింపఁబడిన నీలకంఠశతకము సంపూర్ణము" అనియున్నది.

అనుబంధము III.

అయ్యా, ఇదివఱకు పూర్వము శాలివాహనశకము 1457-వ సంవత్సరమునకు సరియగు మన్మథనామసంవత్సర భాద్రపదమాసమునందు గ్రామకరణము శ్రీవత్సగోత్రుడు చీమకుర్తి శంభయ్య అనేవాడు తటాకమొకటివేయించి అందుకు దాఖలాగా సదరుచెరువులో వేసిన శిలాశాసనమందు "ఏర్చూరు" అనియే యున్నది. ఇదిగాక సుమారు రెండువందల సంవత్సరముల క్రిందట రాజశేఖరుఁ డనుకవిరచించిన అంబరీషోపాఖ్యానమను గ్రంథమునందు "సీ. శ్రీకరయోగీంద్ర సిద్ధమునీశ్వర చారణసంచారమేరుచూరు ¦ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకవీర నారసింహక్షేత్రమేరుచూరు ¦ కాంచనప్రాసాదకమనీయ నవరత్న తోరణభాసురం బేరుచూరు ¦ చందనమందారసకలాగమామోద దేందిరామందిరం బేరుచూరు ¦ భూరిధనధాన్య పూరితం బేరుచూరు ¦ చారుకాసారభాసితం బేరుచూరు ¦ కుతలమందున శ్రీవినకొండ సీమ ¦ నేర్చుకొన్నట్టి యూరు మా యేరుచూరు." ఈ పద్యమునందలి చివర రెండుపాదములవలన గ్రామమునకు "ఏర్చూరు" అనుపేరు వచ్చినవిధము కనుపట్టుచున్నది. ఇదిగాక భాగవత షష్ఠస్కంధమున సీ॥ శ్రీవత్సగోత్రుండు శివభక్తియుక్తుఁడా పస్తంబసూత్రుఁడ పారగుణుఁడు ¦ నేర్చూరి శాసనుం డెఱ్ఱనప్రెగ్గడ పుత్రుండు వీరనపుణ్యమూర్తి" అను పద్యమందుఁగూడ నేర్చూరు అనియే చెప్పఁబడియున్నది. పూర్వకవికృతచాటుపద్యము. కం॥ శ్రీరామచంద్రపదసర ¦ సీరుహామకరంద పానమత్తమిళిందా ¦ ఘోరదురితాగ్నికందా ¦ యేరుచురి పురాంజనేయ యినవిభ కాయా ॥ పోతరాజు రామకవి మున్నుగాగల కవీశ్వరులు చెప్పినగ్రంథములయందును "ఏర్చూరు" అనియే చెప్పఁబడియున్నది. అయితే కవులు సందర్భానుసారముగ "ఏర్చూరు" "ఏరుచూరు" "ఏరుచురు" అనివాడుకొనిరిగాని ఏల్చూరు అని యెక్కడను వాడియుండలేదు, అయితే వ్యావహారికలిపియందును సర్కార్ లెక్కలయందును యేల్చూరు అని వాడుచున్నారు మాకు తెలిసినంతవఱకు వ్రాసిపంపినాము చిత్తగింపవలెను.

పోతరాజు లక్ష్మీనరసింహకవి అష్టావధాని.
13—12—1916.

అనుబంధము IV.

పోతరాజువారు అనేయింటిపేరు ఏలావచ్చినది చెప్పుటకు తగునైన దృష్టాంతరములు ఏమియు కనుపించలేదు. యఱ్ఱాప్రగడ అనేవారిగోత్రము మా గోత్రము ఒకటే. అనగా శ్రీవత్సగోత్రమయియున్నది. అందువలన మా కుటుంబములో వాడని అభిప్రాయము. మా వంశముకు ఎప్పటికి పోతరాజువారనే యింటిపేరున్నదిగాని వీరుకొందరు యేరుచూరినుండి లేచి యితరగ్రామములకు వెళ్లి కాపురముచేయుచున్నందున వారికిమాత్రము ఏరుచూరివారని యింటిపేరువచ్చినది అందువలననే యఱ్ఱాప్రగడ అనుకవీశ్వరుఁడు యేరుచూరునుండి యితరగ్రామముకు కాపురము వెల్లుటచేతనే యేరుచూరువారని ఇంటిపేరువచ్చినది.

పోతరాజు అనుపేరుగల మా వంశపురుషుఁడు ఒక ప్రతిష్ఠీకుడైనందున ఆయనపేరే మాయింటిపేరువచ్చినట్టు తెలియునుగాని అంతకు విశేషమేమియు చెప్పఁజాలము. మా వంశవృక్షము కొంతవఱకే యున్నదిగాని అంతబాగుగా పెద్దలు వ్రాసియుండలేదు. భాగవతములోచేరియున్న సింగన్న అనుకవి మా వంశములో వారేఅని చెప్పవచ్చును. ఏలనన ప్రస్తుతము కనుపించు మావంశవృక్షమందు సింగన్న అనుపేరువున్నది. మా గ్రామములో ఏర్చూరువారని ఇంటిపేరు గలవారు వున్నారుకాని వారిది శౌనకస గోత్రముగాన యేర్చూరు సింగన్న మా వంశములో వారేగాని యేర్చూరువారనిచెప్పే శౌనకసగోత్ర వంశీకులుకారు.

పై కారణములనుబట్టి యేర్చూరి సింగన్న అనే కవి సత్తెనపల్లి తాలూకా ఏర్చూరి కాపురస్థుడేకాని గోలకొండ డివిజన్ యేర్చూరి కాపురస్తుడు కాడు. మావంశమూలపురుషుఁడు పోతరాజుకున్ను బమ్మెర పోతరాజుకున్ను చుట్టరికము వుండవచ్చును. ఏలనన వారిదికౌండిన్యసగోత్రము అయియున్నది. కౌండిన్యసగోత్రులకు మాకు సంబంధములున్నవి.

ఇట్లు విధేయుఁడు,
పోతరాజు రామకవిగారిపుత్రుడు, చిన్నలక్ష్మీనారాయణవ్రాలు,
9-1-17.

అనుబంధము V.

సర్వోపనిషత్సార సంగ్రహము.

"శ్రీమద్వైభవప్రాభవే కృష్ణాగోదావర్యో ర్మధ్యప్రదేశే కతిపయగ్రామాగ్రగణ్యం । ఏకశిలానగరీనామక భువనగిరిరితి పుణ్యక్షేత్రంప్రసిద్ధం । తదీయాశీమాంతరాభిరామం వేంకటాపురం అనంతసిద్ధసంచారక్షేత్ర మితిప్రకాశమానం భవతి । తత్సిద్ధక్షేత్రేఅత్యున్నతం నిఖిలౌషధాశ్రయం శరభశార్దూలాద్యఖిల మృగనిలయం బహువిధగుహాపహాంధరాధర శృంగంశృంగారం భవతి॥ తస్మిన్నంధకారబంధురం । పరిపూర్ణామృతసరోవరాంతర్గతం । చిరకాల వృద్ధశిద్ధాశ్రయం ప్రాలేయాచలాంతం । మార్గనిర్గమంసకలకలుషౌఘ సంహార శ్రీమహాలక్ష్మీ నృశింహ్మవిహారగేహం ఏకంగిరిగంహ్వరం భవతి॥ తస్మిశ్శ్రీమహాలక్ష్మీ నృశింహ్వదేవః. అనంతసిద్ధజనబృందై రత్యంతార్చ నైర్నిత్యకృత్యైః ప్రకాశమానోభవతి........

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శా॥ శ॥ 1730. ప్రభవనామ సం॥ శ్రావణ శు 15-ల వఱకు వృద్ధమఱ్ఱి వెంకటరావుగారిచే రచియింపఁబడినది.

(ఈయన శ్రీ కృ. గోదావరిమధ్యమునందలి గోల్కొండపట్టణ సామీప్యమునన్న భోనగిరితాలూకాలో వృద్ధమర్రిపరగణా జమీందారున్ను దేశపాండ్యాయున్ను........వృద్ధమర్రి శాపురస్తులును............గురుదత్తాత్రేయుల వారి శిష్యుఁడు.)"

ఈ గ్రంథము సాహిత్యపరిషత్తువారు సేకరించిన యముద్రితగ్రంథములం దున్నది.

వా॥ సుబ్బరావు.

శ్రీరామాయనమః.

ఒంటిమిట్ట పోతనామాత్యుఁడు

తే. కూటసంగ్రామమున రిపుకోటి గెల్వ, నుత్సహించి విజృంభించుసుదురుమిడుకు
శక్రవైరిని గెలిచినసత్యరతులు, కరుణ రక్షింత్రు రామలక్ష్మణులు నన్ను.

మహాశయులారా!

బమ్మెర పోతనామాత్యుఁడు భాగవతమును రచించినస్థలము నిర్దేశింపఁ బ్రయత్నించి బ్ర॥ శ్రీ॥ జయంతి రామయ్యపంతులవా రోరుగంటివారివాదమును నొంటిమిట్టవారివాదమును వారికిఁ దెలిసినంత పరిశీలించి పోతరా జోరుగంటివాఁడని చెప్పుటే సమంజస మని యభిప్రాయ మిచ్చుటయు దానికి నేను బ్రత్యుత్తర మిచ్చుచుఁ బోతరా జొంటిమిట్టవాఁ డనిచెప్పుటే న్యాయ్య మని తగుకారణములు చెప్పియుండుటయు మీ రెఱింగియేయున్నారు.

ఇట్లుండ నింతలో రావుబహదర్ కందుకూరి వీరేశలింగముపంతులవా రాంధ్రకవులచరిత్రము మఱియొకసారి క్రొత్తకూర్పు ప్రకటించిరి. అందుఁ "బోతననివాసస్థలము నైజాముర్యాజ్యములోని ఓరుగల్లు. ఇదియే భాగవతమునం దేకశిలానగర మని చెప్పఁబడియున్నది" యని కంఠోక్తిగ సిద్ధాంతవాక్యములు వ్రాయుటేగాక "స్థలాభిమానము చేతఁ గొంద ఱిప్పటికిని పోతన జననభూమి కడపమండలమే యని వాదించువా రందందుఁ గనఁబడుచున్నారు. అందుచేత నట్టివారి భ్రాంతి నివారణార్థముగ బమ్మెర పోతననివాస మోరుగల్లని స్థాపించుటకుఁ దగినహేతువులను గొన్నిటి నిందుఁ జూపుచున్నాను" అని ప్రగల్భోక్తులు పల్కిరి. ఈ రావుబహదర్ వా రాంధ్రకవులచరిత్ర మనుగ్రంథము వ్రాసి చిరకాలముగ నాంధ్రలోకమున వ్యాపింపంజేసియుండుట మీ రెఱుంగనివిషయము గాదు. ఇట్టివా రిట్టిసిద్ధాంతవాక్యములను గ్రంథమునం దెక్కించినపుడు శ్రీకోదండరామస్వాములవారికృప యొంటిమిట్టపైఁ దప్పినట్టేకదా యెంచవలయును. చరిత్రములు సామాన్యముగా వ్రాయసకానియిష్టానిష్టములంబట్టి వ్రాయఁబడిన సత్యాసత్యములచేతను గల్పితములచేతను నిరాధారోహాపోహములచేతను బూరింపఁబడుట యందఱకుఁ దెలిసినవిషయమేకదా. వారి యిష్టము వచ్చినట్టు వారు వ్రాసినంతమాత్రమున వచ్చినలోటేమి యని మీ రనుకొనవచ్చును. చరిత్రశబ్దమున కింకను నొకగౌరవము కలదు. సత్యాన్వేషణ

పరులై విశేషవిమర్శనము చేసినవారుతప్పఁ దక్కినవారు చరిత్రములందుఁ జెప్పఁబడినవిషయములు సత్యములనియుఁ దద్గ్రంథకర్త లెంతో శోధించి పరిశ్రమించి వ్రాసిరనియుఁ దలఁచుచుందురు. సత్యమెఱిఁగినవారు నూటికి నొక్కరైన నుందురో యుండరో. తక్కినవారు గ్రంథస్థౌల్యము కర్తృప్రతిష్ఠఁ బట్టి చరిత్రమున నున్నదంతయు సత్యమేయని నమ్ముదురు. ఆకారణముచే సత్యముతో పాటు సత్యేతరములును లోకమునఁ బ్రతిష్ఠఁ గాంచును. సత్యమును విమర్శించి తెలిసినవారిలో నూటి కొకరెవరో వానిని వెలిఁబుచ్చఁగలుగుదురు. వారిలో నెందఱో నావలె నుదాసీనులు. తెలిసినవారైనను బత్రికలందో వ్యాసములుగనో విడివిడిగఁ బ్రకటించినయెడల నవి లోకమునసంతయు వ్యాపింపకయు వ్యాపించినను జిరకాల ముండకయు, నచిరకాలముననే విస్మృతమగును. గ్రంథరూపముగ నుండునది చిరకాలముండును. అసత్యములును నంతకాలము ప్రబలియే యుండును. కావున బ్ర॥ శ్రీ॥ జయంతి రామయ్యపంతులవారి వ్యాసమునకంటె మ-రా-శ్రీ, రావుబహాదర్ కందుకూరి వీరేశలింగముపంతులవారి చరిత్ర మెక్కువకీడు చేయునదై యున్నది. కావున వారు పోతనామాత్యునిగుఱించి వ్రాసినవ్రాఁత పరిశీలించి మనము సత్యమని నమ్మినదానిని లోకమునకుఁ దెలుపవలసినభారము మనయందున్నది.

ఆర్యులారా! కడపమండలమువారి భ్రాంతిని బోఁగొట్ట దీక్షవహించిన వీరు బ్ర॥ శ్రీ॥ జ. రామయ్యపంతులవారి వ్యాసమును జూచువఱకుఁ దామును నిట్టి భ్రాంతికి లోనై యుంటి మనియు, వారివ్యాసమును జూచి "మహాజనులిప్పుడు కన్నులు తెఱచి తమతొంటిప్రమాదమును దెలిసికొని పూర్వాభిప్రాయము మార్చుకొనుచున్నారు" గావున వారితోపాటు నేనును గన్నులు తెఱచికొని యింతవఱకు నేను వ్రాసినదానిని గొట్టివేసి దానిమాఱు పంతులవారువ్రాసిన విషయములను సంక్షేపించి వ్రాయుచున్నానని వ్రాసియుండిన సత్యముఁ జెప్పినవారై యుందురు. ఏలన వీరే 1911-వ సంవత్సరమున ముద్రించిన కూర్పునందును దత్పూర్వపుఁగూర్పునందును "బమ్మెర పోతరాజు. ఈతని నివాసస్థలము కడపమండలములోని ఒంటిమెట్ట. ఇదియే భాగవతమం దేకశిలానగర మని చెప్పఁబడియున్నది" అని కంఠోక్తిగ వ్రాసిరి. ప్రౌఢకవి మల్లన గుఱించి వ్రాయుచు "బమ్మెర పోతరాజువాసస్థానము కడపమండలములోని యొంటిమిట్ట" యని వ్రాసిరి. బ్ర॥ శ్రీ॥ జయంతి రామయ్యపంతులవారివ్యాసము వెలువడినపిమ్మట నిప్పుడు భ్రాంతిముక్తులమనుమహాభ్రాంతిలో మునిఁగి "కడపమండలములోని ఒంటిమెట్ట" అనుపదములకు మాఱుగ "నైజాము రాజ్యము

లోని యోరుగల్లు" అని వ్రాసిరి. ఆఱుసంవత్సరములకాలములోనే తమపూర్వగ్రంథములన్నియు లోకమున నశించిన వనియు నందలితమవ్రాఁతను దాఁచి తదజ్ఞత నభినయించుటచే నిప్పుడు దమ్ములోకులతిలోకులుగఁ దలంతురనియు వారునమ్మిరేని యింతకంటె భ్రాంతి వేఱొం డుండదు. వీరు పురాణము హయగ్రీవశాస్త్రులవారు వ్రాసినదానినిబట్టి పూర్వము వ్రాసిరి. ఇప్పుడు పంతులవారు వ్రాసినదానినిబట్టి వ్రాసిరి. పేరుమాత్ర మప్పుడిప్పు డెప్పుడు చెప్పినవారుగారు. ఎదుటివారివాదమును ఖండించినప్పుడుమాత్రము వారిపేరుతప్పక చెప్పుదురు.

తాము పోతనామాత్యునివాసస్థల మొంటిమిట్టయని పూర్వము వ్రాసియున్నట్టు లిప్పుడు చెప్పకుండుటకుఁ గారణము లేకపోలేదు. వీరిప్పుడు వ్రాసినవ్రాఁతలో "ఒంటిమెట్ట యెప్పుడును నేకశిలానగరము కాఁజాలదు. మెట్టయనుదానికి శైల మర్థమగునుగాని శిల యర్థముగాదు. ఒంటిమెట్ట యన్నచో నేకశైలగ్రామము గావచ్చునుగాని యేకశిలానగరము గాదు." "ఒంటిమెట్టకు సమీపమున గోదావరినది లేకుండుటయు" "ఒంటిమెట్ట యొకచిన్నగ్రామమే" ఇత్యాదివాక్యములు కానవచ్చుచున్నవి. "ఒంటిమెట్ట" యనిన నేకశైలగ్రామమును గాదు ఏకశిలానగరమునుగాదు. అది యెట్లయిన నగునుగాక. ఈవ్యుత్పత్తిజ్ఞానము రెండుసంవత్సరములక్రిందటివఱకు మీ కేల లేకుండెను? అప్పుడు "ఇదియే భాగవతమం దేకశిలానగర మని చెప్పఁబడినది" యని యొంటిమిట్టవిషయమై యేవ్యుత్పత్తినిబట్టి వ్రాసితిరి? ఒంటిమిట్టయొద్ద గోదావరి యీనాఁడు లేదా? రెండేండ్లకు ముందును లేదా? ఆవిషయ మెప్పుడు గ్రహించితిరి? అనియు, ఒంటిమిట్ట చిన్నగ్రామ మనునది యిటీవల రైల్వేగైడులో నొంటిమిట్టప్రక్కఁ జుక్కఁ జూచి తెలిసికొంటిరా యని యెవరైన నడుగుదురో యనుభీతిచేఁ బూర్వమేమియుఁ దాము వ్రాయనట్టు నిప్పుడే యవతరించినట్టు నటించిరి. శిలాశైలశబ్దములు పర్యాయములుగ వాడుట పూర్వభాగమున వచించితి. దానిని స్థాపింపఁ బంతులవారు చదివినగ్రంథములనుండి యొండు వారి స్మరణమునకుఁ దెచ్చెద.

మ. నరవక్షేందువిలాసకృన్నవనయోనస్నావసానంబునన్
వరుణీశైవసింధు లింకు నెసఁ దత్తత్కాలలక్ష్యంబులౌ
సరసాంతస్స్థితగండశైలములు లసన్ జందోయి యంతంతకున్
బరఁగెన్ దత్తనుశోభరేఖ లనఁ గప్పట్టెన్ వళీపుంజముల్. నరసభూపాలీయము.

గీ. ధవళలోచన శ్రీపర్వతంబు నుహిమఁ, బ్రస్తుతింపంగ శక్యమే బ్రహ్మకైన
గండశిలలెల్ల శంభులింగంబు లిందు, సిద్ధమును లిందుఁ జరియించు చెంచులెల్ల.
కాశీఖండము.

మీఁద ననువదించిన రావుబహాదర్ వారి ప్రతిజ్ఞావాక్యములు నన్నుద్దేశించి వ్రాసినను వ్రాయకున్నను నవి నాకును నన్వయించును గావునను, నీవాదమున దిగినవాఁడ నగుటను వీరివ్రాఁతయందలి చిత్రములు లోకమునకుఁ దెలుపకుండినచో నవియే విశ్వసింపఁబడును గనుకను, వీరివాదపద్ధతి విశదీకరించినఁగాని వీరి గ్రంథములు పఠించుటయందుఁ "గనులు తెఱచుకొని" లోకమువారు హెచ్చరికతో గ్రాహ్యముమాత్రమే గ్రహింపఁజాలకయుందురు కావునను బ్రత్యుత్తరమీయఁ గడఁగితిని.

పోతరాజోరుగంటివాఁ డని రావుబహాదర్ వారు చెప్పెడి కారణములు:—

(1) ఇంటిపేరునుబట్టి పోతన పితృపితామహాదులవాసస్థానము బమ్మెర గ్రామ మయినట్టు సులభముగాఁ దెలిసికొనవచ్చును. అతఁ డాగ్రామములోనే పుట్టినవాఁడైనను ఓరుగల్లు రాజనివాస మయినమహాపట్టణమయి యుండుటచేత భాగవతరచనకాలమున కక్కడఁ జేరియుండును. ఈబమ్మెరగ్రామ మోరుగంటికి మూఁడామడదూరములో నల్లగొండమండలమం దున్నది. బమ్మెర యను పేరుగలయూ రేదియు నొంటిమిట్టచేరువనుగాని తుదకుఁ గడపమండలములో నెక్కడనైననుగాని లేదు. అందుచేత భాగవతమందుఁ జెప్పఁబడిన యేకశిలా నగరము నైజామురాజ్యములోని యోరుగల్లేగాని కడపమండలములోని యొంటిమిట్ట కాదు."

(2) పకుర్చారు గోలకొండదేశములో నల్లగొండమండలమందును నారయగృహనామ మయినవెలిగందల కరీంనగరములోను రెండును బమ్మెరకు సమీపమున నున్నవి.

(3) కర్ణాటభాషలో "ఓరు" అనఁగా 'ఒక్క' కల్లు అనఁగా 'రాయి' అని యర్థము. అందుచేత నేకశిలానగర మనఁగా నోరుగల్లుపుర మనుట స్పష్టము.

(4) ఒంటిమెట్ట యెప్పుడును నేకశిలానగరము కాఁజాలదు.

(5) ఒంటిమెట్ట యొకచిన్నగ్రామమే కాని యెప్పుడును నోరుగంటివలె నగరమైనది కాదు.

(6) ఒంటిమెట్టకుఁ బూర్వకాలమందుఁగాని మఱియేకాలమందుఁగాని యేకశిలానగర మన్నపేరు లేదు.

(7) గౌతమినిసహితము గంగయనుట కలదు. ఒంటిమెట్టకు సమీపమున గోదావరినది లేకుండుటయు గోదావరీనది యోరుగంటికే సమీపముననే యుండుటయు విచారింపఁగా బమ్మెరపోతనామాత్యుని నివాసస్థల మైన యేకశిలానగర మోరుగల్లేగాని యొంటిమిట్ట గాదు.

(8) పోతనామాత్యుఁడు తనకవిత్వారంభదశలో గోలకొండ సీమలోని రాచకొండదుర్గాధీశ్వరుఁ డైన (రేచర్ల) రావు సింగభూపాలునిప్రేరణముచేత రచియించిన భోగినీదండకముకూడ నీమహాకవి యోరుగల్లుప్రాంతమువాఁ డని దృఢీకరించుచున్నది.

(9) గోలకొండదేశములో వాడుకలోనున్న "పాలకుర్తినిలయా సోమయలింగా పాదములకు శరణు. పురవుగ బమ్మెరపోతరాజుకు* మీరు కోరిన వరములు కృపచేసినారట। పాలకుర్తినిలయా"॥ అనుపాట

ఇవన్నియు రావుబహాదర్ వారివాక్యములు. ఈ వ్రాఁతయంతయు నా మిత్రుఁ డొక్కఁడు చెప్పినట్లు "రామయ్యపంతులవారి వ్యాసమునుచ్ఛిష్ట" మని మీరు నేను జెప్పకయే గ్రహింపఁగలరు. పరులయశస్సునకు హానిలేకుండఁ బూర్వులపద్యములు ననువదించిన గణపవరపు వేంకటపతి లోనగుకవులపై గ్రంథచౌర్యదోషము మోపినరావుబహాదర్ వారివ్రాఁతలయం దంతకన్న నెక్కువ పశ్యతోహరత్వము గానవచ్చుట శోచనీయము. దీనికిఁ గారణము లేకపోలేదు. రామయ్యపంతులవారివాదము పత్రికయందు బ్రకటింపఁబడుటచే నది కొలఁది కాలములోనే యెందో మూలఁబడును. లోకమునకు గోచరింపదు. గ్రంథస్థమైయుండినఁ జిరకాల ముండును. అని రావుబహాదర్ వారియుద్దేశమై యుండవచ్చును. ఇది మంచియుద్దేశమే కాని స్వయముగ దేశాటనముచేసి మనుష్యులఁ బంపి యాధారముల సంపాదించినవారిపేరు మూలఁబడి తమ పేరుమాత్రము బయటికి రావలయు నని చేయుయత్నము శ్లాఘ్యము కాదు. అయినను నీవిషయమున దొంగిలింపఁబోయిన మంగలమే దొరకిన దన్న సామెత వీరియెడ నిజమైనది.

రామయ్యపంతులవారు వ్రాసినవానినే వీరు వ్రాసినను వారివ్యాసమున సత్యమునందు దృష్టియు ఋజుపద్ధతి యున్నట్టు స్పష్టముగాఁ దోఁచుచున్నది. రావుబహాదర్ వారివ్రాఁతయందుఁ దద్విరుద్ధము గానవచ్చుచున్నది. ఎట్లన పంతులవారు "బమ్మెరయనుగ్రామము..........చేర్యాల తాలూకాలోనున్నది.

* మూలమునందు 'బొమ్మెరపోతరాజు' కనియే యున్నది మూలమునకు విరుద్ధము లైనయను వాదములు, నొకగ్రంథమున నుండుపద్యముల మఱియొకగ్రంథములో నున్నట్లు వ్రాయుటలు, తమవాదమున కనుకూలపడునట్లు ముందున్నవారిని వెనుకటి వారిగ వెనుకటివారిని ముందుగా నున్నట్టు వ్రాయుటలు లోనగునవి యాంధ్రకవులచరిత్రనుండుఁ గానవచ్చుకరలాఘవములు. ఈపాటయందు సోమయలింగనాథుఁడు పోతరాజునకు వరమిచ్చినట్లుండుటచేతను వీరభద్రవిజయకర్తయగుసోమనాథదేవభక్తుఁడగుటను నీపాట వీరభద్రవిజయకర్తకన్వయించు నేమోగాని భాగవతగ్రంథకర్తకన్వయింపదు.

దీని చుట్టుప్రక్కల జనులు సాధారణముగ బొమ్మెర యని పిలుతు"రని వ్రాసిరి. దీని వలనను వారు ప్రకటించిన యనుబంధమువలనను ప్రకృత మందున్న గ్రామము బొమ్మెరయే కాని బమ్మెర కాదని స్పష్టపడియెఁగదా. ఈవిషయమై నేను వ్రాసిన ప్రత్యుత్తరము మీరు చదివియే యున్నారు.

ఇఁక రావుబహాదర్ వారో "ఈ బమ్మెర గ్రామము మోరుగంటికి రమారమి మూఁడామడదూరములో నల్లగొండమండలమం దున్నది." అని యెక్కడ వ్రాసినను బమ్మెర యనుగ్రామము నేఁడున్నట్టే వ్రాసిరి. పంతులవారివ్యాసము చదువనివారికి దీనివలన నేమి యర్థమగును? బమ్మెరగ్రామము నేఁడున్నట్లే కదా బోధపడును. అట్టిది లేదని యెఱిఁగియెఱిఁగి యిట్లు వ్రాయుట లోకవంచనము మాట యేల యాత్మవంచనము కాదా? వీ రుద్దేశించినట్లు పంతులవారి వ్యాసము మూలఁబడి వీరిమిథ్యాగ్రంథమే లోకమున నిలిచిన నెంతయసత్యము లోకమున స్థిరపడునో యోరుగంటిమిట్టవారివాదమున కెంతహాని ఘటిల్లునో చూచితిరా. బొమ్మెరవాసులు తమగ్రామముపేరు బొమ్మెర యనుచుండ వీరు దానిని నిరాధారముగ బమ్మెర యనుట యెంతసాహసము! ఇట్టి వాదములచేత నోంటిమిట్టవాదుల భ్రాంతిఁదొలఁగింపఁ రావుబహదర్ వారు పూనుకొనుట దున్నపోతుతోఁకను బట్టుకొని మహార్ణవ మీఁద యత్నించుటే.*

---

* బ్రహ్మశ్రీ రామయ్యపంతులవారు తమవ్యాసమునకు ప్రకటించిన అనుబంధముల "బమ్మెర పోతరాజు బొమ్మెరలో ప్రస్తుత మున్న వెల్లూర్లవారివంశీకుఁడు."

"పోతరాజుగారు బొమ్మెరనివాసియే యని ప్రకాశ్యతికలదు."

"పోతరాజుగారిది యిదే బొమ్మెర."

"పోతరాజుగారినివాసం యిక్కడనే నని నిశ్చయం అందరు అంటారు" అను నిత్యాది వాక్యములు కానవచ్చుచున్నవి కాని యొకస్థలమందైన నీబొమ్మెరకే పూర్వకాలమందు బమ్మెర యనుపే రుండె నని చెప్పఁబడి యుండలేదు. దీనివలన బొమ్మెర యనాదిగ బొమ్మెర యనుపేరనే పిలువఁబడుచున్నదని యు బమ్మెర యనుపే రున్నట్లు లెవ్వ రెఱుఁగ రనియుఁ గదా గ్రహింపవలసి యుండును. ఓరుగంటివాదులు తమవాదమున కేదో యొకబలము కల్పింపవలయునని నామమునఁ గలకించిత్సామ్యమునుబట్టి బొమ్మెరయే బమ్మెర యనుచున్నారు. బమ్మెరపోతరాజు బొమ్మెరయం దున్నాఁ డనినంతమాత్రమున బొమ్మెర బమ్మెర కాఁజాలదు. కందుకూరి వీరేశలింగముపంతులవారు రాజమహేంద్రవరమున నున్నంతమాత్రమున రాజమహేంద్రవరము కందుకూ రగునా? నేఁ డీయూర నున్నంతమాత్రమునఁ జెన్నపుర వావిలికొలను నగునా? ఏ నాఁడును గాఁజాలవు. కావున నిప్పటిబొమ్మెరకుఁ బూర్వనామము బమ్మెర యని లిఖితసాక్ష్యము దొరకువఱకు రెండుభిన్నములనియే గ్రహింపవలయును. బమ్మెర బొమ్మెర కాదని వాదించువీరు వెలిగండ్ల వెలిగందల యొకటేయని యెట్లు వాదించెదరని వేంకటరమణకవులు నన్నాక్షేపించిరి. సత్యము. నేను వెలిగందలను వదలితిని. తాము బమ్మెరను వదలుదురుగాక. తరువాత నోరుగంటివారివాద మెన్నికాళ్ల నర్తించునో చూతము.

"అతఁ డాగ్రామములోఁ బుట్టినవాఁడైనను, ఓరుగల్లు రాజనివాసమైనమహాపట్టణ మయియుండుటచేత భాగవతరచనాకాలమున కక్కడఁ జేరి యుండును" అని రావుబహాదర్ వారు వ్రాసిరి. "అతఁ డాగ్రామములోఁ బుట్టినవాఁడు" అని నామకరణమునాఁడు తా మచట నుండి కనులారఁ జూచినట్లు వ్రాసినవారివ్రాఁత కెవ్వ రేమి బదులు చెప్పఁగలరు? కాని మహాపట్టణమందుఁ గాని గ్రంథరచన సాగదు కాఁబోలు. అంతటిమహానగరమధ్యమున నుండు వారికి స్వయంకృషివలన జీవనము చేయ సాధ్యపడునా? పోతనవలె సొంతసేద్యముచే జీవించువారు మహానగరమధ్యమందు వాసము సేయుచుండుట యెందైనఁ గలదా? ఓరుగల్లు రాజనివాస మఁట. ఆ కాలమున నోరుగంటిరాజు పేరేమని వారిని నడుగుచున్నాను. రావుబహాదర్ వారివాక్యమునకుఁ బ్రతిబింబముగ నేనొకవాక్యము వ్రాసెదను. "రావుబహాదర్ కందుకూరి వీరేశలింగము పంతులవారు పూర్వము కడపమండలములో నుండి యిప్పుడు చిత్తూరుమండలములోఁ జేరినకందుకూరుగ్రామములోఁ బుట్టినవారు. అయినను గోదావరి మహానది గనుక రాజమహేంద్రమునఁ (రాచకొండ) జేరియుందురు" ఇం దెంత సత్యమెట్టియుక్తి యున్నదో యంతసత్య మట్టియుక్తియే రావుబహాదర్ వారివాక్యమందును గలదు. రాజమహేంద్రమన రాచకొండ. సర్వజ్ఞసింగమనాయఁ డుండినస్థలము. వేదాంతదేశికులవారి సుభాషితనీవి వ్యాఖ్యోపోద్ఘాతములో నుండు "రాజమహేంద్రవర నగరస్థితసర్వజ్ఞసింగక్షమావల్లభేన" యనుచోటను రాజమహేంద్ర మనియే యుండనోపు. ఇది క్లిష్టముగా నుండుటచేతను రాచకొండ యునికి యీప్రాంతమువారికిఁ దెలియకుండుటచేతను గాఁబోలు రాజమహేంద్రవరమని సవరింపఁబడియుండును. బ్ర॥ శ్రీ॥ సదాశివశాస్త్రులవారీసమాధానము తాము వ్రాసినదానికిఁ జెప్పిరి. "బమ్మెర యనుపేరుగల యూరేదియు నోంటిమిట్టచేరువనుగాని తుదకుఁ గడపమండలములో నెక్కడనైనను గాని లేదు" అని రావుబహాదర్ వారు వ్రాసిరి. బమ్మెర యనుగ్రామ మోరుగంటిచేరువను గూడ లేదని నేను జెప్పెదను. నల్లచీర కట్టుకొన్నవా రందఱు నా పెండ్లాలే యన్నట్లు బకార, మకార, రకారములు గలగ్రామములన్నియు బమ్మెరలే యని యోరుగంటివాదులవలె నేను వాదింపఁబూనినచో నోంటిమిట్టకు రమారమి 30 మైళ్ల దూరములోఁగల బొమ్మవర గ్రామమునే బమ్మెరయని చెప్పియుందును. బకార మకార రకారము లందును గాన నగును. ఓరుగంటివాదులవలె నేనును గించిద్రూపసామ్యము నాధారముగఁగొని వాదింపఁ దలఁచియుండినచో బమ్మెరయే బొమ్మరమైనదని బొమ్మర కర్థము లేదని 'హామ్లెట్ బ్రిడ్జి' 'అమటర్ వా

రాననీ' 'సెంటుఅంథ్రాన్ పేట' చింతాద్రిపేట "గోల్డులింగ్‌హామ్" గుల్లో లింగ మయినట్లు బమ్మెర బొమ్మెర బొమ్మర బొమ్మనర మయినదని వాదించి దానికిఁ దగిన యాధారములు కనఁబఱిచియుందును. నాయంతఃకరణమట్టి వాదమున కీయ కొనదయ్యె.

వీరి 2,3,4,5,6,7,8 కారణములు పూర్వభాగమున ఖండించియున్నాను. రామయ్యపంతులవారు చెప్పని కారణ మొకటి యెక్కువగ రావుబహదర్ వారు చెప్పిరి. భాగవతకర్త యగుపోతనామాత్యుఁడే వీరభద్రవిజయమునకుఁ గర్తయని వీరు వ్రాసిరి. వీరి 10-వ కారణమును ఖండించుటకు ముందు వీరభద్రవిజయాంధ్రభాగవతగ్రంథకర్త లొక్కరా యిరువురా యనుట విమర్శింపవలయును. ఈ విమర్శనిమిత్తమై యీ వ్యాసము వ్రాయవలసివచ్చెఁగాని లేనియెడల రావుబహదర్ వారికిఁ బ్రత్యుత్తరమీయఁ బనియే యుండదు. రావుబహదర్ వా రాంధ్రకవులచరిత్ర పూర్వముద్రణమందు:—

"ఈకవి భాగవతము రచియించినతరువాత వీరభద్రవిజయ మనుమఱియొకగ్రంథమును రచియించెను. భాగవతచతుర్థస్కంధమందలి దక్షయజ్ఞకథలో "అనయంబులుప్తక్రియాకలాపుఁడు మానహీనుఁడు మర్యాద లేనివాఁడు మత్తప్రచారుఁ డున్మత్తప్రియుఁడు" అనియు "వసుధ నెవ్వారు ధూర్జటివ్రతులువారు, వారికనుకూలు రగుదు రెవ్వారు వార లట్టిసచ్ఛాస్త్రపరిపంథు లైనవారు, 'ననిఁ బాషండు లయ్యెద' రనియు శివదూషణము విశేషముగఁ జేయఁబడియుండుటచేఁ దత్పాపపరిహారార్థముగ వీరభద్రవిజయమును జేసిన ట్లాపుస్తకములోని యీ క్రిందిపద్యమునందుఁ జెప్పఁబడి యున్నది.

ఉ. భాగవతప్రబంధ మతిభాసురతన్ రచియించి దక్షకృ
ద్యాగకథాప్రసంగమున నల్పవచస్కుఁడ నైతిఁ దన్నిమి
త్తాగమవక్త్రదోషపరిహారరతన్ కై యజనైకశైవశా
స్త్రాగమవీరభద్రవిజయంబు రచించెద వేడ్కతోడుతన్"

అని రావుబదర్ వారు వ్రాసిరి. ఇప్పటికూర్పునందును నీమాటలే యున్నవి. 'పరహారత' యనుప్రయోగమే యిది భాగవతకర్త రచించినపద్యము కాదని వేనోళ్లఁ జాటుచున్నది. ఈ పద్యము వీరభద్రవిజయకర్తదఁట. దానిపై సూహ రావుబహదర్ వారిది. వీరు గొన్నిసంవత్సరములక్రిందటఁ దొలికూర్పునందు వ్రాసిన దానిని ఖండించుచు గురుజాడ శ్రీరామమూర్తిపంతులవారు "వీరభద్రవిజయ వివేక" మని యొక దీర్ఘవ్యాసము వ్రాసిరి. అది వారికవిజీవితము

622-642-వ పుటలయందుఁ గన నగు. వా రుపసంహారమందు "కావున నీ రెండుకథలను జెప్పినవా రొకరు కాక యిరువురు వేర్వేఱుకవు లని నిర్ణయించి యీ గ్రంథము నవీనమనియుఁ గల్పిత మనియు సిద్ధాంతీకరించెదను" అని వ్రాసిరి. తనవాదము పూర్వపక్షమైనపుడు మరల సిద్ధాంతము చేసికొనుటొండె సవరించుకొనుటొండెఁ జరిత్రకారులకు విధియై యుండ రావుబహదర్ వారు తాము ఖండింప సాధ్యమైనచో వారియితరవాదముల ఖండింప యత్నించియు నీవిషయమున మౌనమువహించి ప్రత్యుత్తరమీయక సవరించుకొనక మొదటిపాటనే యిప్పటికిఁ బాడుచున్నారు. చరిత్రకారుల కిట్టిపట్టుదల దగునా? వారు తమకుఁ దెలిసినంతవఱకు సత్యమును లోకమున కెఱిఁగింపవలయును గాని తాము వ్రాసినది తప్పైనను నెదుటివా రాక్షేపించి రనినకారణముచేఁ దానుబట్టినకుందేటికి మూఁడే కాళ్లనవచ్చునా? అట్లు లందు రేని యిట్టితప్పులతడకను లోక మేల యాదరింపవలయును? వీరభద్రవిజయమును సాంతముగఁ జదివినపిమ్మట శ్రీరామమూర్తిపంతులవారి యభిప్రాయమే సరియని నాకును దోఁచినది. ఆగ్రంథము చదివినయెల్లర కట్టులే తోఁపఁగలదు. దానికి నాకుఁదోఁచిన కారణములు చెప్పెదను. ఇందుఁ గొన్ని శ్రీరామమూర్తిపంతులవారివ్యాసమందున్నవి. అందు లేనివి కొన్ని యిందుఁ గలవు. కావున సత్యజిజ్ఞాసువులు వీరభద్రవిజయ వివేకముఁగూడఁ బఠింప బ్రార్థితులు.

"అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మానహీనుఁడు మర్యాద లేనివాఁడు మత్తప్రచారుఁ డున్మత్తప్రియుఁడు" లోనైనవి విశేషశివదూషణములఁట.

ఆర్యులారా! యాంధ్రభాగవతము సంస్కృతమునకుఁ బరివర్తన మనుట మఱవకుఁడు. మూలగ్రంథమున నున్నవాక్యముల నున్న దున్నట్లు చెప్పుట కవికి విధి యనుటయు మఱవకుఁడు. అట్లైనచో నందలి యభిప్రాయముల కాంధ్రకవి యుత్తరవాది కాఁడనుట మీరును నంగీకరింతు రని నమ్మెద.

శ్రీభాగవతే చతుర్థస్కంధే - ద్వితీయోఽధ్యాయః.

"శ్రూయతాం బ్రహ్మర్షయో మే సహదేవా స్సహాగ్నయః
సాధూనాం బ్రువతో వృత్తం, నా జ్ఞానా న్నచ మత్సరాత్
అయంతు లోకపాలానాం యశోఘ్నో నిరపత్రపః
సద్భి రాచరితః పంథా యేన స్తబ్ధేన దూషితః
ఏష మే శిష్యతాం ప్రాప్తో య న్మే దుహితు రగ్రహీత్
పాణిం విప్రాగ్నిముఖత స్సావిత్ర్యా ఇవ సాధువత్

గృహీత్వా మృగశావాక్ష్యాః పాణిం మర్కటలోచనః
ప్రత్యుత్థానాభివాదార్హే వాచాప్యకృత నోచితమ్
లుప్తక్రియాయాశుచయే మానినే భిన్నసేతవే
అనిచ్ఛన్నప్యదాం బాలాం శూద్రాయేవోశతీంగిరః ౧౩
ప్రేతావాసేషు ఘోరేషు ప్రేతైర్భూతగణైర్వృతః
అటత్యున్మత్తవన్నగ్నో వ్యుప్తకేశో హసన్ రుదన్ ౧౪
చితాభస్మకృతస్నానః ప్రేతస్రఙ్నృస్థిభూషణః
శివాపదేశో హ్యశివో మత్తో మత్తజనప్రియః
పతిః ప్రమథభూతానాం తమోమాత్రాత్మకాత్మనామ్ ౧౫
తస్మా ఉన్మాదనాథాయ నష్టశౌచాయ దుర్హృదే
దత్తా బత మయా సాధ్వీ చోదితే పరమేష్ఠినా ౧౬

శ్రీధరీయవ్యాఖ్యయందు ౧౩-౧౪-౧౫-౧౬ శ్లోకములకుఁ దొలుత శబ్దార్థము వ్రాయఁబడినది. ఆవల వాస్తవార్థ మని

"వాస్తవ స్త్వయ మర్థః లుప్తాః క్రియా యస్మిన్ పరబ్రహ్మరూపత్వాత్ । అత ఏవ నాస్తి శుచి ర్యస్మాత్ । అమానినే అభిన్నసేతవే ఇతి ఛేదః । తస్య పరమేశ్వరస్య మదీయా మానుషీ కన్యా కథం యోగ్యా స్యా దితి లజ్జాదినా దాతుమనిచ్ఛన్నపి తత్సంబంధలోభేన దత్తవాన్ । శూద్రా యేత్యసర్వత్వమాత్రే దృష్టాంతో న హీనత్వే పూర్వాపరస్వవచన విరోధాపత్తేః । ఏతదుక్తం భవతి । యథా కశ్చి చ్ఛూద్రాయ వేద మర్థలోభేన దదాతి తద్వ దితి । ప్రేతావాసేష్విత్యాది సర్వం విడంబనమాత్ర మితి స్వయమేవాహ । ఉన్మత్తవదితి. అనన్యోన్మత్త ఇత్యేవానద్యేత్. అశివో నాస్తి శివో యస్మాదితి. అమత్తోఽమత్తజన ప్రియఇతి ఛేదః । పతిః ప్రమథభూతానా మితి భక్తవాత్సల్యమాహ । తామసా నపి దోష మపనీయ పాతీతి । నష్టానా మపి శౌచం శుద్ధిర్యస్మాత్ । దుష్టేష్వప్యేతే మ యానుకంపా్య ఇతిహ్యాన్తరో యస్య సదుర్హృత్తస్మై । బతేతి హర్షే । బ్రహ్మణో వాక్యా ల్లజ్జాభయాదికం పరిత్యజ్య దత్తే త్యర్థః"
యిట్లు వ్రాయఁబడినది.

మీఁదిశ్లోకములకుఁ దెలుఁగు.

తే. వినుఁడు మీరలు రోదమాని విబుధమునిహుత
 తాశనాదిసురోత్తములార! మోహ
 మత్సరోక్తులు గావు నామాట లనుచు
 వారి కండఁగఁ గాఁపురమైరిఁ జూపి.

సీ. పరికింప నితఁడు దిక్పాలయశోహాని, కరుఁ డీక్రియాశూన్యపగుని చేతఁ
 గర మొప్పు సజ్జనాచరితమార్గము దూషి, తం బయ్యె నెన్న గణత్రపుండు
 మహితసావిత్రీసమానను సాధ్వి న, న్మత్తనూజను మృగశాబనేత్ర
 సకలభూమీసురజనసమక్షమున మ, ర్కటలోచనుఁడు గరగ్రహణబుద్ధిఁ
గీ. జేసి తాశిష్యభావంబుఁ జెందు టాత్మఁ, దలఁచి ప్రత్యుద్గమాభివందనము లెలమి
 నడుపకుండిన మాననీ నన్నుఁ గన్న, నోరిమాటకుఁ దన కేమి గోరవో యొ.
సీ. అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మాన, హీనుఁడు మర్యాద లేనివాఁడు
 మత్తప్రచారుఁ డున్మత్తప్రియుఁడు దిగం, బరుఁడు భూతప్రేతపరివృతుండు
 దామసప్రమథభూతములకు నాథుండు, భూతిలిప్తుం డస్థిభూషణుండు
 నష్టశౌచుండు నున్మదనాథుఁడును దుష్ట, హృదయుఁడు గ్రుడును బరేతభూని
గీ. కేతనుఁడు వితతప్రస్తకేశుఁ డశుచి, యయిన యితనికి శివనామముఁ డనుప్రవాద
 గలిగెఁ గాని యశివుఁడని కాన కెఱిఁగి, యెఱిఁగి వేదంబు శూద్రున కిచ్చినటులు.

భాగవతము.

N. B. 'ప్రవాద మెటులుగలిగె'నని వావిళ్లవారిపాఠము.

వ. ఇతనికి నస్మత్తనూజను విధిసత్ప్రకారంబున నిచ్చితి.

N. B. విధిప్రేరితుండ నయి యిచ్చితి నని వావిళ్లవారిపాఠము.

భృగుశాపఘట్ట శ్లోకములు.

"భవవ్రతధరా యేచ యేచ తా న్సమనువ్రతాః
 పాషండిన స్తే భవేయు స్సచ్ఛాస్త్రపరిపంథినః
 నష్టశౌచా మూఢధియో జటాభస్మాస్థిధారిణః
 విశన్తు శివదీక్షాయాం యత్ర దైవం సురాసవమ్
 బ్రహ్మచ బ్రాహ్మణాంశ్చైవ య ద్యూయం పరినిన్దథ
 సేతుం విధరణం పుంసా మతః పాషండ మాశ్రితాః॥

వీనికిఁ దెనుఁగు

గీ. వసుధ నెవ్వాగుఁ ధూర్జటివ్రతులువారు, వారికనుకూలురగుదు రెవ్వారువారు
 నట్టిసచ్ఛాస్త్రపరిపంథులైనవారు, నవనిఁ బాషండు లయ్యెద రని శపించె.

భాగవతము.

రావుబహాదర్ వారు పోతనామాత్యుని మీఁద మోపిన శివనిందాదోషవిషయమైనవాక్యములఁ బూర్ణముగ ననువదించితి.

తొలుత శివనింద చేసినవాఁడు దక్షుఁడు. ఆయనవాక్యముల ననువదించినఋషి వ్యాసులు. ఆ వాక్యములు తెనుఁగునఁ బరివర్తనము చేయఁబడెను.

ఆంధ్రకవి తనకృత్యమును నెఱవేర్చెను. శివుని దూషింపవలయు ననుతలం పాయనకు లేదు. ఆ కారణముచేఁ బాప మాయన నంటఁ గారణము లేదు. కావున నాయనకుఁ బాపభీతియు లేదు. ఈ విషయమునఁ బోతనామాత్యుఁడు చేసినది పాపమేని పూర్వపు సంస్కృతాంధ్రశ్రీభాగవతములు టీకాటిప్పణులపై వ్రాసినవా రందఱు పాపాత్ములే. అచ్చుకూర్చినవారు పాపాత్ములే. చిత్తులు సవరించినవారు పాపాత్ములే. పౌరాణికులు పాపాత్ములే. భాగవతము పారాయణము చేయువారు పాపాత్ములే. ఆ వాక్యములను మరల వ్రాయుటచే రావుబహాదర్ వారును బాపాత్ములే. ఆ వాక్యములందుఁ బాపశంక లేదుగావున నాకుఁ బాప భయము లేదు. రావుబహాదర్ వారు తుదకు శ్రీభాగవతమును గాటేరిగాఁ దేల్చిరి. ఎదుటఁ బడినవారి నెల్లఁ బీడించునది యదియేకదా.

ఈ పద్యములు పోతనామాత్యుఁడు వ్రాసినవే యనుకొన్నను నాయన శ్రీధరీయవ్యాఖ్యానము ననుసరించినవాఁ డగుటచేతను శ్రీధరాచార్యులవాక్య ములకు స్తుతిసిందగా వ్యాఖ్యానము చేసియుండుటచేతను నీపద్యములు వ్రాయు నపుడు తాను దేవహేళనము చేయుచున్నతలం పాయనకుఁ బుట్టనే లేదని యాయన వ్రాసిన "ఇట్లు దక్షుండు పల్కిన గర్హితవాక్యంబులు వినిందితంబు లగుంగాని రుద్రునందు ననిందితంబులై స్తుతిరూపంబుల నొప్పె" ననువాక్య ములు ఘోషించుచున్నవి.

వీరరాఘవీయవ్యాఖ్యయందు శ్రీధరీయవ్యాఖ్యయందలి వాస్తవార్థ మనుభాగము పూర్వపక్షము చేయఁబడి "తస్మా ద్యథోక్తవ వార్థ" అని దూషణ పరముగానే యర్థము వ్రాయఁబడలేదా యని రావుబహాదర్ వా రడుగుదు రేని యీవ్యాఖ్యాన మప్పటికిఁ బుట్టనే లేదనియు నద్వైతి యగుపోతరాజు శ్రీధరీ యమే యాధారముగఁ గొని తనగ్రంథము రచించె ననియుఁ బ్రత్యుత్తరము.

దీనివలనఁ బోతనామాత్యునకుఁ దా నీ భాగము రచించినపుడు తాను శివనింద చేయుచున్నాఁడ ననుభీతి కలుగఁ గారణము లేదా యెంగదా? అప్పుడు లేనిసందేహము భీతి యానల నెప్పు డెట్లంకురించెనో. ఒకవేళఁ గలిగెనందము. అది యెప్పుడు గలిగి యుండవలయును? వీరభద్రవిజయ మెప్పుడు రచియింపఁ బడి యుండవలయును? ఆంధ్రభాగవతగ్రంథ మంతయు సాంతమైన తరువాత నా? కాక మున్దా? భాగవతము పూర్ణము కాకముం దందమా యాతరువాత నా పద్యములను సవరించియే యుండునుగాని భాగవతము నావలఁ గట్టిపెట్టి వీరభద్రవిజయము రచియించి యుండఁడుగదా? సాంతమైనతరువాత నన్నను

గోరఁ బోవుదానికి గొడ్డలి తెచ్చినట్లు పద్యములు సవరించినఁ బోవుదానికి వేఱుగ్రంథము రచింపవలయునా? రావుబహాదర్ వారి కవుల చరిత్రమువలె వ్రాఁతయు ముద్రణము సమకాలమున నడచి భాగవతము లోకమున వ్యాపించి యుండెనా? ఆయన వ్రాసినప్రతియే యాయనమరణానంతరము వెలుపలవచ్చి యుండఁగా గ్రంథము లోకమున వ్యాపించియుండుటచేఁ దనప్రతిలో సవరించి కొని ప్రయోజనము లేదని వీరభద్రవిజయము వ్రాసె ననుయుక్తికిఁ బ్రమేయము లేదుగదా? అటు గాదు, సింగభూపాలుఁడు భాగవతపుస్తకమును బూడ్చించి యుండుటచే దానిలో సవరింపవలను పడ లేదందు రేని యంతటిపుస్తకము పోయిన దుఃఖములో మునిఁగియుండువాని కీయల్పగ్రంథము వ్రాయ మనశ్శాంతియైనఁ గలిగియుండునా? అప్పు డిట్టి చోట నిట్టిపద్యము వ్రాసితి నని మనస్సునకైన స్ఫురించియుండునా? స్ఫురించినచో గ్రంథముతోపాటు పద్యములు పోయినవని యూరకుండక మరలఁ గవిత్వము చెప్పియుండునా? ఇవన్నియు నసంభవములు.

సర్వజ్ఞసింగమనాయఁడు భాగవతమును బూడ్చించె ననుమాట విశ్వాస పాత్రము కాదని నా యభిప్రాయము. ఏలయందురా? అంతటి గొప్పవిద్వాం సుఁడు ప్రభువు సత్ప్రభు వని పేరుపొందినవాఁడు దుష్టుఁ డని పేరొందనివాఁడు భాగవతమువంటిగ్రంథమును నల్పకారణముచేఁ బూడ్చించె ననుట నమ్మఁదగి నది కాదు. భాగవతము తన పేర నుండవలయు ననుసంకల్ప మాయన కుండి నచో దానిని దానే రచించియో రచియింపించియో వేలకొలఁది ప్రతులు సిద్ధము చేయించి పోతనభాగవతము మూలయింటనుండఁగనే లోకమున వ్యాపింపఁజేసియుండును. ఇది యొకయోజన.

రెండవయోజన:—సింగమనాయఁ డాగ్రంథమును బూడ్చింపుటకు నా గ్రంథ మాయన కెట్లు లభ్యపడెను? ఆయనను దూషించి ద్వేషించినపోతన యాయనయొద్దకుఁ దనగ్రంథమును దీసికొనిపోయి యుండఁడుకదా? ఆయన యోరుగంటికిఁ బోతన యుండునింటికిఁ బోయి బలాత్కారముగ గుంజుకొని తెచ్చి పూడ్చించె నందమా. అప్పు డోరుగల్లు తురకలస్వాధీనములో నుండెను. తురకలు హిందువులు బద్ధవైరులై యుండిరి. అట్టిస్థితిలో నచ్చటి కాయనపోయి యేయుండిన వా రాయనను మరల నింటికి రానిచ్చియుందురా? అంతియగాక తమరాష్ట్రములోని యొకని నందు సుప్రసిద్ధకవిని మఱియొకఁడు వచ్చి (యందు శత్రువు) బాధించుచుండిన నాప్రభు పూరక చూచుచుండునా? మన యింటి లోనైన మన మట్టికార్యము సహింతుమా? (ఈ వాదమే యొంటిమిట్టవిషయ

మందును సమన్వయించును.) కావున సింగమసీయఁ డాగ్రంథమును గనులనైనఁ జూచియుండఁడు. ఇఁకఁ బూడ్పించుటెట్లు? కవి ప్రసిద్ధుఁడు కావున నతనిగ్రంథము తనకిమ్మని సింగమనాయఁడు చెప్పిపంపియుండవచ్చును. పోతన నిరాకరించియుండవచ్చును. ఇది యెఱిఁగినలోక మాంధ్రదేశదౌర్భాగ్యముచేఁ గాఁ గాలాంతరమున నాగ్రంథము శిథిలముకాఁగాఁ గాకతాళీయముగ దోషము సింగమనేనియం దారోపించియుండ వచ్చును.

ఒకవేళ భాగవతము సింగమనీనిచేఁ జిక్కియుండె యాయన దానిని రూపుమాప సమకట్టెనేని వెంటనే చించివైచియో తగులఁబట్టియో ధ్వంసముచేయక యీద్రావిడప్రాణాయామ మేల చేసియుండును? ఇది కొంగనుబట్టెడి యనువుకాదా? బెదరింపునకైనచోఁ దనపెట్టెయందే పదిలపఱిచియుంచును, భూమిలోఁ బూడ్చినఁ బత్త్రములు నాశమగునని యాయన యెఱుఁగఁడా? ఆ యనగ్రంథము నశింపుచేసిన నన్నయ్యకు వచ్చినయపఖ్యాతి బ్రహ్మహత్య తనకు వచ్చునని వెఱచియుండఁడా? ఆయన భార్యకలలో గోచరించినసీతాదేవి సగముగ్రంథము నాశమగువఱకు నేల కాచియుండెనో. ఇది మూఁడవయోజన.

ఇత్యాదికారణములచే భాగవతము తత్కవికాలములో శిథిలమయ్యెననుమాట నమ్మరాదు. శిథిలమే కాకుండినచోఁ బ్రస్తానపద్యములు దుష్టములని యాయనకుఁ దోఁచియేయుండిన సవరించుకొన నేయాక్షేప ముండదు. తొలుత నాయన వ్రాసియేయుండఁడు.

పోతన జీవితకాలములో భాగవతము శిథిలము కాలేదని నీవే యంగీకరించితివికదా? దానివలన నాయనకు మనోవ్యాకులతకుఁ గారణము లేదాయెఁగదా? కావున స్థిరచిత్తుఁడయియే వీరభద్రవిజయము రచియించెనని యేలచెప్పరాదని రావుబహదర్ వా రాక్షేపింతురు కాఁబోలు. పోతనామాత్యునకుఁ బాపభీతియే లేదని నా వాదము కావున నీప్రశ్నకవకాశమే లేదని నాప్రత్యుత్తరము.

2. "అనయంబు లుప్తక్రియాకలాపుఁడు మానహీనుఁడు మర్యాద లేనివాఁడు" అని వ్రాసినదానికై నగచి తద్దోషపరిహారార్థము వేఱొకగ్రంథము రచియించియుండినచో నీపోతనామాత్యుఁడే

సీ. "మాసరివాఁడవా మాపాపఁ గొనిపోవ, నేపాటిగలవాఁడ వేదివంశ
మెందు జన్మించితి వెక్కడఁ బెరిఁగితి వెయ్యది నడవడి యెవ్వఁ డెఱుఁగు
మానహీనుఁడ వీవు మర్యాదలును లేవు మాయ గైకొనిగాని మలయరావు
నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు వసుధేశుఁడవు గావు వావి లేదు"

అని రుక్మిణీపరిణయంబున వ్రాసెఁగదా. ఇందు విష్ణుదూషణము చేసినదోషము పోవ నేగ్రంథము రచించెనో యేప్రాయశ్చిత్తము పెట్టుకొనెనో రావుబహదర్ వారు దయయుంచి తెలిపెదరా?

3. "శివాద్వైతవినుతాఖండపాండిత్యుం డగు ముదిగొండబ్రహ్మయలింగారాధ్యరచిత"శివరహస్యఖండమున దక్షకాండమున నీదక్షవాక్యంబులు గానవచ్చుచున్నవి.

"వంచకుండును క్రూరుం డని యెంచక తోడితెచ్చి వియచ్చరులుచూడఁ గూఁతు నిచ్చి వివాహం బొనర్చిన నీతీరుగాఁ బెండ్లికూఁతు పాణిగ్రహణంబు చేసి యశోవిహీనుండై శుభాగారంబుఁ బాసి చనెఁ దల్లిదండ్రులం గానక శ్మశాననిలయుండై యపావనుండు గావున నిట్లొప్పె నిప్పుడమిని ధూర్తుఁడై నృత్యకృత్యంబున పర్తిల్లినన్ శుభకర్మంబున దుర్మార్గుఁడై చక్కఁబోవునే యక్కటా మహామాయకుం డనిదూషించుచు దక్షుండు............మఱియును వేదంబుల రుద్రమహిమానువాదంబులు వినవచ్చిన ననుమోదింపనల్వ దసత్యంబు లాశ్రుత్యోఘంబులు గాల్పనే తత్తదామ్నాయంబులు విడువుఁడు. రుద్రుండు క్రూరచేతస్కుండునుం గావున నీచుండు"

సంస్కృతశివరహస్యఖండకర్త యేప్రాయశ్చిత్తము పెట్టుకొనెనో తెనిఁగించిన యారాధ్యుఁడు మరల నేగ్రంథము వ్రాసెనో రావుబహదర్ వారు దెలుపఁ బ్రార్థితులు.

4. భాగవతమున శివనింద చేయఁబడెననికదా పోతన వీరభద్రవిజయము వ్రాసెనని రావుబహదర్ వారు చెప్పెదరు. మంచిది. ఈ గ్రంథమున తరలము. "పరమసంతస మాదినాథులు భాగ్యవంతులు శ్రీయుతుల్
వరుసఁ దల్లియుఁ దండ్రియుం గలవార లిచ్చ మహావ్రతుల్
ధరణిలోఁ గులగోత్రవంతులు తజ్ఞు లెందుఁ దలంపఁగన్
దరుణి యిన్నియు నేల నీపతితల్లిదండ్రులఁ జూపుమా."

నిట్లు దక్షుఁడు శివునకుఁ దల్లితండ్రులు లేరని దూషించెఁగదా. తల్లిదండ్రులు లేరన్నతిట్టునకు నేమియర్థము? ఉండి మరణించినా రనిన దూషణము కానేరదు. స్వయంభువు అనిన నింద కానేరదు.

ఆది తెలియరానిది యనాది యిన్నట్లు వ్యుత్పత్తి చెప్పదరేని తెలియరానితల్లిదండ్రులు గలవాఁడనికదా యగును. అట్టివా రెవరో మీరే యూహింపుఁడు. భాగవతముఁ గాదని వీరభద్రవిజయము వ్రాసినాఁడనుట అమ్మను దిట్టెదవేమిరా లంజకొడుకా యున్నట్లు లుండలేదా?

5. ఆర్యులారా! యొకపాపము, చేసి దానికై పశ్చాత్తప్తుఁడై వగచువాఁడు "నేనీపాపము చేసితిని. ఏ ప్రాయశ్చిత్తముచే నీపాపము దొలఁగు"నని కదా యాలోచించును. అట్టులే వీరభద్రవిజయగ్రంథకర్తయు నేను భాగవతమున శివనింద చేసితిని. ఆ పాపము పోవ నేకృతి రచియింతునని కదా తొలుత దలఁచియుండవలెను. అగ్రంథమునం దట్టివిచార మేదియుఁ గానరాదు.

సీ. ఏపుణ్యకథఁ జెప్పి యీభూమితలములోఁ బాపసంచయ మెల్లఁ బాయవచ్చు
నేపుణ్యకథ చెప్పి యితరులు పొగడఁగఁ గోటిపుణ్యంబులు గూర్పవచ్చు
నేపుణ్యకథ చెప్పి యితరలోకంబులోఁ బరమకల్యాణంబుఁ బడయవచ్చు
నేపుణ్యకథ చెప్పి యింద్రాదిసురులచేఁ బొలుపార సత్పూజఁ బొందవచ్చు
ఆ. నట్టికథ రచించి యెవ్వరు నెఱుఁగని, యీశు నాదిదేవు నెఱుఁగవచ్చు
నేమికథ యొనర్చి యిలలోన సత్కీర్తిఁ, దనరవచ్చు నంచుఁ దలఁచితలఁచి.
వ. తదీయవిచారచిత్తుండనై తత్కథారంభం బూహించుచున్న సమయంబున"

అని వీరభద్రవిజయమునఁ గాన నయ్యెడి. వాస్తవముగ భాగవతగ్రంథకర్తకుఁ బాపభీతియే తోఁచి ప్రాయశ్చిత్తముగ వీరభద్రవిజయము వ్రాయఁ దలఁపు గలదేని యిట్లు డోలాయమానమానసుఁ డగుటకుఁ గారణమే కలుగదు. కావునఁ బాలపర్తి నాగేశ్వరశాస్త్రులవారు చెప్పినట్లు భాగవతప్రబంధ మనుపద్యము ప్రక్షిప్తమై యుండవలయు.

6. అంతియకాదు భాగవతంబున శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై యని సంకల్పించి "రామభద్రుండ మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెనుంగు సేయుము నీకు భవబంధంబు తెగునని" భగవంతునిచే దత్తాభయుఁడై

కం. పలికెడిది భాగవత మఁట, పలికించెడివాఁడు రామభద్రుండఁట నేఁ
బలికినభవహరమగునఁట" యనినిశ్చయజ్ఞానముగలిగి "జననంబుఁ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్" అని యుపక్రమించినకవికి "సురలచే సత్పూజఁ బొందవచ్చు, నిలలోనసత్కీర్తిఁ దనరవచ్చు"నని క్షుద్రాశయములు పుట్టునా?

7. భాగవతమునఁ జెప్పినది సరిగాదని శివునిమాహాత్మ్యమే చెప్పఁబూనినచో వీరభద్రవిజయమువంటియల్పగ్రంథమా పోతన వ్రాయును. భాగవతమును మించినగ్రంథము వ్రాసియుండును. అందైనను శివునిమాహాత్మ్యము సాధారణముగఁ జెప్పనుగాని భాగవతమందుఁ జెప్పినంతమాత్రమైనఁ జెప్పినవాఁడు గాఁడు. భాగవతంబున దాక్షాయణీవాక్యంబులు

వ. "అదియునుంగాక దేవతల కాకాశగమనంబును మనుష్యులకు భూతలగమనంబును స్వాభావికంబులయినట్లు ప్రవృత్తినివృత్తిలక్షణకర్మంబులు రాగవైరాగ్యాధికారంబులుగా వేదంబులు విధించుటం జేసి రాగయుక్తులై కర్మతంత్రు లయినసంసారులకును వైరాగ్యయుక్తులయి యాత్మారాము లైనయోగిజనులకును విధినిషేధరూపంబు లయినవైదిక కర్మంబులు గలుగుటయు నైజంబు లగుటం జేసి స్వధర్మనిష్ఠుం డగువాని నిందింపం జన దాయుభయ కర్మశూన్యుండు బ్రహ్మభూతుండు నయినసదాశివునిఁ గ్రియాశూన్యుం డని నిదించుట పాపంబగుఁ దంత్రీ సంకల్పమాత్రప్రభవంబు లగుటం జేసి మహాయోగి జనసేవ్యంబు లయినయస్మదీయంబు లగునణిమాద్యష్టైశ్వర్యంబులు నీకు సంభవింపవు. భవదీయంబు లగునైశ్వర్యంబులు ధూమమార్గప్రవృత్తులై యాగాన్నభోక్త లైనవారిచేత యజ్ఞశాలయందె చాల నుతింపంబడియుండుఁ గాన నీ మనంబున నేనధికసంపన్నుండ ననియుఁ జితాభస్మాస్థిధారణుం డైనరుద్రుండు దరిద్రుం డనియు గర్వింపం జన దని వెండియు నిట్లనియె." ఇవిగాక వీనికిముం దుండుపద్యములను బఠింప మిమ్ముఁ బ్రార్థించెదను. ఇంతమాత్రము శివతత్త్వము వీరభద్రవిజయమున వెల్లడింపఁబడినదేమో చూడుఁడు.

ఈ కారణములచే మీఁదిపద్యములు మనపోతనామాత్యుఁడే వ్రాసియుండినను గృత్యము నిర్వహించనే కాని ద్వేషబుద్ధిచే శివనింద చేయలేదనియు నా కారణముచేఁ బ్రాయశ్చిత్తము పెట్టుకొనవలసిన కారణము కలుగలేదనియు రూఢిపడెను.

8. "భాగవతప్రబంధ మతిభాసురతన్" అనుపద్యమువలన వీరభద్రవిజయరచనకు ముందుగదా భాగవతము రచించియుండవలసినట్టు లేర్పడుచున్నది. దీని నేకదా రావుబహాదర్ వా రంగీకరించిరి. వీరభద్రవిజయ రచనకాలము నాఁటికిఁ దాను బాలుఁడనియు సంస్కారహీనుఁ డనియుఁ గవి దానే చెప్పుకొనియున్నాఁడు. రావుబహాదర్ వారు చెప్పకుండినను గ్రంథమిట్లు చెప్పుచున్నది.

ఆ. "పిన్నవాఁడననియుఁ బెక్కుసంస్కృతులను, విననివాఁడననియు వెఱపుమాని
మత్ప్రసాదదివ్యమహిమచే నెంతైనఁ, గవిత చెప్ప లావు గలదు నీకు."

ఆర్యులారా! 20-22 సంవత్సరములకుఁ బైపడిన 'నూనూఁగుమీసాల నూత్నయౌవనము' ప్రాయమువాఁడు పిన్నవాఁడు కాఁజాలఁడుకదా. అనేకవిధ సంస్కారసామర్థ్యముల వెల్లడించు నాంధ్రభాగవతము సంస్కారహీనునిచే వ్రాయఁబడినదని యెట్టిజడుఁడును జెప్ప సాహసింపఁడుకదా. సంస్కృతి

భాగవతమందు భాషాకాఠిన్యము మెండు. అనేకస్థలములతత్త్వము దురవగాహము. అట్టిదానిని సుబోధముగఁ జేసికొని యుభయభాషాప్రావీణ్యము కేవలస్వయంకృషి చే సంపాదించి

క. కొందఱకుఁ దెనుఁగు గుణమగుఁ, గొందఱకును సంస్కృతంబు గుణమగు రెండుం
గొందఱకు గుణము లగు నే, నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యై యెడలన్

అని ప్రతిజ్ఞవచించి వచించినంత నిర్వహించి యసమానముగ గ్రంథము రచించినవానికి మఱియొకఁడు వచ్చి "వెఱపుమాని మత్ప్రసాదదివ్యమహిమచే నెంతైనఁ గవిత చెప్పలావు గలదు నీకు" అని వీఁపుకట్టి ధైర్యము చెప్పవలయునా? ఇంతకంటెఁ బరిహాస్యము వే ఱొండుండునా? ఇది తాతకు దగ్గనేర్పినట్టు కాదా? కావున నీ పద్యము వీరభద్రవిజయకవియందు సార్థకముగ నన్వయించునుగాని భాగవతగ్రంథకర్తయం దన్వయింపదు.

9. మఱియొకవిధముగఁ జూతము. 20-22 సంవత్సరముల పిన్నవయస్సున వీరభద్రవిజయము రచించియుండిన 19-20 సంవత్సరముల నాఁటికైన భాగవతరచన పూర్తియై యుండవలయునుగదా. భాగవతము ముగించుటకు 5-6 సంవత్సరములు పట్టినదనుకొన్నను 14-15-వ యేఁట భాగవతరచన ప్రారంభమై యుండవలయునుగదా. ఇది యీప్రాయపుఁగుమారునిచే వ్రాయఁబడినదనుమాట మీరునమ్ముదురా? పోతరాజో యుదరపోషణమునకై దేవురులాడుచుఁ గృషి యందుఁగాలముగడుపుచువిరామ కాలములలోఁ దనంతఁదాను జదువుకొని యుభయభాషాప్రావీణ్యము సంపాదించినవాఁడు. ఇట్లింతవిద్య సంపాదింప నెంతకాలము పట్టియుండునో యాలోచింపుఁడు. వీరభద్రవిజయము వ్రాసినప్పటికే యుభయభాషాలక్షణజ్ఞానహీనతచే నధమకవిత్వ మలవడినపుడు తత్పూర్వగ్రంథ మగుభాగవతమున మఱియెన్నిదోషము లుండవలయునో మీరే యాలోచింపుఁడు.

14 యేండ్లప్రాయమునాఁటికే "శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై" యని కృతిప్రారంభించునంత భక్తివైరాగ్యములు గలవాఁడు సింగభూపాలుని నేప్రాయమున దర్శించియుండవలయును?

"కర్ణాటరాజులచేత నెప్పుడైన నవమానితుఁ డయి పోతన్న రాజుల ద్వేషించువాఁడయియు నుండవచ్చును" అనియు రావుబహదర్ వారు వ్రాసిరిగదా. ఈ సంచారమునకు 4-5 యేఁడ్లు పట్టినదనుకొన్నను తొమ్మిదవయేఁటనో పదియవ యేఁటనో భోగినీదండకమును జెప్పియుండవలయును భోగినీదండకమూప్రాయమునఁ జెప్పఁబడినదని మీరు విశ్వసింతురా? ఇంతవిద్య యంతటి యల్పవయస్సులో గడించె ననిన మీరు నమ్ముదురా?

10. మఱియొకవిధముగ నాలోచింతము.

"సింగమనాయని దర్శించుటకయి యౌవనారంభదశలోఁ బోయియుండును" అని రావుబహదర్ వారు వ్రాసిరి. ఈ దశ యేదో మనమూహింపవలసినపని పెట్టక వారే "ఇతఁ డీదండకమును 1430-వ సంవత్సరప్రాంతమున నిరువదియైదేండ్ల లోపలివయస్సులోఁ జేసియున్నట్టు కనఁబడుచున్నది." అని వ్రాసిరి. భోగినీదండకము 23-వ యేఁట రచించె ననుకొనినయెడల భాగవతమెప్పుడురచించి యుండవలయును? రావుబహదర్ వారి యూహప్రకారము కర్ణాటరాజుల సభలఁ దిరిగి భగ్నాశుఁడై యిల్లుచేరునప్పటికి 28-30-వ సంవత్సర మైననయి యుండునుగదా? తరువాత భాగవతము పూర్తియగునప్పటికి 34-35 సంవత్సరములప్రాయమైన నయియుండునుగదా. ఈ వయస్సువాఁడు ...ఁడు" అనిచెప్ప రావుబహదర్ వారు సాహసింతురా? భాగవతరచన కాఁ... కునకు సహాయుఁడై మడక దున్నుకొడుకు నున్నట్టు లంగీకరించి యున్... దా? "బ్రాహ్మణుసేద్యంబు బాలవైద్యం"బన్నట్టు బ్రాహ్మణునకు మడకచాలు చక్కఁగ దున్నుటకు 18-20 యేండ్లకులోపల సాధ్యపడునా? 16 యేండ్లకు లోపడిన కాఁపుబాలురే చక్కఁగదున్న లేరు. 18 యేండ్లకొడుకునకు 38 యేండ్లు గలతండ్రియుండఁడా? అధమపక్షమున 20 యేండ్లుగలకొడుకును గలతాను బిన్నవాఁడనని పోతన వ్రాసికొనెననుట రావుబహదర్ వారంగీకరించుటే యచ్చెరువుగొలుపు చున్నది. పంతులవారివ్రాఁతనుబట్టి పరిశీలింప నిట్టిపర్యవసాన మేర్పడుచున్నది. దీనిని లోకు లెంతవఱ కంగీకరింతురో చూడవలయును.

11. "భాగవతమునకుఁ దరువాత రచియించిన వీరభద్రవిజయమందుఁ గూడఁ గొన్నిదోషములు కనుపట్టుచుండుటచేత పోతనకృతభాగవతమందును గొన్నిదోషము లున్నవని యొప్పుకొనుటే న్యాయము" అని రావుబహదర్ వారు తీర్పుదిద్దిరిగాని వీరభద్రవిజయమందుఁ గానవచ్చునట్టి దోషములవంటివి భాగవతమందుఁ గలవా యని వారిని బ్రశ్నించుచున్నాను. గ్రంథవిస్తరభీతిచే వీరభద్రవిజయమందలి కొన్నిదోషములుమాత్రము కనఁబఱచుచున్నాను. ఉదాహృత పద్యములందుఁ గొన్నిగాన నగు.

1.వ యాశ్వాసము.

అవనిరెండవశారదై
బ్రాహ్మణు లుత్తమబ్రాహ్మఁ డనఁగ
పిల్తు దివిజుల నందఱిన్ వెలిబెట్టు దిప్పుడు భర్గునిన్
వనజజగంధి
ఎక్కుగుజ్జము లేదు యెద్దుగాని
పరమవంటిగాఁడు
కుండలీలోకము
నీకాంతవైననిజముగ(నీవు కాంతవైన ననుటకు)
ఇదిమహాద్భుతంబు యిందువదన
కానక కన్నకూఁతురున్
రాజధవళాయము (ధవళాలయ మనుటకు)
పాలిళులనుమీఁదిపయ్యెద వీడంగ (పాలిండ్లనుటకుఁరూపాంతరము)
మేనకపుడు
విశాలసాలలో।చనవరగంధసారఘనసారయుదుంబఁ
ఉవిదారత్నము
యోగిహృద్వ్యాంతవర్తి

2.వ యాశ్వాసము.

శోకములమూఁకలను వీఁకగనియాదర్వీకములు (దర్వీకరములనుటకు)
చాలఁడు సిద్ధమీపలుకు సర్వయుపాయములందు భావజున్.
అనంతరాజ్యసిరి గొల్వుండెన్
పోలదు నీరాక వినుము పొగఁగుదుయిల్లాం ద్రేలా
కరణినుండె దివిజకాంతలెల్ల
భూరికీరకైవారనిజగుణాలంకారుండు(కైవారశబ్దము సంస్కృత మనితలఁ
చినవాఁడు శ్రీనాథుఁడు, ఆయన ననుసరించినవాఁ డీతడు. దీనివలన
నితఁడు శ్రీనాథునకుఁబిదపటివాఁడు.)
చం,దనజంబీరకదంబరంబఫలినీదాడీమమందార.
గౌరీశుఁ డనియెడిగంభీరవార్ధిలో నరగి మన్మథకలం బవిసె నేఁడు.
ఎఱుఁగుదు మంచుఁ జెప్పటలు యెంతయు తథ్యము.
వీరసూకళత్ర విష్ణుపుత్ర.

శంకరజోగి తెచ్చి సమసారనివాసునిఁ జేయకున్నచో (సంసారమనుట)
కమలాక్షులు చెలులు దన్ను గొరత సేయన్
ఇదేలనో
మెడగరళకరుణ
ధృతిమైనుత్తమకన్యయంద్రు మృగనేత్రింగన్న
అలరుసాయకవైరి,
దండపుండరీకతనుకళాశములు
గౌరి తపసివేషధారి యయ్యె.
కరుణతోయరాశి.
తండ్రికొడుకులరాజుయీమొల్లగంధికి
ఎంతసిద్ధముగామ్య మొల్లఁడు యేలయీయడియాస
ఖే,చరగతినొప్పువాఁడ సమసారపుదుఃఖము.
ఒండొరుసుందరాంబువులనోలిమునింగియు
లక్ష్మీనాథాదులనైన
సన్నిధివైతివియేమిపుణ్యమో

3.వ యాశ్వాసము.

భోగరాయఁడు
సప్తసంద్రములు
సకలమైనవారు
మహామూఁకలు-మహాలెక్కలు
కోటికాలరిపంక్తిచేన్
దిగిభకుంభముల్
జగతీశాయనమోనమోనమసుధాసంకాశితాంగాయ.
నన్నుఁగాన లేవు యిట్టినీకు
మహాప్రేఁగై
నెఱజాణునిజూడఁగరండుయిందు (ఇట్టివి పెక్కులుగలవు)
కలకలలో సమూహములో కాఱుమెఱుంగులో కాముగీములో
ఒకతొకర్తు
వచ్చితివియేమికార్యము
వీరభద్రుండలం।తలఁబోనేరఁడుసైఁపనేరఁడువృథా

కామధ్వంసుఁడు సర్వతంత్రములకుం గర్తారుఁడంచున్
పయోరుహాయ యోంకారమయాయ-నాగభూషితభూషణా శరణాగతా
జనపోషణా
శంఖధనుస్సుచక్రధరులన్
మాంసకుప్పలైనమాంసములును
శివద్రోహగండా
ఇదిసరస్వతిముక్కు యిదివటుతుండంబు
గీ. ఓంనమశ్శివాయ ఓంకారరూపాయ.
మానిత్యము(మానితమనుటకు)
పంకితనితాంతపులకాంకితయురస్థల..........పంకజదళాక్షా
యమదండనారసజముదాళశక్తిప్రముఖ-దివ్యదివ్యాయుధ

ఇవన్నియు సాధువులని రావుబహాదర్ వారు సాధించిరేని సాధింపనిండు నేను వలదననుగాని యిట్టిప్రయోగములు భాగవతమందుఁ గలవా యనియే నాదు ప్రశ్న. ఇట్టిదోషము లింకనిన్ని యున్నవి. విస్తరభీతి వదలితిని. ఆగ్రంథము పఠించువారి కవి గోచరింపఁగలవు.

మీఁద వ్రాసినవి రావుబహాదర్ వారికిఁ దెలియనివి యని నేను జెప్ప సాహసింపను. తెలిసి తెలిసి యొక రాక్షేపించినపిమ్మట సవరించుకొనుట మానహానియను నభిమానముచే నట్టియెడ్డైన నాయెడ్డే గెలువవలయు నని తమపిడివాదము మానరైరని తలఁచెదను.

12. వీరభద్రవిజయగ్రంథకర్తయు భాగవతగ్రంథకర్తయు నొక్కరా యనువాద మున్నట్టే నన్నయభట్టీయము చాముండికావిలాస మనుగ్రంథముల వ్రాసిననన్నయభట్టు భారతమువ్రాసిననన్నయభట్టు వేఱువేఱా యొక్కరా యనువాదము జరగుచుండుట మీరెఱిఁగియేయున్నారు. నన్నయభట్టీయ చాముండికావిలాసగ్రంథకర్త భారతకవి యగునన్నయ కాఁడని రావుబహాదర్ వారియభిప్రాయము. దానిని స్థాపింప వారాగ్రంథములు నన్నయ్యభట్టారకచరిత్రమందు విమర్శించిరి. వాని నెట్లు విమర్శించిరో వీరభద్రవిజయ మెట్లు విమర్శించిరో చూచితిరేని వారివిమర్శనమందలి చిత్రమును మీరెఱుఁగఁగలరు. వారా రెండుగ్రంథముల నేవిధముగవిమర్శించిరో తెలుపుచునట్లు నేను వీరభద్రవిజయము విమర్శించెదను. పర్యవసాన మెట్లుండునో చూడుఁడు.

బాలసరస్వతి వ్యాఖ్యానము చేసినట్లు నన్నయభట్టీయపీఠికలోఁ "తెలుఁగువ్యాకరణంబు నాకొసఁగె" నని యుండ "తెలుఁగువ్యాకరణ మనుచో మొదటి తేగణము? గువర్ణ మెట్లు గురువగును?" అని మఱికొన్ని యాక్షేపించిరి. వీరభద్రవిజయమందలి కొన్నిఛందోభంగముల వ్రాయుచున్నాను.

మ. మునినిర్నిద్రదయాత్ముఁడున్ మహితుఁడున్ మార్తాండతేజుండు.
మ. కౌం,డినకుం డన్ముని సన్మునీంద్రపరుఁడై యిద్ధాత్రిఁ గీర్తింపఁగన్.
తరళము. పిల్తుదివిజుల నందఱన్ వెలిబెట్టు దిప్పుడు భర్గునిన్
వెలయ నిశ్చయమిట్టదంచు. గణప్రాసభంగము
కం. కఱకంఠ మిమ్ముఁ బిలువక
తెలివించుక లేకమిమ్ముఁ దెలియక దక్షుం
డఱిముఱి యాగము చేయుచు
మెఱయుచున్నాఁడు రాజమిహిరాధ్యక్షా.
మత్త. జగన్|గాలిగాఁ గలకంఠనిల్చెఁ గొలంకుభంగిఁ దలంకుచున్
సీ. హరిరాజసమమధ్య లంకించి వాలార్పఁ గరికుంభకుచలు పరాకుదెల్ప
శా. నాపిన్నచెల్లెండ్రం బిల్చియు నీవుపిల్వవు మదీయాధీశ
గీ. యిదియేమి తా నంపితిని దక్షునింటికి
గీ. అనుచు హిమవంతు నాలోకనమ్ముచేసి
గీ. భూతినుదుటనుద్రిపుండ్ర మొప్ప
లోకములెల్లం బరిమార్చినట్టివెఱపుం దర్పంబు
అసురగంధర్వయక్షరాక్షసపిశాచ
లయగ్రాహి. తుమ్మెదలు పెక్కుమురి పెమ్ముల వెసన్నుసరి ఝుమ్మురని పద్మముల నమ్మ
సీ. పుణ్యజనులచేత బృందారకావ్రరో గంధర్వకిన్నరగణముచేత [హారభటిన్
మ. కలలోనైనను నొప్పనంటి భవు డాయన్ వద్దువద్దంటి
గీ. ఒసర గోడవ్రాసినట్టిరూపంబును
యేరూపములందు నాదరింపుఁడునన్నున్.
సీ. కడిమిపై మూఁడులోకముల నేలెడివాని నొడలెల్లఁ గన్నులై వెలయువాని
సీ. ముకురంబునందున మృదువు లేదు
సీ. మృడునకుఁ గేలెత్తి మ్రొక్కువారు
ఆ. బహురత్నచయములఁ బఱసిపోవఁగవైచి పట్టుపుట్టంబులు గట్టినిల్చి
పేరటాండ్రుచూడ గౌరికుమారిఁగ్రై, సేయఁ దలఁచి గఱఁగి చెలువుమిగుల
(సీసగీతమిశ్రము)

శా. కన్యాదానముచేసెఁ బర్వతుఁడు గంగామౌళికిన్ లగ్నమౌ
సన్నంబైన సురేంద్రమంత్రి గణఁకన్ సర్వప్రయత్నంబులన్
జెన్నారన్ సుముహూర్తమన్నఁ దెరవాసెన్ మ్రోసె వాద్యంబు ల
న్యోన్యాలోకన మయ్యె దంపతులకున్ మోహానురాగంబునన్
కం. భావజసంహారమహాను, భావా - (బేసిని జగణము)
శా. కాలాంభోధరదీప్తి మెచ్చక భుజంగశృంగసంకాశమై
గీ. తాముపాలించు నట్టిలోకముల విడిచి
కం. భావించి జగములన్నియుఁ, గావింపఁగ వానినన్ని ఖండింపఁగ బ్ర
హ్మావిష్ణుమహేశ్వరులన
కం. నాకుం దోఁచినవిధమున, నీకథఁ గైకొంటిఁగాన నీలగ్రీవా
నీకథమహిమాతిశయము, వాచస్పతికైన వశమె వనజజువశమే
ప్రాసముతప్పు క్రియలేదు.

"తెనుఁగువ్యాకరణం" బనునది సులభముగ సవరింపఁగూడియు దానిని దోషముగఁ బరిగణించి కృతి నన్నయభట్టుది గాదని రావుబహదర్ వారీస డించిరిగాని వీరభద్రవిజయమం దిన్ని మహాదోషము లున్నను నిద్ది భాగవతగ్రంథకర్త రచియించినదే యన జంకరైరి. పైపెచ్చు దీనిలో దోషము లుండుటచే భాగవతమునందును దోషము లున్నవనుట న్యాయమంట. ఈ న్యాయ మన్యాయపంచకమును స్మరింపఁ జేయుచున్నది.

13. చాముండికావిలాపము నన్నయ్యభట్టారకకృతము గాదని రావుబహదర్ వారు వ్రాయుచుఁ గొన్నికారణములు చెప్పిరి. అందుఁ బ్రథమకారణము:—"నన్నయ్యభట్టుకాలము మొదలుకొని యించుమించుగా తిక్కనకాలమువఱకును గలకవులు తమగ్రంథమున కాదియం దొకసంస్కృతశ్లోకమును వేసి తరువాత తెలుఁగుపద్యము వేయుట యాచారమై యున్నది" అని వ్రాసి భారతములోని శ్రీవాణీగిరిజా యనుశ్లోకమును పావులూరుమల్లన శ్రీకంఠంస గుణమనుశ్లోకము కావ్యాలంకారచూడామణిలోని శ్రీవాగాస్పదయో యను శ్లోకము తిక్కననిర్వచనోత్తరరామాయణమందలి శ్రీరాస్తా మనుశ్లోకము నుదాహరించిరి.

నన్నయభట్టుమొదలు తిక్కనవఱకుఁ గలదని వీరు చెప్పెడియాచారము వీరు కల్పించినట్టు తోఁచుచున్నదిగాని యవిచ్ఛిన్నముగ బూర్వకవులయం దున్నట్లు గానరాదు. ఆర్యులారా! తిక్కన భారతమును నే సంస్కృతశ్లోకముతోఁ బ్రారంభించెను? ఆచార మొకగ్రంథమున కన్వయించి వేఱొకగ్రంథ

మున కన్వయింపదు కాఁబోలు. అది పోనిండు. "ఈ దశకుమారచరిత్రములో భారతాంధ్రీకరణవిషయ మేమియుఁ జెప్పఁబడి యుండకపోవుటచేతఁ దిక్కన యీ గ్రంథరచననాఁటికి భారతము చేయనారంభించియుండఁడు" అని రావుబహదర్ వారే వ్రాసిరి. తిక్కన నిర్వచనోత్తరరామాయణము వ్రాసినట్టును గేతన చెప్ప లేదు. కావునఁ బంతులవారియూహప్రకారము దశకుమారచరిత్ర యీ రెండుగ్రంథములకు ముందు పుట్టినదేకదా. ఇం దేసంస్కృతశ్లోకము వ్రాయఁబడినది. అదియుఁ బోనిండు.

"విన్నకోట పెద్దన్న యిప్పటి కయిదువందల యేఁబదిసంవత్సరముల క్రిందట ననఁగా నెఱ్ఱాప్రెగడకంటె కొంచెము ముందుగనో యతనికాలములోనో యున్నాఁడని నిశ్చయింపవలసియున్నది." అని రావుబహదర్ వారే వ్రాసిరి. ఎఱ్ఱాప్రెగడనుగుఱించి వ్రాయుచు "ఇతఁడు తిక్కనసోమయాజితరువాత నించుమించుగా నేఁబదిసంవత్సరములకాలమున నుండినవాఁడు" అని వ్రాసిరి. అట్టి యెఱ్ఱాప్రెగడతో సమకాలికుఁడైన పెద్దన్నను దిక్కనకుఁ బూర్వునిఁగా వ్రాసి యాధారముగ గ్రహించుట యెంతసాహసము! అదియుఁ బోనిండు.

"ఈనన్నెచోడకవి నన్నయభట్టారకునకును తిక్కనసోమయాజికిని నడిమికాలమం దున్నవాఁడు" అని రావుబహదర్ వారే వ్రాసిరి. కుమారసంభవమున మొదటిశ్లోక మేదియో తెలుపవారిని బ్రార్థించెదను. న నన్నయభట్టుచరిత్రము తాము వ్రాసినప్పటికిఁ గుమారసంభవమును దాము చదువలేదందు రోటు. అట్లైనచో నొకయసత్యమును దాఁప రెండసత్యములు వ్రాసినట్లగు.

"నన్నయభట్టారకునికిని ఎఱ్ఱాప్రెగడకు మధ్యకాలమునందు తెలుఁగుకవులు లేరని భ్రమింపఁగూడదు. అథర్వణాచార్యుఁడు, భీమకవి, రంగనాథుఁడు, భాస్కరుఁడు, కేతన, మారన, పెద్దన మొదలయినవారీమధ్యకాలములో ననేకు లున్నారు" అని రావుబహదర్ వారు వ్రాసిరి. ఇందుఁ బేర్కొనఁబడిన భీమకవి రంగనాథుఁడు భాస్కరుఁడు కృతిమొదల రచించినశ్లోకము లెవ్వియో రావుబహదర్ వా రుదాహరింతురు గాక. ఇందఱు వ్రాయక యొకరిద్దఱు వ్రాసినంతనే యది యాచార మనఁబడునా? వారికిమనస్సువచ్చినచోట రా॥బ॥ వారెట్టియాధారములఁ గల్పింతురో తెలిసెనుగదా.

14. రాఘవాభ్యుదయములోని దని యొకరు చెప్పిన ట్టొకపద్యము నుదాహరించి "ఈ పద్యము నన్నయభట్టారకునికవిత్వమును బోలి యుండకపోవుటచేత నీతఁ డానామము గలమఱియొక యప్రౌఢకవి యైయుండవచ్చును" అని

రావుబహాదర్ వారభిప్రాయ మిచ్చిరి. ఒక పద్యమును జూచి గ్రంథమంతటి మీఁద నభిప్రాయ మిచ్చిరి కదా. పోతనామాత్యభాగవతములోని పద్యములఁ బోలినపద్య మొక్కటియైన వీరభద్రవిజయమం దున్నదా యని రావుబహాదర్ వారిని నడుగుచున్నాను. కృతియందలి రెండవపద్యమే యేగతిగా నున్నదో యన్వయించి చూడుఁడు.

చం. సిరియునువాణి గౌరియును జెన్నుగఁ గన్యను మేను వాక్కుఁజె
న్నురమును నుంకు విచ్చి ముదమొప్ప వరించి జగంబు లన్నియుం
దిరములు సేయఁ బ్రోవఁ దుదిఁ దీర్పఁ ద్రియష్టయుగక్షణుండు నై
హరియెడ శంభుమూర్తియగు నాథ్యుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడుఁగా.

ఈ పద్యము భాగవతకర్తదిగా రా॥ బ॥ వారికిఁ దోఁచెఁగదా. చిత్రము.

15. "రాజనరేంద్రునిప్రీతికఱకు నన్నయభట్టొకవేళ భారతాంధ్రీకరణమునకు ముందు దీనిని రచియించి యుండునేమో యని యూహింపవలసియున్నను కవిత్వవిధమునుబట్టి యాలోచింపఁగా నాయూహ కవకాశము కలుగకున్నది" అని చాముండికావిలాసమునుగూర్చి వ్రాసిరి. భాగవతకవిత్వమునకు వీరభద్రవిజయకవిత్వమునకుఁ బల్లెటూళ్లయావుదూడలకుఁ జెన్నపురిగడ్డిదూడలకుఁ గల పోలికయైన నున్నదా యని రా॥ బ॥ వారి నడుగుచున్నాను.

16. చాముండికావిలాసమును విమర్శించుచు రావుబహాదర్ వారు—"నన్నయ్యసీసపద్యములకంటె భిన్నవిధమైనసీసపద్యము లిందుండుట. నన్నయ్య సాధారణముగా తనసీసపద్యమును వడితో నారంభించినపక్షమునఁ దువవఱకును వడులనే పెట్టియు ప్రాసముతో (ప్రాసయతితో) నారంభించినపక్షమునఁ దుదవఱకు ప్రాసమునే పెట్టియు ఉన్నాఁడు" అని వ్రాసిరి. ఈ నియతి భారతమందు రావుబహాదర్ వారికిఁ గానవచ్చెనుగాని భాగవతమందుఁ గాన రాలేదు గదా. ఉన్న దున్నట్టు వ్రాయవలసిన చరిత్రకారుల కీపక్షపాతబుద్ధి యేల? పోతనరచిత భాగవతమందలి సీస, గీతములయం దీనియతి కలదు.

గీతమున కుదాహరణము:—

తే. చేతులారంగ శివునిఁ బూజింపఁడేని, నోరునొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁడేనిఁ, గలుగ నేటికిఁ దల్లులకడుపుచేటు.

ఇది భాగవతమున మొదటిగీతపద్యము.

సీ. మెఱుఁగుచెంగట నున్నమేఘంబుకైవడి, నువిద చెంగట నుండ నొప్పువాఁడు
చంద్రమండలసుధాసారంబుపోలికి, ముఖమునఁ జిఱునవ్వు మొలచువాఁడు

వల్లీయుతతమాలవసుమతీజముభంగి, బలువిల్లు మూఁపునఁ బరఁగువాఁడు
నీలనగాగ్రసన్నిహితభానునిభంగి, ఘనకిరీటము దలఁ గలుగువాఁడు

ఆ. పుండరీకయుగముఁ బోలుకన్నులవాఁడు, వెడఁదయురమువాఁడు విపులభద్ర
మూర్తివాఁడు రాజముఖ్యుఁడొక్కరుఁడు నా, కన్నుఁగవకు నెదురఁ గానఁబడియె.

ఇది ప్రథమసీసము. ఈ రెండుపద్యములందు యతులుమాత్రమే కానవచుచ్చున్నవి. ప్రాసయతి కుదాహరణము:—

గీ. పొగిలిపొగిలి కాలుమగున దేహంబున, నగురుపరిమళములపొగలు వెడలె
దేహకల్మషములు శ్రీహరిముఖమునఁ, ద్రావఁబడుటఁ జేసిభూవరేంద్ర.

సీ. ఊహించి రాముఁడు రోహిణి కొడుకంచు, నప్పుడు యోగీంద్ర చెప్పితీవు
దేవకికడుపున నేవెరవున నాతఁ, డుండెను దేహంబు నొండులేక
తనతండ్రియిలువాసి వనజాక్షుఁజేరితి, మందకుఁబోయెనే మందిరమున
నుండియెయ్యది సేయుచుండెనుదనమేన, మామఁగంసునినేల నామమడఁచె

గీ. నెన్నియేండ్లుమనియె నిలమీఁదమనుజుఁడై, యెందఱైరిభార్య లెట్లుమెలఁగె
మఱియు నేమిసేసె మాధనచారిత్ర, మెంతగలదు నాకు నేర్పరింపు

దీనిలో సీసమునఁ బ్రాసయతి. గీతమున యతి.

కొన్నిగీతములందు రెండుపాదములొకరీతి మఱిరెండొకరీతి నుంటయుఁ గలదు. ఇది క్వాచిత్కము. ప్రథమస్కంధమున సీసములు గీతములు డెబ్బదియున్నవి. ఇన్నిటియందు నీనియతి గానవచ్చుచున్నది.

ద్వితీయస్కంధమున 94-వ పద్యము వఱకుఁ గల 20 సీసగీతములందు మీఁదినియతియే కాన వచ్చుచున్నది. 95-వ పద్యముమీఁద "ఇది మొదలుకొని వెలిగందల నారయకవిత్వము" అని వ్రాయఁబడియున్నది. అది మొదలీ నియతి కానరాదు.

తృతీయస్కంధమునఁ బోతరాజకవిత్వ మితరకవిత్వము కలసినట్లు తోఁచుచున్నది. ఆ విచార మిం దనావశ్యకము.

చతుర్థస్కంధము మొదటినుండియు నీ నియతి గానరాదు. స్కంధ మంతయు శోధింప నీనియతికి లోపడిన వందందుండునవి 30-32-వ పద్యములున్నవి. ఇందును నుభయులకవిత్వము కలసిన దేమో. రా॥బ॥వా రుదాహరించిన "అనయంబు లుప్తక్రియాకలాపుఁడు" అనుపద్య మీనియతికి లోపడినది కాకుండుటచేతను వీరభద్రవిజయగ్రంథకర్తవంటివాఁడు ప్రయోగింపఁ దగిన ప్రయోగము ప్రత్యయరహితమైనప్రవాదము ప్రవాదయనునది కానవచ్చుట

చేతను "దక్షుఁడు పల్కినగర్హితవాక్యంబులు వినిందితంబు లగుంగాని యాథా ర్థ్యంబున వాస్తవంబులగు" ననుదానికి సరిపోవునట్లు సీసపద్యమునందలి కొన్ని విశేషణము లుభయార్థంబుల సరిగా వ్యాఖ్యానముప్రకారము నన్వయింప కుండుటచేతను నీ పద్యము పోతరాజుది కాదని తోఁచుచున్నది. కూచిమంచి తిమ్మకవి మొదలు భాగవతము శోధించినవారు చతుర్థస్కంధము పోతరాజరచితము గాదనుచుండ నుదాహృతపద్యము పోతరాజుగారి దని రా॥ బ॥ వారు వ్రాయుటకేమి యాధారములు దొరకెనో లోకమున కెఱిఁగింప వారిని నమస్కారపూర్వముగ వేఁడుచున్నాను. వీరభద్రవిజయమునకు భాగవతమునకు ముడిపెట్టవలయునని వ్రాసినవ్రాఁతయో యేదైన నాధారము కలదో లోక మెఱుంగ వేడుకపడుచున్నది. వీరికవిజీవితచరిత్ర మెంతటిప్రమాణగ్రంథమో వీరు చెప్పెడి కారణములఁబట్టి తెలియవలసియున్నది.

తరువాత ౫-6 స్కంధములు పోతనవి కావు. అం దీనియతి లేదు. సప్తమస్కంధమున 65 సీసగీతము లున్నవి. అన్నిటియం దీనియతి గానవచ్చుచున్నది. 352-వ పద్యమున రెండవపాదమున ఆనందముద్రాక్షరశాలవారి ప్రతియందు "నపియంతరోషహా × సవిజృంభితంబైన" యని యున్నది. వావిళ్ల రామస్వామిశాస్త్రులవారి ప్రతియందు "నవియంతయునురోష × హాసజృంభితమైన" యని యున్నది. ఈ పాఠమే సాధువు. ఇందు నియతి కాపాడఁబడినది. ఈ స్కంధ మంతయుఁ బోతరాజుగారిదే.

అష్టమస్కంధమున 151 సీసగీతము లున్నవి. కొన్నిటియందుఁ గేవల ప్రాసయతులు గానవచ్చుచున్నవి. అది పోతననియతికి విరుద్ధము గాదు. ఇం దైదాఱుస్థలముల నియమభంగము కానవచ్చుచున్నది. అందుఁ గొన్ని సులభముగ సవరింపఁగూడినవి. లేఖకశోధకముద్రాపకప్రమాదాదుల నైనయీయల్ప దోషములు పోతననియతిని ఖండింపఁజాలినవి కావు.

నవమస్కంధమున 146 సీసగీతము లున్నవి. ఇందు 6-7 స్థలముల నియమభంగము కాన నయ్యెడి.

దశమస్కంధమున 231 సీసగీతములు పూర్వభాగమున నున్నవి. ఇందును ... తప్ప దక్కినవి నియమభంగము లేక యున్నవి. ఉత్తరభాగమున 234-వ ...మునఁజ కీనియతి పోషింపఁబడినది. అనలఁ బోతరాజుకవిత్వము గాదు. ...దఁ జెప్పిననియమభంగము లెట్టివో కొన్నిసూచించెదను. వానినిబట్టి తక్కి...వి మీ రూహింపవచ్చును.

I. ఆచంద్రసూర్యమై యమరులంకారాజ్య,మునకు నెవ్వఁడు విభీషణుని నిలిపె.

ఇది ముద్రితపాఠము. ద్వితీయదళమున 'నణ'లకుఁ బ్రాసయతి. యతి యుండవలయును. దీనిని

ఆచంద్రసూర్యమై యమరులంకాధిరా, జ్యమున కెవ్వడు విభీషణుని నిలిపె.

అని యుండవలయు నని తోఁచుచున్నది.

II. నయనయుగ్మంబు లున్నతిఁ గృతార్థములుగా, నవ్వులు సూపువా రెవ్వరింక

'నెలనవ్వు చూపువా రెవ్వరింక'నని యుండవలయును.

III. గోరూప నైయె బ్రహ్మఁ జేరఁబోయి.

ఇది గోరూపనైయె బ్రహ్మఁ గూడఁ బోయియనిన నియమభంగము లేదు.

IV. ఎందేని నలునదియెనిమిది దినముల్, దరియింప నొకదివసంబు రేపు

ఇందు యతిభంగము. వావిళ్లవారికూర్పునఁ గానవచ్చు

"చరియింప నొకదివసంబు రేపు" అనుపాఠము సాధువు.

ఇట్టులే మఱికొన్ని సవరింపఁగూడినవి యున్నవి. ఇవి సవరించిన నియమభంగపాదములు తగ్గుచున్నవి. కవీతరులవలన నైనయీదోషములు కవినియమముం జెఱుపఁజాలవు. దీనివలనఁ బోతరాజునియమము సర్వత్ర కాపాడెననుట యంగీకార్యమేకదా. ఇట్టినియతి వీరభద్రవిజయమునఁ గల దనిచెప్ప రా॥ బ॥ వారు సాహసింతురా? సాహసింపఁ జాలరేని యొకచోట గ్రంథకర్తలు వేఱని స్థాపింపఁజాలినకారణము వేఱొకచోటఁ జాలకుండుటెట్లు? ఈనియతి వీరభద్ర విజయమున లేదనుటకై రెండుపద్యము లుదాహరించెద.

సీ. వేదండగమనలు వింజామరలు వీవఁ, బల్లవాంఘ్రులు వేడ్కఁ బలసికొలువ
లలితరంభోరువుల్ వెలిగొడుగులు పట్ట, సైకతజఘనలు సన్నుతింప
హరిరాజసమమధ్య లంకించి వాలార్పఁ, గరికుంభకుచలు పరాకు దెల్ప
కమలబాహులతలు కల్యాణములు పాడ, రాజనిభాస్యలు రమణఁ గొలువ
లోలమీనభృంగలోచనల్ ధమ్మిల్ల, సతులు గొంద ఱతులగతుల నడువ
తల్లి దండ్రిఁ జెలులు దర్శింప నమ్మహా, కాళి వచ్చె యాగశాల కడకు.

సీ. కట్టంగఁ జర్మమెకాని చీరలు లేవు, పూయ గంధము లేదు భూతిగాని
కాలకూటమెకాని కంఠమాలిక లేదు, ఫణిరాజుతోడుగా మణులు లేవు
తగ నాకసమెకాని తలవెండ్రుకలు లేవు, తలకుఁబువ్వులు లేవు నెలయకాని
మెక్కఁగంచము లేదు మేఁకపుఱ్ఱెయకాని, యెక్కఁగుఱ్ఱము లేదు యెద్దుగాని
మూఁడుమూర్తులందు మొగినెవ్వఁడునుగాఁడు, జాతి లేదు పుట్టుజాడ లేదు
పరమవంటిగాఁడు బ్రహ్మాదు లెఱుఁగరు, తిరుగ జోగిఁ దగునె దేవుఁ డనఁగ.

ఈ పద్యములు పంతులవా రుదాహరించిన "పరాదక్ష" యనుపద్యమునకు ముందే యున్నవి. ఆ పద్యమువఱకైన వారీగ్రంథమును బఠించియుందురు గదా. అట్లైనచో నిందలి 'లోలమీనభృంగలోచనల్, ధమ్మిల్లసతులు; పరమ వంటిగాఁడు,' ననుదివ్యప్రయోగములు భాగవతగ్రంథకర్తవని యంతఃకరణశుద్ధిగ రా॥ బ॥ వారు నిశ్చయించుకొనిరా? విధిలేదు. ఆత్మవాదరక్షణార్థము వా రవు నందురు. లోకమే మనునో చూడవలయును.

పూర్వగ్రంథమున నవలంబించిననియమము పరగ్రంథమున నవలంబింప వలయు నని విధికలదా యని యెవరైన నడుగవచ్చునుగాని వారి నా ప్రశ్నమే నే నడుగుదు ననుతలంపుతో రా॥ బ॥ వారుమాత్రము నన్నడుగఁజాలరు. మఱి యెవరైన నన్నడిగిరేని యిట్టి దాధారముగఁ దొలుతఁ దెచ్చిన రా॥ బ॥ వారి నడుగుఁ డందును.

17. "భోగినీదండకము పోతనవిరచితము కాదని చెప్పుటయే మనస్సులో నాక్షిప్తమైనను భాగవతకవిత్వముతో భోగినీదండక కవిత్వమును బోల్చిచూచి నపుడు నామన స్సట్లు వ్రాయ నొప్పినది కాదు" అని రా॥ బ॥ వారు వ్రాసిరి. ఆ రెంటితోను వీరభద్రవిజయకవిత్వమును నందలిదండకమును బోల్చిచూచి మూఁటికవిత్వము లొకరీని నున్నట్టు వారు నిశ్చయించుకొనిరా. భోగినీ వీరభద్రవిజయదండకములలోని కొంతకొంత భాగము నిందు వ్రాయుచున్నాను. ఈ సంశయము లోకమే పరిష్కరించును గాక. "కామానలజ్వాలల న్వేఁగి చింతాభరభ్రాంత యైయున్నయింతిం బరీక్షించి తన్మాత, మాయాపరాభూత జామాత, మిథ్యానయోపేత, విజ్ఞాతనానావశీకారమంత్రౌషధవ్రాత లోకైక విఖ్యాత, వారాంగనాధర్మశిక్షాధిసంఖ్యాత సమ్మోహితానేకరాజన్యసంఘాత, వాచాలతాబద్ధ నానామహాభూత యేతెంచి కూఁతుం బరీక్షించి నీతిన్విచారించి బుద్ధిన్వివేకించి బాలన్ మిళత్కుంతలవ్రాతఫాలన్ గరాంభోజరాజత్కపోలన్ సఘుందోష్ణనిశ్వాసతాలన్ విపర్యస్తసన్న్యాసచేలన్ మహాందోళనప్రేంఖితస్వర్ణదోలన్ మృగేంద్రావలగ్నన్ దయావృష్టిమగ్నన్ మనోజాగ్నిభగ్నన్ ....విలోకించి లోనం బరాయత్తయై చిత్తజాతాసిధారాచలచ్చిత్తయై విన్నయై ఖిన్నయై యున్నభావంబు భావించి నెయ్యంబుఁ గావించి బాలా జితత్వంబు మేలా విచారింపవేలా వినోదింపనేలా వయోధర్మముల్ రిత్తగాఁ బుచ్చ నీవృత్తికి న్నెత్తురే వత్తురే కాముకుల్ దాయఁ గాయంబు విద్యున్నికాయోపమేయంబు ప్రాయంబు ధారాధరచ్ఛాయ మిన్నేనుపాయంబులన్ విత్త మా

యత్నముం జేయుమా రిక్థవారంబు నేరంబుగా దీవిచారంబు వంశానుచారంబు సంసారసారంబు లాభాదికారంబు"........మొ॥

భోగినీదండకము.

ఇఁక వీరభద్రవిజయమందలి దండకమునఁ గొంత యెత్తి వ్రాసెదను. సమాసము లన్వయించుకొనుచుఁ జదువఁ బ్రార్థించెదను.

"శ్రీవీరరూపా శివద్రోహగండా ప్రచండప్రతాపా సుపర్వాణసంఘాత మోభానుబింబప్రదీపా । మహాకోపరూపాది వీరాంకవీరా పురారాతిసంహార ఘోరావతారా శివాచారమందార బృందారకాధీశగర్వాపహారా దయాకార నాగేంద్రహారా సనందాదియోగీంద్రచేతోవిహారా జనాధార నీదివ్యతత్త్వంబు భావింపఁగాలేక గర్వాంధకారాంధు లేమైతిమో నీమహారూపంబు రూపింప నజ్ఞానబంధంబులం జిక్కి వేదప్రకారంబులన్ మించి యుచ్చాటికిన్ దక్షయాగంబు వీక్షింపఁగా నిన్ను మారాక యెల్లన్ గడుం దప్పులై యుండు సైరింపవే దేవదేవా శివద్రోహు లైనట్టిమమ్ముల్ విజృంభించి శిక్షించి తీవింక నీదైన వైరంబు చాలింపు మోతండ్రి* మిమ్ముంగూర్చి యేమెంత వారమ్ము"........మొ॥

18. భాగవతమున గద్యము.

శ్రీపరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర సహజపాండిత్యపోతనామాత్యప్రణీతము.

వీరభద్రవిజయము గద్యము.

శ్రీమన్మహామహేశ్వర యివటూరిఆరాధ్యసోమనాథదేవ దివ్యశ్రీపాదపద్మారాధక కేసనామాత్యపుత్ర పోతయ నామధేయప్రణీతము.

రెండుగద్యముల కేమైన సంబంధ మున్నదేమో పరిశీలింపుఁడు. సహజ పాండిత్య యను విశేషణము వీరభద్రవిజయగ్రంథకర్త వేసికొనలేదు. ఏల? తనతండ్రియొద్ద విద్యాదులు నేర్చినట్టు "జనకశిక్షిత విహితాభ్యాసుండనై" యని వ్రాసికొనినాఁడు. భాగవతకవి యట్టినోము నోఁచలేదు. జనకశిక్షిత విహితవిద్యాభ్యాసుఁడనై యని తాళపత్రపాఠము.

"శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర" యను భాగవతగద్యమును బట్టియు వీరభద్రవిజయమునుబట్టియు విచారించిచూడఁగా శివప్రసాదమువలన నీతనికిఁ గవిత్వ మలవడుట కవియభిప్రాయ మయినట్టు స్పష్టమగుచున్నది" అని రా॥ బ॥ వారు వ్రాసిరి.

* గణభంగము.

పోతరాజు కేవల మద్వైతి; శివకేశవుల కభేదము చెప్పువాఁడు. దీనిని. జేతులారంగ శివుని బూజింపఁడేని యనుపద్యమే చాటుచున్నది. ఈ యనకు విష్ణుభక్తిమెండు; అయినను శివునకు నికృష్టత చెప్పినవాఁడు కాఁడు. శైవమతమునఁ బుట్టినను వీరశైవుఁడు గాఁడు. వీరశైవుఁడు విష్ణువునకుఁ బరత్వము చెప్పఁడు. పోతరాజు భాగవతమున విష్ణువునకుఁ బరత్వము చెప్పినవాఁడు. వీరశైవుఁడు తనగ్రంథము వేఱుగతిలేక వచ్చినఁదప్ప విష్ణువున కంకిత మీయఁడు. “మదీయపూర్వజన్మసహస్రసంచితతపఃఫలంబున శ్రీమన్నారాయణకథాప్రపంచవిరచనాకుతూహలుండను” అని వ్రాయఁడు. రా॥ బ॥ వారే శ్రీనాథునిగురించి వ్రాయుచు “ఈ కవిచేతనే రచియింపఁబడిన నందనందనచరిత్రము లోనిదన్నపద్యము నొకలక్షణగ్రంథమందుఁ జదువుటయేకాని నాకు గ్రంథము లభించినదికాదు, పేరునుబట్టిచూడఁగా శ్రీనాథుఁ డట్టిగ్రంథమును రచియించియుండునని తోఁచదు. భీమఖండాదిశైవపురాణములలోనే విష్ణుకథవచ్చినపుడు విడిచిపెట్టిన మహానుభావుఁడు కేవలకృష్ణకథ యైనవనందనందనచరిత్రమును రచియించియుండునా? అనివ్రాసిరి.

ఇఁక వీరభద్రవిజయగ్రంథకర్తయో వీరశైవుఁడు. శైవవిశిష్టాద్వైతి. విష్ణువునకు నికృష్టత నారోపింప వెనుదీయువాఁడు కాఁడు. ఆరాధ్యశిష్యుఁడు. ఇతఁడు నీతనివంశమువారు శైవగ్రంథములనే రచియించిరి.

భాగవతగ్రంథకర్తయందు సార్థకమైన ‘కవితావిచిత్ర’ విశేషణము వీరభద్రవిజయకర్త కన్వయింపదు.

శివునిప్రసాదమునఁ బోతనకుఁ గవిత్వ మలవడె ననుటకు నాధార మేదియుఁ గానరాదు. శోధించిచూచినఁ, ‘బలికించెడివాఁడు రామభద్రుండఁట’ యని చెప్పెనుగాని శివుఁడని చెప్పలేదు. మహానుభావులు రామభద్రుఁ డనునది వీరభద్రుఁ డని దిద్దెదరేమో. “శ్రీపరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర” యని చెప్పెను. ఈ పరమేశ్వరుఁ డెవఁ డేయూరివాఁడు? ఇవటూరివాఁడు గాఁడు. “ఇవటూరిముక్తినాగేశసద్గురుభక్తి నాదిమశైవులైనట్టివారి”నని కేసనమల్లనకవుల, వాక్యము. “ఇవటూరిఆరాధ్య” యని వీరభద్రవిజయగ్రంథకర్త చెప్పుటచే నాయన కన్వయించునుగాని యా మాటలు చెప్పకొనకుండుటచే భాగవతగ్రంథకర్త కన్వయింపదు. భాగవతగ్రంథకర్త యివటూరియారాధ్యశిష్యుఁడైనచో వీరభద్రవిజయమునఁ జెప్పినట్లు భాగవతమునఁ జెప్పియుండును. గురువు నలక్ష్యపఱిచి యుండఁడు. తొలుత లేనిగురువు నడుమ నెక్కడనుండివచ్చును? ఆయన మనస్థితి, భక్తిభావన, వైరాగ్యము నాలోచించిన గద్యమునఁ జెప్పఁ

బడినపరమేశ్వరుఁడు “ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీలమై యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం, బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వము దాన యైనవాఁ డెవ్వఁడు” అనుపద్యములోఁ జెప్పఁబడినపరమేశ్వరుఁడే. శ్రీపరమేశ్వరశబ్దమునకు శివుఁడనియే యర్థము నిర్ధారింప నాధారమేదియో? ఈశ్వరపరమేశ్వరశబ్దములు విష్ణుపర్యాయములుగ భాగవతమునఁ బరశ్శతస్థలములందుఁ గలవు. నిఘంటువులును నీశబ్దములకు విష్ణు వనునర్థ మిచ్చుచున్నవి. ద్వితీయస్కంధమున “పరుఁడై యీశ్వరుఁడై .... తేజరిల్లుహరికిన్” 58-వ పద్యము. అప్పరమేశ్వరునకు నమస్కరించెద 59. ఏపరమేశుపాదయుగము. ఇవన్నియుఁ బోతనప్రయోగించినవే. ఈశ్వరసన్నిధానంబు గల్పించుకొని. రావే యీశ్వరకావవే వరద యిత్యాదులు గజేంద్రమోక్షమునఁ గలవు. పద్మపురాణంబున “శ్రీభూనీళాపతిర్యోఽసా వీశ్వర స్సఉదాహృతః । తస్మా త్స ర్వేశ్వరత్వంతు వాసుదేవే ప్రతిష్ఠితమ్ ॥ యోఽసౌ విరాట్త్వమాపన్నో హవిర్భూతో జనార్దనః । సన్తర్పయతి లోకాం స్త్రీం త్సఏవ పరమేశ్వరః॥” అని యున్నది. ‘పార్వతీపరమేశ్వరా’ అన్నప్పుడు పార్వతీశబ్దసాహచర్యబలముచేఁ బరమేశ్వరశబ్దమునకు శివుఁడని యర్థము చెప్పునట్లు శ్రీశబ్దసాహచర్యమువలన శ్రీపరమేశ్వర యనిన విష్ణువని యర్థము చెప్పఁగూడును. కవికిఁ గలవిష్ణుభక్తియు వైష్ణవగ్రంథరచనయు దీనిని బలపఱుచును. తండ్రి శివభక్తుఁడైనంతమాత్రమునఁ గొడుకు నట్లే యుండవలయునని సిద్ధాంతము లేదు. తండ్రి శివభక్తుఁడయ్యు విష్ణునామము తనకుఁ బేరుగ (కేసన్న-కేశవన్న) నుంచుకో లేదా. కావున శ్రీపరమేశ్వరశబ్దమునకు శివుఁడే యని నిర్ధారించుటకుఁ దగినయాధారము లేదు. విష్ణువని యర్థము సిద్ధాంతీకరింపఁ గూడినను నేనట్లుచేయను. ఆయన యద్వైతికావున నాయనభావమునకుఁ దగినయర్థమే చెప్పెదను. కనుకనే గజేంద్రమోక్షమునుండి యుదాహరించితి.

ఆర్యులారా! నే నిట్లు చెప్పుటకుఁ గారణము లేకపోలేదు. “విద్వత్కవయః కవయ” యన్నట్లు లోకఁడు కవి యనుప్రఖ్యాతి వహింపవలసియుండినచో నతనియందు బాండిత్యము కవితాశక్తి రాణిల్లుచుండవలయును. ఈ రెండును దనకుఁ గలవనియు నవి లభించినవిధమును బోతన గద్యములో సహజపాండిత్య యనుటచేతను బరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర యనుటచేతను జెప్పెను. సహజపాండిత్యుఁడ ననిచెప్పి స్వయముగఁ గృషిచేసి గ్రంథపఠనము కావించి విద్యసంపాదించితినిగాని “గురుశుశ్రూషయా విద్యా” యన్నట్టు

గురుముఖమున విద్యసంపాదించినవాఁడఁ గానని తెలిపెను. దీనివలన నాయన సామర్థ్యము వెల్లడియగుచున్నది గాని లోపము తెలియఁబడుటలేదు. గురుముఖమున విద్య నేర్చినవారి కవితయందు దోషములు లేనట్టుగ గురుముఖమున విద్య నేరువమి నితనికవిత్వమందు దోషములున్నట్టు కొందఱు వ్రాయుట సరిగా నాకుఁ దోఁపదు. అప్పకవివంటి పురోభాగియు ఱ-ర లకు యతిప్రాసముల మైత్రి కలసినదోషముతప్ప మఱియేదోషము బమ్మెరపోతరాజకృతభాగవతమున లేదని చెప్పి వీరభద్రవిజయములో దోషము లుండుటవలన భాగవతమునందుఁగూడ దోషము లున్నవని చెప్పునట్టివంతు రా॥ బ॥ వారికి విడిచెను.

ఇఁకఁ గవిత్వమూ స్వకృషివలనవచ్చునది కాదు. గురువువలన లభ్యపడునది కాదు. "పూర్వజన్మసహస్రకృతసుకృతవిశేషంబునఁ బరమేశ్వరానుగ్రహంబున" వచ్చిననే మేలు. కవితా వనితా చైవ స్వయమేవా గతావరమ్" అనియు "శక్తి, ర్నిపుణతా, లోకకావ్యశాస్త్రాద్యవేక్షణాత్, కావ్యజ్ఞశిక్షయాఽభ్యాస ఇతి హేతు స్తదుద్భవే" యనియుఁ గలదుగదా. ఇందు శక్తి యనఁగా దైవదత్త ప్రతిభగాని వేఱొండు గాదు. ఇది పరమేశ్వరానుగ్రహలబ్ధమే. ఈయర్థమును సూచించుటకే "పరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర యనిచెప్పెను. "అహంకారవిమూఢాత్మా కర్తాహ మితి మన్యతే" యన్నట్టు విద్యాప్రాగల్భ్యకవితా సామర్థ్యగర్వదూషితచిత్తుఁడుగాక యీరెండును భగవద్దత్తములే యని యాత్మ నైచ్యముఁ దెలిపెను. అంతటిభక్తుఁడు వాస్తవాద్వైతి యట్లగాక యిఁక నెట్లు చెప్పును. రా॥ బ॥ వా రూహించినట్టు శివప్రసాదమువలనఁ గవిత్వము లభించియుండెనేని శివరూప సగుణబ్రహ్మమును సూచించు శ్రీమదుమామహేశ్వరేత్యాది వాక్యములనే ప్రయోగించియుండును. ఈ విధముగ నాలోచించిన భాగవతగద్యము రావుబహదర్ వారియూహ కాధార మగునంతటిశక్తి కలది కాదయ్యెఁగదా.

ఇఁక వీరభద్రవిజయగద్యమును బరిశీలించిన నందును శివప్రసాదమువలనఁ గవిత్వము లబ్ధమైనట్లు సూచించుపదజాల మేదియుఁ గానరాదు. "వీరభద్రవిజయమునుబట్టి" యని నేను వ్రాసితినిగాని వీరభద్రవిజయగద్యమును బట్టి యని నేను వ్రాయలేదని రా॥ బ॥ వా రందు రేని వారివాక్యమున కాధారమైన గ్రంథస్థవాక్య మేదియో చెప్ప వారిని బ్రార్థించెదను.

గీ. వెలయ మఱియుఁ గల్గువీరమాహేశ్వరా, చారవరుల వీరసత్యవ్రతుల
వీరసచ్చరితుల వీరవిక్రములను, బరఁగ మ్రొక్కి తలఁచి భక్తితోడ.

వ. "తత్ప్రసాదకరుణావిశేషప్రవర్ధమానకవితామహత్త్వసంపన్నుండనై" యని యొకచోనున్నది.

వేఱొకచోట "మత్ప్రసాదదివ్యమహిమచే నెంతైనఁ గవితచెప్ప లావు గలదు నీకు" అనియున్నది.

మఱియొకచోట "వీరభద్రప్రసాదలబ్ధకవితాతిశయంబున"ననియున్నది.

ఇప్పటికి మూఁడుప్రసాదము లయినవి. వీనిలో రా॥ బ॥ వారి శివప్రసాదము శివప్రసాదముగానే యున్నది.

కావున నుభయమునకు నైకమత్యము స్థాపింపనెంచిన రా॥ బ॥ వారి ప్రయత్నము విఫలమయ్యెను.

"ఇది శ్రీసకలభాషావాగనుశాసన శ్రీనన్నయభట్టవిరచితంబైన చాముండికావిలాసంబునందుఁ బ్రథమాశ్వాస" మనియు "ఇది సకలసుకవిజనశ్రేష్ఠ నన్నయభట్టవిరచితంబైన చాముండికావిలాసం బనుమహాప్రబంధమునందు ద్వితీయాశ్వాసము" అనియు ఇది సకలకవిబుధవినుత సర్వవిద్యావిచక్షణ నన్నయభట్టవిరచితంబైన చాముండికావిలాసం బనుమహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము* అనియు ఆశ్వాసాంతగద్యములు వేఱువేఱుగా నున్నవి. పయినిఁ జెప్పఁబడిన హేతువులనుబట్టి విచారింపఁగా నీచాముండికావిలాసమును నూఱు సంవత్సరములక్రిందట దత్తమండలములోని నందవరీకు లెవ్వరో నన్నయభట్టు పేరుపెట్టి రచియించినట్టు నాకుఁ దోఁచుచున్నది" అని రా॥ బ॥ వారువ్రాసిరి.

ఆ గ్రంథమందే "ఆంధ్రవాక్యానుశాసనం బతిశయిల్లఁ, జేసి లోకోపకారార్థసిద్ధిఁ జేసి, ఘనత రాజనరేంద్రునికరుణఁ బడసి, నట్టివాఁడను నన్నయభట్టనేను" అని విస్పష్టముగా నున్నదని రా॥ బ॥ వారే యనువదించిరి. ఈగ్రంథమును నేను జూడలేదు. రా॥ బ॥ వారి వాక్యములనే యుదాహరించుచున్నాను. ఆముక్తమాల్యదయందలి పద్యరూపక "గద్యము"లందువలెఁ జాముండికావిలాసగద్యములం దీషద్భేదము కానవచ్చుటఁ జేసి యదియు నొక కారణముగఁ గొని చాముండికావిలాసము నన్నయభట్టకృతము కాదని సిద్ధాంతము చేసిన రా॥ బ॥ వారు భాగవతవీరభద్రవిజయగ్రంథగద్యములందుఁ గవిపేరు తండ్రిపేరుతప్ప నితరసంబంధ మీషన్మాత్రము కానరాకున్నను రెండు నేక కవికృతములనుటకు వారికి మన స్సెట్లొప్పెనో.

19. బుద్ధిబుద్ధీత్యాదిశబ్దములు గానవచ్చుటచేఁ జాముండికావిలాసము

* ఇది తృతీయాశ్వాసమని యుండవలయునేమో.

నన్నయభట్టకృతము కాదనిరి. వీరభద్రవిజయమున స్వామిద్రోహరగండేత్యాది కర్ణాటకపదములు కానవచ్చెడిని. భాగవతమున నిట్టివిగలవా?

20. వీరభద్రవిజయమునకు భాగవతమునకు గ్రంథకర్త యొకఁడే యన నొకయాధారము గానవచ్చుచున్నది. అందు నెఱసులు కానరాకుండినచో శ్రీరామమూర్తిపంతులవారి వాదమును నా యొక యాధారముచేతనే రా॥ బ॥ వారు ఖండించియుందురు. అట్లు చేయకుండుటచే దానియందు వారికిని విశ్వాసము లేదని గ్రహింపవచ్చును. ఈ యాధార మేదన రెండుగ్రంథములయందును గవివంశపురుషులనామములు కొంతవఱకు సరిగా నుండుట. భాగవతమందలివియు,వీరభద్రవిజయమందలివియుఁ గవివంశవర్ణనములనుదాహరించెద.

సీ. కౌండిన్యగోత్రసంకలితుఁ డాపస్తంబసూత్రుండు పుణ్యుండు సుభగుఁ డైన
భీమనమంత్రికిఁ బ్రియపుత్రుఁ డన్నయ కలకంఠి తద్భార్య గౌరమాంబ
కమలాప్తువరమునఁ గనియె సోమనమంత్రి వల్లభమల్లమ వారితనయుఁ
డెల్లన యతనికి నిల్లాలు మాచమ, వారిపుత్రుఁడు వంశవర్ధనుండు
లలితమూర్తి బహుకలానిధి కేసన, దానమాననీతిధనుఁడు ఘనుఁడు
దనకు లక్కమాంబ ధర్మగేహిని గాఁగ,మనియె శైవశాస్త్రమతముఁ గనియె.

కం.నడవదు నిలయము వెలువడి, తడవదు పరపురుషగుణముఁ దనపతి నుడువున్
గడవదు వితరణకరుణలు, విడువదు లక్కాంబ విబుధవిసరము పొగడన్.

ఉ. మానిను లీడుగారు బహుమాన నివారితదీనమానస
గ్లానికి దానధర్మమతి గౌరవమంజుల తాగభీరతా
స్థానికి ముద్దుసానికి సదాశివపాదయుగార్చనానుకం
పానయవాగ్భవానికిని బమ్మెరకేసయ లక్కసానికిన్

కం.ఆమానినికిం బుట్టితి, మేమిరువుర మగ్రజాతుఁ డీశ్వరసేవా
కాముఁడు తిప్పన పోతన, నామవ్యక్తుండ సాధునయయుక్తుండన్. భాగ.

రావుబహదర్ వారిమతప్రకార మిట్టికవిత కుదిరినతరువాత వ్రాసిన వీరభద్రవిజయమందలి వంశవర్ణనపద్యముల నుదాహరించెద. అందలి యంత్యానుప్రాసవైఖరి, శబ్దార్థజ్ఞానసౌష్ఠవము, లక్షణాభిజ్ఞత, సామాన్యవివేక మెంతపొంకముగా నున్నదో రసజ్ఞు లరయుదురుగాక.

మ.ధనదుం డాయతపుణ్యమూర్తి మునిమందారుండు సన్మాన్యుఁడున్
ముని నిర్నిద్రదయాత్ముఁడున్ మహితుఁడున్ మార్తాండతేజుండు భూ
తనయాధీశ్వర వర్ణనీయుఁడు తపోగణ్యుండు నైనట్టికౌం
డినకుం డన్ముని సన్మునీంద్రపరుఁడై యిద్ధాత్రిఁ గీర్తింపఁగన్.

ఉ. మల్లయభీమనాహ్వయకుమారకుఁ డన్నయమంత్రికిన్ దయా
వెల్లికి గౌరమాంబ కరవిందదళేక్షణుఁడై జనించి వ
ర్ధిల్ల వెలుంగు సజ్జనవిధేయుఁడు సోమననామధేయుఁ డా
మల్లమయందుఁ గాంచె సుకుమారుల ధీరుల సత్కుమారులన్.

ఉ. నీతియుగంధరుం డనఁగ నిర్మలుఁడై ఘననాగరీకుఁడై
యాతత మైన రేచనయు నన్నయ మంత్రియు సర్వశైవలో
కాతురహారుఁ డెల్లనయు నయ్యలుప్రెగ్గడయున్ నయాగుణ
వ్రాతవిభూషణుండు జనవంద్యుఁడు మాచయ నాఁగ నున్నతిన్.

కం.అందుల మధ్యముఁ డెల్లన, మందరధీరుండు నీతిమంతుఁడు వనితా
కందర్పుఁడు మాచాంబిక, నందంబుగఁ బెండ్లియాడె నభినవకీర్తిన్.

ఉ. మానిని మాచమాంబకుఁ గుమారుఁడు యల్లనకుం బ్రసిద్ధిగా
మానుగ నుద్భవించిరి కుమారులు కేసనయున్ గుణావళిన్
మానితుఁ డైనమాధవుఁడు మాన్యుఁడు నిమ్మడి నాఁగ మువ్వురున్
భానుతవైరి తేజమునఁ బోలిరి ధర్మజభీమపార్థులన్.

ఉ. భూసురవంద్యునిన్ సుగుణభూషణు నాశ్రితకల్పవృక్షమున్
దాసజనప్రసన్ను శివతత్త్వమనోరథ కౌతుకోన్నతిన్
గేసనమంత్రి సత్యనిధిఁ గీర్తివిశాలచిరాయుసంపదున్
జేసి యుమామహేశ్వరులు చెన్నుఁగఁ గాతురుగాక సత్కృపన్.

(అబ్బకాశీర్వచనము.)

ఉ. అట్టిఘనుండు మంచిలి దయాగుణధీమణి మాచమాంబకున్
బుట్టినలక్ష్మియో యనఁగఁ బొల్పగుగోపనసూరిచెల్లెలిన్
నెట్టన పెండ్లియాడె మహనీయుఁడు కేసనమంత్రి శ్రీసతిన్
దట్టపువేడ్కఁ గేశవుఁడు దాను వరించినభంగిఁ బొంగుచున్.

ఉ. పావనగంగ భోగశచి భాగ్యపుగౌరి గభీరభూమిసం
భావనకుంతి రూపగుణభారత సంపదలక్ష్మిదేవి సం
సేవితసంజ్ఞ నిశ్చలవిశేషయరుంధతి యైనలక్ష్మి దాఁ
గేవలకన్యయే తలఁపఁ గీర్తనసేయఁ దగున్ ధరాస్థలిన్.

కం.ఆదంపతులకు సంతత, మోదితచిత్తులకు మిథునముఖ్యులకు దయా
పాదితగుణులకు శంకర, పాదయుగాంభోజభక్తపారీణులకున్.

శా.సారాచారుఁడు వైభవోన్నతగతిన్ సంపూర్ణచంద్రుండు భూ
భారాహీంద్రసమానదక్షుఁడు సదాభర్మాకరుం డర్థిమం

దారుం డంచితరూపరేఖలను గందర్పుండు భూయోయశ
శ్రీస్ఫురమ్యుం డగుతిప్పనార్యుఁడు జనించెన్ వంశవర్ధిష్ణుఁడై.

వ. తదనుజుం డై యేనుజన్మించి పోతయనామధేయుండనై పరఁగి జనకశిక్షిత
విహితాభ్యాసుండనై వీరభద్రప్రసాదలబ్ధకవితాతిశయంబున.

ఉ. భాగవతప్రబంధ మతిభాసురతన్ (అనుపద్యమున్నది.)

ఈ పద్యములు చదివినంతమాత్రన (లక్షణజ్ఞానము శోధింపవలసినంత పనియు లేదు) భాగవతగ్రంథకర్త వీరభద్రవిజయగ్రంథకర్త కాఁడని శైలీతారతమ్యజ్ఞు లెఱుఁగఁ గలరు. భాగవతగ్రంథకర్త భీమనతోఁ దన వంశవృక్షమును బ్రారంభింప వీరభద్రవిజయకర్త యాయనతండ్రిపేరును వ్రాసెను. తొలుతఁ దెలియనితనవంశమూలపురుషునినామ మావల నెట్లెఱిఁగెనో. అంతియగాదు. భాగవతమున లేనిపేర్లిందుఁ బెక్కులు గానవచ్చుచున్నవి. ఇందుఁ దిప్పయ్య వైభవోన్నతుఁ డని ధనవంతుఁడని చెప్పఁబడెను. పినతండ్రియిమ్మడియు ధనవంతుఁడే. నిజమైనచోఁ బోతరాజుదరిద్రుఁ డెట్లుకాఁగలఁడు? "హాలికు లైన నేమి? "ఆఁకటగ్రాసముకోసరంబు" అని చెప్ప నేమి కారణముగలిగెను? ఈ విరుద్ధవిషయ సమ్మేళనాదులు చౌర్యమును జాటించుచున్నవి.

ఇందు సంశయాస్పదము లైనవి మఱికొన్ని కలవని పైవంశవృక్షమును శోధించువా రెఱుఁగఁ గలరు. వీని నన్నిటిని బర్యాలోచింపఁ బరయశోధనపశ్యతోహరుఁడై వీరభద్రవిజయగ్రంథకర్తయు నామసామ్యమునుబట్టి భాగవతగ్రంథకర్త యశస్సును దా నపహరింపఁగోరి "భాగవతప్రబంధ మతిభాసురతన్" అని వ్రాసి దాని కాధారముగఁ దనవంశము పోతరాజువంశము కలిపి యీ దబ్బిలిపద్యముల వ్రాసెనని తోఁచుచున్నది. లేదా భాగవతప్రబంధమనునది ప్రక్షిప్తమేమో.

21. కాశీఖండము సప్తమాశ్వాసములోని

సీ. శితికంఠునకును నెచ్చెలికాఁడు కాఁడొకో, యటమటీఁ డైనయీయక్షభర్త
యహికంకణునకు మూఁడవకన్ను గాఁడొకో, పాల్మాలునట్టి యీపావకుండు
పురవైరి కనతంసపుష్పంబు గాఁడొకో, నిర్భాగ్యుఁ డైనయీనీరజారి
గంగాధరునకు లెంకలలెంకగాఁడొకో, పెనుగూళ యైనయీయనిమిషేంద్రుఁ

గీ. డేమిగుడువంగవచ్చినా రిండ్లువిడిచి, హరుని వెలివెట్టినట్టి యీయాగమునకుఁ
బంచవదనుసికను జేవుఱెంచెనేని, తత్క్షణమునంద తమయాంధ్ర త్రాళ్లుదెగవె?

అనుపద్యము వీరభద్రవిజయమునఁ జతుర్థాశ్వాసమున నాసందర్భమునందే

సీ. నీలకంఠునకును నెచ్చెలికాఁడొకో, యటమటీఁ డైనయీయంబుజాక్షుఁ
డహికంకణునకు మూఁడవకన్ను గాఁడొకో, పాలుమాలినయట్టి పావకుండు
గంగాధరునకు సంగడికాఁడు కాఁడొకో, పెనుకూళ్లమా రైనయనిమిషపతి
పురవైరికిని తలపుష్పంబు గాఁడొకో, నిర్భాగ్యుఁ డైనయీనీరజారి

తే. యేమిగుడువంగ వచ్చితి రిందుమీరు, తాము పాలించునట్టిలోకముల విడిచి
ఎంచవదనునికను జేఁగురించెనేని, తత్క్షణంబున తమయాంధ్ర తాడుదెగదె.

ఈ విధముగఁ గానవచ్చుచున్నది. ఆ యాకవుల వాక్యములప్రకారము పిన్నవయసున రచియింపఁబడినది వీరభద్రవిజయము. ప్రాయ మింతకు మిగులఁ గైవ్రాలకుండునపుడు రచింపఁబడినది కాశీఖండము. రా॥ బ॥ వారి సిద్ధాంతప్రకార మిరువురు సమకాలికులు. ఇందు దొంగ యెవరో? భాగవతగ్రంథకర్త యీపద్యమును దొంగిలె ననుటకంటె దుర్వాదమింకొండుండదు. వీరభద్రవిజయకర్త శ్రీనాథునియనంతరమువాఁడని నా భ్రాంతి. రా॥ బ॥ వారు స్వప్రతిజ్ఞప్రకారము తమజ్ఞానజ్యోతిచే నాభ్రాంతి నణఁచి యుద్ధరింతురుగాక. పూర్వకవి పద్యము నుదాహరించినవాఁడు వానికివెనుకటివాఁడని రా॥ బ॥ వారే కొన్నిచోటుల సిద్ధాంతీకరించియున్నారు.

22. దాక్షాయణీవివాహకృతికర్త లైన కేసనమల్లనలు భాగవతగ్రంథకర్త యైనపోతనామాత్యునిమునిమనుమలని రా॥ బ॥ వారు వ్రాసిరి. వీరు వీరభద్రవిజయగ్రంథకర్తమునిమనుమ లేమో యని తలంచెద. వీరభద్రవిజయమందు "ఇవటూరి సోమనాథదేవదివ్యశ్రీపాదపద్మారాధక" యని యుండుటచేతను దాక్షాయణీవివాహకృతికర్తలు తాము "ఇవటూరిముక్తినాగేశసద్గురుభక్తినాదిమశైవుల"మని వ్రాసికొని యుండుటను నుభయులు వీరశైవులగుటను నేనట్లూహించితి. రా॥ బ॥ వా రుదాహరించిన పద్యమందుఁ బోతరాజు మనుమఁడు ప్రౌఢసరస్వతి యనిరి. "పోతనామాత్యునిమనుమఁ డగునారాయణకవికృతవజ్రాభ్యుదయము" అని శేషాద్రిరమణకవులు 7-4-17గల కృష్ణాపత్రికయందుఁ బ్రకటించిరి. దీనివలనఁ బ్రౌఢసరస్వతితాత పోతరా జొకఁడు, నారాయణకవితాత పోతరాజొకఁడు నిరువు రున్నట్టు లేర్పడెనుగదా. రా॥ బ॥ వా రిరువురు మనుమలు నొక్కరే యందురేని సిద్ధాంతముచేయవలసినభారము వారియందున్నది. అంతియకాక భాగవతకవికి మనుమలు మునిమనుమలు కవీశులైనచో శిథిలభాగము లితరులచేఁ బరిపూరితము లేల కావలసివచ్చెనో తెలియఁజెప్పవలసియుండును. కేసనమల్లనలు తమ పితామహుని భాగవతగ్రంథకర్త యని

కొనియాడ లేదు. వా రంతటి యభిమానహీనులా? సామాన్యవీరభద్రవిజయ కర్త యగుటచేత నామము మాత్రము వక్కాణించిరి. ఎఱ్ఱాప్రెగడ మనుమఁ డాయన నెట్లు పొగడెనో తెలియదా? అట్టిస్తుతికి భాగవతకర్త యర్హుఁడు కాఁడా?

23. దాక్షాయణీవివాహమును బంపుఁడనియు దానినిఁజూచి మూఁడవ నాఁడే మరలఁ బంపెద ననియు రా॥ బ॥ వీరేశలింగముపంతులవారిని బ్రార్థించి యుత్తరము వ్రాసితిని. నాకుఁ బ్రత్యుత్తరమైన నీయ వారికి మనస్సొప్పినది కాదు. గుండ్రాయి దాఁచి పెండ్లినిలుప యత్నించిరేమో కానిండు. అది మరల లోకమునకు గోచరించుట కలిగెనా రా॥ బ॥ వారి విప్రవినోదవిద్యయుఁ గొంత వెలువడునను నమ్మకము నాకుఁ గలిగించినయాధారము నాయొద్దఁ గలదు. అది నా వాదమును బలపఱుచుచు రా॥ బ॥ వారు వ్రాసినదానిని ఖండించుచున్నది. ఆ యాధారము నా కొసఁగినవారు దాని నిప్పుడే ప్రకటింప సమ్మతింపమిని దాఁపవలసివచ్చినది. కేసనమల్లనలగుఱించి వారిచరిత్రము వ్రాయునపు డేమి వ్రాయుదురో చూచి తరువాత బయలుపెట్టవలసియుండినఁ బెట్టెదను. రా॥ బ॥ వారి యనువాదములయందు గ్రంథములలోని తమ కనుకూలవాక్యములు గ్రహించుట ప్రతికూలవాక్యములు విడుచుట కానవచ్చుట కలదు. ఇదియే నా సందేహమునకుఁ గారణము. పోతరాజుమనుమలు కేసన మల్లనలు గురుజాల మల్లనసోమయాజికి దాక్షాయణీపరిణయకృతి నిచ్చిరి. ఈ గురుజాల కిప్పటిపేరు ఆచంట. కేసనయల్లుఁడు అజ్జరపుఁబేరయలింగకవి. ఈ యజ్జరము తణుకుతాలూకాలోఁ దణుకునకు రెండుమైళ్లదూరములో నున్నది. దీనినిబట్టి పోతరాజుసమీపబంధువు లీప్రాంతమువారే కాని గోలకొండవారు కారనుట స్పష్టము. సమీపబంధువు లీదేశమువా రైనపుడు పోతరాజీదేశము వాఁడని యూహించుట యసమంజసమా? ఈ పోతరాజు భాగవతగ్రంథకర్తయైనను వీరభద్రవిజయగ్రంథకర్తయైనను రా॥ బ॥ వారి వాదము నిర్మూలితము. ఇప్పటి కీమాత్రము చాలును. దీనివలననే బమ్మెర యనునింటిపే రున్నంతమాత్రముననే యా యింటిపేరు గలవారందఱు సృష్ట్యాదిగ నేఁటివఱకుఁ బమ్మెర యందేపుట్టిపెరిఁగి మరణించి నారనుట విశ్వాసపాత్రము కాదనునావాదము బలపడినది.

24. ఆర్యులారా! రా॥ బ॥ వారి యభిప్రాయమున భాగవతకర్తయే వీరభద్రవిజయకర్తయును, శ్రీరామమూర్తిపంతులవారి యభిప్రాయమున వా రిరువురు భిన్నులు, అందు వీరభద్రవిజయకర్త నవీనుఁడునని నా యభిప్రాయమిదియే.

అట్లైనచో నీ యిరువురకుఁ గాలభేద మెంత యని మీ రడుగుదురని నాకుఁ దెలియును. కావున నావిషయము నాకుఁ దెలియవచ్చినంత చర్చించెదను. నేను బహుగ్రంథశోధకుఁడను గాను. కావున రా॥ బ॥ వారివ్రాఁతయే నాకు శరణము. వారు వ్రాసినదానినిబట్టియే నాలెక్క నేను జెప్పెదను. న్యాయైకదృష్టిచే మీ కేదియుక్తమని తోఁచిన నది గ్రహింపుఁడు.

బమ్మెరపోతనకాలమును రా॥ బ॥ వారు నూతనముగ నిట్లు నిర్ణయించిరి.

దాక్షాయణీవివాహకృతిపతి	మల్లనసోమయాజికిఁ గృతియిచ్చినవాఁడు
మల్లనసోమయాజి—1596	కేసన—1596
లింగన్న—1636	ఇతనితండ్రి ప్రౌఢసరస్వతి—1556
యజ్ఞన్న—1676	ఇతనితండ్రి మల్లయ్య—1516
పార్వతీశ్వరుఁడు—1716	ఇతనితండ్రి. బమ్మెరపోతన—1476
పేరమంత్రి—1756	

దీనిలో రా॥ బ॥ వారు ధర్మార్థము త్రోసివేసినది 16 ఏండ్లు పోఁగా పోతన్న 1460 వఱకైన జీవించియుండవలయుననియు 1400 లోఁ బుట్టియుండవలయుననియు ననిరి.

పూర్వము 1378 లోఁ బుట్టి 1485 లో మరణించియుండవలయు ననిరి. భేదము (1476-1435)—41 సంవత్సరములు. తరమునకు 40 సంవత్సరములవంతున గణించిరి.

దీనిలో నాకుఁ గలసందేహము విన్నవించెదను.

(1) కేసనకే ప్రౌఢసరస్వతి యనిపేరా. లేక కేసన ప్రౌఢసరస్వతి కుమారుఁడా? కుమారుఁడైనచోఁ బ్రౌఢసరస్వతికి నిజమైననామ మేది? ప్రౌఢసరస్వతి యనునది బిరుదనామ మని పంతులవా రొడయనంబి విలాసములో నుండి యుదాహరించిన యీపద్యమువలన నేర్పడుచున్నది.

ఉ. బమ్మెరవంశమందునను బ్రౌఢసరస్వతి పద్దుగాంచి తా
నెమ్మె దలిర్పఁ గేసనకవీశ్వరుఁ డప్పమనామసాధ్వియం
దిమ్మహిఁ గూర్మిఁ గన్నసుతయెల్లమయందును బేరయాఖ్యుఁడన్
సమ్మతిఁగంటి వీరనరసమ్మను గంగనమంత్రి యుగ్మమున్,

రా॥ బ॥ వారు వ్రాసిన "ప్రౌఢసరస్వతి యనుబిరు దందిన కేసనకవి (పోతనమనుమఁడు) యొక్క దౌహిత్రుఁడు అజ్జరపు పేరయలింగము తెలుఁగున నొడయనంబివిలాస మను కావ్యమును జేసెను" అనువాక్యములు పైపద్యమునకు స్వపార్థము చేయలేదనియుఁ బ్రౌఢసరస్వతి యనునది కేసనకు బిరుదనామము యనియుఁ బ్రౌఢసరస్వతియే కేసన యనియు రూఢిపఱుచుచున్నది గాని పేరయలింగము కేసనకవి దౌహిత్రుఁ డని రా॥ బ॥ వారు వ్రాసిరి. అల్లుఁ డనుట కర్థమగుచున్నది. ఈ రెంటిలో నేది సరియో ప్రాజ్ఞులే నిశ్చయింపవలయును. నావాదమున కది ముఖ్యముగాదు కావున విడిచితిని.

కేసనయే ప్రౌఢసరస్వతి యైనచో "మల్లనసోమయాజికిని పోతనకును నడుమ మూఁడుపురుషాంతరములు గడచినందున" అనువాక్య మెట్లుసాధువు? పోతనమనుమఁడేకదా కేసన. అప్పుడు రెండుపురుషాంతరములుగాక మూఁడుపురుషాంతరము లెట్లగును? తాతకు మనుమనికి నడుమ 120 సంవత్సరములను రా॥ బ॥ వారి లెక్క యెట్లు సరియగును?

పోతన్న తనకుఁ బితామహుఁ డని కేసనయే వ్రాసినట్లు రా॥ బ॥ వారుదాహరించిన యీపద్యమువలనఁ దెలియుచున్నది.

చ. నెరిగుణి గల్గునన్నయమనీషినిఁ దిక్కన శంభుదాసునిన్
బరువడి మత్పితామహుని బమ్మెరపోతన భాస్కరాహ్వయున్
వరకవిసార్వభౌముని నవారితభక్తి నుతింతు మెప్పడున్
గురుకరుణాఢ్యు లంధ్రకవికుంజరులం దగభూతిశోభిలన్.

బమ్మెరపోతన తనకుఁ బితామహుఁ డని కేసనమల్లనలు వ్రాసినను వారి తాతపేరు వారికిఁ దెలియనట్లెంచి రా॥ బ॥ వారు "పయిపద్యములోఁ గవులు బమ్మెరపోతనామాత్యునిఁ దమపితామహుఁ డని చెప్పుకొన్నను నాశ్వాసాంతగద్యములనుబట్టి యతఁడు ప్రపితామహుఁడైనట్లు తెలియనచ్చుచున్నది."

"ఇది శ్రీమద్భవానీశంకర పర్వతాలగురుప్రసాదాసాదిత సారస్వత బమ్మెరకులపవిత్ర కౌండిన్యమునిగోత్ర పోతయామాత్యపౌత్ర మల్లయామాత్యపౌత్ర సంస్కృతాంధ్రభాషాచమత్కారకవితా ధురీణతాబుధవిధేయప్రౌఢసరస్వతి కవి నామధేయ వరతనూభవ కేసనకవిమల్లనకవి ప్రణీతం బైన దాక్షాయణీవివాహంబనుమహాప్రబంధంబునందు" అని వ్రాసిరి.

ఇందు రా॥ బ॥ వారు పౌత్రపుత్రశబ్దములు ప్రౌఢసరస్వతితో నన్వయించిరి. 558-వ పుటలోఁ గడపట నిట్లన్వయించి వ్రాసినవారు 560-వ పుటలో "ప్రౌఢసరస్వతి యనుబిరు దందిన కేసనకవి (పోతనమనుమఁడు)" అని యెట్లు స్వవచనవ్యాఘాతము గావించిరో యెఱుఁగను. 40 పంక్తులలోఁ బరస్పరవిరుద్ధముగ వ్రాసినప్పుడు దేనిని బ్రమాణముగఁ గొనవలయును? ఈసందేహమును రా॥ బ॥ వారే "ఒక్కొక్కచోట నందేని పూర్వాపరవిరుద్ధాంశములుసహితమిందు పడియున్నవి. అట్టివేవేని కనఁబడినపక్షమున మొదటఁ జెప్పఁబడిన దానికంటెఁ దరువాతఁ జెప్పఁబడినది యధికప్రమాణమని చదువరులు గ్రహింతురుగాక" యని పీఠికయందు వ్రాసియుండుటచేఁ బోతనకుఁ గేసన మునిమనుమఁడనుటకంటె మనుమఁడనుటే యధికప్రమాణమని రా॥ బ॥ వారియభిప్రాయమని గ్రహింపవచ్చునుగదా.

అట్లైనచో "పోతనమునిమనుమనికాలములో నుండినమల్లనసోమయాజికిని పోతనకును నడుమనాలుగుపురుషాంతరములును మల్లన సోమయాజికిని పోతనకును నడుమ మూఁడుపురుషాంతరములును మొత్తము 1756-వ సంవత్సరమందుండిన గురుజాలపేరమంత్రికిని బమ్మెరపోతనామాత్యునికిని నడుమ నేడు పురుషాంతరములు గడచినందున నొక్కొక్కతరమునకు నలుబదేసిసంవత్సరములచొప్పునఁ జూచినచో నేడునలుబదులు నిన్నూటయెనుబది సంవత్సరములు 1756 నుండి తీసివేయఁగా 1476 సంవత్సరప్రాంతమువఱకును బమ్మెర పోతనామాత్యుఁడు జీవించియుండవలయును" అను రావుబహదర్ వారి వాక్యములో "మునిమనుమని కాలములో" అను దానిని మనుమనికాలములో ననియు "మూఁడు పురుషాంతరములు" అను దానిని "రెండు పురుషాంతరములు" అనియు "ఏడు పురుషాంతరములు" అనుదానిని "ఆఱు పురుషాంతరములు" అనియు "ఏడునలుబదులు నిన్నూటయెనుబది" అనుదానిని "ఆఱునలువదులు నిన్నూటనలువది" యనియు '1476' అనునది "1516" అనియు సవరించి పఠింపవలసియుండును. దీని సారాంశ మేమన 1400 సంవత్సరములోఁ బుట్టినపోతరాజు 1516 వఱకు అనఁగా 116 సంవత్సరములు జీవించియుండె ననుటే.

పైనుదహరించిన వాక్యమునకు మూఁడుపంక్తులక్రిందనే "ప్రౌఢసరస్వతి యనుబిరుదందిన కేసనకవి (పోతన మనుమఁడు)" అని సవరించుకొని పీఠికలో నుత్తర మధికప్రమాణమనుటకంటె నొక్కపుటలోనే యుండునీస్వోక్తివ్యాఘాతములను సచ్చుచిత్తుసవరించునప్పుడైన సవరించియుండినఁ జదువరులకుఁ జాల

నుపకారము చేసినవారై యుందురు. అచ్చుచిత్తులు తాము చూడలేదందురు కాఁబోలు, ఇప్పటి పద్ధతిప్రకారము గ్రంథమంతయుఁ జదివినఁగాని వీరియభిప్రాయము మేర్పడదు.

రా॥ బ॥ వారు పోతనమనుమఁడు కేసన యని యంగీకరించి యుండుట చేతను, కవులు చెప్పుకొనియుండుటచేతను, పోతనమనుమఁడే కేసనయని నిశ్చయించినచో రా॥ బ॥ వా రుదాహరించినగద్యమున కిట్లన్వయము చెప్పవలయును. పౌత్ర పుత్ర కవితాధురీణ (ధురీణతాయనునది దుష్టము) బుధవిధేయ, ప్రౌఢసరస్వతి కవి నామధేయ (బిరుదనామధేయము లనియర్థము. క్రమాన్వయము) వరతనూభవ అనునది యెల్లఁగేసనకవి మల్లనకవి యనువానితో నన్వయింపవలయును. ఇట్లన్వయించినచో రా॥ బ॥ వారు సృష్టించిన గందరగోళమునకుఁ గారణము గలుగదు.

రా॥ బ॥ వారు తరమునకు 40 సంవత్సరములని గణించిరి. తరమునకు 40 సంవత్సరములు గణించు నియతి మనదేశమందే కాదు. పాశ్చాత్యులందైనఁగలదా యని నాప్రశ్నము. మనదేశచరిత్రకారుల విచారింపఁగా మనదేశమునఁ దరమునఁగా నధమపక్షమున 25 సంవత్సరములనియు నధికపక్షమున 30 సంవత్సరము లనియుఁ జెప్పిరి. ఇది యుక్తముగానే తోఁచుచున్నది. ఈ కాలపువారియందుఁ దరము 20-22 సంవత్సరములే.

ఈ నియతిని దప్పి రా॥ బ॥ వారు 40 సంవత్సరములు చెప్పుటకు నాధారమెద్దియో. తరమునకు 40 సంవత్సరములే యని రా॥ బ॥ వా రందురేని అజ్జరపుపేరయ లింగముగుఱించి వ్రాయుచు "కవి కొండన కేశవపురుషుండైనందున నొక్కొక్క పురుషునికి ముప్పదేసి సంవత్సరములచొప్పునఁ జూచినచో నీ పేరయకవి 1750-వ సంవత్సరప్రాంతములయం దుండియుండును." అని యెట్లు తరమునకు 30 వర్షములుగా గణించిరి. నియతి వీరియిష్టముచొప్పున మాఱుచుండును గాఁబోలు?

"In reckoning historically by generations the word is taken to mean the interval of time between the birth of the parents and that of their children, usually computed at thirty years or three generations to a century."—*James A.H. Murray.*

"Thus the word is also used of the age or person of a generatiou usually taken as about thirty years or three generations to a century." —*Enclyopedia Britanica.*

తరములు తెలిసి కాలమెంచవలసినపుడు తరమునకు 30 సంవత్సరములు. శతాబ్దములు తెలిసి తరములు చెప్పవలసినచోట శతాబ్దమునకుఁ బ్రాయికముగా 3 తరములు. అని లెక్కింతురు. విశేషకారణములు స్పష్టముగఁ దెలియరానిచోట నిదివిధి.

ఈ యాధారములఁబట్టి రా॥ బ॥ వారు తరమునకు 30 సంవత్సరములు చెప్పుట యంగీకరింపవచ్చును. ఒకచోట నేడుతరములకు 210 సంవత్సరములని మఱియొకచోట నేడుతరములకు 280 సంవత్సరములని చెప్పుట కాధారమేమియో వినఁగోరెదను.

ఆధారము వారిస్వచ్ఛందతయే కాని వేఱేదియుఁ గాదు. వీరభద్రవిజయకర్తకు భాగవతకర్తకు ముడిపెట్టుట యుద్దేశ్యము. న్యాయ్యప్రకారము తరమునకు 30 సంవత్సరములవంతునఁ జూచిన వీరభద్రవిజయకర్త 1756-లో ఆఱుముప్పదులు నూటయెనుబది సంవత్సరములు పోఁగా వచ్చు 1576-లో నున్నట్టు లేర్పడుచున్నది. భాగవతకర్తయో రా॥ బ॥ వా రిదివఱకు వ్రాసినట్టు 1435-లో మరణించియుండినయెడల నిరువురకు 141 సంవత్సము లెడ మేర్పడుచున్నది. ఇది పూరించుటకుఁగాను $6 \times 30 = 180$ మాఱు $7 \times 40 = 280$ భేదము 100
మృతసంవత్సరము తొలఁత 1435-ను, 1476-గాఁ జేయుటచే 41
141
నీయుపాయములఁ బన్నుటయేగాక దీని కనుగుణముగ నుండునట్లు పేరయ్యను 114 సంవత్సరములు ముందఱకీడ్చిరి. "పదునేడవశతాబ్దమునందలి కవులగ్రంథములలోని పద్యములనుజూచి యటువంటిపద్యములను జేసియుండుటచేతను మఱికొన్నికారణములచేతను పేరయకవి పదునెనిమిదవ శతాబ్దమువాఁడని నిశ్చయముగాఁ జెప్పవచ్చును" అని 1750 ప్రాంతమున నతఁడున్నట్టుమున్ను వ్రాసిరి. ఇప్పుడు 1636 అనుటకు నీ కారణములన్నియు నెందుఁబోయెనో. సరళమార్గమునువదలి వక్రమార్గమునఁ బోవుటచే నెన్నికంటకములు ద్రొక్కవలసివచ్చెనో చూడుఁడు. రా॥ బ॥ వారి యిష్టప్రకార మేడుతరములుగ లెక్కించినను నిరువురు పోతన్నలకు నడుమ నూఱేండ్లకుమించి యెడము గలదు.*

*తండ్రికొడుకుల పుట్టువునకు నడిమికాలము పురుషాంతరముగ గ్రహించుటకు రావుబహద్దరువా రంగీకరించినట్టు లెఱ్ఱాప్రెగడవిషయమై వారు వ్రాసిన "ఒక్కొక్కఁడు తండ్రికి నలుబదేసి సంవత్సరములయీడునఁ బుట్టుచువచ్చినచో భీమనకొడుకు బొల్లన 1196 వ సంవత్సరమునఁబుట్టియుండవలెను; తరువాత నాతనికొడుకు కెఱపోతన 1236-వ సంవత్సరమునఁ బుట్టియుండవలెను; అటు పిమ్మట నాతనికొడుకు సూరన 1276-వ సంవత్సరమునందుఁ బుట్టియుండవలెను; పిదప సూరనకొడుకు మనకవి యెఱ్ఱాప్రెగడ 1316-వ సంవత్సరమునందుఁ బుట్టియుండవలెను. వెలనాటి

25. కాశీఖండములోనిపద్యము వీరభద్రవిజయమందుఁ గానవచ్చుచున్న దని యాపద్యమును ముం దనువదించితిని గదా. కాశీఖండము 1445 ప్రాంతమున రచింపఁబడినట్లు రా॥ బ॥ వారు వ్రాసిరి. వీరభద్రవిజయకర్త తాను పిన్ననాఁటనే వీరభద్రవిజయము రచించితినని చెప్పెను. అనఁగా రా॥ బ॥ వారి లెక్కప్రకారముగ 1420-వ సంవత్సరమునకు లోపుగ రచించియుండవలయును గదా. 1445-వ సంవత్సరములోఁ బుట్టినగ్రంథములోని పద్యము 1420 సంవత్సరములోఁ బుట్టినగ్రంథములో నెట్లు రాఁగలిగెనో. ఈ నా సందేహము రా॥ బ॥ వారే తీర్ప సమర్థులు. శ్రీనాథునియందు గ్రంథచౌర్యము మోపుదురేమో.—పూర్వము వీరు వ్రాసినలెక్కప్రకారమైనచో 1399 లోపుగ రచించియుండవలయును. అనఁగాఁ గాశీఖండము పుట్టుటకు 46 సంవత్సరములకు ముందు వీరభద్రవిజయము పుట్టియుండవలయును. ఏ విధముగఁ జూచినను రా॥ బ॥ వారి వాదమునకు బాధయే.

చోడునివలన మిగులమన్ననఁ బొందిన భీమనమంత్రి వెలనాటిచోడుని కాలమునాఁటికే ముప్పది నలువదియేండ్లప్రాయము గలవాఁడయి యుండునుగాన నాతనిపుత్త్రునిజననమున కటుతరువాత నలువదియేండ్లు వేయుట న్యాయ్యము కాదు. అందుచేత నిరువదేసి సంవత్సరములు తగ్గించుచు వచ్చినచో మనకవి జననకాలము 1296-వ సంవత్సరప్రాంతములకుఁ బోవును.'' అను వాక్యముల వలన స్పష్టపడియె.

తరమునకు నలువదిసంవత్సరములు చెప్పిన రాఁగలయనర్థ మేమనిన. ప్రథమభార్యయందు బిడ్డలులేక ద్వితీయభార్యయందో తృతీయభార్యయందో బిడ్డఁ గలిగెనేని యట్టియెడఁ దండ్రికి బిడ్డకు నలువదిసంవత్సరములభేద ముండినను ఉండవచ్చునుగాని తక్కిన సందర్భముల నంతభేద ముండుట, యందు నేడుతరములవఱకు వరుసగ నుండుట యసంభావ్యము. నేనుసూచించిన యీ యుపాయముచే రావుబహదర్ వారు తప్పించుకొనఁ జూచిరేని యట్టివిశేషసందర్భముల నిరూపింపవలయును. ఈ యేడుపురిలో నలువదవయేఁటఁ బుత్త్రలాభముగనినవాఁడుండిన నుండవచ్చును. లోకసామాన్యరీతి 25-30 సంవత్సరములయీడున బిడ్డలఁగనినవారు పెక్కు రుందురు. ఒకనికి 25-వ యేఁటఁ బుత్త్రుఁడు జనించిన మఱియొకఁడు (40+15=55) 55-వ యేఁట బిడ్డను గనియుండినఁ గాని లెక్క సరిపోదుగదా. ఇట్టివా రేడుతరములలో నొక రిద్దఱైన నుండవలసివచ్చును. ఇది స్వభావమని తలంపవచ్చునా? రావుబహదర్ వారలు నలువదవయేఁటఁ బుత్త్రుఁడుజనించినట్లు లెక్కించియున్నారు కావున 55-వ యేఁడుస్వభావమే యనియందురు. మీఁద ననువదించిన వాక్యముఁ జూడుఁడు. భీమనమంత్రి వెలనాటిచోడునికాలమునకే 30-40 యేండ్లవాఁడఁట. అవల నలువదియేండ్లకుఁ గుమారునిఁ గనెనని చెప్పుటన్యాయ్యము కాదని యిరువదియేండ్లు తగ్గించిరఁట. అనఁగా 80-వ యేఁట బిడ్డపుట్టెనని చెప్పుటన్యాయ్యము గాదని 60-వ యేఁటఁ బుట్టెననిచెప్పిరి. అనఁగాఁ దల్లికి ముట్లుడిగినతరువాత శిశూత్పత్తి!!

26. ప్రౌఢసరస్వతి బిరుదాంకితుఁడు—కవి మనుమఁడైనచో భాగవతమేల పరులపాలు కావలసివచ్చెను? కేసనమల్లనలు తమ తాత భాగవతమును రచించినట్లేల చెప్పరైరి? ఎఱ్ఱాప్రెగడమనుమని కున్నయభిమానము వీరికి లేదా? పేరయలింగకవి యేల భాగవతమును బూరింపఁడయ్యె? ఇన్ని సందేహములు నన్ను బాధించుచున్నవి. స్థలాభిమానముచే నాకు జనించినభ్రాంతిని రా॥ బ॥ వారు తత్త్వజ్ఞానోపదేశముచేఁ దొలఁగింతురుగాక. అటు చేయరేని నన్నయభట్టీయ విమర్శనాంతమున వారువ్రాసిన "పుస్తకములోని యంతస్సాక్ష్యమును నిరాకరించి యీ పీఠికలోఁ జెప్పఁబడినదానినే వేదవాక్యమునుగా నంగీకరించుట యీ కల్లపలుకులను నమ్మియా" యను వాక్యమున "యీ పీఠికలో" ననుటకు మాఱుగ "రా॥ బ॥ వారు వ్రాసిన చరిత్రమున" అని వ్రాసి వారికర్పింపవలసివచ్చును.

పాలపర్తి నాగేశ్వరశాస్త్రులవారును వీరభద్రవిజయము భాగవతకర్తృకృతముగాదని వ్రాసియున్నారు. గ్రంథవిస్తరభీతి ననువదింపనైతి. ఎవ రెంతవ్రాసిననేమి? రా॥ బ॥ వారు తమయభిప్రాయమును సవరించుకొనరని నే నెఱుఁగుదును.

తా మఱువదవయేఁట బిడ్డజనించినట్లు వ్రాసినవారు "రణతిక్కన 1201-వ సంవత్సరమున యుద్ధములోఁ జచ్చి 1130 లోనో 1140 లోనో 1150 లోనో తనతండ్రి కఱువదవపదిలోనో యెప్పుడో పుట్టియుండవచ్చునని యు,............ఊహాలమీఁది యూహాలతో బయలఁబందిరి వేసిరి'' అని యేనాఁడో మరణించిన శ్రీరామమూర్తిపంతులవారిని గుఱించి పరిహాస్యవాక్యములు రావుబహదర్ వారు వ్రాసిరి. తండ్రికి 50-వ 60-వ యేఁట బిడ్డపుట్టినట్లు వారు వ్రాసిరో లేదో గాని వీరిప్పుడు వ్రాసినది యూఱవపదా? అఱువదవపదా యని నాసందేహము? వీరిసోల్లుంఠనములకు వీరిప్పుడు పాత్రులు గారో టు. పురుషాంతరముల గణించుటయందు నియతి లేకుండుటయే వీరికి నియతి కాఁబోలు. తిలకింపుఁడు.

"ఈకవికిని తిక్కనసోమయాజికిని నడుమ ముగ్గురుపురుషులు మాత్రమే యున్నారు. ఒక్కొక్క పురుషాంతరమునకు నలువదియైదేసిసంవత్సరములు చూచినను సోమయాజులు 1300 సంవత్సరప్రాంతమువఱకును జీవించియుండెనని తేలుచున్నది.'' (115-వ పుట. ఆంధ్రకవుల చరిత్రము.)

"ఈకవికిని తిక్కనసోమయాజికిని నడుమను మూఁడుతరములుమాత్రము చెల్లినవి. ఒక్కొక్కతరమునకంతయు నలుబదేసిసంవత్సరముల చొప్పునఁ జూచినను తిక్కనసోమయాజి 1300 సంవత్సర ప్రాంతమున నుండియుండవలెను,'' (ఆంధ్రకవులచరిత్రము. 118-వ పుట) వీనికి రావుబహదర్ వారే వ్యాఖ్యానము వ్రాయవలయును. ఎటుతిరిగి యేత్రోవనైనఁ దమ రనుకొన్నదాని కనుకూలపడునట్లు విషయమును ద్రిప్ప యత్నింతురే కాని యున్న దున్నట్లు వ్రాసి దీని ఫలితార్థ మిది యని చెప్పరు. తమవాదమున కనుకూలపడునెడలఁ దరమునకు నూఱేండ్లయిన గణింతురు.

ఈ నా శ్రమము వారికై కాదనియు నిష్పక్షపాతబుద్ధులు సత్యైకదృష్టులు ఋజువాదులు నగుమధ్యవర్తుల యాలోచనమున కనియు లోక మెఱుఁగునుగాక.

ఆర్యులారా! 'భాగవతప్రబంధ మతిభాసురతన్' అనుపద్యము వీరభద్రవిజయగ్రంథకర్త వ్రాసినదని రా॥ బ॥ వారు వ్రాయుటచే వారిమాటను విశ్వసించి యట్లే గ్రహించినను వీరభద్రవిజయగ్రంథకర్తయు భాగవతగ్రంథకర్తయు భిన్నులేగాని యొక్కరుగారని నిరూపించితినిగాని యా పద్యము వీరభద్రవిజయగ్రంథకర్త వ్రాసినది కాదను సందేహము నన్ను బాధించుచుండినను దానిని స్థాపింపఁదగిన యాధారములు దొరకమిని నందందు సందిగ్ధముగానే వ్రాసితిని. పరకృతగ్రంథముల స్వకృతము లని ప్రకటింప యత్నించువారును బ్రకటించువారును నీ కాలమునను బూర్వకాలమునను నుండుటచే వీరభద్రవిజయకర్తయు నామసామ్యముచే భాగవతగ్రంథకర్త యశస్సును మ్రుచ్చిలింప నకార్యమునకు లోపడెనని యాయనను నిష్ఠురమాడి పాపకార్య మొనర్చితిని. భగవంతుఁడు నన్ను క్షమించునుగాక. ఈ వ్యాస మింతవఱకు ముద్రిత మగునప్పటికి భాగవతప్రబంధ మనుపద్యము ప్రక్షిప్తమని నమ్మఁదగిన యాధారములు లభించెను. ఈ పద్యము పరిషత్కార్యాలయమున నుండుప్రతులలో నొకదాని యందైన లేదు. అవి యన్నియు భిన్నప్రదేశముల సేకరింపఁబడినవి. మఱియు బ్ర॥ శ్రీ॥ కాశీభట్ల కృష్ణరాయశాస్త్రిగా రనువారు తమయొద్ద వీరభద్రవిజయప్రతి యున్నదని యాంధ్రపత్రికయందుఁ బ్రకటించిరి. వీరభద్రవిజయమందలి కవివంశమును దెలుపుపద్యములను భాగవతప్రబంధ నునుపద్యముతోడ షష్ఠ్యంతములవఱకు వ్రాసిపంపుఁడని వారినిగోరితిని. వారు నాయందు దయయుంచి వ్రాసిపంపుచు "భాగవతప్రబంధమతిభాసురతన్ అనుపద్య మీతాళపత్రగ్రంథస్థముగా లేదనుటకుఁ జింతిల్లుచున్నాఁడ" నని వ్రాసిరి.

నాగేశ్వరశాస్త్రులవారీ పద్యము ప్రక్షిప్తమని పూర్వమే వ్రాసియుండుటచేతను, నా పద్య మాకవి వ్రాయఁజెప్పెడి కారణము విశ్వాసపాత్రము కాకుండుటచేతను, అటియుండినచోఁ బూర్వోత్తరసందర్భములకు సామరస్యము కుదురకపోవుటచేతను, గొన్నితాళపత్రగ్రంథములం దా పద్యము లేకుండుటచేతను నుదాహృతపద్యము ప్రక్షిప్తమనుట సిద్ధాంతితమయ్యెను. ఇప్పుడు రా॥బ॥ వారి వాదముగతి యేమో మీరే యెఱుంగుఁడు.

ఎవఁడో విచారదూరుఁడైన శైవాభిమాని దూర్చిన యా పద్యమును మ-రా-శ్రీ, వీరేశలింగముపంతులవారు విమర్శములేక గ్రహించి వీరభద్రవిజ

యకర్తను నిష్కారణముగ రచ్చకీడ్చుటయే కాక భాగవతగ్రంథకర్తపై లేనిదోషము మోపి యాయనకపకీర్తి మెడఁగట్టిరి. వీ రనాలోచితముగ నుభయకవులపై వ్యాపింపఁజేసిన యపవాదములు శ్రీమదొంటిమిట్ట కోదండరాములకృపచే నేఁటితో సమయునుగాక.

కడపమండల స్థలాభిమానుల "భ్రాంతినివారణార్థముగా బమ్మెర పోతన నివాసమోరుగల్లని స్థాపించుటకుఁ దగిన హేతువులను గొన్నింటి నిందుఁ జూపుచున్నాను" అని శా॥ బ॥ వారు వ్రాసిరి. ఆకొన్నిటిని ఖండించితిని. కొన్నిటి యనునది చమత్కారవాక్యమగునేని పోనిండు కాదేని యన్నిటిని వారు వెడలఁబెట్టుదురు గాక. మఱియొవరైన నెందైన వ్రాసినపిమ్మటఁగాని యవి వెడలిరావు కాఁబోలు.

రావుబహాదర్ వారు గ్రంథమును బూర్ణముగఁ బఠింపక పర్యాలోచింపక తోఁచినదెల్లఁ జరిత్రము లనుపేర వ్రాయుట శోచనీయము. విషయ మెఱుఁగక, స్థలజ్ఞానములేక, పరులు వ్రాసినదానిని వ్రాసికొను తాము లోకము కన్నులు మూసికొని యున్నదనియు స్థలజ్ఞులు భ్రాంతులనియు, వారి భ్రాంతి నివారణార్థము తామాచార్యపురుషత్వము వహించినట్టును వ్యర్థవాక్యములు వ్రాయుట యంతకంటె సంతాపకరము.

ఇఁకముందు వ్రాయుచరిత్రములందైనను హఠశఠవాదములపొంతఁబోక, పరులనుల్లసమాడక, ఋజుపద్ధతి నవలంబించి వ్రాయుచుఁ దమయశస్సు శ్రేయస్సుఁగోరు నస్మాదృశులకెల్ల వృథామనస్తాపము కలిగింపకుందురుగాక.

వీరిఁక దాక్షాయణీపరిణయమును బదిలముగ దాఁచుకొందురుగాక,

"సత్య మేవ జయతి నానృతమ్"

వావిలికొలను సుబ్బరావు,

అనుబంధము.

ఈవ్యాసము 110-వ పుటయందు "సమీపబంధువు లీదేశమువారైనపుడు పోతరా జీదేశమువాఁడని యూహించుట యసమంజసమా" యని వ్రాసితిని. ఇది యూహామాత్రము కాదు. వీరభద్రవిజయకర్త "యివటూరి ఆరాధ్యసోమనాథదేవ పాదపద్మారాధక" యని వ్రాసియుండుటచేతను, వీరభద్రవిజయమున 16-వ వచనముఁబట్టి యతఁ డివటూరియందే యున్నట్టు తేర్పడుటచేతను, నీతనిమనుమలు ఇవటూరిముక్తి నాగేశసద్గురుభక్తి నాదిమ శైవులైనట్టి వారి నని వ్రాసియుండుటను, నీయివటూరి విజయనగరప్రాంతమం దున్నదని తెలియవచ్చుటచేతను, వీరభద్రవిజయకర్తగూడ గోలకొండదేశము వాఁడుగాఁడు. రావుబహదర్ వా రుదాహరించిన దబ్బిలిపాటను రామయ్య పంతులువారు ప్రమాణముగ గ్రహింపలేదు. రావుబహదర్ వీరేశలింగము పంతులవారు గ్రహించుట వింతగాదు. అందలి బొమ్మెరపోతరాజు మున్ను నేను సూచించిన ట్టిపోతురాజో. ఆఁబోతురాజో దున్నపోతురాజో వీరభద్రవిజయ కర్తయునుగాఁడు.

వావిలికొలను సుబ్బరావు.

శ్రీరామాయనమః.

బమ్మెర పోతరాజు నివాసస్థానము.

ఆంధ్రభాగవతకర్త యయిన బమ్మెరపోతరాజు నివాసస్థాన మోరుగల్లు ప్రాంతమం దయియుండును గాని యొంటిమిట్ట యైయుండదని సహేతుకముగాఁ దెలుపుచు నేనొకవ్యాసము రాక్షససంవత్సర మాఘఫాల్గునమాసముల యాంధ్రసాహిత్యపరిషత్పత్రికయందుఁ బ్రకటించితిని. నా సిద్ధాంతములను హేతువులను నాక్షేపించుచు బ్రహ్మశ్రీ వావిలికొలను సుబ్బరావుగారు మఱియొక వ్యాస మీసంవత్సరము జ్యేష్ఠాషాఢమాసముల సంచికలోఁ బ్రకటించినారు. ఈవ్యాసముఁ జక్కఁగాఁ జదివినాఁడను, గాని నాయభిప్రాయమును మార్చుకొనుటకుఁ దగినకారణము లేమియు నందుఁ గానరాలేదు. కావున సుబ్బారావుగారికి నేను బ్రత్యుత్తరమీయ వలసివచ్చినది.

సుబ్బారావుగారివ్యాసము వాదప్రౌఢిమను సూచించు వాక్యాలంకారములతో నిండి యున్నది. అందలిమాటల కన్నింటికి వేఱువేఱుగా సమాధానములు చెప్పవలయునన్న గ్రంథము మిక్కిలి పెరుఁగుటయే కాక వివాదాంశములు మఱుఁగుపడుటయుఁ దటస్థించును, గావున నట్లుచేయుట మాని సిద్ధాంతమునకు ముఖ్యాధారము లని నేను దొలుతఁ బ్రతిపాదించిన విషయములపై సుబ్బారావుగారుచెప్పిన యాక్షేపముల ననువదించి, వానికి సంగ్రహముగా సమాధానముచెప్పి, యాపిదప సుబ్బారావుగారు క్రొత్తగాఁ బ్రతిపాదించిన హేతువు లేమైన నున్నయెడల వానిని ఖండించెదను. చదువరు లీపద్ధతి నామోదింతురుగాక

1. పోతరాజు నింటిపేరయిన బమ్మెర, భాగవతములోని శిథిలభాగములం బూరించిన సింగన నారయకవుల యింటిపేళ్ళయిన ఏర్చూరు, వెలిగందల యను నీమూఁడు గృహనామములకుఁ గారణభూతములగు బమ్మెర, ఏర్చూరు, వెలిగందల యను గ్రామము లోరుగంటికి సమీపదేశమునం దున్నవి, గాన నాగృహనామములు గల కుటుంబము లాప్రాంతమందే యుండె నని యూహించుట యసమంజసము కాదని నా మొదటివాదము. దీనిని బూర్వపక్షము చేయు తలంపుతో సుబ్బారావుగా రయిదాఱు పుటలగ్రంథము వ్రాసినారు.

ఏచ్చూరను గ్రామము గుంటూరుమండలములో నొకటియున్న దనియు, దీని నిప్పుడు ఏల్చూరని జనులు వ్యవహరించుచున్నను బూర్వము ఏచ్చూరే ఏల్చూరుగా మాఱి యుండవచ్చుననియు, నెల్లూరిమండలములో వెలిగండ్ల యను గ్రామ మొకటి యున్నదనియు, నిదియే వెలిగందల మై యుండవచ్చు ననియు, నీయూహాలు సరియైనచో సింగననారయలు గుంటూరు నెల్లూరుమండల వాసులై యుండవచ్చుననియు వారి వ్రాఁతలో సారాంశము. వివాదాస్పదమైన మూఁడు గ్రామనామములలో రెంటికేలాగుననో మేనమామపోలిక గల మఱిరెండు గ్రామములపేళ్లు సుబ్బారావుగారు సంపాదింపఁ గలిగిరి, గాని యీవాదమున కంతకు మూలాధారమైన బమ్మెరగ్రామమునకుఁ బ్రతిగ్రామ మాయనకుఁ బొడకట్టియుండలేదు. ఏల్చూరు, వెలిగండ్లగ్రామముల కనతిదూరములో నొకబమ్మెరయో, బొమ్మెరయో కనఁబడినప్పుడు గాని సుబ్బారావుగారి యాక్షేపము విమర్శనపాత్రముకాదు.

ఒకకుటుంబ మొక్కయూరు విడిచి మఱియొకయూరికిఁ గాఁపురము పోయినప్పుడే పూర్వగ్రామము పేరా కుటుంబమునకు గృహనామ మగుననియు, గృహనామము, నివాసగ్రామనామము నొక్కటియే యగుటయరుదనియుఁ, గావున బమ్మెర పోతరాజు బమ్మెరనివాసి గాఁడనియు సుబ్బారావుగా రింకొక యాక్షేపము చేసినారు. తెలుఁగువారల గృహనామము లనేకములు గ్రామనామములే, కొంతమంది తమయింటిపేళ్లు గలయూళ్ళలోనే కాఁపుర ముండవచ్చును. కొంద ఱితరగ్రామములలో నుండవచ్చును. ఇంటిపేళ్ళ గలయూళ్ళలో నివాసము చేయుచున్నవారలఁ బలువుర నే నెఱుఁగుదును. అట్టివారు బొత్తిగా లేరని సుబ్బరావుగారును జెప్ప సాహసింపలేదు. కాకపోయినను, భాగవతమునురచించు కాలమందుఁ బోతరాజు బమ్మెరలోనే కాఁపురమున్నాఁడని నావాదముకాదు. గ్రంథరచనాప్రారంభమం దాయన యేకశిలానగరమందున్నట్లు భాగవతమే చెప్పుచున్నది. తొలుత బమ్మెరలో నుండి భాగవతరచనాకాలమందుఁగాని యంతకుఁ గొంతకాలము పూర్వముగాని యేకశిలానగరమునకు వెళ్లియుండవచ్చును. కావుననే తాను బమ్మెరకు సంబంధించినవాఁ డనికాని, బమ్మెరనుండి వచ్చినవాఁ డనికాని సూచించుటకై బమ్మెర యనుగృహనామమును బెట్టుకొనియుండును. తిరిగి యవసానదశకు బమ్మెర చేరియుండిన నుండవచ్చును. అట్లు కాకపోయినను బమ్మెర యాయనకు స్థిరవాసమగుటచే నాగ్రామమువా రామహాకవిని దమ యూరివాఁడుగా నే

భావించి యాయనకు జ్ఞాపకముగా విగ్రహమును స్థాపించుట లోకాచారవిరుద్ధము కాదు.

2. పోతరా జొకానొకచంద్రగ్రహణము నిమిత్తమున గంగాతీరమందు మహేశ్వరధ్యానముచేయు నవసరమున రామభద్రుఁడు ప్రత్యక్షమై భాగవతమును దెనిఁగింపుమని యాజ్ఞయొసఁగెనని భాగవతమునం జెప్పంబడి యుండుటంబట్టి యీసందర్భమున గంగయనఁగా గోదావరి యని గ్రహింపవలసి యున్న దనియు, గోదావరికి నోరుగంటిప్రాంతదేశమున గంగ యనుసంజ్ఞ వ్యవహారమందు రూఢమయి యుండుటంబట్టియు, నొంటిమిట్టప్రాంతమం దట్టి వ్యవహారము లేకుండుటవలనను గోదావరి యొంటిమిట్టకుకంటె నోరుగంటికి సమీపమగుటను భాగవతములోని యేకశిలానగర మోరుగల్లనియే యూహింపవలసి యుండునని నా రెండవవాదము ఈవాదము నాక్షేపించుచుఁ గొంతసేపు గంగ యనుసంజ్ఞ గోదావరికిఁ జెల్లదనియు, మఱికొంతసే పావేరు నీళ్ళుగల యేగుంటకైనను జెల్లుననియు నింకను మఱి యేవేవో వ్రాసి యించుమించు పదునాలుగుపుటలు నింపినారు. గంగయనుసంజ్ఞ సర్వసాధారణముగా భాగీరథికే రూఢము గోదావరికి దక్షిణగంగయను సంజ్ఞ లోకములోఁ గలదు. నన్నయభట్టారకుఁ డాసంజ్ఞను బ్రయోగించెను. శ్రీనాథుఁ డొకటిరెండు స్థలములలో గోదావరిని గంగయనియే పిలిచెను. కాని, నావాదమునకు ముఖ్యాధార మోరుగంటి ప్రాంతదేశమునందలి వాడుకగాని యీప్రయోగములు కావు. ఆదేశమందు సర్వసాధారణముగా గంగ యనఁగా గోదావరి యనియే యర్థము. పలువురు ప్రామాణికులవలన నేనిది వినియున్నాఁడను. ఇది కాదని సుబ్బారావుగారు చెప్పలేదు. చెప్పలేరు. చంద్రగ్రహణమునకు మిక్కిలిదూరమున నున్నభాగీరథికిఁ బోవుటకంటె ననతిదూరమందున్న గోదావరివంటి మహానదికిఁ బోవుట సామాన్య లోకాచారానుసారము. పోతరాజు భాగీరథికిఁ బోయియుండఁగూడ దని నావాదముకాదు. పోయినఁ బోయియుండవచ్చును. కాని, తగినంత యాధారములేక యంతదూరము చంద్రగ్రహణనిమిత్తమాత్రమున వెళ్లెననుట సమంజసముకాదని నామతము.

గోదావరికి గంగ యనుసంజ్ఞ లోకవ్యవహారములో నున్నంతమాత్రమునఁ బోతరాజువంటికవి యదిగ్రంథస్థముగావించునా యని యొక యాక్షేపము పుట్టవచ్చును. "అభ్రంకష శుభ్రసముత్తుంగ భంగ యగుగంగకుం జని" యని పోతరాజు ప్రయోగించెను. ఇందు గంగ యనుశబ్ద మనుప్రాసాలం

కారమున కుపకరించినది. పోతరాజను ప్రాసప్రియుఁడు, కావున, లోకవ్యవహారగూఢమును సత్కవిప్రయోగావిరుద్ధమును నగుసంజ్ఞ నాకవి ప్రయోగించుట వింత కాదు. ఈవిషయమై యిచ్చట నింతకంటె నెక్కువవ్రాయుట చర్వితచర్వణ మగును. వలసినచోఁ బాఠకులు నాప్రథమవ్యాసముం జూచెదరు గాక.

భాగవతకృతిపతి సామాన్యరాముఁడు కాక కోదండరాముఁ డనియు, భాగవతములోని కోదండరామవర్ణన మొంటిమిట్ట కోదండరామస్వామి యాకారమునకు సరిపోవుచున్న దనియు, నీహేతువుచేఁ బోతనకుఁ బ్రత్యక్షమైన రామభద్రుఁ డొంటిమిట్టదేవుఁడేయని యూహింపవలయు ననియు సుబ్బరావుగారు వ్రాసినారు. పోతరాజునకుఁ బ్రత్యక్షమైన దేవుఁడు కోదండరాముఁడను మాట తథ్యమే. కాని, కోదండరాముఁ డొంటిమిట్టలోమాత్రమే వెలసియుండలేదు. అనేకగ్రామములలోఁ గోదండరామస్వామి యాలయములు గలవు. ఎక్కడ నున్నను నాదేవుని యాకార మొక్కరీతిగానే యుండును. కావునఁ గోదండరామస్వామి యన్నంతమాత్రమున నొంటిమిట్ట కోదండరామస్వామియేయని సిద్ధాంతముచేయుట న్యాయ్యము కాదు.

కావ్యముల నర్చావిగ్రహముల కంకితమొనర్చినకవులు సర్వసాధారణముగా నావిగ్రహములు ప్రతిష్ఠింపఁబడిన క్షేత్రముల నొకచోటఁ గాకపోయిన మఱియొకచోటనయినను దమగ్రంథములందు సూచించియున్నారు. అట్లు సూచింపనియెడలఁ గృతిపతు లర్చావిగ్రహములు కావనియే యూహింపవలయును. భాగవతమం దట్టిసూచనలు లేవు కావున నీకృతిపతి యర్చావిగ్రహము కాదనియే తేలుచున్నది. ఒంటిమిట్టదేవాలయములో రామవిగ్రహమున కొకప్రక్క సీతావిగ్రహమును రెండవప్రక్క లక్ష్మణవిగ్రహము నున్నవి. పోతరాజు లక్ష్మణవిగ్రహముమాటయే తలపెట్టలేదు, కావున నాతఁడు తనకుఁ బ్రత్యక్షమయినరాముని వర్ణించినప్పు డొంటిమిట్ట దేవాలయములోనివిగ్రహ మాతని మనస్సులో లేదనియే చెప్పవలసియున్నది.

3. భాగవతనిర్మాణ మేకశిలానగరమం దయినది. ఏకశిలానగర మనుసంజ్ఞ యోరుగంటికిఁ జెల్లిన ట్లొంటిమిట్టకుఁ జెల్లదను నామూఁడవవాదమునకు మూఁడుహేతువులు చెప్పినాను. అవి యేవియనఁగా (1) ఏకశిలయనఁగా నఖండశిల యనిభావము. ఓరుగల్లన నదియే యర్థము. ఓరుగంటి కోటనడుమ నఖండశిలారూపమున నొకచిన్నకొండ గలదు. దీనినిబట్టియే పట్టనమున కాపేరు వచ్చియుండును. ఇది యొక హేతువు. దీనికి సుబ్బరావుగారు రెండు

మూఁడాక్షేపములు చేసినారు. ఏకశబ్దమున కఖండమనునది యొకటేయర్థము కాదని యొక యాక్షేపము. ఏకశబ్దమున కఖండమనునర్థ మొక్కటిమాత్రమే యున్నదని నే ననలేదు. ఏకశిలానగర మనుశబ్దమం దాయర్థము చెప్పవలసియున్న దని నావాదము. కాఁబట్టి సుబ్బరావుగారియాక్షేప మప్రసక్తము. ఓరుగంటికిసమీప మం దున్న భువనగిరికిఁ గూడ నేకశిలానగర మనుసంజ్ఞయున్నది కావున నాపే రోరుగంటికిమాత్రమే లేదని రెండవయాక్షేపము. భువనగిరి కెప్పటికిని భువనగిరి యనియే రూఢనామము. ఈపేరునకుఁ గారణభూత మయినకొండ యఖండశిలారూపముగా నుండుటచేఁ గొందఱాపట్టనమున కేకశిలానగర మనుసంజ్ఞను సాధించిరి, గాని యాపే రోరుగంటికివలె సుప్రసిద్ధము కాదు. 'భువనగిరి' "ఏకశిలానగరము"నను రెండును సంస్కృతపదములే. మొదటిది సిద్ధనామము. రెండవది యిటీవల సాధింపఁబడినది. రెంటికి నర్థములో భేద మున్నది. ఓరుగ ల్లనునది కన్నడపుఁబేరు. దానికి సంస్కృతమున నేకశిలానగరమని వ్యవహరించిరి. పోతరాజు సంస్కృతకవిసంప్రదాయమునే యనుసరించెను.

ఏకశిలానగర మనుపే రోరుగంటికే ప్రాచీనగ్రంథములందుఁ గనఁబడుచున్నదనియు, నొంటిమిట్టకాపేరు పూర్వకవులు ప్రయోగించి యుండలేదనియు నా రెండవవాదము. పూర్వగ్రంథములం దొంటిమిట్టకుఁగూడ నేకశిలానగర మనుపేరున్నదని సుబ్బరావుగారివాదము. ఈ పూర్వగ్రంథము లేవి యన:—పురాణము హయగ్రీవశాస్త్రులుగారు రచియించిన భాగవతపీఠిక యొకటి. Madras Manual of Administration అనుపుస్తక మొకటి. "ఒంటిమిట్ట లేక యేకశిలానగరమాహాత్మ్యము" అను పుస్తక మొకటి. మొదటిది "శాలివాహనశక గతసంవత్సరములు 1770 అగు నేఁటి కీలక సంవత్సరమునందు" అనఁగా నిప్పటికి 69 సంవత్సరములక్రిందటఁ బ్రకటింపఁబడినది. ఇందులో బమ్మెరపోతరాజు విద్యాప్రాదుర్భావమునుగూర్చిన పుక్కిటిపురాణము వివరించు నవసరమున "నిమ్మహాత్ముండు బాల్యమునందు గోసంరక్షణార్థంబుగా స్వగ్రామం బగు నేకశిలానగరంబునకు సన్నికృష్టపర్వతాగ్రంబున సంచరించుచుండు సమయంబున నచ్చట నతనిపూర్వజన్మ సుకృతపరిపాకాతిశయంబున చిదానంద యోగీంద్రుండను నొకఋషిశ్రేష్ఠుండు దృగ్గోచరుం డయ్యె" నని వ్రాసి, ఏకశిలానగర మనుచోట హంసపాదముపెట్టి పుటయడుగున "ఈగ్రామమునకు ప్రతినామము ఒంటిమిట్ట. ఇదికడపకు దక్షిణమున చెన్నపట్టణమునకు బోయే

ఘాటలో మొదటిమజిలీ స్థలముగా నుంటున్నది" యనివ్రాసిరి. వీనినిబట్టి యొంటిమిట్ట కేకశిలానగర మనినామాంతరము గలదనియు, బమ్మెరపోతరాజు నివాసమదియే యనియు హయగ్రీవశాస్త్రులుగారి యభిప్రాయ మయినట్లు తేలుచున్నది. ప్రస్తుతవాదమున కీగ్రంథమువలనఁ గలుగుఫల మింతియే. సుబ్బారావుగారి రెండవపూర్వలేఖనము మూఁడుసంపుటములుగా నున్నది. అందు మూఁడవ సంపుటములో నొంటిమిట్ట కేకశిలానగర మనుపేరుగూడ నున్నట్లున్నది. ఈ సంపుటము 1393-వ సంవత్సరమందుఁ బ్రకటింపఁబడినది. ఏకశిలానగరమాహాత్మ్యమనుతప్పులతడక "శాలివాహనశకం 1828 అగునేటి పరాభవ నామసంవత్సర కార్తీక శు 8 శుక్రవారంవర్కు పూర్తి. ఇందుకు సరి అయిన 1906 సం॥ అక్టోబరు నెల 26-వ తేది" యని గ్రంథాంతమం దున్నది. ఇది యొంటిమిట్టసమీపమందలి యోబిలిగ్రామమందు నివసించియున్న కోవూరు రామదాసుచే రచింపఁబడినది. ధూర్త వేంకటాచలమయ్య స్కాందపురాణము ననుసరించి రచించి తనకంపిన తెనుఁగువచనమునుబట్టి పద్యకావ్యము చేసితి నని కవి కృత్యాదియందుఁ జెప్పినాఁడు. ఈమూఁడు గ్రంథములలో హయగ్రీవశాస్త్రిగారి పీఠికయే ప్రప్రథమము. ఇదియైన నిప్పటి కఱువదితొమ్మిది సంవత్సరములకుఁ బూర్వము, అనఁగాఁ బోతరాజుగతించినపిదప నాలుగు వందల సంవత్సరములకుఁ బైఁగాఁ బుట్టినది. పోతరా జొంటిమిట్ట నివాసి యగునో కాఁడో హయగ్రీవశాస్త్రిగారు స్వయముగ నెఱిఁగియుండరుగదా? ఏకారణములఁబట్టి తమ కాయభిప్రాయము గలిగెనో యాయన చెప్పియుండ లేదు. ఆయన కడపమండలమందుఁ బుట్టినవాఁడు కాకపోయినను, గొంతకాలము కార్యవశమునఁ గడపలో నివసించియుండి రని వారి బంధుకోటిలోనివారగు చదలువాడ సుందరరామశాస్త్రిగారు చెప్పుచున్నారు. ఆ కాలమం దీప్రతీతిని హయగ్రీవశాస్త్రిగారు కడపలో విని యుండవచ్చును. ఒంటిమిట్ట కేకశిలానగరమని స్థూలదృష్టిచే నర్థముచెప్పవచ్చునుగనుకను, నాయూరిలోఁ గోదండరాముని యాలయమున్నది గనుకను నీప్రతీతి పుట్టియుండును, గాని యంతకంటె నీవాడుకకుఁ బ్రబలకారణమున్నట్లు కనఁబడదు. Manual of Administration లోని వ్రాఁతకును హయగ్రీవశాస్త్రులుగారి పీఠికయే కారణమయి యుండవలయును. ఏకశిలానగర మాహాత్మ్యములోనికథ కొంత విలక్షణముగా నున్నది. ఒంటఁడు, మిట్టఁడు నను బోయ లిరువు రొకయడవిలో వెలసియున్న శ్రీరామవిగ్రహమును సేవించుచుండిరనియు, నాసమీపమున రామ

తీర్థమను మంచినీళ్లగుంట యొకటి యుండెననియు, బోయలాగుంట నొకరాతితో మూసిపెట్టి వలసినప్పు డా మూఁతను దీసి నీరు ద్రావుచుండెడి వారనియుఁ, గొంతకాలమున నొకరాజావనమునకు వేఁటకువచ్చి దప్పిగొని నీరుగానక తపించుచుండ బోయలు మూఁతదీసి రామతీర్థ మాతనికిఁ జూపిరనియు, రాజు సంతసించి వరముకోరుఁడని బోయల నడుగ రామునకు గుడియుఁ దమపేర నచ్చట నొకయూరును గట్టింపుమని యడిగిరనియు, రా జట్లు చేయుటచే నొంటిమిట్ట యనుగ్రామ మేర్పడె ననియు నిందున్నది. దీనినిబట్టి యేకశిలానగర మనుపేరు రామతీర్థముపైఁ గప్పినరాతినిబట్టి పుట్టినదిగాని యొంటిమిట్టకు భాషాంతరము కాదని తేలుచున్నది. ఈవ్యుత్పత్తి సుబ్బరావుగారి మతానుసారముగాదు. 1300 శక సం॥లు గతించినపిమ్మట బమ్మెరపోతన యీగ్రామమునఁ బుట్టి చిదానందయోగికరుణచే సరస్వతిని బ్రసన్నఁగాఁ జేసికొని భాగవతమును దెనిఁగించెనని భూతవృత్తాంతముగా నీగ్రంథమందు వర్ణింపబడినది. ఈగ్రంథము స్కాందపురాణము ననుసరించి రచింపఁబడినదిగావునఁ బరమప్రమాణమని సుబ్బారావుగారి వాదము. స్కాందపురాణమును గవి చూచియుండలేదు. దానినిబట్టి యెవరో వ్రాసినా రన్న వచనమునుబట్టి గ్రంథము రచించినాఁడఁట. స్కాందపురాణ మన దిక్కులేని క్షేత్రమాహాత్మ్యముల కెల్ల దిక్కు. కావుననే యఱవమున "ఈపొయి కందపురాణత్తిలియుమిల్లై" (ఈకల్ల స్కాందపురాణమునందును లేదు) యనుసామెత పుట్టినది. పోతరాజు తెనుఁగు భాగవతము రచించినకథ యిట్టి పుస్తకమునం దుండుట వింతకాదు.

ఈగ్రంథములు మూఁడును బ్రస్తుతవాదము విజృంభింపక పూర్వమె పుట్టినవి గావునఁ బ్రమాణము లని సుబ్బరావుగారు వాదించుచున్నారు. ఈ వాదము శాస్త్రసమ్మతము కాదు. పోతరాజు జీవించి యున్నపుడుగాని, యాతఁడు గతించినపిమ్మటఁ గొంచెముకాలమునకుఁ గాని యీగ్రంథములలోఁ నేదియైనఁ బుట్టియుండినచోఁ బోతరాజు జన్మస్థానవిషయము గ్రంథకర్త సత్యమెఱింగియే వ్రాసియుండు నని యూహింపవచ్చును. కాని, యాయన కీర్తిశేషుఁడయిన నాలుగువందల సంవత్సరములకుఁ బైనిఁ బుట్టినపురుషుఁ డావిషయము నిజమెఱిఁగియే వ్రాసెనని యెట్లు నమ్మవచ్చును?

ఇంతకు, నొంటిమిట్టవాదుల కేకశిలానగరశబ్దము వ్యుత్పత్తియే కుదిరినదికాదు. ఏకశిల యనునది యొంటిమిట్టకు సంస్కృతరూప మని సుబ్బరావుగారి సిద్ధాంతము. రామతీర్థముపై మూఁతవేయఁబడిన రాతినిబట్టి యేకశిలా

నగర మనుపేరు పుట్టిన దని యేకశిలానగర మాహాత్మ్యములో నున్నది. ఈ రెండును జాలక యొంటిమిట్ట దేవాలయములోని సీతారామ లక్ష్మణ విగ్రహములు మూఁడును నేకశిలానిర్మితము లగుటనుబట్టి యేకశిలానామము గ్రామమునకుఁ గలిగిన దని మూఁడవవ్యుత్పత్తి నొకదానిని సుబ్బరావుగారు కల్పించినారు. నేనీనడుమ సుబ్బరావుగారితోఁగూడి యాదేవాలయమునకుఁ బోయి స్వామిని సేవించితిని. సీతారామ లక్ష్మణ విగ్రహములు మూఁడు నేకశిలానిర్మితము లన్నమాట సరికాదు. మూఁడు నొకపీఠమందే ప్రతిష్ఠింపఁబడియున్నవి గాని యొక్కరాతితో నిర్మింపఁబడినవి కావు. ఒకదాని కొకటి రమారమి గజముదూరమునం దున్నది.

నగరశబ్ద మోరుగల్లునంటి పెద్దపట్టనమునకె చెల్లునుగాని యొంటిమిట్టను బోలిన చిన్నయూరికిఁ జెల్ల దని నావాదము. కొన్నిపల్లెటూళ్లకుఁ గూడ నగరము పట్టనము మొదలగు సంజ్ఞ లున్నవనియు నొంటిమిట్టగూడఁ బూర్వము పట్టనముగానె యుండవచ్చు ననియు సుబ్బరావుగారి సమాధానము. గ్రామములు పుట్టినప్పుడు చిన్నగ్రామములకుఁగూడఁ బెద్దపేరులు పెట్టు నాచార మచ్చటచ్చట నున్నను, నడుమఁ గల్పింపఁబడు నామము లన్వర్థముగానే యుండు ననియు, నొంటిమిట్ట పూర్వము గొప్పపట్టనముగా నున్నట్లు నిదర్శనములు కానరావనియు నాప్రత్యుత్తరము. ఏది యెట్లయినను నిది యొక గొప్పవిషయము కాదు గనుక నింతకంటెఁ జర్చింపవలసిన పనిలేదు.

ఓరుగంటికిఁ బుట్టుపేరు ఒరగల్లనియు, సామాన్యనగరము లనుబంగారమున కీపట్టన మొరపుడురాయివంటిదిగాన నీ పేరుపెట్టిరనియు, కాకతీయ గణపతిదేవునికాలమం దాపట్టనమున రాతికోటయొక్కటి కట్టఁబడుటవలన నప్పటి నుండి యేకశిలానగర మనుసంజ్ఞ వచ్చిన దనియు, నొరగల్లే యొరంగల్లయిన దనియు, నీపేరులో రేఫమున కత్వమెగాని యుత్వము లేదనియుఁ,గన్నడములో నేకార్థమం "దొరు" అను శబ్దము లేనే లేదనియు సుబ్బారావుగా రొక యపూర్వవాదము కల్పించినారు. కన్నడములో నొకటియనునర్థమం దొరు శబ్దము లేదనుటయు, గణపతిదేవునికాలమునకుఁ బూర్వ మేకశిలానగర మని కాని యోరుగల్లనికాని పేరోరుగంటికి లేదనుటయు నీవాదమున కాధారము లయియున్నవి. ఈయూహాలు రెండును దప్పని చూపిన నీవాదమడుగంటును గదా! ఒరుశబ్దవిషయమై సుబ్బరావుగారు :—"ఒరు" శబ్దమునకు "ఒక్క" యను నర్థము కన్నడములో లేదని మ-రా-శ్రీ, కోలాచలము శ్రీనివాసరావుగా

రిప్పుడు చెప్పిరి గదా! ఇట్టులే నేను విచారించిన కర్ణాటక భాషాభిజ్ఞు లల్లరుఁ జెప్పిరి. ఇప్పుడు పంతులవారి వాదమున కేమిగతి" యని వ్రాసినారు.

నావాదమున కించుమిం చాఱువందల సంవత్సరముల క్రిందటఁ గర్ణాటక భాషాలక్షణ గ్రంథములలో నుత్తమ మయిన శబ్దమణిదర్పణ మను లక్షణగ్రంథమును రచియించిన కేశిరాజుగతి. ఆగ్రంథములో సమాసప్రకరణమున:—

"దొరకొళ్వ దఖిలవైయా, కరణరి నొందెంబు దర్కొరెం బాదేశం" అని యున్నది. అఖిలవైయాకరణుల మతమునను (వృత్తియందు) ఒందు (ఒకటి) అనుదానికి "ఒర్" అను నాదేశము వచ్చు నని దీని యర్థము. అఖిలవైయాకరణులు నంగీకరించిన దానికి సుబ్బారావుగారు విచారించిన కర్ణాటభాషాభిజ్ఞు లెల్లరు నెట్లొప్పకుందురో తెలియదు. ఓరు అనునది ఒర్శబ్దమునకు రూపాంతరమని చెప్పనక్కఱలేదు గదా.

ఓరుగంటి కేకశిలానగర మనుపేరువచ్చుటకు హేతువు చెప్పుచు సుబ్బరావుగారు:—

"వచ్చి తనకు మరలఁబడ్డ తమ్ములను హ, రించి సకలగహ్వరిస్థలికిని,
బ్రాజ్ఞు లెన్నఁగాను బట్టాభిషిక్తుఁడై, వీటికొక్కరాతికోట నిలిపె."

అను సోమదేవరాజీయపద్యము నుదాహరించి, "పంతులవారియొక్కరాయి యిందుఁ గానవచ్చుచున్నది. వీనినిబట్టి యాలోచింప శిలాప్రధానమైన కోట గణపతిదేవుని కాలమందు నిర్మింపఁబడుటచే నానగరమునకు నేకశిలానగర మనుపేరు వచ్చెనని తెలియవచ్చెడిని" అని వ్రాసిరి. ఒక్కరాతికోట యనునప్పు డొక్క యను విశేషణము కోట కన్వయించునుగాని రాతి కన్వయింపదు గదా. అట్లయినచో "నొక్కరాతికోట" యుండుటచే నగరమున కేకశిలాభిధానం బెట్లు సాధింపవచ్చునో ప్రాజ్ఞులు నిర్ణయింతురుగాక.

శబ్ద వ్యుత్పత్తిమాట యటుండనిచ్చి గణపతిదేవునికిఁ బూర్వ మోరుగంటిపే రేరూపమునసుండెనో విచారింతము. హనుమకొండకోటలోఁ బద్మావతి యాలయమున కెదుట నొకస్తంభముమీఁదఁ గన్నడశాసన మొకటి యున్నదని నాపూర్వవ్యాసములోఁ జెప్పియుంటిని. ఆశాసనములో గణపతిదేవుని పితామహుఁ డగు కాకతిప్రోలరాజు మంత్రి బేతరస భార్య మైలమయు, మాధవవర్మ వంశజుఁడైన మేలరసయు నలువదిరెండవ చాలుక్య విక్రమార్క సంవత్సరమునకు సరియైన "హేమలంబి సంవత్సర పౌష్యబహుళ ౧౫ సోమవార" మం దాదేవాలయమునకు భూదానములు చేసినట్లున్నది.

శాసనములోఁ జెప్పిన తిథి 1117 సం॥ 24 డిసెంబరునకు సరిపోవును. మేలరస దానమునుగూర్చిన శాసనభాగ మిట్లున్నది:—

"మాధవవర్మవంశోద్భవరప్ప శ్రీమన్మహామండలేశ్వర నుగ్రవాడియ మేలరసం తన్నాళికె యొరుంగల్ల కూచికెఱె యేరియ కెళగె కాలువెయ మొదల గద్దెయ మత్తరొం దాసమీపదలె కరంబం మత్తెహత్తు మిత్త."

దీనికిఁ దెనుగు:—

మాధవవర్మ వంశోద్భవులైన శ్రీమన్మహామండలేశ్వర ఉగ్రవాడి మేలరసు తనయేలుబడి (లోనున్న) ఒరుంగల్లు కూచిచెఱువు గట్టుక్రింద కాలువ మొదట నొక మత్తరు పల్లపునేలయు పదిమత్తరుల మిశ్రభూమియు నిచ్చెను.

ఈశాసనము Epigraphica Indica 9-వ సంపుటములోఁ బ్రకటింపఁబడియున్నది. ఇందు ఒరుంగల్లు అని స్పష్టముగా నున్నది. హనుమకొండ యోరుగంటి కంటియున్నది. శాసనకాలమందు మేలరస ప్రోలరాజు నధికారమునకు లోబడి యోరుగంటిని బాలించుచున్నట్లు కనఁబడుచున్నది.

ఇంతియకాక, గణపతిదేవుని కాలమందుఁ బుట్టిన గణపేశ్వర శాసనములో (దీనిని Epigraphica Indica, 3-వ సంపుటములోఁ జూడఁదగు) గణపతిదేవుని పెదతండ్రియగు ప్రథమరుద్రదేవుని ప్రశంసించు నవసరమున:—

"ఉన్మృష్టాని పురాణి యేన కథయం త్యాపూర్య తత్తజ్జనై
స్తత్తన్నామభి రోరు (ం) గల్లు*నగరే నిర్మాపితా వాటికాః
కించ స్వేషు కృతేషు తే ష్వథ పురీష్వాపూర్య సూత్రైర్జనైః
శ్రీరుద్రేశ్వర సంజ్ఞయా విరచితాః ప్రఖ్యాతదేవాలయాః.

అని చెప్పఁబడియున్నది. ఈశాసనమం దోరుగల్లనియు మొదటిశాసనమునం దోరుంగల్లనియు నున్నది. ఈరెండును ఒరుగల్లు రూపాంతరములే. ఇప్పుడైన గణపతిదేవునికిఁ బూర్వ మోరుగంటిపేరిలో రేఫమున కుత్వము లేదను వాదము సుబ్బరావుగారు మానుకొందురుగాక.

4. భోగినీదండకకృతిపతియగు సర్వజ్ఞసింగమనీఁ డోరుగంటిప్రాంతము వాఁడు గావునఁ దత్కృతికర్తయగు పోతరాజును నాప్రాంతమువాఁడే యైయుండు నని నానాల్గవవాదము. పోతరా జొంటిమిట్టనుండి యోరుగంటి ప్రాంతమునకుఁ బోయి యుండరాదా యని సుబ్బరావుగారి యాక్షేపము. పోతరాజే

*ఒరుంగల్లనువ్యావహారికరూపము ప్రయోగింపఁబడినను ఛందోభంగము లేకుండుటకై యోరుగల్లనియే చదువవలయును.

భోగినీదండకమును రచించె నను జనశ్రుతి యీవాదమున కాధారము. ఈ జనశ్రుతికిఁ దగినప్రమాణములు కాన్పించుట లేదు, కావున నీవిషయ మంతగాఁ జర్చించుట యనావశ్యకము.

5. జనశ్రుతిప్రమాణ మొంటిమిట్టవాదమునకే కాక యోరుగంటివాదమునకును గలదని చూపి యుంటిని. నే నుదాహరించిన జనశ్రుతులలో బమ్మెరపేరేగాని యోరుగల్లు పేరు లేకుండుటచే నాప్రమాణము లోరుగంటివాదమున కుపచరింపవని సుబ్బారావుగారి యభిప్రాయము. దీనికి సమాధానమింతకుముందే చెప్పియున్నాను. ఓరుగంటివాదము బమ్మెరవాదము నొక్కటే. భాగవతమును రచించిన కాలముననో యంతకుఁ గొంచెము ముందుగానో పోతరాజు బమ్మెరనుండి యోరుగంటికి వచ్చియుండును.

ఒంటిమిట్టవాదమున కున్న జనశ్రుతుల వంటివి యోరుగంటివాదమునకుఁగూడ లేకపోలేదని చెప్పుటకై యోరుగంటివారిమాటలఁ గొన్ని నే నుదాహరించితిని, కాని, కేవలజనశ్రుతులు ప్రబలప్రమాణములు కావనియే నామతము. ఏదోయొక యల్పాధారమును బట్టియో, ప్రమాదముననో యొకఁడేదయిన నొకమాట పుట్టించిన యెడల "గతానుగతికోలోకో నలోకః పారమార్థిక" యను న్యాయమునుబట్టి యామాట కాలక్రమమున లోకములో వ్యాపించుట కలదు. అంతమాత్రముచేత నాకింవదంతి సత్యమనుటకు వలనుపడదు. ఇటీవల రావుబహాదర్ వీరేశలింగము పంతులుగారు ఖండించు వఱకు నన్నయభట్టును, తిక్కనసోమయాజియు నొకకాలమువారే యని యాంధ్రలోకమునమ్మినది. సారంగధరచరిత్రములో వర్ణింపఁబడిన యితివృత్తము రాజమహేంద్రవరములో జరగినదనియు, కృతినాయఁకుడు పూర్వచాళుక్యరా జగు రాజనరేంద్రునికొడు కనియుఁ బ్రబల మయిన కింవదంతి కలదు. రాజమహేంద్రవరము సమీపమున సారంగధరునిమెట్ట యనుప్రతీతి గలచిన్నకొండ యొకటి యున్నది. దీనిమీఁదనే సారంగధరుని కాళ్లు, చేతులు నఱకఁబడిన వందురు. రాజనరేంద్రునియొక్కయు నతనికొడుకుల యొక్కయు శాసనము లనేకములు వెలువడినవి. వానిలో నెక్కడను రాజనరేంద్రునకు సారంగధరుఁడను కొడు కున్నట్లే లేదు. చేమకూర వేంకటకవికృతాంధ్ర సారంగధరచరిత్రమందు రాజనరేంద్రుఁడు మాళ్వదేశపురాజయి నట్లున్నది. గోలకొండదేశములోని వేములవాడ ప్రాంతమందలి జనులు సారంగధరునితండ్రి తమదేశము నేలినరాజే యని చెప్పుదురు. ఇట్టి ప్రతీతు లింకను ననేకములు గలవు. వీనిలో నేది సత్యమో యేది యసత్యమో ప్రమాణములవలనఁ గాని తేలదు.

6. భాగవతములోఁ బ్రయోగింపఁబడిన యాంధ్రశబ్దవిశేషము లోరుగంటివాదమునకు నొంటిమిట్టవాదమునకును సమానములే గావున నా యాధారమునుబట్టి యాగ్రంథ మొంటిమిట్టలోఁ బుట్టిన దనికాని, యోరుగంటిలోఁ బుట్టిన దని కాని నిర్ణయించుట కనువు గాదని నావాదము. ఈవాదమును బూర్వపక్షము చేయఁ దగిన యాధారములు సుబ్బరావుగారేమియుఁ గనఁబఱిచి యుండ లేదు.

ఒంటిమిట్ట దేవాలయములోఁ బోతరాజువిగ్రహ మొకటి యున్నదనియు నందువలనఁ బోతరాజాయూరివాఁడే యని యూహింపవలయుననియు సుబ్బరావుగా రొకచోట వ్రాసిరి. రంగమండపములో ద్వారమున కెడమవైపున నొకచిన్న శిలావిగ్రహ మున్నది. పూజారి నడుగఁగా నది పోతరాజు విగ్రహమని కొందఱందురు గాని వేదాంతదేశికుల విగ్రహ మని తన యభిప్రాయ మని యాతఁడు చెప్పెను. ఆవిగ్రహము పోతరాజు దనుట కాధారము లేవియుఁ గనబడవు. విగ్రహము, పద్మాసనస్థుఁడై ధ్యానించుచున్న పురుషుని రూపముగ నున్నది. పాదములయందుఁ బద్మరేఖలును, గాళ్ళకు ముంజేతులకును గొలుసులు నున్నవి. భుజకీర్తులును మెడలో హారమును గలవు. వడగలవైష్ణవులు ధరించునట్టి నిలువుబొట్టు నుదుట నున్నది. పోతరాజు రామభక్తుడైనను శివపూజాతత్పరుఁడు. వైష్ణవచిహ్నమైన నిలువు బొట్టు పెట్టుకొనియె ననుటకు వీలు లేదు. గొలుసులు, హారము, తులసిపూసలపేరు లనుకొన్నచో శివపూజ సేయుచుఁ బోతరాజు తులసిపేరులు ధరించె ననుటయు సమంజసము కాదు. సువర్ణాభరణము లని యూహింపవలసిన యెడల నవియుఁ బోతరాజున కనుచితములే కావున నావిగ్రహము పోతరాజుది కా దనియే చెప్పవలసి యున్నది.


ఈ హేతువులంబట్టి యొంటిమిట్టవాద మిప్పటికిని దుర్బలమే యని నా యభిప్రాయము.

జయంతి రామయ్య.

శ్రీరామాయనమః.

ఒంటిమిట్ట పోతనామాత్యుఁడు

మూఁడవ భాగము.



ఉ. రెండుకరంబులం గవివరిష్ఠుఁడు పోతనపుణ్యకావ్యముల్,
దండిమనంబునం దనకథం, గయికొంచు ధరాతనూజ త
మ్ముండును గొల్వ నేకశిల మోదము మీఱెడు నొంటిమిట్టకో
దండరఘూద్వహుండు మిము ధన్యులఁ జేయుత మెల్లవేళలన్.

మహాశయులారా!

బమ్మెరపోతరా జొంటిమిట్టవాఁడని నేను వ్రాసినవ్యాసమునకుఁ బ్రత్యుత్తరమును బ్ర॥ శ్రీ॥ జయంతి రామయ్యపంతులవారు కార్తికమాసపుఁ బరిషత్పత్రికయందుఁ బ్రకటించిరి. వారు వ్రాసినదానికిఁ బ్రత్యుత్తరము వ్రాసి (రావుబహాదర్ వీరేశలింగము పంతులవారు వీరభద్రవిజయము నుద్దేశించి నేను వ్రాసిన వ్యాసమునకుఁ బ్రత్యుత్తర మిడఁగల రనుభీతి లేనివాఁడఁ గావున)*యీ వివాదమున కింతటితో శాంతిపాఠముఁ బఠింపఁ దలఁచినాఁడను. ఈవ్యాసముతో నుభయవాదములు పూర్ణముగఁ జర్చితములైనట్లు తేర్పడును గావున నిష్పక్షపాతబుద్ధు లగుమధ్యవర్తు లావల నెవరివాదము బలీయమో పరిష్కరింతురుగాక.

ఓరుగంటిపక్షమున మొదటఁ జెప్పినకారణములు గాక క్రొత్తకారణము లేవియు బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారు చెప్పినవారుకారు. వాని నన్నిటిని

* ప్రౌఢసరస్వతీత్యాది సందిగ్ధవిషయములగుఱించి యెందైన నేమేమి నన్నుగుఱించి వ్రాయుదురేమోకాని వీరభద్రవిజయము భాగవతకర్తృకృతమని వారు సాధింపశక్తులు గారని నానమ్మకము.

మున్నే ఖండించియున్నాఁడను. నావాదమునందు వా రిప్పుడు కనఁబఱిచిన లోపములకు సమాధానము చెప్పినచో మధ్యవర్తు లిఁకఁ బరిష్కరించుట కే యాటంక ముండదు. "ఈ వ్యాసముఁ జక్కఁగాఁ జదివినాఁడను, గాని నా యభిప్రాయము మార్చుకొనుటకుఁ దగిన కారణము లేమియు నందుఁ గానరా లేదు" అని పంతులవారు వ్రాసిరి. నా వ్యాసమున వారికిఁ జతురక్షరసంయోగము కలుగుట సత్యము. కొన్నిచోటుల శ్రద్ధతోఁ జదువలేదనుటకు ముందు దృష్టాంతములు చూపెదను. నిష్పక్షపాత బుద్ధులు, సత్యభాషణులు, సభయసములు, విద్వాంసులు నగుమాననీయులు "You have demolished the case for Warangal" అనియు, "The arguments adduced are very convincing and well supported by facts" అనియు "దాదాపు ఇరువదియైదు సంవత్సరముల క్రింద నేను ఒంటిమిట్టఁ జూచియుంటిని. అప్పుడు నేను స్థలజ్ఞుల విచారింపఁగాఁ దాము వ్యాసమున వ్రాసినప్రకార మాయాస్థలములఁ జూపిరి. ఎదిరి యూహాలకంటెను తమ యూహలు ప్రమాణబల సమన్వితములుగఁ గనఁబడుచున్నవి." అనియు "వాదప్రౌఢి గంభీరముగను నిరుత్తరముగను నున్నది. వీరభద్రవిజయమును పోతన కంటఁగట్టుట యసమంజసమని సాధిచేసితిరి. బమ్మెరవాస్తవ్యతా భ్రాంతిని నిర్మూలముఁ జేసితిరి. కవి జీవితవిమర్శాప్రయోగమునకు మార్గోపదేశక మగు వ్యాసము వ్రాసితిరి." అనియు నావ్యాసమునుగుఱించి వ్రాసి యున్నారు. మఱికొంద ఱీవిధముగనే నాతోఁ జెప్పి యున్నారు. రామయ్యపంతులవారు మధ్యవర్తిస్థాన మలంకరించియుండిన నీ యభిప్రాయమే చెప్పియుందురు. వాదు లగుటచే నభిప్రాయము మార్చుకొనఁ గారణము లేమియు వారికిఁ గానరాలేదు. అది వా రాక్రమించిన స్థానదోషముగాని నాదోషముగాదు వారిదోషమునుగాదు.

1. "బమ్మెర, ఏఱ్చూరు, వెలిగందల యనుగ్రామములు ఓరుగంటికి సమీపదేశమం దున్నవి, గాన నా గృహనామములు గలకుటుంబము లాప్రాంతమందే యుండెనని యూహించుట యసమంజసము కాదని నా మొదటివాదము." అని పంతులవారు వ్రాసిరి. దీనికి నే నిచ్చిన ప్రత్యుత్తరము మీరు చదివియే యున్నారు. ఇందు 'బమ్మెర' ఓరుగంటియొద్ద నున్నదనుట యసత్యము. నిరాధారము. ఓరుగంటియొద్ద బొమ్మెర యున్నదిగాని బమ్మెర లేదు. బమ్మెర యెందుండినదో యాంధ్రలోకమున కింకను దెలియదు. నే నాక్షేపించిన పిమ్మటఁ గూడ బొమ్మెరకుఁ బూర్వనామము బమ్మెరయని పంతులవారు స్థాపింపఁజాలరైరి. అట్లుండినఁగదా స్థాపించుటకు? కడపలో జరిగినసభలో నిప్పుడేల్చూ రనఁబడు

గ్రామమే యేఱ్చూరని నేను చెప్పఁగా నది సరిగాదనియు లెక్కలలో నేల్చూ రనియే యున్నదనియుఁ బంతులవా రాక్షేపించిరిగదా. నా వాదమున కనుకూలముగ శాసనవాక్యములు గ్రంథస్థప్రయోగములు కనఁబఱిచితిని గదా? అట్టులే నేనాక్షేపించినపుడు వారివాదమున సత్యముండిన నేలప్రయోగములు కనఁబఱుపరాదు. బమ్మెరబొమ్మెరలకు మేనత్తపోలికో మేనమామపోలికో తామేల నావలె సప్రమాణముగ స్థాపింపరాదు? బమ్మెర బొమ్మెర రెండు నొకటే యనుట యోరుగంటివాదుల యూహామాత్రకల్పిత మనినఁ దప్పేమి? బొమ్మెర గ్రామజనులును దమగ్రామమునకు బమ్మెర యనుపే రుండినట్టు చెప్పలేదు. ఈ విషయము నా రెండవవ్యాసమునఁ జర్చించినాఁడను.

2. "ఈ వాదమున కంతకు మూలాధార మైనబమ్మెర గ్రామమునకుఁ బ్రతిగ్రామ మాయనకుఁ బొడగట్టియుండలేదు. ఏల్చూరు వెలిగండ్లగ్రామముల కనతిదూరములో నొకబమ్మెరయో బొమ్మెరయో కనఁబడినపుడుగాని సుబ్బారావుగారి యాక్షేపము విమర్శనపాత్రము గాదు." అని రామయ్యపంతులవారు వ్రాసిరి. బమ్మెర నామమునకుఁ బ్రతినామము విషయమై రావుబహదర్ కందుకూరి వీరేశలింగము పంతులవారికిఁ బ్రత్యుత్తర మిచ్చియున్నాఁడను. ఏ బకారమకారరకారము లుండునవియైనను బమ్మెరలని నేను వాదింపఁ బూనినచోఁ గోడూరికి 9 మైళ్లలో నొంటిమిట్టకు 30-35 మైళ్లలో నుండుబొమ్మవరమే బమ్మెర యనియు లేమ్బల యనునది జన్మాంతరములఁ గ్రమముగా లేమలవాడ, లేములవాడ వేములవాడ యైనట్టు బమ్మెర బొమ్మెర యై యావల బొమ్మరయై పిదప బొమ్మవరమయినదని వాదించియుందును. పంతులవారివలె నూహ లన్నియుఁ బరమప్రమాణము లని వాదింప నామన సొప్పదు. ఊహలూహలే. అవి సత్యము లనునెడల నాధారములు కనఁబఱుపవలయును. ఇఁకను బొమ్మెరయే బమ్మెర యని యోరుగంటివాదు లాధారము కనఁబఱుపక యూరక హఠవాదము చేసిరా బొమ్మవరమే బమ్మెర యని యొంటిమిట్టవాదులు వాదింతురు. వారివాదమునకు వారు ప్రమాణము కనఁబఱిచినపుడు వీరివాదమునకు వీరు బ్రమాణము కనఁబఱుతురు.

రామయ్యపంతులవారి యభిప్రాయప్రకారము బమ్మెరయనునది గ్రామనామముగా గ్రహించినను వారివాదమునందు బలము లేదనినిరూపించితినిగదా, ఒకవిధమునఁ జూడ బమ్మెర యనునది గ్రామనామము గాదని తోఁచుచున్నది, బమ్మెర యనుశబ్దమునకు నిలుకడలేనిది, చలించునది యనియర్థము. ఇది భ్రమశబ్దమునకుఁ దద్భవమని సీతారామాచార్యులవారు వ్రాసిరి. భ్రము-అస

స్థానే (తిరుగుట) యనుధాతువువలనఁ గలిగినది భ్రమ-కావున బమ్మెరకు నదే యర్థము. దీనికిఁ బ్రయోగములు. "ఎలదేఁటిదాఁటులక్ । బమ్మెరవోవఁ దోలు తెగబాఱెఁడు వెండ్రుకలు"—మను. "బమ్మెరపోకతో" అని పంచతంత్రము. ఇంకను బ్రయోగములు కలవు. గ్రామ మెన్నఁటికి నిలుకడగా నుండునుగాని తిరుగుచుండదు గదా, కావున బమ్మెర యనునది గ్రామనామముగా నుండ దనుట తప్పుగాదు. మనుష్యులయింటిపేరుగా నెట్లుండఁగల దందు రేని వినుఁడు.

ఆంధ్రులయింటిపేర్లు నానాకారణములు గలవి. రామాయణము చెప్పువారు రామాయణమువారు, భారతమును జెప్పువారు భారతమువారు, పురాణపు చెప్పువారు పురాణమువారు. ఇతరులచే భుజింపక స్వయముగఁ బాకము చేసికొనువారు స్వయంపాకాలవారు. సుంకరివృత్తియం దుండువారు సుంకరివారు. ఈ విధముగ నాచనవారు, పోతరాజువారు, ఏనుఁగువారు, కస్తూరివారు, చదువులవారు, పాగావారు లోనగు నింటిపేర్లు గలవు. బమ్మెరవా రను పేరును నిట్లే వచ్చియుండవలయును. పోతరాజు పూర్వు లొకచోట నిలుకడ లేక నానాదేశముల భ్రమించుచుండినవా రగుటచే బమ్మెరవా రైరి కాఁబోలు. దీనికి సరియైన యాంగ్లనామము Nomads. "Nomad = పశుచారోపజీవిన్-అస్థిరవాస" యని ఆప్టి నిఘంటువు. పోతరాజు పశుచారోపజీవి యనియుఁ గింవదంతి కలదుగదా. కావున బమ్మెర యనునది గ్రామనామమని పొరపడి కించిత్సామ్యము గలదేనితోనో ముడిపెట్టక యీ వ్యుత్పత్తి గ్రహించుట బాగని తోఁచుచున్నది. ఇది యూహామాత్రమే. ఇది సరికాదని పంతులవారు సప్రమాణంబుగ నిరూపింతురుగాక. ఈయూహ సరియైనను గాకున్నను నా వాదమునకు హానిలేదు గాని దీని నిరాకరింపఁ జాలకపోయిరా పంతులవారి వాదము సమూలము చెడినది.

3. బమ్మెర, బొమ్మెర యొకటైనను బమ్మెర పోతరాజు బమ్మెరలోనే యుండెనను వాదము నమ్మరా దని నేను వ్రాసితిని. దీనిపైఁ బంతులవారు "కొంతమంది తమయింటిపేళ్లు గలయూళ్లలోనే కాఁపురముండవచ్చును. ఇంటిపేళ్లుగల యూళ్లలో నివాసము చేయుచున్నవారలఁ బలువుర నే నెఱుఁగుదును. అట్టివారు బొత్తిగా లేరని సుబ్బరావుగారును జెప్ప సాహసింప లేదు" అనిరి. ఎట్టిసందర్భములందు గృహనామము గ్రామనామ మొకటిగానుండునో యాసందర్భముల నెల్ల నాప్రథమవ్యాసమున విశదీకరించితిని. అది సరికాదని పంతులవారు చెప్పఁజాలరు. ఇంటిపేర్లు గలయూళ్లలో నివాసము చేయు పలువురిల్లో నేను జెప్పినసందర్భములకు లోపడనివా రెందఱున్నారో వీరు విచారించిరా?

నేను జెప్పినసందర్భములకు లోపడినవా రైనయెడల నది వీరివాదమున కెట్లుపకరించును? నేను జెప్పిన సందర్భములకు లోపడక సృష్ట్యాది నేఁటివఱకు నొకగ్రామమందే యుండి యాయూరిపేరే తమగృహనామముగఁ గలవా రెందేని యుండిన నుండవచ్చు ననివాదమునకై యంగీకరించెదను. ఆంధ్రదేశమునఁ గలకుటుంబముల సంఖ్య యెంత? మీఁదఁ జెప్పఁబడినట్టి కుటుంబముల సంఖ్య యెంత? ఇది దానిలో నెన్నవ వంతు? పదివేల కొకకుటుంబమైనఁ గలదా? ఈప్రశ్న నేనుమున్నే యడిగియుండ స్పష్టమైనప్రత్యుత్తరము వ్రాయక తేరమాటలు వ్రాయు నేల? ఒకవేళ నున్నను సందిగ్ధవిషయములో బహుజనుల కన్వయించు సామాన్యవిధి నన్వయింపక యపవాదవిధి నన్వయింప నేమి కారణము? ఇటు చేయుట లోకసమ్మతమా "శాస్త్రసమ్మతమా?" Exception is no rule. అపవాదములు విధులు గావనుట వీరెఱుంగరా? బమ్మెర యపవాదములోఁ జేరినదనుట కేమి యాధారము? ఊహ. ఈవిషయమున వీరియూహ కేవల మసత్యమనుటకు రెండవభాగమున నాధారములు సూచించియున్నాఁడను.

4. "శ్రీరామలింగాంఘ్రి సేవానరప్రౌఢిఁ గవితాచమత్కృతు ల్గాంచువారి
నప్పలమ్మయును వీరాంబయుఁ బ్రౌఢసరస్వతికిని గన్నప్రజ్ఞవారిఁ*

* ప్రౌఢసరస్వతిపద్దు కేసన కున్నట్లు లజ్జరవుఁ బేరయలింగకవియుఁ "ప్రౌఢసరస్వతి యను బిరుదందిన కేసనకవి (పోతనతనుమఁడు) అని" రావుబహదర్ వారును వ్రాసియున్నారు. ప్రౌఢసరస్వతు లిరువురో యొకరో రావుబహదర్ వారే పరిష్కరింపవలయును. రావుబహదర్ వారు ముద్రించినవిధముగఁ బ్రౌఢసరస్వతికి నిరువురుభార్యలు. పెద్దభార్య అప్పలమ్మ, చిన్నభార్య వీరమ్మ. కవితాసంప్రదాయమునుబట్టిచూడ నప్పలమ్మకొడుకు కేసన, వీరమ్మకొడుకు మల్లన, యని తోఁచుచున్నది, గ్రంథమునం దెట్లున్నదో నే నెఱుఁగను. ఇరువురు నొకతెకొడుకు లయి యుండినయెడల రెండవ యామెపేరును కేసనమల్లనలు చెప్పియుండెరు. ఇంతవఱకుఁ జూడఁ బ్రౌఢసరస్వతి తండ్రియని యప్పలమ్మ తల్లియని వీరికుమారుఁడు కేసన యని యేర్పడుచున్నది.

పేరయలింగకవి తనమాతుపేరు ప్రౌఢసరస్వతి యనుబిరుదుగల కేసన యని యత్తపేరు అప్పమ్మయని వ్రాసినట్లు రావుబహదర్ వారు పద్యము నుదహరించిరి. ఇప్పుడు అప్పలమ్మ కేసనకుఁ దల్లియా? భార్యయా? యనుప్రశ్న కలుగకమానదు. రావుబహదర్ వారు తమయేడుతరములలెక్క కాపాడుకొనుటకై యిద్దఱప్పమ్మలు నిరువురు ప్రౌఢసరస్వతు లుండిరని వ్రాయుదురేమో దానికిఁ దగినయాధారములఁ గనఁబఱిచి యేడుతరములను స్థాపించినను "రావుబహదర్ వారి యిష్టప్రకార మేడుతరములుగ లెక్కించినను నిరువురు పోతనలకు నడుమ నూఱేండ్లకు మించి యెడము గలదు." అని రెండవభాగమున -వ పుటయందు వ్రాసిన నాయభిప్రాయమునకు లోటులేదు. ఈకవులచరిత్రమునం దప్పమ్మ యెవరికిఁ దల్లియగునో యెవరికిభార్యయగునో చూడవలయును: అది నా వాదమునకు సంబంధించినది కాదు; కావున నేను దర్కింపఁబనిలేదు.

గౌండిన్యగోత్రవిఖ్యాతి బమ్మెరభవ్యవంశాఢ్యులై సిరివరలఁ వారి
నివటూరిముక్తి నాగేశసద్గురుభక్తి నాదిమశైవులైనట్టివారిఁ
గేసకవిమల్లకవినామకీర్తిపరుల మమ్ముఁబిలిపించి.

అని దాక్షాయణీవివాహమున నున్నట్టు రావుబహద్దర్ వా రనువదించియున్నారు. ఈకవులే "మత్పితామహుని బమ్మెరపోతన" యని వ్రాసియున్నారు. ఈపోతన భాగవతగ్రంథకర్త కాఁడని రెండవభాగమున సిద్ధాంతముచేసియున్నాను. బమ్మెరకేసన-బమ్మెరమల్లనలు కృష్ణామండలమువారని యందే వ్రాసియున్నాను. ఇప్పుడు రావుబహద్దర్ వీరేశలింగము పంతులవారు బమ్మెరకేసనమల్లనలు బమ్మెరయందే పుట్టినను గురుజాల మహానగరము గావున నక్కడఁ జేరియుందురనియు, గృహనామము బమ్మెరగాఁ గల బమ్మెరకేసన మల్లనలు బొమ్మెరప్రాంత్యమువారేయని పంతులవారును వ్రాయఁగలరా? బమ్మెర యింటిపేరివారు బమ్మెరయందే యుండి రనుట తప్పనుట కిది చాలదా? ఈవిషయము రెండవభాగమున -వ పుటయందు వ్రాసియుండినను దానికిఁ బ్రత్యుత్తర మీయక చర్వితచర్వణంబున వృథాకాలవాగ్వ్యయము చేయనేల?

బమ్మెరపోతరాజు తొలుత బొమ్మెరలో నుండెనంట. గ్రంథరచనకాలము నాఁటికో యంతకుఁ గొంతముందో యేకశిలానగరము చేరెనంట. తిరిగి యవసానదశకు బొమ్మెర చేరెనంట. చేరకపోయినను గృతజ్ఞులై యాగ్రామము వా రాయనకు జ్ఞాపకముగా విగ్రహము స్థాపించిరంట. ఈయంట లన్నియు నురల నూహాలు. ఊహాలు. ఊహాలు. ఏకశిలానగరవాసులు కృతఘ్నులైరంట యని నే నొక యంట చేర్చెదను.

ఇట్టివాదమునకుఁ బ్రత్యుత్తరము రెండవభాగమున నిచ్చియున్నాఁడను. కావునఁ జర్వితచర్వణ మేల? ఇదంతయు నోరుగంటివాదుల యనన్యగతికములైనయూహ లనుట నిర్వివాదము. ఏలన రామయ్యపంతులవారు తమవాదమును బలపఱుచుకొనఁ గొన్నియనుబంధములఁ బ్రకటించిరి కదా. వానియందు శ్రీనాథుఁడు భాగవతమును గర్ణాటరాజున కంకితమిప్పింపఁగోరి బమ్మెరపోతనను జూడవచ్చినపుడు పోతరాజు భూమి దున్నుచున్న వృత్తాంతము లోనైనది బొమ్మెరయందు జరగినట్లు వ్రాయఁబడి యున్నది. దీనివలన భాగవతము బొమ్మెరలో రచింపఁబడుచుండెనని యేర్పడెనుగదా? తమకు ననుకూలము లని తాము వ్రాయించి తెప్పించిన యనుబంధములకు విరోధముగ వీ రిపుడు వాదించుట కేమి కారణము? బొమ్మెరజనులమాట నిజమా? రామయ్యపంతులవారు రావు

బహద్దర్ వారు చెప్పెడుమాట నిజమా? పరస్పరవిరుద్ధము లైన యీ రెండును నసత్యములే.

5. ఈవిషయమున రామయ్యపంతులవారిని నేనొకటి ప్రార్థించెద. సత్యజిజ్ఞాసువు లైనవీరు నాప్రార్థన మంగీకరింతురుగాక. వీరు న్యాయవాదిపరీక్ష యం దుత్తీర్ణులై న్యాయాధిపతిస్థాన మలంకరించి సాక్ష్యస్మృతిప్రకారము న్యాయములఁ బరిష్కరించినవారు కావున 4 నిమిషములు తా మీవాదమున వాదుల మనుభావమును మఱచి న్యాయాధిపతిస్థాన మలంకరించినట్లె యెంచఁ గోరెదను. అప్పుడు నేనే వాదినై వారియెదుట నిలఁబడి నావాదమున కనుకూలము లని విజ్ఞాపనపత్రికతోడఁ గొన్నిపత్రికల నర్పించితి నని యెంచగోరెదను. తరువాతఁ బ్రతివాదివిచారణ ముగిసినపిమ్మట నేను నాసంగ్రహోపన్యాసములో నేను సమర్పించిన పత్రములకు విరోధముగను వానిలో లేనివిగను గొన్నివిషయములు చెప్పితి నని యెంచఁ గోరెదను. అప్పుడు వీరు నేనర్పించినపత్రములఁ బట్టి తీర్పు చెప్పుదురా? ప్రతివాదులు చెప్పినమాటలనుబట్టి సవరించికొని నేను నోటఁ జెప్పినమాటలనుబట్టి తీర్పుచెప్పుదరా? ఇప్పుడు తాము వాదులైనపుడు తద్భిన్నముగ వర్తింప వీరి యంతఃకరణ మెట్లంగీకరించెను? బమ్మెర బొమ్మెర యనుట యనుబంధముల లేనివాదము; ఇతరాధారశూన్యము. భాగవత మోరుగంటియందు రచింపఁబడె ననుట యనుబంధవిరుద్ధవాదము. రావుబహద్దర్ వారి కిచ్చిన ప్రత్యుత్తరముతో దీనిని గలిపి చదివి యీవిషయ మేకాగ్రచిత్తులై రామయ్యపంతులవా రాలోచింతురుగాక.

ఇంటిపేరు గలవా రాపేరుగలగ్రామములోనే తరతరములుగ నుండుట యరు దని నేను జెప్పినదానికై బొమ్మెరకు నోరుగంటికి ముడి పెట్టఁగోరి పంతులవారు తొలుత బమ్మెరలో నుండి భాగవతరచనాకాలమందుఁ గాని యంతకుఁ గొంతకాలము పూర్వముగాని యేకశిలానగరమునకు వెళ్లియుండవచ్చును. కావుననే తాను బమ్మెరకు సంబంధించినవాఁ డని కాని బమ్మెరనుండి వచ్చినవాఁడని కాని సూచించుటకై బమ్మెర యనుగృహనామము పెట్టుకొని యుండును" అని పెద్దయుక్తి వ్రాసిరి. పంతులవారి యూహాలు యుక్తు లనెడుదూదిప్రోగులపై బమ్మెర పోతనామాత్యుఁడే తనతల్లిదండ్రులగుఱించి "బమ్మెరకేసయలక్కసానికిన్" అని వ్రాసినప్రయోగమును మహాప్రభంజనమును బ్రయోగించెదను. దీనివలన బమ్మెరవా రను పేరు పోతనతండ్రితాతలకాలమునుండి యున్నదనియుఁ బోతన తాను దనయింటిపేరు పోఁగొట్టుకొని యోరుగంటిలోఁ గూర్చుండి బొమ్మెర యనుమహానగరముపేరు పెట్టుకొని కీర్తిసంపాదింపఁ గాఁబోలు నాపేరు

పెట్టుకొనె ననునూహ నిష్కృష్టమిథ్య యనియు స్థాపిత మయ్యెను. దీనితో నైనఁ బంతులవారు సత్యముఁ గ్రహింతురుగాక! మహాశయులారా! కేవలోహ లెంతయనర్థకరములో చూడుఁడు? వాదాభినివేశము లిఖిత ప్రమాణవిరుద్ధము లగు వ్రాఁతలనుగూడ వ్రాయించుచున్నది. పంతులవారి ద్వితీయవ్యాసమునం దిట్టినిరాధారోహాపోహములు మఱి రెండు మూఁడు గలవు. కోదండరాముల కృపవలన వానికి నిట్టిగతియే ప్రాపించునుగాక.

రెండవయాధారము.

6. "బమ్మెరపోతరాజు చెప్పినగంగ యేది యనువిషయమున నావాదమునకు ముఖ్యాధార మోరుగంటిప్రాంతదేశమునందలి వాడుక గాని యీ ప్రయోగములు కావు" అని రామయ్యపంతులవారు వ్రాసిరి.

ఇప్పటి పామరజనవ్యవహారమునుబట్టి పురాణముల కర్థముఁ జెప్పుట యనర్థకహేతు వని నావాదము. దానికి వలసినన్ని దృష్టాంతముల నిచ్చితి. వానిలో నొక్కటియైన సరిగాదని పంతులవారు నిరాకరింపఁజాలకయు మరల నదే వాదము చేయుచున్నారు. అందొక్కదానినైన వారు శుద్ధాంతఃకరణముతో నాలోచించెదరుగాక. "తల్లీ! మదిన్నిన్ను భజింతు గంగ!" అను భాగవత పద్యము నుదాహరించి యిందు గంగయనఁగా గోదావరి యని యర్థము చెప్పెదరా? చెప్పలేని యశాస్త్రీయ పామరవాక్యము పరమప్రమాణముగ గ్రహించు టేలచెప్పరు?, ఒకచోఁ బామరవాక్యము ప్రమాణ మగుట యెట్లు? రెండవచోటఁ గాకుండు టెట్లు? పోతరాజు గోలకొండదేశమువాఁ డనునూహయే గ్రహించుటకుఁ గారణ మందులేని యీవాదమే నిలువఁ గాళ్లు లేకుండఁగా దానినాధారము చేసికొని యితరవిషయములు వ్రాయుట గోడలు లేనిమిద్దె కట్టుట కాదా? పోతరాజు గోలకొండదేశమువాఁ డనునూహ యీవలఁ గట్టిపెట్టి చదివెడివా రెవ్వరైన గంగ యనఁగా గోదావరి యని యర్థము చెప్పెదరా? అట్లు చెప్పసాధ్య పడదేని యిది స్వతంత్రాధారము కాఁగలదా? బమ్మెరపోతరా జోరుగంటివాఁ డనుటకుఁ గదా దీనిని మీరాధారముగ గ్రహించితిరి? దాని కాధారము బమ్మెరపోతరా జోరుగంటివాఁడను నూహయే కదా? అట్లయినచో నిందు నన్యోన్యాశ్రయత్వము లేదా? యని ప్రశ్నించితిని. రామయ్యపంతులవారు ప్రత్యుత్తరము చెప్పఁజాలరైరి. స్వవాద మనునభిమానమును విడిచి యీయొక్కవిషయమును జక్కఁగఁ నాలోచించిరేని తమవాదము దుర్బలము గాదు నిర్బల మని పంతులవారికే తోఁపఁగలదు.

7. "సజ్జనానుమతంబున గంగకుం జని" యనునది యెట్లు గ్రహణస్నానపక్షమున సమర్థించెద రని యడిగితిని. దానికిఁ బ్రత్యుత్తరము లేదు. "అభ్రంకషశుభ్రసముత్తుంగభంగ యగుగంగకుంజని" యనుచో విశేషణము లెట్లు గోదావరీపరమున సార్థకములంటిని. దానికిఁ బ్రత్యుత్తరము లేదు కాని పోతన యనుప్రాసప్రియుఁడు కావునఁ బ్రయోగించె ననిరి. "భంగయగు దక్షిణగంగకుం జని" యని వ్రాసియుండినచో ననుప్రాసనియతికి భంగము కలదా? సందిగ్ధదోషమున కేల పాలుపడెను? అనుప్రాసముల నడుమ మాటలు రారాదా? వ్యవహితంబులు పరశ్శతంబులు భాగవతంబున లేవా. "రాకాని శాకాలంబున సోమోపరాగంబు రాకఁగని" యనుచో నాయనియతికి భంగము కలిగెనా?

"అభ్రంకషశుభ్రసముత్తుంగ" యనునది వ్యర్థపద మని పంతులవారన సాహసింతురా? ఈప్రశ్నములకు నొకదానికిఁ బ్రత్యుత్తరము లేదు. "గోదావరి గంగయనుట లోకవ్యవహారరూఢి" యని పంతులవారనుట సరిగాదు. ఆలంకారికమతమున రూఢి యెట్టిదో పంతులవారు మఱచిరి. భరతఖండ మందెందు నీవాడుక లేకుండుట యటుండ నాసికాప్రాంతమందైన భద్రాచలప్రాంతమందైనను రాజమహేంద్రవరప్రాంతమందైన హైదరాబాదునగరమందైనను గోదావరిని గంగయని లోకులు పిలువరు. కావున 'లోకవ్యవహార' మనునది 'లోకైకదేశకోణకోట్యంశభాగవ్యవహార' మనవలయును. ఇట్టిది రూఢిగాదు. "సత్కవిప్రయోగావిరుద్ధ"మనుటయు సరికాదు. మహాకవు లెవరు సందర్భమునకుఁ బొసఁగని సందేహదుష్టములగువాక్యములను నేయార్థములను వ్రాయ లేదు. సందర్భములను బట్టి స్పష్టముగ గోదావరి యని యర్థమగునట్లు వ్రాసియున్నారు. సందర్భమునుబట్టి గోదావరి యని గ్రహింపరాని గంగాపదమును నేమహాకవి ప్రయోగించెను? ఆప్రయోగమేది? ఏల దానిని బంతులవారుదాహరింపరైరి? గోలకొండదేశకవు లెవ్వరైన నట్లు ప్రయోగించిరా?

"చంద్రగ్రహణమునకు మిక్కిలిదూరమున నున్నభాగీరథికిఁ బోవుటకంటె ననతిదూరమునం దున్నగోదావరివంటి మహానదికిఁ బోవుట సామాన్యలోకాచారానుసారము. పోతరాజు భాగీరథికిఁ బోయియుండఁగూడదని నా వాదము కాదు. పోయినఁ బోయి యుండవచ్చును. కాని తగినంత యాధారము లేక యంతదూరము చంద్రగ్రహణనిమిత్తమాత్రమున వెళ్లెననుట సమంజసము కాదని నామతము" అని పంతులవారు చర్వితచర్వణము చేసిరి. దీనికిఁ

ప్రత్యుత్తరము నా ప్రథమవ్యాసముననే వ్రాసితిని. అయినను మరల వారి తృప్తికై పిష్టపేషణము చేయవలసివచ్చి చేసెదను.

"సోమోపరాగంబురాకఁగని" యనుచోఁ గని యనఁగాఁ దెలిసికొని యని యర్థము. కనుధాతువు జ్ఞానార్థమునఁ బ్రయోగింపఁబడినది. ఇఁక సంవత్సరమునకో యాఱునెలలకో పుష్కరము వచ్చు నని తెలిసికొనుట యెట్టిదో యిదియు నట్టిదె. గంగాయాత్ర కవియుద్దేశ్యముకాని కేవలగ్రహణస్నానము కాదు "సజ్జనానుమతంబున" నను ప్రయోగమే కవియుద్దేశమును దెలుపుచున్నది. ఈయుద్దేశము గలవాఁడై యుత్తదినముల గంగాస్నానముచేయుటకంటె గ్రహణకాలస్నానమున నెక్కుడఫలము గలదని శాస్త్రములు చెప్పుటచే నాసనుచుమున కక్కడఁ జేరఁబోయెను. అటుకాదేని 140 మైళ్లు గ్రహణస్నానమునకే పోయినాఁడనుట నమ్మఁగానిమాట. ఈప్రకారము నేను సమాధానమిచ్చి యుండియు మరలఁ బంతులవారావిషయమే వ్రాయుట వ్యర్థశ్రమము. గంగాయాత్ర సంకల్పించినవారు సమీపకాలమునఁ బుష్కరము తటస్థించు నేని యాసమయమునకు సరిగ గంగఁ జేరఁబోయినట్లె గ్రహణకాలమునకు సరిగఁ బోతన గంగఁ జేరఁబోయెనని గ్రహింపవలయును.

ఈవిధముగఁ బంతులవారియాధారములు రెండును రెండుత్రోవలు పట్టినవి. ఇఁక వీరి యాధారములెల్ల మెట్టివో చూతము.

బమ్మెర గ్రామనామ మనుకొనుట మొదటియూహ. బొమ్మెరయే బమ్మెర యనుకొనుట రెండవయూహ. బమ్మెర పోతరాజు బొమ్మెరలో నుండె ననుట మూఁడవయూహ. గ్రంథము వ్రాయ బొమ్మెరలో స్థలము లేమిని గాఁబోలు నోరుగంటికిఁ బోయె ననుట నాలవయూహ. గ్రంథము ముగియఁగానే మరల నూరికివచ్చె ననుట యైదవయూహ. రాకుండినను నోరుగంటివారు కృతఘ్నులై యాయనను స్మరింపమని బొమ్మరవా రాయనపేర బొడ్డురాయి నిలిపిరనుట యాఱవయూహ. పోతరాజు గోలకొండవాఁ డనునూహచే గంగ యనఁగా గోదావరి యనునూహయూహపై నేడవయూహ, గంగ యనఁగా గోదావరి యని యూహించుటచేఁ బోతరాజు గోలకొండవాఁడనుట యెనిమిదవయూహ. ఇన్నియూహలనాధారముగఁ గలది యోరుగంటివారి వాదము. రామయ్యపంతులవారి వ్యాసముం దెచ్చుటఁజూచినను "నూహించుట సమంజ

*తిక్కన భారతరచనకు ముందు యజ్ఞముచేసినట్టు ధనికుఁడుగామిఁ బోతన భాగీరథీస్నానమునకై పోయెను.

సముకదా" యను వాక్యములే కాని కడిగిగాలించి వెదకిన నొక్కచోటనైన వెలిగంధల, వీరప్పారుతప్ప, నిదిగ్రంథస్థము ఇది ప్రత్యక్షప్రమాణము నను వాక్యమొకటయినఁ గానరాదు కదా? ఈ వాదమునందుఁ గానవచ్చునది పంతులవారి ప్రతిభావిశేషమే. వాదకుశలులు మేధావులు నగువారు పూని పుష్పిత వాక్యంబుల గంధర్వనగరంబు నిర్మించుటచే నోరుగంటివారివాద మింత దూరము పెరిఁగినది కాని లేనియెడల నెన్నఁడో యుహ్వానిన నెగిరిపోయి యుండును.

తాము బమ్మెరపోతరాజు వంశమువారమని నెల్లుట్లవారు చెప్పుచుండుట ప్రత్యక్షప్రమాణము గాదా యని పంతులవా రడుగవచ్చును. నిస్సందేహముగ నున్నయెడల నది ప్రమాణమే. అయినను నోరుగంటివాది యైనరావుబహదర్ కందుకూరి వీరేశలింగము పంతులవారు "శేషాద్రిరమణకవులు కృష్ణాపత్రికలో నెల్లుట్ల నారాయణకవినిగూర్చి వ్రాయునపుడును తత్పూర్వమున నెల్లుట్ల నృసింహారావుగారినిగూర్చి వ్రాసినపుడును వారు బమ్మెరపోతరాజువంశమువారని వ్రాసియున్నారు. ఈ కథ యెంతమాత్రమును విశ్వాసార్హమైనది కాదు" అని వ్రాసియున్నారు. రావుబహదర్ వారి వ్రాఁతను నేను స్వతంత్రవిమర్శనము చేయక నమ్మఁజాలనుగావున నిప్పు డింతమాత్రము చెప్పఁగలను. నెల్లుట్లవారినిగుఱించి యోరుగంటివాదులు వారిలో వారే వాదులాడునపుడు నే నెవరివాక్యము ప్రమాణ మని గ్రహింపఁగలను? వారితగవు పరిష్కారమగువఱకది నిస్సందేహమయినప్రమాణము గాదు కావునఁ ద్రోచివైచితిని. రావుబహదర్ వారి వ్రాఁత యోరుగంటివారివాదమునకుఁ బిట్టపిడుగై వారికుండిన యొక యాధారమును నాశముచేసినది.

8. నేను భాగవతసీసపద్యము నుదాహరించినపిమ్మటఁ బోతనకుఁ బ్రత్యక్షమయిన దేవుఁడు కోదండరాముఁ డనుమాట సత్యమే యని యంగీకరించిరి గాని "కోదండరాముఁ డొంటిమిట్టలోమాత్రమే వెలసియుండలేదు. అనేకగ్రామములలోఁ గోదండరామస్వామి యాలయములు గలవు. కావునఁ గోదండరామస్వామి యున్నంతమాత్రమున నొంటిమిట్టకోదండరామస్వామియే యని సిద్ధాంతముచేయ న్యాయ్యము కాదు" అని పంతులవారు వ్రాసిరి.

రామయ్యపంతులవారు వారిప్రథమవ్యాసములో బొమ్మెరలోని పోతరాజునుబట్టి కవి కా నామము వచ్చియుండవచ్చు నని వ్రాసిరి. దానికిఁ బ్రత్యుత్తరముగ నేను బోతరాజు గ్రామగ్రామములలో నుండుటచే నే పోతరాజును

బట్టియైనఁ గవి కాపేరు వచ్చియుండవచ్చు నంటిని. అనఁగా నొంటిమిట్టలోను దత్ప్రాంత గ్రామములలోను గ్రామదేవత లుండుటయు జాతరకాలములోఁ బోతరాజు లూరేగుటయు సర్వజనవిదితము. కావున నొంటిమిట్టలోని పోతరాజునుబట్టి కవి కానామము వచ్చి యుండవచ్చు నని వ్రాసితిని. నావాక్యమునకు బదులువాక్యమును బంతులవారు వ్రాసిరిగాని దానివలనఁ దమవాదమునకుఁ గలుగులోటు విచారింపరైరి. వివాదగ్రామము లోరుగల్లు ఒంటిమిట్ట బొమ్మెర. పోతరాజునకుఁ బ్రత్యక్షమయినదేవుఁ డీగ్రామములోని వాఁడనుట సమంజసమో దేశాంతరగ్రామాంతరవాసి యనుట సమంజసమో మీరే యాలోచింపుఁడు. ఓరుగల్లు బొమ్మెరలందుఁ గోదండరామాలయములు లేవు. ఒంటిమిట్టయం దున్నది. ఇప్పు డెచ్చటిదేవుఁడు ప్రత్యక్షమయ్యెననుట సంభావనీయమో మీరే యోజింపుఁడు.

9. “విగ్రహములు ప్రతిష్ఠింపఁబడినక్షేత్రములపేళ్లు సూచింపఁబడని యెడలఁ గృతిపతు లర్చావిగ్రహములు కా వనియే యూహింపవలయు” నని మఱియొక యాక్షేపము.

ఈయూహ సత్యము గాదనుటకు నెల్లూరి హరిహరనాథతిక్కనలే సాక్షులు. మఱియొకసాక్ష్యము భానుమతీపరిణయంబున

ఉ. శ్రీలఁ జెలంగుసత్త్వగుణశీలత నిర్మలమూర్తివయ్యు మై
నీలరుచు న్వహించితివి నీమదిలోపలి నీలకాంతు లీ
లీలఁ బ్రకాశమయ్యెను భళీ యనుశ్రీయలిమేలుమంగ కాం
తాళమురేచి ఱొమ్మునను దాల్చినవేంకటభర్తఁ గొల్చెదన్.”

అని యున్నది. ఇది “వెలుగోటిరాయశౌరి” కంకితము. ఆపుస్తకమం దెక్కడను దిరుపతిపేరుగాని వేంకటేశ్వరాలయములుండు మఱియే యూరిపేరుగాని లేదు. అలిమేలుమంగా శ్రీవేంకటేశ్వరు లర్చావిగ్రహములు కావని పంతులవారనఁగలరా?

ఒంటిమిట్ట దేవాలయములో సీతారామలక్ష్మణవిగ్రహము లున్నవనియుఁ బోతరాజు లక్ష్మణవిగ్రహముమాట తలపెట్టలేదు గావున నొంటిమిట్ట దేవాలయములోని విగ్రహ మాతని (పోతన) మనస్సులో లేదనియే చెప్పవలసి యున్నది.” అని మఱియొకయాక్షేపము. దీనికి నా సమాధానము.

రామదాసుని జెఱనుండి విడిపింప రామలక్ష్మణులుమాత్రమే ప్రత్యక్షమైరి గనుకను, భద్రాద్రి రామస్వామిదేవాలయమున సీతారామలక్ష్మణులుండుటచే రామదాసును రక్షించినవారు భద్రాద్రివాసులు గారని పంతులవారు చెప్పఁగలరా?

లోక మంతయు నమ్మెడునిది పంతులవారికిఁ బ్రమాణము గాదేని “శ్రీవాసజ్జటప్రోలీ భావుకపత్తనవిహారపటుశీలున” కంకిత మీయఁబడిన చంద్రికాపరిణయంబున

“అని యిష్టదేవతావందనంబును.........గావించి యే నొక్క మహాప్రబంధనిబంధనంబున కుద్యోగించి యున్నతత్పుణ్యరాత్రంబున

సీ. పరువంపు ననగుంపు బలితంపు జిగిపెంపుఁ
గనియొప్పు పాణియుగ్మములతోడఁ
జెలువందు నరవింద ములయంద ములుచింద
ననువొందఁ గలకన్నుఁ గొనలతోడ
జగడంబు గనునంబు ముగయంబు జగడంబు
మేలంబు లాడు నెమ్మేనితోడఁ
దులకించు బలుమించుఁ దలఁకించు నెఱమించు
గమిమించు హేమాంశుకంబుతోడ
మారుఁబలుమాఱుఁ గేరుమైతీరుతోడ
సోమునలయించు నెమ్మోముగోముతోడఁ
బరఁగుమాపాలి మదనగోపాలమూర్తి
యంచితస్ఫూర్తి సాక్షాత్కరించి పలికె.”

అని యున్నది. దేవాలయమందుఁ గృష్ణవిగ్రహముతోడ రుక్మిణీవిగ్రహము, నున్నది. ఇచ్చట రుక్మిణీపేరు కవి తలంపఁడయ్యెఁ గావునఁ గవికి సాక్షాత్కరించినదేవుండు జటప్రోలిమదనగోపాలమూర్తి కాఁడనఁ బంతులవారు సాహసింతురా? ఈయుక్తులు పంతులవారి ప్రతిభ యత్యద్భుత మనియుఁ బొదిలోనమ్ములు క్షయించిన వనియుఁ దెలుపుచున్నవి.

11. భువనగిరికి నేకశిలానగర మనునామ మెట్లయిన నేమి పంతులవా రంగీకరించిరి, బమ్మెరపోతరాజు మాగ్రామమువాఁ డనియు, దానిని లోకమున గూఢపఱుచుటకే యేకశిలానగర మని యాయన వ్రాసెననియు భువనగిరివాసులు చెప్పినఁ బంతులవా రేమిప్రత్యుత్తర మిచ్చెదరని యడిగితిని. దానికిఁ బ్రత్యుత్తరము లేదు. భువనగిరికి నేకశిలానగర మనునది యిటీవల సాధింపఁబడిన దఁట. ఎప్పుడు? ఎవరిచేత? అక్కడ నొంటిగుట్టపుట్టిన దెపుడు? రెంటికి

నర్థములో భేదముండిన నేమిదోషము? భిన్నకారణములచే భిన్ననామములు రారాదా? ఇవి పంతులవారు దెలుపవలెను.

భువనగిరికి నేకశిలానగరమున కేమిసంబంధమని కడపలో సభలో నే నడిగినపుడు భువనగిరియం దేకశైలముండుటచే దాని కాపేరు వచ్చెనని పంతుల వారు చెప్పలేదా? ఇప్పు డర్థభేదము కల దనుచున్నారు. ఆ భేద మేదియో తెలుపవలెను.

ఏకశిలానగర మనుపేరు భువనగిరికి, నోరుగంటికి, నొంటిమిట్టకుఁగూడఁ గలదని నా వాదము. ఒంటిమిట్ట కాపేరీవివాదము పుట్టకముందే పుట్టిన దనుటకై

(1) పురాణము హయగ్రీవశాస్త్రులవారి భాగవతపీఠిక.

(2) Madras Manual of Administration.

(3) స్కాందపురాణము నుండి తెనిఁగింపఁబడిన యేకశిలానగర మాహాత్మ్యము పద్యకావ్యము.

ఈ మూఁడును బ్రమాణములుగ నిచ్చితిని. ఈ మూఁటియందును నేను వ్రాసినట్లు లుండుట సత్యమని యంగీకరించుచు రామయ్యపంతులవారు కొన్ని యాక్షేపములు వ్రాసిరి.

అందు (1) "ఈ మూఁడుగ్రంథములలో హయగ్రీవశాస్త్రిగారి పీఠికయే ప్రప్రథమము. ఇది యైన నిప్పటి కఱువదితొమ్మిది సంవత్సరములకుఁ బైగాఁ బుట్టినది. పోతరా జొంటిమిట్టనివాసియగునో కాఁడో హయగ్రీవశాస్త్రిగారు స్వీయముగ నెఱిఁగియుండరు గదా. ఏ కారణములంబట్టి తమ కాయభిప్రాయము గలిగెనో యాయన చెప్పియుండలేదు" అని పూర్వపక్షము. దీనికి నా ప్రత్యుత్తరము. హయగ్రీవశాస్త్రులవారు బమ్మెరపోతరాజు సమకాలికు లని నేను జెప్పలేదు. వా రిది సృష్టించినారని పంతులవారును జెప్పసాహసింపలేదు. ఏ కారణములంబట్టి యాయనకా యభిప్రాయము కలిగెనో యాయన చెప్పియుండలేదనుట సరిగాదు. వారుస్పష్టముగ "ఈ విషయమంతయు బమ్మెర పోతనామాత్యుని జన్మకర్మప్రభావాదులం దెలిపెడు వచనరూపం బగుప్రాచీన పండితజనలిఖితగ్రంథంబు రప్పించి యందుఁ దెలిపియుండెడు క్రమమున నతి సంగ్రహముగా నిందు తెలుపఁబడినది" యని యిట్లు వ్రాసియే యున్నారు. ఈ వాక్యమును నేను దమకుఁ గనఁబఱిచిన భాగవతమునుండి యెత్తి తమపుస్తకములో వ్రాసికొనియుండియు నిట్లు వ్రాయుటయేలకో? వృథావాదము

పెంచుటకా? ఒంటిమిట్ట వారివాదము మఱింత బలపఱుచుటకా? దీనివలన హయగ్రీవశాస్త్రులవారు స్వకపోలకల్పన మేదియుఁ జేయలేదనియుఁ గేవలజనశ్రుతిని నమ్మి వ్రాయలేదనియుఁ దమమనుష్యులఁబంపి వారు వ్రాయించి తెప్పింపలేదనియుఁ బ్రాచీనపండితులు లిఖితరూపముగ వ్రాసియుంచిన దాని నాధారముచేసికొని వ్రాసిరనియు నందు బమ్మెరపోతరా జొంటిమిట్టనివాసి యని వ్రాయఁబడియున్నదనియు, శాస్త్రులవారు భాగవతపీఠిక వ్రాయుటకుఁ జాల కాలము ముందే యీ విషయము లిఖితగ్రంథరూపంబున దేశంబున విరాజిల్లుచుండె ననియు స్పష్టపడియెను.

హయగ్రీవశాస్త్రులవారు నిరాధారముగ వ్రాసిరని కల్పించుకొని రామయ్యపంతులవారు మఱియు నిట్లు వ్రాసిరి.

"ఆయన కడపమండలమందుఁ బుట్టినవాఁడు కాకపోయినను గొంత కాలము కార్యవశమునఁ గడపలో నివసించియుండిరని వారి బంధుకోటిలోనివారగు చదలువాడ సుందరరామశాస్త్రిగారు చెప్పుచున్నారు. ఆ కాలమందీప్రతీతిని హయగ్రీవశాస్త్రిగారు కడపలో వినియుండవచ్చును."

హయగ్రీవశాస్త్రులవారు తమకుఁ గలయాధారము చెప్పియుండుటచే నిదంతయు నాకాశపంచాంగమే. అయినను హయగ్రీవశాస్త్రులవారు కడపలో వసించినారనుట కల్ల యని కొందఱు పుదూరుద్రావిడులు నాతోఁ జెప్పియున్నారు. ఈ విషయము కడపలోనే పంతులవారికిఁ జెప్పితిని.

"ఈ ప్రతీతిని హయగ్రీవశాస్త్రిగారు కడపలో విని యుండవచ్చు" నని పంతులవారు వ్రాయుటచే జగద్విశ్రుతప్రతీతి చిరకాలముగ నున్నట్టె పంతులవా రంగీకరించిరి. ఇట్టి దోరుగంటికిఁ గుందేటికొమ్ముగదా. బ్ర॥ శ్రీ॥ సుందరరామశాస్త్రులవారిని మీ రిట్లుచెప్పుట కేమియాధారమని పండితులవా రడిగిరా? అడిగియుండినచో గుట్టుబయటఁబడి యుండును. కొండూరు శ్రీనివాసశాస్త్రిగారికి ముందు కడపలోఁ బుదూరుద్రావిడులు లేరని యనేకులు చెప్పియున్నారు. సుందరరామశాస్త్రులవారి యుత్తరమును మీరు ప్రకటించెద రేని దానికిఁ దగిన ప్రత్యుత్తరము నేనును బ్రకటించెదనని పంతులవారితోఁ జెప్పితిని. దానిని వారు ప్రకటింపమిచే నది విమర్శనక్షమము గాదని యేర్పడెను.

(2) Madras Manual of Administration లోని వ్రాఁతకున్న హయగ్రీవశాస్త్రులవారిపీఠికయే కారణమై యుండవలయునని యాక్షేపము. ఇదియుఁ బంతులవారియూహ. ఈ వ్రాఁతకు శాస్త్రులగారిపీఠికయే యాధారమో లేక

టీకికి కాధారమైనవచనగ్రంథమే యాధారమో లేక మఱియేదైనఁ గలదో. ఎటుచూచినను నొంటిమిట్టపక్షపాతులచే నీగ్రంథము వ్రాయఁబడినదని పంతులవారు చెప్పఁజాలరు. ఇట్టి దోరుగంటికి నా కాశపుష్పముకదా?

(3) ఏకశిలానగరమాహాత్మ్యములోనికథ కొంత విలక్షణముగా నున్నదని యొంటని, మిట్టని చరిత్రము వ్రాసి "దీనినిబట్టి యేకశిలానగర మనుపేరు రామతీర్థముపైఁ గప్పినరాతినిబట్టి పుట్టినదిగాని యొంటిమిట్టకు భాషాంతరము గాదని తేలుచున్నది. ఈ వ్యుత్పత్తి సుబ్బరావుగారి మతానుసారముగాదు" అని రామయ్యపంతులవారు వ్రాసిరి. ఒంటిమిట్టకు నేకశిలానగర మను పేరు వచ్చుటకు నే నిదివఱకుఁ జెప్పినకారణములు గాక యిది క్రొత్తది. దీనిని నేను వ్రాయమఱచితిని. నేను జేయవలసినపని పంతులవారు చేసిరిగావున వారికి నమస్కారము. ఇది నామతానుసారము గాదనుట సరిగాదు. రామతీర్థముపై మూసినది యేకశిలగదా. ఈ వ్యుత్పత్తివలన నా వాదమున కేహానియులేదు. ఒంటిమిట్టకు నేకశిలానగర మనుపేరు లేదని చెల్లదని పంతులవారి వాదము. ఒంటికొండ యొంటిబండ సిద్ధముగానున్నవి. పంతులవారి కేది సరిపడిన దానినే గ్రహింపవచ్చును.

12. ఈ గ్రంథము స్కాందపురాణము ననుసరించి రచింపఁబడినది గావునఁ బరమప్రమాణ మని సుబ్బరావుగారివాదము. స్కాందపురాణమును గవి చూచియుండ లేదు. దానినిబట్టి యెవరో వ్రాసినారన్నవచనమునుబట్టి గ్రంథము రచించినాఁడఁట. స్కాందపురాణ మన దిక్కులేని క్షేత్రమాహాత్మ్యముల కెల్ల దిక్కు. కావున నే యఱవమున "ఈ పౌయికంధపురాణత్తిలియు మిల్ల") ఈ కెల్ల స్కాందపురాణమునందును లేదు) యను సామెత పుట్టినది." అని రామయ్యపంతులవారు స్కాందపురాణముపై దెబ్బతీసిరి. ఈ విషయమున నేను జెప్పవలసిన దింతయే. తెనుఁగున నేకశిలానగరమాహాత్మ్య మీ వాదము పుట్టుటకుముందే పుట్టినది. ఆకవి సంస్కృతస్కాందపురాణమున నుండు దానిని దెనిఁగించెద నని వ్రాసియున్నాఁడు. ఆ విషయకపద్యమును బ్రథమభాగమున ననువదించితిని.

ఇఁక స్కాందపురాణము ప్రమాణగ్రంథ మగునా కాదా యనుట లోకము పరిష్కరింపవలెను. అది యప్రమాణగ్రంథ మయ్యెనేని కాశీత్యాది క్షేత్రము లన్నియు దిక్కుమాలినవే.

స్కాందపురాణములోని దగుటచే నొంటిమిట్ట మాహాత్మ్యము కల్లగ్రంథమనిగదా వారివాదము. వారే వేములవాడ క్షేత్రమాహాత్మ్యములో "నా స్థలమునకు దక్షవాటి యనుసంజ్ఞకూడఁ గలదు" అని కొన్నిశ్లోకముల నుదాహరించి యవి భవిష్యోత్తరపురాణములో నున్నట్లు వ్రాసిరి. ఈభవిష్యోత్తరపురాణము బొంబాయిలో వేంకటేశ్వరముద్రాక్షరశాలవారు ప్రకటించియున్నారు. దీనిలో నీవేములవాడ క్షేత్రమాహాత్మ్య మేపుటయందున్నదో తెలుపఁ బంతులవారిని బ్రార్థించుచున్నాఁడను. ఈ వేములవాడకుఁ బూర్వపూర్వతరజన్మంబుల లేములవాడయనియు లేమలవాడయనియు లేమ్బలవాడ యనియుఁ బేర్లని పంతులవారు వ్రాయుటచే వీనికి సంస్కృతనామము లైననింబవాటి, దౌర్భాగ్యవాటి, లంజికావాటి యనుపేర్లాగ్రంథమున నున్నవేమో యని వెదకి వ్యర్థప్రయత్నుఁడనైతిని. ఈ నాకష్టమును బంతులవారు పుటసంఖ్య సూచించి సఫలముఁ జేయుదురుగాక. వేములవాడ మాహాత్మ్య మాయూరిపేర్లే తెలుపుచున్నవి. పురాణకథనమేల? తొలుత లేమలవాడ, అక్కడ లంజలుండుటచే నీపేరు వచ్చెనని పంతులవారే సెలవిచ్చిరి. ఆవల "గుత్తలంజలను మరగినవారికి దుత్తేకడపట" ననుసారంగపాణివాక్యముచొప్పున నది లేములవాడ యయ్యెను. తరువాత నాదారిద్ర్యవాటి రుద్రవాటియై యందు వేఁపచెట్లు విశేషముగ మొలచుటచే వేములవాడ యయ్యెను. ఇట్టి వాటియఁట దక్షవాటి యఁట!! మేలుమేలు ఇదిగదా స్థలభోగ మనునది. రాజేశ్వరుఁడు రాజ్యము చేయుకాలములో వానిప్రీతికై రాజరాజేశ్వరమాహాత్మ్య మని భీమలింగ ముండుటచే గోదావరిమండలస్థదక్షవాటిపోలికగ వేశ్యావాటిని దక్షవాటిగ నెవఁడో మిథ్యావాదిసంస్కృతపండితుఁడు వ్రాసియుండవచ్చును. ఆ యసత్యమును బలపఱుప భవిష్యోత్తరపురాణములో నున్నదని రెండవయసత్యమాడెను. పంతులవారి కది పరమప్రమాణమయ్యెను. రాజు మెచ్చినది రంభ. తాను మునిఁగినది గంగ. పంతులవారివలె నేను బురాణదూషణముఁ జేయను. భవిష్యోత్తరపురాణములో వేములవాడ మాహాత్మ్యము లే దందును.

గోదావరిలోని దక్షారామము మాహాత్మ్యము శ్రీనాథుఁడు తెనిఁగించెను. అది స్కాందపురాణమునుండి గ్రహింపఁబడినది కావున శ్రీనాథుని కృతము దబ్బఱగ్రంథమే పంతులవారియభిప్రాయప్రకార మగునుగాక. ఈ విషయమున నాకు మఱొకసందేహము. హరిద్వారమునొద్ద దక్షుఁడు యజ్ఞము చేసినస్థలమని ప్రతీతికలదు. దానిని నేను జూచియున్నాఁడను. అచ్చటివారందఱును దైర్థికులందఱును నదియే నిజమైన దక్షయజ్ఞవాటి యని విశ్వసించియున్నారు.

ఈవిషయమునఁ బంచమవేదమున నీశ్లోకములు గానవచ్చుచున్నవి

కస్యచి త్త్వథ కాలస్య దక్షో నామప్రజాపతిః
పూర్వోక్తేన విధానేన యక్ష్యమాణో వ్యపద్యత
తతస్తస్య సుఖం దేవాః సర్వే శక్రపురోగమాః
గమనాయ సమాగమ్య బుద్ధి మాపేదిరే తదా
తే విమానై ర్మహాత్మానో జ్వలనార్కసమప్రభైః
దేవస్యానుమతేఽ గచ్ఛన్ గంగాద్వార మితిశ్రుతిః

గంగాద్వారమునకే హరిద్వారమనియుఁ బేరు:—దీనివలనఁ బంతుల వారి పురాణము బవిసి తెలియవచ్చెఁగదా. గంగాద్వారమన గోదావరీద్వారమని పంతులవా రనరుకదా.

ఇప్పు డీరెంటిలో నేది నిజమైనదక్షవాటిగా నుండునో పంతులవారే నిశ్చయింప సమర్థులు. వేములవాడ దక్షవాటి యనుట పచ్చిదబ్బఱ. ఇట్టి దబ్బఱ స్కాందమందును లేదనుట యిట్టిసందర్భములనుబట్టి వచ్చినది. హిమవత్ప్రాంతమున ఋషివాటికల నడుమ గంగాతీరంబున దక్షుఁడు యజ్ఞముచేసి యుండ లంజలవాడలో నినుపగజ్జెలతల్లి తాండవమాడుచోట వేఁపచెట్ల నడుమఁ జేసియుండుననుట యెట్టిసాహసము. స్థలమాహాత్మ్యముల రహస్య మంత తెఱంగినదియే. అద్దపుటిండ్ల వసించువా రితరుల ఱాలరువ్వరాదు.

13. "దీనినిబట్టి యేకశిలానగరమనుపేరు రామతీర్థముపైఁ గప్పినదానిని బట్టి పుట్టినదిగాని యొంటిమిట్టకు భాషాంతరము కాదు" అని పంతులవారు వ్రాసిరి. గ్రామములకు వివిధకారణములచే వివిధనామములు వచ్చు నని నా వాదము. ఆవిషయము ప్రథమభాగములో వ్రాసియున్నాను గావున నిపుడు చర్వితచర్వణము చేయను. వెలిగందల వేములవాడకు దక్షవాటి యని పేరున్న దని పంతులవారు వ్రాసిరిగదా. లేమ్బలవాడ, లేమలవాడ, లేములవాడ, వేములవాడ, యనువానిలో దేనికి దక్షవాటి యనునది భాషాంతరమో తెలుపఁ బంతులవారిని వేఁడుచున్నాను.

14. "ఈగ్రంథములు మూఁడును బ్రస్తుతవాదము విజృంభింపకపూర్వమే పుట్టినవికావునఁ బ్రమాణములని సుబ్బరావుగారు వాదించుచున్నారు. ఈ వాదము శాస్త్రసమ్మతము కాదు" అనియు ఆయన (పోతరాజు) కీర్తిశేషుఁడైన నాలుగువందలసంవత్సరములకుఁ బైనిఁ బుట్టినపురుషుఁ డావిషయము నిజమెఱిఁగియే వ్రాసెనని యెట్లునమ్మవచ్చును" అనియుఁ బంతులవారు వ్రాసిరి.

హయగ్రీవశాస్త్రులవారు పోతరాజునకు 400 సంవత్సరముల కీవలఁబుట్టుట సత్యము. హయగ్రీవశాస్త్రులవారికి 20 సంవత్సరముల కీవల రామయ్యపంతులవారు పుట్టుటయు సత్యము. తమకు ముందుండిన "ప్రాచీనపండితులు" వ్రాసినదాని నాధారముచేసికొని వ్రాసినవారు హయగ్రీవశాస్త్రులవారు. ఎవరో చెప్పిన పుక్కిటిపురాణములనమ్మి 500 సంవత్సరముల కీవలఁ బగలాకాశమెగఁజూచి యోరుగంటిపంచాంగము వ్రాయఁబూనినవారు పంతులవారు. ఈరెంటిలో నేది యెక్కువవిశ్వసనీయము? ఈవాదము రాకముందు పోతన యోరుగంటివాఁడని యెవ్వఁడైన వ్రాసియుండెనా?

15. "పోతరాజు జీవించియున్నపుడుగాని యాతఁడు గతించిన పిమ్మటఁ గొంచెముకాలమునకుఁ గాని యీ గ్రంథములలో నేదైనఁ బుట్టి యుండినచోఁ బోతరాజు జన్మస్థానవిషయము గ్రంథకర్త సత్యమెఱిఁగియే వ్రాసియుండునని యూహింపవచ్చును." అని పంతులవారు వ్రాసిరి.

ఇది ప్రమాణవాక్యమగునేని యాంధ్రకవులచరిత్ర మేగతిఁ బట్టునో. మఱియొకరి ప్రశంస యేలగాని వేములవాడభీమకవికి రామయ్యపంతులవారు సమకాలికులా? పిమ్మటఁ గొంచెము కాలమువారా? పోతనకు హయగ్రీవశాస్త్రులకు 400 సంవత్సరము భేదముండిన భీమన్నకు రామయ్యపంతులవారికి 600 సంవత్సరము లేడము. హయగ్రీవశాస్త్రులవారికి లభించినట్టు ప్రాచీనపండితలిఖితగ్రంథ మేదైనఁ బంతులవారికి దొరకెనా? ఏమి యెఱిఁగి వీరు భీమకవిస్థలము నిర్దేశింప సాహసించిరి? విషయము తమకు ననుకూలమైనచో శాస్త్రసమ్మతము ప్రతికూలించినచో శాస్త్రసమ్మతము కాదు కాఁబోలు. భీమకవిని గుఱించి నేను బ్రస్తావించుట పంతులవారి వాదమునందలి యసంగతదోషము తెలుపుటకేగాని యావాదమునందు నాకభిమానము గలిగి కాదు. భీమకవివాసస్థాననిర్ణయమున నాకుఁ బట్టుదల లేదు.

16. "ఒంటిమిట్టవాదుల కేకశిలానగరశబ్దము వ్యుత్పత్తియే కుదిరినది కా" దంట. మేలుమేలు. నావ్యాసమును బంతులవారు చక్కఁగనే పఠించిరి!!

"ఏకశిల యనునది యొంటిమిట్టకు సంస్కృతరూపమని సుబ్బరావుగారి సిద్ధాంతము." అవును. దీనిని బంతులవారు ఖండింపఁజాలరైరి. మూఁత వేయఁబడినరాతినిబట్టి వచ్చినదని పంతులవారే యంగీకరించి వ్రాసిరి. అందేమియు దోషమును జెప్పినవారుకారు.

"దేవాలయములోని సీతారామలక్ష్మణవిగ్రహములు మూఁడును నేక

శిలానిర్మితము లగుటనుబట్టి యేకశిలానగరనామము గ్రామమునకుఁ గలిగిన దని మూఁడవవ్యుత్పత్తి నొకదానిని సుబ్బరావుగారు కల్పించినారు" అని పంతులవారు నాపై నొకదోషము కల్పించినారు. ఇట్లు వారు వ్రాయుటకుఁ గారణము తమవాద మంతయు ఖండితమయిన దనుమెఱమెఱచే నావ్యాసమును సఱిగాఁ జదువుటయే కాని యసత్య మాడవలయు ననుతలంపునఁ గాదని నేనెఱుఁగుదును. అటు గాకున్న "ఇది నాకల్పితము గాదు" అని నేను స్పష్టముగ వ్రాసియుండ వా రిట్లు వ్రాయుదురా? నేను వ్రాయుటకు నాలుగు సంవత్సరములకుముందు హిందూపత్రికలో మాననీయులగు దివాౝబహదర్ కేశవపిళ్లగారు వ్రాసియుండ దానిని ననువదించితిని. అది వీరు చదివినట్టే లేదు. సత్యబలముగల యొంటిమిట్టవాదులకుఁ గల్పనలు నపోహములు చేయ నక్కఱ లేదు. నా వ్యాసమును వీరు చక్కఁగఁ జదువని కారణముచేతనే యభిప్రాయము మార్చుకొనఁ గారణము లేదని వ్రాసి చెప్పినదే చెప్పి వ్రాసినదే మరల వ్రాసి వృథావాదము పెంచిరి. అంతియగాక "సీతారామలక్ష్మణ విగ్రహములు మూఁడు నేకశిలానిర్మితము లన్నమాట సరికాదు" అనిరి. పంతులవా రిచ్చటఁ బొరపడిరి. నావ్యాసము చదువ నియమితమైనదినమందు సాయంకాలమునఁ బ్రాఁతతాలూకు కచ్చేరిలో నీకార్యార్థమై సత్య మారయ నొంటిమిట్టకుఁ బోయి వచ్చిన నెందలూరు న్యాయవాదులు లోనగువారు (బ్ర॥ శ్రీ॥ పరశురామరావుగారు ప్రముఖులు) తాము కోవెలలో విగ్రహములకుఁ బ్రదక్షిణించి పరిశీలించి వచ్చితి మనియు మూఁడు విగ్రహములు నేకశిలానిర్మితము లనుటకు నాధారముగ మూఁడువిగ్రహములకు వెనుక ప్రక్కన నొకేచాఱ యవిచ్ఛిన్నమని తోఁపఁజేయున ట్లున్నదనియుఁ జెప్పినపుడు పంతులవా రచ్చట లేరేమో. ఏకశిలానిర్మితములన మూఁడువిగ్రహములు కాలుసేతులు పెనవేసికొని పోఁతబొమ్మలయందో కొన్నిపటములయందో కొన్నిరూపములు గానవచ్చువిధ మని పంతులవా రభిప్రాయపడి రని తోఁచుచున్నది. నాయభిప్రాయ మది కాదు. విగ్రహములు మూఁడును వేఱువేఱుగాఁ గానవచ్చుచున్నను నేకశిలవలన నుత్పన్నములైనవని నాయభిప్రాయము. ఇది సత్యమో యసత్యమో యిప్పుడు పోయి పంతులవారు పరీక్షింపవచ్చును. ఈసందేహము నాకక్కడనే వారు తెలిపియుండినఁ బ్రత్యక్షముగఁ జూపియుందును. పోనీ, ఈవ్యుత్పత్తి తమకు సమ్మతము గాదేని నేను జెప్పినతక్కినవ్యుత్పత్తులను దాము నిరాకరింపఁజాలకుండియు "రామతీర్థముపై మూఁతవేయఁ

బడిన రాతినిబట్టి యేకశిలానగర మనుపేరు పుట్టినది" "ఒంటిమిట్ట కేకశిలా నగరమని స్థూలదృష్టిచే నర్థము చెప్పవచ్చును" అని తామే వ్రాసియు వ్యుత్పత్తి కుదిరినది కాదనుట యేమివాదచమత్కారము!!

17. నగర మనుపే రొంటిమిట్టకుఁ జెల్లునని కొన్ని కారణములు చెప్పితిని. గ్రామ మెంతవఱకు వ్యాపించియుండినది వ్రాసితిని. రామయ్యపంతులువారు విచారించినపుడు దేవాలయమునర్చకుఁడు గ్రామమెంతవఱకు వ్యాపించియుండుటయు ననేకులు జనులు వచ్చి పోతన నివసించియుండినచోట నుండుచెట్టునకుఁ బ్రదక్షిణించి కర్పూరపుటారతులిచ్చి యర్చించిపోవుచుండుటయుఁ జెప్పెను. గురవయ్యగారును మఱియొక్కప్రక్కఁ 'గోటలోనిచేలు' కోటమధ్యమున నుండెనని చెప్పిరి. వీసినంతయుఁ బంతులవారు తుంగలలోఁ ద్రొక్కి "నడుమఁ గల్పింపఁబడు నామము లన్వర్థముగానే యుండు ననియు నొంటిమిట్ట పూర్వము గొప్పపట్టణముగా నున్నట్లు నిదర్శనములు గానరావనియు నాప్రత్యుత్తరము" అని వ్రాసిరి.

ఈవిషయమునఁ బంతులవారి నొకటిరెండు ప్రశ్న లడిగెదను. వానికి వారు చెప్పెడుసమాధానములే వారికిఁ బ్రత్యుత్తరములు కాఁగలవు. "ఏకశిలానగర మనుపేరు రామతీర్థముపైఁ గప్పిన రాతినిబట్టి పుట్టినది" అని వారే వ్రాసిరికదా? అంతకుఁ బూర్వమచ్చట గ్రామము లేదని యడవియని వారే వ్రాసిరికదా? ఇప్పుడు గ్రామము, గ్రామనామము కూడఁబుట్టినవా లేక గ్రామనామము నడుమ వచ్చినదా?

ఏకశిలానగర మనునది పాఱువేఁటకొండనుబట్టి వచ్చినదికదా. కొండ ముందా గ్రామము ముందా?

విగ్రహములంబట్టి పేరు వచ్చినదని వ్రాసితినిగదా. విగ్రహములు ముందా గ్రామము ముందా? పంతులవారు తామేమివ్రాసిరో దానినైన మఱియొకపరి చదువుదురుగాక!

ఇన్నిటివలనను నేకశిలానగరనామము నడుమవచ్చినది కాదని యేర్పడెను.

పూర్వపుగ్రామము విరివి యిదివఱకే వివరించితిని. పోత్తపినాడని ప్రసిద్ధి గదా. పోత్తపి రాజస్థానమయినట్టు చరిత్రములే చెప్పుచున్నవిగదా. ఇట్టి పోత్తపి యిప్పటి యొంటిమిట్టయంత యున్నదా. హస్తినాపుర మిప్పుడెట్లున్నదో పంతులవా రెఱుఁగరా? ఇట్టి దృష్టాంతము లెన్ని కావలయును?

18. ఓరుగంటికి నోరుగంటి యనుపే రున్నదని సాధింపఁ బంతులవారు చాల శ్రమించినారు. కాని యది ప్రస్తుతవివాదమునకు సంబంధించినదికాదు. అది యోరుగల్లయినను నొరగల్లయినను మఱియేకల్లయినను నావాదమునకు గాఁగల లాభనష్టములు లేవుకావున నాచర్చ వ్యర్థము. ఓరు శబ్దములేదని కొంద ఱన్నందున దానికి గతి కల్పింప యత్నించితినికాని యది నావాదమును గెలిపించునని కాదు.

19. భోగినీదండకకృతిపతి యగుసర్వజ్ఞసింగమనీఁ డోరుగంటిప్రాంతము వాఁడు గావునఁ దత్కృతికర్తయగుపోతరాజును నాప్రాంతమువాఁడే యైయుండు ననువాదమును నా ప్రత్యుత్తరమును జూచి వదలుకొనిరి.

20. జనశ్రుతిప్రమాణ మోరుగంటికి లేదని వ్రాసియుంటిని. ఓరుగంటి వారివాదము బొమ్మెరవారివాద మొక్కఁటేయని పంతులవారు బదులిడిరి. పరస్పరవిరుద్ధవిషయము లుండునీరెండు నొకటి గాఁజాలదని యిదివఱకే వ్రాసితిని. భాగవతము రెండుస్థలముల నేకకాలమున వ్రాయఁబడెననుట యసంభావ్యము. రెండు నొకటిచేయ హనుమంతుఁడు రెండుకొండలమీఁద రెండుకాళ్లుంచిన దృష్టాంత మిఁకఁ జెప్పఁబడునేమో.

ఉభయగ్రామవాదము లొకటే యని పంతులవారి హస్తములు లిఖించినను, ఆవాదమునందలి బలహీనత యెఱఁగియుండుటచే వారిమన స్సంతతోఁ దృప్తిపడకపోవుటచే "కేవలజనశ్రుతులు ప్రబలప్రమాణములు కావనియే నా మతము" అని మఱియొకయుక్తి వ్రాసిరి. ఓరుగంటివారికి జనశ్రుతిప్రమాణ మభావమగుటను, నెల్లుట్లవారు బమ్మెరపోతరాజువంశమువారు కారని రావు బహాదర్ వారు వాదించుటచేఁ దమవాదమునకు నాధారములుగా నమ్మియుండిన తత్సంబంధిజనశ్రుతులు వాక్యములు డీలుపడుటకు నిట్లు వ్రాయవలసి వచ్చెనుగాని వేఱుగాదు. ఇప్పటి వీరిమతము తమవాదమును నేను బూర్వపక్షము చేసినతరువాత నోరుగంటిదుర్బలస్థితి యెఱఁగిన యీవల జనించినదా? తత్పూర్వమునుండియు నున్నదా? పూర్వమునం దుండియుండుటయే నిశ్చయమయ్యెనేని బొమ్మెరలో జనశ్రుతి యున్నదని వ్రాసి దానికి నోరుగంటికి ముడిపెట్ట వ్యర్థముగ నేల శ్రమించిరి? తమ కనుకూలముగ వచ్చునది ప్రమాణము, అదియే ప్రతికూలముగ వచ్చినఁ బ్రమాణముకాదు కాఁబోలు. జనశ్రుతి విషయమునఁ బంతులవారి నిశ్చయమేమో కవిజనాశ్రయపీఠికఁ జదివినఁ దెలియగలదు. అందు వేములవాడ భీమకవి గోదావరిమండలమువాఁడు గాఁడు

గోలకొండదేశము వాఁడని స్థాపించునపుడు తమకుఁ గలప్రమాణముల నిట్లు పంతులవారు పేర్కొనిరి.

"భీమకవి వెలిగంధలవేములవాడగ్రామనివాసి యని యాప్రాంతమందుఁ బ్రతీతి యుండుటంబట్టియు, గ్రంథావతారికలో భీమన తన యిష్టదైవము వేములవాడ భీమేశ్వరుఁడే యని చెప్పుటంబట్టియు, వెలిగందలవేములవాడలో భీమేశ్వరాలయ ముండుటవలనను, నాఁటికిని నేఁటికిని గూడ నాప్రాంతమందు జైనులయినకోమ ట్లుండుటచేతను భీమకవి యాదేశమువాఁడే యని నిర్ణయించుట కాక్షేప ముండఁగూడదని నాయభిప్రాయము." ఈవాక్యములే గోదావరీమండలములోని వేములవాడపక్షపాతు లిట్లు వ్రాయవచ్చును.

"భీమకవి దక్షారామ వేములవాడ గ్రామనివాసి యని యాప్రాంతమందుఁ బ్రతీతియుండుటంబట్టియు, గ్రంథావతారికలో భీమన తనయిష్టదైవము వేములవాడ భీమేశ్వరుఁడే యనిచెప్పెనుగాని వెలిగందలవేములవాడలోని భీమేశ్వరుఁడని నిరూపించి చెప్పకుండుటచేతను వేములవాడ సమీపమున దక్షారామమం దనాదిప్రసిద్ధ భీమేశ్వరాలయ ముండుటచేతను, జైనులయినకోమట్లు పూర్వము దేశమందంతట నున్నట్లే యిచ్చటనునుండి యిప్పుడు నామావశిష్టులైరి గనుకను భీమకవి యీదేశమువాఁడే యని నిర్ణయించుట కాక్షేప ముండఁగూడదని మా యభిప్రాయము" అని వ్రాసిన వారివాదమును బంతులవారెట్లు ఖండింతురో. జైను లాంధ్రదేశమున మఱెందు లేరని పంతులవారు పొరపడిరి. ఆరణియొద్ద ననేకకుటుంబములే గాక జైనగ్రామములే యున్నవని తెలియవచ్చెడిని. ఒకవేళ నిప్పుడు లేకుండిన నింతకు 700 సంవత్సరములకుముందు గోదావరిమండలమున జైనులు లేరనుట యేమిన్యాయము? అది యెట్లయిన పోనీ నాకేల? నాకుఁ గావలసినది జనశ్రుతివిషయమే.

భీమకవివిషయ మైనజనశ్రుతి రెండువేములవాడలలో నున్నది. అట్లుండియు దక్షారామము వేములవాడ జనశ్రుతికంటె వెలిగందలవేములవాడ జనశ్రుతి కేల పంతులవా రెక్కువప్రాశస్త్య మిచ్చిరో నా కూహింప రాకున్నది. ఒంటిమిట్టవారివాదమును బలహీనము చేయవలయునని కేవలజనశ్రుతి ప్రబల ప్రమాణము కాదనువారు దానినే తమకిష్టమైనచోటఁ బ్రథమప్రబలప్రమాణముగ నెట్లు గ్రహించిరో? కేవలజనశ్రుతి నేను గ్రహింపలేదనియు దానికి సహచరముల రెంటిని మూఁటిని గ్రహించితి ననియు బంతులవారందు రేని యొంటిమిట్ట వాదులును గేవలజనశ్రుతిని మీవలె మేము ప్రథమప్రమాణ

ముగఁ గొనలేదనియు మీకు రెండు మూఁడు కారణములుండిన మాకు 6-7 కారణము లున్నవనియుఁ జెప్పుదురు. (ప్రథమభాగము చూడుఁడు). 'గతానుగతికోలోకః' యనుట వేములవాడయందుమాత్ర మన్వయింపదు కాఁబోలు.

పంతులవారి ట్లిప్పుడు వ్రాయుటకుఁ గారణము గలదు. నెల్లుట్లవారు బమ్మెరపోతరాజువంశ్యుఁడని యక్కడి నెల్లుట్లవారు చెప్పిరని పంతులవారు తమ కనుకూలముగ వ్రాసిరి. భీమకవిచరిత్ర మొకవేములవాడలోనిది మఱియొక వేముల వాడవారు వి[illegible] యిది తమయూరిలో జరిగిన దని చెప్పుకొనునట్లు యొంటిమిట్టలో జరగినపోతనచరిత్రము సుప్రసిద్ధమయి జగమునవ్యాపింపఁగా నది తమగ్రామమునందే జరగినదని యాయన తమవంశ్యుఁడని నెల్లుట్లవారు చెప్పుకొనున ట్లేర్పడెను. ఇప్పుడు రావుబహద్దర్ వీరేశలింగముపంతులవారు నెల్లుట్లవారు బమ్మెరపోత రాజువంశమువారు కారని వ్రాసిరి. బంధుత్వ మసత్య మైనపుడు పంతులవారు చెప్పెడు తక్కినకథలు నసత్యములే యయ్యెను. ఆయాధారము పోయినయెడల నోరుగంటివారి వాదమున కాధారము క్రిందమున్నుమీఁదమిన్ను, నడుమ సున్న యయ్యెను. తమవాదమునకువచ్చిన యీ మహావిపత్తు తప్పించుకొన జనశ్రుతియందు మాకు విశ్వాసము తక్కువ యని పంతులవారనిరి. నెల్లుట్లవారిది జనశ్రుతియే కావున దానితో వారివాదము నేలపాలయ్యెను. రావుబహద్దర్ వారివాదమును దాము ఖండించువఱకు నెల్లుట్లవారికి సంబంధించినదియు దాని ననుసరించినవియుఁ దమవాదమున కాధారములుగఁ బంతులవారు చెప్పరాదు. ఒంటిమిట్టవారివాదమునకు వారిరువురు సమానశత్రువులే కావున ముందా సుందోపసుందయుద్ధము కానిండు.

బమ్మెరపోతరాజు బొమ్మెరయందుండె ననుట జనశ్రుతినిబట్టియేకదా. శ్రీనాథపోతనసంభాషణము జనశ్రుతియేకదా. నల్లుట్లవా రట్లుపోయి యివిరెండు నిట్లు పోయినచో నోరుగంటి వాదులకు నొంటిబండ (ఏకశిల) మాత్రము మిగిలినది.

21. భాగవతములోఁ బ్రయోగింపఁబడిన యాంధ్ర శబ్ద విశేషము లుభయ గ్రామములకు సమానము లని వారివాద మఁట. వారివాదము:- నేను బూర్వపక్షము చేయలేదఁట. ఎంతటిదోష మొనర్చితిని! తొలుత నది యాధారముగ లెక్కించినవారు వారే. నేనుగాను. ఉభయులకు సమానమైనది నాకెట్లు హానికరము కాఁగలదు? దానిలో నేను ఖండింపవలసిన దేమున్నది? అదట్లుండనీ.

కొన్నిపదములు 'కోసరము' మొదలైన వీప్రాంతమందు వాడుకలో నున్నవి గోలకొండదేశములో లేవని వ్రాసితిని. దానిని బంతులవారు పూర్వపక్షము చేయకుండుటచే నాశబ్దము లాదేశమున లేవనియంగీకరించినట్లేకదా ఈయంగీకారము వారివాదమును దుర్బలపఱిచెఁగదా.

22. కడపటిదెబ్బ కమ్మని దెబ్బయని పంతులవా రొంటిమిట్టలోని పోతరాజు విగ్రహమును గుఱించి "పాదములయందుఁ బద్మరేఖలును, గాళ్లకుముంజేతులకు, గొలుసులు నున్నవి. భుజకీర్తులును, మెడలోహారములును గలవు. వడగలవైష్ణవులు ధరించునట్టి నిలువుబొట్టు నుదుటనున్నది. పోతరాజు, రామభక్తుఁడైనను, శివపూజాతత్పరుఁడు, వైష్ణవచిహ్నమైన నిలువుబొట్టు పెట్టుకొనియెననుటకు వీలులేదు. గొలుసులు హారము తులసి[illegible]పూసలపేరు లనుకొన్నచో శివపూజచేయుచుఁ బోతరాజు తులసిపేరులు ధరించెననుటయు సమంజసము కాదు. సువర్ణాభరణము లని యూహింపవలసినయెడల నవియుఁ బోతరాజున కనుచితములే. కావున విగ్రహముపోతరాజుది కాదనియే చెప్పవలసియున్నది" అని వ్రాసిరి.

ఆర్యులారా! యిప్పటికి 40? సంవత్సరములకు ముందు మనదేశములో ఛాయాగ్రాహిణీ యంత్రములు లేవు. ఈవిగ్రహములు వానినిబట్టి యథారూపముగ నిర్మింపఁబడినవి కావు. ఇప్పుడు నిర్మింపఁబడుచుండు శిలావిగ్రహము లెవరివని చెప్పెదరో వారిభార్యలు పుత్రులే యావిగ్రహములు తమభర్తలవలెఁ దండ్రివలె లేవని చెప్పుచుండుట పంతులవా రెఱుంగరా? ఇఁకఁ గవి యనంతరము వారిభక్తులు వారికిఁ దోఁచినట్లు వారివారియభిప్రాయములకొలఁది నిర్మించినవానికి వంక లెన్నవచ్చునా? బొమ్మెరయం దుండుబొడ్డురాయి సాక్షాత్పోతరాజవిగ్రహ మని పంతులవా రనఁగలరా? రవివర్మవంటిచిత్రలేఖకుఁడు యోగియగుశివునకు మీసము లుంచి క్షత్రియుఁడై రాజైనరామునకు మీసము లున్నట్టు రామాయణములో నున్నను లక్ష్యపెట్టక చిత్రములకు లేకుండఁ జేసెను. శివునకు మీసము పెరిఁగినపుడు గడ్డ మేలపెరుఁగలేదు? ఇప్పటినాగరకులలోఁ జేరి శివుఁడు ముఖక్షౌరము మాత్రము ప్రతిదినము స్వయముగఁ జేసికొనుచున్నాఁడా? కాదేని యాయన క్షౌరకుని పేరేమి? మీసములు లేకుండుటకు శ్రీరాముఁడు పేడివాఁడా? ఈకారణములచే నవి శివరామ చిత్రములు కావని పంతులవా రనఁగలరా?

భాష్యకార్లపటము నాయొద్ద నున్నది. వారు సన్న్యాసులు కదా? వారి

చేతుల బంగా రాభరణము లున్నవి. అటని శ్రీపెరుంబత్తూర్‌లో నుండు రామానుజ విగ్రహము వారిది కాదని యెవరైన ననఁగలరా? అద్వైతులుగ నుండు ద్రావిడులు తిరుమణిశ్రీచూర్ణములు ధరించినవారిని బంతులవా రెఱుఁగరా? బమ్మెరపోతరాజు రామభక్తులని పంతులవా రంగీకరించిరి. బమ్మెర పోతన సంతతివా రార్వేలనియోగులని రావుబహదర్‌వారు వ్రాసిరి. అమాత్య, రాజు, శబ్దములనుబట్టి వీరివ్రాఁత నిజమేయని నమ్మనచ్చును. రామభక్తులైన యార్వేల నియోగులు తిరుమణి శ్రీచూర్ణములు ధరించుట పంతులవా రెఱుఁగరా? మతమున శైవులుగా నున్నను పోతనపితామహులు మాతామహులు వారికాలము నాఁటికే మనమున వైష్ణవులని తమకుమారునికిఁ గేసన్న (కేసవన్న) యనియు కుమా●కి (లక్కసాని) లక్ష్మియనియుఁ బేరులిడుటచే స్పష్ట మగుచున్నది. ఇంతకు నాయన యేమినామము పెట్టుచుండెనో యెవ్వఁ డెఱుఁగును? ఆయనకు వెనుక 500 సంవత్సరములకు వచ్చిన పంతులవారి యూహ యెంతవఱకు సరియో యేమి యాధారము గలదని నమ్మవలయును? ఇంతకు మీఁద నేనుజెప్పినట్టు జీవత్పురుషు లేదిపెట్టుకొన్నను బెట్టుకొనకున్నను వారి వెనుకటివారు వారిభక్తులు తమతమ మతానుసారముగఁ జిహ్నము లుంచుదురు. నా స్వవిషయ్యమే నన్నెవరెవ రేమిపేర్లఁ బిలుచునది వ్రాసియుంటిని గదా. ఒకమూర్తికే కొందఱు వడగలనామము లుంచినఁ గొందఱు తెంగలనామము లుంచుదురు. మఱి కొందఱు గోపిచందనముంచుదురు. ఇంతయేల విఘ్నేశ్వరుని భాద్రపదశుద్ధ చతుర్థినాఁడు పూజింతురుగదా. ఊర్ధ్వపుండ్రములు పెట్టువా రాయన కూర్ధ్వపుండ్రములు వెట్టుదురు. తిర్యక్పుండ్రములు పెట్టువారు తాము పెట్టుకొనునట్లే పెట్టుదురు. ప్రస్తుతవిషయమున బమ్మెర పోతరాజువిగ్రహము వైష్ణవు లర్చించు విష్ణ్వాలయంబున నున్నది. కావున దాని నక్కడ నుంచినవారు ద్వైతులయినను విశిష్టాద్వైతులయినను నద్వైతులయినను విష్ణుభక్తులనుట నిర్వివాదము. వీరశైవులచ్చట నావిగ్రహము నుంచియుండరు. బ్రతికియుండు కాలమున మహాకవు లాదరింపఁబడుట యరుదు. అందుఁ బోతనవంటిబికారి నెవఁ డాదరించును. ఆయన కవిత్వమహత్త్వము లోకమున వెలసినపిమ్మటనే యాయన చర్యలను గుఱించి విచారించి మహాపురుషుఁ డని యెఱిఁగి యప్పు డట్టిగౌరవము గలిగించి యుందురు. ఆకార్య మెవఁడు చేసెనో వానిముఖమున నుండునామమె యాయన ముఖమునఁ బెట్టెను. బాదతలమునఁ బద్మరేఖలు మహాపురుషలక్షణము తెలుపఁ జెక్కఁబడి

నవి. అర్చకుఁడావిగ్రహము వేదాంతదేశికులది యని తన యభిప్రాయమని చెప్పినమాట సత్యమే. క్రొత్తవాఁడును గంచివాఁడు నగుట యాయన యభిప్రాయ మేమి ప్రమాణము?

ఆయన ప్రత్యేకాభిప్రాయము నమ్మినపంతులవారికి దేశమంతయు నిది పోతరాజుది యని యనుచున్నా రని యాయనయే చెప్పినమాటయం దేల ప్రత్యయబుద్ధి లేదయ్యెను? ఆయర్చకుఁడే సోపానములమీఁద నిలఁబడి మాట్లాడునపు డావిగ్రహము వేదాంతదేశికులది కాదనుటకుఁ గారణములు గలవని చెప్పలేదా? ఆప్రస్తావనను వేఱొకప్రస్తావనచేఁ బంతులవారు మార్చలేదా? నేనది కనిపెట్టలేదని పంతులవా రనుకొనిరి కాఁబోలు. పంతులవా రాయనను జెప్పనీయకున్నఁ బోనిండు. నాకుఁ దోఁచినది నేను జెప్పెదను. పోతరాజుపేదవాఁడు గావున నాభరణధారణ మసంభవ మనికదా పంతులవారి తలంపు. "సాయంప్రాతర్భిక్షాచర్యా" యని బ్రతికిన వేదాంతదేశికు లేనాఁ డట్టిభూషణములు ధరించి యుండెను? వేదాంతదేశికులు బమ్మెర పోతనకంటెను దరిద్రుఁడు. కావున నావిగ్రహము వేదాంతదేశికుల వారి దనుపంతుల వారి యూహయు సరిగాదు. బొమ్మెరలోని బొడ్డురాయి సాక్షాత్పోతరాజువిగ్రహమేని దానివర్ణన మేల పంతులవారు చేయరైరి. ఓరుగంటివాదుల యదృష్టము కొలఁది నొంటిమిట్టవాదులు బొమ్మెరఁ జూచినవారు కారు. రెండుమార్లు నేను బ్రయాణము పెట్టుకొనినను సాగినది కాదు. కావున నచ్చటిబండారము బయటఁ బడకున్నది. విగ్రహముకాని బొడ్డురాయికాని తుదకు గుండ్రాయి కాని యాయన జ్ఞాపకచిహ్నముగ నొకటి యుంచుకొని యున్నారనుట గ్రాహ్యము కాని పోతనకు ముఖాన మీసములు మొలచియుండెనే విగ్రహమునకు మీసములు లేవే యనుట సరిగాదు. కన్నులు కమలము లన్నప్పుడు కన్నులు నూఱుభాగములుగఁ జీలి నడుమ గ్రుడ్డు నిట్టపొడుచుకొని వచ్చినదని యర్థమా? అట్టులే యిందును గుణముమాత్రము గ్రహింప వలయును.

ఓరుగంటివారి బలమును విమర్శించినట్టు లొంటిమిట్టవారి బలము విమర్శించెదను. వారి కన్నియు నూహాబలము లే కదా. ఇఁక నొంటిమిట్టవారికో, ఒంటి మిట్ట యేకశిలానగర మనుట గ్రంథస్థము.

ఒంటిమిట్టయందుఁ బోతరాజుండె ననుట గ్రంథస్థము.

పోతరాజు దున్నుకొనుచున్న భూమి నిర్దేశింపఁబడి యాయనపేరనే నేఁటికిఁ బిలువఁబడుట ప్రత్యక్షము.

పోతరాజు వంశము వారి బంధువు లుండుట ప్రత్యక్షము.

పోతరాజునకుఁ బ్రత్యక్షమైన కోదండ రామమూర్తి యొంటి మిట్టయందుండుట ప్రత్యక్షము.

బమ్మెర యనునింటిపేరు వంశపారంపర్యముగ వచ్చిన దనుట గ్రంథస్థము,

బమ్మెర యనునింటిపేరుగల వారు గోలకొండ దేశమునకంటె భిన్న దేశములందుండుట గ్రంథస్థము. *కావున నోరుగంటివారి వాదమునకంటె నొంటిమిట్టవారి వాదము బలీయ మని చెప్ప నెవరు సందేహింతురు?

23. మహాశయులారా! శ్రీమదేకశైల కోదండరామ కరుణాకటాక్ష వీక్షణ బలంబునన బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారి యాక్షేపముల కన్నిటికిఁ దగిన సమాధానములఁ జెప్పఁగలిగితిని. ఒంటిమిట్టవారి నాక్షేపించుటయందు వారు వాగ్వ్యయము చేయుచున్నారు గాని యోరుగంటికి నామమాత్రము తప్ప మఱి యే యాధారమును వ్రేలు వంచి యెంచలేకున్నారు. గోదావరి వేములవాడ కా దని వెలిగందలవేములవాడను స్థాపింపఁ బంతులవారు గనఁబఱిచిన యాధారముల కంటె నొంటిమిట్టవారి యాధారములు బలీయము లవునో కావో వారే నిశ్చలచిత్తమున నాలోచింపఁ గోరెదను. ఇంత కెక్కువ నేనిప్పుడు చెప్పవలసిన దేమియు లేదు.

అర్యులారా! యీవాదములో బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారు సత్యజిజ్ఞాసువులై దిగిరనుట సత్యము. సవ్యాపసవ్యమథనంబునఁ గాని వెన్న పడదనియే వారు నన్ను వాదములోనికి డింపిరి. వారు నాకు జ్యేష్ఠభ్రాతృతుల్యులు గావున గురువులు. పరశురాముని యనుమతిఁ గొని యాయనతోఁ బోరిన భీష్ముని వలె నేనును యథాశక్తి వారితోఁ బోరి వారుచెప్పినపని నిర్వహించితిని. గెలుపోటములకు వారే యుత్తరవాదులు కావున వానితో నాకుఁ బనిలేదు. నా వాదము గెలిచినఁ గీర్తి వారిదే.

ద్విపద. కర్మమందే యధికారంబు నీకుఁ
గర్మఫలంబులఁ గాదీవుగోర

నన్నట్లు ఫలభాగిని నేనుగాను. నిర్వంచనముగ నాకార్యము సలిపితినని వారును బుధులును సంతసిల్లినఁ జాలును. జంకు గొంకు లేక బొంకులు టకటొంకు లాడు టాటోటుకాండ్రతో వాదించుట రోఁతగాని పంతులవారి వంటివారితో నెన్నాళ్లైన వాదించుట కీర్తికరమే. సంతోషకార్యమే. "యాఞ్చా మోఘా వర మధిగుణే నాధమే లబ్ధకామా" యని కలదుగదా. అయినను నీవిషయమున నింక వృథావాగ్వ్యయముచేయ మనసొప్పకున్నది. చెప్పవలసిన విషయములు చెప్పఁబడినవి. ఇఁక నిదమిత్థ మని నిర్ణయింప మధ్యవర్తులు సమర్థులు. కావున వ్యర్థశ్రమము చాలించి నన్నీవిషయమున మరల రంగమున కీడ్వకుండుటకై బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారిని బ్రణామపూర్వకముగఁ బ్రార్థించుచు నిష్క్రమించుచున్నాఁడను.

వావిలికొలను సుబ్బరావు.

*ఒంటిమిట్ట కోవెలలోఁ బోతనపేర మర్యాదాతాంబూలమెత్తుటయు నర్చన సంకల్పంబున నేకశిలానగరశబ్దంబు చేర్పఁబడుటయుఁ బ్రత్యక్షంబులు.

శ్రీరామాయనమః.

బమ్మెర పోతరాజు నివాసస్థానము.

పోతరాజు నివాసస్థాన మోరుగల్లా, యొంటిమిట్టా యను చర్చ యుపక్రమించినది నేను. ఓరుగంటివాదము పక్షముగా నేను వ్రాసినదానిపై బ్ర॥ వావిలికొలను సుబ్బారావుగారు ప్రత్యుత్తరము వ్రాసి యొంటిమిట్టవాదమును స్థాపింప యత్నించిరి. దానికి నే నొకసమాధానము వ్రాసి ప్రకటించితిని. అంతటితోఁ దృప్తినొందక సుబ్బారావుగా రింకొక ఖండనవ్యాస మిప్పుడు ప్రకటించిరికదా! ఉపక్రమించినవారే యుపసంహరించుట న్యాయము గావున సుబ్బరావుగారి ప్రస్తుతవ్యాసమునకు సంక్షేపముగా సమాధానము వ్రాసి యీచర్చకు శాంతిచెప్పఁ దలఁచినాఁడను. తా మిప్పుడు వ్రాసినది చాలవఱకుఁ జర్వితచర్వణమని సుబ్బరావుగారే చెప్పియున్నారు. అట్టిదానిని దిరిగి ఖండించుట పిష్టపేషణమగును గాన నట్లొనర్పక సుబ్బరావుగారి వాదఫక్కియం దున్న కొన్ని దోషములను మాత్రము సూచించి విరమించెదను.

1. ఓరుగంటికి సమీపమందున్న గ్రామము బొమ్మెర గాని బమ్మెరగాదు. కనుక దానినిబట్టి బమ్మెర యను నింటిపేరు పుట్టనేర దని సుబ్బరావుగారు నొక్కి నొక్కి వక్కాణించుచున్నారు. గ్రామముపేరు బమ్మెరయే యనియు బొమ్మెర యనునది గ్రామ్యోచ్చారణ మనియు నేను దొలుతనే చెప్పియున్నాఁడను. "వొచ్చెను, వొండెను," ఇత్యాదిశబ్దములయం దీవికారము కనఁబడుచున్నది గదా! సర్వజనవిదితమైనయిట్టివిషయములో వారింతభల్లూకపుఁబట్టేలపట్టవలయునో తెలియకున్నది.

"ఇఁక బొమ్మెరయే బమ్మెరయని యోరుగంటివాదులు హఠవాదము చేసిన, బొమ్మనరమే బమ్మెరయని యొంటిమిట్ట వాదులును వాదింతురు. వారి వాదమునకు వారు ప్రమాణము కనఁబఱిచినపుడు వీరివాదమునకు వీరును ప్రమాణము కనఁబఱుతురు." అని సుబ్బరావుగారు వ్రాసినారు. దీనినిబట్టి హఠవాద మెవరిదో పాఠకులు గ్రహింతురు గాక!

బమ్మెర వాదము నిల్లెగురఁగొట్టితి మని సంతోషించియు, నెచటనైనఁ గొంచెము మిగిలిపోవు ననుభయముచేతఁ గాఁబోలు వాస్తవముగా, బమ్మెర యనునది గ్రామనామము కాదనియు భ్రమశబ్దభవ మనియుఁ "బోతరాజు పూర్వులొకచోట నిలుకడలేక నానా దేశములు భ్రమించుచుండినవా రగు

టచే బమ్మెరవార్రై" రనియుఁ బోతరాజు పశుచారోపజీవిగా నుండెనన్న కింప తంతి యీవ్యుత్పత్తిని స్థిరపఱుచుచున్నదనియు సుబ్బరావుగా రొకక్రొత్తవాదమును గల్పించినారు. పోతరాజేకాక యాయన తాతముత్తాలు గూడ "లంబాడీ" జాతివారివలెఁ బసులఁ గాచుచు నూరూరు తిరిగి జీవనము చేయుచుండుటవలన బమ్మెరవారను పేరు వచ్చినదని దీనియర్థము. బమ్మెరవారి వంశచరిత్రము సుబ్బరావుగారి కెట్లు తెలిసినదో! ఈచర్చ పెరిఁగినకొలఁది నిట్టి బమ్మెర (భ్రమణము) లింక నెన్నిపుట్టునో!

2. కృతిపతులగు దేవత లర్చావిగ్రహము లనిసూచనలు లేనప్పుడా దేవత లర్చావిగ్రహములు కావనియేయూహింపవలయునని నావాదము. "ఈయూహ సత్యము కాదనుటకు నెల్లూరు హరిహరనాథ తిక్కనలే సాక్షులు" అని సుబ్బరావుగారి ఖండనము. భారతకృతిపతి యగు హరిహరనాథుఁడు నెల్లూరిలో నుండిన యర్చావిగ్రహ మనుటకుఁ దిక్కన నెల్లూరివాఁడనుటతప్ప వేఱే యాధారము లేదు. నెల్లూరిలో నిప్పు డావిగ్రహము లేదు. పూర్వ మెన్నఁడు నున్నట్లు నాకుఁ దెలిసినంతవఱకు సాక్ష్యమును లేదు. రంగనాయకస్వామి యాలయమునకును, పెన్నకును నడుమ నుండెడిదని యాధునికులు కొందఱందురు. ఆయాలయమును జూచినవా రెవ్వరును లేరు. చూచినవారు వ్రాసి యుంచిన లేఖనములును లేవు. ఇట్టిస్థితిలో భారతకృతిపతి నెల్లూరిలో నుండిన యర్చావిగ్రహమని యేల సిద్ధాంతపఱుపవలయునో తెలియకున్నది. హరిహరాత్మకమగు దైవతమును దిక్కన భావించుకొని యుండఁగూడదా? నాచనసోముని హరిహరనాథుఁడును నెల్లూరు నివాసియే కాఁబోలును. నావాద మసత్యమనుటకు మఱియొక సాక్ష్యముగూడఁ గలదఁట. అది యేదియనః—భానుమతీపరిణయము తిరుపతివేంకటేశ్వరున కంకితమనియు నాపుస్తకమం దెక్కడను దిరుపతిపేరుగాని మఱి యేయూరిపేరుగాని లేదనియు, "అలమేలుమంగా శ్రీవేంకటేశ్వరు లర్చావిగ్రహములు కావని పంతులవా రనఁగలరా" యనియును సుబ్బరావుగారి వాదము. సుబ్బరావుగారు కనిపట్టలేకపోయినారుగాని భానుమతీపరిణయకృతిపతి శేషగిరీశుఁడేయని సుబ్బరావుగా రుదాహరించిన పద్యమందే యున్నది. పద్యము చివర "శ్రీయలమేలుమంగకాంతాళిఁ జరిచి యొప్పునను దాల్చిన వేంకటభర్తఁ గొల్చెదన్" అనియున్నది. వేంకటభర్త యనఁగ వేంకటమున కధిపతి యనియర్థము. వేంకట మనునది తిరుమలక్షేత్రమునకు పేరు. ఆక్షేత్రమున కధిపతిగాన నాదేవునకు వేంకటేశ్వరుఁడు, వేంకటభర్త వేంకటపతి, యిత్యాదినామములు కలిగినవి. ఈక్షేత్రమున కరవములో వేం

డము, తిరువేంగడము ననియు, దేవునికిఁ దిరువేంగళనాథుఁ డనియుఁ బేళ్లు గలవు. మఱియు, నలమేలుమంగ యనుపేరు, అలర్మేలుమంగ (పుష్పము మీఁదియమ్మ) యను ద్రావిడరూపమున కపభ్రంశము. దీనికే యిటీవలఁ బద్మావతియను సంస్కృతరూపమును గల్పించిరి. అలమేలుమంగ యనుపేరు పురాణోక్తము కాదు. వేంకటేశ్వరుని దేవికిఁదప్ప వేఱొకదేవతకుఁ జెల్లదు. ఈ రెండు హేతువులచేతను భానుమతీపరిణయకృతిపతి తిరుపతివేంకటేశ్వరుఁడేయని తేలుచుండ సుబ్బరావుగారు దీనిని దమ వాదమున కాధారము జేసికొనుట వింతగానున్నది.

3. ఒంటిమిట్ట దేవాలయములో సీతారామలక్ష్మణులు ముగ్గురి విగ్రహములు నుండఁగాఁ బోతరాజు సీతావిగ్రహమును బేర్కొనకపోవుటచేత నాకవి వర్ణించినవిగ్రహ మొంటిమిట్ట కోదండరామస్వామివిగ్రహము కాదని యూహింపవలయునని నావాద మనియు, నీవాదము సరియైనది కాదనియు, సుబ్బరావుగారు వ్రాసిరి. పోతరాజుగారి పద్యము చదివినప్పు డాయనవర్ణించిన రామవిగ్రహ మొంటిమిట్ట కోదండరామస్వామి విగ్రహమే యని తోఁపకుండదని సుబ్బరావుగారు వ్రాయుటచే నేనట్లు వ్రాయవలసివచ్చినది. నావాదమునకు బాధకములని సుబ్బరావుగా రుదాహరించిన రెండుపద్దులలో నేదియు వారి కుపకరింపదు. రామదాసును జెఱనుండి విడిపించిన రామలక్ష్మణులు రౌతువేషములతో వచ్చినారు. వారితో నప్పుడు సీతయు వచ్చుట యనుచితముగదా! చంద్రికాపరిణయ కృతిపతి యగు జటప్రోలుమదనగోపాలుని వర్ణించు సీసపద్యములో రుక్మిణీవర్ణనము లేనిలోపము మఱియొక పద్యములో, "శ్రీవాసజటప్రోలీభావుకపత్తనవిహారపటుశీలునకున్" అని చెప్పుటచేఁ దీరినది. భాగవతములో నెక్కడఁ జూచినను, గృతిపతి యొంటిమిట్టదేవుఁ డనుసూచనలు లేవు. ఇతరాధారము లేనపుడు విగ్రహవర్ణమునుబట్టియే యూహింపవలసియున్నపుడు నావర్ణన మన్నివిధముల నొంటిమిట్ట విగ్రహమునకు సరిపోవలయునుగదా! సరిపోనప్పు డాదేవుఁడే యీదేవుఁడని యేలనమ్మవలయును? ఇదియే నావాదము.

4. పోతరాజు గతించిన యనేకశతసంవత్సరముల కీవలఁబుట్టిన పురాణము హయగ్రీవశాస్త్రిగారు పోతరాజు నివాసస్థాన మొంటిమిట్టయని వ్రాసిన వ్రాఁతను మనము ప్రమాణముగా నంగీకరింపవలసిన యావశ్యకత లేదని నేను వ్రాసినదానికి సుబ్బరావుగారు "హయగ్రీవశాస్త్రులవారు పోతరాజునకు 400 సంవత్సరముల కీవలఁ బుట్టుట సత్యము. (ఇది సత్యమో యసత్యమో నాకుఁ దెలియదు) తమకు ముందుండిన "ప్రాచీనపండితులు" వ్రాసిన దాని నాధారము చేసికొని వ్రాసినవారు హయగ్రీవశాస్త్రులవారు. ఎవరో

చెప్పిన పుక్కిటిపురాణముల నమ్మి పగలాకాశ మెగఁజూచి యోరుగంటి పంచాంగము వ్రాయఁ బూనినవారు పంతులవారు. ఈ రెంటిలో నేది యెక్కువ విశ్వసనీయము? ఈవాదము రాకముందు పోతన యోరుగంటివాఁడని యెవ్వఁడైన వ్రాసియుండెనా?" యని యొకచోటను, "వేములవాడ భీమకవికి రామయ్యపంతులవారు సమకాలికులా? పిన్నటఁ గొంచెము కాలము వారా? ఏమి యెఱిఁగి వీరు భీమకవిస్థలమునిర్దేశింప సాహసించిరి. విషయము తమకనుకూలమైనచో శాస్త్రసమ్మతము, ప్రతికూలమైనచో శాస్త్రసమ్మతము కాదు కాఁబోలు" నని మఱియొకచోటను వ్రాసినారు. నావాద మేదియో సుబ్బరావుగారు సరిగా గ్రహింపలేకపోయిరని యీవ్రాఁతయే తెలుపుచున్నది. పోతరాజు నివాసస్థానము విషయమై కాని, యప్రస్తుతమగు వేములవాడ భీమకవి నివాసస్థానము విషయమై కాని నేను వ్రాసినదెల్లఁ బరమప్రమాణముగా గ్రహింపవలసినదని నేను జెప్పలేదు. చెప్పినచో నది యవివేకమగును. ఆ రెండువిషయములంగూర్చియు నాకు లభించిన యుభయపక్షాధారముల సంకలితముచేసి యవి విమర్శించుటవలన నాకుఁ గలిగిన యభిప్రాయముం దెలిపితిని. నా యభిప్రాయము సరియో కాదో నిర్ణయించుకొనుభారము పాఠకులయందే యున్నది. కొందఱ కది సరి యని తోఁపవచ్చును. సుబ్బరావుగారివంటివారి కది సరికాదని తోఁపవచ్చును. ఎవరికయినను నేను గనఁబఱచిన హేతువులే యాధారము గాని నా సిద్ధాంతవాక్య మాధారము కాదు. హయగ్రీవశాస్త్రిగారి విషయమై సుబ్బరావుగారు చెప్పిన దిది కాదు. ఈ చర్చ పుట్టకమునుపే హయగ్రీవశాస్త్రిగారు పోతరాజు నివాసస్థాన మొంటిమిట్ట యని వ్రాసెను గావునఁ బోతరాజు నివాసస్థాన మొంటిమిట్టయే యని నమ్మవలసినది. అనఁగా హయగ్రీవశాస్త్రిగారి వ్రాఁత యాప్తవాక్యముగా గ్రహింపఁబడవలసిన దని సుబ్బరావుగారివాదము. శాస్త్రిగారి మాట యాప్తవాక్యము కానేర దని నాప్రత్యుత్తరము. "భ్రమప్రమాదవిప్రలిప్సాకరణాపాటవరూపదోషచతుష్టయరహితుఁ" డాప్తుఁ డని శాస్త్రమర్యాద అట్టివానిమాటయే ప్రమాణముగా గ్రహింపఁ దగినది. ప్రస్తుతవిషయములో శాస్త్రిగా రాదోషచతుష్టయరహితుఁడని ప్రాజ్ఞుఁ లెవ్వరుఁ జెప్ప సాహసింపరు. "తమకు ముందుండిన ప్రాచీనపండితులు వ్రాసినదాని నాధారము చేసికొని వ్రాసినవారు హయగ్రీవశాస్త్రులవా" రని వ్రాయుటచే నాశాస్త్రులవా రాప్తులు కారని సుబ్బరావుగారే చెప్పక చెప్పుచున్నారు. ఆప్తుఁడు కానివానిమాట ప్రమాణ మెట్లగునో తెలియదు. మఱియుఁ బూర్వులు వ్రాసినదాని ననుసరించియే శాస్త్రిగారు వ్రాసినా రన్నమాట సత్యముకాదు. శాస్త్రులవారి భాగవత

పీఠికలోఁ, బోతరా జేకశిలానగరమందుండె నని యున్నది. అక్కడఁ బుష్పపెట్టి పుటయడుగున నేకశిలానగర మనఁగా నొంటిమిట్ట యని వివరణరూపముగా వ్రాయఁబడియున్నది. ఈవివరణము శాస్త్రిగారి స్వకపోలకల్పితమని వేఱెచెప్ప నక్కఱలేదు. పూర్వగ్రంథాను వాదమే యైనచోఁ బీఠికాగర్భస్థ మయియే యుండును. వాదమున కీవివరణము గూడ ననువాదమే యనికొందము. అట్లయినచో ననువాద మెన్నఁడును స్వతంత్రప్రమాణము కానేరదు. ప్రామాణ్యము మాతృకానిష్ఠముగాని యనువాదనిష్ఠముగాదు. శాస్త్రిగారిపీఠికకు మాతృకయగుగ్రంథము బయలుపడినప్పు డాగ్రంథమునకుఁ బ్రమాణలక్షణము పట్టునో పట్టదో విచారింపవలసి యుండును. ఏరీతినైనను హయగ్రీవ శాస్త్రిగారి వ్రాఁతకుఁ బ్రామాణ్యము సిద్ధింపదు.

5. ఏకశిలానగర మాహాత్మ్యము ప్రమాణముగాఁ గైకొనఁగూడ దని వ్రాయునవసరమున స్కాందపురాణమునకు లోకమునందుఁ గలయపవాదము ననువదించితిని. దానినెత్తికొని పురాణముల నిందించితి ననియు మఱియేవేవో కొన్ని వ్రాఁతలును వ్రాసి కవిజనాశ్రయ పీఠికలో గోలకొండదేశము నందలి వేములవాడ దక్షవాటికయని భవిష్యోత్తరపురాణములో నున్నట్లు నేను వ్రాసినాననియు వేములవాడ దక్షవాటిక యనుమాట పచ్చిదబ్బఱయనియు వ్రాసినది యేకశిలానగర ప్రశంసలో నప్రస్తుతము. అయినను వారియాక్షేపమునకు సమాధానముఁ జెప్పఁదలఁచినాఁడను. వేములవాడ దక్షవాటిక యని భవిష్యోత్తరపురాణములో నున్నదని కాని భవిష్యోత్తరపురాణములో నున్నదంతయు సత్యమేయని విశ్వసింపవలయు నని కాని నేనువ్రాసియుండలేదు. "దాక్షారామ భీమేశ నందనుఁడ ర్క" అను చాటుపద్యములో స్మరింపఁబడిన దాక్షారామ మేది యని విచారించు నవసరమున వేములవాడకుఁగూడ దక్షవాటిక యనుసంజ్ఞ యున్నదని యాప్రాంతమువారు చెప్పుదురనియు దానికి బలముగా భవిష్యోత్తరపురాణములోని వని కొన్నిశ్లోకము లుదాహరింతు రనియు వ్రాసి యాశ్లోకములను జూపినాఁడను. దాక్షారామసంజ్ఞ వేములవాడకున్నట్లు జనశ్రుతి కలదని ఋజువు చేయుటయే నాపనియై యుండెను. కాని యాజనశ్రుతి సత్యమో యసత్యమో నిర్ణయించుట కవసరము కలుగలేదు. నిజముగా వేములవాడ దక్షవాటిక యైనను గాకపోయినను, నగు ననువాడుక యుండినచో భీమకవి యావాడుక ననుసరించి దాక్షారామనామముచే వేములవాడనే పేర్కొనియె నని యూహింపనొప్పునుగాన నట్లు వ్రాసితిని. దీనివలన సుబ్బరావుగారి వాదమున కేమియు లాభము కలుగనేరదు.

6. ఓరుగంటికి మొదటిపేరు ఒరగల్లనియు, గణపతిదేవుఁడు రాతికోట కట్టించుటచే నోరుగల్లనుపేరు కలిగినదనియు నొక యపూర్వవాదము కల్పించి సుబ్బరావుగారు తమప్రథమవ్యాసములో నొకపుటకుఁ బైఁగా గ్రంథముం బెంచినారు. నా రెండవవ్యాసమం దావాదమును సప్రమాణముగా ఖండించినాఁడను. దానికిఁ బ్రత్యుత్తరము చెప్పలేక "ఇది ప్రస్తుతవివాదమునకు సంబంధించినది కాదు. అది యోరుగల్లయినను నొరగల్లయినను మఱి యేకల్లయినను నావాదమునకు రాఁగలలాభనష్టములు లేవు కావున నాచర్చ వ్యర్థము" అని వ్రాయుచున్నారు. వ్యర్థచర్చకుఁ దామేల తొడంగిరో! అందని పండ్లు చేఁదనుట యిట్టిదే కాఁబోలు.

సుబ్బరావుగారి వ్యాసములో నింక ననేకాంశము లున్నవి. వానికన్నింటికిఁ బ్రత్యుత్తరము లిచ్చుటవలనఁ గాలహరణము తప్ప వేఱొండు ప్రయోజనముండదు. కావున మానినాఁడ.

కొట్టెడుపట్టులం దెంత గట్టిగాఁ గొట్టినను జిట్టచివరకు నేనీవాదములో సత్యజిజ్ఞాసువునైయె దిగితి ననుట సత్యమనియు నాతో నెన్నాళ్ళయినను వాదించుట సంతోషకార్యమే యనియు మఱి యింకను గొన్ని ప్రశంసావాక్యములు వ్రాసి "నన్నీ విషయమున మరల రంగమున కీడ్వకుండుటకై బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారిని బ్రణామపూర్వకముగఁ బ్రార్థించుచున్నా"నని సుబ్బరావుగారు వ్రాసిరి. నావాదమును వదలుకొనుమని సుబ్బరావుగారి తాత్పర్యమైన ట్లిందువలనఁ దోఁచుచున్నది. ఈవాదఫల మనుభవించువాఁడను నేను మాత్రమే యైనచో సుబ్బరావుగారంత వారు కోరినందుకు నేనట్లు చేయవలసియే యుండును. కాని, వాదఫలము లోకాధీనమగుటచే వాదము వదలుకొనుటకు నాకధికారము లేదు. నేను సత్యజిజ్ఞాసువునైయే యీవాదములోనికి దిగితి నని యొప్పికొనినందుకు సుబ్బరావుగారికి వందనము లర్పించుచున్నాఁడను. వారును సత్యజిజ్ఞాసువులే యని నేనును దృఢముగా నమ్ముచున్నాఁడను. అభినివేశదార్ఢ్యభేదముచేతనో, యితరకారణములచేతనో మాయిరువుర వాదరీతులయందును గొంతభేదము కనఁబడవచ్చును. కొన్నియెడల నిష్ఠురోక్తులు కూడఁ బ్రయోగింపఁబడి యుండవచ్చును. అట్టిపట్టులందు, "నహినిందా" న్యాయమును బట్టింపవలయు నని నామతము. చిట్టచివరకు నిలుచునది సత్యమే గాని వాదప్రౌఢి గాదు. అట్టులే యగుఁగాక!

ఉభయపక్షముల బలాబలములు లోకమునకు విదితము లయినవి. ఇఁక నీచర్చ పెంచుట యనుచితమని నాయభిప్రాయము.

జయంతి రామయ్య.

శ్రీరామాయనమః.

ఏకశిలానగరద్వయవివాదసంగ్రహము.

ఓరుగంటివారిపక్షమున ముఖ్యవాదులు.	ఒంటిమిట్టవారిపక్షమునఁ బ్రతివాది.
౧. బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతుల వారు బి. ఏ. బి. ఎల్	వావిలికొలను సుబ్బరావు.
౨. రావుబహదర్ బిరుదాంకితులగు మ-రా-రా-శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులవారు.	

ప్రమాణసూచిక.

సంజ్ఞ.	వాదులపక్షమున	ప్రతివాదిపక్షమున
రా. I.	మ-రా-రా-శ్రీ జ॥ రామయ్య పంతులవారి ప్రథమవ్యాసము.	అ. ప్రథమవ్యాసము
రా. I. అ.	పైదానికి జతపఱిచిన యను బంధములు.	ఉ. ద్వితీయవ్యాసము.
రా. II.	డిటో. వారి ద్వితీయవ్యాసము.	మ. తృతీయవ్యాసము.
రా. III.	తృతీయవ్యాసము.	౨. ప్రథమవ్యాసానుబంధములు.
వీ.	మ-రా-రా-శ్రీ వీరేశలింగముపంతుల వారి యాంధ్రకవుల చరిత్రము.*	

బమ్మెర పోతనామాత్యుఁ డొంటిమిట్టవాఁడా యోరుగంటివాఁడా యను సందేహ మిటీవలఁ గొందఱ బాధించుచుండెను. కాని దానిని బరిష్కరించి వ్రాయ నెవ్వరు పూనుకొనకుండిరి. బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులవారా పనికిఁ బూని యొక వ్యాసము వ్రాసి యందుఁ గొన్ని కారణములు వచించి యోరుగంటివాదమే బలీయమని తీర్మానించిరి. భాగవతంబునఁ బోతనామాత్యుఁడు తా నేకశిలానగరంబునఁ దద్గ్రంథము రచించితినని చెప్పుటయు నేకశిలానగరనామ మొంటిమిట్టకును నోరుగంటికిని గూడ నుండుటయు నీ వాదమునకుఁ గారణములు.

---

*వీరభద్రవిజయము చదివినవాఁ డెట్టివాఁడైనను నది భాగవతగ్రంథకర్తృరచిత మని యనఁజాలఁడు. కావునఁ దద్విషయమిందుఁ జేర్పలేదు. ఆ విషయము "ఉ" నందు విపులముగఁ జర్చితము.

బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారు వ్రాసిన కారణములనే మ-రా-శ్రీ వీరేశలింగము పంతులవారు తమ యాంధ్రకవుల చరిత్రమందు సంగ్రహించికొనిరి కాని వారి పేరుమాత్రము చెప్పరైరి. వారు చెప్పినదానికంటె నెక్కువగ వీరు వీరభద్రవిజయము భాగవతకర్తృరచితమని చెప్పిరి. ఆ వాదము 'ఉ' నందు ఖండితము.—

బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారి వ్యాసమునకుఁ బ్రత్యుత్తరముగ నే నొక వ్యాసము వ్రాసి యం దుదాహరింపఁబడిన కారణములచే నొంటిమిట్టవారి వాదమే బలీయమని వచించితిని. దానిమీఁదఁ బంతులవారు రెండు వ్యాసములు వ్రాసిరి. నే నొకటి వ్రాసితిని. సత్యము దేవున కే యెఱుక. మహాజన విశ్వాస మొంటిమిట్టవారి కనుకూలము., అది నిరాధారమని మ-రా-రా-శ్రీ రామయ్యపంతులవారు కొన్నియుక్తులు చెప్పిరి. ఆ యుక్తులు సరిగావనియు నొంటిమిట్టపక్షమునఁ గొన్ని యాధారములు గలవనియు నేను వ్రాసితిని. ఒంటిమిట్టవారి వాదము బలీయమా యోరుగంటివారి వాదము బలీయమా యని తీర్మానించుటకుఁ రా. I; రా. I. అ; అ. ౦ లే పర్యాప్తములు. అటులయ్యు వాదాభినివేశముచే గ్రంథము పెరిఁగెను. దానివలన యుక్తి ప్రతియుక్తులు కొందఱకు దుర్బోధములయ్యెను. కావున నా మిత్రులు వాదసంగ్రహము ప్రచురింపఁ గోరిరి. ఇది నా 'మ' వ్యాసముతోపాటు ముద్రింప యత్నింప నాంధ్రసాహిత్యపరిషత్పత్రికాధికారులు దీనిని బ్రకటింప నొల్లరైరి కావునఁ బ్రత్యేకముగ ముద్రింపవలసివచ్చెను. ఇది పఠించి మధ్యవర్తులు తమ యభిప్రాయము లొసంగ సమర్థులైయుందురు. ఒక్కొక్క యుక్తివిషయమున జరగిన వాదప్రతివాదము లొక్కచోటనే యియ్యఁబడెను. కావున నొక్కొక్కవిషయమై యాలోచించి యే వాదము బలీయమో యా వాదముక్రిందనే తమ యభిప్రాయము వ్రాసి తుదకన్నికలిపి పర్యవసానమున నొంటిమిట్టవారి వాదము బలీయమో యోరుగంటివారి వాదము బలీయమో యేది విశ్వసనీయమో తెలుప మధ్యవర్తులు ప్రార్థితులు. సంగ్రహముసుబోధముగాని పట్టులమూలమునుబఠింప వారిని బ్రార్థించెదను.

ఓరుగంటియందుఁ బోతరాజుండెననుటకు నోరుగంటివాదులు
మూఁడాధారములు చెప్పెదరు. అందు మొదటిది.

(ఇంగ్లీషంకె లోరుగంటివారి వాదమును దెలుపును. తెలుఁగంకె లొంటిమిట్టవారి వాదమును దెలుపును.)

I. ''పోతరాజునింటిపేరు బమ్మెరవారు. ఇది గ్రామనామము. బమ్మెరయను గ్రామమోరుగంటికి మూఁడామడలోనున్నది. దీని నచ్చటిజనులు బొమ్మెర యని పిలుతురు'' రా. I. పుట. 408.

ఈ వాదమున కాధారములు. రా. I. అ. పుటలు. 414-418.

దీనికి నొంటిమిట్టవారి ప్రత్యుత్తరము.

౧. పోతరాజు నింటిపేరు బమ్మెరయగుట సత్యము. ఇంటిపేరులు వృత్త్యాది నానా కారణములచేఁ గలుగును. బమ్మెర యనఁగా భ్రమణము. ఇట్టిది గ్రామనామముగ నుండఁ బొసఁగదు. (మ. పుట. 161) ఇది గ్రామనామమే యని యోరుగంటివాదులు సిద్ధాంతముచేయఁ జాలరైరి.

౨. బమ్మెర యనునది గ్రామనామమని యంగీకరించినను ''బమ్మెర గ్రామమోరుగంటికి మూఁడామడలో నున్న''దనుటతప్పు. బొమ్మెరయను గ్రామమున్నది. బమ్మెరయే బొమ్మెరగా మాఱెననుట కాధారములు చెప్పఁబడలేదు. తమ కాధారములని వారు చెప్పెడు రా. I. అ. పుటలు 414-418 ల యందు నోరుగంటి యొద్దనుండు గ్రామము బొమ్మెరయని యున్నదిగాని బమ్మెరయని లేదు. సమానరూపములు గలిగియు భిన్నములైనవి, కించిద్భేదముగలిగి భిన్నములైనవి కదిరి-కుదిరి; ఏకనాపురము, నేకనాపురము; ఎల్లుట్ల-నెల్లుట్ల; ఇత్యాదు లాంధ్రలోకమునఁ బెక్కులు గ్రామములు కలవు. (చూడుఁడు. ఉ. 396 పుట).

వీనిపై నోరుగంటివారి యాక్షేపములు.

(1) ౧-కి. పోతరాజు నాయన తాతలు లంబాడీతెగలోఁ జేరినవారని యెట్లు తెలియవలయును?

౨-కి. బమ్మెరకు 'బొమ్మెర' యనునది గ్రామ్యోచ్చారణము ''వొచ్చెను వొండెను'' ఇత్యాదిశబ్దములయం దీ వికారము కనఁబడుచున్నది కదా? రా III. 186.

ఒంటిమిట్టవారి యుత్తరము.

౧. బమ్మెర పోతరాజు లంబాడీవాఁడని యొంటిమిట్టవాదులనరు. పితృ-పితామహ-ప్రపితామహాదులు భిన్నగ్రామవాసులగుటయు నొకఁడే తనజీవితకాలములోఁ బెక్కు గ్రామములసంచారము చేయుచుండుటయు సువిదితము. పోతరాజువృత్తికి, బమ్మెరనామమునకు సరిపోవుచున్నది కావున బమ్మెరవారన స్థిరవాసము లేనివారని యర్థము గ్రహింపవలయును గాని యట్టిగ్రామ మున్నదని యేర్పడువఱకు నది గ్రామనామమనఁ బొసఁగదు.

౨. వొచ్చెను, వొండెను వలె బమ్మెర బొమ్మెరయైనదనుట సరిగాదు. అట్లు బకారాదిశబ్దములన్నియు బొకారాదులుగ స్వేచ్ఛగ గణించిన ననర్థకము తప్పదు. 'నిషధేంద్రు(బక్క)బచ్చుకుఁడు' అనుటకు మాఱు 'నిషధేంద్రు బొక్క-బొచ్చుకుఁడు' అనవచ్చునా యేమి? బొమ్మెర యనునది గ్రామ్యోచ్చారణమనుట కేమి యాధారము? ఏనాఁడైన దానికి బమ్మెరయను పేరుండెననుట కాధార

ములుగలవా? అట్టి యాధారము లేనపుడది గ్రామ్యోచ్చారణమే యని యెట్లు సాధింపనగు?

ఓరుగంటి వాదులకు "వొచ్చెను. వొండెను" నను గ్రామ్యపదములు శరణములగుట శోచనీయము. పంతులవా రనుకొన్నట్లు 'వచ్చెను' అనుపదము 'వొచ్చెను' గా లేదు. 'ఒచ్చెను' అని యొకశబ్దము 'వచ్చెను' పర్యాయముగా నున్నదని గ్రామ్యుల యభిప్రాయము. కావుననే వారు 'వాఁడొచ్చెను' అని వ్రాయుదురు. ఈ 'ఒచ్చెను' అనునది 'వొచ్చెను' ఆయెనుగాని వచ్చెను వొచ్చెను గా లేదు. అట్టులే బమ్మెర బొమ్మెర కా లేదు. కించిద్భేదముతోడి రూపసామ్యము గల గ్రామనామములు పెక్కులున్నవి. బండపల్లెనే గ్రామ్యజనులు బొండపల్లె యని యుచ్చరించుచున్నారని యనుకొని బండపల్లె యని వ్రాయుటకుమాఱు బొండపల్లె యని యుత్తరముల పైవిలాసము వ్రాసిన నది బండపల్లెలోని వారికిఁ జేరునా? బండపల్లె కడపమండలమున నున్నది. బొండపల్లె విశాఖపట్టనమండలమున నున్నది. వచ్చెను, వొచ్చెను వాదమిందుఁ జెల్లునా? కావునఁ దగినయాధారములు దొరకువఱకు బమ్మెర బొమ్మెరలు భిన్నగ్రామములనుటే యుక్తియుక్తము

[దీనిపై మధ్యస్థుల యభిప్రాయము.] ఒంటిమిట్ట* / ఓరుగంటి వారిపక్షము బలీయము.

(1) "బమ్మెర-ఏర్చూరు-వెలిగండల యోరుగంటి ప్రాంతదేశములో నుండుటచే నా యింటిపేళ్లుగల వా రాదేశమువారని యూహించుట యసమంజసముగాదు" రా. II. 364. దీని కాధారము. ఊహ.

ఒంటిమిట్టవారి ప్రత్యుత్తరము.

౧. ఏర్చూరు నరసారావుపేట సమీపముననున్నది. వెలిగండల పొదిలి తాలూకాలోనున్నది. వీని నిప్పుడేల్చూరని వెలిగండ్లయని యనుచున్నారు. (వీని కాధారములు అ. 133-134-171-173.) కావున నా రెండుగ్రామములు గోలకొండదేశమందే యున్నవనుట సరిగాదు.

దీనిపై నోరుగంటివారి యాక్షేపము.

(2) "ఏల్చూరు వెలిగండ్ల గ్రామముల కనతిదూరములో నొక బమ్మెరయో బొమ్మెరయో కనఁబడినపుడుగాని సుబ్బరావుగారి యాక్షేపము విమర్శనపాత్రము కాదు" రా. II. పు. 365.

దీనికి నొంటిమిట్టవారి సమాధానము.

౨. బమ్మెర యోరుగంటి ప్రాంతమందున్నదనుట యోరుగంటివాదుల నిరాధారమైన యూహయే కావున నంగీకార్యము కాదు. ప్రమాణరహిత

*ఇంతవఱకు బలాబలములనుబట్టి యెవరివాదము బలీయమో యా పేరుమాత్రమిం దుంచనగు

సందిగ్ధవిషయము లొకపక్షమువారు తమ కాధారముగఁ గొనుట న్యాయ్యవాదసరణిగాదు. కించిద్రూపసామ్యము కలదని బొమ్మెరయే బమ్మెర యని గ్రహించుట చాలఁ బ్రమాదము. (అ. 1. పు. 126 చూడుఁడు.) బమ్మెరకుఁ గించిద్రూపసామ్యముగలది యొంటిమిట్టసమీపమున బొమ్మనరమున్నది. బమ్మెరయే బొమ్మవరమని యోరుగంటివాదులు వలయునేని గ్రహింపవచ్చును.

(3) ఆ యింటిపేర్లుగలవారు గోలకొండదేశమం దుండిరనియె యూహింపవలసియుండును. రా. I. 408 పుట. ఆధారము. ఊహ.

"బమ్మెరపోతరాజు బమ్మెరలోఁ బుట్టినవాఁడు." కం. వీ. పం.

ఆధారము. రావుబహదర్ వారి మిథ్యాకల్పనము.

దీనిపై నొంటిమిట్టవారి యాక్షేపము.

3. ఒక కుటుంబమువా రొక గ్రామములో నివసించుచుండువఱకు గ్రామము పేరు వారి యింటిపేరుగా నుండుట యరుదు. వారా గ్రామమువిడిచి వేఱొక గ్రామమునకుఁ బోయి యచటఁ గుదిరినపుడే వారి స్వగ్రామనామము గృహనామ మగుచుండును. (అ. 1. 23.)

దీని కాధారము-గ్రామనామము గృహనామము గాఁగలవారు తా మెందున్నారో యా గ్రామము లెందున్నవో యోజించుట.

దీనికి నోరుగంటివారి ప్రత్యుత్తరము.

(4) *a.* "ఇంటిపేళ్లుగల యూళ్లలో నివాసముచేయుచున్నవారలఁ బలువురనే నెఱుంగుదును" రా. II. 365.

b. "భాగవతమును రచించుకాలమందుఁ బోతరాజు బమ్మెరలోనే కాఁపురమున్నాఁడని నా వాదము కాదు. తొలుత బమ్మెరలోనుండి భాగవతరచనాకాలమందుఁగాని యంతకుఁ గొంతకాలము పూర్వముగాని యేకశిలానగరమునకు వెళ్లియుండవచ్చును కావుననే తాను బమ్మెరకు సంబంధించినవాఁడనికాని బమ్మెరనుండి వచ్చినవాఁడని కాని సూచించుటకై బమ్మెరయను గృహనామమును బెట్టుకొని యుండును. తిరిగి యవసానదశకు బమ్మెర చేరియుండిన నుండవచ్చును." రా. II. 365. ఆధారము. ఊహ.

దీనిపై నొంటిమిట్టవారి యాక్షేపము.

౪. ఏ. ఎట్టి సందర్భములలో గృహనామము గ్రామనామమేకముగానుండునో అ. 123. (8) (9) పుటలయందు వ్రాయఁబడెను. పంతులవా రెఱిఁగిన పలువురు తద్భిన్నులని పంతులవారు చెప్పలేదు. అందు వ్రాయఁబడిన సందర్భములలో వీరు చేరియుండిన నది నిష్ప్రయోజనము. అట్టివారు కారేని "అట్టివారు పదివేల కొకరైననున్నారా?" యన్నప్రశ్నకు సమాధానమేల యీయలేదు?

పదివేల కొకరున్నారనుకొనినను సామాన్యవిధి బలీయముగాని స్పష్టవిషయంబులఁ దప్ప విశేషవిధి బలీయముగాదు. కావున 1-వ ప్రత్యుత్తరము వ్యర్థము.

౧. భాగవతరచన కాలమున బమ్మెరపోతన తమ గ్రామములోనుండెనని బొమ్మెరవారు చెప్పుచున్నారు. రామయ్యపంతులవా రోరుగంటిలోనుండెనని వాదించుచున్నారు. ఇందెవరివాక్యము విశ్వసనీయము గ్రాహ్యము? పరస్పర విరుద్ధములు నిరాధారములునగు నీ రెండును స్వవాదపోషణార్థము చెప్పఁబడునవి కావున నసత్యములు. అగ్రాహ్యములు.

౨. బమ్మెర పోతరాజు బమ్మెర యనుగృహనామము తాను బెట్టుకొని యుండునను నూహ కేవల మసత్యము. తన తండ్రియింటిపేరు బమ్మెర యని "మానినులీడుగా" రను పద్యమున "బమ్మెర కేసయలక్కసానికిఁ" అని పోతనామాత్యుఁడే వ్రాసెను. కావున నాయన తండ్రిదాతల తరమునందే బమ్మెరయను నింటిపేరు వచ్చినదనుట సత్యము. కావున నోరుగంటివారి యూహ లసత్యములు.

౩. బమ్మెరపోతరాజు బమ్మెరయందుఁ బుట్టెననుట కేవలసాహసము. ఆంధ్రకవుల చరిత్రయందు స్వవాదపోషణార్థము వ్రాయఁబడిన పరశ్శతమిథ్యలలో నిదియొకటి. బమ్మెరయింటిపేరివారెల్ల బమ్మెరయందేపుట్టిరనుట దుర్వాదము.

౪. పోతరాజు తా నేకశిలానగరంబున భాగవతము నిర్మించితినని చెప్పుటచే బొమ్మెరలో భాగవతము రచింపఁబడెననుట యసత్యము.

౫. ఓరుగల్లు మహానగరము కావున భాగవతరచనకై యచటికిఁ బోతన పోయెననుట యసంభావ్యము. పోతరాజుకాలమునఁ గవుల నాదరింప నోరుగంటియందు హిందూరాజు లేఁడు. కావున 'రాజధానికావునఁ బోయె'ననుట సరిగాదు. సొంతసేద్యముచేసి జీవించు పేదవాఁడు తన గ్రామములోని భూములు సేద్యము బ్రదుకుమార్గము వదలి గ్రంథరచనకై మహానగరమునకుఁ బోయెననుట విశ్వాసపాత్రము కాదు. మహానగరమునఁగాని కవిత సాగదా? మహానగరములందు సొంతసేద్యము చేయువారు వసింపసాధ్యపడునా? ఉ. పుట. 397.

౬. వీరభద్ర విజయకర్తయగు పోతరాజునింటిపేరు బమ్మెరవారని యాయన మనుమలు బమ్మెర కేసనమల్లనలు వ్రాసిరి. వీరును వీరిబంధువులును కృష్ణామండలములోని ఆచంట అజ్జరము గ్రామములనుండినవారు. వీరభద్రవిజయకర్తయు నివటూరియందుండెను. ఇవన్నియు గోలకొండదేశములోనివికావు. కావున గ్రామనామ మింటిపేరుగఁగలవా రాగ్రామమందే కలకాలముండిరనుట

యసమంజసము గాదను దుహూహాను నిది కూఁకటివేళ్లతోఁ బీఁకి పాఱవైచుచున్నది.

మధ్యస్థుల యభిప్రాయము, ఒంటిమిట్ట / ఓరుగంటి వారిపక్షము బలీయము.

ఓరుగంటివారి రెండవయాధారము.

(1) పోతరాజు స్నానముచేసిన గంగగోదావరియే కాని భాగీరథికాదు. కావునఁ బోతరాజు గోలకొండదేశమువాఁడు.

దీనికాధారము.

"నా వాదమునకు ముఖ్యాధార మోరుగంటి ప్రాంతదేశమందలి వాడు గాని ప్రయోగములుగావు." రా. II. 366.

దీనిపై నొంటిమిట్టవారి యాక్షేపము.

౧. పామర వాక్యములను బ్రమాణముగఁగొని పురాణముల కర్థము చెప్పరాదు. అట్లు చెప్పిన ననేకానర్థకములు కలుగును. అ. 136, 137. పోతన యెచ్చట నట్లు చెప్పియుండలేదు. గోదావరియుద్దిష్టనదియైనచోఁ గవి దక్షిణగంగయనియే చెప్పియుండును. భాగవతము పఠించినవా రెవ్వరును గంగకు గోదావరియని యర్థము చెప్పియుండలేదు. ఆ యర్థము స్ఫురించుటకుఁ దగిన యాధారములును గ్రంథమున లేవు. గంగయనఁగా గోదావరి యని యర్థముచెప్పుటకుఁ బోతరాజు గోలకొండవాఁడను పూర్వజ్ఞానముండవలయును. అట్టిజ్ఞానము కలిగించు కారణము లేవియుఁ గానరావు. ఇది పూర్వవాదమునాశ్రయము కోరుచున్నది. కావున స్వతంత్రప్రమాణము కాఁజాలదు. పోతరాజు గోలకొండవాఁడను వాదము నిరాధారమైనపుడు దీనికి నిలువఁ గాళ్లులేవు. పోతరాజు గోలకొండవాఁడు గావున గోదావరిని గంగయని వ్రాసెనఁట. గోదావరిని గంగయని వ్రాయుటచే నాయన గోలకొండవాఁడని చెప్పవలయునఁట. ఇందన్యోన్యాశ్రయత్వము కానవచ్చుచున్నది. కావున దుష్టవాదము. ఇంతకు గోలకొండదేశము వారందఱు గోదావరికే గ్రహ్ణణస్నానము నిమిత్తమైపోదురనుట యేమి నిశ్చయము? భాగీరథికేల పోయియుండరాదు? పోయియుండవచ్చునని పంతులవారును నంగీకరించిరి కాని గోదావరి కంటె గంగ దూరముకావునఁ బోయియుండఁడనిరి. గోదావరికి బమ్మెరకు ౧౮౦ మైళ్లు. ఇంతదవ్వు గ్రహణస్నానమునకై యెవ్వఁడు పోవును? కావునఁ బోతరాజు స్నానముచేసిన గంగ భాగీరథియే. దీని కితరాధారములు.

i. "అభ్రంకషశుభ్రసముత్తుంగభంగ" యను విశేషణము గంగయందే సార్థకము. గోదావరియందుఁ గాదు.

ii. 'సజ్జనానుమతంబున గంగకుంజని' యనుటవలన గ్రహణస్నానము మాత్ర ముద్దిష్టము కాదనియుఁ దీర్ఘయాత్ర యుద్దిష్టము, గ్రహణము నిమిత్త,మనియు గ్రాహ్యము.

ఓరుగంటివారి సమాధానము.

(1) గంగయనుశబ్ద మనుప్రాసాలంకారమున కుపయోగించినది. పోతరాజనుప్రాసప్రియుఁడు. లోక వ్యవహారరూఢమును సత్కవిప్రయోగావిరుద్ధమును నగుసంజ్ఞ నాకవిప్రయోగించుట వింతగాదు. రా. II. 368.

ఒంటిమిట్టవారి యాక్షేపము.

౧. 'అభ్రంకషశుభ్ర సముత్తుంగభంగయగు దక్షిణగంగ'యని వ్రాసిన ననుప్రాసాలంకారభంగము కలుగదు. విశేషణ విశేష్యము లవ్యవహితంబులై యుండవలయునని యలంకారగ్రంథములందు నియమింపఁబడలేదు. అట్టి నియతి ఛేకమునకు లాటమునకే. ఇది ఛేకముగాదు లాటముగాదు. కావున సమాధానము సరిగాదు. 'లోకవ్యవహారరూఢ'మనుటయుఁ దప్పు. రాజమహేంద్రనరభద్రాచల హైదరాబాదులం దీసంజ్ఞ గోదావరికి లేదు. కావున లోకవ్యవహారవాదము నిలువదు. కావున నట్లుచెప్పిన సందిగ్ధనేయార్థ దోషములకుఁ గవి పాలుపడుననిన యాక్షేపమునకు సమాధానము చెప్పఁబడలేదు. దోషయుక్తపువ్రాఁతలు పోతరాజు వ్రాసియుండఁడుగావున గంగయనఁగా గోదావరియని యర్థముకల్పించి యతనిని దోషినిజేయుట తగదు.

౨. రూఢమనుటయు సరిగాదు. రూఢపదము పంకజశబ్దమువలె సర్వజనాంగీకృతమై యుండవలయును. గంగయనఁగా గోదావరియనుట యిదివఱ కెవ్వరు విన్నది కన్నది గాదు. అల్పప్రదేశమాత్ర వ్యవహృతము రూఢము కానేరదు. సత్కవిప్రయోగా విరుద్ధమనుటయు సరిగాదు. "నాకుఁ బ్రయోగము లాధారములు కా"వని నుడివియు మరల వానిసాహాయ్య మపేక్షించు టెట్లు? సత్కవు లెవ్వరిట్లు ప్రయోగించి యుండలేదని అ. 138-139. పుటలయందు వివరించి యుండఁగా వెట్టికి 'సత్కవిప్రయోగా విరుద్ధ'మనుట సరిగాదు. అట్టి ప్రయోగములున్న నేల యనువదింపలేదు? తక్కిన ౧. i. ii. యాక్షేపములకు సమాధానములేదు. గోలకొండ దేశకవులెవ్వరును గోదావరిని కేవల గంగయని వ్రాయలేదు. కావునఁ బోతన చెప్పిన గంగ గోదావరి కాఁజాలదు.

మధ్యవర్తుల యభిప్రాయము. $\frac{\text{ఒంటిమిట్ట}}{\text{ఓరుగంటి}}$వారిపక్షము బలీయము.

ఓరుగంటివాదుల మూఁడవయాధారము.

(1) ఏకశిలానగరమను పేరోరుగంటికి సుప్రసిద్ధము. ఏకశిలానగరమను నది యోరుగల్లునకు సరియైన సంస్కృతపదము. ఏకశిలానగరమందుఁ దాను భాగవతమును రచించితినని పోతన చెప్పియున్నాఁడు.

ఒంటిమిట్టవారి యాక్షేపము.

౧. ఓరుగంటికి నేకశిలానగరనామముండుట యంగీకరించితిమి. ఓరుగల్లనుటకు నది సరియగు సంస్కృతనామమనియు నంగీకరించితిమి. కాని యేకశిలానగరములు మూఁడుండుటచే నితరకారణములు లేనపు డోరుగంటియందే భాగవతము రచింపఁబడెననుట యుక్తియుక్తముకాదు. పోతన సుప్రసిద్ధైకశిలానగరవాసియేయై యుండినచోఁ బ్రతాప రుద్రపాలితైక శిలానగరమనియే ప్రతిష్ఠాకరముగఁ జెప్పికొని యుండును. అటు చెప్పలేదు. కావున నేకశిలానగరమన నోరుగల్లేయని సిద్ధాంతముచేయ వలనుపడదు. భువనగిరి యందమా యనిన నచటివారు పోతన తమవాఁడని చెప్పుకొనలేదు. ఓరుగంటిలోఁ బోతన యున్నట్టు జనశ్రుతిగాని యితరాధారములుగాని యేవియులేవు. కావున నేకశిలానగరమన నొంటిమిట్టయనియే చెప్పవలయును.

ఓరుగంటివారి సమాధానము.

(2) ఓరుగంటిలో నాధారములులేకున్నను బొమ్మెరలో జనశ్రుతియున్నది. పోతనవంశమువారు నెల్లుట్లవారున్నారు.

దీనిపై నొంటిమిట్టవారి యాక్షేపము.

౨. నెల్లుట్లవారు బమ్మెరవంశమువారు కారని యోరుగంటివాదులలోనే భిన్నాభిప్రాయము గలదు. ఆ వంశమువారమని వారు చెప్పుకొనుచే కాని యాయన వంశమో యాయన జ్ఞాతులవంశమో వీరభద్ర విజయకర్త వంశమో యెట్లు నిర్ధారించుటకుఁ బ్రమాణములను వారు కనఁబఱిచి యుండలేదు. బమ్మెరయను నింటిపేరుగల కుటుంబములు రెండున్నవి. పోతనామాత్యు లిరువురున్నారు. కావున నిది నమ్మఁదగినదికాదు.

బొమ్మెరలోని జనశ్రుతి యోరుగంటివారి కనుకూలముగ లేదు. ఓరుగంటిలోఁ బోతనయున్నట్టు లోరుగంటివారును జెప్పలేదు.

ఓరుగంటివారి సమాధానము.

(3) "ఓరుగంటివారి వాదము బమ్మెరవారివాదము నొక్కటే. భాగవతము రచించిన కాలముననో యంతకుఁ గొంచెముముందుగనో పోతరాజు బమ్మెర నుండి యోరుగంటికి వచ్చియుండును. రా. II. 374 పుట.

ఒంటిమిట్టవారి యాక్షేపము.

3. i. బొమ్మెరయం దుండఁగనే పోతనపూర్వులు బమ్మెరవారయినట్టు బొమ్మెరజనులు చెప్పుచున్నారు. ఓరుగంటికి వచ్చినతరువాతఁ బోతన తా నా పేరుపెట్టుకొనెనని యోరుగంటివాదులు చెప్పుచున్నారు.

ii. భాగవతము బొమ్మెరలో రచింపఁబడినదని బొమ్మెరవారు చెప్పుచున్నారు. ఓరుగంటి యందని యోరుగంటివాదులనుచున్నారు.

కావునఁ బరస్పర విరుద్ధములైన యీ రెండువాదము లొకటియని యనరాదు. పోతరాజోరుగంటికిఁ బోయి యక్కడఁ దనయింటిపేరు మార్చుకొనెననువాదము ముందే ఖండింపఁబడినది.

మధ్యవర్తుల యభిప్రాయము.* ఒంటిమిట్ట/ఓరుగంటి వారిపక్షము బలీయము.

ఇఁక నోరుగంటివాదు లొంటిమిట్టవారిపైఁ జేసెడు నాక్షేపములు.

(1) "కోదండరాముఁ డొంటిమిట్టలో మాత్రమే వెలసియుండలేదు. అనేక గ్రామములలోఁ గోదండరామస్వామి యాలయమ్ములుగలవు. కావునఁ గోదండరామస్వామి యున్నంతమాత్రమున నొంటిమిట్ట కోదండరామస్వామియే పోతనకుఁ బ్రత్యక్షమయ్యె నని సిద్ధాంతముచేయుట న్యాయ్యముకాదు.

ఒంటిమిట్టవారి సమాధానము.

౧. కోదండరామస్వామి యాలయము లనేకగ్రామములలో నుండుట సత్యము. అయినను వివాదగ్రామములు మూఁటిలో నొంటిమిట్టయందు మాత్రమే కోదండరామాలయమున్నది. కావున సంబంధముండుదానిని వదలి సంబంధములేనిదానిని గ్రహించుట న్యాయ్యముగాదు. కావునఁ బోతనకుఁ బ్రత్యక్షమైనమూర్తి యొంటిమిట్ట కోదండరాముఁడేయనుట న్యాయ్యము.

ఓరుగంటివారి యాక్షేపము.

(2) కావ్యముల నర్చావిగ్రహముల కంకితమొనర్చిన కవులు సర్వసాధారణముగా నా విగ్రహములు ప్రతిష్ఠింపఁబడిన క్షేత్రముల నొకచోటఁ గాకపోయిన మఱియొకచోటనయినను దమగ్రంథములందు సూచించియున్నారు. అట్లు సూచింపనియెడలఁ గృతిపతు లర్చావిగ్రహములు కావనియే యూహింపవలయును. భాగవతమందట్టి సూచనలు లేవు కావున నీకృతిపతి యర్చావిగ్రహము కాదు." రా. II. 367.

ఒంటిమిట్టవారి సమాధానము.

౨. i. ఈ యూహ సరిగాదు. తిక్కన హరిహరనాథునిపేరు చెప్పెనుగాని నెల్లూరిపేరుగాని మఱి యేయూరిపేరుగాని చెప్పలేదు. ఆమాత్రమున హరిహరనాథుఁ డర్చావతారము కాకపోవునా?

ii. భానుమతిపరిణయ గ్రంథకర్త

*ఇంతటితో నోరుగంటియందుఁ బోతన యుండెనని స్థాపించు నాధారములు ముగిసినవి. ఆ వాసమం దెంత బలముగలదో మధ్యవర్తు లాలోచింపవలయును.

ఉ. శ్రీలఁ జెలంగు సత్త్వగుణశీలత నిర్మలమూర్తినయ్యు మై
నీలరుచుల్ వహించితివి నీమదిలోపలి నీలకాంతు లీ
లీలఁ బ్రకాశమయ్యెను భళీయను శ్రీయలిమేలుమంగ కాం
తాళ మరీచి యొమ్మునను దాల్చిన వేంకటభర్తఁ గొల్చెదన్.

అని కృత్యాదియందు వేంకటేశ్వరులఁ బేర్కొనియెను. ఆపుస్తకమం దెందును దాను జెప్పిన వేంకటేశ్వరు లేయూరివాఁడో చెప్పలేదు. ఆమాత్రమున నలిమేలుమంగా వేంకటేశ్వరు లర్చావిగ్రహములు కాకపోదురా? మ॥ 169-170.

దీనిపై నోరుగంటివారి యాక్షేపము.

(2) హరిహరనాథుఁడు నెల్లూరివాఁడనుటకు జనశ్రుతితప్ప వేఱాధారములు లేవు. "ఇట్టి స్థితిలో భారతకృతిపతి నెల్లూరిలోనుండిన యర్చావిగ్రహమని యేల సిద్ధాంతముచేయవలయునో తెలియకున్నది. హరిహరాత్మకమగు దైవతమును దిక్కన భావించికొని యుండఁగూడదా?"

"సుబ్బరావుగారు కనిపట్టలేక పోయినారుగాని భానుమతీపరిణయ కృతిపతి శేషగిరీశుఁడే యని సుబ్బరావుగా రుదాహరించిన పద్యమందే యున్నది. వేంకటభర్తయనఁగా వేంకటమునకు నధిపతియని యర్థము. వేంకటమనునది తిరుమలక్షేత్రమునకుఁ బేరు. ఆ క్షేత్రమున కధిపతికావున నా దేవునకు వేంకటేశ్వరుఁడు వేంకటభర్త వేంకటపతి యిత్యాదినామములు కలిగినవి. అలమేలుమంగయనుపేరు పురాణోక్తముకాదు. వేంకటేశ్వరుని దేవికిఁదప్ప వేఱొక దేవతకుఁ జెల్లదు. ఈ రెండు హేతువులచేతను భానుమతీపరిణయ కృతిపతి తిరుపతి వేంకటేశ్వరుఁడే యని తేలుచుండ సుబ్బరావుగారు దీనిని దమ వాదమున కాధారముచేసికొనుట వింతగానున్నది." రా. III. 188-189.

ఒంటిమిట్టవారి సమాధానము.

౨. ఏ. గ్రంథములందు గ్రామనామములు చెప్పఁబడనియెడల నా గ్రంథములయందుఁ బేర్కొనఁబడిన దేవత లర్చావిగ్రహములు కావని రామయ్యపంతులవారు మొదట నాక్షేపించిరి. భారతమునందు నెల్లూరిపేరు లేదు. హరిహరనాథుని పేరుమాత్రమున్నది. అయినను హరిహరనాథుఁ డర్చావిగ్రహము కాఁడా? యని నేను సమాధానముఁ జెప్పితిని. హరిహరాత్మకమగు దైవమును భావించెనని పంతులవారనిరి. అనఁగా నర్చావిగ్రహము కాదని వారభిప్రాయము కదా. అటయినచో నది పొరపాటు. శిల్పశాస్త్రమున హరిహరనాథ విగ్రహముండవలసిన విధములోనైనవి పేర్కొనఁబడినవి. సుప్రసిద్ధహరిహరాలయము హరహరక్షేత్రమందు నేఁటికిని గానవచ్చుచున్నది. గోలకొండ

దేశముననున్నట్టు పంతులవారు జతపఱిచిన రా. 1. అ. యందునున్నది. కావున హరిహరనాథుఁ డర్చ్యవిగ్రహము కాఁడనుట తప్పు. పంతులవారి యాక్షేపము మూర్తివిషయము గాని స్థలవిషయము గాదు. ఒకపేరుగల దేవత యర్చావిగ్రహమూర్తి యగునా కాదా యను వాదమున నూరిపేరెత్తుట యప్రస్తుతము. అర్చావతారము కాదని పంతులవా రాక్షేపింప నర్చావతారమే యని నా సిద్ధాంతము. తదనంతరము స్థలవిషయవిచారము. తిక్కనయుండు నెల్లూరిలో నట్టిమూర్తికిఁ గోవెలయుండి నట్టు జనశ్రుతిగలదు కావునఁ దిక్కన హరిహరనాథుఁడు నెల్లూరివాఁడనిచెప్పుదురు. ఒంటిమిట్టవిషయములోఁ గోదండరామమూర్తి ప్రత్యక్షముగా నున్నాఁడు. కావున నట్టి యూహలతోను బనిలేదు. కావునఁ దిక్కనకు గోచరించిన హరిహరనాథునివలెఁ బోతనకు గోచరించిన కోదండ రామమూర్తి యర్చావిగ్రహమనియు నట్టి విగ్రహమాకవి యుండు నూరనేయుండుటచే నా విగ్రహమే యా కవికి గోచరించెననుట న్యాయ్యమనియు నొంటిమిట్టవారి యభిప్రాయము.

ఇఁక వేంకటభర్తవిషయము సమాధానము.

వేంకటమనునది తిరుమలక్షేత్రమునకుఁ బేరనియు నా క్షేత్రమున కధిపతిగావున నా దేవునకు వేంకటేశ్వరుఁడు వేంకటభర్త వేంకటపతి యిత్యాది నామములు కలిగినవనియు వేంకటభర్త యని భానుమతీపరిణయమం దుండుటచేఁ దిరుమలక్షేత్రమే చెప్పఁబడియెననియుఁ బంతులవారు చెప్పిరికదా

వేంకటేశ్వరాలయ మొకతిరుమలయందు మాత్రమే కలదా? కడపరాయదుర్గము లోనగు ననేకక్షేత్రముల వేంకటేశ్వరాలయములు లేవా? ఆ పద్యము కడపలోనుండు నలిమేలుమంగా వేంకటేశ్వర పర్యాయముగ నేల యన్వయింపరాదు? అని మున్నే నేఁజేసిన యీ యాక్షేపములకుఁ బంతులవారు సమాధానము చెప్పలేదు. కావున నే దేశమున నేకవి వేంకటేశ్వర శబ్దము పేరుకొనినను దక్షేత్రమునవుండు విగ్రహము గాదనియుఁ దిరుమలయందుండు దేవునినే పేరుకొనెననియుఁ జెప్పుట సరిగాదు.

భానుమతీ పరిణయములోని 'వేంకటభర్త' యే యూరివాఁడో కవి చెప్పకపోవుటచే నే యూరియందుండు వేంకటేశ్వరులకైన నన్వయింపవచ్చును. పంతులవారు దీనిని నిరాకరింపఁజాలరు. అయినను వేంకట(గిరి) భర్త కాకృతి యియ్యఁబడుటచే, నా పురము తిరుమలయని తలంచుట న్యాయ్యము. ఇట్టులే భాగవతములోని కోదండరామమూర్తి యేయూరి మూర్తియైనఁ గావచ్చును గాని యేకశిలానగరము గ్రంథమునఁ జెప్పఁబడుటచే నా నగరమందలి మూర్తియని గ్రహించుట న్యాయ్యము. అన్యైకశిలానగరంబుల రామాఁ

యములు లేకుండుటచే నొంటిమిట్టలోని రామమూర్తికే యన్వ
న్యాయబుద్ధు లామోదింతురు.

ఓరుగంటివారియాక్షేపము.

(3) ఒంటిమిట్టదేవాలయములో రామవిగ్రహమున కొక విగ్రహమును రెండవప్రక్క లక్ష్మణవిగ్రహమునున్నవి. పోతన్న హమువూట తలపెట్టలేదు. కావున నాతఁడు తనకుఁ బ్రత్య దర్శించినపు డొంటిమిట్టదేవాలయములోని విగ్రహమాత్రని నియే చెప్పవలసియున్నది.

ఒంటిమిట్టవారిసమాధానము.

3. దేవాలయములోనుండు మూర్తులన్నియు భక్తు రింపవలయునని నియతిలేదు. ఎందఱు గోచరింపవలయునని కల్పమో యది యాయనకే తెలియును. భద్రాచలమున సీతారామలక్ష్మణ విగ్రహములున్నను దానీపాకు నిరువురె గ ప్రోలిదేశమందు రుక్మిణీకృష్ణులున్నను గృష్ణుఁడుమాత్రమే నట్టు చంద్రికాపరిణయకర్త వ్రాసెను. ఆమాత్రమునఁ కృష్ణుఁడు జటప్రోలి కృష్ణుఁడుగాఁడా?

ఓరుగంటివారియాక్షేపము.

(4) రామదాసుని జెఱనుండి విడిపించిన రామలక్ష్మణులతో వచ్చినవారు. వారితో నప్పుడు సీతయువచ్చుట చంద్రికాపరిణయకృతిపతి యగు జటప్రోలు మదనగోపాలు ములో రుక్మిణీవర్ణనము లేని లోపము మఱియొకపద్యములో సా భావుకపత్తన విహారపటుశీలునకుఁ" అని చెప్పుటచేఁ దీరి

ఒంటిమిట్టవారి సమాధానము.

4. భిల్లుఁడై శంకరుండు పార్థునకు గోచరించినప్పు వెంట నంటినట్లు సీతాదేవి రూపాయలసంచులు మోసి వలెనో కారాగృహము కనప్రాడ్డు దానివలెనో మఱి ర గూడదను నియతికలదా? రామదాసుఁడు కడపట ధ్యాని సంకల్పముండిన నెన్ని వేషములు వారు వేయలేరు?

జటప్రోలి మదనగోపాలమూర్తి విషయమైన ప్రత్యుత్తర దంతభగ్నమన్నట్టున్నది. కవికి భగవంతుఁడు ప్రత్యక్షమైన వర్ణించినపద్యములలో రుక్మిణీదేవిని జెప్పనిలోపమఁట వప్పుఁ ప్రోలుపేరు చెప్పుటచేఁ దీరినదఁట. వెనుక జటప్రోలుపేర రుక్మిణి కృష్ణునితోఁడఁ బ్రత్యక్షమైనట్లు లర్థము కాఁబోలు. రుక్మిణి పేరుగలదా?

వర్తుల యభిప్రాయము. ఒంటిమిట్ట / ఓరుగంటి వారిపక్షము బలీయము.

ఓరుగంటివారి రెండవ యాక్షేపము.

భాగవత నిర్మాణ మేకశిలానగరమం దయినది. ఏకశిలానగర మను
గంటికిఁ జెల్లినట్లు లొంటిమిట్టకుఁ జెల్లదు. రా. II. 367.

ఒంటిమిట్టవారి సమాధానము.

లకు వేఱు వేఱు కారణములచే వేఱు వేఱు నామములు
59-169

ంటిమిట్టగ్రామమునడుమ దేవాలయసమీపమున నొంటిగుట్ట
బట్టి యేకశిలానగరమనుపేరు సార్థకము. ఓరుగంటికి నేకశిలా
నెట్టి సంబంధముకలదో యట్టి సంబంధమే యొంటిమిట్టకు నేక
ునకుఁ గలదు. శిలాశైలశబ్దములు పర్యాయపదములు. ఇది
సలు నిరాకరింపని వ్యుత్పత్తి.

గరమనుపేరు రామతీర్థముపైఁ గప్పిన యొంటిరాతినిబట్టి పుట్టి
70 ఇదియోరుగంటివాదు లంగీకరించినవ్యుత్పత్తి.

ముసందలి సీతారామలక్ష్మణ విగ్రహము లేకశిలానిర్మితములు.
వాదులుచేసిన యాక్షేపమునకుఁ బ్రమాదము కారణము
ొంటికినడుమ గజముదూర మున్నదనుట యత్యుక్తి.
ప్రాచుర్యార్థమందుఁ బ్రయోగింపఁబడిన దనుకొన్నను నొం
ర్థకము. ఈవ్యుత్పత్తిని నోరుగంటివాదులు నిరాకరింపలేదు.

ఓరుగంటివాదుల యాక్షేపము.

లానగర మనుపేరోరుగంటికే ప్రాచీనగ్రంథములందుఁ గనఁ
ంటిమిట్టకాపేరు పూర్వకవులు ప్రయోగించియుండలేదు.

ఒంటిమిట్టవారి సమాధానము.

కశిలానగర మన నొంటిమిట్టయని యాంధ్రభాగవతపీఠిక
హయగ్రీవశాస్త్రులవారు వ్రాసిరి.
of administration లోఁగలదు.

నగర మాహాత్మ్యమను గ్రంథముననుగలదు. ఇది స్కాంద
నికిఁ దెలుఁగు.

నిమీఁద నోరుగంటివారి యాక్షేపము.

ము హయగ్రీవశాస్త్రులవారు పోతన సమకాలికుఁడుగాఁడు.
లమువాఁడును గాఁడు. కావున సత్యమెట్లెఁగియుండఁడు.

ii. ఆయనవ్రాఁత కాధారమేదియో చెప్పలేదు.

iii. కడపలోఁ గొన్నాళ్లుండెను గనుక నక్కడ వినియుండవచ్చును.

iv. స్కాందపురాణమునఁ బెక్కులు కల్లలుకలవు గావున దానినుండి తెనిఁగింపఁబడిన యేకశిలానగర మాహాత్మ్యము విశ్వాసపాత్రముగాదు.

ఒంటిమిట్టవారి సమాధానములు.

౨. i. ఇప్పుడాంధ్రకవుల చరిత్రములు వ్రాయువారును, వేఱువేఱుగ భీమకవీత్యాదికవుల చరిత్రములు వ్రాయువారును, నాయాకవుల సమకాలికులుగారు. కొంచెముతరువాతి వారునుగారు. ఈ చరిత్రకారులే యోరుగంటివాదులు కావునఁ దామువ్రాసిన కవులచరిత్రములు దబ్బఱలని వా రంగీకరించెదరేని యొంటిమిట్టవాదులును హయగ్రీవశాస్త్రులవారి వాక్యము లాధారములుగ నుదాహరింపకుందురు.

ii. హయగ్రీవశాస్త్రులవారు ప్రాచీనపండిత లిఖితగ్రంథమును నాధారముచేసికొని లిఖించిరిగాని యిప్పటిచరిత్రకారులవలె స్వకపోల కల్పనలచేతను దురూహాపోహములచేతను స్వసృష్టప్రమాణములచేతను స్వోక్తివ్యాఘాతములచేతను స్వప్రతిష్ఠకై పుటలు నింపలేదు.

iii. హయగ్రీవశాస్త్రులవారు కడపలోనుండిరనుట కల్పితము: రాధారము. ఇది సత్యమేయనుకొనినను దానివలనఁ జిరకాలకింవదంతి కలదు దమకు లభించిన లిఖితగ్రంథమునందలి విషయములను స్థలజ్ఞులచే వా పృథపఱుచుకొనియే పిమ్మట వ్రాసిరనియు నేర్పడుచున్నదికాని స్థలజ్ఞానము యజ్ఞానము విమర్శనశక్తిలేక తోఁచినట్లెల్ల వ్రాసిరని యేర్పడదు.

iv. స్కాందపురాణ మసత్యగ్రంథమేమో లోకమే పరిష్క పవలయును. అది యెట్లైనను నీ వాదముచేయువారు పుట్టకముందే పుట్టిన థమగుటచే నానాఁటికే యొంటిమిట్ట కాసంస్కృత నామమున్నట్లు గ్రహిం తప్పదు.

దీనిపై నోరుగంటివారి యాక్షేపము.

(3) i. "హయగ్రీవశాస్త్రిగారి వ్రాఁత యాప్తవాక్యముగా గ్రహింపవలసినదని సుబ్బరావుగారివాదము. భ్రమప్రమాద విప్రలిప్సాకరణా పాటవరూప దోష చతుష్టయ రహితుఁడాప్తుఁడు. హయగ్రీవశాస్త్రిగారట్టివారని ప్రాజ్ఞులెవ్వరుఁ జెప్ప సాహసింపరు. ఆప్తుఁడు కానివానిమాట ప్రమాణమెట్లగు, తెలియదు."

ii. శాస్త్రులవారి భాగవతపీఠికలోఁ బోతరాజేక శిలానగ నుందుండెనని యున్నది. అక్కడఁ బువ్వుపెట్టి పుటయడుగున నేకశిలానగ సనఁగా నొం

ని వివరణరూపముగా వ్రాయఁబడియున్నది. ఈ వివరణము శాస్త్రిగారి
కల్పితమని వేఱె చెప్పనక్కఱలేదు.
వాదమున కీవివరణముగూడ ననువాదమే యనుకొందము. అట్లయిన
వాదమెన్నఁడును స్వతంత్రప్రమాణము కానేరదు. ప్రామాణ్యము
నిష్ఠముగాని యనువాదనిష్ఠము కాదు.

దీనికి నొంటిమిట్టవారి సమాధానము.

యగ్రీవశాస్త్రుల వారాప్తులనికాని వారివాక్య మాప్తవాక్యమని కాని
కరణము చేయలేదు. నామకరణము చేసిన వారును దూషించినవారును
రే. ఇది తనబిడ్డకత్తపేరుపెట్టి చావఁగొట్టిన కోడలిని స్మరింపఁజేసెడి.
మ నేకశిలానగరమని మున్నెవ్వరైన వ్రాసిరాయని పంతుల వారడుగ
రున్నారని నేను జెప్పితిని. ఇష్టమువచ్చినవారు విశ్వసింపవచ్చును. తమ
నది హానికరమై తోఁచినయెడలఁ బంతులవారి వంటివారు విశ్వ
వచ్చును. ఆప్తుఁడు భగవంతుఁడొక్కఁడే. వేదములే యాప్తవాక్య
వెనుక నించుమించు తత్తుల్యుఁడని యెంచఁబడు మహర్షు లాప్తులు.
లాప్తవాక్యములు. ఆయామతములవారు తత్తన్మతాచార్యులను
నెంతురు దీనికిఁ గేవలాభిమానము కారణము. ఆ వెనుక
వక్తలని లోకులు భావింతురో వారువారిని నాప్తులుగ భావింతురు.
స్త్రులు దేవుఁడుగాఁడు మహర్షిగాఁడు. అస్మన్మతాచార్యుఁడుగాఁడు.
గొప్ప సాహాయ్యము చేసినాఁడను గౌరవబుద్ధి తప్ప నంతకెక్కువ
గాయనయందు నాకుండఁ గారణము లేదు. అట్టిచో నే నాయ
చెప్పుదునా? ఆయన మనుష్యమాత్రుఁడే కావున సర్వావస్థల
మరహితుఁడు కాఁడని నేను జెప్పఁజాలను గాని యీ విషయ
యం దట్టి దోషములు కానరావు. పూర్వులు వ్రాసినదానిని
మన్నానని నిజము స్పష్టముగఁ జెప్పుటచే నాయనయందు భ్రమ
లేవు. వారు పుదూరు ద్రావిడులగుటచే నొంటిమిట్టకొక ప్రతిష్ఠ
పకొక గౌరవముకలుగునను భావమున్నదని చెప్పఁ గారణము
నొంటిమిట్ట యోరుగల్లు సమానములు. ఒకదానికిఁ బ్రతిష్ఠ
కి వచ్చు లాభము గానరాదు. నూతనసృష్టి ప్రతిష్ఠ వారు కోరిన
కావున వారియందు విప్రలిప్సయు లేదు. విప్రలిప్సయనఁగా
కాలమున నీ వాదమైననుండిన నొక పక్షముపూని వ్రాసెనన
యట్టి యపవాదమునకుఁ గారణమే లేదు. కావున నాయనయందు

మోసపుబుద్ధి నెట్టి ప్రాజ్ఞుఁడు నారోపింపఁజాలఁడు. మోసము
లేదు. కారణము లేదు. దానివలన నాయనకు లాభమును లేదు.
తాంధ్రములఁ బండితులు. శాస్త్రులను నామము సార్థకముగ వ
గొప్పపదవినుండినవారు. ఇట్టివారియందుఁ బూర్వలిఖితము నను
దు నపాటవదోష మేమియుండఁగలదో యసూయారహితచిత్తు
పంతులవారి తర్కవాదము గుంజాన్యాయమును స్మరింపఁ
గోలకొండదేశములో నెవఁడో కశ్చిత్పురుషుఁడు గోదావరికి గం
చెప్పెనఁట. ఈ పేరులేనివా రెంత పెద్దమనుష్యులో యేమాత్ర
ష్టయరహితులో పంతులవారు చెప్పినవారు కారు. అట్టివార
కాప్తులు. వారివాక్యమాప్తవాక్యముగ నందఱునమ్మవలయుఁగాఁ
బంతులవారి కనుబంధములు సంపాదించి యిచ్చినవారు పరమా
దోషచతుష్టయరహితులే. అనుబంధములు వ్రాసియిచ్చిన
చతుష్టయరహితులే. వహ్వా! యెంద ఱాప్తులు పంతులవారి ప
వచ్చుచున్నారు!!! ఈ యందఱికంటెను బురాణము హయగ్రీ
జఘన్యులు కాఁబోలు. ఎట్టి ప్రమాణమును లేక యోరు
వాదించు పంతులవారు కొన్ని ప్రమాణములైనఁ గానవచ్చు
నాక్షేపించుట రిత్తచెవులవాఁడు రాగిపోగులు పెట్టుకొనిన వా
ట్లున్నది. బమ్మెర బొమ్మెర యనుకొనుట మొదటిభ్రమ. ఓరుగంటి
బమ్మెర 'భ్రమతోనే ప్రారబ్ధము. నిర్విశిష్టగంగను గోదావరియ
ము. బమ్మెరయందుఁ బోతనపుట్టెను, గృతిరచనకు నోరుగం
బమ్మెరయను నింటిపేరు తానే పెట్టుకొనెను నిత్యాది మిథ్యా
మును వంచింపఁ గావింపఁబడెను గావున విప్రలిప్సాదుష్టముఁ
వాదమున నీ దోషములు గలవుగాని హయగ్రీవశాస్త్రులవారి
ii. హయగ్రీవశాస్త్రులవారు వ్రాసిన బమ్మెర పోతరాజ
యన యేకశిలానగరమున నుండెనని వ్రాయఁబడియున్నది. ఏ
నొంటిమిట్టయని పుటకుఁ గ్రిందివైపు వ్రాయఁబడియున్నది.
నున్నట్టు మీఁద వ్రాసిరి. ఏకశిలానగరములు రెండుమూఁడు
గుదురుగాన నోరుగల్లను దురభిప్రాయ మెవ్వరైనఁ బడుదురో య
యని వివరించిరి. ఇది వారి స్వకపోలకల్పితమఁట. ప్రాచీనపండిత
ననుసరించి వ్రాసితినని వారు వ్రాసిరిగాని యీ గ్రంథమునే
న్నానని వారు వ్రాసినవారు గారు, కావున నీ వివరణము మ
యుండవలయును. అటు గాదేని సుప్రసిద్ధైక శిలానగరము

ముము' గానుండు నొంటిమిట్టపై వారి కిదృష్టిపోవఁ గారణముకలు
లిఖితవిషయము సత్యమా యసత్యమా యని స్థలజ్ఞుల విచారించి
కడపలో వారు విన్నారని పంతులవారు నంగీకరించిరి. ఇట్టిది
తముగునా? పీఠికలో వ్రాయఁబడినవిషయము లోరుగంటి కస్వ

మెవరు కని విని యెఱుఁగనిదానిని సృష్టించిచెప్పుట స్వకపోల
పోతరాజు బమ్మెరయందుఁ బుట్టెను. గ్రంథరచనకాలమునకు నోరు
మెను. బమ్మెరవారను పేరు తానే పెట్టుకొనెను. ఇత్యాదులు
రములు గాని మున్నొకరు చెప్పినదాని ననుసరించి చెప్పుచున్నా
లకల్పితముగ నెవఁడు భావించును?

ప్రమాణముగఁ గొనఁబడు ననువాదములు పెక్కులు గలవు. విస్తర
పనొల్ల. పంతులవారు మూలగ్రంథము ప్రమాణముకాదని
స చూతము.

ర్తుల యభిప్రాయము. $\frac{\text{ఒంటిమిట్ట}}{\text{ఓరుగంటి}}$ వారివాదము బలీయము.

ఓరుగంటివారి మూఁడవ యాక్షేపము.

ల్పగ్రామమైన యొంటిమిట్టకు నగరశబ్దము చెల్లదు.

టిమిట్టవారి సమాధానము. i. ఒంటిమిట్ట పూర్వము కోటలు
పెద్ద పట్టనమైనట్టు గుర్తులుగలవు. నిశివి వెడలుపు విస్తారము.
ష్టగల పల్లెలకు నగరమని పేరుండ దీనికిఁ జెల్లదా?

ఓరుగంటివారి కడపటి యాక్షేపము.

టిమిట్ట దేవాలయమందుఁ గానవచ్చుచుండు పోతరాజువిగ్రహ
మనది పోతరాజువిగ్రహము కానేరదు. ఈ విగ్రహమునకుఁ
ర్ణము కనకాభరణములున్నవి.

ఒంటిమిట్టవారి సమాధానము.

ర్వకాలపు శిలాది నిర్మితవిగ్రహములు పన్నిద్దఱాళ్వారుల విగ్రహ
నస్వరూపములు గావు. వారి తరువాతి వారు వారివారి భక్త్యతి
స్వమతానుసారముగ నేర్పఱుచుకొన్న స్మరణచిహ్నములు
యిష్టముచొప్పున నిర్మించిరి. వైష్ణవాలయమున నుండుటచే
హ్నము లుండుటచేతను, వైష్ణవులుఁగూడ నమ్మహాభక్తుని గౌర
చనలయును. ఇది సాక్షాత్ప్రతిబింబమని యెవరు చెప్పలేదు.
వి చెప్పుచున్నారు. బొమ్మెరయందు బొడ్డురాతిని బోతనయనుట
నదా? అందు సాక్షాత్ప్రతిబింబము గలదా? ఇది వేదాంతదేశి

కుల విగ్రహమన్నచో నాయనయు దరిద్రుఁడే. ఆయనకుమాత్రము కనకా
భరణము లెందుండివచ్చెను? అద్వైతులందు నియోగులం దూర్ధ్వపుండ్ర
ధారులు పెక్కులుగలరు?

మధ్యవర్తులయభిప్రాయము. $\frac{\text{ఒంటిమిట్ట}}{\text{ఓరుగంటి}}$ వారివాదము బలీయము.

విజ్ఞాపనము.

బమ్మెర పోతనామాత్యుఁ డేయూరియందుండెనో చూచి తెలిసి చెప్పువా
రెవ్వరును లేరు. నేనే బమ్మెరపోతనయని నే నిట్టి యూరనుంటినని యాయనయే
వచ్చి చెప్పినను నిప్పటివా రాయనవాక్య మేమాత్రము విశ్వసింతురో! కావున
నిప్పటికిఁ గానవచ్చు నాధారములఁబట్టి యేయూరియం దుండెననుట యుక్త
మో నిష్పక్షపాతలోక మాలోచింపవలయును. ఆయన యేయూరివాఁడైనను
నాయన నామము ప్రతిపల్లియందును స్మరణీయము. ఆయన సమస్తాంధ్రలోక
మునకుఁ బూజ్యుఁడు. అని యొంటిమిట్టవాదుల యభిప్రాయము కావునఁ బ్రతి
గ్రామమువారును బోతన మా యూరివాఁడని యెంచుట యొంటిమిట్టవారికి
సంతోషకరమైన కార్యము. ఆ విషయమున నొంటిమిట్టవాదు లగరుగొండులై
యితరుల నాక్షేపింపలేదు. ఆక్షేపింపరు. లేనిప్రతిష్ఠ సంపాదించుకొనఁగోరి
యొంటిమిట్టవారిపైఁ గలహమునకుఁ గాలుద్రవ్వినవా రోరుగంటివాదులు.
ఉభయవాద సారాంశమిట్లున్నది.

ఓరుగంటివారి వాదము సారాంశము.	ఆధారము.
బమ్మెరయనునది గ్రామనామము.	ఊహ.
బొమ్మెరయే బమ్మెర.	ఊహ.
పోతరాజు బమ్మెరలోఁబుట్టి పెరిఁగెను.	ఊహ.
గ్రంథము వ్రాయుటకు నోరుగంటికిఁ బోయెను.	ఊహ.
గ్రంథము ముగియఁగానే మరల బొమ్మెరచేరెను.	ఊహ.
పోతరాజు గోలకొండవాఁడు కావున గోదావరి నే గంగయనివ్రాసెను.	ఊః
నెల్లుట్లవారు బమ్మెర పోతరాజు వంశమువారు బొమ్మెరలో నున్నారు.	ఈవిషయమున ాదులలోనే భిన్నాభిప్రా యము గలదు.
బమ్మెరయనుపేరు తానే పెట్టుకొనెను.	గ్రంథస్థమునకు విరుద్ధమైన యూహ.
ఏకశిలానగరనామము.	ఉభయులకు స ానము.
వెలిగందల ఏర్పూరు.	ఉభయులకు స ానము.
బొమ్మెరవా రాయనపేర స్మరణచిహ్నము నిలి పిరి.	స్మరణచిహ్నా సమానము ుభయులకు

ఒంటిమిట్టవారిపక్షమున	ఆధారము.
ఒంటిమిట్ట కేకశిలానగరమను పేరుగలదు.	గ్రంథస్థము.
ఒంటిమిట్టయందుఁ బోతరాజుండెను.	గ్రంథస్థము. ఓరుగంటియం దీ మాట చెప్పు వారు లేరు.
పోతరాజు దున్నుచుండిన భూములు నేఁటికిఁ బోతనమడులనియే పిలువఁబడును.	ప్రత్యక్షము. ఓరుగంటియం దిట్టివి లేవు.
పోతరాజు వంశమువారి బంధువులున్నారు.	ప్రత్యక్షము ఓరుగంటియందు లేరు.
పోతరాజునకుఁ బ్రత్యక్షమైన కోదండరామమూర్తి యొంటిమిట్టయం దున్నాఁడు.	ప్రత్యక్షము. ఓరుగంటియందు లేఁడు.
బమ్మెరయను నింటిపేరు వంశపారంపర్యముగ వచ్చెను.	గ్రంథస్థము.
బమ్మెరయను నింటిపేరుగలవారు గోలకొండ దేశమునకంటె భిన్నదేశములం దున్నారు.	గ్రంథస్థము.
పోతరాజప్రయుక్త 'కోసర' మిత్యాదులు గోలకొండయందు లేవు.	తద్భిన్నమండలములం గలవు.

ఈ విషయము లాలోచించి పోతరా జొంటిమిట్టయం దుండినవాఁడను చిరకాలాగత జనశ్రుతిని నిరాకరించుటకును, నోరుగంటియందే యుండెననుట కును దగా రణము లిప్పటికిఁ గలవేమో మధ్యవర్తులు సెలవిత్తురు గాక. ఒంటిమిట్టి ప్రార్థన యింతయే. ఓరుగంటి కాధారముగ లిఖితాధారములు తాళపత్ర ం సృష్టింపఁబడుచున్నవని వింటిని. అవి యెంతవఱకు విశ్వసనీయములో ఏ ప్రాజ్ఞు లాలోచింతురుగాక.

వావిలికొలను సుబ్బరావు.

మా

మా

వ

ు.

మధ్యవర్తుల యభిప్రాయములు.

ఏలూరు, 10-4-19.

ఈ విషయమైన వాదప్రతివాదములు మొదటినుండియుఁ బరిశీలన బుద్ధితోఁ జూచితిమి. ఒంటిమిట్టవారివాదమే బలీయమని మాకుఁదోఁచిన యభిప్రాయ మీయడమైనది.

(Sd.) రాజామంత్రి ప్రెగడ భుజంగరావు.

విజయనగరము ఖస్బా, 15-1-20.

మ-రా-రా-శ్రీ, వావిలికొలను సుబ్బరావు పంతులవారి దివ్యసముఖమునకు, విధేయుఁడు గాడేపల్లి అనంతరామమూర్తి కృతానేక వందన పూర్వక విజ్ఞాపనము—

శ్రీమదాంధ్ర భాగవత కర్తయగు బమ్మెర పోతనామాత్యుని నివాసస్థానముం గూర్చిన వివాదములో నేనోరుగల్లు వాదుల పక్షములోఁ జేరియుండువాఁడను. తా మీనడుమ పంపిన వార్రంగల్ ఒంటిమిట్ట వివాదఖండనమను గ్రంథమొకటి నాకు మ॥ గురుజాడ దుర్గాప్రసాదరావు పంతులుగారు దయచేసినందున నే నా గ్రంథము సాంతముగఁజదివినాఁడను. నా పూర్వాభిప్రాయమును నా గ్రంథమందలి ధాటీపంచకము పంచత్వమొందించినది. పోతనామాత్యుని నివాసస్థాన మేకశిలానగర నామాంతరమగు నొంటిమిట్టయే యని నేనిపుడు నిస్సంశయముగా విశ్వసించుచున్నాఁడను.

ఈగ్రంథసహాయమున నోరుగల్లు వాదులగు నా మిత్రుల గొందఱినిపుడొంటిమిట్టవాదుల పక్షములోఁ జేర్పగలుగుచుంటినని సంతోషపూర్వకముగా విన్నవించుచున్నాఁడను.

(Sd.) గాడేపల్లి అనంతరామమూర్తి.

ది 12-2-19 న కడపజిల్లా సెషన్సుకోర్టు శిరస్తదారుగారైన మ-రా-శ్రీ, వావిలాల వేంకటశివావధానులుగా రిట్లు వ్రాసిరి.

శ్రీ ఒంటిమెట్ట కోదండరాముఁడు భక్తాగ్రేసరులగు తమను ప్రోత్సాహముచేసి శ్రీమద్రామాయణమును వ్రాయించిన కారణము అన్నివాదముల

కంటెను. ఆ దేవుఁడే పోతనచేత భాగవతము వ్రాయించెనని నిర్ధారణచేయు నటుల నాకు తోఁచుచున్నది.

ది 1-9-19 న అనంతపురమునుండి దత్తమండల కళాలయమున సంస్కృత పండితులుగ నున్న బ్ర॥ శ్రీ॥ మ-రా-శ్రీ, సం॥ వేం॥ అప్పలాచార్యులుగా రిట్లు వ్రాసిరి.

బమ్మెర పోతనామాత్యు డొంటిమిట్టవాఁడను కింవదంతి చిరకాలాగతమయి విశ్వవ్యాప్తముగ నున్నది. ఈ జనశ్రుతి అన్యదీయ ప్రబలప్రమాణ బాధితమయినచో అప్రమాణికమని చెప్పనగును. అట్టి ప్రమాణములు మృగ్యములు. అప్రమాణ్య సాధకములుగ వాదులచే నుపన్యస్తమయిన హేతువులు సద్ధేతువులుగ కాన్పించవు. ఏదయిన నొక్క విషయమున విప్రతిపత్తి యుదయించి నప్పుడు అబాధిత హేతూపన్యాసమే అన్యతరపక్ష నిర్ణాయకమగుట శాస్త్రీయమయిన సంప్రదాయము, ప్రకృతము ప్రసక్తమయిన వివాదమున వాదులచే నుదాహృతమయిన హేతుపరంపర కాలాత్యయాపదిష్టమగుటచే నయ్యది స్వమతవ్యవస్థాపకము కాకపోవుటయే కాక ప్రత్యుతపరపక్ష ప్రతిష్ఠాపకమై ప్రతివాది విజయసంధాయక మగుచున్నదని వ్రాయుట పునరుక్తము

ఓరుగంటివా రుదహరించిన హేతువులలో మూఁడువంతులు ఊహామాత్రసారములు. మిగిలిన నాలుగువంతులో కొన్ని యన్యోన్య భిన్నాభిప్రాయ కళంకితములు. కావున వానికి ఆంశిక ప్రామాణ్యమే కాని సంపూర్ణ ప్రామాణ్యము లేదు. కొన్ని యుభయవాది సమ్మతములు. కొన్ని గ్రంథ విరుద్ధములు. ఇది వారి హేతువాదస్థితి.

ఒంటిమిట్టవారి హేతువులు ప్రత్యక్షప్రమాణ సిద్ధములు, గ్రంథస్థములు నయి యున్నవి. ఉభయవిధ హేతువులకు నిట్టి తారతమ్యముండుటవలన నొంటిమిట్టవారికి విజయప్రాప్తి కరతలామలకమని నా నిశ్చయము. * *

అట్టి తాము పట్టుదలనే ప్రధానముగ నెంచి జగత్ప్రతారణకై గాని ప్రతిష్ఠార్థము గాని యన్యులవలె నసంబద్ధముగను అప్రమాణముగను అసత్యములను స్వకపోల కల్పితములను విశృంఖలముగ వ్రాయుచు "తానుపట్టిన కుందేటికి మూఁడే కాళ్లు" అని వాదించు వారు కారు, యథార్థ స్థితిని లోకమునకు వెల్లడించుటకు ప్రయత్నము చేయువారు నని విద్వల్లోక మెఱుంగును. తక్కినవారి జోలి మన కేల. ఉభయవాదములయందలి సత్యాసత్యములను నిష్పక్షపాత

బుద్ధితో పరిశీలించిన పక్షమున విద్వాంసులు తమవాదము బలీయమని [illegible]క చెప్పుదురని నా తాత్పర్యము.

నేనొంటిమిట్టవారి వాదమే బలీయమని చెప్పువాఁడనుగాని యోరుగంటి వారివాదము బలీయమని చెప్పువాఁడను గాను. ఇదియే నా యథార్థాభిప్రాయము.

శ్రీక్రియాశక్తి యొడెయరు గ్రంథాయతన కార్యదర్శిగారైన మ-రా-శ్రీ, శిరిపి ఆంజనేయులుగారు ధర్మవరమునుండి సెప్టెంబరు ది 1 న "బాలభారతి" పత్రికయందిట్లు వ్రాసియున్నారు.

* * * *

బొమ్మెరవారియు నోరుగంటివారియు వాదములు ప్రకృత కాలాగతములై పోతనామాత్యుని యునికివిషయమై పరస్పరవిరుద్ధములై వైపరీత్య హేతువులుగ నున్నవి. ఓరుగంటివారి వాదము స్వతంత్రప్రమాణములు లేని యుక్తి చమత్కార గర్భితముగ నున్నది. ఓరుగంటివా రాంధ్రప్రపంచమునకు జాటిన యూహలైదును నొంటిమిట్టవాదుల చిరకాలాగత జనశ్రుతికి సముచిత గ్రంథప్రమాణములకును నిలువఁ జాలినవిగా లేవు. ఓరుగంటియందుఁ బోతన యుండెనని స్థాపించు వాదము తరచిన కొలఁది బలహీనమయి నిస్సారమయి యొంటిమిట్టవారి ప్రచండవాద వాతూలహతిచే నెగురఁ గొట్టఁబడుచున్నది. ఓరుగంటివారి యూహలు నిరాధారము లని నిర్ధరించుటయందు శ్రీ నావిలికొలను సుబ్బరాయ కవిగారు సల్పిన పరిశ్రమ మత్యంత స్తుత్యర్హము.

ది 6-3-19 న తిరుపతినుండి మ-రా-శ్రీ, నాగపూఁడి కుప్పుస్వామయ్యగారిట్లు వ్రాసియున్నారు.

ఇందు సూచించిన యంశములలో నోరుగంటివారి వాదము దుర్బలమనియు నొంటిమిట్టవారి వాదము బలీయమనియు నా యభిప్రాయము.

తిరుపతినుండి ది 4-3-19 న బ్ర॥ శ్రీ॥ పాతాళభేది సుబ్రహ్మణ్యముగారును, 5-3-19 న మ-రా-శ్రీ, ఏ. పద్మనాభయ్యగారును యొంటిమిట్టవారి వాదమే బలీయమని యభిప్రాయముల నిచ్చియున్నారు. మ-రా-రా-శ్రీ, గాడిచెర్లహరిసర్వోత్తమరావుగారు రాయదుర్గము నరసయ్య శాస్త్రులు లోనగువారును బోతరాజొంటిమిట్టయం దుండెననియే వ్రాసిరి.

విజ్ఞాపనము.

ఇందలి వ్యాసములు సాహిత్య పరిషత్పత్రికయందు మున్ను ముద్రింపఁబడినవే. ఇవి గ్రంథరూపముగ నన్నియు నొకచోనుండిన భవిష్య ద్విమర్శకులకు సాయపడునని బ్ర॥ శ్రీ॥ జయంతి రామయ్యపంతుల వారలయుఁ బరిషత్పత్రికాధిపతులయు ననుజ్ఞగొని ప్రకటించితిని. పోతరాజు జనించిన ౫౦౦ సంవత్సరముల కీవాదము జన్మించెను. ఇఁక ౫౦౦ సంవత్సరముల కిద పరిష్కరింపఁబడినను వ్యసనము లేదు. అభ్రంకష శుభ్ర సముత్తుంగ భంగయుగు గంగ యనుచో గంగ యనఁగా నోరుగంటియొద్దనుండు కాశీబుగ్గయని యర్థము చెప్పువారును, దల్లిని భార్యగను భార్యను దల్లిగను నన్వయించి వాదించువారును వీరలవాదమును ననుమోదించువారును గల యీకాలమున సర్వత్రసత్యస్థాపన మెట్లు కాఁగలదు? అయినను నొంటిమిట్టవాదము నామోదించినవారు గొప్పవారు విజ్ఞులు నితరమండలములవారు గాక ఈ మండలముల వారాబాలగోపాల మొంటిమిట్టవాదము నామోదించి చిరకాల జనశ్రుతి సప్రమాణమని యంగీకరించియుండ నిఁక నీ శుష్కవాదముతోఁ బనియేమి? బమ్మెర పోతన యొంటిమిట్టయందుండెనని మేము చెప్పుదుమే కాని యితరగ్రామములం దడుగిడిన వాఁడు కాఁడని చెప్పము. ఒక కవి యొకజన్మములో ౩-౪ గ్రామములం దుండుట గలదు. ఎఱ్ఱాప్రెగడ గుడ్లూరు చేదల్వాడ రెండుగ్రామములయం దుండెననుట గ్రంథస్థము. నేను బుట్టిపెరిఁగి ౩౫ సంవత్సరములు కడప మండలమందుండి కొన్ని గ్రంథములు రచించుటయుఁ దరువాత నెల్లూరు చేరుటయు నావలఁ జెన్నపురియందు నిరువది సంవత్సరములుండి తక్కిన గ్రంథములన్నియు రచించుటయు లోకమునకు వ్యక్తమేకదా. నిదర్శనములు కానవచ్చుటచేతఁ బోతరా జొంటిమిట్టయందుండె నని మేము చెప్పుచున్నారము కాని హఠశఠవాదముల నిమిత్తమై కాదు. 179-వ పుటలో నేనుజెప్పినట్టు లేగ్రామమువారు పోతరాజు మావాఁడని చెప్పినను మే మాక్షేపింపము. అట్లు వారిచెప్పిరేయని మాకుఁ గడుపుకుట్టు లేదు. చూపోపమి లేదు. అట్టివారివలె మేమును మా యొంటిమిట్టయందుండెనని చెప్పుదుము. దానికిఁ బ్రమాణములు చూపితిమి. నిష్పక్షపాతులగు వారెట్లైనఁ బరిష్కరింప నిండు.

కం. పరులధనమునకు విద్యా, పరిణతికిం దేజమునకు........మనం

బెరియఁగ నసహ్యపడు న, న్నరుఁడు దెవులులేని వేదనంబడున[illegible]పా.

ఇట్లు విన్నవించు: సుజనవిధేయుఁడు, వావిలికొలను సుబ్బరావు.

British Model Press, Choolai, Madras—1920

పోతరాజవిజయము.

ప్రథమధాటి.

"వార్రంగల్ ఒంటిమిట్ట వివాద" ఖండనము.

(కడపపురంబున 5-5-19 తేదియందుఁ గూడిన సభలోఁ జదువఁబడెను.)

మహాశయులారా!

శ్రీమదాంధ్రభాగవతకర్త యగుబమ్మెరపోతనామాత్యుఁడు చిరకాలముగ మనమండలమునందును, దదితరమండలములందును నొంటిమిట్టవాఁడని ప్రబలజనశ్రుతి యుండుట యాంధ్రలోక మెల్ల నెఱిఁగినవిషయమే. అయినను గొందఱు (ఓరుగంటివారుగారు మొ॥) పోతన యోరుగంటివాఁడనియు, నొంటిమిట్టవాఁడు కాఁడనియు ౫-౬ సంవత్సరములుగ వాదించుచున్నారు. అట్టివారివ్వాదముల నెల్ల సయుక్తికముగను, సప్రమాణముగను ఖండించి మన వావిలికొలను సుబ్బరావుగారు పోతరా జొంటిమిట్టవాఁ డనుటను సిద్ధాంతము చేసియున్నారు. ఇప్పుడు బెజవాడలో న్యాయవాదులుగ నుండు బ్ర॥ శ్రీ॥ పెద్దిభొట్ల వీరయ్యపంతులు, బి.ఎ., బి.ఎల్., అనువారు వా॥ సుబ్బరావుగారు చేసినసిద్ధాంతము తమయభిప్రాయమునకు విరోధముగ నున్న కారణముచేతను, సుబ్బరావుగారు మున్నొకసారి సభలోఁ జెప్పిన మఱికొన్ని కారణములచేతను "వార్రంగల్ ఒంటిమిట్టవివాదము" అను నొకవ్యాసముఁ బ్రకటించి యోరుగంటియందే పోతన్న యుండినాఁడని వాదింపఁగడంగిరి. సందిగ్ధ విషయములందు నభిప్రాయభేదము లుండుట సహజము. అందు ఖేదింత యేమియు లేదు. వారివారికిఁ దోఁచినట్లు వారువా రనుకొనవచ్చును. వాదింప వచ్చును. కాని వాదించుటయందుఁ దెలిసినంతవఱకైన సత్యమునందు దృష్టియుంచుట యుత్తమపురుషలక్షణము. కావున న్యాయబలముచే నీవిషయము సిద్ధాంతము గావలయు నని బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారు వ్రాసినవాక్యము శ్లాఘ్యము.

బ్ర॥ శ్రీ॥ వీరయ్యపంతులవారో రామయ్యపంతులవారి యభిప్రాయముతో నేకీభవింపక "ఈదావా కేవలము వాదబలమునుబట్టి నిర్ధారణకాఁబడవలెను" అని వ్రాసిరి. న్యాయమందు దృష్టిలేక వాదబలముచే గెలువ మా

స్వర పో

... వారివాద మె ...
యుండునో యట్లే బ్ర ...
లతోను, నసత్యములతో ... ని ...
నశించునట్లు లసత్యములు ... సత్య ...
ములందలి మిథ్యల నెల్లలోకము ... నఁబడు ...
దోషము లెన్నుట ప్రశస్తకార్యము ... నను ధ

ఉ. సారపు ధర్మముఁ విమల సత్యము ప ...
భారము నొందలేక చెడఁ బాలివిర్గౌన యవస్థ ...
వ్వార లుపేక్ష చేసి రది వారలచేటగుఁ గాని ధర్మని
స్తారక మయ్యు సత్యఫలదాయక మయ్యును దైవ ముండెడుఁ.

అను భగవద్వాక్యము ననుసరించి కర్తవ్యలోపము పాపావహ మని నిశ్చయించి వేఱుమార్గము లేక యీ బమ్మెర పోతనామాత్య సమాజమువారీకార్యమునకు దిగిరి.

ఇఁక బ్ర॥ శ్రీ॥ వీరయ్యపంతులువారి వ్యాసమునందలి విషయ మొక్కొక్కటియే యెత్తుకొని ప్రత్యుత్తర మీయఁబడును. వీరయ్యపంతులవారి వాదము చెప్పవలసినప్పుడు సాధ్యమైనంతవఱకు వారివాక్యములే యనువదింపఁబడును. విపులముగ నున్నచోట సంగ్రహించి వ్రాయఁబడును. అనువాదములయందు నపశబ్దములు, గ్రామ్యములు దురన్వయములు లోనైనవి పెక్కులుండును. మూలమునందుఁ గానవచ్చు నట్లే గ్రహింపఁబడెను. కావున నందలిదోషము వీరయ్యపంతులవారిదే యని గ్రహింతురుగాక. అందలి యపశబ్దాది దోషములు మావి యని లోకము తలంపకుండుటకై యిది ప్రస్తావింపవలసివచ్చెను.

వీరయ్యపంతులవారి ౧-వ యాక్షేపము.

"౧౦౦౦-వ సంవత్సరము నాటివరకు కడపమండలములో నుత్తరభాగము నిర్జనభూమిగ విశేషముగ దేవాలయములు గాని అగ్రహారములు గాని లేనిస్థితిలో నుండిన సంగతిని ముఖ్యముగ జ్ఞాపకముంచుకోవలెను. ఆ ప్రదేశము దండకారణ్యభాగమై శ్రీశైలము మహానందిప్రదేశముల కాగ్నేయముగ నుండినది. ౧౧౦౦ సంవత్సరములలో కులోత్తుంగ చోడుని కాలమువఱకు దత్తమండలములు దండకారణ్యభాగములై నిర్మానుష్యముగ నుండెను."

"వారంగల్ ఒంటిమిట్ట వివాద" ఖండనము.

ప్రత్యుత్తరము.

వీరయ్యపంతులవా రిచ్చినవివరముఁబట్టి వారు నిర్జనభూమిగఁ జెప్పు దండకారణ్యభాగము కడపమండలములో జమ్ములమడుఁగు తాలూకా యగుచున్నది. ఈజమ్ములమడుఁగు తాలూకాయందే దానవులపా డనుగ్రామ ముండుట మీరంద ఱెఱింగినవిషయమే. అందు జైనదేవాలయము కలదు. అందుఁ గ్రీ.శ. ౯౧౫-౯౧౬-౯౧౭ సంవత్సరములకు సంబంధించిన శాసనము కలదు. అది రాష్ట్రకూటరాజైన నిత్యవర్ష (ఇతఁడే మూఁడవ యింద్రుఁడు) కాలమునాఁటిది. ఇతఁడు జైనసన్న్యాసి శాంతి యనువానికి స్నానార్థమై పీఠము కట్టించెను. ౯౧౫ నాఁటికి రాష్ట్రకూటరాజులు రాజ్యముచేయుచు దేవాలయములు కట్టించి యుండఁగా జమ్ములమడుఁగు తాలూకా ౧౦౦౦ సంవత్సరముల వఱకు నిర్జనభూమి యని వ్రాసినవ్రాఁత యెట్టిదో మీరే యాలోచింపుఁడు. జమ్ములమడుఁగు తాలూకా నిర్జనారణ్యమైనచో దానికుత్తరభాగమైన కందనోలు (కర్నూల్) మండలము నిర్జనముగానే కదా యుండవలయును. అది సందేహింప నేల? ౧౧౦౦ వఱకు దత్తమండలము లన్నియు నిర్మానుష్యదండకారణ్యభాగ మని పంతులవారు స్పష్టముగ వ్రాయనే వ్రాసిరి కదా. కర్నూల్ మండలములో వీరయ్యపంతులవారు నిర్జనారణ్య మనిచెప్పెడుకాలమునకు ౩౦౦ సంవత్సరములకు ముందు అనఁగా క్రీ॥ శ॥ ౬౯౦ లో వినయాదిత్యుని శాసనము కానవచ్చుచున్నది. నిర్జనారణ్యమున శాసనము లుండుటకుఁ గారణము లేదు.

"That parts of the district, notably the river valleys in the low country, were inhabited ages before the earliest of these records which have come down to us, is proved by the existence of kistvaens or cell-tombs. They are locally known to the present day as Pandava gullu (పాండవగుళ్లు). * * * The constructions of unhewn stone near Yerraguntla are of course referred to a still *earlier civilisation* but as they too have not yet been scientifically examined it can only be recorded that they are the oldest surviving monuments of human activity in the district."

"The Choolya state referred to by Hiuen Tsiang (640 A. D) was the Telugu Chola kingdom occupying most of the black cotton country of this district and perhaps parts of Kurnool and Anantapur. The same authority says it is a small state, about 400 miles in circumference. In inscriptions we find the name of this Chola country to be Renandu (the 7000) and a division of it is called Renadu (the 70) The rule of the Telugu Cholas appears to have lasted till the latter part of the 8th century".

"..................the Chola dynasty under its famous, and hitherto mythical, king Karikala attained unprecedented ascendency and captured Conjeevaram from Trilochana-Pallava, while on the North the same Pallava king suffered defeat at the hands of the Chalukyan adventurer Vijayaditya, who claimed to come from Ayodhya (Oudh). This battle probably took place in Cuddapah district, as the village of Mudivemu where the queen of the victor Vijayaditya, who lost his life took refuge after the battle, is no other than Pedda Mudiyam in Jammalamadugu taluk. "ఇది ౬-వ శతాబ్దములో జరిగినది.

* * * * * * * *

"The recent discovery of some copper plates at Malepad and stone inscriptions at Pedda Mudiyam and Muddanur conclusively prove that at least four generations of the earliest Chola kings ruled this country."

* * * * * * * *

"That all this country was effectively ruled by the Bana is not probable but as already stated his authority was undoubtedly acknowledged in the North of Cuddapah district in the last quarter of the 9th century."

* * * * * * * *

"We know more about a latter king of this line Krishna III (Rashtra kuta) who reigned from A. D. 940 to 956. In his reign the power of the Rashtra kutas reached its Zenith. He must have held the whole of Cuddapah district except the eastern portion beyond the Seshachalams, for he penetrated as far south as Melpadi in Chittoor district."

* * * * * * * *

"By the incursion of the Cholas into the Pallava country at the end of the 5th century A. D. of which one, if not the only, lasting result had been the establishment of a small Chola state in the North-West of Cuddapah district. The power of the Pallavas suffered only a temporary eclipse. During the next four centuries, with Conjeevaram as their capital, they ruled all the eastern country, including the present eastern taluks of Cuddapah district and their authority as far north as the Kistna was undisputed."

* * * * * * * *

"It is recorded that one Dasavarman, the grand-father of a Choda chieftain, conquered the Paka Rashtra and ruled at Pottapi. This must have been about A. D. 1000."

* * * * * * * *

A rich harvest of information has been obtained from lithic records discovered in or near several villages on the banks of the

Cheyyer river in Pullampet taluk such as Nandalur, Lebaka and Tangatur. The great Chola king Kulottunga I (A. D. 1070 to 1118) is mentioned in an inscription at Nandalur.

మీఁది యనువాదము లన్నియు కడపగెజటీర్ నుండి గ్రహింపఁబడినవి. దత్తమండలములు క్రీ. శ. ౬౦౦ నుండి నాగరికతతో నిండియుండినట్టు స్పష్టపడి యెఁగదా. ఇదిగాక ఓసూరులకోనయందును గడపకు ౮ మైళ్లలోను శిలామయాయుధములు కానవచ్చుచున్నవి. కావున రమారమి ౨౦౦౦ సంవత్సరములనుండి యీ మండలము నాగరికదశయం దుండెనని విశ్వసింపవచ్చును. ఇప్పుడు ౧౧౦౦ వఱకు దత్తమండలములు నిర్మానుష్య మని వాదించు వీరయ్య పంతులవారివాదమునందు సత్యలేశ మేమాత్ర మేనున్నదో మీరే యాలోచింపుఁడు.

౨-వ యాక్షేపము.

"౧౦౮౦ మొదలు ౧౪౦౦ లోగా పొత్తపినాటిని పాలించిన యుత్తమ రాజు లెవ్వరును లేరు.

సమాధానము.

౧౧౦౦ వఱకు రాజాధిరాజులు కడపమండలమును బొత్తపినాడులోనుగఁ బాలించి రని మీఁదఁ జూచాయగాఁ దెలిపితిమి. వారంద అధమరాజు లని యెవ్వరు వ్రాయలేదు. అదట్టులుండ నిండు. వీరయ్యపంతులవారు ప్రమాణముగఁ గొనినయాంధ్రులచరిత్రమం దిట్లు వ్రాయఁబడియున్నది.

"కరికాలునకు మహిమానుఁ డనుకుమారుఁడును, అతనికిఁ గరికాలుఁడు తొండమానుఁడు దాసవర్మ యనుమూవురు కుమారులు గలరనియు శాసనములందుఁ గన్పట్టుచున్నది. కరికాలునివంశమునఁ దెలుఁగుబిజ్జన జనించెను.

"కరికాలవంశమున జనించిన దాసవర్మ మొదట పాకనాటి రాష్ట్రమును, జయించి పొత్తపిపట్టనమును రాజధానిగఁ జేసికొని పరిపాలించెనని చెప్పఁబడియున్నది. పొత్తపి యనునది కడపమండలమునందలి పుల్లంపేట తాలూకాలోని టంగటూరునకు సమీపమందున్న పోతపి యనుగ్రామమే గాని వేఱొండు గాదు. ఈపొత్తపిరాజధానిగాఁగల పొత్తపినాడును బరిపాలించిన చోడులను గూర్చి మఱియొకతావునఁ దెలిపెదను. ఈపొత్తపి శబ్దము పెక్కండ్రు చోడరాజులయొక్క బిరుదనామములతోఁ బొందుపఱుపఁబడియున్నది. ఈ పొత్తపినాటిని బరిపాలించిన దాసవర్మసంతతివారు కమ్మనాటిని జయించి కోట్యదొనను రాజధానిఁగఁ జేసికొని పరిపాలనము చేసిరి. ఈకోట్యదొనపట్టణము

ఇప్పుడు గుంటూరుమండలములోని నరసారావుపేటకు సామీప్యమున కోణి దెన యనుపేరితోఁ బరంగుచున్నది."

"ఈదాసవర్మ సంతతిలోనివాఁడైన శ్రీమన్మహామండలేశ్వర బల్లయచోడ దేవమహారాజుయొక్క క్రీ. శ. ౧౧౦౬-౧౧౦౭వ సంవత్సరములోని శాసనము ప్రాచీనమైనదిగఁ గన్పట్టుచున్నది. ఇతఁడు కమ్మనాటికి ముఖ్యపట్టణ మగు కోట్యదోన అను కొట్టిదోన (కోణిదెన) యందు బల్లీశ్వరాలయ మను పేరితో నొకశివాలయమును గట్టించెను. దాని చిహ్నము లిప్పుడు గానరావు. ఈచోడ బల్లికుమారసంభవమను మహాకావ్యమును రచించిన నన్నెచోడుని తండ్రి యైనటులఁ గుమారసంభవములోని యీక్రిందిపద్యమునఁ దేటపడు చున్నది." అనియు నీనన్నెచోడుఁడు ౧౧౫౦-౧౧౭౦ ప్రాంతముల నున్నట్టు లాంధ్రకవులచరిత్ర దెలుపుచున్నది. దీనినిబట్టి దాసవర్మ పొత్తపినా డేనాఁ డేలెనో మీరే యూహింపవచ్చును.

బల్లియచోడ దేవమహారాజు శాసనము సంవత్సరము ౧౧౦౬. అతఁడు ౧౧౦౦ రాజ్యమునకు వచ్చెనని తలంతము. అతఁడు దాసవర్మ సంతతివాఁ డఁట. దాసవర్మకు బల్లియచోడునకు నడుమ నెన్నితరములు మాఱెనో తెలి యదు. ౪ తరములు మాఱె ననుకొనినను దరమునకు ౩౦ సంవత్సరముల వంతున లెక్కించిన ౪ × ౩౦=౧౨౦ అగును. ౧౧౦౦ లో ౧౨౦ తీసివేయఁ గా ౯౮౦-వ సంవత్సరము ప్రాంతమున దాసవర్మ పొత్తపియం దుండవలసినట్టు లేర్పడెను. ఇట్లుండఁగాఁ బొత్తపినాటిని బాలించిన యుత్తమరాజు లెవ్వరు లే రను టేటి మాట?

మధురాంతకపొత్తపిచోడ బేటరాజు ౧౧౨౧; మధురాంతకపొత్తపి చోడ విమలాదిత్యుఁడు ౧౧౨౫-౧౧౨౬ ఈవిధముగ రాజులు వరుసగఁ బాలించు చుండిరి.

వీరంద ఱుత్తమరాజులు కారని వీరయ్యపంతులవా రందు రేని యిఁక నుత్తమరాజు లెట్టివారో వీ రర్థము లెట్టివో వారే తెలుపవలయును.

"Later Choda chieftains who ruled this part of country generally assumed the title Madhurantakam-Pottapi-Chola. They were thus feudatories of the Chola kings."

* * * * * * * *

"His (Kulottunga I A. D. 1070 to 1118) successor's name Vikrama Chola is also found in two inscriptions of the same place, to which are assigned dates corresponding to A. D. 1121 & 1126 respectively. In the same place (Nandalur) again there is a record of Kulottunga III A. D.

(1178-1216) of whom we know from another source that his territory included Nellore. The name of his successor Raja Raja Deva III is also found on an inscription at Nandalur. During this and the following century the province was actually administered by the Telugu Chodas and from their inscriptions which contain genealogical accounts it is clear that the office of governor became hereditary. It happened at times; through the weakening of the central authority that the Madurantaka Pottapi Chodas exercised practically sovereign powers. Such a period occurred towards the end of the 12th century when another feudatory or viceroy of the Cholas, who was in charge of a province of which the head-quarters were at Vallur near Cuddapah, boasts to have "levied tribute from Kanchi." This appears to refer to a general insurrection of the northern provinces of the Chola kingdom in the early years of Kulottunga III, the rebels being probably set on or encouraged by the Eastern Chalukyas or Pallavas. Their success, was shortlived, for in A. D. 1196, Kulottunga III regained Conjeevaram and made "the kings of the North prostrate themselves to the ground." This sovereign entirely reestablished the Chola power in the Paka-nadu. During the reign of his successor Raja Raja Deva III (A. D. 1216-1243) the power of the Cholas suffered a temporary eclipse chiefly owing to the aggression of the Pandyas in the South. That the Cholas survived this set back is chiefly due to the prowess and loyalty of the Madurantaka-Pottapi-Chola Tikka who was then administering the Pakanadu, we find him actually at Conjeevaram during the reign of Raja Raja Deva III helping that weak Monarch to repel the attacks of the Pandyas one of whose allies was the Hoysala king from the West, whose name was Vira Somesvara (A. D. 1234 to 1253). Not only Tikka who was also known as Gandagopala, establish theChola king on his throne, but he defeated theHoysala king & "played ball with the head of Prithviswara" who apparently threatened the Paka nadu from the North. It is interesting to note that after the defeat of Vira Somesvara the ambitions of the Hoysala kings found an outlet further North, for his successor Narasimha III, who reigned from A. D. 1254-1291, is referred to in an inscription found at Devagudipalle of Royachoti Taluk, which shows that by that time at any rate the Vaidumbas, who formerly held that part of the country, had been dispersed. Both Tikka and his son and successor Manuma Siddhi ruled the Pakanadu from Nellore, though both of them held the title Madhurantaka Pottapi Cholas who governed the Merpaka nadu, the rest of the Paka nadu being administered from Kandukur by another branch of the same family of Telugu Chodas whose distinguishing name or title seems to have been Gandagopala. Manuma siddhi, who ruled at Nellore and owed allegiance to the Chola king Rajendra Chola III (A. D. 1246 to 1268) was the patron of the Telugu poet Tikkana somayaji who translated a portion of the

Sanskrit Mahabharata into Telugu and from whose writings we learn something of Manuma siddhi's genealogy."

ఈ దీర్ఘానువాదమును సభ్యులు క్షమింతురు గాక.

ఈప్రకారము కడపమండలము ముఖ్యముగఁ బొత్తపినాడు 1268 వఱకుఁ చోళుల ప్రభుత్వమునకు లోపడియుండెను. చోళులభాష యఱవమని యంద ఱెఱుంగుదురు. అదియునుగాక మీఁద వివరించినట్టు లీకాలము కలహముల తోనే వ్యయపఱుపఁబడెను. ఇట్టి సందర్భములనుబట్టి యీ మండలమున నాంధ్రభాషకుఁ బ్రచారము తగ్గెను. ఇది సత్యమైనఁ గావచ్చునుగాని యీ దేశ ముత్తమరాజులచేఁ బరిపాలింపఁబడలేదనుట సత్యముగాదు.

చోళులకుఁ దరువాత నీదేశమును గాకతీయు లాక్రమించిరి.

"From this date (1268) the Pottapi country as was already the case with all the tract corresponding to the taluks of Jammalamadugu, Proddutur, Cuddapah, Kamalapuram and probably Pulivendla, fell into the hands of Ambadeva who had temporarily usurped the Kakatiya crown. He ruled this part of his territory from Vallur, some ten miles West of Cuddapah and the administrative divisions were the Gandikota Sima, the Muliki nadu, Renadu and in the East of the district, the Sakili, Yeruva and Pottapi divisions. During the time of Ambadeva a land survey of Pottapi Nadu was carried out under the direction of his subordinate Peddi Nayaka, and a river channel was constructed at Lebaka. A flood bank was also thrown up to prevent the waters of the Cheyyer from inundating a temple at Attirala. Pratapa Rudra was the Kakatiya king who succeeded to the throne at Warangal after the death or down fall of the usurper Amba deva,"

With the opening of the 14th century we thus find the whole of Cuddapah District, except Royachoti Taluk, under the sway of the great Northern kingdom whose capital was Warangal while Royachoti Taluk was, as we know, in the latter part of the 13th century, included in the territories of Hoysalas. In A. D. 1309 came the invasion of the Deccan by the Muhammadans during the reign of the Khilji Emperor Allah-ud-din. Warangal fell and with it the Kakatiya dynasty."

* * * * * *

"The subjection of the country was completed about A. D. 1325 when Warangal was captured and the king Prataparudra carried a prisoner to Delhi. But in A. D. 1336 the Vijianagar kingdom was founded by Harihara and Bukka, two Hindu refugees from Warangal."

దీని నంతయు మీ రాలోచించిన నీ మండలము కొంతకాలమువఱకుఁ జోళులకు లోపడియుండి తరువాతఁ గాకతీయులకు లోపడియుండెనని స్పష్ట

మగుచున్నది. ఆకారణముచే నా కాలమున నిదంతయు నోరుగంటి రాజ్య ముగనే యుండెనుగాని యిప్పటి భేదము లప్పుడులేవు. కావుననే యక్కడివా రిక్కడివా రేకగృహావాసము గావించు చున్నట్లుండిరి. ఆ కారణముచేతనే యోరుగల్లునకుఁ గీడుమూఁడినపు డచ్చటివారు దత్తమండలములలోఁ గుదురు కొనుటకుఁ గారణమయ్యెను. గోలకొండ వ్యాపారులు లోనగువారును గోల కొండదేశములోని గ్రామములను దమయింటిపేర్లుగాఁ గలవారును నిట్లువచ్చిన వారే. వారిలో బమ్మెరపోతరాజు పూర్వులు నొకరై యుండవలయును. మీఁద వివరించిన జైనులు చోళులు, రాష్ట్రకూటులు, కాకతీయులు, విద్యానగర ప్రభువులు నుత్తమరాజులుగారను వీరయ్యపంతులవారివాద మెంత న్యాయ్య మో మీరే యాలోచింపవలయును.

౩-వ యాక్షేపము.

"పెన్నానదికి నుత్తరభాగముననున్న ప్రదేశములలో నాకాలపు నాగ రకత యెట్టులుండినను, పొత్తపినాడులో నక్కాలంబున (పదియవ శతాబ్దా నంతరము) మాత్రమప్పుడే గ్రామములేర్పడి యరణ్యములు జనపదములుగా మారుస్థితిలోనుండి నాగరతకు నోచుకొని యుండలేదు."

సమాధానము.

ఇంచుమించు ౯౮౦-వ సంవత్సరమున దాసవర్మ పొత్తపి రాజధానిగ నేలి నట్టు, నంతకుముందు కొందఱు చోళులు మొదలగువారుండినట్టు, మీఁదవివ రింపఁబడెను గదా. ఆ కాలమున నూళ్లు పల్లెలు లేకుండిన నేచెట్లు చేమల మీఁద వారుప్రభుత్వముచేసిరో వీరయ్యపంతులవారే చెప్పవలయును.

౪-వ యాక్షేపము.

"౧౦౦౦ మొదలు ౧౪౦౦ వరకుఁ గల పెన్నకు నుత్తరభాగమున గల విశేషశాసనములంబట్టియు పెన్నకు దక్షిణమున దేవాలయములు అగ్రహార ములు దత్తమండలములలో నా కాలమున లేనందునను ౧౩౦౦ నాటికి కడప మండల మనాగరకస్థితిలో నున్నదనుటలో సందియము లేదు."

సమాధానము.

వీరయ్యపంతులవారి వ్రాఁతకు మనము దుఃఖింపఁగారణములేదు. మన కీ విషయమున మిత్రులు నెల్లూరిమండలమువా రున్నారు. నెల్లూరిని గూర్చి యాంధ్రులచరిత్రము మధ్యయుగమునఁ బుట ౫-౨ నందు నిట్లు వ్రాయఁబడి యున్నది. "అయినను నెల్లూరునకు దిగువ భాగమునందలి దేశమున మొదటి

పరాంతకుఁడు మొదలుకొని మొదటి కులోత్తుంగ చోడునివఱకు శాసనము లేవియు నంతగాఁ గానంబడకుండుటచేత నా భాగము చాలనఱకు నిర్జనారణ్యముగానుండెనని యూహింపఁబడుచున్నది. ఈప్రదేశము అనంతపురము, బళ్లారి, కడప, కందనోలు మండలములవలెనే దండకారణ్యములో నొక భాగముగానుండి చాలకాలము నిర్జనప్రదేశముగానే యుండినది. ఆహేతువుచేతనే యీ ప్రదేశమునందు పురాతన దేవాలయములుగాని పురాతన బ్రాహ్మణాగ్రహారములుగాని లేక పోయెను.” అనఁగాఁ బెన్నకు దక్షిణభాగముగనుండు నెల్లూరుపురము మొదలుకొని దక్షిణభాగమంతయు ౧౧౦౦ వఱకు నిర్జనారణ్యముగా నుండెనఁట. “నదుఃఖం పంచభిస్సహ” యన్నట్లు లైదుమండలములవా రడవిమనుష్యుల మయితిమి గావున వ్యసనము లేదు. మీఁది వాక్యములే పంతులవారి కాధారములు కాఁబోలు. “మఱియు హానుతాంగు వర్ణించిన లక్షణములన్నియుఁ గడప మండలమునకు వర్తించుచున్నవి. క్రీ. శ. ౧౮౦౦ సంవత్సరమున బ్రిటిషువారీమండలము స్వాధీనము చేసికొనుపర్యంతము దారిదోపిడి కాంత్రగుంపులచే నిండియుండి ఘోరకృత్యముల కాటపట్టయి యుండెను” అని యాంధ్రులచరిత్రము పూర్వయుగము ౩౭౮-వ పుటయందుఁ గనవచ్చుచున్నది.

దేహాళీమండల వాసులారా! దీని కేమనెదరు. పాశ్చాత్త్యులు వ్రాసిన హిందూదేశచరిత్ర మెంతసత్యమో యిదియు నంతసత్యమే యందురా? ఒకటి మాత్రము సత్యము. సత్యమెఱుఁగక మీఁది వాక్యములు చదువు పామరులు మన మండలమువారిని దారిదోపిడి గాంత్రవంశమునఁ బుట్టినవారని విశ్వసింతురు. కావుననే కదా కృష్ణా గోదావరి మండలములోని కొందఱు మనలను మన బాలురను నీచదృష్టితోఁ జూచుచు విద్యావిషయమందే గాక రాజకీయ విషయమందును దాము పల్లకి యెక్కువారనియు మనము మోయువారమనియుఁ దలంచుచున్నారు. ఇప్పుడైన దత్తమండలచరిత్ర యొకటి వ్రాయించుట యవశ్యమని మీకుబోధపడినదా? ఇఁక వీరయ్యపంతులవారి ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరము వినుఁడు. ఇప్పుడు కీర్తిశేషులైన గోపీనాధరావుగారిని వావిలికొలను సుబ్బరావుగారు గొన్నిప్రశ్నలడిగియుండిరి. వానికి వారిచ్చిన ప్రత్యుత్తరములు.

Q. Are there any temples in the Ceded districts constructed before the advent of the Vijayanagar dynasty?

A. The Ceded districts formed successively the dominions of Rashtrakutas, the W. Chalukyas and later on the Hoyslas — very flourishing dynasties, from the ashes of the last of which rose the Vijayanagar dynasty. In the palmy days

of the above mentioned families several hundreds of temples were built and many of them do stand still in spite of time and the ravages of the Mussalmans.

In Bellary Dt., Kuragodu, Kampli, Kogali, Bagali, Arubali &c. &c., belong to the W. Chalukyas.

In Kurnool Dt., Ahobilam and Sri Sailam.”

ఇవిగాక కడప సరిహద్దులలోనుండు తిరుమలయుఁ, గదిరి, పుష్పగిరి, నెందలూరు దేవాలయములును బురాతనములు.

Q. Are there any proofs of the existence of similar temples (Jaina) in the Ceded Districts?

A. There are hundreds. There is a village very near Guntakal named indifferently Konakondla, Konakundla or Kondakundi which is attempted to be identified with Kondakunda after which one section of the Jaina clergy was named Kondakundanvaya, because one inscription found in the village calls the place Kondakunda thirtha and refers to the construction of a basadi (Jaina Temple) then called Chatta Jinalaya by Navikabha, the wife of Mahamandalesvara Joginnayya rasas, a feudatory of Vikramaditya VI. (A D. 977-1128)

In Aala Haravi (in Adoni Taluk) there is an inscription dated S. 854 referring to Jainism in that part of the country.

Besides these there are Jaina temples in the Bellary Dt., which I have myself visited and they all belong to the Rashtrakuta and Chalukya periods W.

Q. From the existence of this temple (at Danavulapad) can we assume that this part of the country was once civilised?

A. I don't understand what you mean? No part of S. India was uncivilised except in prehistoric periods. Ceded Districts formed part of the Andhras (Satakarnis) the Vishnu Kundins, the Pallavas, the Eastern Chalukyas of Badami and of Kalyan, the Rashtrakutas, the Hoysalas, the Vijayanagaras—so far at least the past 2000 years it was certainly civilised and I have reason to believe very much earlier also.

గోపీనాధరావుగారు వ్రాసిన విషయములన్నియు సత్యములని చరిత్రవలన స్థాపింపఁగలముగాని గ్రంథవిస్తరభీతి విరమించెదము.

౫-వ యాక్షేపము.

“౧౩౦౦ నాటికి కడపమండల మనాగరికతస్థితిలో నున్నదనుటలో సందియము లేదు.”

సమాధానము.

నాగరికతయన నెట్టిది? జుట్టుకత్తిరింపులు, మెడపలుపులు ధరించుటలు, బీడీలు త్రాగుటలు నాగరకతా చిహ్నము లేని కడపమండల మనాగరకస్థితియందుండెనని యంగీకరించెదము. అటుగాక సర్ థామస్ మన్రోవారు చెప్పినట్లు “If a good system of agriculture, unrivalled manufacturing skill, a capacity to produce whatever can contribute to either convenience or luxury, schools established in every village for teaching, read-

ing writing and arithmetic, the general practice of hospitality and charity amongst each other and above all a treatmemt of the female sex full of confidence, respect, delicacy are among the signs which denote a civilised people, then the Hindus are not inferior to the Nations of Europe and if civilisation is to become an article of trade between England and India I am convinced that England will gain by the import cargo"

ఇది నాగరికతయగునేని యిట్టి వ్యాపారమే జరిగినయెడ నొత్తరావాసులే మేలుపడుదురనుట నిశ్చయము. రాష్ట్రకూటుల కాలమున సంస్కృత కర్ణాట భాష లిందు వ్యాపించి యుండెను. విజయరాజు 'అనుపమకవి' యని విఖ్యాతి గాంచియుండెను. చోళుల కాలమున సంస్కృత ద్రావిడములు విస్తరించి యుండెను. కాకతీయుల కాలములో సంస్కృతము వ్యాపించియుండెను. దత్త మండలములు నెల్లూరు గుంటూరు మండలములకు సర్వాధికారియై పాలించిన గంగయ సాహిణి కాలమున సంస్కృతము వ్యాపించియున్న ట్లతని సంస్కృత శాసనములే తెలుపుచున్నవి. "పుష్పగిరి మఠాధిపతులైన శివయోగీంద్రులను గణపతి దేవమహారాజు గురువుగాఁ జేకొనెను" అని వీరయ్యపంతులవారే వ్రాసిరి కదా. దానివలన మతవిషయమందును విద్యాధికులిం దున్నట్టులు తెలియరాదా? శా. శ. ౧౧౬౮ (క్రీ. శ. ౧౨౪౬) ప్లవంగసంవత్సర పుష్య శుద్ధ ౧౩ బుధవారమునాఁడు గంగయదేవమహారాజునకు భృత్యుఁడైన జొత్తి రామి నాయకుఁడు ములికినాటి సీమలోని సిద్ధవటమునకుఁ బశ్చిమమున రెండు పరువుల దూరమునఁ బినాకినీ నదీతీరంబుననున్న జ్యోతిగ్రామములోని సిద్ధ నాథుని గుడిగోపురము కట్టించి యగ్రహారము నొసంగి శాసనము వ్రాయించె నని యాంధ్రులచరిత్రమం దున్నది. దీనినిబట్టి ౧౨౦౦ వఱకు దత్తమండ లములో దేవాలయములు అగ్రహారములు లేవని వ్రాసిన వీరయ్యపంతు లెంత సత్యవాదులో మీరే యెఱుఁగుఁడు. రాష్ట్రకూటరాజుల కాలమునుండి దేవాల యములుండుట ముందే వివరింపఁబడెను. దేవాలయములు కట్టువారున్నప్పు డీ మండలమున శిల్పవృత్తులు లేవనవచ్చునా? ఉత్తమ నాగరకులైన ప్రభువులు పాలించుచుండిన యీదేశ మనాగరకరతయందుండెననుట యవిచారమూలకము "The number of pagodas in this (Sidhavattam) Taluq shows that at a remote period it must have been of great importance and was probably highly civiiised.,'—Gribbile's manual.

రామాయణమునఁ జెప్పఁబడిన విధముచూడ నుత్తరమునఁ గిష్కింధయు దక్షిణమునఁ బాండ్యనగరము నుత్తమనాగరకదశ యందుండ నీరెం

టికి నడుమ నతిదూరంబుననుండు నీమండలమెట్టు లనాగరిక దశయందుం డెనో. నాగులవిషయమై వీరభద్రరావుగారు వ్రాసిన దంతయు నీమండల మునకు నన్వయించుచున్నది. వారు కొలఁదిగ నాగరకులే యని వారు వ్రాసియున్నారు. అట్టిచో నిది యెట్టు లనాగరక దేశమాయెనో? ఈ దేశము ద్రావిడాక్రాంతమైయుండెఁగదా. "The Telugu people seem never to have possesed the architectural skill of the Tamils" అని చెప్పఁబడి యుండు టచే నీదేశ మెట్టు లాకాలమున ననాగరకదశయందుండెను. ఈమండలమున బౌద్ధులు జైనులు ప్రబలించియుండిరి. వా రనాగరకులని యెవ్వరు నన లేదు. ఆ బౌద్ధులు జైనులు దేశాంతరములనుండి వచ్చినవారుగారు. ఇచ్చటివారే మతము మార్చుకొనిరి. ఇవి యన్నియు విశదముగ విపులముగ వ్రాయవలయు ననినఁ బెద్ద గ్రంథమగును.

అయినను వీరయ్యపంతులవారు ప్రమాణముగఁ గొనిన వీరభద్రరావుగారి యాంధ్రులచరిత్రము పూర్వయుగములోనివి కొన్ని వాక్యము లను వదించెదము.

"శిలాశాసనములలో నొకటి పోర్ముఖరామపుణ్య కుమారునకును, (నెం 384 of 1904) మూఁడు చోళమహారాజునకును (నెం 405-406-408 of 1904) ఒకటి విక్రమాదిత్య చోళమహారాజునకును (నెం 400 of 1904) మఱియొకటి శక్తినర్దవిక్రమాదిత్యుని కుమారుఁడగు చోళమహారాజాధిరాజ సత్యాదిత్యున కును (నెం 393 of 1904) సంబంధించినవిగ నున్నవి. ఇవన్నియును గడపమం డలములోని ప్రొద్దుటూరు జమ్ములమడుగు తాలూకాలలోఁ గానిపించినవి. కావున వీరి రాజ్యముకూడ నచ్చట దేయై యుండుననియూహింపఁబడుచున్నది. ఈ శాసనములలో నుదాహరింపఁబడిన రాజులలో చోళమహారాజు సూర్య కులుఁడనియు, కాశ్యపగోత్రుఁడనియు, కరికాలచోడవంశజుఁడనియుఁ బేర్కొ నఁబడియుండెను. వీరు వహించిన బిరుదునామములం జూడ స్వతంత్రులుగఁ గన్పట్టుచున్నారు. వీరి శిలాశాసనములుగాని తామ్రశాసనములుగాని వీ రేకా లముననుండినదియుఁ దెలుపుచుండలేదు. వీరి శాసనములలోని లిపిని బట్టి చూడఁగ ౮-వ శతాబ్దమునకుఁ బూర్వమున నున్నవారని తేటపడుచున్నది."

"ఇంతియగాక ౧౯౦౫-వ సంవత్సరములో కడపమండలములోని పెద్ద ముడియ (ముదివేము) మను గ్రామంబున చోళమహారాజు పాలనములోని శాసన మొకటి గానిపించినది. (నెం 352 of 1905) చిప్పిలి గ్రామమునఁ గన్పట్టఁ బడిన శాసనములో నెం 299 of 1905) పుణ్యకుమారునిపేరు గానంబడు

చున్నది. అన్యవచోళుని శాసన మొకటి గానిపించుచున్నదిగాని (నెం 350 of 1905) యితఁడు పశ్చిమ చాళుక్యరాజగు నాఱవ విక్రమాదిత్యునకు లోఁబడిన మండలేశ్వరుఁడుగాని స్వతంత్రుఁడుగాఁడు. అయిన నితఁడు పైచోడవంశము లోనివాఁడుగ నుండెను. ౧౯౦౭-వ సంవత్సరములో నీ చోడుల శాసనములు మఱి మూఁడు గన్పట్టఁ బడినవి. ఒకటి ముట్టుకూరులోను, ఒకటి ప్రొద్దుటూరులోను, మఱియొకటి నల్లచెరువుపల్లెలోను, గనుఁగొనఁబడినవి. ఈ గ్రామములన్నియుఁ గడపమండలములోనివే." "కడపమండలములోని చోడులు ౭౦౦౦ గ్రామములు గలిగిన రేనాడును బాలించుచుఁ దాము కరికాల చోడ వంశజులమని చెప్పుకొనుచున్నారు."

"మదనపల్లె పెద్దతిప్పసముద్రము శాసనములలో నుదాహరింపఁబడిన గండత్రినేత్రుఁడే వైదుంబులలో స్వతంత్రుఁడైన కడపటివాఁడుగా నుండెను. ఈ వైదుంబులు ౯-౧౦ శతాబ్దముల నుండినవారు.

"నలంబవాడిరాజ్యము బళ్లారి-కడప-కందనోలు-మైసూరు మండలములలోఁ జేరియున్నది. ఈ నలంబవాడిరాజ్యము క్రీ. శ. ౭-వ శతాబ్దము మొదలుకొని ౧౦-వ శతాబ్దమువఱకు వర్ధిల్లినది."

"కాఁబట్టి మొదట దండకారణ్యమును బ్రవేశించినవా రాంధ్ర ద్రావిడులనుటకు సందియము లేదు. వీర లిప్పటికి రెండువేల యేనూఱు సంవత్సరములనాఁ డాంధ్రరాజ్యమును స్థాపించిరనుటకు సంకోచింప నక్కఱలేదు" పుట. 69-70.

బౌద్ధుల "కాలమునందు నెల్లూరు - గుత్తి - కడప - కందనోలు మండలములును, కృష్ణానదికి దిగువనుండు దేశమును, కృష్ణా గోదావరులకు నడుమ నుండు దేశము వజ్రభూమిగ (Diamond fields) వ్యవహారమునందుండెను. ఉత్తరపినాకినీనదీ ముఖద్వారమున నొక రేవుపట్టణ ముండినట్లుగ బౌద్ధుల గాథల యందుఁ జెప్పఁబడియున్నది." పుట. 74. (క్రీ. పూ. 477-323).

"బోధాయనాపస్తంబుల కాలమునాఁటి కావ్యులు పెక్కండ్రు దక్షిణాపథమునకు వచ్చి యాంధ్రదేశమున నివాసము లేర్పఱుచుకొనుచుండిరి." పుట. 75.

"కావున క్రీస్తుశకమునకుఁ బూర్వము నాలుగవ శతాబ్దమునందే యాంధ్రరాజ్యము స్థాపింపఁబడినదని స్పష్టముగాఁ జెప్పవచ్చును." పుట. 79

బళ్లారిమండలము సరిహద్దులకు నత్యల్ప సంఖ్యగల మైళ్లదూరములోఁ

బ్రకృతము నైజామురాష్ట్రములోనుండు సిద్ధాపుర మశోకునకు దక్షిణరాజధానిగా నుండెను.

"కాఁబట్టి గోతమపుత్ర శాతకర్ణికాలమున నాంధ్రరాజ్యము గంగాతీరము మొదలుకొని కాంచీపురమువఱకు వ్యాపించియుండెనని విశ్వసించుచున్నారము." (క్రీ. పూ. 133-154) పుట. 135.

"చీనాయాత్రికు లిరువురు వ్రాసిన స్థలచరిత్రవర్ణనలు శ్రీశైలమువిూఁది శివాలయమున కన్వయించుచున్నవి. శ్రీశైలమునకు శ్రీపర్వతమని సంస్కృత భాషాగ్రంథములందుఁ దఱచుగా వాడఁబడియున్నది. శ్రీపర్వతము పేరు టిబెట్ గ్రంథములందుఁ గనంబడుచున్నది. శ్రీశైల శివాలయము ప్రాచీనమైనదని చెప్పెడు గాథలుగూడ దీనిని బలపఱుచుచున్నవి. ఎన్నివిధములచేతఁ జూచినను చీనాదేశపు యాత్రికు లిరువురియొక్క వర్ణనలు దీనికే యన్వయించుచున్నవి. గనుక మన యజ్ఞశ్రీశాతకర్ణి నాగార్జునిని కొఱకు నిర్మించిన బౌద్ధసంఘారామ మదియేయని మఱియొకమాఱు పేర్కొనుచున్నారము. నాగార్జునాచార్యుఁడు క్రీ. శ. 134-200. మధ్యదేశము-కళింగదేశము-దక్షిణకోసలము-విదర్భదేశము-కొంకణదేశము-మహారాష్ట్రదేశము-దక్షిణకుంతలదేశము ఇంతయేల? పాండ్య చోళ కేరళ దేశములుఁ దక్కఁ దక్కిన దక్షిణాపథ దేశములన్నియు నాంధ్రసామ్రాజ్యమునఁ జేరియున్నవని చెప్పవచ్చును."

క్రీ. శ. ౧౩౪-నందు శ్రీశైలమున బౌద్ధారామ మేర్పడెనుగాని యందలి దేవాలయ మనాదియని యెఱుంగునది. అట్టిదే శ్రీవేంకటేశ్వరులుండు తిరుమలయు. వేంకటాద్రికి శ్రీశైలమని పేరుగలదు. 'శ్రీశైలేశ దయాపాత్ర'మ్మని వైష్ణవులు పఠింతురు. భారతయుద్ధకాలమున బలరాముఁడు తీర్థయాత్రకుఁ బోయినపుడు శ్రీశైలమును వేంకటాద్రిని దర్శించినట్లు భాగవత దశమస్కంధమున ౭౯-వ యధ్యాయంబునఁ జెప్పఁబడినది. గృహమునకుఁ గడప యెట్టిదో వేంకటక్షేత్రమునకుఁ గడపమండల మట్టిది. కావుననే దానికిఁ గడప యని పేరు. కావున నది 1100 వఱకు జనశూన్యముగ నుండెననుట పరిహాస్యము కదా.

"మొట్టమొదట ఆకాలమున అరువలైన పల్లవులు దత్తమండలములను పాలించిరి" అని వీరయ్యపంతులవారు వ్రాయుచుఁ గాలము చెప్పక దాఁచి "నందివర్మరాజు 1102-లో ప్రొద్దుటూరులో రాజ్యము చేసెను" అని వ్రాయుట యేమిచమత్కారమో. పల్లవులు దత్తమండలములను ౪-వ శతాబ్దమునఁ బాలించిరి.

"కడప - కందనోలు - బళ్లారి-అనంతపురమండలము లొకప్పుడు పల్లవ రాష్ట్రములోఁ జేరియుండెనని యిదివఱకే తెలుపఁబడియెను. 'పల్లవ సామ్రా

జ్యము విచ్ఛిన్నమైన తరువాత ౩౨,౦౦౦ గల నలంబవాడి రాజ్య మేర్పడియెను."

దత్తమండలమువారియందుండు గొప్పగుణమును జూడుఁడు. ౭-వ శతాబ్దమునందు విజయాదిత్యుఁ డయోధ్యానగరమునుండి దక్షిణాపథముమీఁద దాడివెడలివచ్చి యీదేశమును బరిపాలించుచుండిన త్రిలోచనపల్లవునితో యుద్ధముచేసి హతుఁడయ్యెను. పతివెంటవచ్చిన యాతనిపట్టమహిషి గర్భవతియైయుండి తప్పించుకొని పాఱిపోయి పెద్దముడియములోనుండిన విష్ణుభట్ట సోమయాజి శరణుచొచ్చెను. ఆయన యామెకభయహస్తమిచ్చి తన యింట నుంచుకొనెను. ఆమెను వెదకుచువచ్చిన త్రిలోచన పల్లవుఁ డావృత్తాంత మెఱిఁగి యా బ్రాహ్మణుని యింటికివచ్చి రాజస్త్రీ నీయింట నున్నది. మాస్వాధీనపఱుపుమని యడిగెను. ఆయన నాయింట నాభార్య నాబిడ్డలుతప్ప మఱియెవ్వరు లేరని వాదించియున్నవారిని గనఁబఱిచెను. అతఁ డారాజస్త్రీని సందేహించి యీ చిన్నది యెవ్వతెయని యడిగెను. ఈమె నాకూఁతురు ప్రసవార్థమై వచ్చియున్నదని సోమయాజి చెప్పెను. గ్రామములోని బ్రాహ్మణులందఱట్లే చెప్పిరి. ఈమె బ్రాహ్మణస్త్రీయగునేని యీమెచేత మీరు భుజించెదరా యని పల్లవుఁ డడిగెను. భుజించెదమని వారెల్ల నొప్పుకొనిరి. ఈవిధముగ వా రామెప్రాణమును గాపాడిరి. ఆమె కుమారుఁడే విష్ణువర్ధనుఁడు. ఈ యుద్ధము జమ్ములమడుఁగునొద్ద జరిగెను. అట్టి విద్యావంతులు యాగకర్తధురీణులు పరోపకారపారీణులు ౭-వ శతాబ్దమందే యుండిన యీమండల మనాగరికదేశ మఁట!!

శరణాగతరక్షణము దత్తమండలమువారిసొత్తు. శరణాగతుఁడైన రాక్షసునికి నభయమిచ్చిన శ్రీరామునివలె నానగొందిరాజగు జంబుకేశ్వరుఁడు కులశత్రువులలోఁ జేరిన బహాఉద్దీన్ అనువానికి నభయమిచ్చి తన్నిమిత్తముగ రాజ్యము ప్రాణము గోలుపోయెను. ఇది యనాగరకత కాఁబోలు!!!

౬.-వ యాక్షేపము.

"ఇట్టిలోకాగ్రణ్యుని మావాఁడు మావాఁడని వార్రంగలువారును కడపవారును వాదమునకు దిగినారు."

సమాధానము.

ఇది శుద్ధమైన యబద్ధము. వాదమునకు దిగినవా రోరుగంటివారును గారు ఒంటిమిట్ట వారును గారు. ఓరుగంటివారు పోతన్న బొమ్మెరయందుండెనని వ్రాసియిచ్చిరిగాని యోరుగంటియందున్నట్లు చెప్పలేదు. వాది

యోరుగల్లని వీరయ్యగారు వ్రాయుట తప్పు. లేని పెత్తనమునెత్తి పైఁబెట్టుకొని నూతనసృష్టి ప్రతిష్ఠగోరిననడుమంత్రవుఁ గొందఱు మాత్రమే వాదించుచున్నారు. ఒంటిమిట్టవారో స్వార్థరక్షణము గావించుకొనుటకై యెదుటివారి దురాక్షేపములను కుయుక్తులను ఖండించుచున్నారు. కావునఁ గలహకారకులోరుగంటి వారుగారు నొంటిమిట్టవారును గారు.

౭-వ యాక్షేపము.

ప్రభువులుపాలించు ముఖ్యపట్టనమువంకకే కవులందఱు పోవుట స్వభావము. ౧౪౦౦ వఱకుఁగల ప్రభువు లుత్తరభాగములనుండిరి కాని దక్షిణపు వైపున లేరు కావున నంతవఱకుండిన కవులందఱు నుత్తరభాగమందే కానవచ్చుచున్నారు. ఆవల దక్షిణమున విజయనగరరాజ్యము ప్రబలించెఁ గావునఁ గవులందఱు విశేషముగ దక్షిణమునఁ గానవచ్చుచున్నారు గాని యుత్తరమున లేరు. ఈ న్యాయము ననుసరించినచో బమ్మెర పోతరాజుకాలమునఁ గవులందఱు నుత్తరముననుండఁగా నతఁడుమాత్ర మొంటరిగా నొంటిమిట్టయందుండెనని యూహించుట సమంజసముగాదు.

సమాధానము.

పాలించు ప్రభువులుండుచోటికిఁ గవులుపోవుట స్వభావమని మేము నంగీకరించెదముగాని యెట్టికవులని మాత్రము ప్రశ్నించెదము. తిరిపెపుఁ గవులని ప్రత్యుత్తరముపుట్టక తప్పదు. ధనకాములగువారికి రాజాశ్రయము కావలయునుగాని "ధనమదాంధుల కొలువేల తాపసులకు" "ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి" యని వ్రాసిన పోతన్న కేరాజేరాజ్య మేలిననేమి? యాచక కవులలోఁ బోతరాజును జేర్చుట మహాపాతకము. తక్కిన కవులమార్గము ప్రవృత్తిమార్గము పోతనమార్గము నివృత్తిమార్గము. కేవల మీమార్గనిష్ఠుఁడు పోతరాజొక్కఁడే. కవికోటులెల్లఁ బోయినమార్గము విడిచి తానొక్కఁడే యసహాయుఁడై తద్భిన్నమార్గమున నెట్లు పోవసాహసించెనో, యందఱు గురుముఖమున విద్య నేర్వఁ దాను స్వయముగ విద్య నెట్లు గడించెనో యట్లే కవులందఱు గుమిగూడిన నగరంబుల విడిచి తపస్సులకు యోగ్యమై జలకాష్ఠసమృద్ధిగలిగి కేవలమహానగరముగాక కేవల పల్లియుఁగాక సామాన్యగ్రామమైన యొంటిమిట్టయందుఁ బోతరాజుండెను. యేయథామాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమన్నట్లు పోతన చిత్తవృత్తికిఁదగిన ప్రదేశమే యాయన కావాసముగ భగవంతుఁడు కుదిర్చెను.

బమ్మెర యనునది గ్రామనామమే యైనచో దానిని బోతన పూర్వపితామహులు విడిచి దేశాంతరము వచ్చియుండవలెనని వారి యింటిపేరే తెలుపుచున్నదని సుబ్బరావుగారు ముందే వ్రాసిరి. సందర్భములును దాని కనుకూలముగనున్నవి.

వీరయ్యపంతులుగారు వల్లించు ౧౩౦౦ నాఁటికి గోలకొండదేశము తురకలదాడికి నల్లాడుచుండినది. ఓరుగంటిపైఁ దురకలు దండెత్తి తత్ప్రాంతదేశమును భస్మీభూతమును జేయుచుండిరి. తురకలు గ్రామములు చూఱకొని తగులఁబెట్టి స్త్రీలనుజెఱిచి ఘోరహత్యలు కావించుచుండినట్లు చరిత్రకారులు వ్రాసియున్నారు. పోతన తాతగారికాలము నాఁటికి గోలకొండ దేశమంతయు నల్లకల్లోలముగ నుండినది. తురకలరాయిడి సహింపలేక ప్రజలల్లాడుచుండిరి. పోవననుకూలపడినవా రనేకులు వలసలుపోయి దేశాంతరగ్రామాంతర వాసులైరి. ఓరుగంటివారని యింటిపేరుగల కుటుంబములును, గోలకొండ దేశములోని గ్రామములపేర్లింటిపేర్లుగాఁ గల కుటుంబములును నీదేశమునఁ బెక్కులు గనవచ్చుట కిదే కారణము. గోలకొండదేశమువా రీదేశమునఁ బెక్కురుండుట రామయ్యపంతుల వారంగీకరించి యున్నారు. దేశవృత్తాంత మెఱుఁగని వీరయ్యగారు దక్షిణమునవా రుత్తరమునకుఁ బోయిరని వ్రాసిరి. ఆకాలమునఁ గడప కర్నూల్ మండలములు ప్రతాపరుద్రుని రాజ్యములోఁ జేరినవగుటచే నోరుగంటి ప్రాంతములనుండఁ జాలని వా రీ ప్రాంతములకువచ్చిరి. ఇట్లు తాతదండ్రులు కుదురుకొని భూములుపుత్రులు సంపాదించిన స్థలమునందే పోతరాజుండెనని యెంచుటన్యాయ్యము. కావున వీరయ్యపంతులవారు చెప్పెడు జనచలన పథము పోతరాజున కన్వయింపఁజాలదు. గోల్కొండ దేశము కూడుడికిన ట్లుడుకుచుండు సమయమున దత్తమండలములు శాంతివహించి యుండెను. ఆనెగొంది వారా కాలమునఁ బ్రబలియుండిరఁట.

ఆనెగొంది రాజులలో నందుఁడు ౧౦౧౪–౧౦౭౬

అతని కుమారుఁడు చాళుక్యుఁడు ౧౦౭౬–౧౧౧౭

విజయధ్వజుఁడు ౧౧౧౭–౧౧౫౬

ఇతఁడే విజయనగరము తొలుతఁ గట్టించినవాఁడు.

వేమరాజు ౫–౧౧౭౬

రామదేవరాజు ౧౧౭౬–౧౨౭౧

ప్రతాపరాయఁడు ౧౨౭౧–౧౨౯౭

ఇతనికొడుకే శరణాగత త్రాణపరాయణుఁడని ముందుచెప్పిన జంబుకేశ్వరుఁడు ౧౩౩౪-లో హతుండయ్యెను.

ప్రథమ హరిహరాయలు ౧౩౩౬–౧౩౫౫.

ఇతని పెద్దతమ్ముఁడు కంపభూపతి యుదయగిరి రాజ్యమును, బాలించెను. ఇతని పేరి కంపసముద్రమను నగ్రహారముచిట్టివేలునకు మైలులో నున్నది.

ఇతని తమ్ముఁడు వీరబుక్కభూపతి. ౧౩౫౫-౧౩౭౭.

నాచన సోమన కడప మండలములోని బుక్కపట్టన మీయనచే దానముగఁ గొనెను.

వీరబుక్క భూపాలునికొడుకు రెండవ హరిహరరాయలు. ౧౩౭౭-౧౪౦౪.

ఈయన కాలమునందే పోతన జనించెనని పూర్వ పండితులు వ్రాసియున్నారు.

ఈ రెండవ హరిహరరాయలకు రత్నభాండాగారాధ్యక్షుఁడుగా నుండిన వినుకొండ తిప్పనామాత్యుని కుమారుఁడే క్రీడాభిరామగ్రంథకర్త యగు వల్లభామాత్యుఁడు. ఇతఁడు ములికినాడు పాలించుచుఁ బులివెందల తాలూకాలోని మోపూరునం దుండెను. చెన్నూరు ములికినాడులోఁ జేరినదే.

ప్రథమ దేవరాయలు ౧౪౦౬-౧౪౨౨. విక్రమార్కచరిత్ర రచియించిన జక్కన యితని కాలమునాఁటివాఁడు.

ప్రౌఢదేవరాయలు. ౧౪౨౩-౧౪౪౭, ఆంధ్రభాగవత మీ కాలములో రచియింపఁబడి యుండవలయును. ఇట్లు చరిత్రములు చెప్పుచున్నవి. ఇందు సంధగ్ధములును గలవు.

ఈ రాజులందఱు సుప్రసిద్ధులు. ధర్మానురక్తులు. దేశక్షోభములేక సుభిక్షముగ రాజ్యము పాలించినవారు కావుననే యోరుగంటిలో నిలువలేనివారు వీరి రాష్ట్రములో నెలకొనిరి. వీరయ్యపంతులవారి జనచలన పథవిధము, నిర్మానుష్యవాదము అనాగరికవాద మెట్టిదో యిప్పు డాలోచింపుఁడు. ఇంత బాగుగఁ జరిత్రవిషయములు చర్చించి యిఁక వారు నామ విధమును జర్చింపఁ బ్రారంభించిరి.

౮-వ యాక్షేపము.

పోతన్నకు సంబంధించినవారి నామధేయములు పోతన్న, తిప్పన్న, సింగన్న యనునవి గోలకొండదేశమున నెక్కువ ప్రచారమున నున్నవి. కావున నాపేర్లుగలవా రాదేశమువారై యుండవలయును.

సమాధానము.

వీరయ్యగారు గోలకొండ దేశములో నెన్ని సంవత్సరములు వాసముచేసిరి? ఓరుగంటికిఁ బోయి ౧-౨ దినములుండి వచ్చినపుడు పొగబండిలోనివారు నోరుగంటిలోనివారు నీ పేర్లువ్రాసిన చీట్లను ముఖములకుఁ గలిపించుకొనియుండ లెక్కించిరా? లేక యెదుటఁబడిన వారినెల్ల మీ పేరేమని యడిగిరా? నూటికెందఱైన విశేషముగనున్నవా రనవలయును? వీ రెందఱ లెక్కించిరి? వాదము నిమిత్తమై వాదించువారి వ్రాఁత లట్లుగాక మఱి యెట్లుండును?

“పోతన యను నామము పెన్నకును గోదావరికిని మధ్యప్రదేశములో నెక్కువ వాడుకలో నున్నట్లు గన్పడుచున్నది. అంతమాత్రముచేత నాపేరు దత్తమండలములలో లేదన వీలులేద”ని పంతులవారే వ్రాయుచు మరల నేల యాక్షేపించిరో?

సాధారణముగా మన నామములు దేవతానామధేయములుగా నుండును. ఏ దేశమున నేసుప్రసిద్ధ దేవతామూర్తి యుండునో యా దేశమునఁ, దత్ప్రాంతముల నా దేవుని నామము పెక్కురకుండుట సహజము. భద్రిరెడ్డి భద్రారెడ్డి, భద్రప్ప లోనగుపేర్లు భద్రాద్రిసమీపమ్మున నున్నట్లు మన మండలముల నున్నవా? అట్లులే రంగయ్య, శేషప్ప, వేంకటయ్య, వెంగయ్య, తిరుమలయ్య యోబయ్య లోనగు నామములు మన దేశముననున్నట్లు దూరదేశమున నుండునా? వాస్తవమిట్లుండఁ బ్రసిద్ధుఁడగు దేవుఁడుండుచోట నాదేవుని పేరిటివా రరుదనియుఁ దదితరస్థలములం దెక్కువగానున్నారని వాదించునారు ధర్మవాదులా?

శివునకు నంది వాహనము. శివభక్తులు నందికిఁ దెనుఁగునఁ జెప్పఁబడు బసవయ్య, బసవన్న, బసన్న, బసప్ప, బసవరాజు, బసిరెడ్డి లోనగు పేర్లును, బోతన్న, బోతరాజు, పోతిరెడ్డి లోనగు పేర్లును ధరింతురు. ఈ పేర్లు శైవులుండు దేశములం దన్నిటనుండునుగాని యొకచోట నుండి యొకచోట నుండవనుట యవిచారమూలకము. మహానంది, శ్రీశైలము లోనగు శివక్షేత్రములు భైరవాలయములు దత్తమండలములందుఁ బెక్కులు గలవు. శివాలయములు శివశక్త్యాలయములున్నచోటుల నెల్ల బసవన్నలు పోతన్నలు నుండనే యుందురు. ఇది యాబాలగోపాల మందఱెఱింగినవిషయము. సర్వ సాధారణమైన పోతనామధేయము మన మండలముల లేవనుట యతిసాహసము. కావుననే కదా లేవని వీరయ్యపంతులవారు చెప్పలేకయు వాదాభిమానముచే

వృథా లేవనిరి. పోతవరము, పోతురాయి, పోతలరాయఁడు, పోతిరెడ్డి పోతప్పతోట్టి యను పేర్లెన్నియో మన మండలములఁ గలవు.

ఇఁకఁ దిప్పయ్యపేరు చూతము. తిప్పశబ్దము త్రిపురాంతక శబ్దభవము. త్రిపురాంతక దేవుఁడు, త్రిపురాంతక గ్రామము రెండును గందనవోలు (కర్నూల్) మండలములోని మార్కాపురము తాలూకాలోనివి. కావునఁ దిప్పన్న, తిప్పయ్య, యను పేర్లు మన దత్తమండలములలోఁ బుట్టి యావల నితరమండలములకుఁ బోయెను. వాస్తవమిట్లుండ నీపేర్లు గోలకొండ దేశములో నున్నవని మన మండలములలో లేవని వీరయ్యపంతులవారు వ్రాయుటకేల జంకు గొనరైరో. తిప్పశబ్ద ముపసర్గగాఁగల గ్రామము లెన్నియున్నవో చూడుఁడు.

కల్లూర్ తిప్పాయపల్లె. తిప్పనూరు (క) తిప్పరాజుపల్లె, తిప్పిరెడ్డి పల్లెలు ౨, త్రిపురవరము, తిప్పలూరు, తిప్పలూరు నుంకేసుల, తిప్పాయపల్లె, తిప్పనపల్లె, (అనంత) తిప్పేపల్లి తిప్పాభట్లపల్లి, (బ) తిప్పేహాళ్లి. గ్రామముల పేర్లిన్ని యుండినయెడ మనుష్యుల పేర్లెన్నియుండునో యాలోచింపుఁడు.

ఇఁక సింగనపేరు విచారింతము. జ్వాలా నరసింహమూర్తి, లక్ష్మీ నరసింహమూర్తి, ఉగ్ర నరసింహమూర్తి, అహోబల నరసింహమూర్తి, కదిరి నరసింహమూర్తి, పెనుసెల నరసింహమూర్తి, తరిగొండ నరసింహమూర్తి లోనగు నరసింహక్షేత్రములు మన మండలముల నుండఁగా నీపేరు మన దేశమున లేదనుట యెంతటి తెంపరితనము. వీరయ్యపంతులవారి మడికిసింగన తనకా పేరెట్లుగలిగెనో తానే యిట్లు వ్రాసెను.

చం. ఒనరఁగఁ దద్విధూవరు లహోబలదేవునిఁ గొల్చి తద్వరం
బున నొగి సింగనార్యుని నమోఘ గుణాఢ్యు ననంతుని న్మహీ
జననుతు నబ్బయాంకు బుధసన్నుతి పాత్రుని నారయాహ్వయుం
గని నరసింహనామములు గారవ మారఁగఁ బెట్టి రందఱున్.

క. వారలలో నగ్రజుఁడను, వారిజదళనయనచరణవారిజసేవా
సారమతి నతులవాక్య, శ్రీరచనాచతురమతిని సింగాహ్వయుఁడన్.

ఇఁక నెల్లన కేసన యనుపేర్లు విచారింతము.

ఎల్లన, ఎల్లమ్మ, ఎల్లారెడ్డి, ఎల్లప్ప, యీ పేర్లు మన మండలముల నరుదఁట. ఎల్లారెడ్డిపల్లె, ఎల్లమరాజుపల్లె, ఎల్లమపేఁట యీ గ్రామములు మన కడప మండలమందే గలవు. కేసాపురము అనంతపురమందుఁ గలదు. కేశ

వయ్య, కేశిరెడ్డి లోనగు నామములు గలవా రెందఱో గలరు. కేశవరావు మనసభయందే కలఁడు.

అయ్యలరాజు రామభద్రకవి యొంటిమిట్టవాఁడై యుండ నాయనకూడ తమవాఁడేయని చెప్ప సాహసించి మడికిసింగన్నతండ్రి యయ్యలయ్యగనుక యయ్యలరాజువారు తమ దేశమువారని యక్కడనుండి యిక్కడికి వచ్చిరని వీరయ్యపంతులవారు వ్రాసిరి.

ఆర్యశబ్దభవము అయ్య. అనుబంధమైనపు డిది పూజ్యవాచకము. దీనిని దండ్రి శబ్దమునకుఁ బర్యాయముగ వాడుటగలదు. నాయన శబ్దమువలెఁ బుత్రపర్యాయముగను వాడుటగలదు. ఉదా. "అయ్యల్ వచ్చెగదయ్య." ఇది పురుషనామముగ వర్తకులయందును గానవచ్చుచున్నది. ఇట్టి తద్భవపద మొక దేశమునకుఁ గట్టుగుత్తకాదు. మడికిసింగన్న తన గురువు నిట్లు వర్ణించియున్నాఁడు.

కం ధర నిహపరములకును గురు, చరణంబుల యూఁతలగుట చర్చించి మదిం
బరవాది భద్రవారణ, హరిముఖ్యులఁ దిరుమలయ్యలార్యులఁ గొలుతున్

ప్రతివాది భయంకరము వా రెచ్చటివారో యంద ఱెఱింగిన విషయమే. మడికిసింగన్నగురువే తిరుమలయ్యలార్యులయినపు డాపేరీప్రాంతములఁ బ్రచారములేదనుట యేమి న్యాయ్యము. మీఁద నుదాహరించినది తాళపత్రపాఠము. ఇఁక వీరయ్యపంతులు బి.ఏ. బి.ఎల్, గారు శైలిని విచారించుచున్నారు.

౯-వ యాక్షేపము.

"శ్రీనాథుఁడు దీర్ఘసమాసములను వివిధములుగ నుపయోగించుచు సంస్కృతపదములను హెచ్చుగావాడియుండ పోతనామాత్యుఁడు తన గ్రంథములను శబ్దాలంకారములతో నింపివేసెను. ఇద్దరు కవులగ్రంథరచన లొక్కమాదిరిగ నుండినచో వారు సమకాలీనులైనయెడ వారు సామీప్యనివాసులై యొకరి కవిత్వము నొకరు తెలిసికొని యున్నవారని నిర్ధారణజేయవలెఁ గాని వారిలో నొక రుత్తరధ్రువంబున మఱియొకరు దక్షిణధ్రువమున నున్నటుల నిర్ధారణ జేయుట సహజము గాదు".

ఈ వాక్యమున విషయదోషములు రెండు గానవచ్చుచున్నవి. ఒక గ్రంథమున సంస్కృతశబ్దము లెక్కువగ వాడియుండి వేఱొకగ్రంథమున శబ్దాలంకారములు విశేషించియుండెనేని రెండును రచనయందు సమానములఁట.

మహాస్రగ్ధర. దమయంతీకేళిధాత్రీధరశిఖరహరిద్రత్న భావర్భసందో
హానుజాండాఘాతభగ్నస్యదభవమదతావాప్తలజ్జావనమ్ర
త్వముమైయుత్తానగామ్యత్వసురభినదనాంతస్థమైలీలనత్య
గ్థము గోగ్రాసప్రదానవ్రతసుకృతము ఘోరంబుగా వీటికిచ్చున్

ఇది శ్రీనాథుని కవిత్వము. సంస్కృతపదభూయిష్ఠము.

ఉ. పుణ్యుఁడు రామచంద్రుఁ డటఁ బోయి ముదంబునఁ గాంచె దండకా
రణ్యముఁ, దాపసోత్తమ శరణ్యము, నుద్ధతబర్హిబర్హలా
వణ్యము, గౌతమీవిమలవాఃకణ పర్యటన ప్రభూతసా
ద్గుణ్యము, నుల్లసత్తరునికుంజవరేణ్యము నగ్రగణ్యమున్

ఇది పోతనకృతము. అంత్యానుప్రాసయుక్తము. ఈ రెండుపద్యము లొక్కమాదిరి యఁట. మే మలంకారశాస్త్రజ్ఞులను గొందఱ విచారించితిమి. పంతులవారు చెప్పు రెంటికిఁ బోలికలేదని చెప్పిరి.

రెండవది. రచన లొక్క మాదిరిగనుండినయెడ వారు సమకాలికులైరా యొకరికవిత్వము నొకరు తెలిసికొని వ్రాసినారని యెంచవలయునఁట. అనఁగా నొకరిపద్యములను మఱియొకరుచూచి యట్టి పద్యములను దాము వ్రాసికొనుదురని యర్థము. జీవత్కవు లొకరినిజూచి మఱియొకరు వ్రాసికొనెడి యాచారము లేదు. గౌరవముమీఁద దృష్టిగల కవియట్లు చేయఁడు. సంప్రదాయజ్ఞులట్టి యాచార మంగీకరింపరు. ఇరువురు భిన్నకవులు సమానకాలమువారేకవిధమైన శైలిగలపద్యములు దైవికముగ వ్రాయవచ్చును. వారిరుచు లేకవిధముగ నుండవచ్చును. ఆ మాత్రమున నొకరినిజూచి మఱియొకరు వ్రాసినారను సిద్ధాంతము సరిగాదు. కావున వారు సమీపగ్రామమందే యున్నవారను రాద్ధాంత మంతకంటెఁ దప్పు. దేశాంతర కాలాంతరములం దున్నను గవితయందుఁ బోలికయుండవచ్చును. ఒక యింటనున్నను బోలికలేక పోవచ్చును. తిక్కనశైలి తిక్కనశిష్యునికిఁ బోతనశైలి పోతనశిష్యునకు రాలేదు. గగనఘనికానికిని నాకధునికానికిని భేదములేదా? కావునఁ బంతులవారి తర్కము కవితాజ్ఞానముగల వా రంగీకరింపరు. షేక్స్పియర్ - పింగళిసూరన సమకాలికులు, Comedy of Errors లోను, గళాపూర్ణోదయములోను గల నాయకుల రూపసామ్యకథన మెవరిని జూచి యెవరు గ్రహించిరి?

"………Beware
Of entrance to a quarrel, but being in
Bear it that the opposed may beware of thee."—Shakespeare.

క౦. ఎవ్వనితో నెచ్చోటం, జవ్వకుఁ జేసాఁచవలదు; చేసాఁచినచో
నివ్వలనవ్వల నెవ్వగు, నవ్వకయుండంగఁ బగసనందీర్పందగు. శ్రీనాథుఁడు.

౧౦-వ యాక్షేపము.

౧౩౦౦-వ సంవత్సరములో చందోలులోనుండిన మంచన యనుకవి కేయూర బాహుచరిత్రమునందు "బాలరసాలసాల నవపల్లవకోమల కావ్యకన్యకన్" అనుపద్యము రచించినటుల గన్పట్టుచున్నది. ఈ పద్యము పోతన రచితమని కొందఱందురు. అట్టి పద్యరచన యే కవిదైనను చందవోలునుంచి వార్రంగలు ప్రాంతమునకుఁ గల రాకపోకల వల్ల నట్టి వ్యాప్తి సాధ్యమగును గాని ఒంటిమిట్ట కట్టి యవకాశము లేదు"

సమాధానము.

అవకాశమేల లేదు? ఒంటిమిట్ట యా కాలమున జనశూన్యమైన మహారణ్యములోఁ బ్రవేశనిర్గమోపాయములు లేని స్థితిలోనుండెనని పంతులవారి భ్రమ గనుక. గోలకొండ దేశమునకుఁ గడపకుఁ గాని కృష్ణాగోదావరీ మండలములకుఁ గడపకుఁ గాని రాకపోకలకు మార్గములు లేవని యచ్చటివా రచ్చటనే, యిచ్చటివా రిచ్చటనే, యుండిరని యభిప్రాయపడుట తప్పు. ప్రజలకేగాక గొప్ప సేనలకును రాకపోకలకు మార్గములుండెను. ఆర్యులారా! మంచన ౧౩౦౦ లోనుండినవాఁడు. భాగవతము ౧౪౨౦ ప్రాంతములో రచింపఁబడి యుండవలెను. వీరయ్యపంతులవారి యభిప్రాయ ప్రకారము ౧౩౬౦ లో రచింపఁబడినది. మంచనగ్రంథము ౬౦-౧౨౦ సంవత్సరములలో ౧౦౦ మైళ్లకు లోపుగానుండు దేశములో వ్యాప్తికాలేదని మీరు విశ్వసింతురా? చందవోలు గుంటూరుమండలమున నున్నదని వింటిమి. అక్కడిగ్రంథ మిక్కడికి నధమపక్షము ౬౦ సంవత్సరములలో వచ్చియుండదా! తక్కిన గ్రంథము లెట్లువచ్చెను? "సాధ్యమైనంతవఱకు పుక్కిటి పురాణగాథలను చాటుపద్యములను చర్చకు దెచ్చుట లేదు. అట్టివి విశ్వసనీయములు గావు. నా వాదమంతయు లిఖితసాక్ష్యముపై యాధారపడి యున్నది" యని వీరయ్యపంతులవారు ప్రతిజ్ఞాదికము పచించిరి కదా. ఈ నియతి యిప్పు డేకృష్ణలోఁ గలసెను? దీనివలన శ్రీనాథపోతన సంభాషణము వా రంగీకరించిన వారైరి.

౧౧-వ యాక్షేపము.

"భోగినీదండకము యొక్క శైలినిబట్టి పెక్కండ్రు భాషాభిమానులయ్యది పోతనామాత్య రచితమని యభిప్రాయపడియున్నారు. సింగమనీని సాంగత్యము పోతన కబ్బుటకు ఒంటిమిట్ట యెప్పటికి సాధనము కాఁజాలదు. సింగమనీనికి నొంటిమిట్ట కెట్టిసంబంధమును లేదు."

సమాధానము.

ఈ న్యాయవాదులుగారు సర్వజ్ఞసింగమనీని గుఱించి వ్రాయుచు "సర్వజ్ఞసింగమ నీడను నామాంతరముగల రావుసింగన్న భూపాలుఁడు వేంకటగిరికిఁ బ్రభువైన విద్వత్ప్రభావు" అని యొకచోటను "తాతయగు రేచర్ల సింగమనీడు వార్రంగలు ప్రాంతమున నుండఁగా వారి కొమారుని కొమారుడైన సర్వజ్ఞ సింగమనీడు వెంకటగిరి ప్రాంతమునకుఁ బోయియుండవచ్చును." అని వేఱొకచోటను వ్రాసిరి. ఆర్యులారా! తాత యోరుగంటి ప్రాంతమున నుండ సింగమనీఁడు వేంకటగిరికి రావచ్చునఁట. బమ్మెర పోతనతాత యోరుగంటిప్రాంతములనుండి యొంటిమిట్టకు రాఁగూడదఁట! వీరి వాదప్రకారము సింగమనీఁడు వేంకటగిరిలోనుండిన నొంటిమిట్టయోనుండు పోతనకేల సంబంధము లేక పోవలయునో దేశజ్ఞానముగల వా రాలోచింతురుగాక. వేంకటగిరికి, నొంటిమిట్టకు వెలిగొండ, చింతరాజుపల్లె మీఁదుగ రెండు దినముల ప్రయాణము. ఈ మార్గమున నిప్పటికి రాకపోకలున్నవి. సర్వజ్ఞసింగమనీఁ డాకాలంబున వేంకటగిరియందుండెనను విషయ మొక్కదానిని వీరయ్యపంతులువారు స్థాపించిరేని యొంటిమిట్టవాదులకెంతో యుపకారము చేసినవారగుదురు కాని యదివ్యర్థాభిలాషయనియు బి.ఎ., బి.ఎల్., గారు విపరీత కరణిసాధించినను సింగమనీఁడు వేంకటగిరికి రాఁజాలఁడనియు నెఱుంగుదుము. ఇంకొక చిత్రము కనుఁడు. సింగమనీఁడు ౧౪౨౨-లో నుండెనని యాంధ్రకవుల చరిత్రమున నుండ ౧౩౪౫-లోఁ బోతన సింగనల యౌవనదశలో భోగినీదండకము రచియింపఁబడెనని వీరయ్యపంతులవారి విపరీతవాదము.

౧౨-వ యాక్షేపము.

"భాగవతశైలికిని పద్మపురాణశైలికినిగల సంబంధమును దెలిసికొనుటకై రెండుపద్యముల నీదిగువ వ్రాయుచున్నాను.

ఉ. వేణివిలోలనీలజలవేణి, విశాలపవిత్రసైకత
శ్రోణి, మరాళచక్రకుల సుస్వరవాణి, సరోరుహోల్లస

త్పాణి, సద్భక్తిమజ్జనవిధానవిశారద నాకలోకని
శ్రేణి, మహాఘశాత్రవ విశిక్షణశాతకృపాణి, యెల్లెడన్. పద్మపురాణము.
ఉ. క్షోణితలంబు నెన్నుదురు సోఁకఁగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికిఁ, జంచరీకచయ సుందరవేణికి, రక్షితామర
శ్రేణికిఁ, దోయజాతభవ చిత్తవశీకరణైకవాణికిన్
వాణికి, నక్షదామశుక వారిజపుస్తకరమ్యపాణికిన్. భాగవతము.
ఉ. ఆతరుణీలలామకుఁ బ్రియంబుగ వేచని కాంచె నాజగ
త్పూతము, నక్షయార్తిపరి భూతివిధాన సమర్థసత్ఫల
వ్రాతము, నవ్యపుష్పమకరంద విలోలుపమత్తషట్పదో
పేతము, దత్తనిర్జర సమీహితజాతము, పారిజాతమున్. పద్మ.
మ. హరి కేలం బెకలించి తెచ్చి భుజగేంద్రారాతిపైఁ బెట్టెనుం
దరగంధానుగతభ్రమద్భ్రమరనాద వ్రాతమున్, బల్లవాం
కురశాఖాఫల పర్ణపుష్పకలికా గుచ్ఛాదికోపేతమున్
గిరిభిత్త్రాతముఁ, బారిజాతము, త్రిలోకీయాచకాఖ్యాతమున్. భాగ.

పైపద్యముల రచనలంబట్టి కవులిరువురును ఒక్కవిధమైన శబ్దాలంకార ప్రియులని దెల్లమగుచున్నది. పద్మపురాణమునకును, భాగవతగ్రంథమునకు రచనకాలములో విశేష వ్యత్యాసముండినయెడల రామగిరి యొంటిమిట్టల మధ్య నీగ్రంథసంచారమున కవకాశముండెడిది. అంతట నొకరిగ్రంథము నొకరనుకరించిరనఁదగును కాని యిందుకు విరుద్ధముగ పదునాల్గవ శతాబ్దమున అచ్చులేనికారణమున గ్రంథములు తాళీదళ సంపుటములలో వ్రాయఁబడియుండ రామగిరినుండి యొంటిమిట్టకు ప్రయాణసౌకర్యములు లేనికాలమున కవులలో నేకాభిప్రాయములు నేకశైలి గలుగుటకు నన్యోన్యగ్రంథావలోకనావకాశంబు సమకాలీనులగు కవులయెడ ప్రాముఖ్యముగ నెంచఁదగిన విషయముగ పరిగణించుచో నట్టి పరిస్థితి పోతన రామగిరికి సామీప్యమున నున్నవారంగల్లుననుండిన సాధ్యమని స్థిరపడుచున్నది."

సమాధానము.

i, జీవత్కవులు సమానులుగ నుండువారు ప్రతిష్ఠాకాముకు లొక్కరి గ్రంథముఁ జూచి మఱియొకరు వ్రాసికొనుదురనుట యాచారవిరుద్ధము. కావున నట్టివాదమే సాధువుకాదు. స్పర్ధయుండెనేని యొకరిగ్రంథము వెలువడిన తరువాత నొకరినొకరుమించ వ్రాయయత్నింపవచ్చును.

సింగన్ననుజూచి యతనిమించఁ బోతన్న వ్రాసెననుట దుర్వాదము.

ii. ఇరువురును వాణి, పారిజాతము వీనికనుప్రాసములు గూర్చిరి వాణికి - వాణి-పాణి- వేణి-శ్రోణి - నిశ్రేణి - రాణి యిట్టి యల్పసంఖ్యాకపదములు తప్ప వేఱుపదములు రావు. భిన్నులుగాక కవి యొకఁడేయైనను భిన్నస్థలముల వాణి శబ్దమునే గ్రహించి యంత్యానుప్రాసములు గూర్పఁ దలఁచెనేని యా పదములే మరల మరల రాక తప్పదు. అట్లుతే పారిజాతమునకును. ఈ రెండు పద్యము లొకరిని జూచి వేఱొకరు వ్రాసిరనుట దుష్టము.

గీ. వాణి నజురాణి ఘననీలవేణి మధుర, వాణిఁ బల్లవ సంకాశపాణిఁ బృథుల
సైకత శ్రోణినాత్మలో సన్నుతింతు,సుమధుమధుర సుధావచస్స్ఫూర్తికొఱకు.

ఇందొక సైకతశ్రోణి కాననచ్చుచున్నది. సమకాలికులైనను భిన్నకాలికులైనను వాణి శబ్దమున కనుప్రాసము గూర్చినచో నా 5–6 శబ్దములలోఁ గొన్ని రాక తప్పవు. ఈయన వెనుకటికవి కావున ననుకరించె ననినను బోతన్నకు సమకాలికుఁడైన గౌరన

ద్వి. వల్లకీమృదుపాణి, వరనీలవేణిఁ బల్లవారుణపాణిఁ బరమకల్యాణిఁ
జారుహారశ్రేణి, సైకతశ్రోణి వారిజాసనురాణి వాణిఁ బ్రార్థించి"

యని వ్రాసియున్నాఁడు, ఈయన యెవరి ననుకరించెనో లేక పోతన సింగన గౌరనలో నెవరి నెవ్వరనుకరించిరో వీరంద ఱొక్కచోఁ గూర్చుండి వ్రాసిరో యీయనుకరణసామ్యమిందుఁదప్ప మఱి యెన్నిచోటులనున్నదో పంతులవారు సెలవీయఁ బ్రార్థితులు.

కం. పాడిరిగంధర్వోత్తము, లాడిరి రంభాదికాంత లానందమునన్
గూడిరి సిద్ధులుభయముల,వీడిరిచారణులు మొరసె వేల్పులభేరుల్.భాగ.
కం. ఆడిరి యచ్చరలేమలు, పాడిరి గంధర్వపతులు పరమమునీంద్రుల్
గూడిరిబహువిధములఁగొని, యాడిరి యందందయద్భుతావహభంగిన్.
శ్రీనాథుఁడు భీమఖండము.

శ్రీనాథపోతన లొక్కవిధముగ నీపద్యముల నెప్పుడొకరిని జూచి వేఱొకరు వ్రాసిరి?

iii. గోలకొండదేశమునకుఁ గడపమండలమునకు రాకపోకలు లేవనుట కేవలమసత్యము. చరిత్రమునకు విరుద్ధము.

iv. పోతన్నకు సింగన్నకుఁగూడ ననుప్రాసములందుఁ బ్రీతిపుట్టించిన వారు వేఱుగనున్నారు. వీరు భాస్కర రంగనాథ నాచన సోమనాదులు.

కం. రాముఁడు మేచకజలద, శ్యాముఁడు సుగుణప్రభావ సంయామి వినుత
స్తోముఁడుగిరిజాధిపనుత, నాముఁడువాక్రుచ్చెఁగుశికసంయమితోడన్.

భాస్కర రామాయణము.

కం. రాముణ్ మేచకజలద, శ్యాముణ్ సుగుణాభిరాము, సద్వైభవసు
త్రాముణ్, దుష్టనిశాటవి, రాముణ్, బొమ్మనియెంబంక్తి రథుఁ డడవులకున్

భాగవతము.

సీ. తాలంబ! కానవే తాలఫలస్తని, కుందంబ! కానవే కుందరదనఁ
దిలకంబ! కానవే తిలకగమ్యలలాటఁ, గమలంబ! కానవే కమలవదన
హరిణంబ! కానవే హరిణబాలేక్షణ, సింహంబ! కానవే సింహమధ్యఁ
బికరాజ! కానవే పికమంజులస్వనఁ, గీరంబ! కానవే కీరవాణి
గీ. లలితకలభంబ! కానవే కలభగమన, బంధుజీవము! కానవే బంధుజీవ
మైనజనకనందనసీతననుచు రాముఁ, డచటనచటనీగతివానినడిగియడిగి.

భాస్కర రామాయణము.

సీ. పున్నాగ! కానవే పున్నాగవందితుఁ, దిలకంబ! కానవే తిలకనిటలు,
ఘనసార! కానవే ఘనసారశోభితు, బంధూక! కానవే బంధుమిత్రు,
మన్మథ కానవే మన్మథాకారుని, వంశంబ! కానవే వంశధరునిఁ
జందన! కానవే చందనశీతలుఁ, గుందంబ! కానవే కుందరదను
గీ. నింద్రభూజమ! కానవే యింద్రవిభవుఁ, గువలవృక్షమ! కానవే కువలయేశుఁ
బ్రియకపాదప! కానవే ప్రియవిహారు, ననుచుఁ గృష్ణుని వెదకిరయ్యబ్జముఖులు

ఇట్టివి మఱియుఁ గొన్ని గలవు.

ఇఁక నాచనసోముని హరివంశములోని కొన్ని పద్యము లనువదించెదము. వానిని బఠించి నాచన సోమన్నకుఁ బోతన్నకు నెక్కువ సంబంధమును గల్పింపవలయునో లేక పోతన్నకు సింగన్నకే యెక్కువసంబంధము కల్పింపవలయునో సాహిత్యజ్ఞానము గలవారు పరిష్కరింతురు గాక. నాచనసోమునిపద్యము లుదాహరించుటకు ముం దాయన యెక్కడివాఁడో పరికింతము.

నాచనసోమన్న బుక్కరాయలచేఁ గడపమండలములోని జమ్ములమడుఁగు తాలూకాలోనుండు బుక్కపట్టన మగ్రహారముగా ౧౩౭౦-వ సంవత్సరమందుఁ గొన్నవాఁడు. హరివంశము దానికిముందే వ్రాసెనో వెనుకనే వ్రాసెనో తెలియదు. ౧౪౦౦వఱకు బ్రతికియున్నట్టు లూహింపవచ్చును. పోతన్న ౧౩౭౫-లోఁ బుట్టినట్టు పూర్వులు చెప్పియున్నారు. నాచనసోముని వార్ధకదశ పోతన బాల్య

కౌమారము లొక్కటైయుండవచ్చును. వార్ధకదశయందు సోమన తనసగ్రాము ముబుక్కపట్టనములో నుండెనని యూహించుట లోకవిరుద్ధము గాదు. బుక్కపట్టనమొంటిమిట్టకు ౫౦ మైళ్ల దూరముననున్నది. నాచన సోమన్న మరణించు నప్పటికిఁ బోతనయించుమించుగ నిరువదియేండ్లవాఁడై యుండవచ్చును. కావునఁ బోతరాజట్టి మహాకవితో మాట్లాడియు నుండవచ్చును. బుక్కపట్టనము దానము గొన్నవారిలో సర్వజ్ఞ సింగయ్యయను బ్రాహ్మణుఁడొక్కఁడుగలఁడు. పోతన సూచిన సర్వజ్ఞసింగన యీయన యేమో? సర్వజ్ఞసింగన్న సమాచారమిప్పటి కప్రస్తుతము కావున నది యటులుంతము. నాచనసోమన కడపమండలమునకు సంబంధించిన వాఁడని మీఁదఁ జెప్పితిమి. ఇఁక నతని కవిత్వమునకుఁ బోతన కవిత్వమునకుఁ గల తారతమ్యము పరిశీలింతము.

చ. చనిచని కాంచె నంత ఋషిసంహతి సారసకేసరాంతరా
సనసరసాళిసంగఁ, దటచందన శాఖిచలత్తరంగఁ, గాం
చనసరసీ జలార్ద్రయతిసంచిత సైకతలింగ, గంగ, నం
జనగిరిగాఢగంధగజసంగతశృంగ రథాంగ నర్తకిన్.

చ. కదసితి మంతదంత పరిఘద్విపఖండితదేవదారువున్
మదనవినోదకం దళిత మానసమానస వాసభీరువున్
బ్రదరపదాచ్యుతక్రకచపాటితలస్తకదేశచారువున్
ముదితచమూరువున్ ఫలిత మూలినమేరువు, నాసు మేరువున్.

ఇట్టి యంత్యాను ప్రాసంబులఁగల పద్యంబులు హరివంశంబునఁ బెక్కులున్నవి.

సీ. అభ్రంకషంబైన యాలపోతు నితండు, త్రుంచినాఁడీతండు పెంచినాఁడు
సీ. సారసంబున లేవ నీరసంబునఁ జావఁ, బద్మాసనుఁడు వీరిపాలఁగనియె

ఇట్టి చమత్కారంబులును హరివంశంబునఁ గలవు. భాగవతంబున నంత్యానుప్రాసంబుల గుఱించి చెప్పవలసినపనియే లేదు.

కం. అతని సుతుఁడు భగీరథుఁ, డతితప మొనరించికనియె నత్యుత్తాపాంగన్
సుతరంగన్ ముఖవనరుహ, రతభృంగన్ శివజటాగ్రరం గన్ గంగన్.

ఇట్టివి నూర్లకొలఁది గలవు. ఇట్టిసామాన్యపద్యముల విడిచి విశేషపద్యములఁ బరికింతము. సత్యభామ నరకాసురునితో యుద్ధముచేయు విషయము శ్రీభాగవతమున లేదు. అట్లుండియు నాచనసోమనహరివంశములో

సీ. తంత్రీవినోదంబు తడవుసైఁ పనిప్రేళ్లు, గోనయంబు తెగలపైఁ గోరిగనుట
యస్త్రంబు పిడిముట్ట నలయుపాణితలంబు, లస్త్రకంబిఱియింప లావుకలిమిఁ

జెలికత్తె కొత్తిలి పిలువలేనియెలుంగు, సింహనాదంబుచేఁ జెదర కునికి
ప్రమదనర్తన కేళిఁ బలురమింపనిపదం, బైదురాణంబుల నలఁతఁ బడమి
గీ. సోయగపుఁ జిత్రరూపంబుఁ జూచుచోట, వేసరువిలోచనంబులువికృతదైత్య
లక్ష్యమీక్షించుటయు మొక్కలంపుఁ దెంపు, గైకొనియె సత్యభామ సంగ్రా
[మసీమ. ఉహరి.

అని యిట్లు వ్రాయఁగాఁ బోతన భాగవతములో

సీ. బొమ్మపెండ్లిండ్లకుఁ బోనొల్ల నను బాల, రణరంగమున కెట్లు రాఁదలంచె
మగవారిఁగనినఁ దా మఱుఁగు చేరెడునింతి, పగవారిగెల్వ నేపగిదిఁ జూచెఁ
బసిఁడి యుయ్యెలలెక్క భయమందు భీరువు, ఖగపతిస్కంధమే కడిఁదినెక్కె
సఖుల కోలాహల స్వనములో ర్వనికన్య, పటహ భాంకృతుల కెబ్భంగినోర్చె
గీ. నీలకంఠములకు నృత్యంబుఁ గఱపుచు. నలసి తలఁగిపోవు తలిరుఁబోఁడి
యేవిధమునఁనుండె నెలమినాలీఢాది, మానములను రిపులమాన మడఁప
సీ. వీణెఁజక్కఁగఁబట్ట వెరవెఱుంగనికొమ్మ, బాణాసనం బెట్లు పట్టనేర్చె
మ్రాఁకునఁదీఁగె గూర్పంగ నేరనిలేమ, గుణము నేత్రయధనుఃకోటిఁగూర్చె
సరవిముత్యము గ్రువ్వఁ జాలనియబలయే, నిపుణత సంధించె నిశితశరముఁ
జిలుకకుఁ బద్యంబు చెప్పనేరనితన్వి, యస్త్రమంత్రములెన్నఁ డభ్యసించెఁ
గీ. బలుకుమనినఁ బెక్కుపలుకని ముగుదయే, గతినొనర్చెసింహ గర్జనములు
ననఁగమెఱసెఁ ద్రిజగదభిరామ గుణధామ, చారుసత్యభామ సత్యభామ

అని వ్రాసెను.

ఇవి నాచనసోమన పద్యములకంటె బాగుండవలయునని వ్రాసిన వవునో కాదో తిలకింపుఁడు. మఱియు సోమన

మ. అరిఁ జూచుఁ, హరిఁ జూచుఁ జూచుకములందందంద మందారకే
సరమాలామకరంద బిందుసలిల స్యందంబు లందంబులై
తొరుఁగం, బయ్యెదకొంగొకింత దొలఁగఁ, దోర్దోశరాసారముఁ
దరహాసామృత పూరముఁ, గురియుచుం దన్వంగి కేళిగతిఁ.

అని వ్రాయఁగాఁ బోతన

మ. పరుఁ జూచుఁ, వరుఁ జూచు, నొంప, నలరింపఁ, రోషరాగోదయా
విరతభ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారముఁ
జరగం, గన్నుల కెంపుసొంపుపరఁగం జండాస్త్ర సందోహముఁ
సరసాలోక సమూహముఁ నెఱపుచుం జంద్రాస్య హేలాగతిఁ.

అని వ్రాసెను. ఈ రెంటియందుఁ గ్రింద గీటులుగీచిన మాటల పోలిక పరిశీలింపుఁడు. అంతటితోఁ బరితుష్టి లేక పోతన

సీ. రాకేందుబింబమై రవిబింబమైయొప్పు, నీరజాతేక్షణ నెమ్మొగంబు
కందర్పకేతువై ఘనధూమకేతువై, యలరుఁ బూఁబోఁడిచేలాంచలంబు
భావజుపరిధియై ప్రళయార్క పరిధయై, మెఱయునాకృష్టమై మెఱఁతచాప
మమృతప్రవాహమై యనలసందోహమై, తనరారు నింతి సందర్శనంబు
గీ. హర్షదాయియై మహారోష దాయియై, పరఁగుముద్దరాలి బాణవృష్టి
హరికినరికిఁ జూడనందంద శృంగార, వీర రసములో నవిస్తరిల్ల.

అని వ్రాసెను. ఇంతే కాదు. ఇంకను దిలకింపుఁడు.

సోమన—ఇతఁడే సాత్యకి యిమ్మహాభుజు
పోతన—ఇతఁడే దానవ చక్రవర్తి
సోమన—వినరా సాత్యకి మాటలేమిఁటికిరా
పోతన—వినరా డింభక మూఢచిత్త గరిమఁ.

ఇంతవఱకుఁ బద్యంబులఁ గల సామ్యము తెలుపంబడినది. ఇఁక గద్యంబులఁ గనుఁడు.

వ. మఱియుం దదాశ్రమంబు వలాహకంబునుబోలెఁ గరకాస్పదంబై, కుంజ రంబునుం బోలెఁ గుంభాభిరామంబై, రంగస్థలంబునుంబోలె శైలూష శత రమ్యంబై, యింద్రభవనంబునుం బోలె నైరావత రుచిరంబై తరుణీ ముఖంబునుంబోలెఁ దిలకవిరాజితంబై పరమయోగి హృదయంబునుంబోలె మోక్షనిలయంబై, పారావారంబునుం బోలె నమృతోత్పాదనస్థానంబై &c &c. ఉహరి.—మఱియును మధువైరి మందిరంబునుం బోలె మాధవమ న్మథమహితంబై, బలభేదిభవనంబునుం బోలె నైరావతామృత రంభాగణి కాభిరామంబై కర్ణకలహంబుం బోలె మహోన్నత శల్యసహకారంబై &c &c. భాగ.

మఱియుఁ గనుఁడు.

ఇట్లు మధుసూదనుం డేయుసాయకంబులు గాలువలుగట్టి మెయిమఱువులు చించియుఁ, గాయంబులు నొంచియు, మర్మంబులు గీఱియు, మహీతలంబులు దూఱియుఁ, బ్రేవులు వెఱికియుఁ బెనుమూఁకల కుఱికియు, సీసకంబులు వగిలించియు శిరంబులు నొగిలించియు &c &c. ఉ. హరి.

అట్టియెడం గదల నడిచియుఁ, గుఠారంబులఁ బొడిచియు, సురియలం

ద్రుంచియు, శూలంబులం జిమ్మియు, శక్తులనొంచియుఁ, జక్రంబులఁ ద్రుంచియు, ముసలంబుల మొత్తియు, ముద్గరంబుల నొత్తియుఁ, గుంతంబులఁ గ్రుచ్చియు, బంతంబు లిచ్చియు, శరంబుల వేసియుఁ, గరవాలంబుల వ్రేసియు &c &c. భాగ. ఇట్టి వింకను పెక్కులు గలవు. విసుఁగుచే విరమించుచు నొక్క గీతంబుమాత్రంబు నుదాహరించెదము.

గీ. అంతకంతకుఁజిట్టంటులంటి యంటిచెలువలకుయావనమువిందు సేయుచున్న
మానగుణబద్ధు,మన్మథమంత్రసిద్ధురుచిరరసవృద్ధు నాయనిరుద్ధుఁజూచి. ఉషారి.

గీ. అభినవాకారు నకు విద్యావిహారు, మహితగుణావృద్ధు, మన్మథమంత్రసిద్ధుఁ
గలితపరిబుద్ధు,నఖిలలోకప్రసిద్ధుఁ,జతురు ననిరుద్ధు,నంగనాజననిరుద్ధు. భాగ.

సభ్యులారా! గోలకొండదేశము పద్యములు కడపమండలమునకు వచ్చు మార్గము లేదనియు నించుమించు సమకాలికులగు కవుల పద్యంబులు సమానంబులుగ నున్నచో వా రిరువురు సమీపగ్రామవాసులై యుండవలయును గాని యొక రుత్తరధ్రువమున నొకరు దక్షిణధ్రువమున నున్నట్లు చెప్పరాదనియు వీరయ్యపంతులవారు వ్రాసినవాదము స్మరించి యా వాదము సాధువైనచో సోమన్న పద్యములకుఁ బోతన పద్యములకు నెక్కువ సామ్యముగలదో, సింగన్న పద్యములకుఁ బోతన పద్యములకు నెక్కువ సామ్యముగలదో పరిశీలించి యే యిరువురు కవు లొక్క ధ్రువంబుననుండిరో సత్యము మీఁద దృష్టియుంచి సెలవొసంగుఁడు.

ఆర్యులారా! చరిత్రాంశములంబట్టియు, శైలిసామ్యంబునుబట్టియుఁ బరిశీలించినచో వీరయ్యపంతులవారి వాదమేగతిఁబట్టెనో చూచితిరి కదా. ఇఁక వారు వ్రాసిన మఱి కొన్నివిషయముల విమర్శింతము.

౧౩-వ యాక్షేపము.

“అప్పటి కాలమున నేకశిలానగరమున అనేక దేవాలయములుండి మహమ్మదీయులవల్ల తర్వాత నష్టపరచఁబడినవి. అనేకాలయములలో కోదండ రాములవారి యాలయ ముండనోపును.”

సమాధానము.

ఏ ముండనోపును? ‘ఉన్నది’ యనునది సాక్ష్యముగ గ్రహింపఁబడును గాని యుండనోపును ఉన్నవేమో యిత్యాదు లూహలు సాక్ష్యముగ న్యాయాధిపతులు గ్రహింపరని ౨౦ సంవత్సరములుగ న్యాయవాదులుగ నున్నామను వీరయ్యపంతులవా రెఱుంగకుండుట చిత్రము.

బమ్మెరపోతనకుఁ గించిత్కాలము ముందుండిన వల్లభరాయఁడువ్రాసిన క్రీడాభిరామంబున నా కాలంబున నోరుగంటి యందుండిన దేవాలయములు పేర్కొనఁబడినవి.

సీ. అదెభైరవస్థాన మటమీఁద నల్లదె, చముడేశ్వరీమహాశక్తినగరు
వీరభద్రేశ్వరా గారమంటపమదె, యదెబౌద్ధదేవు విహారభూమి
అదెముద్దరా ల్మసానమ్మనివాసంబు, నల్లదెకొమర సామయ్యనగరు
అదెపాండవులగుడి యట దక్షిణంబున, గర్తాయఁడురిదు తుర్కల మసీదు

గీ. కొంతదవ్వులనదె మహాగోపురముల, పైఁడికుండలు రవిదీప్తిఁ బ్రజ్వలించి
కానవచ్చెను మేరుశృంగములఁబోలెఁ, గేశవశ్రీస్వయంభూని కేతనములు

ఇవిగాక వీరాదేవికిని, మాహురమ్మకును, మైలారయ్యకు దేవాలయములు గలవు. ఇన్ని దేవాలయములుండఁగాఁ గోదండరామస్వామి దేవాలయము మాత్రము తురకలు పాడుచేసిన కారణము వీరయ్యపంతులవారు తెలుపఁ బ్రార్థితులు. మసీదునుగూడఁ జెప్పిన కవికోదండ రామాలయముండినఁ జెప్పకుండునా? ఈ పద్యమువలననే గాక మాకు లభించిన యితరాధారముల వలననుగూడఁ గేశవాలయము దక్క వేఱు విష్ణ్వాలయ మానగరంబున నుండలేదు.

౧౪-వ యాక్షేపము.

భాగవతంబునఁ బోతన రామభద్రనామ ముపయోగించి యున్నాఁడు గాని కోదండరామనామ మెచ్చట నుపయోగించినటుల లేదు.

సమాధానము.

కోదండము ధరించిన రామభద్రుఁడు కోదండ రాముఁడు కాఁడు కాఁబోలు.

౧౫-వ యాక్షేపము.

అయ్యలరాజు రామభద్రకవి ౧౬౦౦ సంవత్సరప్రాంతమున పొత్తపినాటిలో నొంటిమిట్టలో నుండినవాఁడు. అనఁగా పోతనకు ౨౦౦ సంవత్సరములకు తర్వాత నున్నవాఁడు. ఈకవియో ఆయన తండ్రియో యుత్తరమునుండి దక్షిణమునకువచ్చి యుండవచ్చును.

సమాధానము.

ఈ వ్రాఁత యుద్దేశము స్పష్టముగాన వివరింపఁబనిలేదు గాని వ్రాసిన వ్రాఁత యందెంత సత్యమున్నదో చూతము. ఈయనను గుఱించి కవి చరిత్ర

మందు “౧౪౩౦-వ సంవత్సరమున కొకటి రెండేండ్లుముం దికవిగ్రంథరచన కారంభించినట్లు తోఁచుచున్నది” అని వ్రాయఁబడియున్నది. అనఁగా ౧౪౨౮-వ సంవత్సరమున రామభద్రుఁడు సకలకథాసార సంగ్రహము తెనిఁగింప నారంభించియుండవలెను. ఈపుస్తకము కృష్ణదేవరాయల ప్రార్థన ప్రకారము వ్రాయనారంభింపఁబడెను. కేవల బాలునిఁ గృష్ణదేవరాయలుప్రార్థించి యుండఁడు గావున నప్పటికి రామభద్రునికి ౨౪ సంవత్సరముల ప్రాయమై యుండవచ్చును. అనఁగా రామభద్రుఁడించుమించు ౧౪౨౩-వ సంవత్సరమున జన్మించి యుండవలయును. ఆంధ్రకవుల చరిత్రముమందే అయ్యలరాజు అయ్యల భాస్కరకవుల గుఱించి వ్రాయుచెడ “వీరి పూర్వులలో నొకడైన తిప్పనార్యుఁ డొంటిమిట్ట రఘువీరశతకనిర్మాణ కర్తయుఁడై రాయల యాస్థానకవిగానుండెను. అతని మునుమఁడైన రామభద్రకవి రామాభ్యుదయమును రచించెను.” అని యున్నది. రామాభ్యుదయ గద్యమందు “శ్రీమదొంటిమిట్ట రఘువీర శతకనిర్మాణ కర్తృ జగదేకఖ్యాతిధుర్యాయ్యలరాజు తిప్పయమనీషి పర్వతాభిధాన పౌత్రాక్కయార్యపుత్ర........రామభద్రకవి ప్రణీతంబయిన” యని యున్నది. దీనివలన నయ్యలరాజుకొడుకు తిప్పరాజు. తిప్పరాజుకొడుకు పర్వతరాజు. పర్వతరాజుకొడు కక్కయార్యుఁడు, అయన కొడుకు రామాభ్యుదయ గ్రంథకర్త రామభద్రుఁడని యేర్పడుచున్నది. ఇందక్కయార్యుఁడు మాత్రము కవిగాఁడు. తక్కినవారు కవులని హంసవింశతిలోని

ఉ. అయ్యలరాజుఁ, దిప్పసచి వాగ్రణిఁ, బర్వతరాజు, రామభ
ద్రయ్యను, భాస్కరాగ్రణిఁ, బ్రధానివరుండగు కొండధీరునిం
జయ్యన తిమ్మయప్రభుని సత్కవితారచనాఢ్యులైన మా
యయ్యలరాజువంశజుల నాదికవీంద్రులఁ బ్రస్తుతించెదన్.

అను పద్యమువలన మీఁదఁ జెప్పిన వంశావళి స్థిరపడియెను. ఇందుఁ జెప్పఁబడిన తిప్పరాజే రఘువీరశతక నిర్మాతయని రెట్టమతము “రఘువీరశతక నిర్మాణ కర్తరాయకవి తిప్పనార్య” యనుటచేఁ దెలుపుచున్నది. కావున రామభద్రుఁడు ౧౪౨౩ సంవత్సరమున జనించి యుండిన నక్కయార్యుఁడు ౧౩౯౩ సంవత్సరమున, నతని తండ్రి పర్వతరాజు ౧౩౬౩ సంవత్సరముననుు, అతని తండ్రి తిప్పరాజు ౧౩౩౩ సంవత్సరమందుననుు, అతని తండ్రి యయ్యలరాజు ౧౩౦౩ సంవత్సరమున జన్మించి యుండవలెను. అట్లైన నీ యిరువురు బమ్మెరపోతన సమకాలికులు. దీని వలన రామభద్రుఁడు ౧౬౦౦-లో నుండె

ననుట మొదటి పొరబాటు. రామభద్రుని తండ్రియో యతఁడో యుత్తరము నుండి దక్షిణమునకు వచ్చెననుట రెండవ తప్పు. పోతన్న కాలములో నిప్పటఁ దిప్పన్నపేరు లేదనుట మూఁడవ కల్ల.

౧౬-వ యాక్షేపము.

“కడప మండలములో ప్రస్తుత మన వివాదములోచేరిన పోతనామాత్యుఁడు భాగవతము దక్క మఱియొక్క కవీశ్వరునిపేరుగాని గ్రంథముపేరుగాని ౧౦౦౦ మొదలు ౧౩౦౦ మధ్యకాలమున నుండినటుల లేనందున”

సమాధానము.

౧. మీఁదఁ జెప్పఁబడిన తిప్పనార్యుఁడు.

౨. వల్లభామాత్యుఁడు.

౩. నాచన సోమన్న.

వీరు ముగ్గురు ముఖ్యాంధ్రకవులు. పోన్నకుఁ బూర్వులు కడప మండలమునందలివారు.

౧౭-వ యాక్షేపము.

“నిజముగ నిరువురు నొంటిమిట్టవారలే యైనఁగాని తుదకు పోతన ఒంటిమిట్ట వాడేయైనఁగాని భాగవతమచ్చట రచియింపఁబడినగాని అచ్చటనే ౨౦౦ సంవత్సరముల తరువాత గ్రంథరచనకు గడంగిన రామభద్రకవి పోతన కెట్టి ప్రాముఖ్యత నొసంగి యుండవలెనో యూహింపనగును. రామభద్రకవి యటుల జేయలేదు.” “ఆంధ్రభాగవతకర్త నభినుతింతు”యని మాత్రము వ్రాసియున్నాడు. ఒంటిమిట్ట కతిసమీపమున గ్రంథరచనగావించిన మట్లి అనంత భూపాలుఁడు పోతనామాత్యుని పేరైనఁ దలఁచి యుండలేదు.

సమాధానము.

కొందఱు పూర్వకవులను స్తుతింపనే లేదు. కొందఱు నన్నయ తిక్కనల మాత్రమే స్తుతించిరి. కొందఱు కవిత్రయము నుతించిరి. కొందఱు తమ సమీపబంధువులు కవులుగానున్నను బేరుచెప్పి విడిచిరి. ఇట్లు నానావిధములుగఁ గాన వచ్చుచున్నది. పంతులవారు చెప్పెడి రామభద్రుఁడు తనతాతలు కవులయి యుండ వారి నేల గ్రంథమునఁ బేర్కొనలేదు? ఆయన

గీ. శబ్దశాసనసుకవికంజలియొనర్చి, యుభయకవిమిత్రునకు హస్తయుగళిమోడ్చి
శంభుదానునిసోముభాస్కరుఁదలంచి, యాంధ్రవాగ్భాగవతకర్త నభినుతించి.

అని కవిత్రయసోమభాస్కరులతోఁపాటు పోతన్న నెన్నుట గౌరవించుట కాదు కాఁబోలు. శంభుదాసాదులకుఁ జూపిన గౌరవముకంటెఁ బోతన్న కెక్కువ గౌరవము కనఁబఱిచెను. కవిత్రయమువారిని బిరుదులచేఁ దెల్పినట్లు పోతన్నను నాంధ్రభాగవత కర్తయని శ్లాఘించెను.

పారిజాతాపహరణమున

సీ. కౌశికగోత్ర విఖ్యాతుఁ డాపస్తంబ, సూత్రుఁ డార్వేల పవిత్రకులుఁడు
నంది సింగామాత్యునకును దిమ్మాంబకుఁ, దనయుండు సకల విద్యావివేక
చతురుండు మలయమారుత కవీంద్రునకు మే, నల్లుండు కృష్ణరాయక్షితీశ
కరుణాసమాలబ్ధ ఘనచతురంత యా, నమహాగ్రహార సన్మాన యుతుఁడు

గీ. తిమ్మయార్యుండు శివపరాధీనమతి య,ఘోరశివగురు శిష్యుండు, పారిజాత
హరణమనుకావ్య మొనరించె నాంధ్రభాష, నాదివాకరతారాసుధాకరముగ.

అని నందితిమ్మన వ్రాసెనేకాని మలయమారుతకవికిఁ దాను మేనల్లుఁడై యుండియు నతఁడు వరాహపురాణాదులఁ దెనిఁగించిన కవియైయుండియు నతనిని బ్రశంసింపక పేరుచెప్పి విడువఁ గారణమేమో పంతులవా రెఱింగింతురు గాక. సుదక్షిణాపరిణయ కర్తయుఁ బాండురంగమాహాత్మ్య కర్తయుఁ దెనాలి వారైనను దెనాలి యన్నయ్య రామకృష్ణునిపేరు స్మరింపలేదు.

వాదుల మతప్రకారము బమ్మెర పోతనకు మనుమలో మునిమనుమలో యయిన కేసన మల్లనకవులు మత్పితామహుని బమ్మెర పోతన నని చెప్పిరిగాని యంత కెక్కువగ నేల ప్రశంసింపలేదు? గ్రంథముపేరైన నేల చెప్పలేదు??

హంసవింశతి యందు నారాయణకవి నిజవంశ పూర్వకవులలో నొక్కనిగ రామభద్రుని పేరుకొనియెనేగాని యేల విశేషప్రశంస సేయలేదు?

సారకవితాభిరాము గుంటూరువిభుని మంత్రిభాస్కరు మత్పితామహుఁ దలంచి యని తిక్కన చెప్పెనుగాని స్తుతి పాఠమేల యప్పగింపలేదు?

ఇవి యన్నియుఁ బోల్చిచూచినపుడు రామభద్రుఁడు పోతనయందు గౌరవముఁ జూపెనో లేదో పాఠకులే పరిష్కరింతురు గాక. అంత కెక్కువ శ్లాఘింపకుండుట లోపమేమో యదియు నాలోచింపుఁడు.

ఇఁక నిట్లె యనంత భూపాలుఁడో యేకవినిస్తుతించిన వాఁడే కాఁడు. ఇతఁ డీవిషయమునఁ గుమారసంభవ గ్రంథకర్తను నన్నెచోడుని బోలియున్నాఁడు. నన్నయ తిక్కనలనుగూడఁ బేరుకొనని వాఁడు పోతన్నను బేర్కొనకుండుట యేమివింత.

౧౮-వ యాక్షేపము.

"భాగవతమువల్ల మనకు గోచరమగు విషయమొక్కటి పేరయలింగము పేరువల్ల స్పష్టపడుచున్నది. బమ్మెర కుటుంబమువారు శైవులనియు నీ దిగువ పద్యమువల్ల పేరయలింగకవియొక్క బమ్మెరవంశము వంశపరంపరమైన కవులను గలిగియుండి నటులను అకవులలో కేసనయొక్కరనియు నందలి ప్రౌఢసరస్వతి పద్దు మన పోతనకే వర్తించగలదనియు ధృవపడుచున్నది.

ఉ. బమ్మెరవంశమందునను బ్రౌఢసరస్వతి పద్దుగాంచి తా
నెమ్మె దలిర్పఁ గేసన కవీశ్వరులప్పమ నామసాధ్వియం
దిమ్మహిఁ గూర్మిగన్నసుత యెల్లమయందును బేరయాఖ్యుఁడర్క
సమ్మతిఁగాంచె వీరనరసమ్మను గంగనమంత్రి యుగ్మముక్."

"౧౭౫౦-లో అజ్జరపు పేరయలింగమను కవి తనమాతామహుని యింటిపేరు బమ్మెర వారనియు."

సమాధానము.

వీరయ్యపంతులవారి పై వాక్యరత్నముల సావధానులరై చిత్తగించితిరి గదా. పై పద్యమును మఱొక్కసారి పఠింపుఁడు. పేరయ లింగమునకు బమ్మెరవారు మాతామహులఁట. అది యెట్లో మాకు బోధపడలేదు. కేసనభార్య అప్పమ్మ యని వారి కూఁతురు "ఎల్లమ్మ" యని యామె భర్త పేరయ్య యని వారి బిడ్డలు వీరనరసమ్మ గంగనమంత్రియని యర్థమగుచున్నది. మాతామహుఁడన మామ యని యర్థము కాఁబోలు! మఱియొక్క చిత్రము. ప్రౌఢసరస్వతిపద్దు వారి పోతన్నకే వర్తింపఁగల దఁట. వహ్వా! యన్వయశక్తి!! ఇట్టి యన్వయశక్తిచేఁగదా యోరుగంటి వాదము గెలువ వలసియున్నది!!! ఎట్లైననేమి పోతనకును బిరుదు లభించెనని మాకును సంతోషమే. కేసనకుఁ బేరయలింగము దౌహిత్రుఁడని రావుబహదర్ వీరేశలింగముపంతులవారు వ్రాయఁగా నది తప్పని మున్నె సుబ్బరావుగారు తెలిపియుండినను వీరయ్యపంతుల వారి కది దెలిసికొను శక్తికూడ లేకపోయెనని విచారపడెదము. లోకము గతానుగతికము. విన్నన్న చెప్పినది వేదము.

౧౯-వ యాక్షేపము.

"భాగవతము ౧౩౬౦-వ నాటికి పూర్తియైనట్లు నిర్ధారణ జేయవలసియున్నది." ౧౭౫౦-లో అజ్జరపు పేరయ లింగమను కవి తన మాతామహుని యింటిపేరు బమ్మెరవారని వ్రాసెను.

సమాధానము.

బమ్మెర కేసన్నకు నజ్జరపు పేరయలింగమల్లుఁడగునే గాని దౌహిత్రుఁడుగాఁడనియు నాంధ్రకవుల చరిత్రమందు వ్రాయఁబడినది తప్పనియు సుబ్బరావుగారు సవరించియుండినను జదివియుఁ దెలిసికొన నొల్లక యంతకంటె విపరీతముగ వీరయ్యపంతులవారు వ్రాసిరి. వీరివ్రాఁత నెట్లు సమర్థించుకొందురో చూతము. పేరయలింగము ౧౭౫౦ అఁట. బమ్మెర పోతన భాగవతమును ౧౩౬౦-లో రచించెనఁట. కావున బమ్మెరపోతన ౧౩౨౮-లో నైన జన్మించి యుండవలయును గదా. దాక్షాయణీవివాహములోని వంశావళి వీరేశలింగము పంతులవారు చెప్పినట్టుచూచిన బమ్మెరపోతన ౧౩౨౦. అతనికొడుకు మల్లయ్య ౧౩౫౦. అతనికొడుకు ప్రౌఢసరస్వతి ౧౩౮౦. అతనికొడుకు కేసన ౧౪౧౦. అతని కూఁతురు ఎల్లమ్మ ౧౪౪౦. ఈమె పెనిమిటి అజ్జరపు పేరయ్యలింగము ౧౭౫౦ అఁట. అనఁగా పేరయ్యలింగము తనకంటె ౩౧౦ సంవత్సరములు పెద్దది యగు పడుచును వివాహమాడె నఁట. రా॥ బ॥ వీరేశలింగముపంతుల వారి యొకానొక లెక్కప్రకారము తండ్రికి ౬౦-వ యేఁటఁ గొడుకుపుట్టినట్టు గణించినను భార్యాభర్తలకు ౧౯౦ సంవత్సరములు వ్యత్యాసమేర్పడుచున్నది. ఆర్యులారా! వాదచమత్కారముఁ జిత్తగింపుఁడు. పేరయలింగమను కవి తన మాతామహుని యింటిపేరు బమ్మెరవారని వ్రాయలేదు. మామగారి యింటి పేరు బమ్మెరవారని వ్రాసెను. ఒంటిమిట్ట వాదులాలిని దల్లినిజేసి యట్లు వ్రాయుచున్నారు.

౨౦-వ యాక్షేపము.

“రేచర్ల సింగమనాయడు వార్రంగల్ ప్రాంతముననుండెను. ఒకవేళ నీ సింగమనాయఁడే వెంకటగిరికిబోయి నశ్లెంచినను భోగనీ దండకము వేంకటగిరిలో వ్రాయంబడినశ్లెంచుటకు కారణము గన్పట్టదు. ఈ దండకము పోతన యౌవనములో వ్రాసినదగుటచే బోతనయును సింగమనీడును వార్రంగల్ ప్రాంతమున నున్నకాలమున వ్రాయఁబడియుండనగును. పిల్లల మఱ్ఱికి సామీప్యముననున్న బమ్మెరలో పోతనయుండుటవల్లనే సింగమనీనికి పోతనకు నెయ్యమో కయ్యమో కల్పింపసాధ్యమగును గాని యొంటిమిట్టవాదమున కియ్యెడ నవకాశము లేదు. సింగమనీడు రేచర్ల అన పోతనాయని కుమారుడు. ఈ అన పోతనాయని మంత్రియైన మడికి సింగన తండ్రియే అయ్యల మంత్రి

సమాధానము.

సర్వజ్ఞ సింగమనాయఁ డెవరో తెలియక చరిత్రకారులే కలవరపడి యొకరి నొకరాక్షేపించుచున్నారు. సర్వజ్ఞ సింగమనాయఁ డొకఁడే యని యొకరనిన నిద్దఱని కొందఱు ముగ్గురని మఱికొందఱు నది వంశపరంపరాగత బిరుదమని యింకఁ గొందఱనుచున్నారు. కొంద ఱతఁడు రాచకొండయందుండెనని మఱికొందఱు వెలుగోటియందుండెనందురు. కొందఱు వేంకటగిరియందుండెనందురు. అప్పటికి వెలుగోటివారు వేంకటగిరికి రాలేదని పెక్కుర యభిప్రాయము. బమ్మెర పోతనకాలములో రాచకొండయందు మాధవనాయఁడు. అతని కొడుకు సింగమనాయఁ డుండినట్టు శాసనము లున్నవి. భోగినీదండకమున సర్వజ్ఞ సింగమనీఁడు కుమారాన్న పోతావనీనాథ సూనుఁడు. ఒకయొరలో రెండు కత్తులవలె నొక యూర నిద్దఱుప్రభువు లెట్లుండిరో, ఇదంతయు నాలోచింప భోగినీదండక సింగమనీఁ డేయూరివాఁడో యింకను సిద్ధాంతము కాలేదు. రాచకొండ వెలుగోడు వేంకటగిరి యీ మూఁడు ప్రదేశము లించుమించుగ నొంటిమిట్టకు సమానదూరములే కావున సింగమనీఁ డెందుండెనని స్థిరపడినను నొంటిమిట్ట వారివాదమునకు రాఁగల నష్టియేదియు లేదు. అట్టులే భోగినీదండకము పోతనకర్తృకమైనను గాకున్నను నష్టిలేదు. భాగవతమునకు సింగమనీనికి సంబంధము లేదని పూర్వమే బ్ర॥శ్రీ॥ వావిలికొలను సుబ్బరావుగారు వ్రాసియున్నారు. కావున నీవిషయమై దీర్ఘచర్చమానితిమి. సింగమనీఁడు రేచర్ల అన పోతనాయని కుమారుఁడు. ఈ అన పోతనాయని మంత్రియైన మడికి సింగన తండ్రియే అయ్యలమంత్రి యని వీరయ్యగారు వ్రాసిరి. సింగమనీఁడు కుమారాన్న పోతనాయని కుమారుఁడని భోగినీదండకమే చెప్పుచున్నది గాని యీ రేచర్ల అన పోతనాయని మంత్రి మడికిసింగన తండ్రియగు నయ్యలరాజనుటయే మిథ్య. ఎట్లన,

సీ. ఆత్రేయగోత్ర పవిత్ర పేరయమంత్రి, పుత్రిసింగాంబికఁ బుణ్యసాధ్వి
వెలయవివాహమై వేఁగి దేశంబులో, నేపారురాజ మహేంద్రపురికి
నధిపతి తొయ్యేటి యనపోతభూపాలు, మంత్రియై రాజ్యసంపదలఁ బొదలి
యొప్పారుగౌతమి యుత్తర తటమున, మహనీయ మగుపెద్ద మడికియందు
గీ. స్థిరతరారామ తతులు సుక్షేత్రములును, పెక్కులార్జించి సితకీర్తిఁ బెంపుమిగిలి
యఖిల జగదన్న దాతనా నవనిఁ బరఁగె, మధుర గుణ ధుర్యుఁ డయ్యల
[మంత్రి వరుఁడు.

మడికి సింగన వ్రాసిన యీ పద్యమువలన నతని తండ్రి యయ్యలమంత్రి రాజమహేంద్రప్రభువైన తొయ్యేటి యనపోత భూపాలునియొద్ద మంత్రియై యుండి యనేక క్షేత్రాదులు పెద్దమడికియందు సంపాదించెనుగాని రాచకొండ లోనుండు రేచర్ల యన పోతభూపాలునొద్ద మంత్రియై సంపాదించిన వాఁడు గాఁడు. ఇది పంతులవారు ప్రమాదబుద్ధి చెప్పిన తప్పు గాదు. ఏలన, మడికి సింగనయు నతని తండ్రియు నోరుగంటి ప్రాంతమువారని సాధింపఁగోరి వ్రాసిన వ్రాఁత యిది. పై పద్యమువలన మడికిసింగన పెద్దమడికియందే పుట్టిపెరిఁగి యుండవలయును. వాసిష్ఠరామాయణములోని యీ క్రింది వాక్యములఁబట్టి మడికిసింగన పద్మపురాణోత్తరఖండంబును, భాగవత దశమస్కంధంబును బెద్ద మడికియందే రచించి యావల రామగిరికిఁ గొనిపోయినట్లు భావింపఁదగి యున్నది. "విష్ణువిభవాభిరామంబులగు పద్మపురాణోత్తర ఖండంబును, భాగవత దశమస్కంధంబును దెనుంగున రచియించి యప్పుణ్యపురాణంబులకుఁ గృతిప తిఁగా నేపుణ్యుఁ బ్రార్థింతునో యని విచారించి............అబ్బనార్యతనూభవ కందనామాత్యుఁడు నాకు నతిస్నేహబాంధవుండును గావున నమ్మంత్రి యుగంధరుం గృతిపతిఁ గావించి" యని యుండుటచే గ్రంథరచనానంతరము నాయకాన్వేషణము గావింపఁబడియె ననుట స్పష్టము. పద్మపురాణమును గృతియిచ్చుటకుఁగా సింగన పెద్దమడికినుండి రామగిరికిఁబోయి యుండును. ఆ కృతు లిచ్చి మాన్యములు సంపాదించుకొనియెను గాని వాని కావల వ్రాసిన వాసిష్ఠ రామాయణంబును గర్నూల్ మండలమందుండు నహోబలేశ్వరునకే యంకిత మిచ్చెను. శైలిపోలికకై పంతులవా రుదాహరించిన వేణివిలోల నీలజలవేణి ఆ తరుణీలలామకు నను రెండు పద్యములు పద్మపురాణములోనివి కావునఁ బెద్ద మడికియందు వ్రాయఁబడినవని చెప్పఁదగును. కావున సింగన పోతన్నలు నొకరినిజూచి మఱియొకరు వ్రాసినారనుట కల్లయూహ కదా.

౨౧-వ యాక్షేపము.

"భాగవతపురాణము బమ్మెరపోతన భాషాంతరీకరించుటకు మాత్రము వార్రంగలు ప్రాంతమునువదలి యొంటిమిట్ట కేగవలసిన ప్రసక్తి గన్పించ లేదు."

సమాధానము.

భాగవతమును దెనిఁగించుటకు మాత్రము బమ్మెరవదలి యోరుగంటికిఁ బోయెనని యసంబద్ధోక్తు లోరుగంటి వాదులనుచున్నారుగాని యా కార్యమునకై యొంటిమిట్టకువచ్చెనని యొంటిమిట్ట వాదులన లేదు. దేశక్షోభము కారణముగఁ బోతనతండ్రి దాతలే యా దేశమువిడిచి వచ్చిరని యొంటిమిట్ట వాదులనుచున్నారు.

౨౨-వ యాక్షేపము.

"కురుముద్దాలిపురము కురుమదవల్లి. ఇతరమార్పు లిట్టివే యని యూహించుచో బమ్మెర బొమ్మెర భేదములఁ బాటింపఁ బనిలేదు."

సమాధానము.

బండపల్లె బొండపల్లె యిత్యాదులందు భేదము పాటింపనిచోఁ గలుగు ననర్థకములను సుబ్బరావుగారు మున్నె వివరించియున్నారు. బమ్మెర బొమ్మెరయైనఁ గావచ్చును. కాకపోయినఁ బోవచ్చునుగాని వాది స్థానమలంకరించి యుండు వీరయ్యగారు న్యాయాధిపతిగారియెదుట బొమ్మెరయే బమ్మెర యని చెప్పినచో మీకాధారమేమని న్యాయాధిపతి యనిన నిది మాయూహ యనినచో నిరూపించు భారము తమ యందుండియు నిరూపింపఁజాలక యూహలని చెప్పిన వీరిపక్షమున నెట్లు వారు తీర్పుచెప్పెదరో, ౨౦ సంవత్సరములుగ న్యాయవాదిగనుండు పంతులవారూహ లెట్లు ప్రమాణములనుచున్నారో మే మూహింపఁ జాలకున్నాము. బొమ్మెర బమ్మెర యనుటకు నాధారములుండినఁ గనఁబఱుపవలయును లేవా లేవనవలయును. ఇది యుక్తమార్గము.

౨౩-వ యాక్షేపము.

"ఎప్పు డేకశిలానగరము నెవ్విధముగ నొంటిమిట్ట కన్వయించుటకు వీలుగాన్పించలేదో యంతట నా వాదము వదలి విగ్రహము లొక్కరాతివను వాదము బయలు దేఱినది."

సమాధానము.

బ్ర॥శ్రీ॥ సుబ్బరావుగారు వ్రాసినవ్యాసమును జూడనివారి కన్నులుగప్ప వ్రాసిన వ్రాఁత యిది. ఒంటిమిట్ట యేకశిలానగరమనుటకు వారికిఁ దెలిసిన కారణముల నేక కాలమునఁ బ్రథమవ్యాసమందే సుబ్బరావుగారు వ్రాసిరికాని భిన్నకాలములయందు వ్రాసినవారుగారు. ఒంటిమిట్ట కేకశిలాఃనగర నామ ముండుటయుఁ బోతరాజిక్కడివాఁడగుటకుఁ బ్రబలకారణ మీవ్యాసము కడపట వివరించెదము.

౨౪-వ యాక్షేపము.

"ప్రతిగ్రామములో నట్టి గ్రాము నామ మింటిపేరుతో సరిపోవుట తరచుగ జూచుచున్నాము గదా."

సమాధానము.

తెలుపుగఁ గాదుకదా ౧౦,౦౦౦-కు నొకటైన నట్టిది కలదో లేదో. ఆర్యులారా! కడపలోఁ గడపవారని కాని యొంటిమిట్టలో నొంటిమిట్ట వారని కాని మన గ్రామములేల బెజవాడలో బెజవాడవారని, కాకినాడలోఁ గాకినాడవారని రాజమహేంద్రనరములో రాజమహేంద్రవరమువారని యెందఱున్నారో చెప్పఁగలరా. తెలుపుగనున్నారఁట! ఏమి సాహసికోక్తి.

౨౫-వ యాక్షేపము.

“ఒంటిమిట్ట వాదమునకు బలమై మిక్కిలి ప్రధానమైన కారణ మొక్కటి గలదు. కోదండరామాలయ మొంటిమిట్టలోఁ గలదు. ఈ యాలయము ౧౫-వ శతాబ్దానంతరమేర్పడి యుండవచ్చునని మట్లిరాజులు విజయనగర సామ్రాజ్యానంతరం పొత్తపినాటిని పాలించిన కాలములో కట్టఁబడి యుండునని తెలియజేసియున్నాను.” “మట్లిరాజులు విజయనగర సంస్థానపు రాజులకు నల్లుంద్రుగనుండి యాసామ్రాజ్యము పోయిన తరువాత చిట్టివేల్ మొదలగు ప్రదేశములను మట్లివారు పాలించిన ౧౬-వ శతాబ్దంబున దేవాలయము లేర్పడినటు లున్నదని యింతకుమున్ను విన్నవించి యున్నాను.”

సమాధానము.

ఈ యూహ నరికాదు. దేవాలయము కన్నులెత్తిచూచిన వారెవ్వరు నిటు చెప్పరు. ఇట్లు మీరనుటకు నాధారములుగలవా యని సుబ్బరావుగారు పంతులవారికి 3-ర యుత్తరములు వ్రాసిరి. దానికిఁ బ్రత్యుత్తర మింకను నిచ్చుచునే యున్నారు. ఇప్పుడైన సెలవిచ్చెదరు గాక. ఏది చెప్పినను దెలి యని వారు నమ్ముదురు గదా యని చేతికి వచ్చినట్లెల్ల వ్రాయుట యెదుటి వారడిగినపుడు మౌనముద్రవహించుట!! ఇది గదా వాదబలమున గెలుచు వారి లక్షణము. బమ్మెరపోతన కాలమునకు ముందే దేవాలయము పుట్టిన దనుటకై నాలుగు ప్రమాణములు గనఁబఱిచెదము.

i. విజయనగర సంస్థానము సదాశివరాయల కాలమున నున్నత స్థితి యందుండెను గాని క్షీణింపలేదు. తల్లికోట యుద్ధానంతర మాసంస్థానము క్షీణించెను. తల్లి కోటయుద్ధము ౧౫౬౫ జనవరిలో జరగెను. ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయములో నుండు శాసనములో ౧౫౫౫-లోనే కోవెలకు మాన్యములిచ్చినట్లున్నది. దేవాలయమే లేకుండిన దేవతామాన్యము లెవ్వరికియ్యఁబడెను? వెనుక నెన్నఁడో మట్లివారు కట్టింపఁబోవు దేవా

లయమునకు ముందుగనే సదాశివరాయఁడు మాన్యము లిచ్చెనని న్యాయవాదులైన వీరయ్యపంతుల వారందురు కాఁబోలు.

ii. “The number of pagodas in this (Sidhout) Taluk shows that at a remote period it must have been of great importance and was probably highly civilised.”

iii. “The king (Harihara Bukkarayulu) then went to Wontimitta and there dedicated a temple with a tower to Raghoonayaka Swamy and went on a pilgrimage to Ramasvaram.”

ఈ రెండనువాదములు “డిస్ట్రిక్టు మాన్యుయల్” లోనివి.

iv. బమ్మెరపోతనకు సమకాలికుఁడైన యయ్యలరాజు తిప్పరాజు రఘువీరశతకము రచించెనని ముందు చెప్పితిమిగదా. దేవాలయము దేవుఁడు లేనిచో శతకమెట్లు వ్రాయఁబడెను? వీనిని వలనఁ బోతనకాలము నాఁటికి నొంటిమిట్ట యందు దేవాలయము లేదనుట సరిగాదు. పంతులవా రిప్పటి దేవాలయము లేదనిరి కాని దేవుఁడు లేఁడనినవారు కారు. అది కొంతమేలు.

౨౬-వ యాక్షేపము.

“ఒంటిమిట్ట నది కతిసమీపమగుటంజేసి పోతనకటనుండి వచ్చుటకు కొన్ని నిమిషములకంటె నెక్కువ వ్యవధి యక్కఱ లేదు.”

సమాధానము.

స్థలజ్ఞానము లేని వారిని నమ్మింప నెన్నియసత్యములువ్రాయఁబడినవో చూడుఁడు. నాల్గుమైళ్లుదూరమఁట కొన్ని నిమిషముల ప్రయాణమఁట. కొన్ని ఎన్ని?

౨౭-వ యాక్షేపము.

“పోతన గ్రహణమునకు గోదావరికిఁ బోయి వెంటనే యింటికివచ్చి కొన్నాళ్లకు నేకశిలానగరమునకు జనుదెంచె”

సమాధానము.

ఇంటికనఁగా బొమ్మెరలోని యింటికని పంతులవారి యభిప్రాయము. ఈ వివర మెందువ్రాయఁబడియున్నదో పంతులవారు తెలుపఁ బ్రార్థితులు. గంగాతీరమునుండి చక్కఁగ నేకశిలానగరమునకుఁ జనుదెంచినట్టు భాగవతమున నున్నది. ఈ వంకరత్రోవ వీరయ్యపంతులవారిది.

౨౮-వ యాక్షేపము.

“భాగవతములో నుదాహరింపఁబడిన ఏఱ్చూరు నరసారావు పేటదగ్గర నున్నది”

ప్రత్యుత్తరము.

సుబ్బరావుగారు చెప్పిన దీని నంగీకరించి రామయ్యపంతులవారి వాద మంగీకరింపకపోవుటచే వీరయ్యపంతుల వారికి వందనములు.

౨౯-వ యాక్షేపము.

కోదండరామాలయమునకు మట్లివారు ధర్మకర్తలు.

సమాధానము.

ఇది వీరయ్యపంతులవారి నియమనము. సత్యమై యాచరణమునకు వచ్చినపుడు మట్లివారు వీరికిఁ గృతజ్ఞులైయుండఁగలరు.

౩౦-వ యాక్షేపము.

ఒంటిమిట్ట నివాసులకుఁగాని దగ్గర గ్రామములవారికిఁగాని పోతన సంగతియే తెలియదు.

సమాధానము.

స్థలజ్ఞానము లేక వాదబలమున సాధింపఁ జూచువారిట్టి వ్రాఁతలుగాక మఱియెట్టివి వ్రాయుదురు? ఇట్టి యసత్యములు వ్రాసిన లోకమేమి తలఁచునో యని జంకు గొంకుకూడ నేల లేదో. చాలఁ గాల మీ మండలమందుండిన బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతులవారు స్థలస్థజనశ్రుతి నంగీకరించియుండ స్థలజ్ఞానము లేని వీరు నిరాకరింప సాహసించిరి.

౩౧-వ యాక్షేపము.

"భాగవతములో నుపయోగింపఁబడిన దేశీయపదములు కొన్ని యొంటిమిట్టవారి వాడుకలోనివి కావు. ఆ గ్రామస్థుల నడుగనట్టి పదములను పడమటి దేశస్థులు అనఁగా కడపప్రాంతములవా రుపయోగించెదరని చెప్పియున్నారు.

సమాధానము.

ఒంటిమిట్ట కడపయొద్దలేక తూర్పుదేశమున సముద్రతీరమున నున్నదని పంతులవారియభిప్రాయము కాఁబోలు. ఒంటిమిట్ట గ్రామస్థులను మీ రడిగిన పదము లేవియని సుబ్బరావుగారు వీరిని ౪ నెలలుగ ౩-౪ మార్లడిగినను బ్రత్యుత్తర మీయ లేక యున్నవారు.

౩౨-వ యాక్షేపము.

వీరయ్యపంతులవారు వ్రాసిన మఱి కొన్ని యసత్యములను బ్రమాణ విరుద్ధములను వివరించి యీ వ్యాసము సంక్షేపించెదము,

౧౧౮౦-లో నున్న పాల్కురికి (పాల్కుర్తి) సోమనాథకవి ౧౩౨౦-లో నున్నట్టు లా కారణమునఁ బోతనకు సమకాలికుఁడైనట్టు వీరయ్యగారి వ్యాసమునం దున్నది. ఇది యెంతటి కృత్రిమపు వ్రాఁతయో చూడుఁడు. ఇంతటి యసత్యమునకుఁ బాలుపడిన వా రెంతకు సాహసింపరు. నాచన సోమన బుక్కరాయల కాలమువాఁడు. పోతన ప్రౌఢదేవరాయల కాలములోను నుండెను. కవిత్వమున ముందు హరివంశమని వెనుక భాగవతమని పూర్వము వివరింపఁబడెను. వాస్తవ మట్లుండ ౧౩౬౦ పోతనయు ౧౩౮౦ సోమన్నయు నెట్లయిరో పంతులవారు దయచేసి యెఱిఁగింపవలయును. ఎఱ్ఱాప్రెగడ ౧౩౫౦ యని వ్రాసి యెఱ్ఱాప్రెగడయుఁ బోతన్నయు సమకాలికుల నొనర్చిరి. వా రిరువురు సమకాలికులు గారు.

మడికి సింగన్న ౧౩౭౦ అని వీరయ్యగారు వ్రాసిరి. ౧౪౨౦-లోఁ బద్మపురాణమును దెనిఁగించినట్లు సింగనయే తన గ్రంథమున వ్రాసెను. ౧౩౭౦-కి సింగన పుట్టియు నుండఁడు.

తిక్కన సోమయాజి శిష్యుఁడు మారన ౧౩౩౦ అఁట. పంతులవారి వాదప్రకారము పోతన ౧౩౨౦-లోఁ బుట్టియుండిన యెడల నిరువురు సమకాలికు లగుచున్నారు. గురుశిష్యు లేకకాలమువారు గావునఁ దిక్కనసోమయాజియుఁ బోతనయు సమకాలికు లగుదురు. అట్లైనచో "ఒనరఁగ నన్నయ తిక్కనాది కవులీ యుర్విన్" అని పోతన యెట్లు వ్రాసెనో. ఇంకను బరిశీలించిన నెన్నియసత్యములు బయలు దేఱునో—

ఇంత వఱకు బ్ర॥ శ్రీ॥ వీరయ్యపంతులవారికిఁ బ్రత్యుత్తరమిచ్చుటయందుఁ గాలక్షేపము చేసితిమి. ఒంటిమిట్ట కేకశిలానగరమను పేరున్నదనుటకుఁ బోతన యొంటిమిట్టయందుండెననుటకుఁ బ్రబలప్రయాణములు గలవు. కోవెలయందుఁ బ్రతి దినార్చనావసరంబునఁ జెప్పంబడు సంకల్పమందు "అస్యాం శుభతిథౌ భగవదాజ్ఞయా భగవత్ప్రీత్యర్థం దండకారణ్యక్షేత్రే ఏకశిలానగరే సీతారామవిమానచ్ఛాయాయాం దేవదేవోత్తమ" అను నీ వాక్యములు విన వచ్చును.

ఈ దేవాలయమున నుత్సవాదులఁ గొన్నిమర్యాదలు గలవు. అందైదు తాంబూలము లెత్తుట గలదు. (౧) అహోబలమఠస్వాములవారికి (౨) శ్రీ శంకరాచార్యులవారికి (౩) వేదపారాయణమువారికి (౪) బమ్మెరపోతన భాగవతమునకు (౫) గోష్ఠికి. ఇవి యనాదిగ నున్నవి.

శ్రీరామాయనమః.

నారాయణశతక కర్తృత్వఖండనము

ద్వితీయ ధాటి.

శ్రీమదాంధ్రభాగవతగ్రంథకర్త యగుబమ్మెర పోతనామాత్యుఁ డోరుగంటి మిట్టయందుఁ డుండె నని చిరకాలప్రతీతియు లిఖితసాక్ష్యము లోనగు నిదర్శనములు పెక్కు లున్నను వానినెల్ల నిరాకరించి (యితరమండలముఖ్యకవుల నెల్లఁ గృష్ణలోనో గోదావరిలోనో కలుపవలయునను) కొందఱెట్టులైన నాయనను నోరుగంటియందు స్థాపింప ౫-౬ సంవత్సరములుగఁ బ్రబలప్రయత్నములు చేయుచుండుట యాంధ్రలోక మెల్ల నెఱింగినవిషయమే. తత్సంబంధములైన వాదప్రతివాదములు గ్రంథరూపమున వెలువడియున్నవి. పోతరాజవిజయము ముద్రణమందున్నది. సత్యజిజ్ఞాసువు లగుపండితులరు, సత్యాసత్యములు విమర్శింపసామర్థ్యము గలభాషాభిమానులకుఁ దద్గ్రంథము నీ సభవా పూరకయ పంపుకొందురు.

ఈవాద మిట్లు జరుగుచుండ సాధుమార్గమున నోరుగంటివారివాదము జయింపఁజాల దని తోఁచుటచేఁ గాఁబోలు యెవ్వరో వక్రమార్గమునఁ బోవ నుద్యమించుట యెఱింగి యేకశిలానగరద్వయవివాదసంగ్రహమునం దిప్పటికి ౭-౮ నెలలనాఁడే బ్ర॥శ్రీ॥ రాజశ్రీ వావిలికొలను సుబ్బరావుగారు "ఓరుగంటికాధారముగ లిఖితాధారములు తాళపత్రములు సృష్టింపఁబడుచున్నవని వింటిని. అవి యెంతవఱకు విశ్వసనీయములో భావిప్రాజ్ఞులాలోచింతురుగాక" యని వ్రాసిరి. అది యోరుగంటివాదులకుఁ గొందఱకుఁ గన్నెఱ్ఱచేసెను. వారు వ్రాసినది సత్యమో యసత్యమో యీ నారాయణశతకవిమర్శనము తెలుపఁగలదు.

నారాయణపద్యశతక మొకటి యాంధ్రలోకమున నుండుట యనేకాంధ్రు లెఱుఁగుదురు. ఇందలి ౧౦-వ పద్యము.

మ. ధరసింహాసనమై నభంబుగొడుగై తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయములెల్ల వందిగణమై బ్రహ్మాండ మాగారమై

సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై
వరుస న్నీఘనరాజసంబు నిజమై వర్థిల్లు నారాయణా.

అనునది యనేకస్త్రీపురుషులకు ముఖస్థమై యున్నది. కావున నీశతకము నూతనకల్పితము గాదు. దీనిని వ్రాసినకవి యెవరో మాకింకను నిజము తెలియరాలేదు.

ఇట్లుండఁ బిఠాపురమందుండు "నాంధ్రపరిశోధకమహామండలి" కార్యనిర్వాహకులై యోరుగంటిపక్షవాదు లైన మ-రా-శ్రీ వంగూరు సుబ్బరావు పంతులవారు మ-రా-శ్రీ వడ్డాది సుబ్బారాయనిగారిచేఁ బరిశోధింపించి యా నారాయణశతకమును ముద్రించి బ్రకటించిరి — ముద్రితప్రతియం దీశతకము ౧౦౦ పద్యములు ముగియఁగనే కడపట,

"శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర, కేసనమంత్రిపుత్ర, సహజపాండిత్య, పోతనామాత్యప్రణీతంబైన, నారాయణశతకంబున సర్వంబును సంపూర్ణము"అను గద్యము ముద్రింపఁబడినది. ఈగద్యము నాధారము చేసికొని మ-రా-శ్రీ వంగూరి సుబ్బరావుగారు "ఈశతకము సార్వజనికపుస్తభాండాగారమునఁ జిరకాలమునుండి యున్నట్లు నేనెఱుఁగుదును. ఇది శ్రీమద్భాగవతమును దెనిఁగించిన బమ్మెరపోతనామాత్యకృత మని గద్యవలనఁ దెలియుచున్నది. గ్రంథశైలియందును, కొన్నివ్యాకరణదోషములందును భాగవతమునకు సంపూర్ణముగుపోలికతో నున్నది....ఈ గ్రంథమును బోతన్న చిన్నతనమునందు మంచిధార గలకవితాశక్తి గలిగి శ్రుతపాండిత్యముచే రచియించి క్రమముగా మహాపండితుఁడై భాగవతము రచియించినట్లు నమ్మవచ్చును. కావున నాతని "సహజపాండిత్య" బిరుదమున కిది తార్కాణము కావచ్చునని నాయభిప్రాయము. పద్యములనడక, భావములు, నతిగమ్యములయ్యు భాషాదోషము లెల్లవిధములైనవి నిందుఁ గన్పట్టుచున్నవి" యని పీఠికయందు లిఖించిరి.

ముద్రితపుస్తకములను రెండుప్రతులను సంపాదించి వావిలికొలను సుబ్బరావుగారు మాసమాజమునకుఁ బంపిరి. ఈ పుస్తకమును బఠించి, యిది బమ్మెరపోతనకృతము గాదనియు నెవ్వరో యాయనపేరటి గద్యమును బ్రాంతశతకమునకుఁ జేర్చిరనియు మాసమాజమువారికిఁ దోఁచుటచే నీశతకమును విమర్శించి పండితమహాజనాభిప్రాయ మెఱుఁగఁగోరి విక్రమసింహపురమున జరగఁగల సాహిత్యపరిషద్వార్షికసభయందుఁ బఠింపవలసినట్టు మాబమ్మెరపోతనా

మాత్యసమాజమువారు ౧౯౧౯-వ సంవత్సరము మేనెల ౫-తేది యందు జరిగినసభయందుఁ దీర్మానించిరి, ఈ ౫-వ తేదియందుఁ బెజవాడలోనుండు బ్ర॥ శ్రీ॥ పెద్దిభొట్ల వీరయ్యపంతులు బి,ఏ., బి.ఎల్ గారు వ్రాసిన "వార్రంగల్ ఒంటిమిట్టవివాదము" అనుగ్రంథమునందలి వాదమును ఖండింప మాసమాజమువారు సభ చేసిరి. ఆసభకుఁ దాము రాఁజాలమని తెలుపుచు బ్ర॥ శ్రీ॥ వీరయ్యపంతులవారు "నూతనముగా బ్రచురింపఁబడిన నారాయణ శతకము నందలి ధర్మపురలక్ష్మీనాథ యనుమాటవల్ల బోతన వార్రంగల్ ప్రాంతమున నుండినటుల దెలియగలదు" అని వ్రాసిరి.

దీనివలన నీశతక మోరుగంటివాదమును బలపఱుప నోరుగంటివారలచేఁ బ్రకటింపఁబడియె ననుట స్పష్ట మయ్యెఁగదా. దీని నామోదించిన బ్ర॥ శ్రీ॥ వీరయ్యపంతులవారేగాక రా-శ్రీ వంగూరి సుబ్బరావుగారును నోరుగంటివారులేయని యాంధ్రలోకమునకు విదితము. వీరుగాక కర్తలు, కారయితలు, ప్రేరకులు, నామోదకు లెవ్వరెవ్వరు తెఱమఱుఁగుల నున్నారో మే మెఱుఁగము. నిజము నిలుకడపైఁ దెలియును. బ్ర॥ శ్రీ॥ రా-శ్రీ వావిలికొలను సుబ్బరావుగారికి వారిమిత్రులొకరు "I have come to *understand to-day* that a letter was received by Mr. P. Veerayya about the discovery of Potanna's manuscript of దశమస్కంధము in ఓరంగల్. Did you hear" 12-2-1919.

అని లేఖ లిఖంచిరి॥ ౫౦౦ సంవత్సరములనాఁటి తాళపత్రగ్రంథము రామబాణ క్రిమిదష్టమై నశింపక యథాస్థితి నుండఁగలదేమో మీరే యాలోచింపుఁడు. అది బమ్మెర పోతన స్వహస్తలిఖితమని యాయక్షరముల గుర్తింపఁ జాలినమహానుభావులెవ్వరో. ఈలేఖవలన నోరుగంటివారు లింకను నెట్టెట్టివాని కెక్కుపెట్టియున్నారో యూహింపుఁడు. దీనివలనఁ గూటగ్రంథములు రత్నగర్భచరిత్రాదులు మఱికొన్ని పోతనపేరనో యాయనకొడుకుపేరనో మనుమనిపేరనో మునిమనుమనిపేరనో వెలువడఁగలవని యెంచఁ గారణము కలుగుచున్నది. అట్టివి వెలువడినపు డాంధ్రలోకమే వానిని దగురీతి విమర్శించునుగాక.

ఈశతకపరిశోధనమం దొకచిత్రము గానవచ్చుచున్నది. దానిని మీకుఁ దెలిపి యింతటితో నీపీఠిక విరమించి గ్రంథవిమర్శనమునకుం గడంగెదము.

శోధన మనఁగ శుద్ధముగఁ జేయుట: యనఁగా దోషములను సవరించి

నిర్దుష్టముగఁ జేయుట. పరిశోధన మనఁగా మిక్కిలి నిర్దుష్టముగాఁ జేయుటగదా. ఇఁక నీగ్రంథము పరిశోధింపఁబడినవిధముఁ గనుఁడు.

౪. "కుఱుగుంపైనను వంకపోయినఁ గడుం గుజ్జైనఁ జేడైత్రినన్" అను పాఠమును "కుఱుగుంపైనను వంకబోయినఁ గడుంగుజ్జయినఁ జేడైత్రినన్" అని ఛందోభంగ మగునట్లును బ్రథమమీఁదిపకారము బకారమగునట్లును బరిశోధింపఁబడినది.

౭. "కడకుం బాయక వేయినోళ్లు గలయాకాకోదరాధీశుఁడున్ । కడ ముట్టన్ వినుతింపలేక నిగుడం గ్రాలంగ నోప్పారు మి । మ్మడరన్ సన్నుతిసేయ నాదువశమే యజ్ఞాని లోభాత్ముఁడన్ । జడుడన్నజ్ఞుఁడ నేకజిహ్వుఁడ జనస్తబ్ధుండ నారాయణా॥ వేయినోళ్లు గలయాదిశేషుఁడే నిన్ను స్తుతింపలేకయుండ నొంటినాలుక గల నేను నిన్ను నుతింపఁగలనా యని కవ్యాశయము. ఏక జిహ్వుఁడ ననునది నైకజిహ్వుఁడ నన్ని పరిశోధింపఁబడినది. రాజమహేంద్ర తాళపత్రప్రతియందు నేకజిహ్వుఁడ ననియే యున్నది.

౧౮. "మదవద్ధేనుకముష్టి కాద్యసురులన్" అని వ్రాఁతప్రతిపాఠము. మదవద్ధేనుకదానవాద్యసురులన్ అని పరిశోధితపాఠము.

౩౦. "సగుణబ్రహ్మ మయాఖ్యతం" అనునది "సగుణబ్రహ్మ మయాభ్యతన్" అని పరిశోధితము. యాభ్యత యిందు నేల రావలసివచ్చెనో

౪౪. ప్రేపల్లెం దాడుచు, ననునది యంతకంటె సాధువని కాఁబోలు ప్రేపల్లందాడుచు నని పరిశోధితము.

౫౮. "రమ్యంబుగాఁ జౌలకున్" అనునది చెవ్లకున్ అని పరిశోధితము.

౮౭. "వృద్ధాప్యకాలంబునన్" అనునది "వృద్ధాప్యవేళంబులన్" అని శోధింపఁబడినది.

౯౯. నరసింహాచ్యుత వాసుదేవ వికసన్నాళీకపత్రాక్ష యనుపాఠము వికసన్నాళీకపత్రేక్షణ యని శోధింపఁబడినది.

ఇట్టివి మఱికొన్ని గలవు. ఇట్టిదానిని దజ్ఞులు శోధితమందురో బాధితమందురో. ఆర్యులారా! వంగూరు సుబ్బారావుగారును విద్యావంతులే, మహాపండితులే. ఇట్టివారు బ్ర॥ శ్రీ॥ వడ్డాది సుబ్బరాయనిగారి సాహాయ్యముతో గ్రంథము పరిశోధించి ప్రకటించితి మని చెప్పుచు నపపాఠముల గ్రహించుచు సాధుపాఠముల విసర్జించుచు లేని దోషములు కల్పించుచు ముద్రించుటకుఁ

గారణము సహజపాండిత్య శబ్దమునకుఁ దాముచెప్పిన యర్థము సమర్థించుటకో మఱియేమిటికో ప్రాజ్ఞు లాలోచింతురుగాక.

"ప్రాయికముగా యథామాతృకముగా ముద్రింపఁబడినది" యని పీఠిక యందు మేము వ్రాయలేదా యందురేని ప్రాయికశబ్దమున కేమి యర్థము? యథాశక్తిసహాగమన మనియా? యథామాతృక మ్మగునేని పరిశోధిత మన నేల? సాధుపాఠమును బాధించుట పరిశోధితమా? అదట్టులుండనిండు. యథామాతృకమనిరికదా. 'అథవా పుస్తకత్రయ'మ్మను నియతికలదుగదా. సాహిత్యపరిషత్తునందుఁ బ్రతులుగలవని తామేవ్రాసిరికదా. వానిని గన్నెత్తియైనఁ జూచిరా? ఒక నాఁటిలో ముద్రించుటచే మాకు విరామము లేదయ్యెనందురేని యీగ్రంథములు 'రెండుప్రతులు' చిరకాలముగ రాజమహేంద్రవరపుస్తకభాండాగారమున నుండుట యెఱింగియు నొకనాఁటిలో ముద్రింపవలసినంత యాత్యయికకార్య మేమిగలిగెను? వీరు ప్రకటించిన విష్ణుచిత్తీయరాజనీతియందును శీఘ్రముగఁ బ్రకటింపఁబడినదని వ్రాసియున్నారు. ఇఁక నెన్నిట నట్లు వ్రాసిరో మేమెఱుఁగము. కావునఁ ద్వర యనునది నెపమని గ్రహింపవలసియున్నది. ముద్రణ మొకదినమం దయ్యెననిరి, అంగీకరింతము. వీరు ౩-౮-౧౯ యందు వ్రాసినవ్రాఁతప్రతికిని, దాము చేసిన సవరణకు విరోధముగ ముద్రాక్షరశాలవారు పైదుష్టపాఠముల ముద్రించిరని వంగూరు సుబ్బరావుగారు చెప్ప సాహసింతురా?

ఇంతటితోఁ బీఠిక నిలిపి నారాయణశతకము బమ్మెరపోతనామాత్యకృతమగునో కాదో విమర్శింతము.

నారాయణశతక విమర్శము.

ధర్మపురిలక్ష్మీనారాయణున కంకితముగ రచియింపఁబడి నారాయణశతకమను పేర లోకమునఁ దెలియవచ్చుశతకమున మత్తేభశార్దూలవృత్తములు నూఱుగలవు. ప్రతిపద్యముకడపట "నారాయణా" యనుపదము మకుటముగఁ గూర్పఁబడినది. ఈగ్రంథకర్త యెవఁడో మాకుఁ దెలియరాలేదు. కాని పీఠికయం దనువదించిన "ధరసింహాసనమై" యనుపద్య మాంధ్రలోకమున నింతకు మున్నే వ్యాప్తమై యుండుట సత్యము. ఆ కారణముచే నీశతకము నూతనసృష్టము గాదు. దీనికడపట—

"ఇది శ్రీపరమేశ్వర కరుణాకలితకవితావిచిత్ర, కేసనమంత్రిపుత్ర, సహజపాండిత్య, పోతనామాత్యప్రణీతం బైననారాయణశతకంబున సర్వమును

సంపూర్ణము" అని ముద్రింపఁబడినది. ఇట్టిగద్యమే భాగవతమునఁ బోతనవిరచితస్కంధాంతముల నుండుట యెల్లరెఱుంగుదురు. ఈ గద్యము నాధారముగఁ గొనియు మఱి కొన్నికారణములచేతను నీశతకము బమ్మెర పోతనామాత్యకృతమని గ్రంథమును బ్రకటించిన మ-రా-శ్రీ వంగూరు సుబ్బరావుగారు వ్రాసిరి. బ్ర॥ శ్రీ॥ పెద్దిభొట్ల వీరయ్యపంతులు లోనగు నోరుగంటివాదులు తమవాదము జయించెనని చంకలు తట్టుకొనుచున్నారు.

ఈశతకము బమ్మెర పోతరాజకృత మనుటకు వంగూరు సుబ్బరావుగారు చెప్పెడు కారణములు.

(1) ఆంధ్రభాగవతమునఁ గానవచ్చుగద్యమే యీశతకము కడపటను గానవచ్చుట.

(2) గ్రంథశైలియందును, కొన్నివ్యాకరణదోషములందును భాగవతమునకు సంపూర్ణమగుపోలికతో నుండుట.

(3) "ఈగ్రంథమును బోతన్న చిన్నతనమునందు మంచిధారగలకవితాశక్తిగలిగి శ్రుతపాండిత్యముచే రచియించి క్రమముగా మహాపండితుఁడై భాగవతము రచియించినట్లు నమ్మవచ్చును. కావున నాతని సహజపాండిత్యబిరుదమున కిది తార్కాణము కావచ్చునని మాయభిప్రాయము. పద్యములనడకభావములు నతిరమ్యములయ్యు భాషాదోషము లెల్లవిధములైనవి యిందుఁ గన్పట్టుచుం"డుట.

ఈ కారణములు క్షోదక్షమము లేమో పరిశీలింతము:—సభాస్తారులారా! తొలుత గద్యమునుగుఱించి మాకుఁ దెలిసినవిషయము విన్నవించెదము. i. శతకములం దెందైనఁ దద్గ్రంథకర్తలు తమనామధేయములను గద్యరూపమున వ్రాసికొనియున్నారా? ఆయాచారమునకు భిన్నముగ నిందు గద్యము కానవచ్చుట సంశయాస్పదముకదా.

ii. సాహిత్యపరిషత్పుస్తకభాండాగారమున నైదుప్రతులున్నవి. అందు నాల్గిట గద్యముగాని కవిపేరుగాని లేదు. ఒక్కదానియందుమాత్రము గద్యము కలదు. ఇది కాగితములప్రతి. దీనిసంఖ్య 1113. పద్యములు ప్రాఁతమసితో వ్రాయఁబడినవి. గద్యము నూతనముగ, కలకత్తా (స్వాన్) సిరాతో వ్రాయఁబడినది. లిపియు భిన్నముగనే కానవచ్చుచున్నది. ఈగ్రంథ మోరుగంటివాదము పుట్టినతరువాత సాహిత్యపరిషత్కార్యాలయమునఁ జేరినది. సృష్టి

కర్త లెవ్వరో యెప్పుడుసృష్టించిరో మేముచెప్పఁజాలముగాని గద్యము కూటసృష్టి (forgery) యనుట నిస్సందేహము. ఇది గోదావరిజిల్లాప్రతి.

దీనిని గుఱించి మఱికొంత వివరించెదము సావధానులరై చిత్తగింపుఁడు. ఏవ్రాఁతప్రతి నాధారముచేసికొని మ-రా-శ్రీ, వంగూరి సుబ్బరావుగారు ముద్రించిరో యావ్రాఁతప్రతి కడపట—

క. భారద్వాజసగోత్రుఁడ, సూరిస్తుతబాచిరాజసూనుఁడ రామాం
బారమణీమణితనయుఁడ, సారసవంశార్ధిచంద్రుఁడధరలోన్.

క. ప్రతి చూచివ్రాసినాఁడను, సతతము శివభక్తిసారసంగ్రహలీలా
ద్భుతలోకోత్తరసీతా, పతినాముఁడ నందివాడపరమాన్వయుఁడన్.

అని యున్నది. ఈపద్యములవలన రాజమహేంద్రవరప్రతి నందివాడ సీతాపతి యనునాయన వేఱొకమాతృకనుజూచి వ్రాసి సార్వజనిక పుస్తకభాండాగారమునకు నాయనో వేఱొకరో యిచ్చినట్టు రూఢిపడియెఁగదా. ఇఁక సాహిత్యపరిషత్తునందుఁ గానవచ్చు శతకమును బరిషత్తునకుఁగా దే॥ భరద్వాజమను వారు సేకరించిరి. వా రాపుస్తకముమీఁద "మహారాజశ్రీ బ్రహ్మశ్రీ, నందివాడ శీతాపతిగారు పరిషత్తునకు నొసంగిన నారాయణశతకం ఇది పోతరాజప్రణీతం" అని వ్రాసి దే॥ భ॥ అని తమపేరుసూచించిరి. దీనివలన నిది రాజమహేంద్రవరప్రతికి మాతృక యగుట స్పష్టము. మాతృకగద్య కూటసృష్టియగుచోఁ బుత్రిక గద్య యెట్టిదో మీరే భావింపుఁడు.

హిత్యపరిషత్తువారిపక్షమున యన్. రంగనాథరావు అనువారు వ్రాఁతపుస్తకములను సేకరింపఁ జిత్తూరు కడపమండలముల సంచరించిరి. వారు పంపిన పుస్తకములలో నొకప్రతి తాటియాకులపై వ్రాయఁబడిన దున్నది. దీనిసంఖ్య 2167. ఈపుస్తకముకడపట ముష్టూరి బాలరాజుకొమారుఁడు పెద్దవెంగయ్య వ్రాసికొన్నది యనియు నిది జయనామసంవత్సరమున వ్రాసికోఁబడిన దనియు నున్నది. ఈ జయమొన్నటిజయకుఁ బూర్వపుజయ. ఇట్టివ్రాఁతగ్రంథమందు గద్యము లేకుండుట యటుండ 101-వ పద్య మిట్లు కానవచ్చుచున్నది.

మ. రమణీయంబుగ నాదిమంబు నవతారంబుల్ భవద్దివ్యరూ
పము నామామృతముం దలంప దశకప్రాప్తయ్యె కృష్ణావతా
రము సుజ్ఞానము మోక్షముల్ ద్వివిధసంప్రాప్తిం శతాంధ్రాఖ్యకా
వ్యము సర్పించితి మీపదాబ్జములకున్ వైకుంఠ నారాయణా

ఈ పద్యార్థ మిట్లు గ్రహింపవలసియున్నది. ఆదిమదశకము, అవతారదశకము, దివ్యరూపదశకము, నామదశకము. ఇంతవఱకుఁదరగతికి 10 పద్యములవంతున వ్రాయఁబడినవి. ఆవలఁ గృష్ణావతారవింశతి, జ్ఞానవింశతి, మోక్షవింశతి యని రకమునకు 20 వంతున వ్రాయఁబడినవి. అన్నికలిసి 100 అయ్యె. మూలగ్రంథమందీయంతర్విభాగము లాయాస్థలముల సూచింపఁబడినవి. దీనివలన నీశతకము నాద్యంతగ్రంథసంఖ్య 101 యని యేర్పడియె. కొన్నిప్రతులలో 104 కొన్నిటిలో 110 యున్నవిగాని కవియే పద్యసంఖ్య భాగములతో నియమించియుండఁ దక్కినవి ప్రక్షిప్తము లనఁదగును. ఈ 101-వ పద్యమందు సర్పించితిననిమాత్రము వ్రాసెనుగాని కవి తననామము పేర్కొన్నవాఁడు గాఁడు. తనయోగ్యత యెఱింగియే పేరు దాఁచికొనెనని భావించుట తప్పుగా నుండదు. పేరు చెప్పియేయుండిన సర్పించితి ననుపదముతోడనే యదియు నుండవలయునుగాని భిన్నముగ గద్యమునం దుండఁ గారణము లేదు. కావున నీగద్యము కూటసృష్టి యనఁదగియున్నది.

గ్రంథశైలి, పోలిక.

బమ్మెర పోతనామాత్యుశైలివిధ మెవ్వరెఱుఁగని విషయముగాదు. ఆయన యత్యంతానుప్రాసప్రియుఁడనుట జగత్ప్రసిద్ధము. అనుప్రాసాభిరుచి యాయన నాచనసోమునిహరివంశము రంగనాథ రామాయణము, భాస్కరరామాయణము పఠించినకాలమునందే జనించి యుండవలయునుగాని యున్నట్టుండి పిట్టపిడుగువలె భాగవతరచనవేళకు నాకసమునుండి దిగి రాలేదు. భోగినీదండకము బమ్మెర పోతన రచితము కాకున్నను శైలిగదా యనేకుల సంశయాంబుధి ముంచుచున్నది. కావున నీశతకము పోతనవిరచితమే యైయుండినయెడ ననుప్రాసదుర్భిక్షమునకుఁ గారణము లేదు. ఈ నూఱుపద్యములం దొకచోటనైన ననుప్రాసప్రీతిని గవి కనఁబఱిచిన వాఁడుగాఁడు. వక్ష్యమాణపద్యములే కవిశైలిరీతిఁ దెలుపుచున్నను నొకపద్యము మచ్చునకై యుదాహరించెదము.

మ. ఇరవొందన్ సచరాచరప్రతతుల న్నెన్నంగశక్యంబె కా
కరయన్ పద్మభవాండభాండచయము న్నారంగ మీకుక్షిలో
నరుదార న్నుదయింపఁ బెంప నడప న్న న్నారికేళోద్భవాం
తరవాఃపూరముచంద మొంద చెపుదున్ దైత్యారి నారాయణా. 21

వ్యాకరణదోషసామ్యము.

నారాయణశతకంబున ద్రుతంబున కచ్చుపరమైనపుడు ద్విత్వము విచ్చలవిడిగాఁ బ్రయోగింపఁబడినది. "ఎడల న్నేతప్పులున్." ఇట్టివి సాధారణముగ

సరాసరి పద్యమున కొకటివంతున గాన నగు. ఇట్టి సంధిని వం॥ సుబ్బరావు గారు దోషములలోఁ బరిగణించిరో లేదో మేమెఱుంగముకాని యిట్టిసంధి విషయమై బహుజనపల్లి సీతారామాచార్యులవారు ప్రౌఢవ్యాకరణంబున నిట్లు వ్రాసిరి. ''కొన్నియెడలఁ బ్రామాణికప్రయోగంబులం ద్రుతంబున కచ్చుపరం బగుచో ద్విత్వంబు చూపట్టెడి.

ఉ. మ. ఘనచక్రాయుధనిష్ఠురక్షతగళద్రక్తాస్యసర్పాంగుని
న్ననుభూతాప్రతిమప్రగల్భపరివాదాంతర్ధితోద్విక్రముక్ ఉ. హ. 6 ఆ.
సర్వమున్నతని దివ్యకళామయమంచు. భాగ. 7 స్కం.
తరుణీశాతకటాక్షవీక్షలకొనల్దార్కొన్నచోట్లుంబలె, న్నురుశోభావిభవా కరంబులగుచున్ రోమాంకురస్థానముల్. కళా. ఆ. 7. (నన్నయభట్టారకుఁడు ''అన్నిష్ట సఖునూఁదియున్నదాని'' అని ప్రయోగించి ''లుక్సంశ్లేషో నాచిద్రుతస్య'' యని సంశ్లేషమును నిషేధించుట ప్రయోగవైరళ్య సూచనార్థంబని యెఱుంగునది.)''

దీని వలన నిది దుష్టము కాదనియుఁ దలఁచు ప్రయోగింప రాదనియు నేర్పడెను.

ఇఁక నారాయణశతకములోఁ గానవచ్చుకొన్నిదోషములను జేర్కొనెదము. అట్టివి భాగవతమున బమ్మెర పోతనామాత్య రచితభాగంబులఁ గలవేమో ప్రాజ్ఞు లారయుఁడు.

౫. గాడిదసౌరభ్యపరీక్షనూడఁ గుశలే.
౮. జగత్త్రయములన్ నిష్పాపులం జేయఁగా.
౧౧. మగమీనాకృతి వార్ధిఁ జొచ్చి.
౧౨. అత్యంతసాఃసర్థ్యులై.
౧౩. డాగున్న గర్వాంధునిన్.
౧౪. హేమకసిపోద్దండాసురాధీశ్వరున్.
౧౫. విహారించింద్ర విరించిశంకరమహావిఖ్యాతదివ్యాకృతిన్.
౧౬. త్రైలోక్యనిర్దుష్టమై. ఇరువయ్యొక్కటిమారు.
౨౪. నిర్భేద్యుండవై త్రైగుణోపేతంబై.
౩౧. తగిలుండు.
౩౨. శత్రోరగవ్రాతముల్.

౪౪. వ్రేపల్లెందాడుచు.
౪౮. వీలీషించము.
౫౮. చెప్లుకున్ - చాలకున్.
౬౧. తెల్సి.
౬౬. దాసోహభావము - దాసోహం భావమనియుండవలయు.
౬౭. భేషజునకున్.
౭౦. నిరసించేరికి.
౭౨. సంసారమాతుఃపయోధరదుగ్ధంబులు.
౭౬. కల్గుండు.
౮౦. కారుణ్యులై పుణ్యులై.
౮౩. జలయంత్రాన్వితబంధయాతనగతిన్. వృద్ధాప్య వేళంబులన్.
౮౪. మమహంకార వికారసంపద.
౮౮. వరదాసావళి దాసదాసినయి.
౯౧. గజయూథేంద్రుండు ఆపన్నుఁడై. ద్రౌపదీయెడ. నీశరణ్యామనెనో.
౯౯. జగత్త్రాతాహితల్పాంబుజోదర.
౧౦౦. భాగీరథీపడఁతి.

ఇఁక ఛందోభంగములంగనుఁడు.

౯౫. అనయంబున్ మదిఁదన్నెఱుంగక తుది న్నీమాయచే మగ్నుఁడై॥
ఇది వ్రాఁతప్రతి యందలిపాఠము. తుది న్నామాయచే నని శోధిత పాఠము.

ఈదోషములయం దీశతకము భాగవతమునకు సంపూర్ణ మగుపోలికతో నున్నదని మ-రా-శ్రీ, వంగూరి సుబ్బరావుగారు వ్రాసిరి. ఇది సత్యమా మీరే పరిష్కరింప సమర్థులు.

శతకము బాలకకృతమా?

ఈశతకమును బోతన బాల్యమున రచించెనని యోరుగంటివాదుల యభిప్రాయము గదా. ఇట్లు వ్రాయుటకు గ్రంథమం దాధార మొక్కటియైనఁ గానరాదు. తప్పులు కుప్పలుగా నున్నవి కావున బాల్యరచిత మఁట. అట్లైనచోఁ దప్పులు కుప్పలుగానున్నవన్నియుఁ బోతనరచితములా? బాల్యరచితములా?

ఈపద్యములు చిత్తగింపుఁడు - ఇవి బాలకవికృతములా!

మ. చన్నుల్ మీఁదికి చౌకళింప నడుముం జవ్వాడ కందర్పసం
పన్నాఖ్యంబు నటింపఁ జూడ్కి కబరీభారంబు లూటాడఁగా
విన్నాణంబుల నొప్పు గోపికలు.—46.

మ. కసవొప్పన్ పసిమేసి ప్రొద్దుగలుగం గాంతారముం బాసి య
ప్పసియు న్నీవును వచ్చుచో నెదురుగాఁ బైకొన్నగోపాంగనా
రసవద్వృత్తపయోధరద్వయహరిద్రాలేపనామోదముల్
పసిఁగొంచున్ బసిగొంచు వచ్చుటలు నే భావింతు నారాయణా.

ఇట్టి ప్రయోగములు మఱియుఁ గొన్నికలవు.—మఱియొక తెగ పద్యములు చూడుఁడు.

23-40-69-70-97. పద్యములు వేదాంతసంబంధములయి యున్నవి. బాలకవికి వేదాంతతత్త్వమెట్లలవడెనో? మీఁద వివరించిన యపలక్షణప్రయోగములన్నియు సహజపాండిత్యబిరుదమునకుఁ దార్కాణమంట! ఏమికడుపుమంట.

సభాస్తారులారా! సహజపాండిత్య మన నేమియర్థము? పాండిత్యము సహజ మని యర్థమా? లేక సహజముగ నోరవెడలు వెఱ్ఱివెక్కుడుకూఁతలన్నియుఁ బాండిత్యమునకుఁ జిహ్నమనియా? ఎంతెంత వెఱ్ఱికూఁత లెక్కువగఁ గూసిన నంతంత సహజపాండిత్యబిరుదమునకు యోగ్యుఁడగునా యేమి? నారాయణశతకము వ్రాసినవాఁడు తనకు లక్షణజ్ఞానము చాలదనియు నిట్టి గ్రంథమునఁ దనపేరు చెప్పుకొనుట శాశ్వతాపకీర్తిపాలగుటకే యని యెఱింగి నామధేయము దాఁచెను. ఆమాత్రజ్ఞానమును లేక యిటువంటి యపలక్షణ కృతియందుఁ బరమేశ్వరకరుణాకలితకవితావిచిత్ర సహజపాండిత్య యని పోతనామాత్యుఁడు వ్రాయునా? ఆగద్యము భాగవతమునకుఁ దగునుగాని దీనికిఁ దగునా? ఇందేకవితావిచిత్రము గానవచ్చుచున్నది? ఏమిపాండిత్యము ప్రకటింపఁబడినది? గద్యము శతకమునకు నదుకుపెట్టినట్టున్నదిగాని రెండు నొకరు వ్రాసినట్టున్నదా?

ఈపద్యమును దిలకింపుడు.

మ. చదువుల్ పెక్కులు సంగ్రహించి పిదపం జాలంగ సుజ్ఞానినై
మదిలోఁ బాయక నిన్ను నిల్పఁదగు నామర్మంబు వీక్షింపఁడే
మొదలం గాడిద చారుగంధవితతుల్ మోవంగ శక్యంబె శా
కది సౌరభ్యపరీక్షఁ జూడ కుశలే యవ్యక్త నారాయణా.

ఇది భావ మతిరమ్యమైన పద్యము!!! ఓరుగంటి ప్రాంతములందుఁ బరిమళపదార్థములు గాడిదలు మోయునుగాఁబోలు. దత్తమండలములం దట్టియాచారము లేదు. కావున నీశతక మోరుగంటిప్రాంతమునఁ బుట్టిన దనుటకుఁ బ్రబలాధార మోరుగంటివాదులకు లభించినది. మాబమ్మెర పోతన్న రసజ్ఞుఁడు కావున నిట్టి పిచ్చివ్రాఁతల వ్రాయఁడు.

97-వ పద్యమున ధర్మపురిలక్ష్మీనాథ నారాయణా యని యున్నది. ధర్మపురి గోలకొండదేశమున నున్నదఁట. ఆకారణముచే నీశతకము గోలకొండదేశమునఁ బుట్టెనఁట. ఇది బమ్మెరపోతన వ్రాసెనుగావున బమ్మెర పోతన గోలకొండదేశమున వాఁడేకాని దత్తమండలములవాఁడు కాఁడఁట. కూటసృష్టికి బరమోద్దేశ మిది. ధర్మపురములు రెండును ధర్మపురి యొకటియు దత్తమండలములందుండుట యోరుగంటివాదు లెఱుంగమి నిట్టిసాహసవాదమున కుపక్రమించిరి. ధర్మపురనృసింహస్వామిపేర నొకశతకము గలదు. ఇదియు గోలకొండదేశమునందే పుట్టె నని యొకరు వ్రాసిరి. ఆధర్మపురియందు లక్ష్మీనారాయణాలయము నృసింహాలయము రెండును గలవా? రెండును లేవా? యేల వ్రాయరైరో? ఈ శతకము దత్తమండలములఁ బుట్టినట్టు మేము స్థాపింప యత్నింపము. అదియెందైనఁ బుట్టనిండు. పోతనకృతము కాదనుటే మాయభిప్రాయము. అయిన 87-వ పద్యంబున,

మ. భవనాశిన్ గయ తుంగభద్ర యమునన్ భాగీరథిం గృష్ణ వే
త్రవతి న్నర్మద పెన్న బాహుద పయోరాశి న్వియద్గంగ యం
దవగాహంబుననైన పుణ్యము లొగి న్నారంగ నేఁ డిచ్చటన్
భవదంఘ్రిస్మరణంబునం గలుగు నోపద్మాక్ష నారాయణా.

అని పుణ్యనదులను బేర్కొనుచుఁ బెన్నను జెయ్యేటిని బేర్కొని గోదావరినిగాని శేషాద్రిరమణకవుల 'గంగబుగ్గను'గాని యేల పేర్కొనలేదో? తమ దేశనది నేల స్మరింపనైన స్మరింపలేదో? యోరుగంటివాదులు చెప్పరైరి.

ఈక్రింద వివరింపఁబడువిషయము లాలోచించి యిది బమ్మెర పోతనకృతమేమో పరిష్కరింపఁ బ్రార్థించుచున్నారము.

గీ. చేతులారంగ శివునిఁ బూజింపఁడేని, నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
యని చెప్పుటచేతను,

సీ. తనువున నంటిన ధరణీపరాగంబు, పూసిన నెఱిభూతిపూఁత గాఁగ
ముందర వెలుగొందుముక్తాలలామంబు, తొంగలసంగడికానితునుక గాఁగ

ఫాలభాగంబుపైఁ బరఁగుకావిరిబొట్టు, కాముని గెల్చినకన్ను గాఁగఁ
గంఠమాలికలోని ఘననీలరత్నంబు, గమనీయ మగుమెడకప్పు గాఁగ
ఆ. హారవల్లు లురగహారవల్లులు గాఁగ, బాలలీలఁ బ్రౌఢబాలకుండు
శివునిపగిది నొప్పె శివునికిఁ దనకును, వేఱులేమి దెల్ప వెలయునట్లు.

అనుటచేతను బోతన శివకేశవభేదము పాటింపనియద్వైతి యగుట స్పష్టము. ఇట్టియద్వైతి బాల్యమున వైష్ణవ విశిష్టాద్వైతిగా నుండెనని వాదించు జడుఁడుండఁడు గదా. తండ్రి శైవమతస్థుఁడు గావున నుండినఁ గొంత శైవపక్షపాతమే బాల్యమున నుండవచ్చును. ఇఁక నారాయణశతకములోని పద్యములం గనుఁడు.

౨౪. వరనాభీధవళాంబుజోదరమునన్ వాణీశుఁ గల్పించి య
ప్పురుషశ్రేష్ఠుని ఫాలమందు శివునిం బుట్టించి యామేటికిన్
బరమోత్తంసముగా వియత్తలనదిం బాదంబులం గన్నమీ
సరి యెవ్వారలు మీరుదక్కఁగ రమాసాధ్వీశ నారాయణా.

ఇందుఁ బురుషశ్రేష్ఠుఁ డనఁగా జీవకోటియందు శ్రేష్ఠుఁడని భావము. పురుషోత్తమశబ్దమునకుఁ బురుషులకంటె నుత్తముఁ డని వ్యుత్పత్తి.—ఇది బాలుఁడు నద్వైతి చెప్పినపద్యమా?

౨౬. ప్రభ మీనాభి జనించినలసత్పద్మోరు సద్మంబునం
ప్రభవం బైనవిరించి ఫాలజనితప్రస్వేదసంభూతుఁడై
యభిధానంబును గోరి కాంచెను భవుం డార్యేశు లూహింపఁగా
నభవాఖ్యుండవు నిన్నెఱుంగవశమే యబ్జాక్షనారాయణా.

ప్రథమపాదమున గణభంగము.—బ్రహ్మలలాటమందలి చెమటలోఁ బుట్టుటచే శివునకు భవుఁడనునామము కలిగెననియు నారాయణుఁ డభవుఁడనియుఁ జెప్పఁబడెను. ఇట్లు బాలుఁడు నద్వైతి చెప్పునా? ఈయైతిహ్య మెందలిదో పెక్కురు పెద్దవారే యెఱుంగరు.

౨౮. సవిశేషోరుసువర్ణబిందు విలసచ్చక్రాంకలింగాకృతిన్
భవుచే వృద్ధవుచే పయోజభవుచే పద్మారిచే భానుచే
దివిజేంద్రాదిదిశాధినాయకులచే దివ్యన్మునీంద్రాళిచే
నవదివ్యార్చన లందుచుందువు రమానారీశ నారాయణా.

ఇందు శివుఁడు లోనగువారు సాలగ్రామార్చనము చేయునట్టు చెప్పఁబడినది.

౩౮. వరుసం గర్తపిపీలికాకృత తనూవల్మీకనాళంబులోఁ
బరఁగంగా వసియించి యుండెడుమహాపాపోరగశ్రేణికిన్
బరమోచ్చాటనమై రహస్యమహిమన్ బాటింపుచున్నండుమీ
తిరుమంత్రం బగుమంత్రరాజమమరున్ దివ్యాత్మనారాయణా.

తిరుమంత్రశబ్ద మద్వైతినోర వచ్చునా? రహస్యశబ్దము రహస్యత్రయము సూచించుచున్నది.

౬౬. తనకున్ సాత్వికసంపదాస్పద మహాదాసోహభావంబునన్
ననయంబున్ మది నన్యదైవభజనం బాతంగ దూరింపుచున్
జనితాహ్లాదముతోడ నీచరణముల్ సద్భక్తి పూజించి నిన్
గనుగొన్నంతనె కల్మషంబులడగుం గర్మఘ్న నారాయణా.

అద్వైతి సోహమనునుగాని దాసోహమనఁడు. శివకేశవుల నిరువురఁ బూజించునుగాని శివపూజ మానఁడు. కావున నీపద్యమునందలి దాసోహంభావము నన్యదైవభజనదూరత్వము నద్వైతివాక్కు లగునా? ఇట్లన్యదైవభజనమునే పోతన దూరీకృతము గావించెనని చెప్పుచు నుత్తరకాలమునఁ బడుపులంజను గృతినాయికఁ జేసి యర్థార్థియై భజించె నని యోరుగంటివాదులు వాదించు టెట్టివాదమో.

౮౮. ధరగ్రామాధిపునింటిదాసుఁ డొరుకెంతో ద్రోహముం జేసినన్
పరగం జెల్లుట సూచితీభువనసంపాద్యుండ వైనట్టిమీ
వరదాసావలిదాసదాసినయి దుర్వారౌఘముల్ జేసితిన్
కరుణం జేకొని కావుమయ్య త్రిజగత్కల్యాణ నారాయణా.

మొదటి రెండుపాదములవలన నీకవి యోరుగంటివాసి గాఁడనియు సామాన్యగ్రామనివాసియనియు నేర్పడుచున్నది.

'దాసావలిదాసదాసి'నని తాను బురుషుఁడో స్త్రీయో యాజ్ఞానముకూడ లేక పోతన చెప్పెనను నోరుగంటివారివాదమును మీరంగీకరింతురా? "భృత్యస్య భృత్యపరిచారక భృత్యభృత్యభృత్యస్యభృత్య ఇతి మాం స్మర లోకనాథ" యను ముకుందమాలనుండి యిది గ్రహింపఁబడినది. ఇట్టిభావ మద్వైతికిఁ గలుగునా?

౯౨. నీలగ్రీవుఁడు చేతిపుర్రె విడిచెన్ నీయింతి భిక్షంబునన్
నీలగ్రీవుఁడు యీశ్వరాఖ్యఁ దనరెన్ నీనామజప్యంబునన్

నీలగ్రీవుఁడు మించి ద్రుంచెఁ బురముల్ నీప్రాపు సేవించినన్
నీలగ్రీవముఖాబ్జభాస్కరకృపానిత్యాత్మ నారాయణా.

౯౬. నీవే శంకరమూలమంత్రమయుఁడౌ నీవే జగత్కర్తవున్.

ఇవి యద్వైతి చెప్పునా. ఈ గ్రంథకర్త వైష్ణవ విశిష్టాద్వైతి యనుటకు మఱియుఁ గొన్ని యాధారములు గలవు. ఇంకొక పద్యము నుదాహరించెదము.

మ. స్నానంబుల్ నదులందుఁ జేయుట గజస్నానంబు చందంబగున్
మానంబొప్పఁ బఠించు వేద మటవీమధ్యంబులో నేడ్పగున్
నానాహోమములెల్ల బూడిదలలోన న్వేల్చు నెయ్యైచనున్
నీనామోక్తియు నీపదాబ్జరతియున్ లేకున్న నారాయణా.

ఇది ప్రతిదినము నుదయమున విశిష్టాద్వైతులు పఠించు కులశేఖరాళ్వార్ కృత ముకుందమాలలోని

ఆమ్నాయాభ్యసనాన్యరణ్యరుదితం వేదవ్రతాన్యన్వహం
మేదశ్ఛేదఫలాని పూర్తవిధయ స్సర్వే హుతం భస్మని
తీర్థానా మవగాహనానిచ గజస్నానం వినా యత్పద
ద్వంద్వాంభోరుహసంస్మృతిం విజయతే దేవ స్స నారాయణః॥

అను శ్లోకమునకుఁ దెనుఁగు. ఇది బాలుఁడు నద్వైతి యగువాఁడు చెప్పినాఁ డనినమాట విశ్వసనీయమా?

ఇట్టులే పోతనకుఁ గించిత్కాలపూర్వుఁ డగు లీలాశుకులు చెప్పిన కృష్ణకర్ణామృతములోని,

రాధా పునాతు జగ దచ్యుతదత్తచిత్తా, మంథాన మాకలయతీ దధిరిక్తపాత్రే। తస్యాః స్తన స్తబకచంచలలోలదృష్టిః దేవోపిదోహనధియా వృషభం నిరుంధన్—అను శ్లోకమును,

౮౨. పెరుఁగుల్ ద్రచ్చుచు నొక్క గోపిక మిముం బ్రేమంబునం జూచి రా
గరసావేశత రిత్తపవ్వ నిడియెం గవ్వంబు నీవు న్మనో
హరలీలం గనుగొంచు ధేనువని యయ్యాబోతునుం బట్టితీ
వరవృత్తాంతము లేను పుణ్యకథగా వర్ణింతు నారాయణా.

తాళపత్రగ్రంథమునందు మూలము ననుసరించి "ధేనువని యర్యాబోతుకుం బెట్టితీ"వని యున్నది. పరిశోధనము దున్న తెలివియుం బోయినది.

౨౩. మదిలోనం దమభక్తిపీఠముపయిన్ మానాథ మీపాదముల్
గదియం జేర్చినవానికే నొడయఁడన్ గానంచు నత్యున్నతిన్
పనిలుండై సమవర్తి భృత్యుచెవిలో భాగంబుగాఁ బల్కు మీ
పదపద్మార్చకు లెంతపుణ్యులో కృపాపారీణ నారాయణా.

ఈ భావము భాగవత షష్ఠస్కంధమున నజామిళోపాఖ్యానంబునం జెప్పఁబడినది. అజామిళోపాఖ్యానము భాగవతమునం దప్ప మఱి యొండుచోట లేదని వినికి. సంస్కృతగ్రంథ మీకవికి దుర్బోధము. కావున నీ పద్యము దాశరథిశతకానంతరమో యాంధ్రభాగవత షష్ఠస్కంధానంతరమో పుట్టియుండవలయును.

"ఎఱుంగునే పసులగాపరి భావజమర్మకర్మముల్" అను పారిజాతాపహరణవాక్యము మీకందఱకు ముఖస్థమేకదా. నారాయణశతకకవి దాని ననుసరించి

"పసులంగాపరి యేమెఱుంగు మధురప్రాయోల్ల సద్వృత్తవాగ్విసరారావము" అని కొంచెము మార్చిచెప్పెను.

దీనివలన నిది పారిజాతాపహరణమునకును వెనుకఁ బుట్టిన దని తలఁపవచ్చునుగదా.

పూర్వోదాహృతపద్యములవలన నారాయణశతకకవి వైష్ణవవిశిష్టాద్వైతి యగుట నిస్సందేహము. వీరభద్రవిజయము శైవవిశిష్టాద్వైతి వ్రాయుటయు నిశ్శంకము. ఈరెండును బోతన బాల్యమున రచించె నని యోరుగంటి వాదులు వాదించుచున్నారు. ముందు శైవుఁడై యావల వైష్ణవుఁ డయ్యెనా ముందు వైష్ణవుఁడై యావల శైవుఁ డయ్యెనా తరువాత నద్వైతి యెప్పు డయ్యెను? భోగినీవర్ణనారతుఁ డెప్పుడయ్యెను?

శ్లో॥ వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన
బహుశాఖా హ్యనంతాశ్చ, బుద్ధయోఽ వ్యవసాయినామ్
అనుట యిందు స్మరణీయము.

నారాయణశతకమున ముద్రితగద్యము కూటసృష్టి యని సప్రమాణముగ నిరూపించితిమి. గ్రంథస్థసాక్ష్యమువలన నిది బమ్మెర పోతరాజకృతము గాదని నిర్ధారించితిమి. ఇది మాయభిప్రాయము. విజ్ఞులు, కవులు, పండితులు నగు మీయట్టివారు మాయభిప్రాయ మొప్పో తప్పో యెఱిఁగింపవేఁడెదము.

గీ. "సభకునచ్చి ధర్మసందేహ మడిగిన, నెఱిఁగి చెప్పకుండు రేని సభ్యు
లనృతదోషఫలమునం దర్ధ మొందుదురు"

గీ. "ధర్మ మెఱిఁగియుండి దా నొండుగా లాభ, లోభపక్షపాతలోలబుద్ధి
సభల నెవ్వఁడేని సభ్యుఁడై పలుకు వాఁ, డనృతదోషఫలము ననుభవించు"

అను సూక్తులు మీ స్మరణమునకుఁ దెచ్చుచున్నారము.

ఈకూటసృష్టి యెవ్వఁ డెప్పుడు చేసె నని నిర్ధారింప మిమ్ము మేము కోర లేదు. ఇందలిగద్యము కూటసృష్టి యగునా కాదా? ఈశతకము బమ్మెర పోతనామాత్యరచిత మనవచ్చునా? ఇవియే మీరు పరిష్కరింపవలసిన విషయములు.

మాకడపమండల పోతనామాత్య సమాజమువారి పక్షమున మీకం దఱకు వందనముల నర్పించి విరమించుచున్నాఁడ.

జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మ (పాఠకుఁడు.)

8-6-1919 యందు నెల్లూర జరగిన యాంధ్రసాహిత్యపరిషద్వార్షికోత్సవ సమయంబునఁ బై వ్యాసము మా పోతనామాత్యసమాజము పక్షమునఁ దత్సభ్యులలో నొకరగు బ్ర॥ శ్రీ॥ జనమంచి వేంకటసుబ్రహ్మణ్యశర్మగారిచేఁ బఠితమయ్యె. ఈ వ్యాసమును విని యాంధ్రసాహిత్యపరిషత్పుస్తకభాండాగారమునందుండి సభకుఁ దేఁబడిన నారాయణశతకము వ్రాఁతప్రతిని నందునూతనముగఁ గ్రొత్తమసితో (Fountain pen ink) వ్రాయఁబడిన గద్యమును గని సభ్యులందఱు నేకవాక్యముగఁ దద్గద్యము కూటసృష్టియని కంఠోక్తిగ వక్కాణించిరి. సభకు విచ్చేసియుండిన బ్ర॥ శ్రీ॥ పెద్దిభొట్ల వీరయ్యపంతులవారును వ్యాసమును విని గద్యమును గని నారాయణశతకమును బూర్ణముగఁ బఠింపక కార్యాంతరవశులై కొంతభాగముమాత్రము చదువుటచే నారాయణశతకము పోతనవిరచితమని పొరపడితిమనియు మూలగ్రంథమును జూచినవాఁ డెవ్వఁడైనను నందలిగద్యము కూటసృష్టియని యంగీకరింపక మానఁడనియు నుపన్యసించిరి. బ్ర॥ శ్రీ॥ రాజశ్రీ చిలుకూరు వీరభద్రరావుగారీ గ్రంథము ముద్రింపఁ బ్రయత్నములు జరుగుచుండఁగనే తామిది పోతనది గాదు. ఆయన పేరఁ బ్రకటింపవలదని తత్ప్రకటనకర్తలను హెచ్చరించినట్లు చెప్పిరి. బ్ర॥ శ్రీ॥ జయంతి రామయ్యపంతుల వారిది పోతన కృత్యముగాదనియు గద్యము నూతన సృష్టమనియు నభిప్రాయపడిరి.

ఈ సృష్టి నూతనము గావునఁ జౌర్యము చేసేతఁ జిక్కుపడియె. కాలము

గడచుటం జేసి వీరభద్రవిజయమున వంశావళి వ్రాసిన దొంగలు భోగినీ దండకమునఁ బద్యమును వ్రాసిన తస్కరులు పట్టుపడకున్నారు. ఆరెండును గూటసృష్టియగుట నిస్సందేహము. ఆ విషయము తృతీయ చతుర్థభాగములయందు విమర్శింపఁబడును. సత్యమిట్లుండ మహా పరిశోధక ఖ్యాతియుఁ జరిత్రకారులను కీర్తియుఁ గని యిప్పుడు కీర్త్యవశిష్టులయిన రావుబహదర్ కందుకూరి వీరేశలింగముపంతులవా రాంధ్రపత్రిక యుగాదిసంచికకు బమ్మెర పోతరాజును గుఱించి యొక వ్యాసమును వ్రాసియిచ్చిరి. ఇది వారి మరణానంతరము ప్రకటింపఁబడి లోకమున వెలువడియె. ఆవ్యాసమునం దీనారాయణశతకమునుగుఱించి యిట్లు వ్రాయఁబడియున్నది.

"పోతన విరచిత నారాయణశతకములోని యీక్రింది పద్యమువలనఁ గూడ

మ. అపరాధంబులు నిన్ను నమ్మివినుమే నాజన్మపర్యంతమున్
విపరీతంబుగఁ జేసినాఁడ నికనీవేదిక్కు నాలోనికిన్
గపటంబింతయులేక దండధరుకుం గట్టీక రక్షింపుమీ
కృపకుం బాత్రుఁడనయ్య ధర్మపురి లక్ష్మీనాథనారాయణా.

భాగవతమునఁ బేర్కొనఁబడిన యేకశిలానగరమోరుగల్లేయని యూహింపఁబడఁ దగియుండలేదా? ఈ ధర్మపురి నైజామురాజ్యములో మంథెన సమీపమున గోదావరీతీరమునందున్నది. పోతన భాగవతమునఁ జెప్పఁబడినట్టు చంద్రగ్రహణ పుణ్యకాలమున గంగాస్నానార్థముపోయిన దీపట్టణమునకే యయియుండును. మహేశ్వర ధ్యానంబుచేసి కించి దున్మీలితలోచనుండై యుండినపుడు రామభద్రుఁడు కవికిఁ గన్నుఁగవకెదుటఁ గానఁబడుట యిచ్చట నేయయియుండును. అందుచేత నావఱకు శివభక్తుఁడయి యుండిన పోతనార్యుఁ డాకస్మికముగా విష్ణుభక్తుఁడుగా మాఱి యీయూరి నారాయణునిపై నక్కడనే నారాయణశతకమును జెప్పియుండును. అక్కడనుండి మరల కొన్ని దినములలో నేకశిలానగరమునకు వచ్చి శ్రీ కృష్ణస్తుతితో భాగవతపురాణాం శ్రీకరణ మారంభించియుండును. ధర్మపురీశ్వరునిఁ బేర్కొనుటచే బమ్మెర పోతరాజు స్నానమునకుఁ బోయినది యీపురముకడనున్న గౌతమీ గంగకే యనియు గోదావరినుండి కొన్నిదినములలో వచ్చిన యేకశిలానగర మోరుగల్లేయనియు సులభముగాఁ దెలిసికోవచ్చును."

మహాపరిశోధకుల వాక్యవైఖరి వాదము తీరుగంటిరిగదా! ఇందు మేము

గ్రీఁతలు గీచిన పలుకుల విమర్శించెదము. "పోతన విరచిత నారాయణ శతక"మఁట. పంతులవారి యీ గ్రంథకర్తృత్వస్థాపనము ప్రభావతీప్రద్యుమ్న మును దమపేరఁ బ్రకటింప సిద్ధపడి తమయదృష్టముకొలఁది గురుజాడ శ్రీరామ మూర్తి పంతులవారందలి కొన్ని పద్యములు ప్రకటింపఁ బరిభవగండము తప్పించుకొనిన యాపంతులవారి చరిత్రము స్మృతికిఁ దెచ్చుచున్నది. "అప రాధంబులు నిన్నునమ్మి వినుమే నా జన్మపర్యంతముఁ" అను వాక్యమువలన నీకవి చిన్నప్పటినుండి నారాయణమూర్తినే నమ్మి విష్ణుభక్తుఁడై యుండెనని స్పష్టమయ్యెఁగదా. అంతియగాక తక్కిన గ్రంథమువలన నీకవి వైష్ణవ విశిష్టా ద్వైతి యనుటకు సందేహమే లేదుగదా? ఇట్లుండ శైవవిశిష్టాద్వైతియై వీర భద్రవిజయము రచియించి వైష్ణవవిశిష్టాద్వైతియై నారాయణశతకము రచించి యావలఁ గొన్నిదినములలో నద్వైతియై భాగవతము రచించెనఁట. పోతన కూడ నెంత శీఘ్రకాలమున నెన్ని మతముల భ్రష్టుఁడయ్యెను.

"ఈ ధర్మపురి మంథెనసమీపమున గోదావరీతీరమున నున్న"దఁట. గ్రంథమందుఁ జెప్పఁబడిన ధర్మపురి నైజాము రాష్ట్రములోని ధర్మపురియేయను టకు నేమి ప్రమాణము? దత్తమండలముల మూఁడు ధర్మపురులున్నవి. అం దొక్కటి కడపకుఁ గేవల సమీపమున నున్నది. ఈ ధర్మపురియందఁట శ్రీ రాములు పోతన్నకుఁ బ్రత్యక్షమై భాగవతము వ్రాయ నియమించెనఁట! ఆంధ్రకవుల చరిత్రము (నూతన ముద్రణము 564-వ పుట) నందుఁ బంతుల వారీ వృత్తాంతము స్వప్నావస్థయందు జరగెనని లిఖించిరి. ఇప్పుడు జాగ్రద వస్థలోఁబడిన వీ రిది సత్యమని వ్రాయుటయేగాక "యావఱకు శివభక్తుఁడై యుండిన పోతనార్యుఁ డాకస్మికముగా విష్ణుభక్తుఁడుగా మాఱి యాయూరి నారాయణునిపై నక్కడనే నారాయణశతకమును జెప్పెననియు లిఖించిరి. సెబాసు రామచంద్రబాబయ్యా! బ్రాహ్మణుఁడు నిమిషములో భ్రష్టుఁడైన ట్లుగ నీమహిమ యేమోగాని పోతన ముఖమున నావఱకుండిన విభూతిని దిరు మణి శ్రీచూర్ణములుగా నిమిషములో మాఱునట్లు చేసితివి!!! దేవతాంతర పరి గ్రహము దూషించిన యీ పోతన తరువాత నెట్లు దేవతాంతర పరిగ్రహ మంగీకరించెనో పంతులవారు వ్రాయ రైరి. ఆవఱకు శివభక్తుఁడే యై యుండినచో "నేను నిన్ను నమ్మి యీ జన్మ"మని యెట్లు వ్రాసెనో యదియుఁ బంతులవారు సెలవీయరైరి. పంతులవా రనాలోచితముగ నవిమర్శముగ వ్యర్థపువ్రాఁత వ్రాసిరనుటకుఁ బ్రబ లాధారము గలదు. నారాయణశతక

మెంతటి యవలక్షణ గ్రంథమో మీఁది విమర్శమువలన స్పష్టపడియెఁగదా. ఈ శతకము వ్రాసిన 4-5 దినములలోనే పోతరాజు ఏకశిలానగరమునకు వచ్చి భాగవతము రచించెనఁట. ఈ నూతన వైష్ణవ విశిష్టాద్వైతి శివునకు జఘ న్యత కల్పించినవాఁడు 4-5 దినములలోనే మరల నద్వైతి యెట్లయ్యెనో పంతులవారు చెప్పరైరికదా. ఈ కొలఁదిదినములలో నింతటి లక్షణజ్ఞాన హీనుఁ డంతటి లాక్షణికుఁ డెట్లయ్యెనో యదియు సెలవీయరైరి. భోగినీ దండక మేతద్గ్రంథ పూర్వవిరచితమనికదా వీరి మతము. అందిట్టి లక్షణదోష ములు కానరాకుండుటకు నందలి యంత్యానుప్రాసప్రీతి యిందుఁ గానఁబడ కుండుటకు నేమి హేతువు? దండకరచన కాలముననున్న లక్షణజ్ఞాన మిప్పుడే గోదావరిలోఁ గలసెను? మతముతోడ మఱియుఁబోయెనా? గోదావరీతీరమున మహేశ్వరధ్యానము సేయునెడ రామచంద్రుఁడు గోచరించెనఁట. ధర్మపురి యందుఁ గోదండరామాలయముగాని సీతారామాలయముగాని లేదఁట. అద ట్లుండఁ బ్రత్యక్షమై యనుగ్రహించిన మూర్తిపై శతకము చెప్పక పదిలోఁ బదునొకొండుగ నారాయణుని స్తుతింపనేల? ఈ శతకరచనముగుఱించి భాగ వతమునఁ బ్రస్తావింపకుండుట యేల? కన్నుల కెదురుగనుండు గోదావరి పేరైనఁ జెప్పక యొంటిమిట్ట కనతిదూరముననుండి నైజాము రాష్ట్రములోనివారికిఁ బేరైనఁ దెలియరాని చెయ్యేటిని జెప్ప నేల?

"ఓరుగంటి కాధారముగ లిఖితాధారములు తాళపత్రములు సృష్టింపఁ బడుచున్నవని వింటిని" అని యాంధ్రవాల్మీకులును భక్తాగ్రేసరులునైన శ్రీ వావిలికొలను సుబ్బరావుగారు పలికినట్లు వారియిష్ట దేవతానుగ్రహంబున నా కొఱఁతయు శీఘ్రకాలములోనే తీరునేమో." ఇది రావుబహాదర్ వీరేశలిం గము పంతులవారి యంత్యవాక్యము. బ్ర॥ శ్రీ॥ వావిలికొలను సుబ్బరావు గారిని సత్యవాక్కులను జేసిన యోరుగంటివాదులు వంద్యులు. వారి వాక్యసర ణిఁ జూడ నారాయణశతక గద్యసృష్టికిఁ బంతులవారు కారయితలో ప్రేరకులో యయి యుందురని సంశయింపఁ దగియున్నది. తమ వాదమునకుఁ బంతుల వారు 'కొఱఁత'గ భావించియుండిన కూటసృష్టి వారి జీవితకాలములోనే తీరుటయుఁ దత్కర్తలయుఁ దత్సంబంధులయు బవిసి నిండుసభలో నాఱి పోవుటయు రావుబహాదర్ వారు వినుటకుమున్నే కన్నులు మూసికొని ధన్యులైరి.

శ్రీరామాయనమః.

వీరభద్రవిజయ కర్తృత్వఖండనము

తృతీయ ధాటి.

అది యెట్టిపాపమో కాని శిశు శౌచక్రియాలోల లగు లోలాక్షుల కరతామరసంబుల నలంకరింపఁ దగుపుస్తకములందుఁ దుదనో మొదటనో బమ్మెర పోతరాజు పేరెవరో యేదో యుద్దేశముతో నిఱికింపఁగాఁ గొంద ఱెఱిఁగియో యెఱుఁగకయో బాలప్రాయపుఁ గృతియని చనుఁబాలప్రాయపుఁ గృతియని యుగ్గుఁబాలప్రాయపుఁ గృతియని పేర్లుపెట్టి పోతరాజునకుఁ "కవిపట్టపురాజునకు" నపకీర్తి మెడఁగట్టుచున్నారు. పోతనవిషయమున నిట్టిద్రోహము పూర్వమందును జరిగియుండినదనుటకుఁ బోతన్నను నోరుగంటివానిని జేయఁగోరి తదభిమానులెవరో నారాయణశతకము కడపట నాయనపేరట గద్యముసృష్టించి వ్రాయుటే ప్రత్యక్షప్రమాణము. మన కన్నుల యెదుటనే యిట్టి ఘోరకార్యములు చేయువారును జేయించువారును నామోదించువారును గానవచ్చుచుండ నిట్టిమహాత్ములు పూర్వముమాత్రము లేకుందురా? పోతనయందంతటి ప్రీతిగలవా రుత్తమగ్రంథములందుఁ దమప్రకృతి నికృతి చమత్కృతి నెఱపి యాయన కపకీర్తిరానైన లేకుండఁ జేయరాదా? అధమాధమ గ్రంథము లాయుత్తమకవి మెడకుఁ గట్టవలయునా?

ఆర్యులారా! దీనికిఁ గారణము లేకపోలేదు. పోతరాజకృత భాగవతము ఛిన్నము భిన్నము కొంతనష్టము కృమిదష్టమైపోవుట సత్యము. (ఆయన వ్రాసిన తాళపత్రగ్రంథము సమగ్రముగనో యసమగ్రముగనో దొరకినదని వాదించువారు లోకవంచకులు.) నష్టభాగములను దరువాతి వారు తమశక్తి కొలఁదిఁ బూరించుటయు సత్యము. వీరు లాక్షణికులుగామి వీరు రచించిన భాగంబుల దోషంబులుండుటయు సత్యము. విమర్శన శక్తిగలవారు గ్రంథము సాంతముగఁ బఠించినవారు "బమ్మెరపోతరాజకృత భాగవతంబు సలక్షణంబుగా కిష్మహి నేమిటంగొదవ" యనియుఁ "బోతకవీంద్రుని కవనమందు లక్షణం బెందుఁ దప్పునా దక్షహారణ" యనియు వ్రాసిరి. విమర్శనశక్తి చాలని

వారును, సాంతముగఁ బఠింపక పీఠికలుచదివి విమర్శించువారును, ధ్యానము సేయుచున్న యనఁగా నిద్రపోవుచున్న యని యర్థము గ్రహించు శక్తిగలవారును, గుంభకర్ణ విభీషణశబ్దములలో భకారముండుటచే రావణశబ్దము రాభణయనియే యుండవలయునని వాదించినట్టు లెవఁడో వ్రాసిన వీరభద్రవిజయమందు దోషములున్నవి. కావున భాగవతంబునందును దోషములున్నవని యెంచవలయుననియు దోషము లనునవి రెంటియందునుండుట రెండును నేకకర్తృకములని వ్రాసిరి. ఇట్టి యభిప్రాయములుగలవారు ప్రౌఢవయస్సున వ్రాసిన భాగవతమున దోషములుండఁగాఁ దత్పూర్వకృతములందు దోషములుండుట యరుదాయని వాదింపవచ్చునని క్షుద్రగ్రంథములందు స్వవాదోపపత్తికై పోతన పూతనామధేయముఁ జేర్చుచున్నారు. చేర్చిరి! చేర్పఁగలరేమో.

బమ్మెరపోతన పేర నిప్పటికిఁ గూటసృష్టమైన గ్రంథములందు వీరభద్రవిజయము మొదటిది. రెండవది భోగినీదండకము. మూఁడవది నారాయణశతకము. వాదాభినివేశముచే నిఁక నెన్ని వెలువడునో యెవ్వఁ డెఱుఁగును. పూర్వ విమర్శితము నారాయణశతకము. వీరభద్రవిజయము ప్రకృతము విమర్శింపఁబడును. గురుజాడ శ్రీరామమూర్తిపంతులవారును, వావిలికొలను సుబ్బరావుగారును విపులముగ మున్నె చర్చించియుండుటచే మేమిది సంగ్రహించి వ్రాసెదము.

'ప్రయోజన మనుద్దిశ్య నమందోపి ప్రవర్తతే' యని కలదుకదా. ఇందుఁ గూటస్రష్టల యుద్దేశ మేమై యుండును. దానివలన వారికిరాఁగల లాభ మేమి యని యాలోచింతము. బమ్మెరపోతరాజు తండ్రి శైవుఁడు. ఈ యింటిపేరుగల యితరులును శైవులే. అట్టి శైవమతమునఁ బుట్టిన పోతన్న శైవసిద్ధాంతగ్రంథములను వ్రాయక విష్ణుపరత్వము స్థాపించు శ్రీభాగవతమును దెనిఁగించెను. దీనిం గనిన వీరశైవేతరులు శైవమతమునఁ బుట్టిన పోతనామాత్యుఁడే శివపరత్వ మంగీకరింపక విష్ణుపరత్వ మంగీకరించెనని వీరశైవులను సోత్ప్రాసములాడి యుందురు. హిందువులందు విద్యావంతుఁడగు వాఁడు కామినీకాంచన దాసుఁడై స్వమతభ్రష్టుఁడై యన్యమతప్రవిష్టుఁడై నవు డామతమువా రిట్టిమాటలాడుచుండుట మనము వినుచున్నారముగదా. కావున నందు వింతయేమియు లేదు. అట్టిమాటలు వీరశైవులకుఁ గొందఱకుఁ గాకున్నఁ గొందఱకైన గోపకారణమై యుండును. ఆ కారణముచేఁ బోతరాజు శివపరత్వముగూడ స్థాపించెననుటకై వీరభద్రవిజయము భాగవతగ్రంథకర్తృక మనిపింపవలసి

వచ్చెను. "ఇట్టి యీభాగవతపురాణమును శివపరత్వమును స్థాపింపకరచియించుటచేత నితనికి నోటవ్రణము లేచి పురుగులుపడినట్టును దానిఁ బోఁగొట్టుకొనుటకై పిమ్మట వీరభద్రవిజయము అను శైవగ్రంథమును రచియించినట్టును కొందఱు పాషండులు పలుకుచుండుదురు" అను పాలపర్తి నాగేశ్వరశాస్త్రులవారి వాక్యము మా యూహను బలపఱుచుచున్నది. ఇట్టిపాషండు డెవఁడో వీరభద్రవిజయమున వంశావళిని గద్యమును మార్చెను. అంతటితో సంతుష్టి లేని మఱియొకఁడో 'భాగవతప్రబంధ మతిభాసురతన్' అను పద్యమును నిఱికించెను. దీనిని బ్రమాణముగఁగొని మహాగ్రంథ పరిశోధకులు నాంధ్రకవులచరిత్రకుఁ గర్తలునగు వీరేశలింగముపంతులవా రాపద్యము పోతరాజకృతమనినచోఁ గలుగు నసందర్భములనైన నాలోచింపక యది ప్రక్షిప్తమని యితరులు వ్రాసినను లక్ష్యపెట్టక తమవాదము మానుకొనక 25 సంవత్సరములుగ నాపద్యము పోతరాజకృతమేయని తమ యాంధ్రకవులచరిత్రము ప్రతిముద్రణమందును బలుమాఱు వ్రాసిరి. తుదకీవిషయమును బూర్ణముగ బ్ర॥ శ్రీ॥ వావిలికొలను సుబ్బరావుగారు చర్చించి యాపద్యము పోతరాజకృతము కాదనియుఁ బ్రక్షిప్తమనియు వీరభద్రవిజయగ్రంథకర్త నామము పోతరాజేయనుట సత్యమైనచో నతఁడు కాలాంతరముననున్న మఱియొకఁడనియు నొక విపుల వ్యాసము వ్రాసి యాంధ్రసాహిత్యపరిషత్పత్రికయందుఁ బ్రకటింపించిరి. ఇప్పుడు మే మీగ్రంథముతోపాటు ముద్రించిన 'పోతన నికేతనచర్చ' యను గ్రంథమున దానింగాన నగు. ఆవ్యాసమును గని వీరేశలింగముపంతులవారు తమ యంత్యవ్యాసమున

" ముద్రితమైయున్న వీరభద్రవిజయములో

ఉ. భాగవతప్రబంధ మతిభాసురతన్ రచియించి దక్షదు
ర్యాగ కథాప్రసంగమున నల్పవచస్కుఁడ నైతిఁదన్నిమి
త్తాగత వక్త్రదోష పరిహారతకై యజనైకశైవ శా
స్త్రాగమ వీరభద్రవిజయంబు రచియించెద వేడ్కనామదిన్.

అనియుండిన పద్యమును జదివి భ్రమపడి నేనుభాగవతరచనానంతరము వీరభద్రవిజయము వ్రాయఁబడెనని చెప్పియుంటిని. ఇప్పుడు గురుప్రాయులై వావిలికొలను సుబ్బరావుగా రీపద్యము వ్రాఁతప్రతులలో లేదనిచెప్పి నాకన్నులు తెరపిచూపినందునను ఇప్పుడు నేనిందునిమిత్తమై చదివిన వ్రాఁతపుస్తకములలో నొక్కదానియందు దప్ప నీపద్యము కానఁబడనందునను కవి చిన్నవాఁడని

చెప్పినపద్యమున కది ప్రత్యక్షవిరోధముగా నున్నందునను ఈ పద్యము ప్రక్షిప్తమని నిశ్చయించి నాప్రమాదమును కృతజ్ఞతాపూర్వకముగా సవరించుకొనుచున్నాను. శైవుఁడు వైష్ణవపురాణమును రచియించెనన్న శైవసంఘమునకెల్ల నవమానకరముగా నుండునని యెంచి భాగవతరచనా పాపపరిహారార్థముగాఁ దరువాత వీరభద్రవిజయము రచించినట్లు స్వజనులలో నమ్మకము కలిగించుటకై వీరశైవుఁడెవ్వఁడో యొకఁ డీపద్యమునుగూర్చి పుస్తకమునఁ జేర్చియుండును." అని లిఖించిరి. కడప మండలమువారి భ్రాంతినివారణము చేయఁ గంకణము కట్టుకొన్న రావుబహదర్‌వారే తమ చిరకాలభ్రాంతిని మానఁ బోఁగొట్టుకొంటిమని విధిలేక వ్రాయవలసివచ్చినపు డెంత తహతహలాడి యుందురో! వీరు జీవించియే యుండినచోఁ బరశ్శత విషయముల వీరిచే నిట్లే వ్రాయించియుందుము. అదట్టు లుండనిండు. క్రిందఁబడినను మీసాలకు మన్నుకాలేదన్నట్టు భాగవతానంతర కృతము వీరభద్రవిజయమను తమవాదమును మానికొనియు స్వాభిమానవశంబున వాదము విడువలేక భాగవతమునకు ముందే వీరభద్రవిజయము రచియింపఁబడెనని యొకవాదమును గల్పించిరి. వారివాదవిధమును వారివాక్యములచేతనే తెలిపెదము.

"వీరభద్రవిజయము పోతనకృతము కాదనియు నెవ్వఁడో వేఱొకఁడు పోతనపేరుపెట్టి దానిని రచియించెననియు మొట్టమొదటఁ గొంతకాలము క్రిందట నొకవాదము బైలువెడలినది; ఆవాదము నిలువదని తేటపడిన తరువాత నిప్పు డిది పోతనకృతమేయనియు వీరభద్రవిజయము రచియించిన పోతన భాగవతమును జేసినపోతనగాక వేఱుపోతనయనియు నిద్దఱుపోతన్న లున్నట్లు బుద్ధిమంతులగుటచే నింకొకవింత వాదమును బైలుదేఱఁదీసిరి. పోతన్న కాని వాఁడు కష్టపడి పుస్తకముచేసి తనపేరు మాసిపోవునట్లుగా నన్యుఁడైన పోతన్న పేరు పెట్టుటకుద్దేశమేమియుండును. పుస్తకమునకుఁ బ్రసిద్ధిరావలెనన్న యుద్దేశముతో నట్లుచేసిన నెడు పక్షమున పూర్వలాక్షణికులు నిర్దుష్టకవిత్వముకాదని నిరాకరించిన పోతన్నకు కర్తృత్వ మారోపించుటకంటె సర్వలాక్షణికులును పరమప్రమాణకవిత్వమని శిరసావహించెడు తిక్కనాదులలో నొక్కరికి తనపుస్తకకవిత్వము నారోపించియుండరా? పుస్తకములో కర్తపేరు ప్రత్యక్షముగాఁ గనఁబడుచున్నప్పుడు దానిని నిరాకరించి యన్యకర్తృత్వము నారోపించుటకు నిరాక్షేపములును నిర్దుష్టములునైన యమోఘనిదర్శనములుండ నక్కఱలేదా? వీరభద్రవిజయమును రచియించిన పోతన్న వేఱు భాగవతమునురచించిన పోతన్న వేఱు అని చెప్పుటకైన నేమి హేతువులున్నవి?"

ఇప్పుడీవాద సాధుత్వము విమర్శించి సిద్ధాంతభారము మధ్యవర్తులపై విడిచెదము.

వీరభద్రవిజయ గ్రంథకర్తయు భాగవతగ్రంథకర్తయు నొక్కఁడు కాఁడని మా వాదము. వీరభద్రవిజయ గ్రంథకర్త నామధేయము పోతన్నయైనఁ గావచ్చును. కాకుండిన మఱియొక భూతన్నయైనఁ గావచ్చును. పర్యాయమున నీ రెండును విమర్శింతుము.

వీరభద్రవిజయకర్తపేరు పోతన్నయని ముద్రితగ్రంథగద్య వంశావళులఁ గానవచ్చుచున్నది. ఈ పోతన్నయింటిపేరు బమ్మెర కాదు. అతని యింటిపేరు బమ్మెరవారని గ్రంథమునం దెందును నెంత వెదకినను నేఁటివఱకుఁ గానరాదు. కావునఁ బోతనయను పేరుగల వీరశైవుఁ డెవఁడో యాగ్రంథమును దొలుత రచియించి యుండవచ్చును. తరువాతి వారో నామసామ్యమును గమనించి వీరశైవులకు వచ్చిన యవయానమును బాపుకొనుటకై వంశావళిని గద్యమును మార్చియుండవచ్చును. వీరభద్రవిజయ గ్రంథకర్త వసిష్ఠ గోత్రజుఁడు. భాగవతగ్రంథకర్త కౌండిన్యగోత్రజుఁడు.

కం. విదితముగ నతని మొగముల, చదువులు నాల్గునుజనించె సరసతగా న
చ్చదువులు నాతని సృష్టికి, సదమలుఁడు వసిష్ఠతపసి జననంబయ్యెన్.

అని వీరభద్రవిజయమునఁ గలదు. ఇట్టి వసిష్ఠగోత్రసంభవుని కౌండిన్యగోత్రునిఁ జేయుటకై

"అట్టి వసిష్ఠపుత్రుం డగు కౌండిన్యుండు

చం. ధనదుం డాయత పుణ్యమూర్తి మునిమందారుండు సన్మాన్యుఁడు
న్మునినిర్నిద్ర దయాత్ముఁడున్ మహితుఁడున్ మార్తాండ తేజుండు భా
తనయాధీశ్వర వర్ణనీయుఁడు తపోగణ్యుండు నైనట్టి కౌం
డినకుండన్ముని సన్మునీంద్రవరుఁడై యిద్ధాత్రిఁ గీర్తింపఁగన్."

వ. అట్టి కౌండిన్యగోత్రంబునం దాపస్తంబ సూత్రంబున"

అని రెండువచనంబులు నొకక్రియాశూన్య పద్యముతో నదుకుపెట్టఁబడినది. వాస్తవముగ వీరభద్రవిజయకర్త కౌండిన్యగోత్రజుఁడేయై ఋషిత్రయమును బేర్కొనఁ నుద్దేశించి యుండినచో మొదటివానిని మూఁడవవానిని జెప్పి నడుమనుండు మిత్రావరుణిని విడువ నేల? "వసిష్ఠ మిత్రావరుణ కౌండిన్య" యనికదా పరున, ఒక పురుషోత్తముఁడు తప్పఁ దక్కిన యందఱు కౌండిన్యుఁడు

వసిష్ఠు మనుమఁడని వ్రాసియున్నవారు. సూర్యచంద్ర వంశ్యరాజుల వంశావళిలో నామధేయములు లుప్తములు కాలేదాయను సమాధానమిందుఁ బొసఁగదు. కావున "అట్టి వసిష్ఠపుత్రుండగు కౌండిన్యుండు" అనునది మొదలు ప్రక్షిప్తమని చెప్పవలసియున్నది.

ఈ వంశావళియందుఁ బోతన యన్నయుఁ దండ్రులు మహైశ్వర్య సంపన్నులని మహాదాతలని చెప్పఁబడియున్నది. భాగవతమునందు నట్టిది కానరాదు. అంతటి యైశ్వర్యయుక్తుఁడైన పోతన హాలికుఁడైననేమి యని గ్రాసము కోసంబని చెప్పవలసినట్టిస్థితి కేలవచ్చెను?

వీరభద్రవిజయకర్త జనకశిక్షిత విహితవిద్యాభ్యాసుండనై' యని వ్రాసెను. ఇట్టివాఁడు విద్యాగురువు జనకుఁడునగు వానిపట్లఁ గృతఘ్నుఁడై భాగవతమున 'సహజపాండిత్య' యని యసత్యము వ్రాసియుండునా? సహజపండితుఁ డిట్టితప్పులు కుప్పలగు పుస్తకమునా వ్రాసియుండును?

వీరభద్రవిజయ రచనకుఁ గాశీఖండరచనకు నడుమ నథమపక్షమున నూఱేండ్లున్నట్లు బ్ర॥ శ్రీ॥ వావిలికొలను సుబ్బరావుగారు స్థాపించిరి కదా. దానికిఁ బంతులవారేల ప్రత్యుత్తరమీయలేదు?

శ్రీనాథుఁడు నిజసమకాలికుల గ్రంథములందలి తెనుఁగు పద్యములను దనగ్రంథములందుఁ జొప్పించినవాఁడు కాఁడు. అటుండఁ గవిత్వమున నారితేఱి కాశీఖండము వ్రాయునపు డీకుప్పచెత్త పుస్తకమునుండి "నీలకంఠునకును నెచ్చెలి కాఁడొకో" యను పద్యమును దొంగిలించెనని "బుద్ధిమంతులు" నమ్మరు.

మఱియుఁ దొలుతఁ గైవారశబ్దమును సంస్కృతముగ వాడినవాఁడు శ్రీనాథుఁడు. అట్టిప్రయోగమే వీరభద్రవిజయమునఁ గానవచ్చుచున్నది. కైవారము తెనుఁగు. ఈశబ్దవిషయమున శ్రీనాథుఁడు పొరపడెనని చెప్పుటకే నోరురాకయుండఁగా నిట్టిప్రయోగమును వీరభద్రవిజయమును బ్రమాణముగాఁగొని గ్రహించెనని "బుద్ధిమంతులు" నమ్మరు.

బాల్యకవిత్వమునకును బ్రౌఢకవిత్వమునకును శైలీభేదము కానవచ్చునన్నను చిన్నప్పటివి కొన్నిసహజములైన పోకలు పెద్దవారైనతరువాత వ్రాసిన గ్రంథములందును గానవచ్చుచున్నవి. అట్టివేవైన నిందుఁగలవా?

మతమునందును గవులిరువురు భిన్నులు. వీరభద్రవిజయకర్త శైవవిశిష్టాద్వైతి. భాగవతకర్త యద్వైతి. వీరభద్రవిజయము వ్రాయునప్పటికిఁ గవి

వీరశైవుఁడనియు ధర్మపురిలో గంగాతీరంబున విశిష్టాద్వైతి యయ్యెననియుఁ దరువాత నాలుగైదు దినములకే మరల నద్వైతి యయ్యెనను వాదమును "మహేశ్వరధ్యానంబుసేయుచుఁ గించి దున్మీలితలోచనుండనై యున్నసమయంబున" నను పోతనవాక్యమునకు "స్వప్నమునందు" నని యర్థము గ్రహించు 'బుద్ధిమంతులు' నమ్మవలయునుగాని తక్కినవారు నమ్మరు. ఏలనఁ బోతనయే "మదీయపూర్వజన్మ సహస్రసంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణ కథాప్రపంచ విరచనాకుతూహలుండనై" గంగాస్నానంబునకుం బోయితిననుటచే భాగవతమును దెనిఁగింపుమని శ్రీరామమూర్తిచే బోధితుఁడు గాకముందే యాయనకు విష్ణుభక్తి చిరకాలముగఁ గలదని బోధపడుచున్నది. ఇట్టివాఁడు విష్ణువునకు నికృష్టత చెప్పియుండఁడు.

సుబ్బరావుగా రిత్యాది కారణములచే భిన్నకర్తృత్వమును స్థాపించియుండఁగా వానిలో నొకదానికైనఁ బ్రత్యుత్తరమీయక "యిరువురు కవులు భిన్నులనుటకు నేమికారణము" లున్నవని పంతులవారు ప్రశ్నించుటయే వింత గొలుపుచున్నది.

దాక్షాయణీపరిణయకర్తలు తమ తాతపేరు బమ్మెరపోతన యని వ్రాసిరి. ఈయన వ్రాసినగ్రంథమేదియో చెప్పినవారుగారు. భాగవతమునంత లోకోత్తరగ్రంథమునే తమతాత రచియించియుండిన వారేల వేనోళ్లఁ గొనియాడకుందురు? శిథిలభాగములనేల వారు పూరింపకుందురు? కావున నాపోతన వీరభద్రవిజయకర్తఁగాఁ జెప్పఁబడు పోతన యేమోయని యూహింప వలనుపడుచున్నది గాని వీరభద్రవిజయకర్త తనయింటిపేరు బమ్మెరవారని చెప్పకుండుటచేతను గూటసృష్టవంశవర్ణనముఁబట్టి యూహింపవలసియుండుటచేతను నదియు నమ్మరాకున్నది. వీరభద్రవిజయమునందలి వంశావళి పెక్కుతాళగ్రంథములఁ గానవచ్చుచున్నది. భాగవత ప్రబంధమనునది యల్పసంఖ్యాగ్రంథములందుఁ గననయ్యెడిఁ గావున వంశావళిఁ దెలుపు పద్యంబుల సృష్టించినవాఁడును భాగవతప్రబంధ మను పద్యముఁ జేర్చినవాఁడును భిన్నులుగా నుండవలయునని మీఁద వక్కాణించితిమి. వీరభద్రవిజయకర్త కాశీఖండమునుండి ప్రయోగముల గ్రహించెనని వచించితిమి. ఇందలి "నల్లనవచ్చినిల్చె విషముప్పుడు నేరెడుపండు నాకృతిన్" అను వాక్యమును భీమఖండమును స్మరింపఁజేయుచున్నది.

అంతియకాక "మేరువువింటి కమ్మియఁట మేదినితేరఁట సూర్యచంద్రులిం । పారఁగ బండికల్లఁట ననంతుఁడు నారఁటబ్రహ్మవిష్ణువుల్ । సారథియున్ శరంబునఁట" అను పద్యమునందును "గానక కన్నకూఁతురున్" ఇత్యాది ప్రయోగంబులందును తరువాతి కవుల గమకములు గానవచ్చుచున్నవి.

కూటసృష్టి కుద్దేశమేమని పంతులవారు ప్రశ్నించిరి. ఈప్రశ్నలకుఁ బ్రత్యుత్తరమును దామే పదిపంక్తులకు ముందువ్రాసియు మరల నేవేవో యుక్తులఁబన్ని వానిని ఖండించిరి. "శైవుఁడు వైష్ణవపురాణమును రచించెనన్న శైవసంఘమునకెల్ల నవమానకరముగా నుండుననియెంచి వీరశైవుఁడెవఁడో యొకఁడు" పోతన యథార్థవీరశైవుఁ డనిపించుటకై వీరభద్రవిజయమున నతనిపేరిటికించి యుండవలయును. వాస్తవోద్దేశమిదిగానుండును గాని పుస్తకమునకుఁ బ్రసిద్ధిరావలెనని యుండఁజాలదు.

పుస్తకములలోఁ గర్తపేరు ప్రత్యక్షముగా కనఁబడుచున్నప్పుడు దానిని నిరాకరింపరాదఁట. నారాయణశతక గద్యమందును గర్తపేరు ప్రత్యక్షముగాఁ గానవచ్చుచున్నది. ఆపేరు గ్రాహ్యమా? గ్రాహ్యము గదా మఱి పంతులవారికి.

ఈ గ్రంథకర్తృత్వవిషయము మున్నే విపులముగఁ జర్చితమగుట నింతకెక్కువవ్రాయుట యనావశ్యకము. భిన్నకర్తృత్వమును స్థాపించుచు సుబ్బరావుగారు కాలవ్యత్యాసము అనర్వాచీనకవికృత పద్యదర్శనములోనైనవి కారణములు వ్రాసియుండ వానికిఁ బ్రత్యుత్తరమీయఁజాలక స్వకపోలకల్పితాక్షేపములకుఁ దామేసమాధానముచెప్పుకొని పంతులవారు సంతుష్టులైరి. ఆ సందేహములు నివారణమగువఱకు నిఁక నీవిషయము చర్చించుట వ్యర్థశ్రమమని యింతతో నీవిషయము విరమించి భోగినీదండక విమర్శమునకై ప్రారంభించెదము.

వీరభద్ర విజయకర్తస్థానమైన యివటూరునుగుఱించి విచారింపఁగా మ-రా-శ్రీ ఇవటూరి సోమేశ్వరరావుగారు 10-9-19 యందు "ఇవటూరనునది మా యింటిపేరు. ఆ గ్రామము గోదావరిజిల్లా దరినయున్న అయితంపూడికి ఉత్తరమున పదిమైళ్లదూరమున నున్నది" అని సుబ్బరావుగారిపేర వ్రాసిరి. ఈ అయితంపూఁడి కృష్ణామండలములోనిది. నరసాపురమునకు 18 మైళ్లలో నున్నది. వీరభద్రవిజయకర్త మనుమఁడు ఆయన యల్లుఁడు నా మండలములోఁ జేరిన ఆచంట లోనగు గ్రామములలో నుండినట్టు పూర్వమే సుబ్బరావుగారు వ్రాసియున్నారు. ఇటుచూచిన నితఁడును నోరుగంటి ప్రాంతమువాఁడు కాఁడు. ఈ యివటూరిప్పుడు 'బేచరాక్' అని వినికి. ఆరయవలయు.

శ్రీరామాయనమః.

భోగినీదండక కర్తృత్వఖండనము

చతుర్థఘాటి.

"పోతనచేసిన గ్రంథములు నాలుగు.—వీరభద్రవిజయము, భోగినీ దండకము, నారాయణశతకము, భాగవతము" అని కీర్తిశేషులైన రావుబహదర్ కందుకూరి వీరేశలింగముపంతులవారు వ్రాసిరి. నారాయణశతకము స్పష్టముగ నేఁటికాలపుఁ గూటసృష్టియని నిరుత్తరమగునట్లు విశదీకరించితిమి. వీరభద్రవిజయమున బమ్మెర పేరే లేదని, వంశావళి కూటసృష్టియని, యాయన యివటూరు నివాసియని, యాయన వంశమువా రివటూరికి సమీపమందుండు నజ్జరము ఆచంట గ్రామములవారని, యీ కారణములచే వీరభద్రవిజయకర్తయు నోరుగంటివాఁడు కాఁడని వివరించితిమి. భాగవతము బమ్మెర పోతరాజకృతమగుట నిర్వివాదము. ఇఁక భోగినీదండకము మిగిలెను. ఇదియైనఁ బోతనామాత్యకృతము కాఁగలదేమో చూతము.

ఈ దండకము దొలుత 1893-వ సంవత్సరమున శ్రీమదముద్రితగ్రంథచింతామణి పత్రికాధిపతులగు పూండ్ల రామకృష్ణయ్యపంతులవారిచే నెల్లూర ముద్రితము ప్రకటితము నయ్యెను. అవతరణికయందు "ఈ భోగినీదండకమును రచియించిన బమ్మెర పోతన్నగారు పదునేనవ శతాబ్దమున జీవించియున్నవారు. వీరి యశోవిశేషంబు శ్రీమదాంధ్రభాగవతరచనవలన భూవలితంబు. ఈ కవివరుం డీదండకంబు వ్రాసెనన్నవార్త యింతకాలముదాఁక లోకవార్తగనుండె. అది యిప్పటికొప్పుగనొప్పె. వీరి భాగవతగతంబగు "ఇమ్మనుజేశ్వరాధముల" కన్న పద్యపద్యకుఁ జాటుధాటి నెసఁగు "బాలరసాలసాలనవపల్లవ కోమల కావ్య కన్యక" యను దానికిని విరుద్ధసందర్భంబులిందుఁ బొందువడుటఁ గొందఱది తత్కృతముగాదని యభిప్రాయపడినను "బాలత్వంబున నాటలన్ మెలఁగు విభ్రాజద్వయోవంతుఁడై స్త్రీలోలత్వముఁ జెందు వార్ధకమునం జింతారతి" యను నయంబున ననయంబు జనంబు తమతమ వయోవస్థను దత్తత్కార్యములఁ గావ్యముల నొనరింత్రు. తిక్కన మఖియు మొట్టమొదటఁ గొంతకాలము నర

స్తుతిఁ బొనరించెఁ గాన వీరు నట్టి మహనీయులగుటఁ దారుణ్యగుణ్యంబున దీనిఁ బూనిచిరని నిశ్చయింప విపశ్చిత్తులర్హులు. దీని రచనాశైలియుఁ గరబదరస దృశముగ నీక్షింపఁబడుట వారి యర్వాచీనకల్ప కల్పితంబగు శ్రీమదాంధ్ర భాగవతమం దందములగు రెండు దండకములు చెప్పకయ చెప్పెడి. అట్లగుటం బట్టి యిట్టి యూహాపోహలవలన వీరి కన్న నన్యులీపదరస సాహిత్యసౌహిత్య ముంగలిగి నిశ్శంక శ్రీ వేంకటగిరి సంస్థానాస్థాన విద్యానవద్యులగుటఁ దఱచుగ నెఱయదని కవితావైదుషీభూషణులు భాషించిరి. పదోద్దండముగనుంట దీని నుద్దండదండకంబని యండ్రు. దండక కథానాయకుండు శ్రీ వేంకటగిరిరాజ్య చతుర్దశ పురుషుండు" అని కాననయ్యెడి.

మానవస్తవవిముఖుండగు నంతర్ముఖున కీబంధకీగ్రంథసంబంధం బసంబద్ధమని కొందఱు మనీషులు భాషింప సంతోషింపక తారుణ్యంబు కారణంబని నిర్ణయించి రామకృష్ణయ్యగారు తమ వాదమున కాధారములుగ i. భాగవతగ్రంథస్థ దండకద్వయ సామ్యంబును, ii. అనన్య సామాన్యశైలిని iii. తిక్కన నరస్తుతిని బేర్కొనిరి.

భోగినీదండకమునకు సరిపోవుశైలిగల దండకములు రెండు భాగవతమునఁ గలవని యాకారణముచే నీ మూఁడును నేకకర్తృకములని రామకృష్ణయ్యగారు వ్రాసిరి. అట్లైనచో భాగవతమునఁ గానవచ్చు రెండు దండకములు శైలియందుఁ బరస్పరసామ్యము నొందుటయేగాక రెండును భోగినీదండకసామ్యమును బొందియున్నవని యంగీకరించినట్టేకదా. భాగవతమునందలి రెండు దండకములలో నొకటి తృతీయస్కంధంబునను వేఱొకటి దశమస్కంధంబునను గన నయ్యెడి. తృతీయస్కంధము పోతన రచితము నష్టము. దృష్ట మన్యకవి రచితము. ఈ రెండును శైలియందు సమానములయినయెడల ననన్య సామాన్యశైలియను రెండవ యాధారము వ్యర్థమయ్యెను.

అంత్యానుప్రాసములతో దండకము వ్రాయుట శబ్దజాల సామగ్రికల కవికిఁ గష్టకార్యము కాదు. సంవర్తననిర్బంధమునకు లోపడియు నన్నయభట్టారకుఁడు "శ్రీకంఠలోకేశ లోకోద్భవస్థాన సంహారకారీ పురారీ మురారి ప్రియా చంద్రధారీ" యని ప్రారంభించి వ్రాసిన యీశ్వరస్తుతి పోతన దండకశైలి ననుకరించియుండలేదా. అంత్యానుప్రాసములతోఁ బురాతనాధునాతన కవి రచితదండకములు గానవచ్చుచున్నవి. కావున భోగినీదండకశైలియనన్య

సామాన్యమగుట యంగీకార్యముకాదు. నృసింహపురాణములోని దండకముఁ జిత్తగింపుఁడు.

భోగినీదండకశైలియందుఁ గ్రొత్తలేవియుఁ గానరావు. రంగనాథరామాయణమునందలి

ద్వి. "ఏలే మహీపుత్రి యేలే మృగాక్షి। యేలే సరోజాక్షి యేలే లతాంగి యేలే వధూమణి యెన్ని చందములఁ। గాలుచు నున్నాఁడఁ గటకటా యనవు.

భోగినీ దండకమునందలి.

"విచారంబులేలే (శుభాకారయేలే గుణోదారయేలే కులోద్ధారయేలే తటిద్దేహయేలే వరారోహయేలే లలాటాలకవ్యూహయేలే మహోత్సాహయేలే మహారాజయేలే కలాలాపయేలే)* జగన్మోహనద్రూపయేలే చలచ్చంచలాలోకనవ్రాతయేలే నయోపేతయేలే" అను దానితోఁ బోల్చి చూడుఁడు. నృసింహపురాణములోని దండకమును బఠింపుఁడు. దీనివలన గవైక్యము స్థాపింప శైలీసామ్యము నిస్సందిగ్ధప్రమాణము కాఁజాలదుగదా. వీరభద్రవిజయములోని దండకమునకు భాగవత దండకమునకు వీరేశలింగము పంతులవారు సామ్యము చెప్పుచుండ శైలీవాదము రిత్తవాగ్వాదముమాత్రము ఫలముగలది యగు.

వేంకటగిరి సంస్థానాస్థాన విద్యానవద్యతగుఱించి మేమేమియుఁ జెప్పఁబనిలేదు. ఆ సంస్థాన ప్రభువులు విద్యావంతులని భోగపురుషులని లోకమంతయు నెఱుంగును. బ్రహ్మానందశతకమువలెనే భోగినీ దండకము రాజపిండఫీతుఁడు తత్ప్రేష్యవర్గములోఁ జేరినవాఁడు వ్రాసియుండునుగాని బమ్మెర పోతనవంటి స్వతంత్రుఁడు భక్తిమార్గనిష్ఠుఁడు వ్రాసియుండఁడు. కారయిత యెంత దుష్టుఁడైనను దన యట్టివానినే యకార్యమునకై ప్రేరించునుగాని ధిక్కారభీతి సాధువులఁ బ్రేరింప నొల్లఁడు. అట్టి కర్తయు రాజభీతి నట్టి కార్యము సలిపినను లోకభీతిఁ బేరు దాఁచుకొనునుగాని నిజనామమున వెలువడఁడు. మాంసముఁ దినువాఁడు ప్రేవులు మెడలో వేసికొనఁడు. కావుననే యవమానభీతుఁడు దండకకర్త తనపేరు దాఁచె. నారాయణశతకమునకు గద్య వ్రాసినవాని యట్టి దుష్టుఁడెవ్వఁడో బమ్మెరపోతనపేరఁ బద్యము వ్రాసె.

ఇంతకు నానాఁటికి వేంకటగిరి సంస్థానము పేరేలేదని చరిత్రకారులు వ్రాయుచున్నారు. సర్వజ్ఞసింగమనాయఁడు (భోగినీదండక కృతిపతి) వేంకట

* కుండలీకృతభాగము ప్రక్షిప్తము.

గిరియందుండుటయు భోగినీదండకము పోతన రచితమగుటయు సత్యములేని పోతన యొంటిమిట్టవాఁడగుట నిస్సంశయము. పోతరాజెందులవాఁడైనను భోగినీదండకమే వ్రాసియుండి దానికిఁ దగిన ప్రతిఫలము నొందియుండెనా యవల రాజుల దూషింపఁ గారణములేదు. విఫలమనోరథుఁ డయ్యెనా భాగవతమును సింగమనాయఁడు పూడ్పించెనన్న కథకవకాశములేదు. (పోతన నికేతన చర్చఁ దిలకింపుఁడు.)

ఇఁకఁ దిక్కన నరస్తుతిచేసెను గావునఁ బోతనచేసె నఁట. ఇది యేమి తర్కయుక్తియో మే మెఱుఁగము. తిక్కన పూర్వవయస్సున వేశ్యాలంపటుఁడని లోకప్రవాదము కలదు. వయోరూపధనాధికారంబులంబట్టి యట్టివాఁడైన నైయుండవచ్చును. తిక్కనజారుఁడని పోతనయు జారుఁడనుట న్యాయమా? తిక్కన రాజాశ్రయమునఁ జీవించుచుండినవాఁడు. ప్రభునియుక్తకార్యము కాదని చెప్పవలనుపడని స్థితియందుండినవాఁడు కవిప్రభువులు మామయు నల్లుఁడునని వావివరుసలాడుకొనునంతటి చనవుగలవారు. నిర్దిష్టకృతియా భగవన్నుతి. ఇట్టి సందర్భములు పోతనకుఁగలవా? ఒకవేళ పోతనగతిమాలి తన యొద్దకువచ్చినపుడు నాలంజెపైఁ గృతిచెప్పుమనిన సింగమనాయని నాయన రోషించి దూషించివచ్చియుండునుగాని తోషించి భూషించి వచ్చియుండఁడు.

మఱికొన్ని సందర్భములనుబట్టి చూచినను దండక కర్తయు దానిక్రింది పద్యము వ్రాసినవాఁడును భిన్నులని తోఁచుచున్నది. శతకదండకములందుఁ గవిపేరు ప్రత్యేకముగాఁ గానవచ్చు నాచారములేదు. అట్లుకానవచ్చు నారాయణశతకమునందలి గద్యము కూటసృష్టమయ్యెఁగదా. అట్టిదే భోగినీదండకమందలి పద్యమును.

కవి యొక్కఁడే యైనచో "ఆచంద్రతారార్కమై యొప్పుతఁగన్" అని వ్రాసిముగించి మగలఁబద్యమున "సుధాంశుమార్తాండ కులాచలాబ్ధి శశితారకమై" యని యేలపునరుక్తి దోషమున కెడమీయ వ్రాయును? ఈ పద్యమున మఱియొక చిత్రముఁ గనుఁడు.

"పండిత నీతికోవిదుఁడు బమ్మెరపోతన" యని తొలుతొల్తఁ బూండ్ల రామకృష్ణయ్యగారు వేంకటగిరి సంస్థానమునుండి తెచ్చిముద్రించిన ప్రతియందున్నది. ఇదియే ప్రథమపాఠమై యుండవలయు. కన్నవారికిఁ గాసునకై కాయమమ్ము లంజలఁగృతినాయికలఁ జేసి వేశ్యావిప్రలంభమువర్ణించుట పండిత నీతికోవిదత్వమా? యను నాక్షేపమురాఁగా నిప్పుడు పండితకీర్తినీయుఁడను పాఠ

ము ముద్రింపఁబడుచున్నది. తానుజేసిన యీ ఘనకార్యము పండిత నీతికోవిద లక్షణమని కాని పండితకీర్తనీయమని కాని బమ్మెరపోతన చెప్పియుండఁడు.— భాగవతరచనానంతరమే యీ యన పండితకీర్తనీయుఁ డయ్యె.

బ్ర॥ శ్రీ॥ రాజశ్రీ చిలుకూరి వీరభద్రరావుగా రీదండకము బమ్మెర పోతన కృతముగాదని తమ యాంధ్రులచరిత్రమందు వ్రాసిరి. గురుజాడ శ్రీరామ మూర్తిపంతులవారు తమకవి జీవితములందు,

"సింగమనీనికిఁగల యభిరుచి సంస్కృతభాషలోఁగాని యాంధ్రంబునఁ గాదని అతనివలన రచితములైన సింగభూపాలీయము నాటకపరిభాష మొద లగు గ్రంథములంబట్టి కాన్పించును.

అట్టివాఁ డాంధ్రములో వారనారిపై నొక దండకముంజెప్పించి దానికిఁ దాను గృతిపతియైయుండ నంగీకరించెనని పుట్టింపఁబడిన కథయే పొసఁగి యుండ లేదు.

కావున సింగమనీనికిని పోతరాజునకును విహితవిశ్వాసములు లేవనియే నిశ్చయింపవలసి యున్నది.

సర్వజ్ఞ సింగమనీఁడు పోతరాజును భాగవతము తనకుఁ గృత్తియిమ్మని యడుగుటయు దానిని స్పష్టముగానీయనని పోతన తిరస్కరించెననుటయు యుక్తి యుక్తముగఁ గాన్పింపదు. లోకములోఁ గవులు తాముగ్రంథములు రచియించి ప్రభువులపైఁ గృతినీయ ననుగ్రహింపుఁడని యాశ్రయించుటయు నట్టిగ్రంథ ములఁ గృతినంద నిష్టముగలవారు ఆగ్రంథమునకుఁ దగు సత్కారమెంతో దానింజేయుటకుఁ దమరు చాలియుందురో లేదో చూచుకొనుటయు నట్టి గొప్పవ్యయ మవశ్యమో కాదోచూచుకొని యనంతర మట్టిగ్రంథము గృతినం దలేమని చెప్పుటయును, కవికది సమ్మతము కానియెడల నాప్రభువునువదలి మఱి యొక ప్రభువు నాశ్రయించుట యున్నదిగాని సింగమనీనివలె నొకగ్రంథము నాకుఁ గృతియియ్యవలెనని స్వయముగ యాచించుటయు, నట్లు యాచించు ప్రభుని నీ పీ గ్రంథమునకుఁ గృతిపతివికాఁ దగవు కావున నేనీ యను పొమ్మని పోతనమూర్ఖించి చెప్పుటయు లోకానుభవ వ్యతిరేకమైయున్నది" అనివ్రాసిరి.

ఈ విషయమై కొందఱటు కొందఱిటు వ్రాసిరి. తుదకు బ్ర॥ శ్రీ॥ పెద్ది భొట్ల వీరయ్యపంతులువారును "రేచర్ల సింగనాయఁడు వారంగల్ ప్రాంతో మున నుండెను. ఒకవేళ నీసింగమనాయఁడే వేంకటగిరికిబోయినట్లెంచినను భోగినీదండకము వేంకటగిరిలో వ్రాయఁబడినట్లెంచుటకుఁ గారణము గన్ప

డదు. ఈ దండకము పోతనయౌవనములో వ్రాసినదగుటచే పోతనయును సింగమనీడును వారంగలుప్రాంతమున నున్నకాలమున వ్రాయఁబడి యుండ వగును. తర్వాత పోతన భాగవతమును రచించినటుల సింగమనీఁ డెఱింగి తన కంకితమిమ్మని యడిగియుండవచ్చును. అంతమాత్రముచేత సింగమనీ డలిగి భాగవతము పాతిపెట్టించినటుల దెల్పుకథ వింతగ దోచగలదు. ఈ కథలలో నెంతసందియముండినను పిల్లల మఱ్ఱికి సామీప్యముననున్న బమ్మెరలో పోతన యుండుటవల్లనే సింగమనీనికి పోతనకు నెయ్యమో కయ్యమో గల్పింపసాధ్య మగునుగాని యొంటిమిట్టవాదమున కియ్యెడ నవకాశము లేదు.

సింగమనీడు రేచర్ల అన పోతనాయని కుమారుఁడు. ఈ అన పోతనా యని మంత్రియైన మడికిసింగన మంత్రియే అయ్యలమంత్రి"యని వ్రాసిరి.

ఈ వాక్యములను మేము విమర్శించి వ్రాయుచుండఁగా 24-9-19 గల యాంధ్రపత్రికయందు వీ రొకవ్యాసమును బ్రకటింపించిరి. అందు నారాయణ శతకమున గద్యసృష్టమని వీరభద్రవిజయకర్తృత్వము సందిగ్ధమనియు వ్రాయుచు "ఇటులనే భోగినీదండకము పోతనవిరచితము గాదనుచున్నారు. దీనికిని చివర నొక పద్యమును కల్పించునటుల గన్పట్టుచున్నది. నారాయణశతకమునకు పట్టి నట్టిగతియే పట్టినది" అని లిఖించిరి. వాదాభిమానముమాని సత్యమెఱుంగఁ బూనినందునకై వీరికి వందనములు. ఆక్రోశముమాని స్తిమితబుద్ధి నాలోచిం చినచో నన్నిముఖ్యవిషయంబుల మాతో నేకీభవింపఁగలరని మానమ్మకము.

ఆంధ్రకవుల చరిత్రము నవీనముద్రణమందు "బమ్మెరపోతరాజు నైజాము రాజ్యములోని రాచకొండ సంస్థానమునకు ప్రభువగు సర్వజ్ఞసింగమనాయని యాస్థానమునకుఁబోయి యాతని యిష్టానుసారముగఁ గవిత్వముచెప్పినందు నకుఁ బోతరాజప్రణీతమైన భోగినీదండకము సాక్ష్యమిచ్చుచున్నది.... ఈసర్వజ్ఞ సింగమనాయఁడు 1422 సంవత్సరములు మొదలుకొని 1447-వ సంవత్సరమువఱ కును విజయనగరాధీశ్వరుఁడుగానున్న ప్రౌఢదేవరాయనితో సమకాలికుఁడు"

"ఈదండకము చెప్పునాఁటికిఁ బోతన్నభక్తాగ్రేసరుఁడు కాఁడు. చంద్రో పరాగపర్వదినమున గంగాస్నానమునకుఁ బోయినపుడు రామభద్రుఁడు స్వప్న ములో సాక్షాత్కరించి శ్రీమద్భాగవతమును దెనిఁగింపనియోగించిన తరు వాత నీతనివిష్ణుభక్తి ప్రారంభమైనది."

భోగినీదండకములోఁ జెప్పఁబడిన సర్వజ్ఞసింగమనాయఁ డెవరాయని చర్చించుచు నిట్లువ్రాసిరి.

"బేతాళనాయనికి నేడవతరమువాఁడు సర్వజ్ఞసింగమనాయఁడగుటకు సందేహము లేదు. రసార్ణవసుధాకరాది సంస్కృతగ్రంథములను రచియించినవాఁ డతఁడే యగుటకును సందేహము లేదు. శ్రీనాథపోతనార్యు లాతనికాలపువారు కాకపోవుటయు నందుచేత నాతని యాస్థానమందుండకపోవుటయు నిశ్చయమే. అంత మాత్రముచేత పదవతరమువాఁడైన సింగమనాయఁడు విద్వాంసుఁడును సర్వజ్ఞబిరుదాంకితుఁడునుగాఁ డన్న సిద్ధాంతమేర్పడ నేరదు. ఇద్దఱును విద్వాంసులు కావచ్చును. ఇద్దఱును సర్వజ్ఞబిరుదాంచితులు కావచ్చును. ఇద్దఱును గ్రంథకర్తలుకావచ్చును. ఇద్దఱును కృతిపతులు కావచ్చును. వేదాంతదేశికులు సుభాషితనీవిలోనగు గ్రంథములఁబంపినవాఁడును వైష్ణవగ్రంథకర్తలు తమ వ్యాఖ్యానములలో సర్వజ్ఞబిరుదనామముతోఁ బేర్కొనినవాఁడును బేతాళనాయని యేడవతరమువాఁడయిన మొదటి సింగమనాయఁడే యయి యుండును. అయినను పదవతరమువాఁడయిన సింమనాయఁడును సర్వజ్ఞబిరుదాంకుఁడే. ప్రౌఢదేవరాయని కాలములోనుండిన యీ సర్వజ్ఞసింగమనాయని యాస్థానమునకే శ్రీనాథకవి సార్వభౌముఁడును బమ్మెర పోతనామాత్యుఁడునుపోయి యాతనిపయిని పద్యములను జెప్పి బహుమానములను బడసిరి." అని మహాపరిశోధకులగు వీరేశలింగముపంతులవారు వ్రాసిరి,

మ-రా-శ్రీ, చిలుకూరి వీరభద్రరావుగా రాంధ్రులచరిత్రము మూఁడవ భాగమున వ్రాసిన కొన్నివాక్యముల ననువదించి యావల మా యభిప్రాయము తెలిపెదను.

"ఇంతటి యాత్మగౌరవ సంపత్తిగల యీ కవిచంద్రుఁడు సింగమనాయఁ డుంచుకొన్న వేశ్యనుగూర్చి దండకముచెప్పెననిగాని చెప్పననిగాని యూహించుటకే సాధ్యపడదు."

"కాఁబట్టి పదవతరము సింగమనాయనికి సర్వజ్ఞబిరుదముండిన నుండవచ్చునుగాని యందునకుఁ బ్రమాణముగా భోగినీదండకమును జూపుటమాత్రము సాహసకృత్యమని నా యభిప్రాయము. అంతకన్న మఱియే యాధారమును గన్పట్టదు. శ్రీనాథుఁడు రావుసింగమహీపాలు సభకుఁబోయి యుండెనది వాస్తవమగునేని యతఁడు తప్పక యీ పదవతరము సింగమనాయఁడే కావలయును. శ్రీనాథుఁడుకాని బమ్మెరపోతనగాని సర్వజ్ఞసింగమనాయని యాస్థానకవులు గారు. ఇంతకును సర్వజ్ఞసింగభూపతి యెవ్వరో యేగ్రంథకర్తకును సరిగాఁ దెలిసి యుండలేదు."

"శ్రీనాథుఁడు బమ్మెరపోతన మొదలగువారు సమకాలికులు గావునే నీటివల వారు పెక్కుకథలను గల్పించి వానినన్నిటి నొక్క సింగమనాయనికే యారోపించి రసాభాసము గావించిరి. అవి పరస్పరము పొందికలేక యున్నవి. భోగినీదండకము కవనము భాగవతకవనమును బోలియున్నను పోతనకవి కృతము గాదని చెప్పవచ్చును. మంచి కవియగువాఁ డారీతిగా చిన్నదండకములోఁ బోతనకవనమువలెఁ గవనము చెప్పుట యొక వింతగాదు. భాగవతములో శివదూషణముఁ జేసినందులకుఁ బాపపరిహారార్థముగా వీరభద్రవిజయమును పోతరాజు రచించెనని యొక గ్రంథమును గల్పింపఁ జాలినవారుండఁగా నొక చిన్న దండకమును శబ్దాద్యలంకారములతోఁ గూర్పఁజాలినవార లుండకుందురా."

ఈ వాదమునకంతెయు మూలకందము భోగినీదండకమునఁ గానవచ్చు సర్వజ్ఞ సంగమనాయఁడను శబ్దము. ఈ సర్వజ్ఞ సంగమనాయఁ డెవఁడు? ఏ కాలపువాఁడు? ఏ దేశమువాఁడు? అని తెలిసికొనవలసియున్నది. ఇది సాధ్యపడునేమో చూతము.

సర్వజ్ఞశబ్ద ముపసర్గముగాఁ గల సింగమనాయండ్లు భోగినీదండకకృతిపతితోడ నలువురేవురు కానవచ్చుచున్నారు. కావున నిది వంశపరంపరాగత బిరుదమని కొందఱభిప్రాయపడిరి. వీరేశలింగము పంతులవారును దీని నంగీకరించిరి.

ఆర్యులారా! పోతన ౧౪౦౫లో జన్మించి ౧౪౩౦ లోపల భోగినీదండకమును రచించి రాచకొండలోనుండు సర్వజ్ఞసింగమనాయని కిచ్చెనని కదా వీరేశలింగముపంతులవారి వాదము. ఈకాలమున రాచకొండలో నెవరుండిరో చూతము. వీరేశలింగముపంతులవారే

"రాచకొండ కీశాన్యమూలను రెండుక్రోసుల దూరములోనున్న నాగారగ్రామమునందలి మాధవనృపాలుని శాసనములో

"శాకాబ్దే నిధి వార్ధి రామ శశిగే వ్యబ్దే ప్లవంగే శుభే
మాసే హ్యాశ్వయుజే రఘూద్వహపదే యో రాఘవీయాహ్వయమ్
టీకా మర్థపటుప్రబోధఘటనా మాణిక్య పుష్పాంజలిం
కృత్వారాజతి రావుమాధవనృపో రామాయణస్య శ్రియే"

అని శాలివాహనశకము ౧౩౪౯ ప్లవంగసంవత్సరాశ్వయుజమాసమున సన్ ౧౪౨౭వ సంవత్సరమునందు రావు మాధవ నరపాలుఁడు

శ్రీమద్రామాయణమునకు రాఘవీయమను టీకను జేసెనని చెప్పఁబడినది" అని లిఖించిరి.

౭-వ తరము సర్వజ్ఞసింగభూపతికి (౧) అన పోతానాయఁడు, (నామాంతరము) అన్నమనాయఁడు (౨) దాచానాయఁడు (౩) వల్లభనాయఁడు (౪) వేదగిరినాయఁడు (౫) దామానాయఁడు (౬) మాదానాయఁడు (ఈయన భార్య నాగమ్మ) అని యార్వురు కొడుకులు.

వెలుగోటివారి చరిత్రములో "ఇందుకు ౭-వ తరము సర్వజ్ఞసింగభూపతి కుమారులలో నాఱవవాఁడై యీ యన్నమనాయని సోదరుఁడైన యెనిమిదవ తరము మాధవరావు భార్య నాగాంబిక స్థాపించిన శిలాశాసనములో శాలివాహన శకము ౧౩౪౯ (క్రీస్తు ౧౪౨౭) సంవత్సరములోనుండి రాచకొండ నేలుచుండినట్లు వ్రాయఁబడియున్నది" అని వ్రాయఁబడియున్నది. మీఁది రెండనువాదములవలన బమ్మెరపోతన భోగినీదండకము రచించెనని చెప్పఁబడిన కాలమందు రాచకొండలో ౧౦-వ తరము సర్వజ్ఞసింగమనాయఁడు లేఁడనియు నాయన తాత మాధవరావుండెననియు నేర్పడెను. పంతులవారు తాత మనుమల నేకకాలమున నేకనగరాధిపతుల నెట్లుచేసిరో మేమెఱుఁగము. పోతన భోగినీదండకమును రచించెనన్న కాలమ్మునకు ౧౦-వ తరము సింగమనీఁడు పుట్టియే యుండనట్లేర్పడుచున్నది. ఇఁకఁ గయ్యనెయ్యము లెట్లు కలిగెనో.

౮-వ తరము మాధవరావు ౧౪౨౭ లో నుండినయెడల నాయన యించుమించు ౧౩౯౭ లో నైన జనియించి యుండవలయును. అట్లైనచోఁ బదవతరము సింగమనాయఁడు ౧౪౫౭ లో జనించియుండవలయును. ఈ పదవ తరము వారినిగుఱించి "వీరలు శాలివాహనశకము ౧౩౮౦ (క్రీస్తు శ. ౧౪౫౮) మీఁదఁ బ్రౌఢదేవరాయల కాలములో నున్నవారు" అని వెలుగోటివారి వంశచరిత్రమున వ్రాయఁబడియున్నది. దీనివలన మా గణితము సప్రమాణమగుచున్నది. దీనివలన ౧౦-వ తరము సర్వజ్ఞసింగమనాయఁడు పుట్టునప్పటికిఁ బోతన్నకుఁ బంతులవారి లెక్కప్రకారము ౫౩ సంవత్సరములు. అప్పటికి భాగవతము పూర్తియైయుండును. తరువాత ౨౫ సంవత్సరములకు అనఁగా ౭౮ యేట భోగినీదండకరచనమఁట. ఇది నమ్మఁదగినదా? ౧౩౬౦ లో భాగవతము రచింపఁబడెనన్న బ్ర॥శ్రీ॥ వీరయ్యపంతులవారి వాద మంగీకరించినచోఁ దన ౧౬౩-వ యేటఁ బోతన దండకమును రచించియుండవలెను.

ప్రాచీన పండిత లిఖిత గ్రంథమునుబట్టి భాగవత పీఠికాకారులు వ్రాసి

నట్లు ౧౩౭౮ లోఁ బోతన జన్మించియుండి వీరేశలింగముపంతులవారు చెప్పినట్లు ౭౫ సంవత్సరములు జీవించియుండినచో ౧౪౫౩ వఱకుండినవాఁడగుటఁ బోతన ప్రౌఢ దేవరాయల సమకాలికుఁడు కావచ్చునుగాని ౧౦-వ తరము సింగమనాయని సమకాలికుఁడగుట దుర్ఘటము. ఒకవేళఁ బోతన చరమదశలో ౧౦-౧౨ సంవత్సరములు సర్వజ్ఞసింగమనాయని సమకాలికుఁడై యుండినను నాయపరవయస్సున భోగినీదండకము రచించె ననువాదము విశ్వసింపఁదగదు.

మఱియొక విధముగఁ జూతము. భోగినీదండకమందు "వసంతావనీనాథ సంసేవితాం చత్పదాంభోజు"నని యున్నది. ఈ వసంతావనీనాథుఁడు కుమారగిరిరెడ్డియే. ఇతఁడు ౧౪౦౦ వఱకుండినవాఁడు. కావున భోగినీదండకము ౧౪౦౦ కీవలఁ బుట్టియుండవలెను. ఈ బిరుదము భోగినీదండక కృతిపతికి స్వార్జితమా వంశపరంపరాగతమా యని యాలోచింపవలయును. పాండ్యక్ష్మాపాలజేత యనునది పరంపరాగతమేకాని యీ బిరుదము తత్పూర్వులకున్నట్టు గానరాదు. కావున స్వార్జితమై యుండవలయును. అట్లైనచో నీకాలపువాఁడు ౭-వ తరము సర్వజ్ఞసింగమనాయఁడగుచున్నాఁడు. వసంతభూపాలుఁడు ౧౪౦౦ లో మరణించుటచే నతఁడు సింగభూపాలునికి లోపడుట తత్పూర్వవృత్తమై ౧౩౮౦-కి ౧౪౦౦-కు నడుమ జరగియుండవలయును. ఇటు చూచినఁ బోతన యేడవతరము సింగమనాయని సమకాలికుఁడగుచున్నాఁడు కాని పెక్కుకారణములచేఁ దద్వాదము మానుకొనవలసివచ్చుటచే వీరేశలింగముపంతులవారే "శ్రీనాథపోతనార్యు లాతని కాలమువారు కాకపోవుటయు సందుచేత నాతని యాస్థానమునం దుండకపోవుటయు నిశ్చయమే"యని వ్రాసిరి. కావున మాకా ప్రయాస తప్పినది. దానికిఁ గారణములు రా॥శ్రీ॥ వీరభద్రరావుగారు విపులముగ వ్రాసియున్నారు. భోగినీదండక సింగభూపతి జననీజనకనామములు ౭-వతరము సింగభూపతి తల్లిదండ్రుల నామములు భిన్నములగుటచే వారిరువురు భిన్నులనుటకుఁ బ్రబలప్రమాణము. ఆ బిరుదము ౧౦-వ తరము సింగభూపతికిఁ (భోగినీదండక కృతిపతికి) బారంపర్యముగ వచ్చెనందమా యతని పూర్వులలో ౧౪౦౦-కు ముందున్న రాజున కాబిరుదముండి యుండవలెఁగదా. లబ్ధబిరుదుఁడెవ్వఁడు? ఎవ్వఁడును గానరాఁడు. ౭-వ తరము సింగభూపాలుఁడే కావలయును. ఇదివఱకు వ్రాసినవారి వ్రాఁతలనెల్లఁ దలక్రిందుపఱిచి శ్రమించి ప్రౌఢదేవరాయలు 1, పోతన్న, ౧౦-వ తరము సింగమనీఁడు సమకాలికులని సాధించినను దక్కిన యిరువుర చరమవయస్సులో సింగమనీఁడు వారికి సమ

కాలికుఁడగునుగాని సమానవయస్కుఁడు కాఁజాలఁడు. కావునఁ బోతన పూర్వవయస్సున ౨౫-వ సంవత్సరమున భోగినీదండకము రచించెనను వాదము నిలువదు.

భోగినీదండక కృతిపతియగు సింగనపాండిత్య మెట్టిదో యతనికి సర్వజ్ఞ బిరుదము సార్థకమో యలంకారమాత్రమో చూతము భోగినీదండకమున నీయనను గుఱించి "సీమంతినీ మానసారామ వాటీవసంతుఁడ, లీలావతీపంచ బాణుఁడ, వధూచిత్తవిత్తాపహారావధానుఁడ, భోగినీరాజు, బహుప్రేయసీవల్లభుఁడు, వధూటీ సరోజాతభల్లుఁడ, కామినీలోకపాంచాలు డనియు; శౌర్యవిషయమునఁ దేజో జయ ప్రాభవోద్దాము నుద్దామజన్యావనీభీముఁడ, భీమప్రతాపానలాభీల జిహ్వా లికీలావినిష్కాలితారాతి పాండ్యక్షమాపాలదుర్వారగర్వాటవీవాతు, వారాశివే లావరీతావనీభారధౌరేయుఁడ, కఠోరాసిధారావినిర్భిన్న సోమాన్వయోత్పన్న భూభృత్సమూహుఁడ రాయశుండాలహర్యక్షు రాయకందర్ప సాలాక్షు రాయగో ఘాంగనాబృందగోవిందుఁడ, అనియు నీతివిషయమున నీతిఁ బలారాతిమంత్రిం బ్రమోషించునని యు దానంబున సదాదానవిద్యానిరూఢుఁడ అనియుఁ జెప్పఁ బడెను. ఇఁక విద్యనుగుఱించి యొకవిశేషణము మాత్రము కానవచ్చుచున్నది. మనోజాతహృద్యాసవద్యైక విద్యానిరూఢుఁడ అను విశేషణ మాయనకుఁ దెలిసినది యొకవిద్యయే యనియు నది కళాశాస్త్రమనియు నేర్పడుచున్నది. భాషా విశేషంబులఁ శేషుతోనైన భాషించునని చెప్పఁబడలేదా యందు రేని యది యనేకభాషల మాటలాడ నేర్చునని తెలుపునుగాని, సంస్కృతాంధ్ర భాషా పాండిత్యమును బ్రకటింపదు. కాముకుఁడని తెలుపు విశేషణములు, పరంపరా గత బిరుదములు పేర్కొనఁబడియెఁగాని కృతిపతి పండితుఁడనికాని కవియనికాని గ్రంథకర్తయని కాని కారయితయనికాని గ్రంథమునం దెందును గానరాదు. ౭-౧౧ తరముల సింగమనీలవలె నితఁడు పండితుఁడైనచోఁ దత్సంబంధమైన విశే షణ మొండైన లేకుండునా? పేరులేనినాయికకు నూరులేని "వారాశివేలావరీ తావనీభారధౌరేయుఁడు" నాయకుఁడైనాఁడు. ఇట్టివారికిఁ దగినవాఁడూరుపేరు లేనికవియే కాని పోతన్న కాఁజాలఁడు. రా॥శ్రీ॥ వీరభద్రరావుగారు చెప్పినట్టు లీసర్వజ్ఞుఁ డెవ్వఁడో యిప్పటికెవ్వరికిఁ దెలియదు. ఇప్పటికి

(1) ౧౩౭౦ వఱకు జీవించియుండిన వేదాంతదేశికులవారి సమకాలికుఁ డొక సర్వజ్ఞసింగమనాయఁడు.

(2) అన్నపూర్ణాదేవికి ననపోతనాయనికిఁ గుమారుఁడై ౧౩౮౦-౧౪౦౦ వఱకుండిన సింగమనాయఁడు.

(3) పోచమాంబకుఁ గుమారాన్నపోతనకు జనించి భోగినీదండకపతి యైన సింగమనీఁడు.

(4) ౧౪౫౦ మీఁదటనుండిన సింగమనీఁడు.

(5) పెదకోమటి వేమభూపాలునకు సమకాలికుఁడగు సింగమనాయఁడు. ఈ యేవురుసర్వజ్ఞులే. వీరియైక్యభేదములు విశదీకరింపఁ జరిత్రకారులే తమ యస మర్థతఁ జెప్పుకొనుచుండ మాకేల వృథాశ్రమము.

భోగినీదండక కృతిపతి యేయూరివాఁడో యేకాలపువాఁడో తెలియ కయు నసంబద్ధమగు కూటసృష్టపద్యము నొకటి యాధారము చేసికొని పోతనకు నాయనకు ముడిపెట్టఁజూచుట వ్యర్థకార్యము.

ఆరితేఱిన జారశిఖామణి దండకపతి యీ దండకమునుజూచి తనదుండగ మునకు విషాదపడఁగాఁ బశువేశ్యాభిగమనము చేసినవారు ప్రాజాపత్యవ్రతము నాచరింపవలయునను ధర్మవాక్యమెఱింగిన పోతన

గీ. "రసికులైనవారు రమణులకొకవేళ, వంగుకెల్ల ధర్మవర్తనంబు

ఈ రసమున విల్లు నారికివంగదా, చిత్తజాతరూప సింగభూప" అని యా యనకుఁ గన్నీరు దుడిచెనఁట. దబ్బఱలుపల్కువారి కడ్డంబుగలదె.

ఆర్యులారా! భోగినీదండకవిషయమున మాకాగ్రహము లేదు. దుష్టుల దుష్కార్యమువలనఁ జేరకుఁ బోతనకు లభించిననిందఁ బాపఁ దక్కినవారివలె మేమును యత్నించితిమి. రాచకొండ వెలుగోడు వేంకటగిరి యీమూఁడును నించుమించుగ నొంటిమిట్టకు సమానదూరములే. కావునఁ బోతన యొంటి మిట్టవాఁడను మావాదమున కేలోటును లేదు. అయినను నీదండకము పోతన కృతము కాఁజాలదనియు నంత్యపద్యము ప్రక్షిప్తమనియు మా యభిప్రాయము. ఈదండకమున 'శుభాకారయే లే' మొదలు 'కలాలాపయే లే' వఱకుఁగల వాక్య ములు ప్రక్షిప్తములని పూండ్లరామకృష్ణయ్యగారు కుండలీకరించిరి. వేంకటగిరి సంస్థానకోశమందలి ప్రతియందే యీ ప్రక్షిప్తము గానవచ్చుచున్నది. కావునఁ బద్యము ప్రక్షిప్తమగుట యసమంజసము గాఁజాలదు.

శ్రీరామాయనమః.

వీరేశలింగ వాదఖండనము

పంచమ ఘాటి.

—०ॐ०—

నవీనముగ ముద్రింపఁబడిన యాంధ్రకవుల చరిత్రమందుఁ కందుకూరి వీరేశలింగముపంతులవారు బమ్మెరపోతరాజును గుఱించి వ్రాసినవిషయములను ఖండించుచు బ్ర॥ శ్రీ॥ వావిలికొలను సుబ్బరావుగా రొకవ్యాసము వ్రాసిరి. దానికిఁ బ్రత్యుత్తరముగ వీరేశలింగముపంతులవా రొకవ్యాసమువ్రాసి బమ్మెర పోతన యోరుగంటివాఁడనుటకుఁ గొన్నికారణములు తెలిపిరి. వానిలోఁ గొన్నిపూర్వఘాటులఁ జర్చితమయ్యెను. శేషమిందుఁ జర్చితమగును.

(1) "బ్రహ్మశ్రీ వావిలికొలను సుబ్బరావుగారు నన్ను బహువిధముల దూషించి పరిషత్పత్రికలో నొకవ్యాసమును వ్రాసి ప్రకటించిరి." అని వీరేశలింగముపంతులవారు వ్రాసిరి.

గురుజాడ శ్రీరామమూర్తిపంతులవారి విషయమై మఱికొందఱి విషయమై యే యే స్వారోపితదోషములకు నెట్టివాక్యముల వీరేశలింగముపంతులవా రుపయోగించిరో యట్టివి యంతకంటె ఘోరమైనవి యగు దోషములను బంతులవారియందు పదృష్టాంతముగఁ గనఁబఱిచి యీ వాక్యములనే వా॥ సుబ్బరావుగారు వ్రాసిరి. ఒకరిని దూమనునప్పుడు నిందలుగానివి తమ విషయమునఁ బరులనిన నిందలయ్యెఁ గాఁబోలు. సుబ్బరావుగారు మోపిన దోషములు తమయందు లేవని పంతులవారు సిద్ధాంతీకరించియుండినచో సుబ్బరావుగారు నింద్యులే. సుబ్బరావుగారి వ్రాఁతయందు నసత్యములు లేవు. పరులను వారన్నమాటలు వారిని నా దోషములకే యనుట దోషముగాదు.

(2) "ఒంటిమిట్టకవులలో మొదటివాఁడగు తిప్పనామాత్యుఁడు తనశతకములో నొంటిమిట్ట రఘువీరుఁడనియే చెప్పెను." "ఈకవికాలములో నొంటిమిట్టయందున్న దేవుఁడు కోదండరామస్వామియే యై యుండిన యెడల శతకమకుటమునందు "గుణధామామహా దొంటిమిట్టనగరీ కోదండరామాప్రభూ" అని వేసియుండును." అని పంతులవారు వ్రాసిరి.

దీనివలనఁ దిప్పనార్యుని కాలమందొంటిమిట్టలోని దేవుఁడు రఘువీరుఁడే కాని కోదండరామస్వామిగాఁడని పంతులవారి యభిప్రాయమని యేర్పడుచున్నది. ఆమూర్తిద్వయభేద మేకేశోపాసకులగు పంతులవారికే యెఱుక. ఒంటిమిట్టరఘువీరశతకమునఁ బద్యముల మకుటమున రఘువీరాయని యుండుటచేఁ గోదండరాముఁ డన్వయింపఁబడఁడేని దాశరథిశతకమునందు "భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ" యని గోపన్నచెప్పెనే. భద్రాచలస్వామి కోదండ రాముఁడు గాఁడా? దాశరథి కోదండరాములు, రఘువీరకోదండరాము లీద్వంద్వమందు భేదమెందు విశేషముగఁ గానవచ్చెడినో విజ్ఞు లాలోచింతురు గాక. ఒంటిమిట్ట యందలి మూర్తిని గొందఱు రఘునాయకులని, కొందఱు రఘువీరుఁడని కొందఱు కోదండరాముఁడని శ్రీరఘురాములని వ్రాసియున్నారు. దాశరథిశతకమునందలి "భండనభీముఁడార్త జనభాంధవుఁ డుజ్జ్వల బాణతూణకోదండకళాప్రచండ భుజతాండవవర్తికి రామమూర్తికిన్" అను పద్యము భద్రాచల రాముఁడు కోదండరాముఁడని తెలుపదాయందు లేని "బలువిల్లుమూఁపునఁ బరఁగువాఁడు" "నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు మహాశుగంబులున్ విల్లును దాల్చువాఁడు" అను భాగవతవాక్యము లొంటిమిట్టయందలి దేవుఁడు కోదండరాముఁడని చాటుచున్నవి కావా? "వినుతయశోవిశాల రఘువీర దరస్మిత పద్మపత్రలోచన" యను స్కంధాంతపద్యమున రఘువీరశబ్దము ప్రయోగింపఁబడినది కదా.

మహదొంటిమిట్టనగరీ కోదండరామాయని తిప్పన వ్రాసియుండు నఁట. వహ్వాపాండిత్యము. సమానాధికరణమున 'మహత్' అనునది 'మహా' యని మాఱునని తిప్పనకుఁ దెలియదనిచెప్పి పంతులవారు తమ యజ్ఞత చాటించుకొనిరి. ఇట్టి పాండితిచేఁగదా "సోమపాః పూతపాపాః" అను దానిఁబట్టి భగవద్గీత సారాయము ద్రావనేర్పుచున్నదని సత్యవాదినియందు వ్రాయుట.

(3) "ఏకశిలానగర శబ్దార్థమునుబట్టి విచారించినను ఒక్కరాయి యని యర్థమిచ్చు నోరుగంటి కది చెల్లునుగాని యొక్కకొండయను నర్థమిచ్చెడి యొంటిమిట్టకుఁ జెల్లదు" అని పంతులవారు వ్రాసిరి.

ఈవిషయమై సుబ్బరావుగారు కావలసినంత వ్రాసియున్నారు. గండశిల, గండశైలమునకుఁ బ్రయోగములఁ గనఁబఱిచియున్నారు. ఓరుగంటియొద్దనుండునది గుట్టయేకాని "రుబ్బురాయి" కాదు. ఒక్కరాయివలనఁ బేరుగాంచగల దేని యింటింటవీరి "రుబ్బురా"లుండును గావున నన్నియు నేకశిలానగరములే.

పూర్వము కడపమండలమందుండి యిప్పుడనంతపురమండలములోఁ జేరిన కదిరియొద్ద 'తనికల్లు' అని గ్రామముకలదు. దీనినే 'తనకల్లు' అని వాడుచున్నారు. 'తని + కల్లు' దీనికి సంస్కృతమున నేకశిల యనియే కదా యగును.

ఈ యూరియొద్దనుండు చిన్నగుట్టనుబట్టి యాపేరువచ్చినదని యచ్చటివారు చెప్పెదరు. ఒంటిరాయి యిందుఁ గానరాదు.

ఒన్ను+గల్లు=ఒంగోలయినదని నెల్లూరివారు వ్యుత్పత్తి చెప్పుచున్నారు. ఇక్కడను గుట్టయున్నదికాని యొంటిరాయి లేదు.

పెను+సెల=పెంచెలయినదని వ్యుత్పత్తిచెప్పెదరు. ఇది నృసింహక్షేత్రము. మహాపర్వత మధ్యమున మూర్తి గానవగు.

వీనివలన గ్రాహ్యమును విజ్ఞులు గ్రహింతురు గాక.

(4) "దేవాలయములోని విగ్రహములన్నియు నతుకులు లేక యేకశిలతోనే చేయఁబడియుండును గాన గ్రామములన్నియు నేకశిలానగరములే కానచ్చును." అని పంతులవారు వ్రాసిరి.

సుబ్బరావుగారు వ్రాసిన దానినర్థము చేసికొనక వ్రాసినదీనికిఁ బ్రత్యుత్తర మనావశ్యకము.

(5) "పేరులకై పెనఁగులాడెడి యీశుష్కవివాదము నింతటితో విడిచిపెట్టి" పంతులవారు భాగవతమునఁ జెప్పఁబడిన గంగను గోదావరిని జేయ శ్రమించి బ్ర॥ శ్రీ॥ జయంతి రామయ్యపంతులవారు వ్రాసినదానినే మాఱుమాటల వ్రాసిరిగాని సుబ్బరావుగారి యాక్షేపములకుఁ బ్రత్యుత్తరము వ్రాసినవారుగారు. కావునఁ జర్వితచర్వణ మనావశ్యకము. అయినను నొకనూతన విషయము వ్రాయవలసియున్నది. పోతన గ్రహణకాలమున స్నానముచేసిన 'గంగ' గోదావరి కాఁజాలదని సుబ్బరావుగారు వ్రాసినపిమ్మట శేషాద్రిరమణకవులను వారుకృష్ణాపత్రికలో భాగవతములోఁ జెప్పఁబడిన 'గంగ' యనునది గోదావరికాదనియు నోరుగంటికి సమీపముననుండు 'గంగబుగ్గ' యనియు నది సాక్షాద్భాగీరథి యనియు వ్రాసిరి ప్రకటించిరి. రా॥శ్రీ॥ వంగూరి సుబ్బరావుగారును నట్టులే గంగయనఁ "గాశీబుగ్గ" యని వాదించినట్టు లాంధ్రపత్రికయందుఁ బ్రకటింపఁబడెను. ఆర్యులారా! కంటిరిగదా వాదము గా టెట్టుగాఁ జేలుచున్నదో.

(6) "ఇంతెకును మీ యేకశిలానగర మనెడిది వంటిమిట్టా? ఒంటిమిట్టా? "వంటిమిట్టలోను వసతిగాను" అని స్థలపురాణములో వకారాదిగానున్నప్పుడు బొమ్మెర బమ్మెరకాదని వాదించెడు మీరువంటిమిట్టయే యొంటిమిట్టయనీ యెట్లు చెప్పెదురు." గ్రామము వంటిమిట్టియే యైనపక్షమున దాని యేకశిలార్థమే రాక మీ వాదము నిస్సారమగును గదా." అని పంతులవారు వ్రాసిరి.

ఒంటిమిట్ట క్షేత్రమాహాత్మ్యమను గ్రంథము తప్పుల తడకయని మున్నే సుబ్బరావుగారు వ్రాసియున్నారు. అది సంస్కృతమునకుఁ దెనుఁగగుటచే నేకశిలానగరమను పేరొంటిమిట్టకుఁ బూర్వమునుండి గలదనుటకై యది గ్రహింపఁబడెనుగాని భాషావిషయమునఁ బ్రమాణగ్రంథముగ దానిని వా రుదాహరింపలేదు. భాషాజ్ఞానము చాలనివాఁడు వ్రాసినయపశబ్దమును గ్రహించి పంతులవారార్భటించిరి. కానిండు. వారివాక్యము, వారికే యిట్లు సమర్పించెదము.

ఇంతకు మీ యేకశిలానగరమనునది ఓరుగల్లా? వార్రంగల్లా? "వార్రంగల్ ఒంటిమిట్ట వివాద"మను గ్రంథమున వేయిచోటులందు నాంధ్రభాషయందు బి.ఏ., పట్టము ధరించి బి.ఎల్.,నం దుత్తీర్ణులై పండితులై చరిత్రాంశములెల్ల శోధించి యిరువదిసంవత్సరములుగ న్యాయవాదులైయుండు బ్ర॥ శ్రీ॥ పెద్దిభొట్ల వీరయ్యపంతులవారు వార్రంగల్ అని వ్రాసిరే. గ్రామము వార్రంగల్లే యయినపక్షమున దాని కేకశిలార్థమే రాక మీ వాదము నిస్సారమగునుగదా.

(7) "పోతరాజు తనకుప్రత్యక్షమయినట్టుచెప్పిన రాజముఖ్యుని వర్ణనను బట్టియైనను మూడవచరణములోని

"వల్లీ యుతతమాల వసుమతీజముభంగి
బలువిల్లుమూఁపునఁ బరఁగు వాఁడు

అను దానినిబట్టి కోదండరాముఁడని యూహించుటకంటె ప్రథమచరణములోని "మెఱుఁగు చెంగటనున్న మేఘంబుకైవడి, నువిద చెంగటనుండ నొప్పువాని" అను దానినిబట్టి సీతారాముఁడని యూహించుట యధికవిశ్వాసయోగ్యము కాదా." అని పంతులవారి వాక్యము.

పట్టాభిరాముఁడైనను, గల్యాణరాముఁడైనను, గోదండరాముఁడైనను సీతాసమేతరాముఁడే కాని చంద్రమతీరాముఁడు, రాధారాముఁడు లేఁడు. రాముఁడెట్టివేషము వేసినను సీతకూడనేయుండును. శ్రీరామునితోడ సీతగాని లక్ష్మణుఁడుగాని లేనిదేవాలయము మే మెఱుఁగము. రామేశ్వరద్వీపమధ్యమున నేకాంతరాముఁ డున్నాఁడు. లక్ష్మణ సుగ్రీవ హనుమదాదులున్నారు. సీతమాత్రము లేదు. సేతుబంధవిషయమున మంత్రాలోచనసమయమని యైతిహ్యము. మే మెఱింగనంతలో నీదేవాలయమునఁదప్ప సీతావిశిష్టుఁడు గానిరామునిఁ గల దేవాలయము లేదు. ఒంటిమిట్టయందలి దేవుఁడు కోదండరాముఁడు. పోతనకుఁ బ్రత్యక్షమైన దేవుఁడు కోదండధారియగునా కాఁడా యని విచారము, అప్పుడేది సముచితమో "బుద్ధిమంతు"లాలోచింతురు గాక.

వారు వ్రాసిన తక్కినవిషయములు చర్విత చర్వణములు, నప్రస్తుతప్రశంసలు కావునఁ జచ్చినపామును గొట్టనేలయని యుపేక్షించితిమి.

శ్రీరామాయనమః.

ఘాటీపంచకోపసంహారము.

———

పోతననికేతనం బొంటిమిట్ట యనుచిరకాలప్రతీతి లోకప్రవాదము నిర్వివాదము. నూతనముగ వెలువడిన వా పక్షవాదమున పక్షవాదమే తత్ప్రతీతిని సిద్ధాంతము చేయుచున్నది. శ్రీరామమూర్తిపంతులు లోనగు సందిగ్ధచిత్తులు కొంద ఱీవిషయము పూర్ణముగఁ జర్చితమగునఱకు నోరుగంటిని గ్రహింతుమని కొందఱు నొంటిమిట్టను గ్రహింతుమని కొందఱు వ్రాసిరిగాని యుభయపక్ష విషయములఁ జర్చించిన వారు లేకుండిరి. బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులవా రాపనికిఁ గడఁగి వారికిఁ దెలిసిన బలాబలములు చర్చించి పోతన యోరుగంటియందుండెనను వాదమే బలీయమని యభిప్రాయపడిరి. వారిప్రేరణము చేతను మాలోని కొందఱ ప్రేరణముచేతను బ్ర॥ శ్రీ॥ వావిలికొలను సుబ్బరావుగారు వారివ్యాసములోని దోషములను గనఁబఱుచుచు నొంటిమిట్ట పక్షమునఁ గల యాధారములఁ గొన్నిటిఁ దెలుపుచు వ్యాసము వ్రాసిరి. వారివ్యాసము వెలువడుటకుఁ దడవగుటచేఁ గీర్తిశేషులైన కందుకూరి వీరేశలింగముపంతులవారు బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతుల వారివ్యాసములోని విషయములను గ్రహించి తమ యాంధ్రకవులచరిత్రము నూతన ముద్రణమందు నోరుగంటి పక్షమున వ్రాసిరి. వీరికిని సుబ్బరావుగారే ప్రత్యుత్తరమిచ్చిరి. బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతుల వారివ్యాసములును, బ్ర॥ శ్రీ॥ సుబ్బరావుగారివ్యాసములును 'పోతననికేతనచర్చ' యందుఁ గాననగు. బ్ర॥ శ్రీ॥ రామయ్యపంతుల వారివాదము దుర్బలమగుట గ్రహించి బ్ర॥ శ్రీ॥ పెద్దిభొట్ల వీరయ్యగారు "వా్రంగల్ ఒంటిమిట్ట వివాద"మను నొక వ్యాసమును రామయ్యపంతుల వారివాదమును బురస్కరించుకొని వ్రాసిరి. ఇందలి ప్రథమఘాటి తద్వ్యాసఖండనమే. న్యాయమార్గమునఁ దమవాదము గెలువదని యెఱింగి కొంద ఱోరుగంటివాదులు వక్రమార్గప్రచారులై కూటసృష్టికి నారంభించిరి. ఇట్టికూటసృష్టుల నెల్ల నాధా

రము చేసికొని వీరేశలింగముపంతులవారు తమ యంత్యవ్యాసమును లిఖించిరి. ఆవాదవిధము తత్ఖండనము లిందుఁ గాననగు. ఈ విధముగ నోరుగంటి పక్షవాదము ఖండితము చేయఁబడెను.

ఈ రెండు వాదగ్రంథములను బఠించినవా రోరుగంటి కాధారముగఁ నామమాత్రము తప్ప మఱి యే యితరాధారమును గనఁబఱుపఁబడ లేదని గ్రహింపఁగలరు. నామ ముభయత్రసమము గావున నది యాధారము కాఁజాలదు. రా॥ శ్రీ॥ వంగూరి సుబ్బరావుగా రోరుగంటికి నేకశిలానగర నామమున్నదని ౧౦౦ ఆధారములు గనఁబఱిచెదరఁట. వహ్వా వాదబలము! ఓరుగంటికి నేకశిలానగరమను పేరు లేదని యెవరనిరి? వీరి భోగినీవాదము, ధర్మపురివాదము, వీరభద్రవిజయవాదము కాశీబుగ్గవాదము భువనగిరి కేల యన్వయింపరాదో, దానికి నేకశిలానగర నామము గలదుగదా. పోతననికేతన చర్చ పఠింపుఁడు. తక్కిన రెంటికి నుండునట్లు పేరుండుట తప్ప నోరుగంటి కే యితరాధారమైనఁ గలదా? భాగవతమున గంగయనఁగా గంగబుగ్గయని కాశీబుగ్గ యని బుగ్గలను జెలమలను జెప్పుట పరిహాస్యము కాదా? బుగ్గలను జెలమలను గూటసృష్టులను నాధారము చేసికొని వాదించువారికి వారిని సరిచేసికొని ప్రత్యుత్తరమిచ్చుటే పనికిమాలినపని. భువనగిరి చెన్నపురులకు నేకశిలానగర మాది రాజపట్టన నామములు గ్రంథస్థములు శాసనములు మృగ్యములు. వీని నెవరు నిరాకరింతురు? తిరుక్కోవెలూరు కడప, డిల్లీలకు దేహళీనామము గలదు. మొదటి రెంటికి శాశసనములు మృగ్యములైనను గ్రంథములు ప్రమాణములు. కావున "అహోభాగ్య మహోభాగ్యం। దేహళీపురవాసినామ్" అనునదియు వేదాంతదేశిక దేహళీస్తుతియు డిల్లికి నన్వయించుననియుఁ గడపకుఁ దిరుక్కోవెలూరికి నన్వయింపవనియు వాదించు వారికెవ్వరు ప్రత్యుత్తరమీయఁగలరు. వాదులు స్వవాదసిద్ధాంతమున కోపక సిద్ధాంతము చేయుభారము మాయది యని వాదింపఁజొచ్చిరి. వాదులమని చెప్పి కలహమునకు దిగినవారు వారుగాని మేము గాము. వాదులు తమవాదమును స్థిరపఱుపఁ జాలనపుడు వాదము మానికొనుట యుత్తమపక్షము. అభిమానము వారి నటు చేయనీయకున్నది. వారివాద మెప్పుడు స్థిరపడ లేదో యప్పుడే యథాపూర్వ మొంటిమిట్ట పక్షము నిలిచినట్టే కదా.

అట్టులున్నను నొంటిమిట్టయందుఁ బోతనయుండెననుటకు నాధారము లను సంగ్రహించి తెలుపుచున్నారము. నిష్పక్షపాతబుద్ధులు నిరసూయులు నగు మధ్యస్థులే మాకు శరణము.

ఇవటూరు ఓరుగల్లు దగ్గఱను నొకటియున్నట్లు లిప్పుడే మా పేర నొకరు వ్రాసిరి. వీరభద్రవిజయము భాగవతకవికృతము కానప్పు డినటూరెందుండి నను నొకటియ. పుత్త్రులు పౌత్త్రులు కృష్ణామండలము వారగుట నతఁడు నచ్చటివాఁడే యైయుండవచ్చును.

శ్రీరామాయనమః.

విజయ భేరీఘోషము.

అస్తమిత సమస్తవాదివాదసముదాయం బగుడు నొంటిమిట్ట వాసప్రాశస్త్యంబునకుఁ గల హేతువుల నిరూపించెదము.

ఈవాదము పుట్టుటకుముందే యొంటిమిట్టకు నేకశిలానగరమను నామాంతరముగలదని i. ప్రాచీనపండిత లిఖితగ్రంథముల నాధారము చేసికొని భాగవతమునకుఁ టీక వ్రాసిన పురాణము హయగ్రీవశాస్త్రులవారి వాక్యము

ii. Madras Manual of Administration.

iii. ఏకశిలానగర మాహాత్మ్యము.

iv. దేవాలయమున నర్చాసమయమునఁ జెప్పఁబడు సంకల్పవిధానమున 'దండకారణ్యే ఏకశిలానగరే' యను వాక్యములు తెలుపుచున్నవి.

బమ్మెరపోతరా జొంటిమిట్టయం దుండెననుటకు నాధారములు.

i. హయగ్రీవశాస్త్రి సముద్ధృతప్రాచీనపండిత లిఖితగ్రంథవిషయ మొంటిమిట్ట విషయముననే సార్థకమైయుండుటయు నందలి విషయము లోరుగంటికి నన్వయింపక పోవుటయు మాతృక యిప్పుడు కానరామి నిదిప్రమాణముగాదనుట సరిగాదు. అను వాదము లెన్నియో యెన్ని విషయములందో ప్రమాణములుగ గ్రహింపఁబడుచున్నవి. హయగ్రీవశాస్త్రి సముద్ధృతము కూటసృష్టియని స్థాపింపఁబడువఱకు వారి వాక్యము ప్రమాణమే.

ii. పోతన్నమడుల యునికి.

iii. పోతరాజ బంధువుల యునికి.

iv. పోతరాజునకుఁ బ్రత్యక్షమైన కోదండరాముల యునికి.

v. పోతరాజ విగ్రహము నునికి.

vi. పోతరాజప్రయుక్త కోసరమిత్యాది పదములు కడపమండల మందలి యునికి.

vii. ఆంధ్రదేశమందలి చిరకాలజనశ్రుతి.

viii. ఒంటిమిట్ట కోవెల మర్యాదలందుఁ బోతన భాగవతమునకుఁ దాంబూల మర్యాద.

శ్రీరామాయనమః.

మధ్యవర్తుల యభిప్రాయములు.

(1) పిఠాపురము రాజుగారి దివానుగానుండి కీర్తిశేషులైన మొక్కపాటి సుబ్బరాయఁడుగారు.

"Dear sir, Your letter to hand. You have demolished the case for Warangal. I expressed the same to Mr. J. Ramayya Pantulu, though not in so many words. By your vigourous defence you have won back Potanna kidnapped by the Warangal party." * *

(2) పిఠాపురములోని శ్రీరాజారావు చెల్లాయమ్మరావు బహదర్ గారి హైస్కూలు ప్రధానోపాధ్యాయులగు బ్ర॥ శ్రీ॥ రాజశ్రీ, కూచి - నరసింహము పంతులవారు బి.ఏ., ఎల్.టి.,

"Dear sir, * * I have already had the pleasure of reading your able contribution to the Academy Journal.

The arguments adduced are very convincing and well supported by facts.

(3) ఒంగోలు వేంకటరంగయ్యగారు, బి. ఏ., బి. ఎల్., నెల్లూరు. "ఆంధ్రపరిషత్పత్రికయందలి పోతనామాత్యునిఁ గూర్చిన తమ వ్యాసమును జదివితిని. వాదప్రౌఢి గంభీరముగను నిరుత్తరముగ నున్నది. వీరభద్రవిజయమును పోతన కంటఁగట్టుట యసమంజసమని రూఢిచేసితిరి. బమ్మెర వాస్తవ్యతాభ్రాంతిని నిర్మూలముఁ జేసితిరి. కవిజీవిత విమర్శాప్రయోగమునకు మార్గోపదేశకమగు వ్యాసము వ్రాసితిరి.

(4) ఎర్నాగుడము లోనగు గ్రామముల జమీందార్ గారగు శ్రీ శ్రీ చెలికాని లచ్చారావుగారు, రామవిలాస గ్రంథనిలయస్థాపకులు, చిత్రాడ, పిఠాపురము.

"తమరు నాకడకు అభిప్రాయము నిమిత్తమై ఓరుగల్లు ఒంటిమిట్టల గుఱించి పంపించినపుస్తకమును చదివితిని. భాగవతాది గ్రంథంబులను జూచితిని. నాబుద్ధికి ఒంటిమిట్టవాదమే సందర్భముగా నున్నట్లుతోఁచినది. * * * చిత్రాడయందు చిలకూరి వీరభద్రరావుగారి యధ్యక్షతక్రింద జరగిన పోతనా

మాత్యుని గుఱించిన సభయందు జరగిన విషయంబున వాదోపవాదంబున ఒంటిమిట్టవారిపక్షమున నా యభిప్రాయములు చెప్పితిని. ఆ రోజున మాట్లాడిన ఎనమండ్రుగురులో 5 గురు ఒంటిమిట్టవాదమున కనుకూలు రైరి. నేను పెక్కువిషయంబుల ఒంటిమిట్ట వారివాదముతో నేకీభవించుచున్నాను."

5. హితకారిణీ పత్రిక 16-3-19—ఈ నెల 7-8-19 తేదీలలో చిత్రాడలో సభలు జరగినవి. * * * తరువాత పోతనామాత్యుని నివాసస్థల విషయమై చర్చించుటకు రా-శ్రీ, చిలుకూరు వీరభద్రరావుగారి యధ్యక్షతక్రింద నొకసభ జరగినది. నంగూరి సుబ్బరావుగారు సంశర్భ పూరితములైన కొన్నియూహలఁ బొందుపరిచి ఓరుగల్లుపక్షమునఁ జెప్పిరి. మరికొందఱు కూడ ఈ పక్షమున మాటలాడిరి. అధికసంఖ్యాకులు ఒంటిమిట్టపక్షమున నుండిరి. శ్రీచెలికాని లచ్చారావుగారు యుక్తియుక్తముగ గ్రంథపూర్వక నిదర్శనములతో ఒంటిమిట్టపక్షమున ప్రసంగించిరి. వీరభద్రరావుగారు యేపక్షమునైనను నిర్దిష్టముగ చెప్పకపోయినను మొత్తముమీఁద ఓరుగల్లు పక్షముననే యెక్కువమోజు చూపిరి.

6. శ్రీ॥ శ్రీ॥ కే. గోపాలకృష్ణమ్మపంతులవారు, ఎం.ఏ., Asst: Sanskrit Professor Presidency College, Madras. కడప పోతనామాత్య సమాజమువారికిఁ బంపినశ్లోకములు.

i. శ్రీమచ్ఛాస్త్ర విశారదః సువిమల ప్రజ్ఞాచణః పండితః
సీతాజాని పదాంబుజే గళితధీః నిర్మత్సరో నిర్మమః
శ్రీమద్బమ్మెర వంశమౌక్తికమణిః శ్రీయొంటి మిట్టస్థలే
ఆచంద్రాంబురు హోప్తతారకమహో శ్రీపోతనార్యః సుధీః

ii. పోతనార్య కవీంద్రోసౌ । శ్రీమాన్ విజయతే తమామ్
యదృచ్ఛాభ లాభసంతుష్టః । కృషిమాత్రోప జీవినః॥

7. ఆసీన్మహీ క్షితాంమాన్యః । పోతరాజ ఇతిశ్రుతః
యోవేదభక్తే ర్మాహాత్మ్యం । సదారామేతి యద్వచః

2. కృష్ణాయేన స్వీకాదేవీ । మనోరథ మపూరయత్
యస్యచాన మితంశీర్షం । నరాధిప సమాగమే

3. సత్యంశౌచం దయాయస్య । భూతానాంచ హితైషితా
భక్తి ర్విత్త కరేదేవే । వైకుంఠం పదమాస్థితే

4. ద్రుతంస్త్రైనమానసంయేన । తూర్ణంభాగవతాత్మనా
పరిణామంచ భేజేను । సర్వలోక సుఖావహామ్

5. దేహళీ పురవాస్తవ్యాః । భాగ్యంవో కిముపర్ణ్యతాం
యద్దేశే నావిభవతాం । ప్లావితాభూస్సుకీర్తిభిః

కే. విశ్వనాథశర్మ, ఎం.ఏ.,

8. వేంకటగిరిరాజాగారి హైస్కూల్‌లోని యాంధ్రపండితులు శ్రీమాన్ నేలటూరి పార్థసారథి యయ్యంగార్లవారు * * * * పోతనయుండిన యేకశిలానగరము కడప మండలములోని యొంటిమిట్టకాక యోరంగల్లు కాదనియు నా యభిప్రాయము.

9. మ-రా-శ్రీ, పీ. నరసింగరావుపంతులుగారు, బి.ఏ.,బి.ఎల్., నెల్లూరు. పోతరాజుగారి యింటిపేరైన 'బమ్మెర' యనునది ఓరుగంటి సమీపమున నున్న 'బొమ్మెర' యనుటకు ఆధారములు బలీయములని చెప్పుటకు వీలులేదు. నేను పలుమారు కడపగ్రామమునకు వెళ్లుచుండుట కలదు. ఒంటిమిట్టకును వెళ్లియున్నాను. అచ్చటివారు వృద్ధులు పెక్కండ్రు పోతరాజుగారు యిచ్చట భాగవతమును రచియించిరి అనిన్ని అచ్చట వేంచేసియుండు శ్రీకోదండరామస్వామివారికే అంకితముగావించిరి యనిన్ని చెప్పియుండిరి. ఆదేవాలయమును కూడ నేను చూచియున్నాను. చిరకాలము జనశ్రుతినిబట్టి వృద్ధులు చెప్పిన సంగతిని విశ్వసింపకుండుటకు శ్రీయుత జయంతి రామయ్యపంతులవారు ప్రబలతరములైన యాధారమేమియు చూపలేదని నా యభిప్రాయము.

బ్ర॥ శ్రీ॥ వావిలాల వేంకట శివావధానులుగారు, బ్ర॥ శ్రీ॥ నాగపూఁడి కుప్పుసామయ్యగారు శ్రీమాన్ విద్వాన్ అప్పలాచార్యులవారు లోనగు వారొసంగిన యభిప్రాయములు స్థలాభావముచేఁ బ్రకటింపఁబడవయ్యె. అవి మఱియొండుచోటఁ బ్రకటింపఁబడును.

British Model Press, Choolai, Madras—1919.

END OF
TITLE